# నిదురించే తోటలోకి

నవల

\- మన్నెం శారద



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 181

కౌముది మాసపత్రికలో

జనవరి 2015 సంచిక నుంచి డిసెంబర్ 2017 సంచిక వరకూ

సీరియల్‌గా వచ్చిన నవల

**ఒక ప్రాతఃకాలం.**

ఇంకా సూర్యుడు సముద్ర గర్భం నుండి బయటకి రాని సమయంలో సముద్రాన్ని అనుకున్నట్లున్న ఆ బంగళాలో వెనుక వైపు ఉన్న దట్టమైన చెట్ల మధ్య గాలి సందు సందులో చొరబడి హుషారుగా ఈలలు వేస్తోంది.

ప్రియురాలి పొందు నుండి పొందిన ఆనందం లాంటి పూల సువాసనలు గాలితో కలిసి ఆ ప్రాంతాన్ని తన్మయానికి గురిచేస్తున్నాయి.

పచ్చిక మీద రాలిన పండుటాకులు, ఎండుటాకులు, అరమగ్గిన ఆకులతో ఒక చిత్రకారుడు గీసిన చిత్రంలా ఉంది నేలంతా.

అక్కడ వెనుక వైపున్న మెట్లమీద అతను కూర్చున్నాడు.

అతని చూపుడు వేలు మధ్య వేలు మధ్య నన్ను సిగరెట్టు పొగ తెల్లగా ఆ ప్రాంతంలో వలయాలు తిరుగుతోంది.

చెట్లమీద పక్షులు సందడిగా అరుస్తూ సముద్రం వైపు బారలు బారలుగా ఎగురుతూ వెళ్తున్నాయి.

దూరంగా సముద్ర ఘోష.

మత్స్యకారులు అరుపులూ, కేకలూ.

ఆ బంగళా మాత్రం ఏదో పోగొట్టుకున్నట్లుగా స్తబ్ధంగా ఉంది.

అతనికి నలభై అయిదు ఏభయి మధ్యలో వయసుండొచ్చు. కొద్దిగా పల్చబడిన రింగుల జుత్తు - ఇన్ని సంవత్సరాలుగా ఎన్నో విధాల నలిగి అలసినట్లున్న మొహం, ఎక్కడో గతంలోకి చూస్తున్న కళ్ళు. సిగరెట్లు కాల్చడం వలన కొద్దిగా నల్లబడిన పెదవులు - ఒకటి రెండు తెల్లవెంట్రుకలతో ఒక హుందాతనాన్నిచ్చిన మీసాలు - ఇంకా అతనిలో అందముంది. తన పట్ల తనకు శ్రద్ధలేనట్లున్న - ఆ నిర్లక్ష్యపు వైఖరిలోనే ఏదో ఆకర్షణ ఉంది.

అతనొక కాలు కొద్దిగా చాపి, సిగరెట్టు పట్టుకున్న చేతిని దానిపై ఆన్చి సాలోచనగా దూరంగా ఉన్న ఎత్తయిన పున్నాగ చెట్టువైపు చూస్తున్నాడు.

పచ్చగా, ఏపుగా ఆకాశంలోకి దూసుకెళ్ళినట్లున్న ఆ చెట్టు నిండా సన్నాయి బాకాలు గుత్తులు గుత్తులుగా కట్టినట్లున్న తెల్లని పున్నాగ పూలు గాలి వీచినప్పుడల్లా గుంపులు గుంపులుగా క్రిందకి రాలుతున్నాయి.

అవి రాలుతున్నప్పుడల్లా గాలి వాటిని ఒడిసి పట్టుకుని వాటి వాసనలని దొంగిలించి పారిపోతోంది. పూలు గిరికీలు కొడుతూ అందిన గాలి పొందుని మరింత పొందాలన్న వృధాప్రయత్నం చేసి నేలరాలిపోతున్నాయి.

ఆ పూలు ఒక తివాసీలా క్రింద ఉన్న ఒక ఎత్తయిన చప్టా మీద దట్టంగా పేరుకుంటున్నాయి.

సరిగ్గా అక్కడే ఉంది అతని చూపు.

పూలని జరిపి పట్టి చూస్తే అది కేవలం చప్టాకాదని అదొక సమాధని అర్ధమవుతుంది.

చాలా సంవత్సరాలుగా ఖాళీ దొరికినప్పుడల్లా అతనక్కడికొచ్చి కూర్చుంటాడు.

ఆ సమాధిని చూస్తూ సిగరెట్టు మీద సిగరెట్టు కాలుస్తుంటాడు. సూర్యుడు పైకొచ్చి ఎండ చుర్రుమనిపించే వరకు అతనలా కాలక్షేపం చేస్తాడు.

ఆ వ్యాపకం అతనికి, ఆ బంగళాలోనే ఉంటున్న మాలికి మాత్రమే తెలుసు.

"టీ తీసుకోండి బాబూ!"

మాలి మాటకి అతనీలోకంలోకి వచ్చాడు.

మౌనంగా టీ కప్పు అందుకున్నాడు.

మాలి అతన్ని డిస్టర్బ్ చేయడు.

అతనికి పూర్తిగా ఏమీ తెలియక పోయినా మీద పడిన వయసు రీత్యా కొంత అర్థం చేసుకోగలడు.

అతను టీ తాగుతూ లేచి మెల్లిగా పున్నాగ చెట్టు క్రిందకెళ్ళాడు. ఒక చేత్తో పూలని పక్కకి జరిపి ఆప్యాయంగా సమాధిని చేత్తో స్పర్శించాడు.

ఆలోచనలతో అతని కళ్ళేరబడ్డాయి.

చేతికేదో తగిలినట్లు.

ఆప్యాయంగా.

అనురాగంగా.

"వరూధినీ!"

అతని హృదయం సముద్రంలా ఘోషించింది.

గుండెలో పుట్టిన ఒక ప్రేమఝురి వెల్లువై సుడులు తిరుగుతూ కన్నీరై కళ్ళకి చేరే ముందే ఆవిరైపోయింది.

ఫలితం.. తీరని బాధ.

మరచిపోలేని గాథ.

తను.. తను.. ఒక ఫూల్.

వరూధినిని పోగొట్టుకున్నాడు.

అవును. తను అవసరానికి స్పందించలేకపోయాడు. అందుకు ఫలితమే ఈ ప్రేమరాహిత్యపు వేదన.

తను నిజంగానే తప్పు చేసాడా?

ఆలోచనల మీద ఆలోచనలు. నిరంతర సముద్ర కెరటాల్లా.

ప్రశ్నల మీద ప్రశ్నలు.

జవాబు దొరకని అఘాతాల్లా.

చేతిలోని సిగరెట్టు చుర్రుమని పించాక అతను స్పృహలోకొచ్చాడు.

మెల్లిగా వెనుతిరిగి కారువేపు నడిచాడు.

ఆలోచనలు కూడా వెనుతిరిగి..

1990

హేమంత్ ఉద్యోగంలో చేరి ఆర్నెల్లయింది.

ఇంకా కాలేజి పోకడలు పోలేదు.

ఎంత పనయినా ఇట్టే చేసేవాడు కానీ క్రమశిక్షణంటే గిట్టేదికాదు.

ఒక్కోసారి నిద్రలేచి, మొహం కడిగేసుకుని డ్రెస్ మార్చుకుని పరిగెత్తుకొచ్చేసేవాడు.

టక్ చేసిన షర్టు అస్తవ్యస్తంగా ఉండేది. నలిగిన షర్టు, సరిగ్గా దువ్వని క్రాపు. ఎలా పెంచారయా నిన్ను అని మేనేజరంటే 'ఇలానే' అని ఠక్కున టేబులెక్కి కూర్చునేవాడు.

మేనేజర్ గుండెమీద చరచుకుని "దిగవయ్యా బాబూ! సార్ చూసాడంటే మధ్యలో నాకు ప్రాబ్లం" అని మందలించేవాడు.

ఆ సంవత్సరం చాలా చిత్రమైంది.

ప్రతి సంవత్సరం రిటైర్‌మెంట్సు, రిక్రూట్‌మెంట్సు సహజంగా ఉండేవే.

కానీ ఆ సంవత్సరం ఒక్కసారిగా విపరీతంగా రిటైర్‌మెంట్లు, రిక్రూట్‌మెంట్సు జరిగాయి. ఫలితంగా ఆఫీసుల నిండా యువరక్తం ప్రవేశించింది. ముప్పయి పర్సెంటు రిజర్వేషన్స్ పుణ్యమా అని విపరీతంగా అమ్మాయిలు వాళ్ళ మధ్య బియ్యంలో రాళ్ళలా అబ్బాయిలూ వచ్చి చేరారు.

ఎక్కడ చూసినా సందడి.

గోల గోల.

హడావుడి.

ఒక్కసారి లాకు గేట్లు తెరవగానే వెల్లువలా దూకిన నదీ తరంగాల్లా.

వయసు మీరిన మగాళ్ళకి షోకులెక్కువయ్యాయి.

వయసుపై బడ్డ స్త్రీలకి కోపాలెక్కువయ్యాయి.

కారిడార్లన్నీ గలగల నవ్వుతూ, కబుర్లూ.

ఆఫీసులు కాలేజీల్లా మారాయి.

వాళ్ళని అదుపులో పెట్టి సీటుల్లో కూర్చోబెట్టడమే చాలా కష్టమైంది ఆఫీసర్లకి.

అందులో అప్పుడే షాపునుండి తెచ్చి రేపర్‌లోంచి తీసిన చాకులా మెరిసాడు హేమంత్.

అతనిదొక విభిన్న మనస్తత్వం.

ఎవరినీ ఆకర్షించాలని ప్రయత్నించకపోవటమే అతనికొక ప్రత్యేక ఆకర్షణ.

పనిపట్ల ఏకాగ్రత లేనట్లు కనిపిస్తూ చాలా షార్ప్‌గా అతను నిమిషాల్లో పనిచేసే తీరు త్వరలోనే ఆఫీసర్ల దృష్టిలో పడింది.

అతికొద్ది నెలల్లోనే అతను చాలామంది హృదయాల్ని దోచుకున్నాడు. చాలామంది పని రాకుండా పైకెగబాకిన ఆఫీసర్లు లోలోపల అతన్ని చూసి కుళ్ళుకున్నా అతన్ని తమ పనులకి టూల్‌లా వాడుకునేవారు.

అందులో రమేష్ బాబు హేమంత్‌కి నెక్స్ హయ్యర్ అథారిటీ.

అతని డ్రాఫ్టింగ్ మీద, అతని వర్క్ మీద రోజూ హయ్యర్ అథారిటి రిమార్క్సు, క్వొరీలు ఉండేవి. కానీ చిత్రంగా అతనికి ప్రమోషన్స్ రావడం ఆగేదికాదు.

అలానే అతనికి ప్రమోషన్ వచ్చింది.

ఆ రోజు అతను హేమంత్‌ని తన ఛాంబర్‌లోకి పిలిచాడు. హేమంత్‌కి రమేష్‌బాబంటే సదభిప్రాయంలేదు.

దానికి అతనికి పనిరాకపోవడమే కాదు - అతను బాగా కరప్ట్. ఎలా పనిని పక్కదారి పట్టించి రూల్స్‌ని డీవియేట్ చేసి డబ్బు గుంజాలో అతనికి తెలిసినంత మరెవరికీ తెలియదు.

మరో బలహీనత అమ్మాయిలు.

ప్రొద్దుట సీట్‌లోకి రాగానే కొంతమంది అమ్మాయిలు, అమ్మాయిలుగా చలామణి అయ్యే స్త్రీలు అతని రూములోకి వెళ్ళి పనిలేకపోయినా స్వింగ్ డోర్ తీసి ''గుడ్ మాణింగ్ సా..ర్'' అనేవారు పళ్ళికిలించి.

వెంటనే అసలే శరీరం మీద అదుపులేకుండా పెరిగి పోయిన రమేష్‌బాబు పొంగిపోయి పదింతలయి ''కమిన్ కమిన్'' అంటూ వాళ్ళని లోపలికి పిలిచి ఎదురు కుర్చీలంతా నింపేసి అతి గర్వంగా జేబులోంచి వంద తీసి అటెండర్ బాలయ్యకిచ్చి టీలకి పురమాయించేవాడు.

బాలయ్యని చూస్తే నక్కకి చొక్కా తొడిగినట్లుంటాడు.

ఏ ఎండకా గొడుగు పట్టేరకం.

లోపల ఆఫీసర్‌కి అడుగులకి మడుగులొత్తినట్లు నటించి బయటకి రాగానే వెంటనే హేళనగా మాట్లాడే రకం.

''గానా బజానా షురూ అయింది సారు..! ఏమ్మా వనజా, నువ్వెళ్ళలేదే లోపల ఇంకో కుర్చీ ఖాళీగానే ఉంది'' అని పాపం పనిచేసుకుంటున్న ఆడవాళ్ళని కదిలించి వెళ్ళేవాడు. మగాళ్ళంతా నవ్వుతుంటే, ఆడాళ్ళకి మండి పోయేది.

''వెధవ, నోరు తిన్నగా ఉండదు'' అని వాళ్ళు మండిపడేవారు.

''ఏడ్చాడు, వెధవ. వ్యవహారాలన్నీ వీడే నడుపుతాడు. అందుకే రమేష్‌బాబుకి వీడంటే చచ్చేంత భయం'' అనేవాడు సూపర్నెంటు ముకుందం ముక్కుపొడుం పీల్చుకుంటూ.

ఈ తతంగమంతా చాలా చిత్రంగా, చిరాగ్గాను ఉండేది హేమంత్‌కి మొదట్లో.

తను ఇంజనీరింగ్ చేస్తున్నప్పుడు కన్న కలలకి, నిజవాతావరణానికి అసలు సంబంధమే లేదు.

ఆ పుస్తకాల్లో ఉన్న సబ్జెక్టుకి ప్రాక్టికల్‌గా జరుగుతున్న పని విధానాలకి అసలెలాంటి పొంతనా లేదు.

ఆ టేబుల్స్, కుర్చీలు, ఫైల్స్, మనుషులు, వాళ్ళ ఆలోచనా విధానాలు, కక్కుర్తి, చిల్లర మాటలు. కంపరమెత్తి పోయేది.

గవర్నమెంటు ఆఫీసుల్ని కొన్ని శక్తులు ఎంత గొప్పగా తీర్చిదిద్దాయో. ఆ ఒరవడిలోంచి బయటపడటం అంతే కష్టమన్న విషయం హేమంత్‌కి అర్థమయిపోయింది.

కాని.. వెంటనే ఉద్యోగం వదిలి వెళ్ళిపోయే స్థితికాదు తనది.

పైగా కాస్ట్, ఆడవాళ్ళ రిజర్వేషన్ కోటానుండి ఎలాగో బైటపడి ఆఫీసు లోపలికి అడుగుపెట్టిన బాపతు తను.

హేమంత్ రమేష్‌బాబు ఎదుట కూర్చున్నాడు.

''సర్, ఏంటి పిలిచారు?'' అన్నాడు వినయంగా.

బదులుగా రమేష్ బాబు కుర్చీలో మినుముల బస్తాలా కదిలి కృతకంగా నవ్వాడు.

''ఏంలేదు. ఏం తీసుకుంటావు, కాఫీనా, టీయా?'' అన్నాడు.

''నేనిప్పుడే కాంటిన్‌కి వెళ్ళొచ్చాను సర్'' అన్నాడు హేమంత్

''అద్సరే, సరే మరోసారి తాగితే ఏంటీ, బాలయ్యా రెండు కాఫీ'' అంటూ అక్కడే నిలబడ బాలయ్యని బయటకి సాగనంపి ''వీడొట్టి రోగ్. అందుకే వీణ్ణి సాగనంపాను'' అన్నాడు రమేష్ బాబు మళ్ళీ నవ్వుతూ.

హేమంత్ మాట్లాడలేదు.

''ఏమీలేదు. నిన్ను నాదగ్గర పోస్టు చేయించుకుంటున్నాను. పర్సనల్‌గా. అంటే.. నీకు వేరే ప్రత్యేకమైన వర్కు ఉండదు నేను అంతా చూసుకోలేను. నీ హెల్ప్ కావాలి''

విషయం అర్ధమైంది హేమంత్‌కి.

అంతకు ముందు వారం రోజుల క్రితం ఒక ఫైలు మీద ఛీఫ్ ఇంజనీరు రాసిన కామెంటు గుర్తొచ్చి హేమంత్‌కి నవ్వొచ్చింది.

అది తన సీటుదే. వృద్ధ గౌతమి మీద టెండర్లు పిలిచారు.

తను డీల్ చేసి నోటు పెట్టాడు. టెండరులో కోట్ చేసిన ఎస్టిమేట్ రేట్స్‌కి, ఎస్టిమేట్‌లో వేసిన రేటుల్లో తేడా ఉంది. కానీ ఎమౌంటుల్లో తేడాలేదు. ఆ విషయం నోటులో రాస్తూ బహుశా ఇది టైపొగ్రాఫికల్ ఎర్రర్ అని తను రాశాడు. రమేష్‌బాబు దాన్ని తన తెలివితేటలతో టోపోగ్రాఫికల్ ఎర్రర్ అని దిద్దాడు. టోపోగ్రఫీ అంటే నేల ఎత్తుపల్లాలకి సంబంధించింది. ఇది సర్వేలో వస్తుంటుంది. చీఫ్ ఇంజనీరుగారికి అసలే లాంగ్వేజి మీద పట్టుంది. అంతకు మించి బి.పి ఉంది. ఆయన ఆ ఫైలు చూసి కుర్చీలోంచి ఎగిరిపడ్డాడు. కోపంతో ఊగిపోయాడు.

ఓనమాలు రాకుండా అడ్డదారుల్లో వచ్చిన వాళ్ళంటే అతనికి చెప్పలేని కోపం.

కానీ ఈ విషయంలో అతను కూడా అసహాయుడు. వాళ్ళతో పాటు వాళ్ళ వెనుక ఒక ఎమ్మెల్యేనో, మినిష్టరుదో ఫోను కాలుంటుంది. పనిరాకపోయినా ప్రత్యేక సీటుకోసం - అక్కడ దొరికే లంచాల కోసం లక్షలు సెక్రటేరియట్‌లో ధారపోసి సగర్వంగా ఆ సీటుల్లో కూర్చునే రమేష్‌బాబు లాంటి వాళ్ళ వల్ల ఆయన తరచు బి.పి పెరిగి ఆస్పత్రుల చుట్టూ తిరుగుతుంటాడు.

అందులో టెండర్లంటే బంగారు ఖని. లంచగొండులకి.

ఆయన నెత్తీ నోరు కొట్టుకుని "అలాస్, నౌవేడేస్ ద స్వేన్స్ హేవ్ బికమ్ డక్స్ ఇనవర్ డిపార్టుమెంటు" అని కోపంగా ఫైలు మీద అడ్డంగా రాసేసాడు.

రమేష్‌కి తను చేసిన తప్పేమిటో అప్పటికీ అర్ధం కాలేదు. ఫైలు చాలాసేపు ఒళ్ళో పెట్టుకుని విచారించి హేమంత్‌ని పిలిచాడు.

"ఏంటి, హేమంత్, ఈయనకేవన్నా పిచ్చా! నేను సరిగ్గానే కరెక్టు చేసాను కదా! ఈయనేంటి, స్వేన్స్, డక్స్ అని రాస్తాడు. అసలు స్ట్రీమ్ ఎక్కడుంది వృద్ధ గౌతమి నది కదా!"

అప్పటికి గాని రమేష్‌బాబు ఎంత తెలివైనవాడో హేమంత్‌కి అర్ధం కాలేదు.

నిజానికి అది చాలా చిన్న తప్పు - ఇంజనీరింగ్ డిపార్టుమెంటులో ఎదురయ్యే టెక్నికల్ ప్రోబ్లమ్స్‌లో చిన్న లాంగ్వేజ్ ప్రాబ్లం.

వృద్ధ గౌతమి నది చివరిదశలో. ఏనాం దగ్గర సముద్రంలో గోదావరి పాయ. దాన్ని స్ట్రీమంటే డేంటన్నదే రమేష్ బాధ.

చివరికెలాగో అతన్ని కన్విన్స్ చేసాడు హేమంత్.

అలాంటి రమేష్‌బాబు చాలామంది సీనియర్స్‌ని, తెలివైన వారిని దాటుకుని చాలా కీలకమైన సీటులో కూర్చున్నాడు.

ఇప్పుడు తను తన ఇండువిడ్యుయాలిటీని త్యాగం చేసి ఇతనికి పనిచేయాలి.

"ఏంటాలోచిస్తున్నావ్, హేమంత్. ఈ సీటు చాలా కష్టమైంది. నాక్కాస్త సాయపడితే. ఇదిగో ఆర్లెలలో ఈ మహానుభావుడు రిటైరయిపోతాడు. నీకు చాలా ఫ్యూచరుంది, నిన్ను నీవు ప్రూవ్ చేసుకోడానికి. ప్లీజ్"

హేమంత్ అయిష్టంగానే తల పంకించాడు.

గవర్నమెంటు ఆఫీసుల్లో ఎఫిషియన్సీకి ఒక గౌరవమంటూ ఉండదు. వాడేసుకోవడమే తప్ప.

ప్రమోషన్స్‌కి ఎవరినెలా తప్పించవచ్చో తెలిసిన మేధావులు ఎడ్మినిస్ట్రేషన్ వింగ్స్‌లో చాలామంది పండిపోయి ఉన్నారని హేమంత్‌కి ఆ కొద్దికాలంలోనే అర్ధమైంది.

బాలయ్య కాఫీ తెచ్చి ఇద్దరికి ఇచ్చాడు.

హేమంత్ కాఫీ తాగి బయటకొచ్చాడు.

అప్పటికే ఆఫీసంతా చాలావరకు ఖాళీ అయింది.

వాచీ చూసుకున్నాడు హేమంత్. అయిదు దాటింది. అతనికి ఎదురొచ్చింది పద్మ నవ్వుతూ.

పద్మకి ఎంత వయసుంటుందో తెలీదు కానీ ఎండిన కట్టెలా ఉంటుంది. చర్మం అదోలాంటి రంగు. నలుపు కాదు కళకళలాడటానికి.

తెలుపు కాదు మెరవడానికి.

కాల్చి పొగ చూరిన రంగు. నవ్వినా సాగని ప్లాస్టిక్ పెదాలు, గుంటకళ్ళు, ఆమె కట్టే సాదా షిఫాన్ చీరలు - ఆమె వంటి రంగుని ప్రతిబింబిస్తూ మాసిపోయినట్లు - ఎన్నాళ్ళుగానో స్నానం మొహం ఎరగనట్లు - చూడగానే అప్రసన్నంగా ఉంటుందెవరికైనా.

ముఖ్యంగా ఆమె ఎప్పుడూ మగాళ్ళని చూసి సిగ్గుపడుతున్నట్లుగా మెలికలు తిరుగుతుంది. సీట్లో కూర్చుని అసూర్యంపశ్యలా తలదించుకుని ఎవరూ చూడనప్పుడు వాలు చూపులు విసిరి దొంగనవ్వులు నవ్వాలని ప్రయత్నిస్తుంది.

హేమంత్‌కి ఆమెని చూస్తే తల తిరుగుతుంది.

ఒంటరిగా దొరికితే మగాళ్ళని పట్టేసుకోవాలన్నట్లుంటాయి ఆమె చూపులు.

సహజంగా ఆఫీసులో పని చేసే స్త్రీలు లింగబేధం పాటించడానికి ప్రయత్నించరు. అక్కడ వారి హోదాయేగాని నేను ప్రతి క్షణం స్త్రీని అని చెప్పుకోడానికి ప్రయత్నించరు. కాని అక్కడా.. అక్కడా ఇలాంటి వాళ్ళు కూడా ఉంటారు కాబోలు.

హేమంత్ 'నన్నేనా' అన్నట్లు చూశాడు ఆశ్చర్యంగా. ఇంతవరకూ అతను ఆమెతో మాట్లాడలేదు.

"అవును. ఏం?" అన్నాడు కొంచెం ఆశ్చర్యంగా చూస్తూ.

"ఉండరాదూ, కొంచెం పనుంది మీతో" అంది రాగం తీస్తూ. ఆమె మాటలో అదోలాంటి రాగం. అది కొని తెచ్చుకున్నదో మురిపెంగా మాట్లాడాలనో.

"రామ్మా నీకోసం సార్ చూస్తున్నాడు. ఆయనెన్నెళ్ళనివ్వలే" అన్నాడు అక్కడే నిలబడ్డ బాలయ్య వెటకారంగా.

"ఇదిగో బాలయ్యా, నా జోలికొస్తే బాగుండదని చెప్పలే నీకెన్నిసార్లో" అంది పద్మ కళ్ళెర్రజేసి.

"చాలా సార్లు చూశాలేగాని ఎళ్ళు తల్లీ" అన్నాడు బాలయ్య అంతకంటే నిర్లక్ష్యంగా.

పద్మ బాలయ్యని చురచురా చూస్తూ - అరక్షణంలో రంగు మార్చి హేమంత్ వంక చూసి సిగ్గుపడుతూ నవ్వి రమేష్‌బాబు ఛాంబర్‌లోకి వెళ్ళింది.

"మీరెళ్ళండి సార్. అందరికీ పని అయిపోయి కొంపల కెళ్ళేటప్పుడు ఈవిడకి పనిమొదలవుతుంది" అన్నాడు బాలయ్య చిరాకు పడుతూ.

హేమంత్ అర్థంకానట్లు భుజాలెగరేసి వెళ్ళిపోయాడు.

❦❦❦

**మెస్‌లో భోజనం ముగించి** బయట కొచ్చి టైము చూశాడు హేమంత్.

తొమ్మిందింపావు

తండ్రికో ఫోన్ చేయాలనిపించి ఎదురుగా ఉన్న బూత్‌లో కెళ్ళి డయల్ చేసాడు.

"హలో"



కౌముది

తండ్రి తెరలు తెరలుగా దగ్గుతున్న శబ్దం.

మనసు నొక్కేసినట్లయింది.

"నాన్నగారూ!నేను.."

"అవున్రా.. తెలుస్తోంది.. ఫోంచేసావా?"

"ఇప్పుడే ఎలా ఉన్నారు? "

"నాకేవిరా! నేనెక్కడికీ పోను. ఆ ఇల్లు సంగతి తేలందే" హేమంత్‌కి ఒక్కసారి ఎత్తుమీదనుండి పాతాళంలోకి తోసేసినట్లయింది.

ఏం మాట్లాడినా ఆయన ఇంటి దగ్గరకే తెస్తారు.

"అదికాదండీ, మీ ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోండి. ఆ ఇల్లు ఎవరిక్కావాలి. మీరు బాగుంటే చాలు. నేను డబ్బు పంపుతాను కదా!"

బదులుగా ఆయన దగ్గుతో పాటు నవ్వు మిళితం చేసి.. ఆయాస పడుతూ "నీ డబ్బెవరిక్కావాలిరా! నిన్ను కన్నాను కాబట్టి చదివించాను. మా అమ్మకిచ్చిన మాటకోసం ఆ ఇంటి కోసం పోరాడుతున్నాను. గెలిచి తీరతాను. ఎవడమ్మా మొగుడి సొమ్ము.. "మళ్ళీ తెరలు తెరలుగా దగ్గు.

ఆయనతో మాట్లాడి నిష్ప్రయోజనమని తెలుసు హేమంత్‌కి.

"అక్కయ్యుందా?"

"ఆ!ఁ మాట్లాడుకు.. చావండి"

"తమ్ముడూ!" రాజేశ్వరి లైన్లో కొచ్చింది.

ఆవిడ హేమంత్‌కి పెద్దక్క. తర్వాత ఇద్దరు. శ్రీదేవి, సరస్వతి.

రాజేశ్వరికి హేమంత్‌కి పదిహేనేళ్ళ వ్యత్యాసముంది.

ఇంజనీరింగ్ రెండవ సంవత్సరం చదువుతుండగానే తల్లి శాంత ఉన్నట్టుండి వంట చేస్తూనే విరుచుకుపడిపోయింది.

అంతే. మరి లేవలేదు.

అమ్మ వెళ్ళిపోయింది. రమ్మన్నారు.

ఎప్పుడూ తనకోసం గుమ్మం పట్టుకుని చూసే తల్లి కనులు మూసుకుని శాశ్వతంగా నిద్రపోతోంది.

హేమంత్‌కి గుండె పిడచకట్టుకుపోయింది.

ఏడుపు రాలేదు.

అక్కలు ఏడుస్తుంటే నిర్జీవంగా, నిస్తేజంగా చూశాడు.

"ఏడవరా తమ్ముడూ!" అని అక్కలు బ్రతిమలాడినా ఏడుపు రాలేదు.

తతంగమంతా దానికది జరిగిపోయింది.

"ఎలా ఉన్నావ్‌రా?"అక్క పిలుపుతో ఈ లోకంలో కొచ్చాడు హేమంత్.

"బాగనే ఉన్నానక్కా. నువ్వెలా ఉన్నావ్?"

"నాకేవిరా! ఉన్న ఊరు. ఇంటి కూడు. నువ్వే ఆ హోటల్ మెతుకులు తిని ఎలాగున్నావో... ఏంటో?"

హేమంత్ నవ్వి "ఇప్పుడు కొత్తేముంది, ఇంజనీరింగ్‌లో జాయినప్పటి నుండీ.. అలవాటేగా. నాన్న బాగా దగ్గుతున్నారు." అన్నాడు.

"ఏం చెయ్యమంటావు. నేను, మీ బావగారు ఎంత చెప్పినా వినకుండా.. ఆ కోర్టులోనే మకాం. కేసు కోసం ఉన్నదంతా ఊడ్చేస్తున్నారు. గట్టిగా అన్నానని. అదిగో ఆ దొడ్డివేపు వరండాలో కుంపటి పెట్టి స్వయం పాకం వండుకుంటున్నారు" నిష్ఠూరంగా అన్నది రాజేశ్వరి.

హేమంత్ భారంగా నిట్టూర్చాడు.

"సరే, వదిలేయండి. వినకపోతే ఏం చేస్తాం. కనీసం మందులన్నా...."

"ఆఁఆఁ నేను ఇస్తూనే ఉన్నానులే. నువ్వేం బెంగ పడకు. ఆరోగ్యం జాగ్రత్త!" అంటూ ఫోను పెట్టేసింది రాజేశ్వరి.

హేమంత్ దిగులుగా రూమ్ చేరాడు.

రాజేశ్వరి పేరుకు అక్కేగాని తల్లిలాంటిది. చిన్నప్పటి నుండి ముద్దు చేసి పెంచింది.

ఆమె కంత చదువు అబ్బలేదని చిన్నపాటి వ్యాపారం చేసుకుంటున్న మేనమామ రామారావుకే ఇచ్చి చేసారు. అమ్మ పోయాక తండ్రిని వాళ్ళ దగ్గరే పెట్టుకున్నారు. రామారావు చాలా మంచివాడు. బావగారి పట్ల గౌరవ మర్యాదలున్నవాడు కావడంతో తన తండ్రి ఆటలు సాగిపోతూనే ఉన్నాయి.

బట్టలు మార్చుకుని నిద్రరాక చేతికందిన పుస్తకం తీసి చదవటం ప్రారంభించాడు.

రోజూ ఎంతో కొంత, ఏదో ఒకటి చదవడం అతని వ్యాపకం.

ఎవరు రాశారా అని చదవడు.

ఆ రాసింది చదివింప చేయగలిగితే చదువుతాడు.

అలానే నిద్రలోకి జారిపోతాడు.

అదే జరిగిందిప్పుడు.

ఆఫీసుకి గ్రేస్ పీరియడ్‌లో జేరడం హేమంత్‌కి అలవాటు.

అటెండెన్స్ రిజిస్టర్ క్లోజవుతుండగా హడావుడిగా వచ్చి సంతకం పెట్టే హేమంత్‌ని మేనేజరు "కొంచెం ముందు తగలడచ్చుకదా! పెళ్ళా పెటాకులా! ఏం చేస్తావ్?" అని ముద్దుగా కసురుకునేవాడు.

"అదుంటే.. మీకన్నా ముందే ఇక్కడ ఉండేవాణ్ణి" అని హేమంత్ అనగానే హాల్లో అందరూ నవ్వేవాళ్ళు.

"ఏంటండీ, హేమంత్, ఆడాళ్ళు మగాళ్ళని బతకనివ్వరనా మీ ఉద్దేశ్యం?" అని సుధారాణి తగులుకునేది.

సుధారాణి కొంచెం ఫెమినిస్టు భావాలున్న మనిషియైనా, పనిలో దిట్ట. మాటపడదు. ఆఫీసు కొచ్చాక ఆమె తన డిజిగ్నేషన్‌తోగాని.. స్త్రీత్వం చూపించికాని బతకదు. అందుకే హేమంత్‌కి ఆమె అంటే గౌరవం.

ఆమెకి కూడ హేమంత్ అంటే ఇష్టం.

"బాబోయ్. మీరు రాకండి మేడం." అనేవాడు. అలవాటు ప్రకారం సైన్ చేసి సీట్లోకి వెళ్ళి కూర్చున్నాడు.

ఏదో ఘాటు వాసన.

చుట్టూ చూశాడు. ఏవీ కనపళ్ళేదు.

డ్రా తెరిచేసరికి ఒక మూల పచ్చ సంపెంగ ఘుమాయిస్తోంది.

"బాలయ్యా!"

"సార్"

"ఏంటిది?"

"పువ్వు సార్. సంపెంగ పువ్వు" వాడి వెకిలి నవ్వు.

"అదే, ఇక్కడికెలా వచ్చిందని"

"నాకెలా తెలుస్తది సార్."

"మేఘసందేశంలా సంపెంగి సందేశమేమో" హేమంత్‌తో పాటు సర్వీసులో చేరిన ప్రియ కామెంటుకి హాలంతా నవ్వారు.

హేమంత్ మొహం కాస్త సిగ్గుతో ఎర్రబడింది కాని.. వెంటనే సర్దుకుని "తీసెయ్, అవతల పడెయ్. నాకా వాసన గిట్టదు" అన్నాడు చిరాగ్గా.

"పువ్వు సార్" బాలయ్య సందేహంగా చూశాడు.

"చెవిలో పెట్టుకో" హేమంత్ తనే తీసి విసిరేసాడు. హేమంత్ కోపం చూసి నవ్వులు ఆగాయి.

ఇంతలో రమేష్ బాబు పిలుపుతో హేమంత్ రూములోకి వెళ్ళడంతో ఆ గొడవ సద్దుమణిగింది.

హేమంత్ విష్ చేసి కూర్చున్నాడు.

రమేష్ బాబు అతనికొక ఫైలు ఇచ్చి "ఇది కొంచెం చూడు హేమంత్" అన్నాడు.

హేమంత్ పేజీలు తిప్పాడు.

"ఇది ఆర్బిట్రేషన్ కేసుకదా సర్. నేనింతవరకు డీల్ చేయలేదు. నాకు నాలెడ్జిలేదు" అన్నాడు సంశయంగా.

"నీకదెంత సేపులే. మేనేజర్ దగ్గర ఆర్బిట్రేషన్ ఏక్ట్ ఉంటుంది. చదివితే నిముషంలో పట్టేస్తావు"

"ఇది పద్మగారి సీట్లోదనుకుంటాను"

"అవును. మూణ్ణెల్ల నుంచి పెట్టుక్కూర్చుంది. అసలే కోర్టు కేసు. అందుకే నీకిస్తున్నాను"

"ఆవిడ చాలా సీనియర్ కదా, పని రాదా?"

హేమంత్ మాటకి భుజాలు తడుముకున్నాడు రమేష్ బాబు.

"ఏదో ఫేమిలీ వర్రీస్, పోనివ్వు, కాస్త నువ్వు చూడు" రమేష్ బాబు సర్దుతుంటే బాలయ్య ఫైల్స్ సర్దుతున్నట్లుగా అక్కడే నిలబడ్డాడు.

మళ్ళీ వచ్చిందా ఘాటు వాసన.

సర్రున తలెత్తి చూశాడు హేమంత్.

"ఆ పువ్వు జేబులో వేసుకు తిరుగుతున్నావా?" కొంచెం కోపంగానే అడిగాడు హేమంత్.

"బాబోయ్, అది ఇది కాదు సార్. ఇదింకోటనుకుంటాను" అన్నాడు బాలయ్య కంగారు నటిస్తూ.

"ఏవయింది?" రమేష్ బాబు అయోమయంగా అడిగాడు.

"సంపెంగి పువ్వు గురించి లెండి"

"సంపెంగి పువ్వా?" కంగారు పడ్డాడు రమేష్

"సార్‌కి ఆ వాసన గిట్టదంట"

"ఓ అగర్ బత్తీ హేమంత్, నీకా స్మెల్ పడదా! సర్లే, బ్రాండ్ మార్చేద్దాం" అన్నాడు రమేష్ నవ్వుతూ.

హేమంత్ ఫైల్ తీసుకుని బయట కొస్తుంటే అతన్ని అనుసరించి వస్తూ "ఈ మొత్తం ఆఫీసులో ఓ పది సీట్ల దగ్గరన్నా ఈ వాసనొస్తది సార్. రేపింకోటి" అన్నాడు బాలయ్య.

హేమంత్‌కి బాలయ్యకి చనువివ్వడం ఇష్టముండదు. ఎక్కువగా అక్కడే వినయంగా కూర్చుని ఉండే యాదయ్యకే చెబుతాడు పని. అందుకే మరేం మాట్లాడకుండా మానేజర్నడిగి ఆర్బిట్రేషన్ ఏక్ట్ తీసుకుని సీటుకొచ్చి కూర్చుని చదవడం మొదలెట్టాడు.

పది నిముషాల్లో అతని సీటు కెదురుగా వచ్చి కూర్చుంది పద్మ.

తలెత్తి చూశాడు హేమంత్.

పద్మ దొంగ నవ్వు నవ్వింది. ఎవరికీ కనపడకుండా. "నా ఫైల్ డీల్ చేస్తున్నారంటగా. సార్, పని నేర్చుకోమన్నారు మీ దగ్గర"

దాదాపు టేబుల్ మీద తలాన్చి పడుకున్నట్లుగా కూర్చుని అంది పద్మ.

"నా దగ్గర మీరు నేర్చుకోవడమేంటి, మీరు సీనియర్"

"అబ్బా, మీరు మరీ! పనికి సీనియారిటీ ఏంటి, మీరు తెలివైన వాళ్ళుకదా" అంది ముద్దు ముద్దుగా పద్మ.

"గవర్నమెంటాఫీసులో వర్క్‌కి తెలివితేటలేం అక్కరలేదు. టర్న్ ద పేజ్, లెర్న్ద వర్కు. పాత కేసు ఒకటి చూస్తే అర్థమైపోతుంది. వెళ్ళి స్టడీ చేయండి. ఫైలిదుగో" అంటూ ఫైలు ఆమె ముందుకి తోసాడు హేమంత్.

ఆ నిరసన తట్టుకోలేక పోయింది పద్మ.

"అయ్యో, అంత తెలిస్తే.. మిమ్మల్నెందుకడగటం. ఇంతకీ సంపెంగి వాసన మీకు పడదా! రేపు గులాబీలు తెస్తాలెండి" అంది గుసగుసగా.

హేమంత్‌కి అర్థమై పోయింది.

"మా ఇంట్లో పెద్ద తోటుంది తెలుసా? మా మావగారికి అదే యావ. నేనే పెట్టాను. అందరికీ తెలిస్తే బాగోదు కదా!"

హేమంత్‌కి తల తిరిగిపోతోంది.

ఏవిటీవిడ. ఆ గుట్టేమిటి, గుసగుసలేవిటి? తనేవిటి, ఆవిడేవిటి?

"మీరెళ్ళి సీటు దగ్గర కూర్చుంటారా?"

"ష్, గట్టిగా అనబాకండి. మనమేం చేసినా నలుగురికీ తెలియకూడదు. ఆ మాత్రం తెలియదా?"

హేమంత్ గబుక్కున లేచి సర్రున కేంటిన్ వైపు వెళ్ళిపోయాడు.

అతని మనసు చేదు తిన్నట్లుగా అయిపోయింది.

చాయ్ తాగి కేంటిన్ దగ్గరున్న గుల్‌మొహర్ చెట్టు క్రింద నిలబడి సిగరెట్ కాలుస్తూ ఆలోచిస్తున్నాడు.

కొత్తగా ఎపాయింటయిన అమ్మాయిలు కేరింతలు కొడుతూ నవ్వుతూ, తుళ్ళుతూ కేంటిన్ వైపు వెళ్తున్నారు.

ఆ వయసలాంటిది.

"కమ్ హేమంత్. జాయిన్ విత్ అజ్" అందులోంచి జీన్స్ వేసుకున్న ఒకమ్మాయి చేయూపింది.

"జస్ట్ ఫినిష్డ్, యూ కేరీ ఆన్" అన్నాడు హేమంత్ నవ్వుతూ. ఆమె కాలేజీలో అతనికి సీనియర్.

అమ్మాయిల గురించి అంత తెలీని వాడేం కాదు తను. చాలా నాటీ అనే పేరుంది తనకు.

కానీ ఆ అల్లర్ల వెనుక ఎలాంటి నీచమైన ఆలోచనలుండేవి కావు. పైగా అమ్మాయిలు హేమంత్‌ని ఇష్టపడి నవ్వేవారు. ఎవరితోనూ ప్రేమదాక వెళ్ళాలన్న ఆలోచన గానీ, అవకాశం గానీ అతనికి రాలేదు. అలా అనిపించలేదు కూడా.

కానీ.. పద్మలాంటి వ్యక్తుల్ని చూడటం ఇదే మొదటిసారి. ఆ గుట్టేమిటో.. అలా పదిమంది సీట్ల దగ్గర పూలు పెట్టడమేంటో.. ఆ గుసగుసలేంటో... సీటు దగ్గర కెళ్ళాలంటేనే చిరాగ్గా ఉంది.

సడెన్‌గా తమింటి దగ్గర సరోజిని ఆంటీ గుర్తుకొచ్చింది. ఆవిడ అమ్మకి ఫ్రెండే పెద్దగా చదువులేదు. మొరటు సరసాలాడేది. ఏ మాటంటే ఆ మాట నదురూ బెదురూ లేకుండా అనేది.

"ఇది నిన్నేం సరిగ్గా చూసుకోదు బావా, కోర్టులో గెలిచి ఆ ఇల్లు వస్తే నా దగ్గర కొచ్చేయి, బంగారు పూలల్లో పెట్టుకుని చూసుకుంటా" అని తన తండ్రినుద్దేశించి అనగానే చేతిలో గరిటె విసిరేసేది అమ్మ.

అక్కయ్యలు 'ఛీ పాడు' అన్నట్లు కోపంగా చూసేవారు.

"దాన్నింకోసారి ఇంట్లోకి రానివ్వకు" అనేవారు నాన్న కోపంగా.

అమ్మ మాత్రం నవ్వేది.

"దానిదంతా పిచ్చివాగుడే" అనేది తీసిపారేస్తూ.

గట్టెక్కి వేలు ముడి చుట్టుకుని చీరకాస్త పైకెత్తుకుని వచ్చేవాళ్ళని వెళ్ళేవాళ్ళని ఏదో ఒకటి అనడం సరోజనీ ఆంటీకి మామూలు.

ఒకసారి తన ఇంజనీరింగ్ ఫస్టియర్ సెలవులకి ఇంటికొస్తే చూడ్డానికి వచ్చింది.

"ఏరా, ఎప్పుడైపోద్దిరా చదువూ? ఆడు నన్నేం బాగా చూసుకోటం లేదు. నీ మీదే ఆశలు పెట్టుకున్నా" అంది.

"ఏంటే, ఏం వాగుతున్నావ్, కళ్ళు పోతాయి" అంది అమ్మ కోపంగా.

"ఏ?" అంది సరోజని ఆంటీ అమాయకంగా.

"వాణ్ణి, వాడి బాబుని, కూడా లైన్లో పెడతావటే"

"అదా, మీ ఆయన లైన్లోకి రాకనే కదా!"

అంటూ భళ్ళున నవ్వింది ఆంటీ.

అలాంటి ఆంటీ అమ్మ చనిపోయినప్పుడు దొర్లి దొర్లి ఏడ్చింది. ఇంటికెంతో అండగా నిలబడింది.

"ఇల్లు, ఇల్లంటూ కోర్టుల చుట్టూ తిరుగుతూ ఇంటి దీపాన్ని ఆర్పేసుకున్నావు కదా బావా" అంటూ నాన్నని మందలిస్తూ ఏడ్చింది.

ఇద్దరక్కయ్యల పెళ్ళికి అండగా నిలబడింది.

తన చదువుకి డబ్బు సాయం చేసింది.

"మీ అమ్మకి నువ్వంటే ప్రాణం రా, మీ నాన్న దేనికీ పనికి రాకపోయినా గుట్టుగా లాక్కొచ్చింది సంసారాన్ని. నువ్వే అక్కల్ని చూసుకోవాలి" అని చెప్పింది.

ఇంత అల్లరిగా కనిపించే ఆంటీ, భర్త చనిపోయాక వీధి మొహం చూడలేదు.

అమ్మ ఒకసారి అనడం గుర్తు.

"దానికి వాళ్ళాయనంటే ప్రాణం. అతను దీన్ని బాగా చూసుకుంటాడు" అని.

"ఏంటి సార్, చెట్టుకింద శిలయిపోయారు, మిమ్మల్ని రమేష్ సారు కలవరిస్తున్నారు" బాలయ్య మాటలకి ఈ లోకంలోకొచ్చి అతన్ని అనుసరించాడు హేమంత్.

హేమంత్ మెల్లిగా నడుస్తుంటే పక్కగా జీప్ స్రరున శబ్దం చేస్తూ ఆగింది.

హేమంత్ ఎవరా అన్నట్లు చూశాడు.

రమేష్!!

"జీపెక్కు హేమంత్, అలా మా ఇంటికెళ్ళి మాట్లాడుకుందాం"

"వద్దు సర్. నేను కాస్త నడవాలనే వెళ్తున్నాను"

"పర్లేదు. మా ఇంటికెళ్దాం ఎక్కు"

ఇక తప్పదన్నట్లుగా ఎక్కాడు హేమంత్.

ఇరవై నిముషాల్లో జీప్ దోమల్ గూడాలో పాష్ లొకాలిటీలో ఉన్న ఒక ఇంటి ముందాగింది.

అది పాత కట్టడం. విశాలంగా ఉంది.

"ఇది మీ స్వంతిల్లా సార్?"

"మా మావగారిది. ఒక్కతే కూతురు. నాదే అనుకో" నవ్వేడు రమేష్ బాబు.

హాల్లో టీపాయ్ మీద కాళ్ళార జాపుకుని అతని అత్తమామలు టి.వి చూస్తున్నారు.

హేమంత్ మొగమాటంగా నిలబడి చూస్తున్నాడు.

"ఈ అబ్బాయెవరూ?" మామగారడిగాడు.

"నా కొలీగ్, మీరు కూర్చోండి. నేను మేడ మీదకి తీసుకెళ్తా" రమేష్ వినయంగా చెప్పి హేమంత్ అతన్ని తన గదికి తీసుకెళ్ళాడు.

ఇంతలో రమేష్ పిల్లలు లూషా, అతిక్ వచ్చారు.

"ఇద్దరూ అంకుల్ని విష్ చేయండి" అన్నారు రమేష్.

వాళ్ళిద్దరూ "గుడీవినింగ్ అంకుల్" అన్నారు కోరస్‌గా.

"ఇక వెళ్ళి ఆడుకోండి" అంటూ జేబులోంచి రెండు చిన్న చాక్లెట్లు వాళ్ళకి తీసిచ్చాడు.

"నువ్వెప్పుడూ ఇంతే! కాడ్బరీ బార్ తెమ్మంటే తేనే తేవు" అంటూ వాళ్ళా చాక్లెట్లు తీసుకుని వెళ్ళిపోయారు.

"సార్, వాళ్ళ పేర్లు.. మీరు హిందూసే కదూ!" హేమంత్ సంశయంగా అడిగాడు.

"అవును. ఆ పేర్లా! కొత్తరకంగా ఉండాలని నేనే పెట్టాను కదూ" అన్నాడతనే.

హేమంత్‌కి రమేష్ తెలివితేటల మీద మరింత అవగాహన పెరిగింది.

పనమ్మాయి కాఫీ తెచ్చి ఇచ్చి వెళ్ళింది.

కాఫీ తాగుతుంటే రమేష్ చెప్పసాగాడు.

"మాది ఇల్లరికం పెళ్ళి. వీళ్ళకి చాలా ఆస్తి ఉంది. నా మావకే కాదు నా పెళ్ళానిక్కూడా అణువణువూ కొవ్వు. చాలా పొగరు."

"మరి మీ పేరెంట్స్?"

"నాన్న చిన్నప్పుడే పోయాడు. అమ్మే నాలుగ్గేదెలు పెట్టుకుని పాడి అమ్మి చదివించింది. మా అమ్మ వస్తే పేడ వాసనంటుంది మా ఆవిడ. అందుకే అమ్మరాదు. ఒక రోజొస్తుంది. చూస్తా వీళ్ళ సంగతి" రమేష్ కోపంగా పళ్ళు నూరాడు.

"అసలు మీకు ఇల్లరికం పెళ్ళెందుకూ? మీది మంచి జాబే కదా!"

హేమంత్ ప్రశ్నకి మందహాసం చేసాడు.

"నీకు తెలీదు హేమంత్. పావర్టీ ఎంత హ్యూమిలేట్ చేస్తుందో, చిన్నప్పటినుండీ చూశాను. అందుకే బాగా సంపాదించాలి. సంపాదించడంలో సంతృప్తి పడనేకూడదు."

"అన్నట్లూ మన లాబ్ ఎడిషనల్ ఛార్జి కూడ నాకిచ్చారు. అందులో చాలా ఏళ్ళుగా గొడౌన్‌లో స్టీల్ రాడ్స్ మూలుగుతున్నాయి. అదంతా లెక్కా పత్రం లేంది. క్వాలిటీ కంట్రోల్ టెస్టుకని వస్తుంది. దాన్ని రేపు అమ్మేద్దాం. మాట్లాడాను. కాస్త నువ్వు సాయపడితే.. పర్సెంటేజ్ ఇస్తాలే. ఊరికే వద్దు."

అంతా అర్థమయి మొహం ఎర్రబడింది హేమంత్‌కి. సర్రున లేచి నిలబడ్డాడు.

"ఏంటి, కోపమొచ్చిందా?" రమేష్ బాబు కంగారు పడ్డాడు.

"అఫిషియల్‌గా ఏ పనన్నా అడగండి. చేస్తాను. నాకిలాంటివెప్పుడూ చెప్పకండి. నేనీ ఉద్యోగాన్ని కేర్ చేయడం లేదు. చేయను" హేమంత్ నిక్కచ్చిగా చెప్పేసి రమేష్ బాబు పిలుస్తున్నా వెనుతిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు.

**మెస్‌లో టిఫిన్ తిని** బయటకొచ్చేడు హేమంత్.

" ఏవండీ, ఈ పుస్తకం మరచిపోయారు." మెస్‌లో పని చేసే కుర్రాడు ఓ పుస్తకం అందించాడు.

"నేనా?" ఆశ్చర్యం ప్రకటిస్తూ పుస్తకం వైపు చూశాడు హేమంత్. 'అమృతం కురిసిన రాత్రి - బాలగంగాధర్ తిలక్' పుస్తకాన్ని చూసి హేమంత్ కళ్ళు మెరిసేయి.

"కాని.. ఇది నాది కాదు" అన్నాడు.

"ఈయన కాదులే. ఇందాకొచ్చాడే ఆ బుర్రమీసాల పెద్దాయన. కాలికొస్తదా, వేలి కొస్తదా ఎదవ కవిత్తం అంటూ విసిరి కొట్టిపోయాడు. రారా.. ఆ పుస్తకవక్కడ గిరాటెట్టి పని చూడు." అంది పెరవలి నుండొచ్చి మెస్ నడుపుతున్న పెద్దావిడ ఆ కుర్రాడిని.

ఆ కుర్రాడు ఆ పుస్తకాన్ని పక్కకి పడేసి తుర్రుమన్నాడు, తిన్న ఎంగిలి ప్లేట్లు తీస్తూ.

హేమంత్ పుస్తకం వైపు ఆర్తిగా చూశాడు. అట్ట ఎవరో తిన్నట్లు చిరిగి ఉంది.

అదృష్టం కొద్దీ టైటిల్, కవి పేరు చెక్కు చెదరలేదు.

హేమంత్ ఆ పుస్తకాన్ని చేతిలోకి తీసుకుని "నేను తీసుకుకెళ్ళనా?" అన్నాడు సంశయంగా చూస్తూ.

"సుబ్బరంగానండీ, మాకెందుకు?" అందావిడ సాగదీస్తూ.

హేమంత్ పుస్తకాన్ని చేతిలోకి తీసుకుని ప్రేమగా అట్టని స్పర్శించాడు.

ఇదివరిలో తను తిలక్ కవితల్ని చాలాసార్లు చదివాడు. తనకెంతో ఇష్టం.

బుక్ పేజీలు తిప్పుతూ వాచి చూసుకున్నాడు. తొమ్మిదిన్నరే అయ్యింది. ఇంకా ఆఫీసు టైముకి గంట ఉంది.

రూముకి వెళ్ళాలనిపించలేదు.

తాళం తీసి ఊరికే కూర్చోవాలి.

అందుకే ఆఫీసుకి బయలుదేరాడు.

హేమంత్ వెళ్ళేసరికి యాదయ్య టేబుల్స్ క్లీన్ చేస్తున్నాడు.

"జర ఉండం్రడిసారూ!" అంటూ హేమంత్ టేబులు ఛెయిర్ తుడిచి ఫేన్ వేసాడు. బూజులు పట్టిన ఫేన్ పిండిమరలా శబ్దం చేస్తూ తిరగసాగింది.

హేమంత్ రిలాక్స్‌గా కూర్చుని తిలక్ పుస్తకం తిరగెయ్యసాగాడు.

అన్నీ తాను చదివిన కవితలే! కొన్ని కంఠస్థం కూడా వచ్చు. ఒక చోట అతని కళ్ళు ఆగిపోయాయి.

'నాకు మీ సాహిత్య వివాదాలు తెలియవు. నలుగుర్నీ మంచి చేసుకోవడం అంతకన్నా తెలియదు. ఒక నిశార్థ భాగంలో నక్షత్ర నివహ గగనం ఒరగా భూమ్మీదకు ఒంగి ఏదో రహస్యం చెబుతున్న వేళ ఒంటరిగా నా గదిలో నేను మేల్కొని రాసుకుంటుంటాను. నా హృదయ స్పందన మాత్రం నాకు వినిపిస్తూ ఉంటుంది. ఎదురుగా గోడమీద బల్లి ఏకాగ్రంగా నాకేసి చూస్తూ ఉంటుంది.

కిటికీ అవతల ఫెరన్ మొక్క క్రీగంట కనిపెడుతూ ఉంటుంది

కీచురాళ్ళు చప్పుడు...."

"హేయ్ వచ్చేసారా?" హేమంత్ తలెత్తి చూశాడు.

ఎదురుగా పద్మ గులాబీపూలు పట్టుకుని నవ్వుతూ.

"అప్పుడే వచ్చేసారన్నమాట. నాకన్నా ముందే." అతని టేబుల్ మీద ఒక ఎర్రగులాబి పెడుతూ నవ్వింది.

"ఇదేంటి?" హేమంత్ పుస్తకం మూస్తూ చిరాగ్గా అడిగాడు. "నిన్న చెప్పానుగా ఈ రోజు గులాపువ్వులు తెస్తానని." అంది ఎదురుగా కూర్చుని అతను మూసిన పుస్తకాన్ని చొరవగా తీసుకుని పేజీలు తిప్పుతూ.

"నాకెందుకు, లేడీస్ కివ్వండి"

"అబ్బో, ఆడాళ్ళకా! ఆళ్ళతో నేనసలు మాట్లాడను. అన్నిటికీ వంకలే!" అని హేమంత్‌ని పట్టించుకోకుండా పేజీలు తిరగేసింది.

"ఏంటో, ఎవరితను. ఏదేదో రాసేసాడు. ఉండండి" అంటూ గబగబా వెళ్ళి తన బాగ్‌లోంచి ఒక డెయిరీ తీసి తిరిగొచ్చి కూర్చుని "చదవండి" అంటూ అతని ముందుకి తోసింది.

"ఏంటిది?" హేమంత్ చిరాకునణుచుకుంటూ అడిగాడు.

"ఇతరుల డెయిరీలు చదివే అలవాటు నాకు లేదు."

"అయ్యో అది డెయిరీ కాదండీ, నేను రాసిన కవితలు"

"మీరు కవితలు రాస్తారా?" ఆశ్చర్యపడుతూ పేజీలు తిప్పాడు.

రెండు పేజీలు తిప్పగానే అతనికి అర్థమయిపోయింది.

"యాదయ్యా, రెండు ఛాయిలు తే" అంటూ పది రూపాయిల నోటు యాదయ్య కిచ్చి పంపి అతని చేతిలో డెయిరి లాక్కుని "ఇది చదవండి" అంది ఒక పేజీ చూపిస్తూ.

హేమంత్ అయిష్టంగానే ఆ పేజివైపు చూశాడు.

"చంద్రుడు ఆకాశంలో కనిపివ్వడంలేదు.

నిశి నాల్గువేపులా చీర చెంగుల్లా కమ్మేసుకుంది.

అదిగో అక్కడ ఒక్కచోట వెలుగుదార.

ఇదిగో.. ఇక్కడ ఈ మూల పొడిచేడు..

నా కళ్ళకి వెండిపళ్ళెంలా పట్టబడ్డాడు"

హేమంత్‌కి కడుపులో తిప్పింది.

"మీరే రాశారా?"

"అవును" పద్మ నల్లటి మొహం సిగ్గుతో వైలట్ రంగు తిరిగింది.

"బాగుంది" డెయిరీ ఆమె ముందుకి తోసి మళ్ళీ తిలక్‌ని అందుకున్నాడు.

"ఎలాగుంది?"

"బాగున్నాయి" పొడిగా అనేసి లేచి వెళ్ళబోతుంటే "అదేంటి నేను చాయి తెప్పిస్తుంటే..?" అంది పద్మ చిరుకోపంగా.

హేమంత్ దిక్కుతోచక కూర్చున్నాడు.

"ఇదిగో ఇది చదవండి అంతలోకి" అంటూ డెయిరి ముందుకి తోసింది.

"ఏంటిది?"

"చూడండి. తెలుస్తది"

హేమంత్ ఆ పేజివైపు చూశాడు.

'గుచ్చెం' అని హెడ్డింగుతో రాసిన కవిత అది.

"గుచ్చెమా! పూల గుచ్చెం" అని మురిపెంగా నవ్వింది పద్మ.

"బాగుంది"

"ఏంటది, చదవే లేదుగా!"

"టైటిల్ చూస్తేనే అర్థమవుతోంది. అయినా మీకు కవిత్వం రాయడానికి స్ఫూర్తి ఎవరు?" అన్నాడు హేమంత్.

స్టాఫ్ ఒక్కొరొక్కరే రావటం మొదలవడంతో హేమంత్‌కి కాస్త ఊపిరాడినట్లయింది.

"ఏమో, నాకలా రాయాలనిపించేస్తది"

"ఓహో!" అన్నాడు అప్పుడే సీట్లో వచ్చి కూర్చున్న సూపర్నెంటు ముకుందం ముక్కుపొడుం ఎగబీలుస్తూ.

వనజ కిసుక్కున నవ్వింది అటెండెన్సు రిజిస్టరులో సంతకం పెడుతూ.

పద్మకి వళ్ళు మండింది.

"మా వీధిలో నాకెంత మంది ఫేన్సున్నారో తెలుసా?"

"అవునా, ఏ పత్రికలో వచ్చాయమ్మా నీ కవితలు, మాకు చెప్పనైనా చెప్పేవు కాదు" అన్నాడు ముకుందం వెటకారంగా నవ్వుతూ.

"వారం వారం మా ఇంట్లో సాయిబాబా భజన చేస్తాం కదా! అప్పుడు చదువుతాను"

"అదేనా భజనంటే!" అంది సుధారాణి నవ్వుతూ.

పద్మ మొహం కోపంతో ఇంకా నల్లబడి పోతోంది.

"చూడండి పద్మగారూ, ముందు అక్షరాలు నేర్చుకుంటే.. కవిత్వం రాయడం ఎంతసేపు. ఆ పనిమీద ఉండండి" అంటూ సీట్లోంచి ఠక్కున లేచి వెళ్ళిపోయాడు హేమంత్.

పద్మ మొహం చెక్కు తియ్యని కందగడ్డలా పెట్టుకుని సీట్లోంచి లేచి వెళ్తోంటే "అమ్మా పువ్వు.. గులాబీ పువ్వు తీసుకెళ్ళు" అన్నాడు బాలయ్య ఛీఫింజినీరు దగ్గర నుండి ఫైల్సు తీసుకొస్తూ.

పద్మ కొరకొరా చూస్తూ పువ్వు తీసుకుని సీట్లో కెళ్ళింది కసిగా.

బావ రామారావు రాసిన ఉత్తరం హేమంత్‌ని తీవ్ర అశాంతికి గురిచేసింది.

చేస్తున్న వ్యాపారంలో నష్టం వచ్చి ఇంటిమీద అప్పు చేసినట్లు - అది నెలాఖరుకి కట్టకపోతే.. ఇల్లు జప్తవుతుందని.. వీలయితే అప్పుగా సాయం చెయ్యమని.

హేమంత్‌కి దిక్కుతోచలేదు.

తనా సర్వీసులో కొత్తగా జేరాడు. లోన్ దొరకదు. కానీ బావగారు ఎప్పుడూ ఒక రూపాయి కూడా అడిగి ఎరగరు. తనకు తండ్రిలాంటి వాడు. ఎంత కష్టమొచ్చి నోరు తెరిచారో!

ఆ రాత్రి రాజేశ్వరి ఫోను చేసింది.

"ఒరేయ్, తమ్ముడూ! ఈమధ్య మీ బావగారేంటో దిగులుగా ఉన్నారా! అడిగితే ఏవీ చెప్పరు. భోజనం కూడ సరిగ్గా చేయడం లేదు. ఒకసారి కనుక్కో. నీ కన్నా నిజం చెబుతారేమో!"

అక్క మాటలకి మరింత బాధ కల్గింది హేమంత్‌కి.

ఇంటి గురించి, ఆర్థిక విషయాల గురించి అసలెప్పుడూ ఏమీ పట్టించుకుని ఎరగని హేమంత్ మొదటిసారి తన నిస్సహాయతకి సిగ్గుపడ్డాడు.

మళ్ళీ తల్లి గుర్తొచ్చింది.

ఎప్పుడూ చిరుబురులాడుతూ ఏమాత్రం ఇంటిని పట్టించుకోని తండ్రితో వేగుతూ తమందర్నీ ఎలా ఆదరంగా చూసుకోగలిగిందో... ఆలోచించే కొలది ఆశ్చర్యం వేసింది హేమంత్‌కి.

తలగడ వేసుకుని చాపమీద పడుకుని తిలక్ పుస్తకం చేతిలోకి తీసుకున్నాడు. వెంటనే పద్మ కవిత్వం గుర్తొచ్చి పుస్తకం పక్కన పెట్టేసాడు.

"రమేష్ గారిని అడిగితే..?'

"అమ్మో... ఆ వంకన తనని వాడుకోటానికి ప్రయత్నిస్తాడేమో!"

"అయినా తప్పదు. ప్రయత్నం చేయాలి కదా!" అనుకుని నిద్రకి ప్రయత్నించాడు హేమంత్.

తను పిలవకుండానే రూములోకొచ్చిన హేమంత్‌ని చూసి చాలా సంతోషపడిపోయాడు రమేష్ బాబు.

"రా, హేమంత్, రారా! నిన్నసలు కనిపించనేలేదు" అన్నాడు సాదరంగా.

హేమంత్ కొంచెం సంశయంగా చూస్తూ కూర్చున్నాడు.

రమేష్ అతన్ని గమనిస్తూ "ఏం జరిగింది, ఏవైనా ప్రోబ్లమా?" అన్నాడు సందేహంగా.

ఔనన్నట్లుగా తల పంకించాడు హేమంత్.

"ఏంటో చెప్పు. నేను నీకు బ్రదర్‌లాంటివాడిని. నా దగ్గర హెజిటేషన్సు వద్దు." అన్నాడు ఎంతో ఆదరం చూపిస్తూ.

హేమంత్ టూకీగా పరిస్థితి వివరించాడు.

"అంత పెద్ద ఎమౌంటా, నాకు పెద్ద కష్టం కాదుగాని.. ఎప్పటికప్పుడు ఇంటరెస్టులకిచ్చేస్తుంటాను. ఓ పని చేద్దాం. పద్మని అడిగి చూద్దాం"

హేమంత్ నొసలు చిట్లించాడు.

"పద్మగారినా?" అన్నాడు అయిష్టంగా.

"అవును. నా దగ్గర మూడు పర్సెంటుకి తీసుకుని తను అయిదు పర్సెంటుకి అప్పులిస్తుంది" అంటూ బెల్ కొట్టాడు.

"వద్దు సర్! ఆవిణ్ణి అడగడం ఇష్టంలేదు" అన్నాడు కంగారుగా హేమంత్.

ఇంతలో బాలయ్య రానే వచ్చాడు.

"పద్మగారిని పిలువు" బాలయ్య ఇద్దరి వైపు అదోలా చూసి రివ్వున వెళ్ళాడు.

"వద్దండీ!" అన్నాడు హేమంత్ మళ్ళీ. ఇంతలో పద్మరానే వచ్చేసింది.

"ఏంటిసారి!" అంటూ.

"కూర్చో" అన్నాడు రమేష్ ఏకవచనలో.

పద్మ మెలికలు తిరుగుతూ హేమంత్ పక్క ఛెయిర్‌లో కూర్చుంది.

"కొంచెం డబ్బు కావాలి" అన్నాడు రమేష్ బాబు.

"ఎంత?" అంది హేమంత్ వైపు క్రీగంట చూస్తూ.

"లక్ష ఉందా?"

"ఎవరికి?"

"ఎవరికయితే నేం లే! నాకే అనుకోరాదూ!" అన్నాడు రమేష్ విసుగ్గా.

"బాగుంది. మీ డబ్బే మీరడుగుతున్నారా? మీకయితే పది పర్సెంటు" అంది పద్మ వంకర నవ్వు నవ్వుతూ.

"సరిగ్గా చెప్పు"

"ఎవరిక్కావాలో వాళ్ళడగొచ్చు కదా!" హేమంత్ వైపు వాలు చూపులు చూస్తూ నవ్వింది పద్మ.

"అయిగా చూడాళి సార్. మొన్న శర్మగారి కూతురి పెళ్ళంటే, ఉన్నదంతా ఇచ్చేసాను" అంది తిరిగి.

"బెట్టు చేయకు. నీ దగ్గరే ఉండే ఉంటాయి. నువ్వు చెయ్యని వ్యాపారమేం ఉంది!"

"ఏంటి సార్! అలా అంటారు!"

హేమంత్‌కి సంభాషణంతా చాలా చిరాగ్గా ఉంది.

సర్రున పైకి లేచి నిలబడి "వద్దు సర్!" అంటూ లేచి వెళ్ళిపోయాడు.

"అబ్బో లక్షరూపాయలకి గతిలేదుగాని.. " అని సన్నగా రాగం తీస్తూ బయటకొచ్చింది పద్మ.

హేమంత్ సీట్లో కూర్చుని ఫైలు డీల్ చేయడానికి ప్రయత్నిస్తున్నాడే కాని.. మనసంతా చిరాగ్గా అయిపోయింది.

రమేష్ బాబుమీద చాలా కోపం వచ్చింది.

"ఏదో స్నేహంగా సహాయం చేస్తాడని వెళితే అంతా ఫస్ చేసేడు. ఏంటిదంతా, ఈ ఆఫీసులో జరగని వ్యాపారాలు లేవా! గవర్నమెంటు ఆఫీసులు ఇంత అధోగతిలో ఉంటాయా!" అనుకున్నాడు విసుగ్గా.

ఇంతలో ఎకౌంట్ సెక్షన్ అటెండరు రాజయ్య వచ్చి.

"రండి సార్లూ! పూజ జరుగుతోంది!" అన్నాడు అందర్నీ.

సెక్షనంతా బిలబిలా లేచారు ఎక్కడి ఫైళ్ళక్కడ వదిలేసి.

రమేష్ బాబు కూడా ఛాంబర్‌లోంచి బయటకొచ్చి "రా, హేమంత్.. పూజకెళ్దాం" అన్నాడు.

"పూజా?" ఆశ్చర్యపోతూ అడిగాడు హేమంత్.

"అవును. దశరా నవరాత్రులు కదా, మన ఎకౌంట్‌సెక్షన్‌లో ఈ తొమ్మిదిరోజులు ఘనంగా పూజలు జరుగుతాయి" అంటూ హేమంత్ చెయ్యి పట్టుకుని లాక్కెళ్ళాడు.

అక్కడప్పటికే పెద్ద క్యూ ఉంది.

ఎకౌంట్ సెక్షన్ రూపమే మారిపోయింది. స్టాఫ్ కుర్చీలు, టేబుల్స్ అన్నీ ఓ పక్కకి తోసేసి పూలతో సెక్షనంతా డెకరేట్ చేసారు. దుర్గాదేవి అవతారాల పటాలన్నీ గోడలకి తగిలించి దండలు వేసారు. అచ్చం ఒక గుడిలా ఉంది సెక్షన్. ముఖ్యంగా ఎకౌంట్స్ సెక్షన్ సూపర్నెంటు కనకలింగం, కేషియర్ ముసలయ్య ఎర్రటి పంచెలు కట్టి, నొసలంతా వడియాలు పట్టినట్లు బొట్లన్నీ బొట్లు పెట్టుకుని అర్ధ నిమీలిత నేత్రాలతో నిలబడి అందరికి తీర్థప్రసాదాలు ఇస్తున్నారు.

అక్కడి పరిస్థితి చూసి తెల్లబోయాడు హేమంత్.

ఆఫీసుల్లో ఇలా పూజలు చేస్తారని అతని కసలు తెలియదు.

"ఇదేంటిది, ఆఫీసుల్లో.. ఇలా" అన్నాడు తను చూస్తున్నది జీర్ణించుకోలేక.

"అంతే ఇక్కడ. ఎందుకొచ్చిందో ఏమోగాని మన హైదరాబాదులో... ఇలానే చేస్తారు. రా ప్రసాదం తీసుకుంది గాని.." అంటూ రమేష్ బాబు షూ తీసి భక్తిగా వంగి లోపలి కెళ్ళాడు.

"సీ ద ఫన్" అంటూ అక్కడే కారిడార్ గ్రిల్‌కి జేరబడి నవ్వింది ప్రియ.

హేమంత్ కూడా నవ్వుతూ "వాటీజ్ దిస్ ప్రియా?" అన్నాడు పక్కకెళ్ళి నిలబడుతూ.

"చూశారా! రెండురెళ్ళెంత అంటే చెప్పలేని కనకలింగంగారికి ఎంత డిమాండో ఈ పదిరోజులూ. దేవుడి రిప్రజెంటేటివ్ కదా!" అంటూ నవ్వింది అప్పుడే అక్కడ కొచ్చిన సుధారాణి.

రికార్డు అసిస్టెంటు అలివేలు హారతి పాటలు పాడింది.

"పదండి కాస్సేపు కాంటిన్‌కి పోదాం. ఇంకాస్సేపటికి పూనకాలొచ్చినా ఆశ్చర్యపోనక్కర్లేదు" అంది సుధారాణి.

హేమంత్ కూడా నవ్వుతూ అక్కణ్ణుంచి తప్పుకున్నాడు.

వరుసగా మూడు రోజులు సెలవలు రావడంతో ఊరికి బయలుదేరాడు హేమంత్.

వెళ్తున్నాడే కాని మనసు మనసులో లేదు.

డబ్బుతో వెళ్ళలేక పోతున్నాడు.

"బావగారెంత ఆశపెట్టుకుని చూస్తున్నారో"

ఏం చెప్పాలి.

తమ్ముణ్ణి చూడగానే ఎంతో ఆనందంగా ఎదురొచ్చింది రాజేశ్వరి. రామారావు కూడా ఆదరంగా పలకరించి చేతిలో బాగ్ అందుకున్నాడు. అప్పటికే శ్రీదేవి, సరసవతి సంసారాలతో సహా వచ్చేసారు. ఇల్లంతా పండగ వాతావతణంతో కళకళలాడుతోంది.

హేమంత్ హైదరాబాదు నుండి తీసుకెళ్ళిన గాజులు, స్వీట్స్ రాజేశ్వరి చేతికిచ్చాడు.

స్నానం చేసి తండ్రి దగ్గర కెళ్ళి కూర్చున్నాడు.

అతను తన కోర్టుకాగితాలు చూసుకుంటూ "ఎలా ఏడ్చావు? సిగరెట్లు బాగ తాగుతున్నావా? ఆ పెదాలలా ఏడ్చాయేంటి నల్లగా!" అన్నాడు.

హేమంత్ జవాబు చెప్పలేదు.

"ఆరోగ్యం ఎలా ఉంది నాన్నగారూ?" అన్నాడు మెల్లిగా

"కనపడ్డంలేదూ! సుబ్బరంగా దిబ్బరొట్టెలా ఉన్నాను. ఇదిగో రేపో మాపో మనం గెలుస్తాం. చూస్తూండు. ఆ బీచ్ రోడ్డులో పెద్ద మేడలో కెళ్ళిపోతాం" అన్నాడాయన.

రాజేశ్వరి గుమ్మం దగ్గర నిలబడి తమ్ముణ్ణి రమ్మన్నట్లుగా సైగ చేసింది.

హేమంత్ లేచి వెళ్ళాడు.

"రారా! భోంచేద్దువుగాని. ఆయన శ్వాస, ఆశ కూడా ఆ దిక్కుమాలిన కొంపే. అమ్మని ఒక్కసారి కూడా తలచుకోడు మహానుభావుడు" అంది కోపంగా.

అందరూ కలిసి భోజనాలు చేసాక "సరోజని ఆంటీ ఎలా ఉంది?" అనడిగాడు.

"ఉంది. వెళ్ళి చూసిరా! ఎప్పుడెళ్ళినా నీ సంగతే అడుగుతుంది" అంది రాజేశ్వరి.

హేమంత్ ఆమెకని ఒక చీరకొన్నాడు.

అది తీసుకుని సరోజని ఇంటితలుపు కొట్టాడు.

ఎప్పుడూ తలుపు కొట్టే అవసరం లేకుండా వీధిలోనే కూర్చునుండే సరోజని ఇంటి తలుపులు మూసి ఉండటం హేమంత్‌కి బాధగా అనిపించింది.

సరోజని తలుపు తీసి "ఎవరూ? అంది గుర్తుపట్టనట్లుగా.

"నేనాంటీ, హేమంతుని."

"ఓరి, నువ్వురా ఏవంతూ! రారా! ఎప్పుడొచ్చేవూ?" అంది కుర్చీ ముందుకి జరిపి.

హేమంత్ చీర పాకెట్టు ఆవిడకందించి కూర్చున్నాడు.

"ఏంటివి?" అంటూ పేకెట్‌లోంచి చీరతీసి చూసింది.

"ఏంట్రా, నాకిప్పుడెందుకురా చీర" అంది బాధగా.

"ఇప్పుడు మీ అమ్మ ఉండుంటే.. ఎంతో సంతోషించేదిరా. ఏంటో, దానదృష్టం నిన్ను ప్రయోజకుడిగా చూడలేకపోయింది. ఈరోజు ఈ చీర దానికిచ్చుంటే.. ఎంతానంద పడేది. సర్లే ఎలాగుందక్కడ. బాగున్నావురా!" అంది గడ్డం పుణుకుతూ.

హేమంత్ తల పంకించేడు.

"ఆడెల్లిపోయాడుగా. నా బతుకిట్టా బండలయింది. ఎదవ! బాగా చూసుకునేవాడు. నేనే ఆడితో పోలేక, ఆడు లేకుండా ఉండలేక దిక్కుమాలిన బతుకనుకో. అసలంత ప్రేమించకూడదనుకో. ***ఏం పెళ్ళిళ్ళురా. ఒకళ్ళమీద ఒకళ్ళు వాలిపోడం. ఒకళ్ళు పోయాక.. మరొకళ్ళు చావలేక బతకడం.."*** అంటూ నిట్టూర్చింది సరోజని.

"అది సర్లే... మీ బావగాని ఏవన్నా చెప్పాడా?"

"దేని గురించాంటీ?" అన్నాడు హేమంత్.

సరోజని అటూ ఇటూ చూసి "రామారావు ఇబ్బందుల్లో ఉన్నాడురా! ఇంటిమీద అప్పుంది. నాకు మీ అక్క చెప్పలేదనుకో. వేరే వాళ్ళవల్ల తెలిసింది." అంది కొంచెం స్వరం తగ్గించి.

హేమంత్ అవునన్నట్లు తల పంకించాడు.

"నిన్నగాక మొన్న ఉద్యోగంలో చేరినోడివి... నీకెక్కణ్ణుంచొస్తాయిరా! అందుకే.. నేనొకటి అనుకుంటున్నా!"

హేమంత్ ఆమెవైపు ఆశ్చర్యంగా చూశాడు.

**సరోజని కొంచెం** ముందుకి జరిగి అటూఇటూ చూస్తూ 'ఆ సుబ్బారావు లేడూ..' అంది.

"సుబ్బారావా?"

"ఆడేరా, ఈది పక్క కాగితాలేరుకునేవాడు. ఏ పని జేస్తేనేంటిలే, బాగా గడించేడు. ఇప్పటికి కాస్త అన్నవుంటే పెడతావేంటి, అనడుగుతాడు. మీ మావకి సేయితుడేలే! ఆడి దగ్గర తీసుకుని.. మీ మావయ్యకిచ్చేయి. అప్పుతీసుకున్నట్లు తెలియనియ్యమాకు!" అంది.

హేమంత్ తెల్లబోయినట్లుగా ఆమె మాటలు వింటున్నాడు. "నాకిస్తాడా?" అన్నాడు ఆశ్చర్యంగా.

"ఎందుకివ్వడు, వడ్డీ ఇస్తే గాడిదకన్నా ఇస్తాడు"

"సరే"

"సరే కాదురా, ఏవన్నా కుదవ బెట్టాల"

"కుదువా, నా దగ్గరేముంది?"

"మరదే చెబుతూంట. తాకట్టుకి నా కొంప అడ్డువేస్తా. వడ్డీ డబ్బులు మాత్రం నువ్వంపించు. ఇది మూడోవాడికి తెలియకూడదు. సుబ్బారావుక్కూడ నా కోసవే అని చెబుతా!" అంది సరోజ.

హేమంత్ నిర్ఘాంతపోయి చూశాడు.

"వద్దాంటీ, ఇప్పటికే మేం నీకు ఎంతగానో రుణపడిపోయాం. నీ నిలువనీడ మీద కూడ మా నీడ పడకూడదు"

"ఏరోయ్, మాటలు జోరుగా వస్తున్నాయి. సరేనేనివ్వను. ఎక్కణ్ణుంచి తెస్తావ్? మీ మావ నీడ పోగొట్టి మీ అక్కని రోడ్డుమీద కూర్చోబెడతావా? చెప్పు"

హేమంత్ జవాబు చెప్పలేక తలదించుకున్నాడు.

సరోజని అతని కాలుమీద చెయ్యేసి "ఏరా, అలా మొహం ఏలాడేసుకున్నావ్! నా మాట ఇను. నేనా ఒంటిదాన్ని. ఏమవుతది. పరిస్థితులు చక్కబడ్డాక ఇల్లిడిపించేయచ్చు. ఆనక మీబావేవన్నా చేసుకుంటే ఏడిసిసస్తావ్!"

హేమంత్‌కి అవుననక తప్పలేదు.

ఆ మర్నాడు సుబ్బారావుని పిలిపించింది సరోజని. రాతకోతలయిపోయేయి.

డబ్బు తెచ్చిచ్చేడు సుబ్బారావు.

అతనెళ్ళగానే హేమంత్‌ని పిలిచి డబ్బు చేతికిచ్చింది సరోజని.

కృతజ్ఞతతో అతని కళ్ళు తడయ్యేయి.

"ఆంటీ!" అన్నాడు గద్గదంగా.

అంతకన్నా ఏం మాట్లాడాలో తెలీలేదు హేమంత్‌కి. "ఏంరా, ఏంటీ ఆ కళ్ళనీళ్ళు! నా ఒళ్ళో ఏసుకుని పెంచిన ఎదవల్లా మీరు. మీ అమ్మ ఎంత మంచిదని. మిమ్మల్ని నా పిల్లల్లా చూసుకుంటానని అన్నానా దానితో. ఎల్లు... ఎల్లి ముందా పని చూడు. అసలే అవతలోడు మార్వాడీ ఎదవ!" అంది జారిన ముడి సరిచేసుకుంటూ.

హేమంత్ తలూపి ఇంటికి బయల్దేరేడు.

హేమంత్ చేసిన సహాయానికి కన్నీటి పర్యంతమయ్యేడు రామారావు.

"నిన్నడగటానికి సిగ్గుపడ్డాను హేమంత్. తొందరలోనే.."

"మావయ్య, ముందు ఇంటి సంగతి చూడు. నీ అభిమానాన్ని ప్రేమని ఏ డబ్బుతో కొలవాలి!" అన్నాడు హేమంత్.

ఇద్దరూ కలిసి వెళ్ళే అప్పు వడ్డీతో సహా జమ చేసి ఇంటి కాగితాలు తెచ్చుకున్నారు.

ఆ సంగతి మూడోకంటికి తెలీకుండా... ఒక్క సరోజిని ఆంటీకి తప్పిస్తే.

దసరా నిజంగానే సరదాగానే జరిగిపోయింది.

పండగయిన మర్నాడు హేమంత్ హైదరాబాదు బయల్దేరేడు. సరోజిని కూడా బయటకొచ్చి నిలబడింది.

అందరికి చెప్పి సరోజిని దగ్గర కొచ్చేడు హేమంత్.

"ఆంటీ.."

"ఎళ్ళిరారా! ఊరికే ఏదో ఉపకారం చేసేనని ఇదయిపోకు. వడ్డీమాత్రం నెలనెల పంపు. జాగ్రత్త!"

సరే అన్నట్లుగా బుద్ధిగా తలూపేడు హేమంత్.

"ఏరా, ఆఫీసులో కూడా ఇలాగే తలదించుక్కూర్చుంటున్నావా?"

సరోజని ప్రశ్నకి తల అడ్డంగా ఊపి నవ్వేడు.

"ఎవర్నీ ప్రేమించలేదా?

"ఏంటత్తా, మళ్ళీ మొదలెట్టేవు!" అంది రాజేశ్వరి వచ్చి చిరుకోపంగా.

"ఏ, ఏవన్నా తప్పన్నానా! నువ్వు నీ మావతో సరసాలాడ్డం నాకు తెలీదనుకున్నావా, ఏ వయసు కా ముచ్చట. నువ్వు కానియ్యరా! లేకపోతే.."

"అత్తా" అని గట్టిగా అరిచింది రాజేశ్వరి.

అందరూ నవ్వుతుండగా ఆటో కదిలింది.

ఇంటినుండి తిరిగొచ్చేక చాలా ఒంటరితనంగా అనిపించింది హేమంత్‌కి.

అక్కయ్యలతో, పిల్లలతో - బావగార్లతో పండుగ సందడిగా, సరదాగా గడిచిపోయింది. దానికి మూలకారణం సరోజిని ఆంటీ.

ఆమెగాక సహాయం చెయ్యకపోతే.. ఏం జరిగేదో!

దేవుడు ఆమె రూపమెత్తి తమని కాపాడుతున్నాడేమో!

ఛీ! ఇప్పుడు కూడా స్వార్థమే!

ఆమె చేసిన సహాయాన్ని దేవుడికి ఆపాదించడం.

ఆమే దేవుడు! అవును.

హేమంత్ నిద్రపోదామని పక్కకి వత్తిగిల్లేడు.

కాని.. నిద్ర రావడంలేదు.

ఏదో అస్పష్టమైన భావనలు.

సరోజిని ఆంటీ వచ్చేటప్పుడు అన్నమాటలు గుర్తొచ్చేయి. పెదవులు సన్నగా విచ్చుకున్నాయి.

"ప్రేమించాలట! లేకపోతే..." ఆంటీ ఏమనాలనుకుందో గుర్తొచ్చి నవ్వుకున్నాడు.

ప్రేమించాలని ప్రేమిస్తారా ఎవరైనా..?

ఎన్ని సంవత్సరాలు ఎదురుచూసినా తటస్థపడని ప్రేమ ఒక్క నిముషంలో వచ్చి మనసులో తిష్టవేస్తుందని, క్షణాల్లో మర్రి వృక్షంలో పెరిగి ఊడలూనుతుందని అంటారు కవులు, రచయితలు!

ఏమో, తనకింతవరకు అలాంటి అనుభవంలేదు.

హేమంత్ ఆలోచిస్తూనే నిద్రలోకి జారుకున్నాడు.

ఆ క్షణం అతనికి తెలియదు ఆ మర్నాటి సంఘటన.. తన జీవితాన్ని ఎంతగానో ప్రభావితం చేస్తుందని.

పొద్దుటే ఎన్నడూ లేంది అద్దంలో మరోసారి చూసుకున్నాడు మొహాన్ని.

అందంగానే ఉన్నాడు తను.

బ్లూయిష్ షర్టు తన వంటిమీద అతికినట్లుంది.

పెదవులపైన మీసం నగిషీ పెట్టినట్లుంది.

కళ్ళు నవ్వుతున్నాయి.

వత్తయిన క్రాఫ్ నిర్లక్ష్యంగా ఎగదోసి రూమ్ తాళం వేసి బయటకి వచ్చేడు.

వాతావరణం చల్లగా ఉంది.

శరత్కాలపు మేఘాలు ఆకాశాన్ని కమ్ముకుని ఉన్నాయి.

ఏవో రొమాంటిక్ థాట్స్!

మనసు ఉత్సాహంగా ఉంది.

రెండు పేంట్ పాకెట్ జేబుల్లోనూ చేతులుంచి ఒక కాలితో అడ్డం వచ్చిన రాయిని తన్ని ముందుకి నడిచేడు. ఆఫీసు చేరగానే మామూలే.

సెలవులనంతరం రావడంతో అందరూ ఒకరికొకరు ఈద్ ముబారక్ చెప్పుకుంటున్నారు.

పద్మ అందరికి గోరుమీట్లు పంచింది.

"ఏంటమ్మా ఇవి, అరిసెలు తేకూడదూ?" అన్నాడు అరిచేతిలో ఉన్న గోరుమీటుని ఎగాదిగా చూస్తూ ముకుందం.

"మరే, అప్పుడుగానీ నా ఆస్తంతా ఆరిపోదు" అంది పద్మ వంకరగా.

"పోన్లేమ్మా, రమేష్ బాబుగారికన్నా ఇవ్వు" అన్నాడు ముకుందం గోరుమీటు నోట్లో వేసుకుని చప్పరిస్తూ.

హేమంత్ కూడా మానసికంగా ఒక అవ్యక్తమైన ఆనందంతో ఉన్నాడేమో పద్మని కసురుకోకుండా ఆవిడిచ్చిన మూడు గోరుమీట్లు తీసుకున్నాడు.

"ఏంటయ్యా, ఇంటికెళ్ళొచ్చావు, పెళ్ళికాని కుదిరిందా, మాంఛి హుషారు మీదున్నావు!" అన్నాడు ముకుందం హేమంత్‌ని ఎగాదిగా చూస్తూ.

"పెళ్ళికుదిరితే ఎవరయినా హుషారుగా ఉంటారా, ముకుందంగారూ?" అన్నాడు హేమంత్ నవ్వుతూ.

"మరి ప్రేమా?" అంది సుధారాణి నవ్వుతూ.

హేమంత్ ఏదో అనబోతుండగా స్వరున హాల్లోకి వచ్చిందో అమ్మాయి.

వస్తూనే "మిస్టర్ రమేష్ బాబు ఎక్కడ?" అంది అందరివైపు చూస్తూ.

అందరి దృష్టి ఆమె మీద పడింది.

ఎరుపు తెలుపు మేళవింపులతో ఉన్న రాసిల్కు ఛుడీదారు వేసుకుంది. ఆమె వయసొక పాతిక అంతకన్నా తక్కువ ఉండొచ్చు. ఒకలాంటి గోధుమరంగు చర్మం మెరుస్తూ ఉంది. చాలా మెత్తటి పట్టులాంటి జుట్టు మెరుస్తూ గాలికి కదులుతోంది నిజం చెప్పాలంటే.. ఆ అమ్మాయిలో అందంకన్నా ఆకర్షణ మెండుగా కనిపిస్తోంది.

మొట్టమొదటిసారిగా హేమంత్‌లో ఏదో అనుకోని కదలిక కలిగింది.

"ఎవరూ చెప్పరేం?" ఆమె కసిరినట్లడిగింది.

హేమంత్ అసంకల్పితంగా వేలు పెట్టి రమేష్ బాబు కేబిన్ వైపు చూపించేడు.

ఆమె స్వరున ఒక నాగినిలా కేబిన్‌వైపు వెళ్ళింది.

'ఎవరూ?' అందరి మొహాల్లో కుతూహలం!

"కొత్త ఎపాయింట్‌మెంటా?" అనడిగింది పద్మ.

"నాబొంద. నాకు తెలియకుండా ఎవరప్పాయింటవుతారు?" అన్నాడు ముకుందం.

హేమంత్ ఎవరిమాటలూ వినే స్థితిలో లేడు. మనసు ఆ అమ్మాయి వెంటే పరిగెత్తింది.

అందుకే అసంకల్పితంగా ఫైలు తీసుకుని రమేష్‌బాబు పిలవకపోయినా కేబిన్‌లోకి వెళ్ళాడు.

వెళ్ళగానే అక్కడి దృశ్యం చూసి అవాక్కయిపోయాడు.

రమేష్‌బాబు నిలబడి గజగజా వణుకుతున్నాడు.

అతని మొహానా ఒక చీర వేలాడుతోంది.

"స్టుపిడ్, వాడ్డూయూ థింక్ ఎబౌట్ లేడీస్!" ఆమె అతని కాలర్ పట్టుకోబోతుండగా గభాల్న చేతిలో ఫైలు టేబుల్ మీద పడేసి అడ్డంగా చేతులు పెట్టి నిలబడ్డాడు హేమంత్.

"ఏంటండీ ఇది, ఆఫీస్! అతనెవరనుకుంటున్నారు మా సెక్షన్ హెడ్" అన్నాడు హేమంత్ కోపంగా.

ఆమె హేమంత్ వైపు నిరసనగా చూసింది.

"ఓహో, ఆఫీసరా! నాకు తెలియదు" అంది కోపంగా.

"అదంతా ఏం వద్దు హేమంత్! ఆవిణ్ణి దయచేసి బయటకి పంపు" అన్నాడు రమేష్‌బాబు వణుకుతూ.

"రండి, బయటకెళ్ళి మాట్లాడదాం" అన్నాడు హేమంత్ ఆ అమ్మాయిని బ్రతిమాలుడుతున్న ధోరణిలో.

"మీరెవరు, అతని చమ్చానా? అతనేం చేసాడో తెలుసా?"

"అదంతా ఏం వద్దు. ముందు కూలవ్వండి, రండి బయట మాట్లాడుదాం" అన్నాడు హేమంత్ ఆమెకి బయటకి దారిచూపిస్తూ. ఆ అమ్మాయి సర్రున బయటకి వస్తూ మళ్ళీ రమేష్‌బాబు వైపు వేలు చూపిస్తూ 'బి కేర్ ఫుల్' అంది.

హేమంత్ ఆమెని వారిస్తూ "ప్లీజ్, స్టాఫ్ చూస్తే బాగోదు" అన్నాడు మెల్లిగా.

ఆమె హేమంత్ వైపు అదోలా చూసి విసవిసా మెట్లు దిగింది. ఆ వెనుకే హేమంత్ అనుసరిస్తూ "మేడం, అసలేం జరిగింది?" అన్నాడు.

ఆమె అతన్ని నిరసనగా చూస్తూ "మళ్ళీ మీకు చెప్పాలా?"

"పోనీలెండి, లెటజ్ హాఫ్ కాఫీ. రండి" అన్నాడు వేడుకోలుగా.

"అవసరంలేదు. " అంటూ ఆమె అక్కడే పెట్టిన స్కూటీ స్టార్ట్ చేసింది.

"మీ పేరయినా..?"

"అప్పలమ్మ" అంది విసురుగా వెళ్ళిపోతూ.

"ఓ.కె.బై అప్పలమ్మగారూ!" అన్నాడు హేమంత్ చెయ్యిగాలిలో ఊపుతూ.

ఆమె అదేం వినిపించుకున్నట్లుగా లేదు. స్కూటీ కనుమరుగయింది.

హేమంత్‌కి ఒక కల అకస్మాత్తుగా చెదిరిపోయినట్లయింది.

జరిగిందసలు పట్టించుకోకుండా ఆమె గురించే ఆలోచిస్తూ సీటు దగ్గరకొచ్చాడు.

"ఎవరండీ ఆవిడ, ఏం మాట్లాడింది?" అనడిగేడు కొలీగ్ ఒకతను.

"తెలియదు"

"మరి కూడ వెళ్ళేరుగా!" అంది పద్మ ఆరాగా.

"అమ్మాయి కదా, వెళ్ళేడులే" అన్నాడు ముకుందం. హేమంత్‌కి వీళ్ళ ప్రశ్నలకి ఇంకోసారయితే కోపం వచ్చి ఉండేదేమో.

కానీ... ఈసారి వాళ్ళ ప్రశ్నలసలు అతని మనసుదాక వెళ్ళనేలేదు.

"హేమంత్ సార్, రమేష్ సార్ పిలుస్తున్నారు" అన్నాడు యాదయ్య. ఆ రోజు బాలయ్య సెలవులో ఉండటం రమేష్ బాబు అదృష్టమని చెప్పుకోవాలి.

హేమంత్ లోనికి వెళ్ళగానే రమేష్ కాళ్ళు పట్టుకున్నంత పనిచేసాడు.

"ఏంటిది సార్, ఏం జరిగింది?" అన్నాడు హేమంత్ అతన్ని వారిస్తూ.

"ఈ అమ్మాయి నా క్లాస్‌మేట్. అప్పట్లో నన్ను ప్రేమించింది. నేను ఆ ఉద్దేశ్యంతో చూడలేదు. కానీ ఈ మధ్య ఒక జర్నీలో కనిపించింది. అప్పట్నుంచి నన్ను పెళ్ళిచేసుకోమని వేధిస్తుంది. నేను కాదన్నానని.. ఇదిగో ఇలా అల్లరి చేస్తోంది" అన్నాడు వణికిపోతూ.

"హేమంత్‌కి అతని మాటలు నమ్మశక్యంగా కనిపించలేదు."

ఆమె రమేష్‌బాబుకన్నా చాలా చిన్నదిగా కనపడుతోంది. మరి ఆ చీర కథేమిటని అడగాలనిపించింది. కానీ.. బాగోదని ఊరుకున్నాడు.

"కాని.. మీకు పెళ్ళయింది కదా సర్!" అన్నాడు.

"అదే చెబుతుంటే వినదే! రెండో భార్యగానన్నా ఉంటుందట. కాదన్నానని ఎంత రగడ చేసిందో చూడు. స్టాఫ్‌కి నువ్వే ఏదో ఒకటి చెప్పు. లేకపోతే నే తలెత్తుకుని ఎలా తిరిగేది?" అన్నాడు ఏడుపు గొంతుతో.

"సరేలెండి" అంటూ పైకి లేచేడు హేమంత్.

"నీతో ఏవన్నా అన్నదా?" సందేహంగా అడిగేడు రమేష్‌బాబు.

"లేదు. అసలు మాట్లాడే స్థితిలో లేదు. వెళ్ళిపోయింది."

"పోనీలే. పీడా విరగడయింది. నువ్వు లేకపోతే.. అమ్మో!" అనుకున్నాడు గుండెమీద చేతులుంచుకుని.

హేమంత్ బయటకి రాగానే "ఏంటి కథ? ఏం జరిగింది?" అనడిగేరు అందరూ. అందరూ ఫైళ్ళు పనివదిలేసి ఎంతో ఆసక్తిగా చూసేరతని వైపు.

"స్క్రూలూజ్! వాళ్ళ చుట్టాలేనట!" అన్నాడు హేమంత్ తన సీట్లోకి వెళ్ళికూర్చుంటూ.

పద్మ మూతి తిప్పింది.

"ఎవరి చెవుల్లో పూలు పెడ్తారు. ఆ పిల్ల లక్షణంగా ఉంటే పిచ్చిదని చెబితే నమ్మడానికి మాకేం పిచ్చిలేదు" అంది వంకరగా నవ్వుతూ.

"అది మీ ఇష్టం. సార్ చెప్పింది నేను చెప్పేను అంతే!"

"అవున్లే, మనకెందుకొచ్చిన గొడవ. నమ్మేస్తే పోలా!" అన్నాడు ముకుందం.

"పిల్ల మాత్రం కత్తిలా ఉంది" అన్నారింకొకరు.

"పొరుగింటి పుల్లకూర కదా! అలానే ఉంటుంది లెండి" అంది ప్రియ.

"ఓహో, ఇదొక గొడవా!" అన్నాడు ముకుందం నవ్వుతూ.

హేమంత్ మాత్రం ఎవరి మాటలూ వినేదశలో లేడు. అతని మనసు ఆమెతో వెళ్ళిపోయింది.

మనసంతా ఏదో సువాసన పరచినట్లు ఆహ్లాదంగా మారిపోయింది.

మళ్ళీ కనిపిస్తుందా?

పేరైనా చెప్పింది కాదే?

ఎలా మళ్ళీ చూడటం.

ఎన్నో ప్రశ్నలు మనస్సుని దొలుస్తుంటే అర్జెంటుగా వెళ్ళి రమేష్‌బాబుని పేరయినా అడగాలని అనుకున్నాడు.

కానీ బాగోదని మనసుని నొక్కిపట్టుకుని అయిదుకాగానే ఇంటిమొహం పట్టాడు.

రూమ్‌కి వెళ్ళాడేగానీ మనసు మనసులో లేదు.

పడుకుని ఏదో పుస్తకం చదవాలని ప్రయత్నించేడు కాని.. ఆ పేజీల్లో ఆమే సాక్షాత్కరించడం మొదలయింది.

ఏంటిది! తను ఇతకన్నా అందమైన అమ్మాయిల్ని చూశాడు. వాళ్ళ పక్కనే కూర్చుని కబుర్లు చెప్పాడు.

కానీ.... ఈ రోజు ఎందుకిలా ఈ అమ్మాయి తనని హంట్ చేస్తోంది.

అర్థం కావడం లేదు.

ఇదేనా ప్రేమంటే.

హేమంత్ అస్తవ్యస్తమైన ఆలోచనలతో కలతనిద్ర పోయాడు ఏ అర్ధరాత్రి దాటాకనో.

**సరోజిని ఒంటరిగా కూర్చుని ఆలోచిస్తోంది.**

కనకారావు చనిపోయిన దగ్గరనుండి ఆమె ఒంటరిదే అంతకుముందే శాంతమ్మ చనిపోయి మనసుకి ఒక రెక్క విరిగినట్లయింది.

గోడకి వేలాడుతున్న భర్త ఫోటోకేసి చూసింది.

ఎంతందంగా ఉంటాడతను.

పాతబెల్లంలా నల్లగా, కొంచెం ఎత్తుగా ఉండే తెల్లటి పళ్ళు, గాలికి వంగిన వెదురుబొంగులా వంగి - వెరసి.. తన కళ్ళకు నవమన్మధుడు.

ఈ మాటే అంటే పకపకా నవ్వేవాడు.

నవ్వినప్పుడు అతని పొట్ట అలలు అలల్లా కదిలేది.

"ఏవిటమ్మా, సరోజినీ! అందానికి కొత్త నిర్వచనం చెబుతున్నావు?" అనేవాడు.

అతను హైస్కూలు చదువు దాటలేదు.

జీవితమంతా పచారీ కొట్లో గుమస్తాగా పనిచేసాడు.

నిజాయితీని గౌరవించే ఆ షాపు యజమాన్లు కనకారావుని చాలా గౌరవంగా చూసేవారు. 'కనకారావుగారూ, మీరు చెప్పండి' అని ప్రతిదానికి సలహా తీసుకునేవారు.

తనకి పెత్తనం ఇచ్చేరని బుర్రంతా గొరిగే రకం కాదు కనకారావు.

తన హద్దులో ఉండి తగిన సలహా మాత్రమే ఇచ్చేవాడు.

స్వంత ఇల్లు ఉంది. పిల్లల్లేరు. ఉన్నదాంతో కాలం గడిపేసారు. అంతో ఇంతో మిగల్చుకుని నల్గురికి సాయం చేసారు. అందుకే తను.. శాంతమ్మ కుటుంబాన్ని ఆదుకోగలిగింది.

సరోజిని మళ్ళీ భర్త ఫోటోకేసి చూసింది.

ఆ ఫోటోకూడా వెలిసినట్లయింది.

కాని... అతని కళ్ళు మాత్రం స్వచ్ఛంగా, నిర్మలంగా మెరుస్తూ కనిపిస్తున్నాయి. ఆ కళ్ళు చాలు.. అతనిలోని నిజాయితీని వెలికి తీసి చూపించడానికి.

అందమూ, నిర్మలత్వమూ..ప్రేమ అన్నీ ఆ కళ్ళలోనే ఉన్నాయి.

కళ్ళే కదా.. మనసుకి గవాక్షాలు.

సరోజినికి అంతా గుర్తొస్తుంది.

తనకి గర్భసంచి తీసేసారు. ఇక పిల్లలు పుట్టరని తెలిసిపోయాక తను చాలా ఏడ్చింది.

అప్పుడు కనకారావు చూపించిన ప్రేమ, చెప్పిన మాటలు తనెప్పటికి మరచిపోలేదు.

"పిల్లలు లేకపోతేనేవమ్మా! మనిద్దరం ఒకరికొకరం పిల్లలంకామా! ఈ లోకంలో పిల్లలంతా మన పిల్లలు కారా! కడుపున పుట్టిన వాళ్ళు ఎలా కాల్చుకుతింటున్నారో.. ఏ పేగునుండి పుట్టారో ఆ పేగుని ఎలా ముక్కలు చేసి హింసిస్తున్నారో చూడటంలేదా! ఊరుకో, చాదస్తంపోకు" అని తలనిమిరుతూ ఊరడించేడు.

తనని ఎప్పుడూ 'అమ్మా' అని సంబోధించేవాడు.

"పెళ్ళాన్ని అసె, ఒసె, ఇదిగో అని పిలిచే మగాళ్ళని చూసానుగాని నువ్వు 'అమ్మా' అంటావేంటి ఏకంగా?" అని అడిగింది ఒకసారి.

అతను నవ్వి "భార్యలోనూ అమ్మ ఉంటుంది సరోజనీ. అసలు స్త్రీలోనే అమ్మ ఉంటుంది. స్త్రీత్వమే అమ్మ" అనేవాడు.

"సరే, రోజూ ఆ గుడిలో కూర్చుని అరికతలు ఇని ఏదో చెప్తావు. నేనెల్లి ఈదిలో కూర్చోవాల. చాలామంది ఇప్పటికే నా బారిన పడకుండా తప్పించుకున్నారు" అని ఇన్ని వేరుశెనగ గుళ్ళు వళ్ళో వేసుకుని వీధరుగు ఎక్కి కూర్చునేది తను.

కనకారావు నవ్వుకుంటూ "నీ ప్రోగ్రాం నువ్వు కానివ్వు నే గుడికి పోతున్నా!" అని వెళ్ళిపోయేవాడు.

తన వీధిలో వెళ్ళేవాళ్ళని వచ్చేవాళ్ళని గిల్లి, ఆటపట్టించి లోపలి కొచ్చేది.

తర్వాత ఎంత రాత్రయినా కలిసి భోంచేసేవారు.

వచ్చేటప్పుడు అంత జిలేబీనో, చక్రకేళి అరటిపళ్ళో ఏదో ఒకటి తెచ్చి ఇచ్చేవాడు తనకి.

ఇద్దరూ కలిసి పిచ్చాపాటీ చెప్పుకుంటూ పచ్చడి మెతుకులయినా పరవాణ్ణంలా తినేవారు.

ప్రతిపనిలోనూ సహాయపడేవాడు.

రాత్రి ఇద్దరూ కొత్తప్రేమికులయ్యేవారు.

సరదా మాటలు చెప్పుకుని కిలకిలా నవ్వుకునేవారు.

నిజానికి తనదేమీలేదు.

జీవితాన్ని ఎంత నిత్యనూతనంగా ఉంచాలో అతనికి తెలుసు.

అతని మాటలో లాలిత్యం, ప్రేమ, బాధ్యత తొణికిసలాడేవి. తన స్వేచ్ఛకి ఏనాడూ అడ్డం పడేవాడు కాదు.

అసలు స్వేచ్ఛ అంటే ఏవిటి?

మనహద్దులు మనకే తెలుసు.

ఒక వ్యక్తి అకస్మాత్తుగా మన జీవితంలో ప్రవేశించి, తప్పుకాని ప్రతిపనిని తప్పుగానో లేక తనమీద సర్వాధికారాలు పొందేనన్న అహంతో ఎగిరే రెక్కలకి కత్తెర వేయడం మంత బందిఖానా మరొకటుంటుందా.

'మనల్ని మరొకరు ప్రతిక్షణం శాసిస్తున్నారు' అనే భావనే మనకి నరకాన్ని చూపిస్తుంది.

భర్తలో స్నేహితుణ్ణి చూసిన తనకి అతనికన్నా ఎవరు మాత్రం అందంగా కనిపిస్తారు.

సరోజిని రామలక్ష్మి పిలుపుతో ఈలోకంలోకొచ్చింది.

"ఏంటే?" అంది సరోజిని రామలక్ష్మి చేతిలో ఏ గిన్నె లేకపోవడం చూసి.

సహజంగా రామలక్ష్మి ఉప్పుకో పప్పుకో ఓ గిన్నె తీసుకుని వస్తుంది.

'మళ్ళీ ఇచ్చేస్తానన్నది' ఒక ఊతపదం.

ఆవిడ ఇచ్చేదిలేదు, సరోజిని తీసుకునేదీ లేదు.

"ఏంటిలా వచ్చావు, చేతిలో గిన్నె లేదేంటే! కొంపదీసి గిన్నెకూడా అప్పివ్వాలా?" అంది నవ్వుతూ.

"నీకు మరీ చతుర్లెక్కువలే. రాములోరి గుడికి ఆయనెవరో పెద్దసావులొరొచ్చేరంట. కాసేపు ఎల్దాంరా!" అంది.

"నేను రానని తెలుసుకదా!"

"తెలుసులే. ఎన్నాళ్ళిలా కూర్చొంటావు, కూర్చుంటే బావేవన్నా వస్తాడా! లోపల కూర్చుని కూర్చుని మావిడిపండులా మగ్గిపోతున్నావు. కొంచెం బయట కొస్తే... కాస్త బాగుంటదక్కా!" అంది బ్రతిమాలుతున్నట్లుగా.

"ఏమోనే? మీ బావపిలుపుకోసం ఇలా పడున్నా" అంది సరోజిని విరక్తిగా.

"బావ పిలుపా, దేవుడి పిలుపా?" నవ్వింది రామలక్ష్మి.

"నాకా గుళ్ళో దేవుళ్ళమీద నమ్మకం లేదే రాముడూ! మీ బావే నాకు కనిపించిన దేవుడు. కలిసి బతికిన దేవుడు." అంది సరోజిని కన్నీళ్ళతో.

"ఇలాగయితే ఎలాగక్కా, ఒక్కసారి నా మాట విని చీర మార్చుకుని నాతోరా! కాసేపు బయటగాలి పీల్చినట్లవుతుంది. నువ్విలా జీవసమాధయిపోతే.. బావ ఆత్మ ఎంత బాధపడుతుంది. నువ్వు ఒకవిధంగా బావని ఏడిపిస్తున్నావ్!" అంది రామలక్ష్మి.

సరోజిని రామలక్ష్మి వైపు సాలోచనగా చూసింది.

అదే అదనుగా రామలక్ష్మి మళ్ళీ మాటలు కొనసాగించింది.

"ఒక్కసారి పుట్టం. ఒక్కసారిపోము. ఇద్దరిలో ఒకరు పోగానే మన ఆనందాన్ని, సరదాల్ని, సంతోషాల్ని పొట్లం కట్టి పడెయ్యడంకన్నా ఆడి బొందలోనే పడికాలిపోవడం మంచిది. ఏ? మగాడు ఏదొదులుకుంటున్నాడు. రెండునెలల్లోనే టింగురంగా అని పెళ్ళి చేసుకుంటున్నాడు. నా మొగుడు చూడు, గడపదాటగానే.. వీధిలో వెళ్ళే ప్రతి ఆడదాన్ని దొంగచూపులు చూస్తాడు. లే! చీరమార్చుకో. నా మాటిను" అంది.

సరోజిని చిన్నగా నవ్వింది.

"కాదే.. ఎన్నాళ్ళయింది ఈదేపు చూసి" అంది - నసుగుతూ.

"పర్లేదు. నేనున్నానుగా!లే!"

సరోజిని తప్పదన్నట్లు తయారయి రామలక్ష్మి వెనకాల బెరుకుగా కదిలింది.

ప్రొద్దుట నుండి ఆఫీసు చాలా హడావుడిగా ఉంది. ఛీఫ్ ఇంజనీర్, డెప్యూటి ఛీఫ్ ఇంజనీరు టూర్ వెళ్ళారు.

ఆఫీసంతా ఆటవిడుపులా ఉంది.

దానికి తోడు ఆరోజు రమేష్ బాబు సెక్షన్‌లోనే లంచ్ ఏర్పాటు చేస్తున్నాడు.

ఇంకేముంది. ఏకారణం దొరికితే పనిఎగ్గొడదాం అనే బాపతంతా కబుర్లలో పడ్డారు.

"ఏంటసలు విశేషం. నిన్న ఆ అమ్మాయి తన్ననందుకా?" అంది ప్రియ వెటకారంగా.

"అమ్మా ప్రియా! నీకింకా ప్రొబేషన్ డిక్లేర్ కాలేదు. సర్వీస్ రూల్స్ తెలియవు. ఏ వంక పెట్టన్నా నిన్నింటికి సాగనంపొచ్చు. పక్క రూంలో ఎంత చచ్చినా కూర్చున్న వాడు ఆఫీసరమ్మా. నోరు సంబాళించుకో" అన్నాడు ముకుందం ప్రియని మందలిస్తూ.

ఇంతలో పద్మ రమేష్‌బాబు చాంబర్‌లోంచి స్వరున వచ్చి "ఈరోజు సార్ మారేజయి పదేళ్ళయిందట. అందుకే లంచ్. మధ్యాహ్నం నుండి వెళ్ళిపోతారట, ఎంజాయ్ చెయ్యడానికి" అంటూ స్పెషల్ న్యూస్ తీసుకొచ్చింది.

"పదేళ్ళయ్యేక ఇక ప్రత్యేకమైన ఎంజాయ్‌మెంటేముంటుంది?" అన్నాడు ముకుందం సాగదీస్తూ.

అందరూ నవ్వుతుంటే హేమంత్ కూడ శ్రుతి కల్పాడేగాని అతని మనసిక్కడలేదు.

నిన్నటి అప్పలమ్మే అతని హృదయమంతా తిరుగుతోంది.

"ఏంటండీ హేమంతుగారూ! మీరిక్కడలేరా?" అంటూ సాగదీసింది పద్మ.

హేమంత్ ఏదో చెప్పబోయేంతలో రమేష్ బాబు హేమంత్‌ని పిలిచాడు.

హేమంత్‌లోనికెళ్ళగానే ఒక స్లిప్ ఇచ్చి "ఆమెను చూడు, ఇలా ఇస్తే బాగానే ఉంటుంది కదా?" అన్నాడు రమేష్.

హేమంత్ స్లిప్ వైపు చూడకుండానే "మీకెలా తోస్తే అలా ఇవ్వండి సర్. ఇందులో నా సలహా ఏముంది?" అన్నాడు.

"అయినా ఒకసారి చూడు, నా తర్వాత జనరేషన్ కదా! మీరు!" అన్నాడు రమేష్ బాబు.

"సరే!" అంటూ ముక్తసరిగా చూసి 'ఓ.కె' చేసేడు హేమంత్.

పార్టీ భారీ ఎత్తున జరిగిపోయింది.

అందరూ రమేష్ బాబుని విష్ చేసారు.

రమేష్ బాబు హాఫ్‌డే శెలవు పెట్టి ఇంటికి వెళ్ళిపోయాడు.

చాలామంది కాస్సేపు అటూ ఇటూ చూసి పర్మిషన్లు పెట్టి వెళ్ళిపోయారు.

హేమంత్, ముకుందం మాత్రం మిగిలారు సీట్లలో.

"నాయనా, హేమంత్"

తలెత్తి చూశాడు హేమంత్.

"నాదొక సలహా" అన్నాడు ముకుందం. "నువ్వు గ్రూప్ వన్ పరీక్షలు రాయకూడదూ?"

ప్రశ్నార్థకంగా చూశాడు హేమంత్.

"ఇక్కడ ఎన్నాళ్ళు చేసినా గొర్రెతోక బెత్తెడే కొందరికి ఎందుకలా హడావుడిగా ప్రమోషన్లు వస్తాయో, కొందరెందుకలా సంవత్సరాల తరబడి ఒకే పోస్టుకి పరిమితమయి పోతారో దేవుడిక్కూడ తెలియదు. రూల్స్‌ని ఎలా డీవియేట్ చేసి అర్హత ఉన్న వాడిని పక్కన కూర్చోబెట్టొచ్చో ఆ ఎడ్మినిస్ట్రేటివ్ పోస్టులో ఉన్న వాళ్ళకి తెలిసినట్లు మరెవరికో తెలియదు. ఇప్పుడక్కడ రాజ్యమేలుతున్న వాడు నాకన్నా పదేళ్ళు జూనియర్. అందుకే నువ్వీ క్యూలో ఏ నాటికీ పైకిరాలేవు. ఒక్క సంవత్సరంలో నీ బుర్రలో గుజ్జంతా పోయి మట్టి చేరుతుంది. నా మాట విని నువ్వీ డిపార్టుమెంటు వదిలేయ్!"

హేమంత్ ఆయన మాటలు సాలోచనగా విన్నాడు.

నిజమే అనిపించింది.

ఉద్యోగం వచ్చినప్పటి సంతోషం ఆఫీసులో చేరాక మాయమైపోయింది.

ఆఫీసు వాతావరణమే తానుహించనిది.

ఒకరికి పదిమంది సీట్సు పని అప్పచెబుతారు.

పదిమంది గాలికి తిరుగుతుంటారు.

ఆఫీసు స్టైల్‌గాని, డెకొరమ్‌గాని చాలా మందిలో ఉండదు.

ఆడవాళ్ళు చాలామంది ఆఫీసులో కూడ వంటగదిలో తిరిగినట్లే తిరుగుతుంటారు. చాలాసేపు సంసార విషయాలే నడుస్తుంటాయి.

మగవాళ్ళు కూడా అంతే.

ఒక బటన్ మరో కాజాలో పెట్టుకుని 'ఏదో వచ్చిపడ్డాం' అన్నట్లు వస్తారు.

ఎందుకిలా మారిపోతారు. స్టేట్ గవర్నమెంటులో ఎందుకలా ఉదాసీనత ఆవహిస్తుంది?

జీతాలు చాలకనా? ప్రమోషన్స్ రావనా? చేసేవాడి చేతే పని చేయిస్తారనా?

హేమంత్ ఆలోచిస్తుండగానే అయిదయింది.

ముకుందంతో పాటు హేమంత్ కూడా డ్రా లాక్ చేసి బయటకి కదిలాడు. ఇద్దరూ నడుస్తుండగా "ఎక్కడిదాక?" అనడిగాడు ముకుందం.

"కోఠికి"

"అయితే నా స్కూటరెక్కు. దారేనాకు. వదిలేస్తాను" అన్నాడు.

హేమంత్ స్కూటర్ ఎక్కేడు.

ట్రాఫిక్ హెవీగా ఉంది.

మెల్లిగా వెళ్తున్నాడు ముకుందం.

కోఠి వచ్చాక స్కూటర్ దిగి 'థాంక్స్' చెప్పి మెల్లిగా పుస్తకాల షాపువైపు వెళ్ళి తనక్కావాల్సిన గ్రూప్ 1 ఎగ్జామ్స్‌కి కావాల్సిన పుస్తకాలు సేకరించాడు హేమంత్.

టైమెంతయిందో కూడా తెలియదు.

ఆడవాళ్ళకి నగలషాపుకి, బట్టలుషాపుకి వెళ్తే కాలం ఎంతయిందో తెలియనట్లు పుస్తకప్రియులకు పుస్తకాల షాపు కెళ్తే తెలియదు.

హేమంత్ అన్నింటినీ చూస్తూ చాలాసేపు టైమ్ గడిపి అక్కడే ఏదన్నా రెస్టారెంటులో టిఫిన్ తిని వెళ్దామని రోడ్డి క్రాస్ చేయబోయాడు.

అతను ఒకవేపుకి చూస్తూ రోడ్డు క్రాస్ చేస్తుండగా జరిగిందా సంఘటన.

మరోవైపు నుండి బస్సు మరో బస్సుని ఓవర్ టేక్ చేస్తూ శరవేగంగా వచ్చేసింది.

సరిగ్గా అప్పుడే ఎవరో వెనక నుండి అతన్ని బలంగా లాగారు. అతను తూలిపడ్డాడు.

క్షణాల్లో జరిగిపోయిందంతా.

హేమంత్ తేరుకుని చూస్తే అతన్ని లాగింది ఒకమ్మాయి. లాగడంలో హేమంత్ బలానికి తట్టుకోలేక అతనిమీదే పడింది.

మొత్తానికి ప్రమాదం తప్పింది.

ఆమె వెంటనే సర్దుకుని వెనక్కి జరిగింది.

హేమంత్ ఆమెవైపు తిరిగి థాంక్స్ చెబుతూ అవాక్కయ్యాడు.

ఆమె..ఆమె.. అక్షరాల అప్పలమ్మే.

ఎంత చిత్రం.

తిరిగి తొందరలోనే ఆమె కనిపించడం

"ఏ ఊరు మీది? ఆమదాలవలసా?" ఆ అమ్మాయి హేమంత్‌ని ప్రశ్నించింది చున్నీ సరిచేసుకుంటూ.

"కొంచెం దగ్గరే. వైజాగ్!" అన్నాడు హేమంత్.

జవాబు చెప్పాడేగాని అతని మనసు చెప్పలేని సంభ్రమానికి గురవుతోంది.

నిజంగా! తను చూస్తున్నది నిజమేనా?

ఏదో కెమికల్ రియాక్షన్ జరిగిపోతోంది మనసులో.

ఆమె మాత్రం అదేం పట్టనట్లుగా "ఎక్కడికెళ్ళాలి?" అనడిగింది.

"పంజగుట్ట. నే వెళ్ళిపోతాలెండి"

"వెళ్ళకపోతే మా ఇంటికి తీసుకెళ్తానా? రండి. కాఫీ తాగి వెళ్దాం. నేనూ అటే. అక్కడ డ్రాప్ చేస్తాను" అందామె.

హేమంత్ తెల్లబోతున్నాడు.

"ఈమె నన్నసలు గుర్తుపట్టిందా? ఎవరో స్ట్రేంజర్‌తో కాఫీ తాగడమే కాకుండా లిఫ్ట్ కూడా ఇస్తుందా?

అర్ధం కావడంలేదు.

ఏది ఏమైనా ఆమెతో మరికాస్సేపు ఉండగల్గడం ఒక అదృష్టం.

హేమంత్ సంతోషంగా స్కూటరెక్కాడు.

**ఆమె ముందు కూర్చుని** స్కూటీ నడుపుతుంటే కొంచెం సిగ్గుగానూ.. మరికొంచెం థ్రిల్లింగ్‌గానూ ఉంది హేమంత్‌కి.

ఎంతకాదన్నా ఆమె శరీరం అతన్ని తాకుతూనే ఉంది.

కుదుపుల్లో ఆమె అతనికి తాకినప్పుడల్లా హేమంత్‌కి ఏదో వింత అనుభవం నరాల్లో పాకుతోంది. మనసు, శరీరం గమ్మత్తయిన పరవశానికి గురవుతున్నాయి.

అంతకుముందే ఆమె పట్ల ఒక చిత్రమైన ఆకర్షణకి గురయి ఉన్నాడేమో. ఇప్పుడతనికి ఆమె పట్ల విపరీతమైన ప్రేమకి గురికావడం చిత్రంగా లేదు. ఆమె మాత్రం అదేం గమనించకుండా దగ్గర్లో ఉన్న తాజ్‌కి తీసుకెళ్ళింది.

ఆమె స్కూటీ ఆపగానే హేమంత్ కొంచెం నిరుత్సాహానికి గురయ్యాడు.

ఇద్దరూ లోనికి వెళ్ళి కూర్చున్నారు.

"ఏం తీసుకుంటారు?"

ఆమె అడిగింది.

"మీ ఇష్టం" పరధ్యానంగా అన్నాడు హేమంత్.

అతనికిప్పుడసలు ఆకలే లేదు.

అనుకోని పెన్నిధి దొరికినట్లు అతని మనసు చిత్రమైన అనుభూతికి గురవుతోంది.

"ఇక్కడ సౌతిండియన్ టిఫిన్స్ బాగుంటాయి. చాలా పాత హోటల్. ఐనా నేనిక్కడే ప్రిఫర్ చేస్తాను"

హేమంత్‌కి ఆమె మాటలసలు చెవికెక్కడం లేదు. ఆమె అతన్నేం గమనించడం లేదు.

ఆమె తెప్పించిన పూరీలు అన్యమనస్కంగా తింటూ ఆమెనే గమనిస్తున్నాడు.

"ఏం చేస్తుంటారు?" ఆమె ప్రశ్నకి అతను ఉలిక్కిపడ్డాడు.

అంటే..!?.. ఈమె తనని గుర్తుపట్టలేదా? లేక తమాషా పట్టిస్తోందా?

" - మీరు.. నన్ను గుర్తుపట్టలేదా?" ఆశ్చర్యపోతూ అడిగాడు హేమంత్.

"గుర్తుపట్టడమా?" ఈసారి ఆశ్చర్యపోవడం ఆమె వంతయింది.

"ఆమె మాటల్లో నిజాయితీ గ్రహించగానే.. మీరు ఆ రోజు మా ఆఫీసుకొచ్చారు"

"మీ ఆఫీసుకా?"

"అవును రమేష్ బాబుతో గొడవపడినప్పుడు.. నేనే... మీకు నచ్చచెప్పి..."

ఆ మాట వింటూనే అప్పటిదాకా మెరుస్తున్న ఆమె కళ్ళు ఎర్రబడ్డాయి. కోపంతో మొహం జేవురించింది.

వెంటనే తనని తాను కంట్రోల్ చేసుకోడానికన్నట్లుగా మంచి నీళ్ళు తాగి "ఓహో! మీరా? నాకసలు గుర్తులేరు!" అంది నవ్వడానికి ప్రయత్నిస్తూ.

ఆమె మాటలు కొంచెం నిరుత్సాహం కల్గించినా.. హేమంత్ నవ్వుతూ "నాకు మాత్రం మీరు గుర్తున్నారు. మీ పేరు అప్పలమ్మ కదా! అలా పెట్టేరేంటండి పేరు. ఆవిడ మీ కులదైవమా?" అన్నాడు.

వెంటనే సుడులు తిరుగుతున్నట్లుగా నవ్వింది.

ఆమెలా నవ్వుతుంటే సమ్మోహనంగా ఉంది హేమంత్‌కి. ఆమె పొడవాటి కళ్ళు అరమోడ్పులయి విసన కర్రల్లాంటి కనురెప్పల వెంట్రుకలు కదులుతూ.. పెదవులు సాగి ఎర్రబడి బుగ్గల దాకా పాకి... హేమంత్ హృదయం శ్రుతి తప్పిపోతోంది.

ఆమె కొద్దిగా నవ్వు కంట్రోల్ చేసుకుని .... "నిజంగా నమ్మేసారా?" అంది.

"మరి..?"

"ఊహించండి నా పేరు! మీ వల్లకాదు!"

"సుహాసిని!"

"ఎందుకు? నవ్వాను కాబట్టా? మరి ఏడిస్తే దుఃఖభాజని అంటారా?"

హేమంత్ దిక్కుతోచనట్లు బుర్రగోక్కున్నాడు.

"వద్దులెండి. నేనే చెబుతాను. వరూధిని"

"అంటే ప్రవరుడుని సతాయించిన వరూధిని?"

"అవును అల్లసాని పెద్దనగారి వరూధినే. కాని.. నేను మిమ్మల్ని సతాయించను లెండి" అందామె చిలిపిగా నవ్వుతూ.

"నేను ప్రవరుడంత తెలివి తక్కువవాణ్ణి కాదులెండి" ఠక్కున అనేసి నాలిక్కరుచుకోబోయి ఆగిపోయాడు హేమంత్.

వరూధిని అతన్నదోలా చూసి "ఫర్వాలేదు.. మాటలు వచ్చే!" అంది కొద్దిగా నవ్వుతూ.

హేమంత్ రిలాక్సయి "అమ్మాయిలంత స్పీడ్ అబ్బాయిలు మాట్లాడరు మేడమ్" అన్నాడు చిరునవ్వుతో.

"అవును చేతలు నేర్చిన వారికి మాటలెందుకులెండి" అంది వరూధిని.

"ఇంతకీ మీరేం చేస్తుంటారో చెప్పలేదు.?"

"జాబ్"

"అదే, ఎక్కడ, ఏమిటని?"

"ఎందుకు, రేపట్నుంచి.. అక్కడ తయారవుదామనా?"

హేమంత్ కొంచెం చురుక్కుమన్నట్లుగా చూసి "మరీ అంత బేవార్స్‌గా భావించకండి. నేనూ ఇంజనీర్నే. కొన్ని హద్దులు పరిమితులూ ఉన్నాయి నాకు!" అన్నాడు.

"సారీ సరదాగా అన్నాను. అద్సరే రమేష్ బాబు కూడా ఇంజనీరేకదా! సంస్కారాలు డిగ్రీల్లో ఉండవండి. పెరిగిన వాతావరణంలో ఉంటాయి. ఏమంటారు?"

"నిజమే" అన్నాడు హేమంత్.

ఇద్దరూ కాఫీ తాగడం పూర్తిచేసి బయటకి వచ్చారు.

"ఎక్కడ వదలాలి మిమ్మల్ని?"

"వద్దులెండి, నేను వెళ్ళిపోతాను" అన్నాడు హేమంత్ మొగమాటంగా.

"నేను వెళ్ళేది అదే దారయితే వేరుగా వెళ్ళడం దేనికి? ఇంకాస్సేపు మాట్లాడుకోవచ్చు, అన్నట్లు మీ పేరు చెప్పనే లేదు!"

"మీరడగనే లేదుగా. హేమంత్ నా పేరు!" అన్నాడు.

"ఓ! చాలా ఇష్టమైన పేరు. మిమ్మల్ని 'హేమ్' అని పిలుస్తాను. ఓ.కే!" అంది వరూధిని.

అడగకనే వరాలిచ్చే దేవతలా కనిపించింది ఆమె హేమంత్‌కి.

"బాగుంది. ఇలా నన్నెవరూ ఇంతవరకూ పిలవలేదు" అన్నాడు హేమంత్ సంతోషంగా.

"ఇంతకీ.. ఎంతవరకు?"

"పంజగుట్ట"

"నేను సంజీవరెడ్డి నగర్ వెళ్ళాలి. రండి"

హేమంత్ ఎక్కి కూర్చున్నాడు.

"బాగా చీకటి పడింది. ఆమెతో రైడ్ హేమంత్‌కి ఏవో లోకాల్లో తేలిపోతున్నట్లుండగానే పంజగుట్ట వచ్చేసింది.

ఆమె పోలీస్ స్టేషన్ దగ్గర ఆపి "ఇక దిగుతారా స్వామీ!" అంది నవ్వుతూ.

హేమంత్ దిగి షేక్ హాండ్ ఇచ్చేందుకు చెయ్యి చాపాడు.

ఆమె అతని చేతిని షేక్ చేసి "బై హేమ్! సీయూ!" అంటూ సర్రున ముందుకి సాగిపోయింది.

ఆ స్పర్శ గుండెలోకి పాకుతుంటే ఎవరెస్టు శిఖరమెక్కినంత ఆనందంగా రూమువైపు సాగిపోయాడు హేమంత్.

అతనెవరో నిజంగా స్వామీజీయో, బ్రతుకు తెరువుకి స్వామీజీ అయ్యాడో తెలియదు కాని మంచి మాటలే చెబుతున్నాడు. అన్నీ జీవిత సత్యాలే! తెలిసినవే! చెప్పే విధానంలో ఒక రకమైన ఆకర్షణ ఉంది. కంఠస్వరంలో గాంభీర్యంతో పాటు లాలిత్యం ఉంది. అతని కళ్ళలో ఆకర్షణ ఉంది.

గుడి అంతా కిటకిటలాడుతోంది.

అందరూ తన్మయత్వంగా వింటున్నారు.

కొందరికి కళ్ళు మూతలు పడిపోతున్నాయి.

కొందరు పారశ్యంగా ఊగుతున్నారు.

కొందరికి తమ కష్టాలు గుర్తొచ్చాయేమో .. బొట బొటా కన్నీరు కారుస్తున్నారు.

ఇతనిలో ఇంత ఆకర్షణ ఉండబట్టే .. ఈ జనం ఇలా మూగేరా?

లేక ప్రతివారికి లోలోపల ఏదో వెలితి.. ఆరాటం ఉన్నాయా?

లేదా.. ఇంకా పైలోకాల్లో కూడా సుఖపడాలన్న దురాశా?

సరోజని అతని మాటలు వింటూనే చుట్టూ పరికించి చూసింది.

సుబ్బారావు!

అక్కడే గుడి చప్టా మీద కూర్చుని తనవైపే చూస్తున్నాడు.. వంకరగా.

సరోజనికి గొంగళి పురుగు మీద పాకినట్లయింది.

వళ్ళంతా అసహ్యంతో చీదరించింది.

"ఇక వెళ్దామే!" అంది రామలక్ష్మితో లేచి నిలబడుతూ.

"అదేంటే, సావులోరు బాగా చెబుతున్నారుకదా! ఆరతిచ్చేవరకూ ఉందాం. మజ్జెలో లేస్తే ఏవన్నా అనుకుంటాడేమో!" అంది రామలక్ష్మి సరోజనీని సముదాయించే ప్రయత్నం చేస్తూ.

"ఆఁ అనుకుంటాడు. నువ్వు తీసుకున్న అప్పులు తిరిగివ్వటంలేదని.. రౌరవాది నరకాలకి పోతావని అందరిలో చెప్పి పరువుతీస్తాడు. లే! లే!" అంది విసుగ్గా.

"ఆ దెబ్బకి రామలక్ష్మి దిగ్గున లేచి సరోజనిని అనుసరించింది.

"ఏంటక్కా, వంట్లోకాని బాగోలేదా?" అంది గాభరాగా.

"వంట్లో బానే ఉందే! నాకే ఏంటో అంతా ఏషగాళ్ళలా కనపడ్డారు. మాయదారి మాటలు నాలుగు చెప్పి కోట్లు గడిస్తున్నారు ఈళ్ళు. ఆ ముందు వరసలో చూశావా, కొంపలార్పి సంపాదించిన ఎదవలే కుర్చీల్లో కూర్చుని నీలుగుతున్నారు. మనకేం తెలీదని ఇనాలే, ఈ మాటలు!" అంది విసుగ్గా సరోజని.

"తెలుసుకో! కాని.. ఏవో పొరపాట్లు చేస్తానే ఉంటాం కదా!" అంటూ నసిగింది రామలక్ష్మి. సరోజని రామలక్ష్మి వైపు సాలోచనగా చూసి "అటు చూడు!" అంది.

రామలక్ష్మి సరోజని చూపించిన వైపు చూసింది.

రోడ్డు వైపునున్న కుప్పతొట్టిలో చేతులు పెట్టి కలయ తిప్పి అందులోంచి ఏదో తీసుకుని తింటున్నాడొక ముష్టతను.

"ఛీ! ఛీ ఛీ!" అంది రామలక్ష్మి ఏవగింపుగా.

అతనా చెత్తను కదిలించడం వలన అక్కడంతా దుర్వాసనతో నిండిపోయింది.

"దరిద్రం ఎలా తింటున్నాడో.." అంది ముక్కుమూసుకుంటూ.

"నువ్వూ తింటావ్.. ఏవీ దొరక్కపోతే!" అంది సరోజని నవ్వుతూ.

"నేనా..?"

"నువ్వేకాదు.. నేను కూడ! ఆకలి అంత పని చేయిస్తుంది. అతనిక్కూడా సుభ్భంగా మంచివే తినాలని ఉండదా? దరిద్రం, ఆకలి చాలా భయంకరమైనవి. గట్టున కూర్చున్నవాడికి సుడిగుండంలో పడ్డవాడి బాధలు తెలీవే. నీతులకేం, గట్టెక్కి నేనూ చెబుతా. ఇంత కుంకుం బొట్టెట్టుకుని కళ్ళు మూసుకుని ఊగిపోతూ చెబితే రేపొ గుడికి మానేసి లెంపలేసుకుంటా మీరందరూ నా దగ్గరే చతికిలబడతారు" అంది సరోజని.

రామలక్ష్మి అటెగళ్ళగానే సరోజని తాళం తీసి శూన్యంగా బావురుమంటున్న ఇల్లు భయపెట్టినట్లుగా కనిపించింది.

మొదటిసారిగా సరోజని అదోలా వణికింది.

దిగులుగా భర్త ఫోటోవైపు చూసింది.

"నువెళ్తే ఎల్లావుగాని ధైర్యాన్ని తీసుకుపోకయ్యా! అందరికీ లోకువయిపోతాను!" అనుకుంది బాధగా.

మొదటిసారిగా సరోజని కళ్ళలో నీళ్ళూరేయి... భయంతోనో...బాధతోనో.

ఇంకా స్టాఫ్ ఎవరూ రాలేదు.

హేమంత్ ఏదో ఫైలు రిఫర్ చేస్తున్నాడేగాని.. అతని ఆలోచనల నిండా వరూధినే ఉంది.

ఎంత చక్కని నవ్వు, ఎంతగా మెరిసే కళ్ళు.

ఆ స్పర్శ.

జన్మజన్మలకి మరచిపోగలడా!

ఎంత చలాకీతనం.

ఎంత నిర్భయం.

ఏదో మంచి వాసన.. ఆమె దగ్గర.

గతరాత్రంతా అతను తన చేతిని ముద్దుపెట్టుకుంటూనే ఉన్నాడు.

ఎందుకీ అమ్మాయి మొదటి చూపులోనే మనసుని లాగేసింది.

ఇదేనా ప్రేమంటే.

హేమంత్‌కి బాహ్య స్మృతి లేనేలేదు.

కళ్ళనిండా ... మనసు నిండా.. ఆమే! ఆమే.

"సారూ!"

...

"సారూ!"

ఒక్కసారి ఉలిక్కిపడ్డాడు హేమంత్.

"సార్ పలకరులే! ఆయన లోకం మారిపోయింది" హేమంత్ చురుక్కుమన్నట్లుగా చూశాడటువైపు.

ఎదురుగా నవ్వుతూ పద్మ నాగమల్లిపూవు పట్టుకుని.

ఆమెని చూడగానే పాతాళంలో పడిపోయిన ఫీలింగ్.

మరోవైపు యాదయ్య!

"ఏంటి?" అన్నాడు.

"ఏం లేదుసార్! మన సారింకా రాలే!" అన్నాడు యాదయ్య నసుగుతూ.

"ఊ!" అన్నాడు పరధ్యానంగా.

"ఇంకా మోస్తాడు. బిచానా ఎత్తేసాడుగా!" అంది పద్మ వంకరగా నవ్వుతూ.

"అంటే..?" అనడిగింది ప్రియ.

"యాదయ్యనే అడుగు" అంది పద్మ.

"మరే సార్. సారు ఊరెళ్ళలేదు. ఇకణ్ణే ఓ హొటేలు గదిలో ఉండాడు. మేడం సారు సామాన్లిసిరి కొట్టింది. గెటౌవుటన్నది. నేనే అన్నీ ఏర్కొచ్చినా. ఎవరికి ఈ సంగతెరక బట్టదని సెప్పిండు"

హేమంత్ యాదయ్యని దగ్గరగా రమ్మని పిలిచేడు.

"ఎవరికీ చెప్పొద్దన్నారా?"

"అవునుసార్!"

"ఎంతిచ్చేరు?"

యాదయ్య నీళ్ళు నవులుతున్నట్లుగా చూసి "ఏక్ సౌ" అన్నాడు.

"మరి నువ్వేం చేస్తున్నావ్?"

యాదయ్య నిర్ఘాంతపోయినట్లుగా చూశాడు. అందరూ కొంచెం ఖంగు తిన్నట్లయ్యారు.

"నిన్ను సార్ నమ్మేరు. పైగా డబ్బులు తీసుకున్నావ్. ఇలా అందరికీ చెప్పడం వలన నీకేమొచ్చింది. అంత మాత్రం నమ్మకంగా ఉండలేవా?"

"అదికాదు సార్..." అని యాదయ్య ఏదో చెప్పేలోపునే `ఇలాంటివి దాగుతాయా?` అంది పద్మ వెటకారంగా.

"మీరు ఆఫీసుకెందుకొస్తున్నారు?"

హేమంత్ పద్మవైపు తిరిగి అడిగాడు.

ఊహించని అతని ప్రశ్నకి తెల్లబోయింది పద్మ.

"మీరు ఏ రోజూ ఆఫీసు టైంకిరారు. వచ్చాక అరగంట పూలు పంచడంతో సరిపోతుంది. ఆ తర్వాత లంచ్ రూంలో కబుర్లు, ఆ పైన కాంటిన్‌లో పచారాలు, మీ ఫైల్స్ ఇతర్లు డీల్ చేయాలి, ... మళ్ళీ అరగంట లంచ్ టైంని రెండుగంటలుగా వాడుకుని అరగంట ముందే వెళ్ళిపోతారు. మీకెందుకండి, ఇతరుల సంగతులు?"

హేమంత్ మాటలకి పద్మ తెల్లబోయింది.

ఆ పైన బొటబొటా కన్నీళ్ళు కార్చింది.

"నిన్నగాక మొన్న జాయినయ్యారు. మీకంటే.. సీనియర్ని నన్నంటారా?" అని వెక్కిళ్ళు పెట్టింది.

ముక్కు చీది కొంగుకి తుడుచుకుంది.

ఆ పైన ఆడవాళ్ళకి చెప్పి ధర్నా చేయించడానికి లంచ్ రూం వైపు పరిగెత్తింది.

హేమంత్ కూడ ఒక రకమైన దిగ్భ్రమకి గురయ్యాడు. తనలా అనకుండా ఉండాల్సిందేమో!

"అయ్యా, కొంప కూల్చేసావు. ఆవిడ సామాన్యురాలు కాదు. ఆడవాళ్ళలో రెండు రకాలు ఉంటారు. ఆత్మాభిమానం కోసం ఎంతటి గరళాన్నయినా మింగేవాళ్ళు, తమ ఆటసాగలేదంటే.. ఎలాంటి అభియోగాన్నయినా మోపి రోడ్డుకెక్కేవాళ్ళు. .. ఎందుకయ్యా హేమంత్. ఇప్పుడు ఆఫీసు పీకి రోడ్డున పోస్తుంది కదా!" అన్నాడు ముకుందం వాపోతూ.

సరిగ్గా అప్పుడే రమేష్ బాబు సెక్షన్‌లో ప్రవేశించాడు. అతని వెనుకే పద్మ... రాగాలు తీస్తూ! అతని చాంబర్‌లో కెళ్ళింది.

అరగంట తర్వాత రమేష్ బాబునుండి హేమంత్‌కి పిలుపొచ్చింది.

హేమంత్ లోనికెళ్తుంటే స్టాఫంతా ఉరికంబం ఎక్కే ఖైదీని చూసినట్లు జాలిగా చూశారతని వైపు.

హేమంత్ అదేం పట్టనట్లుగా లోనికెళ్ళాడు.

కాస్సేపు పద్మరాగాలు, అరుపులు, రమేష్‌బాబు సముదాయింపులూ వినిపిచాయి.

"నేను.. కంప్లయింట్ చేస్తాను డి.సి.ఇ గారికి" అంది పద్మ ముక్కుపుటాలెగరేసి.

"నా మాట వినేది లేదా! చెయ్యి, నువ్వెంత పని చేస్తావో ఆయన నోటీసుకి వెళ్తుంది. తీసుకెళ్ళి ఏ గోడౌన్ సెక్షన్‌లోనో పడేస్తాడు. సిమెంటు బస్తాలు, ఇసుక బస్తాలు లెక్కెట్టుకుంటూ కూర్చోవచ్చు!" అన్నాడు రమేష్ బాబు కోపంగా.

ఆ మాటకి పద్మ నోరు ఠక్కున మూత పడింది.

"నువ్వెళ్ళి సీట్లో కూర్చో" అన్నాడు రమేష్‌బాబు పద్మని.

"ఇతనికి కనీసం మెమో అన్నా ఇవ్వండి" అంటూ విసవిసా వెళ్ళింది పద్మ కుర్చీనొక తన్ను తన్నుతూ.

ఆమె వెళ్ళగానే "ఎందుకు హేమంత్ అంత రేష్‌గా మాట్లాడటం. ఏదో లేడీస్" అన్నాడు రమేష్ బాబు కొంచెం అసహనంగా.

హేమంత్ నిర్ఘాంతపోయాడు. అసలు గొడవ వచ్చిందే రమేష్‌బాబుని చులకనగా మాట్లాడినందుకని చెప్పలేకపోయాడు.

"సరే! అయిందేదో అయింది. వదిలేయ్. సాయంత్రం నీతో కొంచెం పనుంది. వెళ్ళిపోకు" అన్నాడు.

హేమంత్ తల పంకించి సీట్లో కెళ్ళాడు.

మనసంతా చాలా చికాగ్గా అయిపోయింది.

కాని... అప్పుడే. అతనికొక దేవత ప్రత్యక్షమైంది ఎదురుగా!

ఆశ్చర్యపోతూ చూశాడు హేమంత్.

ఎదురుగా వరూధిని.!!

**వరూధినిని చూసి** అందరూ నోళ్ళు తెల్లబెట్టినంత పనిచేసారు.

హేమంత్ కూడ కొంచెం కంగారు పడ్డాడు.

అందరివైపు క్రీగంట చూసి చిన్నగా నవ్వి "కూర్చోండి" అని కుర్చీ చూపించాడు.

"కూర్చోవడం కాదు. కొంచెం మీ హెల్ప్ కావాలి. బయటకి రాగలరా?" అనడిగింది వరూధిని.

"ఇప్పుడా?" టైం చూసుకుంటూ నసిగాడు హేమంత్.

"ఇప్పుడే హాఫ్ డే లీవ్ అప్లయ్ చేయండి"

"కాని.. బాస్ సాయంత్రం ఏదో మాట్లాడాలని ఉండమన్నారు" అన్నాడు హేమంత్.

"ఎవరూ ఆ రమేష్ బాబా?"

"ఇంతకీ మీరొస్తారా లేదా! మా మదర్‌కి బాగోలేదు. కొంచెం హాస్పిటల్లో ఎడ్మిట్ చేయడానికి సహాయపడతారని అడిగాను" ఆమె కంఠస్వరంలో నిష్ఠూరం ధ్వనిస్తోంది.

"వస్తానుండండి." హేమంత్ లేచి లీవ్ లెటర్ రాసి రమేష్ బాబు రూమ్‌లోకి వెళ్ళాడు.

కాస్సేపటిలో తిరిగొచ్చి "పదండి" అన్నాడు.

ఇద్దరూ కలిసి వెళ్తుంటే అందరి కళ్ళూ తమ మీదే ఉన్నాయని అతనికి తెలుసు.

అంతే జరిగింది!

అసలే అగ్గిమీద గుగ్గిలంలా ఉన్న పద్మ గుండెలు బాదుకున్నంత పని చేసింది.

"చూశారా అతని తెగింపు! ఆ పిల్ల బాస్‌ని ఇష్టం వచ్చినట్లు తిట్టేళ్ళిన పిల్ల కదూ! ఈవిడతో ఎప్పుడు ఫ్రెండ్‌షిప్ చేసాడు ఇటు బాస్‌కి సర్ది చెప్పినట్లు చెప్పి అటు సినిమాకూరేగుతున్నారు" అంది కోపంగా.

"సినిమాకని మీకెలా తెలుసు?" ప్రియ ప్రశ్నించింది.

"ఈ టైములో ఇంకెక్కడికి తగలడతారు?"

"ఎక్కడికో చోటకి. మొత్తానికి మన హేమంత్ టేస్ట్ మంచిదే పిల్ల కత్తిలా ఉంది." అన్నాడు ముకుందం పద్మని రెచ్చగొట్టే ఉద్దేశ్యంతో వంకరగా నవ్వుతూ.

"ఆ కత్తిలాగా ఉంటుంది, కొడవల్లాగా ఉంటుంది. ఇప్పుడు దొరికాడు హేమంత్ నా చేతికి" అంటూ రివ్వున రమేష్‌బాబు రూమ్‌లోకి జొరబడింది సుడిగాలిలా.

"ఏంటీ, నువ్వింకా గొడవ వదలవా పద్మా! ఏదో కొత్తగా సర్వీసులో కొచ్చాడు. చిన్నతనం. వదిలేయ్!" అన్నాడు రమేష్‌బాబు కొంచెం విసుగ్గా.

"ఆఁ! ఆఁ! నేను వదిలేసాను. ఇక పట్టుకోవాల్సింది మీరే! మీ ప్రియమైన శిష్యుడిప్పుడెక్కడికి వెళ్ళాడు?" అనడిగింది ఎదురుగా కుర్చీ లాక్కుని కూర్చుంటూ.

"ఎవరో వాళ్ళ ఊరి వాళ్ళొచ్చారట కదా?"

"అవునా?" పద్మ అమాయకంగా అడిగింది.

"అవును."

"మీ ఫామిలీ ఊరెళ్ళిందా?"

"ఊ" అనుమానంగా చూస్తూ తలపంకించాడు రమేష్‌బాబు.

"మరి లాడ్జిలో ఎందుకున్నారు?"

పద్మ ప్రశ్నకి తెల్లబోయి చూశాడు రమేష్‌బాబు.

"ఈ కథంతా హరి కథలా చెప్పించుకున్నాడు మీ హేమంత్. తనొక్కడే వింటే ఫర్వాలేదు. ఆఫీసందరికీ వినోద కార్యక్రమం ఏర్పాటు చేసాడు. ఆ..రోజు.. అందరూ ఒకటే నవ్వులు!"

పద్మ మాటలు విని రమేష్‌బాబు మొహం ఎర్రబడి పోతుంది.

"మీ ఆవిడ సామాన్లు విసిరేసిందట. పొమ్మందట"

"ఎవరూ.. యాదయ్య చెప్పాడా?" కోపంగా యాదయ్యని పిలవబోయాడు రమేష్ బాబు.

"ష్" అతని చేతిని పట్టుకుని వారించింది పద్మ.

"మీరిప్పుడు వాణ్ణి ఏవడిగినా ఇంకా అల్లరవుతారేగానీ ప్రయోజనముండదు. తెలియాల్సింది తెల్సే పోయింది."

రమేష్‌బాబు మొహం పాలిపోవడం క్రీగంట గమనిస్తూనే ఉంది పద్మ.

అదే ఆమెకి కావాల్సింది కూడ.

"మీరు యాదయ్యనేం అడక్కండి. ఈ క్లాసు ఫోరోళ్ళు.. ఇంకా అల్లరి చేస్తారు. సరే. హేమంత్ ఎవరితో వెళ్ళాడో తెలుసా?"

"ఎవరితో?"

"ఆ రోజు మిమ్మల్ని ఆఫీసులో ఉతికి పారేసిందే దానితో"

రమేష్ గుండె మండిపోయింది.

"నువ్వు సరిగ్గా చూశావా?"

"శుభ్రంగా రెండు కళ్ళతోను.. చూశాను. ఇది అదే! మిమ్మల్ని తన్నినంత పనిచేసిన హీరోయినే!"

"ఇంపాజిబుల్! హేమంత్‌కి ఆ అమ్మాయి తెలియదసలు!" అన్నాడు రమేష్ పద్మ మాటలు కొట్టిపడేస్తూ.

"మీరలా చెవిలో పూలు పెట్టుకుని మాట్లాడితే నేనేం చెప్పలేను. కావాలంటే స్టాఫ్‌ని ఇంకెవర్నన్నా పిలిచి అడగండి."

"చెవుల్లో పూలుపెట్టడం నీ బిజినెస్. ఇంతకీ ఆ పిల్ల మళ్ళీ ఎందుకొచ్చినట్లు? అసలా హేమంత్‌కి ఈ పిల్లని పరిచయమెలా అయ్యింది?" నొసలు చిట్లిస్తూ అడిగాడు రమేష్‌బాబు.

"ఆరోజు సముదాయిస్తున్నట్లు చంకనేసుకుని కూడా వెళ్ళాడు కదా! బయట ఎన్ని బలాదూర్లు కొడుతున్నారో మీకు తెలుసా?"

రమేష్ బాబు వంట్లో రక్తం సలసలా మరిగిందా మాటలకి.

"పద్మా, నువ్వెక్కువ ఊహిస్తున్నావేమో! అసలొక క్షణం చూశావా పిల్లని నువ్వు! అసలా అమ్మాయి వరూధినయి ఉండదు"

"వరూధినో, మేనకో.. పేరు నాకు తెలియదు. కానీ ఈ పిల్ల.. ఆ పిల్లే!" అంటూ కుర్చీని తన్నినంత పనిచేసి అంత వేగంగాను వెళ్ళిపోయింది పద్మ.

రమేష్ జుట్టు పీక్కున్నంత పనిచేసాడు.

బి.పి.పెరిగిపోయింది.

"ఈ పద్మంతా ట్రాష్ మోసుకొస్తుంది. వరూధిని హేమంత్‌కి అసలు తెలిసే అవకాశమే లేదు" అని మనసుని సరిపెట్టుకోవాలని చాలా ప్రయత్నించాడు. కాని... ఎక్కడో ఏ మూలో సందేహంగానూ ఉంది.

ఆ న్యూస్ నిజమేమోనన్న ఉక్రోషమూ ఉంది.

కళ్ళు బైర్లుగమ్మి ఎదురుగా చూస్తున్న ఫైల్లో అక్షరాలు అలుక్కుపోయినట్లుగా కనిపిస్తున్నాయి.

అప్పుడే ఇంటర్‌కమ్ మోగింది.

రిసీవర్ అందుకున్నాడు భయంగా.

"మీటింగ్ టైమయింది. వైజాగ్ ఎస్.ఇ, పార్వతీపురం ఇ.ఇ వచ్చి సి.ఇ గారి దగ్గరున్నారు. ఫైలు తీసుకుని రండి" సి.ఇ పి. ఏ హెచ్చరించేడు.

రమేష్ ఆదరాబాదరా ఫైలుని మూటలా కట్టి పరిగెత్తినట్లు వెళ్ళాడు.

వెళ్తున్న అతన్ని తేరిపార జూశారు స్టాఫ్.

"ఈ రోజు పార్వతీపురం డివిజన్ వర్క్స మీద కాన్ఫరెన్సుంది.. గురుడు వణుక్కుంటూ వెళ్తున్నాడు. హేమంత్ కూడ సహాయం లేడు. ఈరోజు రమేష్ బాబుకి కల్యాణమే!" అన్నాడు ముకుందం వెటకారంగా.

"కావాల్సిందే, లేకపోతే ముందొచ్చిన చెవులకన్నా.. ఆ హేమంతంటే ఎంత మోజో!" అంది కసిగా పద్మ.

"ఇంతకీ ఇందాకొచ్చిన అమ్మాయి గురించి ఈయనకూదేసేవా? ముకుందం నవ్వుతూ అడిగాడు.

"చెప్పక! ఊరుకుంటానా?"

"ఎందుకమ్మా, రమేష్‌బాబు మీద అంత కక్ష! అసలే కాన్ఫరెన్సుంది. ఇతనికా ఆ ఫార్మేషన్ రోడ్డు డీటెయిల్స్ తెలియవు. ఈ టైములో ఆ మాట చెబితే అతను బి.పి.తో ఛీఛీంజనీరుగారి ముందు పడితే.. ఈ ఆడాళ్ళకి తొందరెక్కువ!"

"ఏంటండీ ఆడవాళ్ళంటున్నారు?" అన్నారు లేడీ స్టాఫ్ కోరస్‌గా ముకుందం మీదకి దండెత్తే ప్రయత్నం చేసారు.

"అమ్మమ్మా, ఆగండాగండి. ఆడవాళ్ళు తొందరగా ఎమోషనలవుతారని అన్నాను"

"అందరాడాళ్ళని ఒక తాటితో కట్టకండి" అంది ప్రియ చిరాగ్గా పద్మవైపు చూస్తూ.

"ఇది మరో ప్రపంచ యుద్ధంగా తయారు చెయ్యడం నాకిష్టంలేదు" అన్నాడు ముకుందం స్త్రీలని శాంతపరిచే ఉద్దేశ్యంతో వందరుపాయల కాగితం యాదయ్యకిచ్చి కాఫీ, ఏవైనా స్నాక్స్ తెమ్మని పురమాయిస్తూ.

"ఇంతకీ ఆ పార్వతీపురం వర్క్స్ అంత టిపికలా సార్?"

"నేను కొన్నాళ్ళు వైజాగ్ సర్కిలాఫీసులో పనిచేసేనమ్మా. చాలా టిపికల్. అంతా ఫస్ట్‌క్లాస్ ఏజెన్సీ. కారడవి. ట్రైబల్స్ అడ్డదారుల్లో నడిచిపోతుంటారు. ఆ అడవిలో ఎలైన్ మెంటు వేసి ఆ పల్లెల్ని కలుపుకుంటూ రోడ్లు వేయడమంటే.. ఆ సర్వే.. ఎస్టిమేట్స్ తయారు చేయడం.. వర్క్స్ చేయించడం.. ఎప్పుడూ మలేరియా వస్తుంటుంది. అసలా నామిన్‌క్లేచర్సే కన్‌ఫ్యూజ్‌గా ఉంటాయి"

"బాప్‌రే! ముందే చెప్పారు. నేను ఛస్తే ఎప్పుడూ అటుసైడ్ వెళ్ళను." అంది ప్రియ భయంగా.

"హెడ్డాఫీసులో పనిచేసినోళ్ళు.. అక్కడ అరగంట కూడా పని చేయలేరు" అన్నాడు ముకుందం.

అందరూ యాదయ్య తెచ్చిన స్నాక్స్ తింటూ టీ తాగుతుంటే "ఇంతకీ ఏ సినిమా కెళ్ళుంటారో మన హేమంత్ ఆ అమ్మాయినీ!" అన్నాడు పద్మని ఏడిపించే ఉద్దేశ్యంతో ముకుందం ఓరగా చూస్తూ.

"సింగినాదం - జీలకర్ర" అంది పద్మ కోపంగా.

"అరే! ఈ పేరుతో కూడా సినిమా వచ్చిందా?" ఆశ్చర్యం ప్రకటించాడు ముకుందం.

"సార్! మీరు నాకు కోపం తెప్పిస్తున్నారు. వస్తా!" అంటూ పద్మ పర్సు తగిలించుకుని వెళ్ళిపోయింది.

"అమ్మా! ఇంకా టైముంది తల్లీ! అప్పుడే వెళ్ళిపోతున్నావా?" అన్నాడు ముకుందం.

పద్మ అతని మాటలు వినిపించుకోలేదు.

"సర్లే వెళ్ళులే తల్లీ! ఎప్పుడు మాత్రం పూర్తిగా ఆఫీసవర్స్ పనిచేసావ్!" అని సణుక్కున్నాడు ముకుందం.

"ఇటెక్కడికి? ఏ హాస్పిటల్?" అనడిగాడు ఆమె స్కూటీ రయ్యమని ఏబిడ్స్ వైపు తీసుకెళ్తుండగా హేమంత్ "మీకు సిటీ అంతా తెలుసా?"

"తెలీదనుకోండి"

"మరందుకే!" అంది వరూధిని నవ్వుతూ.

"నోర్మూసుకుని కూర్చోమంటారా?"

"అంత అమర్యాదగా మాట్లాడనులెండి"

"థాంక్స్! ఇంతకీ అమ్మగారి కేవయింది!"

"నాకేం తెలుసు! డాక్టర్లు చెప్పాలి!"

"ఇంతకీ ఆవిడేరి?"

"మా కజిన్ ఆల్‌రెడీ హాస్పిటల్‌కి తీసుకొచ్చింది. నేను ఆఫీసునుండి వస్తున్నా! కాస్తతోడుంటారని.. ఎంతయినా ఆడపిల్లని కదా..నేను!" అంది కొంచెం దిగులుగా వరూధిని.

ఇంకోసారయితే ఏవయినా జోక్ చేసేవాడే కాని సందర్భం అలాంటిది కాదేమో మౌనం పాటించాడు హేమంత్.

సర్రున స్కూటీని జుమ్రూద్ థియేటర్‌లో పార్కుచేసింది వరూధిని.

"ఇదేవిటిక్కడ!"

"ష్! రండి" వరూధిని వేగంగా ముందుకి నడిచింది.

అప్పుడప్పుడే నగరం నాగరికత పేరుతో బలవంతంగా కూలడం ప్రారంభించింది. విశాలమయిన తోటలతో అందంగా ఉన్న బంగళాలన్నీ నిలువునా కూల్చబడి ఎపార్టుమెంట్లవుతున్న తరుణం!

అలా ఈ సినిమాహాలు రూపాంతరం చెందిందేమోనని ఆమె వెంట నడిచాడు హేమంత్.

ఆమె ఎంట్రన్స్ వైపు వెళ్తుంటే ఆశ్చర్యంగా చూసి "సినిమాకా?" అన్నాడు తెల్లబోతూ.

ఆమె వెనుతిరిగి నవ్వింది.

"అవును"

"మరలా.. మీ అమ్మగారికి బాగోలేదని.." సంశయంగా అడిగాడు.

"లేకపోతే సినిమాకంటే మీరొస్తారా?"

"కాని.. మరీ అంత అబద్ధమా?"

"ఫర్వాలేదులెండి. మా అమ్మగారు అనారోగ్యం మనిషే! ఎప్పుడూ హాస్పిటల్ స్టాఫ్‌ని పరామర్శించి వస్తుంది" అంటూ హాల్లోకి నడిచింది వరూధిని.

హాలు చాలావరకు ఖాళీగానే ఉంది.

ఇద్దరూ సీట్సులో కూర్చున్నాక అడిగాడు హేమంత్ "ఏం సినిమా?" అని.

"ఓ కౌన్ థీ!"

"చాల పాతది!"

అందుకే చూడటం.

"బ్లాకండ్ వైట్!" నిట్టూర్చేడు హేమంత్.

"అన్నీ మైనస్‌లు కాదు చెప్పడం. పాటలు బ్రహ్మాండంగా ఉంటాయి. సాధన, మనోజ్‌లు ఎంతో అందంగా ఉంటారు. నాకు చాలా ఇష్టం నా ఫ్రెండు, నేను వెళ్ళాలని అనుకున్నాం. తనకి సడెన్‌గా ఏదో పని తగిలింది. వదిలేయడం నాకిష్టం లేదు. నాతోరావడానికి ఎవరైనా బకరా దొరుకుతారా! అని ఆలోచించాను. మీరు తగిలారు. ఒక్కర్తినీ సినిమా ఎంజాయ్ చేయలేను" అంది వరూధిని నవ్వుతూ.

"నేను బకరాని!" హేమంత్ నిష్ఠూరంగా అన్నాడు.

"జస్ట్ ఫరే జోక్!" అంటూ నవ్వింది.

సినిమా మొదలయింది.

హేమంత్ ఏదో అనబోయేంతలో "మీరిదివరకు చూశారా!"

అనడిగింది వరూధిని.

"లేదు."

"అయితే బాగా ఎంజాయ్ చేస్తారు. మంచి సస్పెన్స్. చూడండి" అంది.

హేమంత్ సినిమా చూస్తున్నాడేగాని.. వరూధిని వ్యక్తిత్వం గురించి ఆలోచిస్తున్నాడు.

ఈమె చొరవలో అంతరార్థం ఏవిటి? తనెప్పటి నుండో తెలిసినట్లుగా అంత చనువుగా ఎలా ప్రవర్తించగల్గుతుంది! ఎంతకీ అంతుపట్టడం లేదు ఆమె కేరక్టర్.

అలా.. అని ఆమెని తక్కువగా అంచనా వేయడానికి మనసంగీకరించడంలేదు.

కాసేపటికి ఆమె చెప్పినట్లుగానే సినిమాలో లీనమయిపోయాడు హేమంత్.

ఆ మర్నాడు ఆఫీసుకి వచ్చేసరికి వాతావరణమంతా తేడాగా ఉంది. అందరూ అతన్నొక అపరాధిలా చాలా ఘోరాలు చేసి వచ్చినవాడిలా చూస్తున్నారు.

చాలా చిరాగ్గా ఉందా వాతావరణం.

'చెప్పుడు మాటలు వినరాదు' అని అందరూ గొప్పగా స్లోగన్స్ చెప్పి ముందు చెప్పుడు మాటలతోనే తమ ఉషోదయాన్ని మొదలుపెడతారు.

ఎంత లెక్కపెట్టకూడదనుకున్నా వాళ్ళమధ్యనే బ్రతకాలి. మొదటిసారి చాలా టెన్స్‌గా ఫీలయ్యాడు హేమంత్.

"నిన్న సినిమాకెళ్ళాను సార్!" చాలాబాగుంది అని ఉపోద్ఘాతంగా మొదలెట్టింది పద్మ.

"ఎవరితోనమ్మా, మీ ఆయనతోనా?" అడిగాడు ముకుందం.

"లేకపోతే నాకేం బోయ్ ఫ్రెండ్సున్నారా వెళ్ళడానికి!" అంటూ సాగదీసింది పద్మ.

"అయ్యో! నేనంత మాటనలేదు తల్లీ! నువ్వెటో వెళ్ళిపోతున్నావు. వస్తా!" అంటూ సీట్లోంచి లేచెళ్ళిపోయాడు ముకుందం.

యాదయ్య వచ్చి 'సార్ రమ్మంటున్నాడు' అంటూ హేమంత్‌ని పిలిచాడు.

హేమంత్ రమేష్ ఛాంబర్స్‌లో కెళ్ళి విష్ చేసాడు.

"రా, కూర్చో" అన్నాడు రమేష్.

"నిన్నొచ్చినమ్మాయి ఎవరు?" ఉపోద్ఘాతం లేకుండా అడిగాడు రమేష్‌బాబు.

హేమంత్ రమేష్‌బాబు మొహంలోకి చూస్తూ "మీ చుట్టాలమ్మాయే, వరూధిని" అన్నాడు స్థిరమైన గొంతుతో.

తన ప్రశ్నకి తెగ తడబడిపోతాడని.. జవాబు చెప్పలేక తడుముకుంటాడని ఆశించాడు రమేష్‌బాబు. అందుకే హేమంత్ అంత ఖచ్చితంగా చెబుతుంటే నివ్వెరపోవడం అతనివంతయింది.

"నీకావిడ తెలుసా?"

"మీవల్లనే! ఆరోజు మాట్లాడేనుకదా సర్!"

"అయితే ఆ మాత్రానికి మళ్ళీ ఎందుకొచ్చింది? అదీ.. నీ దగ్గరకి!"

"వాళ్ళమ్మగారికి బాగోలేదు. హాస్పిటల్‌కి వెళ్ళాలని రిక్వెస్టు చేసింది."

"నిజంగానే బాగోలేదా?"

హేమంత్ మాట్లాడలేదు.

"ఓహో, నాకన్నా ఆవిడ దగ్గరదయిపోయిందా, అది చాలా కన్నింగ్. నేనయిపోయాను. నీ వెంట పడుతోంది. ఇప్పటికెంతమందో!"

"సరే!" కొంచెం కఠినంగానే అన్నాడు హేమంత్.

"కోపమొచ్చిందా?" వెటకారంగా అన్నాడు రమేష్. హేమంత్ నిజంగానే కోపం అణచుకున్నాడు.

"ఇతరుల గురించి, అదీ ఆడవాళ్ళ గురించి అంత నీచంగా మాట్లాడటం నేను ఇష్టపడను."

"అంటే నాకు సంస్కారం లేదంటావా?"

"నేనంత మాటలనను. ఇప్పుడేం జరిగిపోయిందని. ఏదో సహాయమడిగింది. వెళ్ళాను. దానికంత రాద్ధాంతం దేనికి! అదీ.. నా పర్సనల్!"

"రమేష్‌బాబు హేమంత్ జవాబుకి కొద్దిగా నిరుత్తరడయ్యేడు. నిన్న పార్వతీపురం ఫైలు విషయంలో రమేష్‌బాబుకి ఛీఫ్ ఇంజనీరు చేత అక్షింతలు పడ్డాయి. ఇప్పుడది అర్జెంటుగా హేమంత్ చేత డీల్ చేయించకపోతే తనకి సస్పెన్షన్స్ ఆర్డర్స్ వస్తాయి. అందుకే వెంటనే తగ్గిపోయాడు రమేష్‌బాబు.

"సర్లే జరిగిందేదో జరిగింది. నేను సాయంత్రం ఉండమంటే ఉండకుండా వెళ్ళిపోయాము నాక్కాస్త కోపం వచ్చింది. లెటిట్ బి. కాస్త ఈ ఫైల్లో క్వొరీలు చూసిపెట్టు. ఒక గంటలో మళ్ళీ పిలుపొస్తుంది" అన్నాడు ఫైలు హేమంత్ ముందుకి తోస్తూ.

హేమంత్ ఫైలు తీసుకుని విసురుగా చాంబర్స్‌లోంచి వచ్చేసి సీట్లో కూర్చున్నాడు తిరగేస్తూ.

ఏదో ఉపద్రవం జరిగిపోతుందనుకున్న స్టాఫ్ వాతావరనం అంత కూల్‌గా ఉండటాన్ని జీర్ణించుకోలేకపోయారు.

ముఖ్యంగా పద్మ!

ఇక దిక్కుతోచక గోళ్ళరంగు వేసుకుంటూ.. అదీ రెండుకాళ్ళు సీట్లో ఎత్తి కూర్చుని...'ఏవిటో మనాఫీసు పాడయిపోయింది సార్!' అంది ముకుందంతో.

"అదిప్పుడు తెలిసిందామ్మా?" అన్నాడు ముకుందం.

పద్మ కొన్ని విషయాల్లో చాలా తెలివైంది.

తను తన సంభాషణ పొడిగించాలని, అనవలసినవి అనాలనుకున్నప్పుడు అవతలి వారి మాటలు అర్థం కానట్లుగా నటిస్తుంది.

"మరీ బరితెగించేస్తున్నారు సార్. ఇదివరకెలా ఉండేది. అందరం అన్నాచెల్లెళ్ళలా, గౌరవంగా పనిచేసుకునేవాళ్ళం."

హేమంత్ కాన్సెంట్రేషన్ అంతా దెబ్బతింటోంది.

"అవునమ్మా! రోజులు మారిపోయాయి కదా తల్లీ! ఎప్పుడూ ఒక్కలా ఉంటారా!"

"అయినా! అంత తెగించి ఆఫీసుల కొచ్చేసి మగాళ్ళని బండ్లమీద ఎక్కించేసుకుని.. ఛీ!ఛీ!ఛీ" అంది పద్మ. మిగతా వాళ్ళు పనిచేసుకుంటూనే ఆవిడ ప్రేలాపన వింటున్నారు.

ఏవన్నా అంటే బాస్ ఆవిడ గుప్పిట్లో ఉన్నాడు.

"ఆఫీసొదిలేసి సినిమాలు.. షికార్లు!"

హేమంత్ తన చేతిలోని పెన్ ఫైలు మీదకి విసిరేసి వేళ్ళు విరుచుకున్నాడు.

"అవును పద్మగారూ! మీరన్నది నిజమే! నిన్నవచ్చిన అమ్మాయి గురించే కదా.. మీరంటున్నది. నేను కూడా అదే అనుకున్నాను అయినా వెళ్ళాను. ఆడదానికి లేని బాధ నాకెందుకని. నిజవేనండి. ఆఫీసు వాతావరణాలు చెడిపోతూనే ఉన్నాయి. పనిరాక కొందరు, పనిలేక కొందరు... తమ అవసరాల కోసం దిగజారుతుంటే ఎవరు మాత్రం ఏం చేస్తాం చెప్పండి. ఆఫీసులో ఎలా కూర్చోవాలో ... ఎలా

నడవాలో ఎలా డ్రెసింగ్ చేసుకోవాలో గౌరవానికి, ప్రవర్తనకి ప్రాధాన్యత లేని రోజుల్లోకి మనం వచ్చేసాం. ముందు మీరు కాళ్ళు క్రిందపెడతారా?" అన్నాడు చాలా సౌమ్యంగా.

పద్మ షాక్ తిని చూసింది.

వెంటనే ఏమనడానికీ పాలుపోలేదు.

నిన్నటి రచ్చ మళ్ళీ ఈరోజు చేస్తే ఎవరూ సింపతీ చూపించరుకదా, హేమంత్‌నే వెనకేసుకొచ్చే ప్రమాదముంది.

అందుకే ఉక్రోషాన్ని చంపుకుని లంచ్ రూమువైపు నడిచింది అసహనంగా.

**సరోజిని ఆలోచిస్తూ** వంట చేస్తోంది.

నిజానికి వంటేం కాదు.

ఏదో ఆకలి ఆగనప్పుడు ఏదో ఇంత ఉడకేసుకుని తినడం. రుచీ పచీ అంటూ ఏమీ ఉండదు. మనసుకేదీ నచ్చదు.

బ్రతకాలని ఉండదు. చావురాదు.

ఈ దొంగసచ్చినోళ్ళంతా ఆత్మహత్య మహాపాపం అంటారు.

బ్రతికి ఉండి ఈ నరకం అనుభవించడం కన్నా పాపం మరొకటి ఉంటుందా!

అసలే ఇంట్లో ఉండెళ్ళిన దొంగ సచ్చినోణ్ణనాలి. ఎందుకంత అపురూపంగా తనని ప్రేమించడం.

తనకి మరో ప్రపంచం లేకుండా చేయడం.

ఇప్పుడేమో అర్ధాంతరంగా పోయాడు - తనని దిక్కులేనిదాన్ని చేసి.

అసలీ అతుక్కుపోవడాలేంటి. మధ్యలో వచ్చి మధ్యలో వెళ్ళిపోయే మాయదారి మొగుడికోసం తను చచ్చిపోయినట్లుగా బతకడం ఏంటి?

వెంటనే వెనక వీధిలో వెంకటలక్ష్మి గుర్తొచ్చింది.

వెంకటలక్ష్మి మొగుడు లక్ష్మీనారాయణ మున్సిపల్ ఆఫీసులో అటెండరు.

వెధవ! రోజూ తాగి అర్ధరాత్రి కొంప చేరి ఏదో కారణం పెట్టుకుని వెంకటలక్ష్మిని చితకబాదుతుండేవాడు. పిల్లలు ఒకటే గోలగా ఏడ్పులు.

పెరటి గోడమీద నుండి ఆ ఆక్రందనలు వినలేక చిన్న స్టూలు వేసుకుని లక్ష్మీనారాయణని ఎడాపెడా తిట్టేది తను.

"నా పెళ్ళాం నా ఇష్టం" అనేవాడు లక్ష్మీనారాయణ ముద్ద ముద్దగా.

తను భరించలేక ఒక రాయి తీసి సూటిగా వాడి మొహానికి తగిలేట్లు కొట్టింది. దెబ్బకి నెత్తికి చిల్లుపడి బొటబొటా రక్తం కారింది.

దెబ్బకి తాగిన మందు దిగి 'రక్తం, రక్తం' అంటూ పెడబొబ్బలు పెట్టేడు.

ఇంతసేపు పెట్టిన రాగాలు మాని "అయ్యో! అయ్యో! అలా కొడ్తారాండీ!" అంటూ చెంగు చింపి మొగుడికి కట్టుకట్టి పతివ్రతగా మారిపోయింది వెంకటలక్ష్మి.

"ఏంటమ్మా, అన్నీ నీకే కావాలి" అని కాస్త విసుక్కుని లక్ష్మీనారాయణని డాక్టరు దగ్గరకి తీసుకెళ్ళి కట్టు కట్టించుకొచ్చాడు కనకారావు.

ఆ మర్నాడు అసలు చోద్యం ప్రారంభమైంది.

అలవాటుగా వీధరుగెక్కి కూర్చుంది తను.

"ఏంటి సరోజనీ, రాత్రి లక్ష్మీనారాయణని రాయిచ్చుక్కొట్టేవంట!"

"అవును టైముకి గునపం దొరకలేదు. లేకపోతే అదే విసిరేద్దును వెధవ మీదికి. చచ్చేవాడు" అంది తను.

"అయ్యో! అయ్యో! మొగుడూ పెళ్ళాలన్నాక ఏదో కిందా మీదా పడతారు. తెల్లారి కలిసిపోతారు" అన్నాడు ఆచారి.

తనతనివైపు తేరిపార చూసి "కిందా మీదా పడటం కాదు - దాన్ని చావగొడుతున్నాడు. జీతమంతా తాగుడికి తగలేసి తిండిలేకుండా పెళ్ళాం పిల్లల్ని మాడుస్తున్నాడు. రోజూ ఆ భాగోతం వినలేక పోతున్నాం" అంది తను.

"అయినానూ! వాడి పెళ్ళాం .. వాడిష్టం. మనం మధ్యలో కెళ్ళకూడదు" అంది ఆచారి పెళ్ళాం అలివేలు చేతులు తిప్పి అభినయిస్తూ.

"ఓహో! ఆచారి రాత్రికి ఒకసారి ఈవిడ బుర్ర బద్దలు కొట్టు. నాకు చూడాలనుంది" అంది కొంగులో బఠాణీలు నోట్లో వేసుకుంటూ.

"అయ్యో! పదండి, ఈవిడతో.. మాట్లాడటం.." అంటూ చెంపలేసుకుంది అలివేలు.

"మెల్లిగా నడు. పడ్తావ్. ఆచారసలే అర్భకుడు. నిన్ను మోసుకెళ్ళలేడు పాపం!" అంటూ పకపకా నవ్వింది తను.

"ఏంటే, ఆవిడ నానా తిట్లు తిడుతూ వెళ్తోంది.. ఎందుకు నీకిదంతా?" అంటూ రంగ ప్రవేశం చేసింది రామలక్ష్మి.

"లేకపోతే.. వాడి పెళ్ళాం వాడిష్టమంట. అది మనిషి కాదా! వాడు తన్నడానికి.. ఇది ఏడ్వటానికి పుట్టేరా! ఏం మాట్లాడతారే జనం! పె..ద్ద ధర్మం కనుక్కున్నట్లు."

"ఏదో ... చిన్నప్పటి నుండి అలానేగా నూరిపోస్తారు మరి."

"ఆఁ! నూరిపోస్తారు.. మన బుర్రలేవయ్యేయి.. అన్నం పెట్టి ఆదరించడానిక్కాదు మొగుడు... తన్నడానికి.. చంపడానికి. పైగా వాడిష్టమట. చీపురు తీసి వాయించక."

ఆ సంవత్సరమే లంగ్స్ తినేసాయని పుటుక్కుమన్నాడు లక్ష్మీనారాయణ.

ఏదో నలుగురికోసం అన్నట్లు రాగాలు తీసి తాళి తెంపుకుంది వెంకటలక్ష్మి.

వెంట వెంటనే అటెండరు ఉద్యోగంతో పాటు పెన్షను.. గ్రాట్యుటీ గాడిదగుడ్డూ అంటూ వచ్చి వెంకటలక్ష్మి ఒళ్ళో పడ్డాయి.

మనిషి మూడు నెలల్లో మారిపోయి లావయి రంగు తేలింది. వంటిమీదకి మంచి చీరలు వచ్చిపడ్డాయి. భుజానికి పర్సు, కళ్ళల్లో మెరుపు, పిల్లలకి చదువులు.. అసలు వెంకటలక్ష్మి నిప్పుడెవరూ గుర్తుపట్టలేరు.

"బాగున్నావే వెంకటీ! నీ బాబొక మంచి పని చేసి చచ్చేడే! గవర్నమెంటు ఉద్యోగం చేసేవాడికిచ్చి కట్టబెట్టాడు. ఇప్పుడు చూడు. ఎంత ఒడ్డున పడ్డావో!" అంది తను.

వెంకటలక్ష్మి నవ్వి "అవునండి సరోజనీగారూ!" అంది.

అదంతా గుర్తు చేసుకుంటూ పప్పులుసుకి పోపు పెడుతుంటే.. వెనక నీడలా అనిపించి ఉలిక్కిపడి చూసింది సరోజని.

వెనక సుబ్బారావు.. పళ్ళికిలిస్తూ.

సరోజనికి నిలువెల్లా మండిపోయింది.

"ఇక్కడిదాకా ఎందుకొచ్చేవ్. ఏం పని?" అంది గట్టిగా.

"అరవకు సరోజనీ! పోపు వాసనకి గుమ్మెత్తి వచ్చాను" అన్నాడు సుబ్బారావు నిబ్బరంగా.

సరోజనికి వాడి బుద్ధి అర్థమైంది.

రాత్రి, గుడిలోనే వాడి చూపులు తేడాగా ఉన్నాయి.

"సరే, రుచి చూస్తావా?"

"చూపిస్తే చూడనా?" చొరవ తీసుకోవాలని ముందుకి జరిగేడు సుబ్బారావు.

అదే అదనుగా వేడి వేడి పప్పులుసు వాడి అరచెయ్యి లాగి గరిటెడు పోసింది సరోజని.

దెబ్బకి పెడబొబ్బలు పెట్టబోయి బాధని దిగమింగేడు సుబ్బారావు" చచ్చేను బాబోయ్" అని కీచుగా అరుస్తూ.

"ఏం పాపం! రుచి చూస్తానన్నావుగా?"

"మరీ మోటు సరసం! నీది సరోజని!" అని అక్కడే ఉన్న నీళ్ళలో చెయ్యి పెట్టబోయేడు సుబ్బారావు సిగ్గులేకుండా.

సరోజని గరిటె గట్టిగా ఊపుతూ "ముందు బయటకి నడు" అంది గద్దిస్తూ.

సుబ్బారావు గబగబా హాల్లోకి నడుస్తూనే "నా దగ్గర అప్పు తీసుకున్నావు గుర్తుందా?" అన్నాడు అక్కసుగా.

"ఊరికే ఇచ్చావా, ఇల్లు తాకట్టు పెట్టుకుని వడ్డీకి ఇచ్చావు. అంత మాత్రాన గజ్జికుక్కలా కొంపలో జొరబడతావా! నిన్ను రమ్మని పిలిచేనా నేను?" అంది సరోజని.

"సరే! చూస్తా!" అంటూ బయటకి నడిచేడు సుబ్బారావు.

వాడెళ్ళగానే చెప్పలేని ఏడుపొచ్చింది సరోజనికి - అదీ మొదటిసారి.

గోడకి జేరబడి కూలబడి వెక్కెక్కి ఏడ్చింది చాలాసేపు.

గోడకి వేలాడుతున్న కనకారావు వైపు చూసింది బేలగా.

"ఏంరా పోతూ పోతూ నా ధైర్యాన్ని కూడా తీసుకుపోయేవా..? నువ్వుండగా నా కాలిగోరుకూడా చూడ్డానికి ధైర్యం లేని ఈ కాగితాలేరుకునే కంపు వెధవ వంటగదిదాకా వచ్చేసాడు" అనుకుంది బాధగా.

"ఏంటే ఆ సుబ్బిగాడు పొద్దున్నే వచ్చిపోతున్నాడు" అంటూ గ్లాసు పట్టుకొనొచ్చింది రామలక్ష్మి.

"వాడూ.. నీలాగే... ఒక గ్లాసు కందిపప్పుందా.. అని వచ్చాడు" అంది సరోజని తేరుకుని మామూలుగా ఉండటానికి ప్రయత్నిస్తూ.

రామలక్ష్మి పకపకా నవ్వి "ఇచ్చేవా.. మరి?" అంది.

"ఇవ్వకపోతే ఎలా.. ఇచ్చే పంపేను. నీకేం కావాలో ఏడు" అంది.

"పంచదార" అంది రామలక్ష్మి కొంచెం సిగ్గుపడుతూ.

"నీ సిగ్గు చివిడినట్లే ఉంది. ఆ గ్లాసిటు తగలెట్టు" అంటూ ఊడిన జుట్టు ముడేసుకుని పైకి లేచింది సరోజని.

"ఈ నెల్లో ఇది మూడోసారి! ఫస్టుకంతా ఇచ్చేస్తా" నసుగుతున్నట్లుగా అంది రామలక్ష్మి.

పంచదార గ్లాసులో పోస్తూ "ఈ నెలకి మూడోదేలే. అంతకు ముందు నెలలు? నువ్విచ్చేది నేను పుచ్చుకునేదీ లేదు గాని పట్టుకెళ్ళు" అంది సరోజని.

రామలక్ష్మి గ్లాసందుకుని "అక్కా, వాణ్ణి ఇంటికి రానివ్వకు. బావున్నప్పుడయితే.. ఆ సంగతి వేరు!" అంది సలహా ఇస్తున్నట్లుగా.

సరోజనికి ఏదో అనాలని ఉన్నా ఏమీ అనలేక పోయింది.

"ఊ!" అంది నీరసంగా.

రామలక్ష్మి వెళ్తుంటే మళ్ళీ ఏదో దిగులావరించినట్లయింది సరోజనికి.

అలానే గోడకి జేరబడి కూర్చుంది శూన్యంలోకి చూస్తూ.

"హలో!"

బస్టాండ్‌లో నిలబడ్డ హేమంత్ గొంతు గుర్తుపట్టి పక్కకి చూశాడు. స్కూటీ ఆపి ఒక కాలుక్రింద పెట్టి చిలిపిగా చూస్తూన్న వరూధిన్ని చూసి అతని కళ్ళు మెరిసేయి.

కాపర్ సల్ఫేట్ కలర్ బాతిక్ ప్రింట్ చేసిన కాటన్ డ్రెస్సులో ఆమె చాలా ఆకర్షణీయంగా ఉంది.

"ఎక్కడికి?"

"హాస్పిటల్‌కే" చిలిపిగా నవ్వింది.

"ఈసారెవర్ని జాయిన్ చేస్తున్నారు?" వెటకారంగా అడిగేడు.

"మిమ్మల్నే!" పకపకా నవ్వింది వరూధిని.

"నాకేం బాగానే ఉన్నాను."

"అని మీరనుకుంటే ఎలా? "

"నేను రాను" బస్టాండులో తమ ఆఫీస్ స్టాఫ్ తమిద్దరి సంభాషణ వింటున్నారనే సందేహంతో మెల్లిగా అన్నాడు హేమంత్.

"మీరు రాకపోతే.. ఆ బట్టతల భానుమూర్తినెక్కించుకుంటాను" అంది వరూధిని మొండిగా.

అతనెవరో నిజంగానే సిన్సియర్‌గా ముందుకొచ్చి.. "నాకిస్తారా లిఫ్ట్?" అనడిగాడు.

వరూధిని అంతపనీ చేసేరకం అని కంగారు పడి వెంటనే స్కూటీ ఎక్కేసాడు.

వరూధిని పకపకా నవ్వి "బేడ్‌లక్ బాబాయ్‌గారూ! బెటర్‌లక్ నెక్స్ట్ టైమ్!" అంటూ స్కూటీ స్టార్ట్ చేసింది.

"మీకసలు భయమనేదే లేదా?" హేమంత్ ఆశ్చర్యంగా అడిగేడు.

వరూధిని చిన్నగా నవ్వింది.

"భయం? దాని సంగతి టాంక్‌బండ్ మీద కూర్చున్నాక చర్చించుకుందాం!" అంది.

స్కూటీ టాంక్ బండ్ మీదకి చేరింది.

ఇద్దరూ ఒక బెంచీ మీద కూర్చున్నాక పల్లీలు కొన్నది వరూధిని.

"ఇదేనా హాస్పిటల్?" అనడిగేడు హేమంత్.

"ఈ రోజుకిదే!" కొన్ని పల్లీలు అతనికి షేర్ చేస్తూ నవ్వింది వరూధిని.

హేమంత్ సందేహంగా చూస్తూ "మీతో స్నేహం బాగుంది కాని.. మీ ఏటిట్యూడే అర్థం కావడం లేదు. మీకు చాలా ధైర్యం. బాగా డబ్బులో భయం లేకుండా పెరిగినట్లున్నారు?"

వరూధిని అతని వైపు సాలోచనగా చూసింది.

"డబ్బుంటే భయముండదా? అసలు భయందేనికి ఏం తప్పు చేసేనని?"

ఆవిడ సూటి ప్రశ్నకి జవాబు తోచక నీళ్ళు నమిలేడు హేమంత్.

"అంటే.. అబ్బాయితో ఇలా బాహాటంగా స్నేహం.?!"

"ఏం మీకు బాగాలేదా?"

"బాగుంది కాని.."

"బాగుంది కాని భయం! మీ మగాళ్ళంతే నండి. అన్నీ చాటుమాటుగా కావాలి. ఎక్కడి జీవితం అక్కడ పదిలంగా ఉండాలి. పేరు, గౌరవం చెడకూడదు. కానీ ఆడవాళ్ళలా కాదు. మనసుకి నచ్చితే ఈ ప్రపంచమంతా దండెత్తి వచ్చినా వెనుకాడరు. అసలు ధీరోధాత్తులు, సింగినాదం అంటూ మగవాళ్ళు బడాయిగా టైటిల్స్ తగిలించుకున్నారు గాని స్త్రీలే మానసిక ధారుఢ్యం కలవాళ్ళు!"

ఆమె మాటలకి చేతులు జోడించేడు హేమంత్.

"ఈ లెక్చర్ వినిపించడానికా ఇక్కడిదాకా తీసుకొచ్చేరు నన్ను?"

వరూధిని అతని వంక సూటిగా చూస్తూ "అమ్మాయిలు అమ్మాయిలతోనే స్నేహం చేయాలా?" అనడిగింది.

"అనికాదు" నసిగేడు హేమంత్.

వరూధిని సర్రున లేచి నిలబడి "పదండి. మిమ్మల్ని అబ్బాయిల గుంపులో వదిలేస్తాను" అంది.

"నో నో!" గబుక్కున ఆమె చెయ్యిపట్టుకుని లాగేడు హేమంత్.

అది అతనికి తెలియకుండా జరిగిన చర్య.

వరూధిని కూడ అతనివైపదోలా చూసి కూర్చుంది.

ఆ తర్వాత నిదానంగా ఆకాశంలో అస్తమిస్తున్న సూర్యుణ్ణి చూస్తూ "నిజమే హేమ్! మీరడిగిన ప్రశ్నలో ఏమీ తప్పులేదు. కానీ.. నాకు మీతో మాట్లాడుతుంటే.. చాలా బాగుంటుంది. మనసుకేదో నచ్చింది మీలో ఉంది. మీతో షేర్ చేయడం బాగుంటుంది. ఒక్కొక్కరితో ఒక్కొక్కరికి స్నేహం కుదురుతుంది. అంతే. వాటికి పెద్ద రీజనింగ్ ఉండదు. ఆ టైము.. పరిస్థితి ఏదో మరి!" అంది గంభీరంగా.

హేమంత్ ఆమె మాటలకి లోలోపల ఉబ్బి తబ్బిబ్బయ్యేడు. ఒక్కసారే గజారోహణ చేసినంత పనయ్యిందతనికి.

"కాని.. ఆ రమేష్ బాబు మీరు నాగురించి వస్తున్నారని చాలా ఫీలవుతున్నాడు. "

"అవును... వాడు ఏడవాలనే వస్తున్నాను!"

వరూధిని మాటలకి ఉలిక్కిపడ్డాడు హేమంత్. అంటే "తనకోసం కాదన్నమాట!" అతనికి ఏనుగు మీద నుండి నిర్దయగా క్రిందకి తోసేసినట్లనిపించింది.

వరూధిని అదేం గమనించలేదు.

రమేష్‌బాబు పేరు చెప్పినప్పుడు ఆమె అదోలా మారిపోవడం హేమంత్ మొదటినుండి గమనిస్తూనే ఉన్నాడు.

అదే సమయానికి రోడ్డుకవతల వైపు ఒక కారు ఆగి ఉందని.. అందులోంచి రమేష్‌బాబు వాళ్ళిద్దర్ని గమనిస్తున్నాడని వాళ్ళిద్దరికీ తెలియదు.

హేమంత్ డ్రాకి తాళం వేస్తుండగానే ఒక బాగ్ తీసుకుని "ఈ రోజు నువ్వు నాతో వస్తున్నావ్" అన్నాడు రమేష్ బాబు హేమంత్ సీటు దగ్గరకొచ్చి.

"కాని.. సర్!"

"కానీలేదు.. గినీలేదు. ఫాలోమీ" అన్నాడు రమేష్ ముందుకి నడుస్తూ.

గత్యంతరం లేక అతన్ని అనుసరించేడు హేమంత్.

ఇద్దరూ కారులో అతనుంటున్న లాడ్జికి చేరారు.

అదో థర్డ్ క్లాసు లాడ్జి.

అక్కడ కూర్చోవాలంటేనే కంపరంగా అనిపించింది చుట్టూ చూస్తూ అస్థిమితంగా కూర్చున్నాడు హేమంత్.

"సరే! మీరిక్కడ..?"

"ఒక నెల నుండి ఉంటున్నాను. నా పెళ్ళాం తరిమేసింది. తెలిసే అడుగుతున్నావ్ కదూ?"

రమేష్ బాగ్ లోంచి విస్కీ బాటిల్, గ్లాసులు తీసి ముందు వంపుతూ అన్నాడు.

"నేను డ్రింక్ చేయను"

"ఇదేం కరిచేయదులే. ఈ ఒక్కరోజుకి నాకు కంపెనీ ఇవ్వు" అన్నాడు ఛీర్స్ చెప్పి తాగుతూ.

హేమంత్ గ్లాసు పట్టుకుని గుండ్రంగా తిప్పుతూ కూర్చున్నాడు.

"ఆ వరూథినితో నీ స్నేహం మూడుపువ్వులూ ఆరుకాయల్లా ఉందనుకుంటాను"

హేమంత్‌కి అర్థమైంది - అతనేం మాట్లాడాలని తీసుకొచ్చేడో!

మౌనంగా చూస్తూ కూర్చున్నాడు.

"నీకు తెలుసోలేదో.. దానికి పెళ్ళయింది. ఒక కూతురు కూడా ఉంది. మొగుడొదిలేసేడు."

నెత్తిన బాంబు పడ్డట్లయింది హేమంత్‌కి.

అసలే మాత్రం ఊహించని ఆ విషయాల్ని అతని మనసు జీర్ణించుకోలేక పోయింది.

వెంటనే మొదటిసారని కూడా మరచిపోయి గ్లాసులోని మందు గడగడా తాగేసేడు.

మొదటిసారేమో మందు నెత్తికెక్కిపోయింది.. ఒక పెను విషాదంలా.

ఏడుపు వెక్కెక్కి వచ్చింది.

నిజంగానే ఏడ్చేసేడు హేమంత్.

"నిన్ను బాగా డిసీవ్ చేసింది కదూ! అదంతే! నన్ను కూడా పెళ్ళిచేసుకోమని.. చాలా వత్తిడి చేసింది. పెళ్ళాం బిడ్డల్ని అన్యాయం చేసి."

హేమంత్ మాట్లాడలేదు.

అదే అదనుగా మరో గ్లాసందించేడు రమేష్.

హేమంత్ కిక్కురుమనకుండా తాగేసాడు.

రమేష్ మనసు శాంతించింది.

ఏమాత్రం స్పృహలేని హేమంత్‌ని చిన్నగా కారెక్కించి స్వయంగా అతని రూమ్‌లో పడుకోబెట్టి తలుపు దగ్గరకేసి లాడ్జి మొహం పట్టేడు ఒక రకమైన సంతోషంతో.

**నిద్రలేచేసరికి పదిన్నర దాటింది.**

హేమంత్ ఉలిక్కిపడ్డాడు. ఆఫీసు టైమయిపోయింది.

త్వరగా లేచి వెళ్దామని ప్రయత్నించాడు.

వళ్ళంతా ఒకటే నొప్పులు - ఎవరో కుళ్ళబొడిచేసినట్లు.

మొదటిసారిగా తాగడంతో తల దిమ్మెక్కిపోయి రక్తప్రసరణ లేనట్లుగా ఉంది.

తిరిగి మళ్ళీ పడుకున్నాడు - నిస్సత్తువగా.

మనసంతా ఒకటే ఆలోచనలు.

మొదటిసారిగా - ఆవేదనగా, మోసపోయానన్న బాధతో.

వరూధిని.

ఎంత దగా చేసింది?

తనతో ఆడుకుంది.

పద్మనే తను ఏవగించుకున్నాడు.

అంతకంటే ఛీట్ వరూధిని.

ఆడవాళ్ళంటే తనకెంత గౌరవం.

తన తల్లి, సరోజని, అక్కచెల్లెళ్ళు, తన కాలేజి స్నేహితులు - అందరూ ఎంతో కొంత తనని ప్రేమించిన వాళ్ళే. వాళ్ళ జీవితాల్లో కష్టాలు, త్యాగాలు - కొద్దిపాటి ప్రేమకోసం తపించిపోవడం, ఆ చిన్నపాటి గుర్తింపుకే పొంగిపోయి కొండల్ని సైతం మోయడానికి సిద్ధపడటం - ఎంత ఔన్నత్యం! ఎంత ఔదార్యం! ఎంత త్యాగం!

మరేంటి ఈ సిటీ కొచ్చాక ఇలాంటి స్త్రీలు ఎదురవుతున్నారు.

వీళ్ళనెవరిలా తయారు చేసారు.

ఏది ఏమైనా తను వరూధినిని క్షమించలేడు.

కేవలం రమేష్‌బాబు కోసం ఆఫీసుకు వస్తూ అందుకు సాకుగా తనని వాడుకుందనే విషయాన్ని హేమంత్ జీర్ణించుకోలేకపోతున్నాడు.

బాధతో అతని కళ్ళు చింతనిప్పుల్లా అయిపోయాయి.

హేమంత్ అలానే ఆఫీసు ఎగ్గొట్టి పడుకున్నాడు.

మనసు పట్టక పైకి పొంగి పొర్లుతున్న ఆలోచనలతో ఎర్రబడిన అతని కళ్ళలోంచి వెచ్చని కన్నీళ్ళు జారి తలగడలో ఇంకిపోయాయి.

ఇదేమిటి, తనేడుస్తున్నాడా?

తల్లి చనిపోయినప్పుడు కూడా రాని కన్నీళ్ళిప్పుడొస్తున్నాయేంటి?

తను నిజంగానే వరూధినిని ప్రేమించాడా?

ఇంత గాఢంగా, ఇంత తట్టుకోలేనంతగా!

గంటలు గడిచి సాయంత్రమైంది.

దుఃఖం, ఆకలి కలిసి పేగులు మెలి పడుతున్నాయి. మెల్లిగా లేచి స్నానం అయిందనిపించాడు.

తల దువ్వుకోవాలని అద్దంలో మొహం చూసుకుంటుంటే ఎన్నాళ్ళో జబ్బున పడినట్లుగా పీక్కుపోయింది మొహం. కళ్ళు చింత నిప్పుల్లా ఉన్నాయి.

హేమంత్ అటూ ఇటూగా క్రాఫ్ దువ్వుకుని రూమ్‌కి తాళం వేద్దామని తాళం తీసుకుంటుండగా తలుపు తెరుచుకుంది.

గుమ్మంలోంచి వెలుగు పడటంతో కళ్ళు రిక్కించి చూశాడటువైపు. వరూధిని.

అవునా.. కాదా అన్నట్లు మళ్ళీ కళ్ళు నులుముకుని మరీ చూశాడు.

వరూధినే.

"ఏంటి హేమంత్ నీకోసం ఆఫీస్ దగ్గర నిలబడ్డాను. నువ్వు రాలేదని ఒక లేడీ చెప్పింది. అదేంటలా ఉన్నావ్? ఒంట్లో బాగోలేదా?" అంటూ దగ్గరగా వచ్చి అతని నొసటి మీద చెయ్యి వేసింది.

అంతే!

అంత విసురుగాను ఆ చేతిని విసిరి కొట్టాడు హేమంత్.

అతని చర్యకి వరూధిని తెల్లబోయింది.

ఒక్కసారి షాక్ తిన్నట్లుగా నాలుగడుగులు దూరంగా వేసి అతని వైపు చూసి "ఆర్ యూ ఆల్‌రైట్?" అంది

బదులుగా హేమంత్ అతి హేయమైన చూపు చూసి "నీ దయవల్ల" అన్నాడు.

వరూధిని తెల్లబోతూ "ఏం జరిగింది హేమ్?" అంది.

"ఇలాంటి వగలమారి వేషాలు వేసి ఎంతమంది మగాళ్ళని బుట్టలో పెట్టావ్? ఇప్పుడు నేను దొరికానా?" అన్నాడు కోపంగా.

వరూధిని నిజంగానే మ్రాన్పడిపోయింది.

ఒక్కసారి ఆమెని అవమానం, బేలతనం ఆవహించాయి. కళ్ళలో నీళ్ళు ఉబికి వచ్చాయి.

వాటిని అదిమిపెడుతూ ఏం మాట్లాడుతున్నారు "ఆర్ యూ మాడ్?" అంది ఉక్రోషంగా.

"అవును. మాడ్‌నే. నీలాంటి నయగారాల ఆడవాళ్ళతో స్నేహం చేస్తే పిచ్చివాళ్ళు కావడం ఎంతసేపు, నీకు పెళ్ళయిందని - ఒక కూతురు కూడా ఉందని.. ఎప్పుడయినా చెప్పావా?"

అతని సూటి దాడికి కారణం ఏమిటో కొద్దిగా అర్థమయింది వరూధినికి.

"రమేష్‌బాబు చెప్పాడా?"

"ఏం నీ గుట్టంతా తెలిసిపోయిందని గిల్ట్ అవుతున్నావా?"

వరూధిని హేళనగా నవ్వింది.

"గుట్టుకాదు. ఇదంతా చెప్పాల్సిన అవసరం నాకు కనిపించలేదు. కాస్తంత స్నేహంతో ఎందుకింత కఠినంగా మాట్లాడటమో నాకర్థం కావడంలేదు. నాకు పెళ్ళయితే మీకెందుకు? కూతురు ఉంటే మీకెందుకు?" అంది కోపంగా.

ఈసారి జవాబు దొరకక హేమంత్ నీళ్ళు నమిలాడు.

"నువ్వు రమేష్‌బాబు కోసం పదే పదే ఆఫీసుకి వచ్చావు. సాకుగా నన్ను వాడుకున్నావు. నువ్వు నా స్నేహమాశించి రాలేదు. నేనొక ఫూల్‌లా దొరికాను నీకు. నన్ను ఇడియట్‌ని చేసావు."

వరూధిని మాట్లాడకుండా అతనివైపు చూసింది.

దాంతో హేమంత్ చెలరేగిపోయాడు.

"మీరు చేస్తున్న పనులు బాగున్నాయా?" అన్నాడు ఒక్కొక్క బాణం ఆమెకి గురిపెడుతూ.

"ఏ పనులు?"

"తెలియనట్లు అడుగుతున్నారు. పెళ్ళయి పిల్లలున్న వ్యక్తి వెంటపడి పెళ్ళి చేసుకోమని అడగటం"

"అని చెప్పాడా రమేష్?"

"అవును. మీరతను వద్దన్నాడని కక్షగట్టి అల్లరి చేస్తున్నారని వాపోయాడు. మీ వలన అతని సంసారం ముక్కలు చెక్కలయింది. అతనిప్పుడు లాడ్జిలో ఉంటున్నాడు. మీ మాటలు విని మోసపోయాను. చాలా నిజాయితీ కల వ్యక్తిగా భావించాను. ఛీ! ఇంత దిగజారుడు...."

"స్టాపిట్! నాన్సెన్స్" గట్టిగా అరిచింది వరూధిని.

"మీకు రమేష్‌బాబు మాటలు బాగా తలకెక్కాయి. మొహం చూస్తుంటే మందుకూడా నశాళానికి ఎక్కినట్లుంది. ఇప్పుడేం చెప్పినా మీకర్థంకాదు. అయినా నేనెలాంటి దాన్నయితే మీకేంటి బాధ? ఒక చిన్న స్నేహం. దానికెందుకింత ఆఫీసు మాని మరీ అప్‌సెట్టయిపోతున్నారు" అంది వరూధిని హేళనగా.

"నేను నిన్ను ప్రేమిస్తున్నాను" అని చెప్పలేకపోయాడు హేమంత్.

"సరే! ఇప్పుడేం చెప్పినా మీకు బుర్రకెక్కేలా లేదు. నిజానికి మిమ్మల్ని నమ్మించి ఒప్పించాల్సిన ఖర్మకూడా నాకులేదు. మీరు నన్నేమనుకుంటే నాకేంటి? కానీ.. నేను నిజంగానే మీతో స్నేహం చేసాను. ఎందుకు ఏవిటి అంటే అన్నిటికీ జవాబులుండవు. ఒక్కొక్కర్ని చూస్తే మాట కలపాలనిపిస్తుంది. అంతే! మీకు నిజంగా తెలుసుకోవాలనుంటే... రేపు సాయంత్రం టాంక్‌బండ్ దగ్గరకు రండి. అంతా చెబుతాను" అంటూ సర్రున వెనుతిరిగి వెళ్ళిపోయింది వరూధిని.

ఆమె అలా వెళ్ళిపోకూడదని.. మనసులో ఏ కోశానో ఆశ ఉంది హేమంత్‌కి.

అయినా ఆగమని అడిగే ధైర్యం లేదు.

కానీ.. ఆమె జీవితంలో ఏదో రహస్యముంది. పాపముంది. దీన్నెలా భరించడం. హేమంత్ బుర్ర ఆలోచనలతో పిచ్చెక్కిపోతోంది.

నిన్నరాత్రి నుండి ఏమీ తినకపోవటంతో ఆలోచనలతోపాటు ఆకలి తోడై మనిషి అతలాకుతలమైపోతున్నాడు.

అస్తవ్యస్తమైన ఆలోచనలతో అతను రూమ్‌కి తాళం వేసి రోడ్డెక్కాడు.

"ఏంటి హేమంత్ ఈరోజు కూడా డుమ్మానా? లీవ్‌లెటర్ ఏమన్నా పంపాడా?" అంటూ కుర్చీ లాక్కుని కూర్చుని ఆరాగా అడిగింది పద్మ రమేష్ బాబుని.

"నీపని నువ్వు చూసుకోవచ్చుగా. హేమంత్ సంగతెందుకు నీకు?" అన్నాడు రమేష్ బాబు చిరాగ్గా.

"ఆ పిల్లతో హనీమూన్‌గానీ వెళ్ళాడేమోనని.." కళ్ళు చికిలించి నవ్వుతూ అంది.

"ఆవిణ్ణి పెళ్ళిగానీ చేసుకున్నాడా.. హనీమూన్లు వెళ్ళడానికి?"

"పెళ్ళయితే హనీలేదు మూన్లూ లేవు. లాడ్జీలేగతి!" అంది పద్మ వెటకారంగా.

రమేష్‌బాబుకి సర్రున కోపం వచ్చింది.

"ఎంత తోస్తే అంత మాట్లాడతావు. నేను చనువిచ్చాననేకదా! నీకూ సంసారముందిగా. పూలు పట్టుకుని ఎందుకు అందరి చుట్టూ తిరుగుతున్నావు. నీ కన్నసలు హేమంత్ మీదుందిలే. పడలేదని.. ఈ ఏడుపు" అన్నాడు కసిగా రమేష్‌బాబు.

"ఏంటండీ, అట్లా మాట్లాడతారు. మాదీ పరువుగల కుటుంబమే. ఊరికే తూలబాకండి. ఏదో మీతో చనువుగా ఉన్నందుకు. " అంటూ ముక్కుచీదబోయింది పద్మ.

"ఊరుకో. ఇక్కడ సీన్ క్రియేట్ చెయ్యకు. ఇంతకీ నీకు హేమంత్ గురించి వివరాలు కావాలి. అంతేగా! మందు తాగి ఏడుస్తూ మూడంకేసుకుని పడుకున్నాడు రూమ్‌లో. చూసొస్తావా?" అన్నాడు వెటకారంగా.

"ఛీ! పాడు. నాకేంబట్టింది? ఏమయిందసలు?" ఉత్సాహం ఉండబట్టలేక గబగబా ప్రశ్నించింది పద్మ.

"ఏవుంది? ఈ రమేష్‌బాబుతోనా.. ఆటలు. దానిగురించి అడ్డమైనవన్నీ చెప్పేసాను. దెబ్బకి రెండు పెగ్గులు తాగి ఏడుస్తూ పడుకున్నాడు." అన్నాడు రమేష్‌బాబు గర్వంగా.

"అయ్యో పాపం. దేవదాసయిపోయాడన్నమాట" అంది పద్మ నవ్వుతూ.

"పాపం! అమాయకుడు. మొదటిసారి ప్రేమలో పడ్డాడు. దెబ్బతిన్నాడు"

"దెబ్బతిన్నాడా? దెబ్బతీయించారా?"

"ఏదో ఒకటి. కొంపతీసి సెక్షన్‌లో చెప్పకు."

"సెక్షన్‌లో ఎందుకు? వస్తాడుగా ఆఫీసుకి. అప్పుడాడుకుంటాను" అని అమిత ఉత్సాహంతో సెక్షన్‌లో కెళ్ళింది పద్మ.

సాయంత్రం అయిదవుతుండగా సందిగ్ధంగా ఆలోచిస్తూ అటూఇటూ రూమ్‌లో పచార్లు చేసాడు హేమంత్.

ఏం చెబుతుంది, ఏదన్నా కట్టుకథ అల్లుకుని.. కన్నీళ్ళు పెట్టుకుంటూ చెబుతుందేమో? 'చూద్దాం' అనుకుంటూ బయలుదేరాడు.

అసలు నిజానికి ఆ టైముకల్లా వరూధినిని చూడాలని అతని మనసు తొందరపడుతోంది.

ఆమెకు పెళ్ళికాలేదని.. కూతురులేదని.. రమేష్ బాబు చెప్పినవన్నీ అబద్ధాలని చెప్పాలని అతని మనసు కోరుకుంటోంది.

చివరికి అనుకున్న టైముకి కొద్దిగా ఆలస్యంగా... కావాలనే వెళ్ళాడు. తనకంత ఇష్టంలేదని తెలియచెప్పాలని.

కానీ.. అక్కడ వరూధిని లేదు.

హేమంత్ చాలా నిరాశగా చుట్టూ చూశాడు.

ఎక్కడా ఆమె జాడలేదు.

మొహం చెల్లలేదా? లేక కట్టుకథ దొరకలేదా?

కొంచెం వెటకారం ధ్వనించింది అతని హృదయంలో.

మరోపక్క ఆమెకోసం అతని కళ్ళు వెదుకుతూనే ఉన్నాయి.

కొద్దిగా అసహనంగా ఎప్పుడూ తాము కూర్చునే బెంచీమీదనే కూర్చుని క్రింద దొరికిన గులకరాళ్ళని నీళ్ళలోకి విసురుతూ కూర్చున్నాడు.

"సారీ, చాలాసేపయిందా వచ్చి?"

వరూధిని గొంతువిని వెనక్కి తిరిగి చూశాడు హేమంత్.

ఎదురుగా వరూధిని తలకి బాండేజ్‌తో.

హేమంత్ కంగారుపడి "అదేంటి, పడ్డారా?" అన్నాడు తన కోపాన్ని మరచిపోయి.

అతని పక్కనే కూర్చుని నవ్వుతూ "నిజం చెప్పమంటారా? అబద్ధం చెప్పనా?" అంది.

"మీకేది అలవాటుంటే అది" మళ్ళీ అతని గొంతులో వ్యంగ్యం.

"నా మొగుడు కాని మొగుడు కొట్టాడు"

"మీకు నిజంగానే పెళ్ళయిందా?"

"అబద్ధంగా కూడా అవుతుందా! అయ్యింది మూడేళ్ళ క్రితం. నాకో కూతురుంది. సంవత్సరంన్నర దాని వయసు. పేరు చిత్ర. "

అతను నరాల్లో రక్తం అంతా పీల్చినట్లయి మౌనంగా వింటున్నాడు.

"మాది ఎరేంజ్‌డ్ మ్యారేజ్. మా నాన్నగారు చేసింది. అతనిపేరు చక్రవర్తి. మా నాన్నగారి ఆఫీసులోనే పనిచేసేవాడు. మా నాన్నగారికి చాలా అభిమానం కలిగేలా ప్రవర్తించేవాడట. అతను మానాన్నగారి మీద అభిమానంతో మా ఇంటిక్కూడా రావటం ప్రారంభించాడు. అమ్మకి కూడా నచ్చాడు. అన్నీ కలవడంతో నన్నతనికిచ్చి పెళ్ళిచేద్దామనుకుంటున్నామని నా అభిప్రాయం అడిగారు. చూడ్డానికి అతను బాగానే ఉంటాడు. ఉద్యోగం మంచిదే. ఒప్పుకున్నాను. పెళ్ళి గ్రాండ్‌గా జరిగిపోయింది. కాపురానికి వెళ్ళాను. చిన్నగా అతని అసలు రంగు బయటపడింది. అతనికి లేని వ్యసనం లేదు. అతను నాన్నగారి దగ్గర నటించిన నటన నుండి బయటపడి నాన్నగారికే దిగ్భ్రమ కలిగించాడు. మరింత డబ్బుకావాలని నామీద వత్తిడి తెచ్చేవాడు. నాన్నగారు నా బాధచూడలేక ఇచ్చేవారు. అంతటితో చాలక ఆడవాళ్ళని డైరెక్టుగా ఇంటికి తేవడం మొదలుపెట్టాడు. అడిగితే గొడ్డుని బాదినట్లు బాదేవాడు. అప్పటికే నేను కన్సీవ్ అయ్యాను. ఏ నిర్ణయమూ తీసుకోలేని స్థితి. అతని వికృతరూపం చూసి మ్రాన్పడి - ఆ బెంగతోనే నాన్న ఆర్నెల్లలో చనిపోయారు.

అతని దురలవాట్లకి సస్పెండయ్యాడు. డబ్బుకోసం ఆరడి మరీ ఎక్కువయిపోయింది. నేను పుట్టింటికొచ్చి అమ్మ దగ్గర ఉండిపోయాను. ప్రతిరోజూ తాగి రావడం, అమ్మ ఎదుట కొట్టడం - డబ్బులు తీసుకుపోవడం అతని అలవాటు.

ఇంతలో చిత్ర పుట్టింది. నేను ఉద్యోగం వెదుక్కున్నాను. కానీ.. అతను ఆఫీసు దగ్గరకొచ్చి బ్లాక్‌మెయిల్ చేసి జీతమంతా పట్టుకెళ్ళిపోయేవాడు. చివరకి కోర్టుకెళ్ళి విడాకులు తీసుకున్నాను. పాప బాధ్యత ఇద్దరిదీ అన్నారు. కానీ.. అతను పాపని నేను డబ్బులివ్వని రోజున తీసుకెళ్తానని బెదిరిస్తూ అప్పుడప్పుడూ వస్తాడు. దౌర్జన్యం చేస్తాడు. కొడ్తాడు. పాపని ఎత్తుకుని పారిపోబోతాడు. ఆ పెనుగులాటలో భాగమే ఇది.

సరే! రమేష్‌బాబు గురించి కదూ చెప్పాలి మీకు. మా అమ్మకీ మధ్య నాకు మళ్ళీ పెళ్ళి చెయ్యాలని పిచ్చిపట్టింది. నన్ను చాలాసార్లు బ్రతిమలాడింది. చివరకి ఎవరికో పెళ్ళిళ్ళపేరయ్యకి చెపింది. అతను చెప్పిన పెళ్ళికొడుకుల లిస్టులో మీ బాస్ రమేష్‌బాబు కూడా ఉన్నాడు."

"అదేంటి, ఆయనకి పెళ్ళాం బిడ్డలున్నారుకదా!" ఆశ్చర్యపోతూ అడిగాడు హేమంత్.

"వినండి. అమ్మ నాకతని ఫోటో చూపించింది. నేను నాకు పెళ్ళివద్దన్నానా అని విసుక్కున్నాను. చక్రవర్తిని చూశాక నాకు పెళ్ళిమీద, మగవాళ్ళ మీదా నమ్మకం పోయింది. కానీ.. అమ్మ బ్రతిమలాడింది. చక్రవర్తి దరిద్రం వదిలించుకోవాలంటే నాకో తోడు ఉండాలని అమ్మ ఉద్దేశ్యం.

"కానీ.. ఇతను చాలా పెద్దవాడిలా ఉన్నాడు కదమ్మా!" అన్నాను ఆ పెళ్ళిని తప్పించాలని.

"కొంచెం పెద్దవాడేలే. కానీ ... పెద్ద పొజిషన్లో కూడా ఉన్నాడు. భార్య గర్విష్టట. దాంతో విడాకులయిందట. నీ ఫోటో చూసి ఇష్టపడ్డాడు. చక్రిగాడి గొడవ తప్పించుకోవాలంటే.. కొంచెం మంచి పొజిషన్‌లో ఉంటేనే కదా! ఎదుర్కోగలడు" అంది.

"మరి..పాప?"

"తన కూతురిలా చూసుకుంటానన్నాడు. చాలా మర్యాదగా మాట్లాడాడు. ఎంత వినయమనుకున్నావు" అంది అమ్మ ఉబ్బితబ్బిబ్బవుతూ.

"ఇదంతా ఎప్పుడు జరిగింది?" అనడిగాను.

"నిన్న నువ్వు ఆఫీసులో ఉండగా వచ్చాడు. పాపని ఎత్తుకున్నాడు. రెండు ఫ్రాకులు కూడా తెచ్చాడు. నువ్వు తిడతావని దాచిపెట్టాను" అంది.

"నేను మౌనంగా ఉండిపోయాను."

"ఏమంటావ్?" అమ్మ ఆత్రంగా నామొహంలోకి గుచ్చి చూస్తూ అడిగింది.

"నేనతనితో మాట్లాడాలి"

"అతనూ.. అదే అన్నాడు. రేపొస్తాడు. కొంచెం ఎక్కడన్నా కూర్చుని మాట్లాడుకోండి" అంది అమ్మ.

నేనేమీ జవాబు చెప్పలేదు.

అమ్మ లేచి వెళ్తూ "వరూ.. ఈ పెళ్ళి చెడగొట్టుకోకే. మంచివాడిలా ఉన్నాడు" అంది బ్రతిమలాడుతున్న ధోరణిలో.

ఆ మర్నాడు నా చేత ఆఫీసుకి శెలవు పెట్టించింది.

పదకొండు గంటలవుతుండగా అతను వచ్చాడు.

అమ్మ నన్ను అతనికి పరిచయం చేసింది.

"హలో!" అన్నాడతను.

నాకతను మొదటి చూపులోనే నచ్చలేదు. కారణం రూపమా! ఏమో.. ఆలోచిస్తున్నాను.

"కొంచెం సేపు బయటకి వెళ్దాం" అన్నాడతను అమ్మ ఇచ్చిన కాఫీ తాగుతూ.

అమ్మ వెళ్ళమని సైగ చేసింది నాకు.

అయిష్టంగానే అతని వెంట కారులో కూర్చున్నాను.

అతను కారు డ్రైవ్ చేస్తూ అతని ఆస్తి వివరాలు, అతని పొజిషన్.. వీటి గురించి చెబుతూనే ఉన్నాడు.

ఊరంతా తిప్పి ఒక చిన్నపాటి హోటల్‌కి తీసుకెళ్ళాడు.

కాఫీ ఆర్డర్ చేస్తూ "ఏవన్నా కొనిపెట్టనా?" అనడిగాడు మొదటిప్రశ్నగా.

నేను అర్థంకాక చూశాను.

"అంటే....?"

"అంటే ఏముంది? ఏదన్నా చీరకొనిపెడతాను" అన్నాడు. నామొహం అవమానంతో జేవురించిది.

"మీరు కొనిపెట్టడమేంటి? పెళ్ళికాక ముందు నేనలా ఎవరిదగ్గరా కానుకలు తీసుకోను."

"పెంకితనం చాలానే ఉంది" అన్నాడు కాఫీ శబ్దం చేస్తూ తాగుతూ.

"ఇదేనా... మీరు మాట్లాడుకుందామని తీసుకొచ్చింది? " కోపంగా అడిగి లేచి పిలుస్తున్నా వినిపించుకోకుండా ఇంటికొచ్చేసాను.

హేమంత్ తెల్లబోతూ వింటున్నాడు.

ఆ తర్వాత ... 'ఆ వెధవ!...' రొప్పుతూ ఆగిపోయింది వరూధిని.. ఆమె కళ్ళలో ఆవేశంతో ఎర్రబడిన నీళ్ళు.

**హేమంత్ ఆమెని** గమనిస్తూ కూర్చున్నాడు.

ఇప్పుడతనిలో ఆమె పట్ల ఇందాకటి వరకు ఏర్పరుచుకున్న ద్వేషం, కోపం పోయి జాలి, బాధ పెనవేసుకుని అతన్ని విషాదభరితం చేస్తున్నాయి.

"వాడు నేను ఆఫీసు కెళ్ళాక అమ్మ దగ్గర కొచ్చి చెప్పిన మాటలు, ఇచ్చిన చీర నన్ను వివశని చేసాయి.

"నీ కూతురికి చాలా గర్వం, ఏమనుకుంటుంది నన్ను?" అన్నాడట.

అమ్మ కంగారు పడుతూ "ఏం జరిగింది బాబూ?" అందట.

అమ్మకి రమేష్‌బాబు సంబంధం పోగొట్టుకోవడం ఇష్టం లేదు. ఎక్కడ అతను నన్ను చేసుకోనంటాడోనన్న భయం ఆమెలో ఎక్కువగా చోటు చేసుకుంది.

అమ్మ బలహీనత అతను కనిపెట్టాడు.

"చీర కొనిపెడతానంటే అదేదో తప్పయినట్లుగా రయ్యిన లేచి వెళ్ళిపోయింది. నీ కూతురికేవన్నా ఇది మొదటి పెళ్ళా! పైగా ఒక కూతురుంది. అవతల రోజూ ఇంటిమీద దాడి చేసే ముందు మొగుడు. వీటన్నిటినీ తట్టుకుని నీ కూతుర్ని పెళ్ళి చేసుకోవడానికి ఎవరొస్తారు ముందుకి?"

అమ్మకా మాటలు కష్టంగా తోస్తున్నా పరిస్థితులతో రాజీపడి వాటిని భరిస్తూ సర్ది చెప్పడానికే ప్రయత్నించింది.

"దానికి నేను నచ్చచెబుతాను. మీరు తొందరపడకండి" అని బ్రతిమిలాడిందట.

అయినా రమేష్ బాబు తగ్గకుండా "ఇప్పుడు చెబుతున్నా వినండి. నాకు నా భార్యనుండి లీగల్ డైవోర్సు లేదు. విడిగా ఉంటున్నామంతే. ఆవిడకి నాకు పడదు. మీ అమ్మాయిని లీగల్‌గా పెళ్ళి చేసుకోలేను. అయినా బాగానే చూసుకుంటాను. మీ మనవరాలిని కూడా. నెలకింతని ఇస్తా. మీ కూతురు ఉద్యోగం చేయనక్కర్లేదు. ఆలోచించుకోండి" అని వెళ్ళిపోయాడట.

అతని మాటలకి అమ్మ హతాశురాలయింది.

నేను ఆఫీసు నుండి వెళ్ళేసరికి ఏడుస్తూ పడుకుని ఉంది. నేను కంగారుపడి అడిగితే ఏడుస్తూ జరిగినదంతా చెప్పింది.

"జీవితంలో ఒక దెబ్బ తగిలితే నీతి జాతి లేని వాళ్ళనుకుంటుందా ఈ ప్రపంచం. ఎంత బాగా పెంచాం నిన్ను. ఎంత మంచి కుటుంబం మనది. ఒక దుర్మార్గుడు చేసిన నీచమైన పనికి.. మన బ్రతుకులింత దిగజారిపోయాయా! తప్పు చేసినవాణ్ణి వదలి మనల్ని శిక్షిస్తున్నారే! వాడికి లీగల్ డైవోర్సు అయిందనుకుని ఇంటిదాక రానిచ్చాను. ఎలా మాట్లాడాడు వాడు! నా కూతుర్ని ఉంచుకుంటానని కదా. వాడు చెప్పడం!" అమ్మ తిరిగి వెక్కెక్కి ఏడ్చింది.

నేను అమ్మ భుజమ్మీద చెయ్యేసి 'వాడు సంస్కారం లేని అధముడు. పాతాళం నుండి వచ్చాడు. వాడు వాగిందానికి నువ్వేడవడమెందుకమ్మా! నేను పెళ్ళిచేసుకోవాలని ఎప్పుడూ అనుకోలేదు. చిత్రే నా లోకం. దాన్ని బాగా పెంచాలి. చదివించాలి. తల్లిగా నా ముందు పెద్ద బాధ్యత ఉంది. వాడి గురించి ఆలోచించకు' అన్నాను.

అలా అన్నానేగానీ నా వంట్లో రక్తమంతా సలసలా మరిగి పోతూనే ఉంది.

అవమానమెంత నిలువల్లా దహించేస్తుందో మాట పడిన వారికే అర్థమవుతుంది. అంతవరకు ఎంతో గౌరవంగా జీవించిన మా జీవితాల్లో చక్రవర్తి అల్లుడు రూపంలో ప్రవేశించి మా బ్రతుకులు ఛిద్రం చేసాడు. చేస్తున్నాడు. ఇప్పుడెవరు వారి వారి సంస్కారం కొద్దీ అనుకున్నా మేం తలదించుకుని భరించాలి. "

అలా చెబుతున్నప్పుడు వరూధిని కంటిలోంచి కంటే కొసకి చేరిన కన్నీటి చుక్క ఎర్రబడటం గమనించాడు హేమంత్.

అతని మనసు విలవిలలాడింది.

అసహాయుడిగా చూశాడామె వైపు.

"మా ఇంటి పక్క ఒకావిడ ఉంది. ఆమె తోచక అమ్మ దగ్గర కొచ్చి కబుర్లు చెబుతుంది. నా వివరాలు అడుగుతుంది. దాస్తే ఇంకా నొక్కి నొక్కి అడుగుతుందని అమ్మ నిజం చెప్పేసింది. ఆవిడ ముందు కన్నీళ్ళు పెట్టుకుని ముక్కు చీది జాలి చూపించింది. ఆ తర్వాత నన్ను చూస్తే ఆవిడకి ఆశ్చర్యం. ఎప్పుడూ ఏడవకుండా డ్రెస్సులు వేసుకుని స్కూటీ మీద తిరుగుతున్నానని బాధ. పదే పదే ఆ మాటే అంటుంది. మీ కూతురు కొంచెం సర్దుకోవాల్సింది. మొగుడన్నాక ఏదో అంటాడు. పెళ్ళయ్యాక స్వేచ్ఛ అంటే ఎలా? అని నా కాపురం కూలిపోవడానికి నాలో ఉన్న సవాలక్ష తప్పులు వెదకడానికి ప్రయత్నిస్తుంది. చక్రవర్తి వచ్చి అల్లరి చేసిన రోజు ఆమెకు పండగే. కిటికీకి చెవులు, కళ్ళు అతికించేస్తుంది. ఇలా ఉంటుంది లోకం. ఎవర్ని ప్రశ్నించగలం. మనకొచ్చిన దురదృష్టాన్ని నిందించడం కాక. "

వరూధిని నవ్వడానికి ప్రయత్నిస్తూ హేమంత్ వైపు చూసింది.

హేమంత్ నవ్వలేక పోయాడు.

అలానే బేలగా చూశాడు.

"అందుకే.. ఆ రోజు కోపం పట్టలేక చీర తెచ్చి వాడి మొహాన్న విసిరాను. మీరొచ్చి సర్దిచెప్పటానికి ప్రయత్నించారు. ముందు మిమ్మల్ని కసురుకున్నా ఎందుకో.. ఎక్కడో మిమ్మల్ని తెలిసినట్లు ఫీలయ్యాను. మాట్లాడాలనిపించింది. కాస్త అమాయకంగా కనిపించారు. చాలామంది కారణాలడుగుతారు నిజానికి అవేం ఉండవు. కొందర్ని చూడగానే చిరాకు కలుగుతుంది. కొందరంటే ఇష్టపడతాం. కొందరసలు ఏ జన్మనుండో మనకి ఆత్మీయులనిపిస్తారు. స్నేహానికి, ప్రేమకి లాజిక్కులుండవు హేమంత్. అదంతే! కాలగతిలో వాళ్ళ బలహీనతలు తెలిసినా వదలాలనిపించదు" అంటూ నిట్టూర్చింది వరూధిని.

హేమంత్ మనసంతా అదోలా అయిపోయింది.

వరూధిని మీద కోపమయితే పోయిందిగానీ తనేం చేయగలడు ఆమెకి. కానీ ఏమయినా చేసి ఆమె జీవితానికి వసంతం తేగలిగితే!

అదే అర్థం కాలేదతనికి.

అలానే అసలే పెద్దవైన కళ్ళని మరింత విస్ఫారితం చేసి చూస్తుండిపోయాడు.

"ఎందుకంత పెద్ద కళ్ళు నీకు. ఆల్చిప్పల్లా. ఏ ఆడపిల్లకో ఇస్తే.. నీలాంటి వాళ్ళకి వలవేసి ఆడించేదిగా!"

ఆమె జోక్‌కి అతను నవ్వలేకపోయాడు.

కనీసం సానుభూతి మాటలు కూడా చెప్పలేకపోయాడు.

"సరే చీకటి పడుతోంది, వెళ్దాం పద!" అంటూ పైకి లేచింది వరూధిని.

హేమంత్ కూడా లేచి నిస్సత్తువగా ఆమె వెంట అడుగులేసాడు.

సీరియస్‌గా ఫైలుని స్టడీ చేస్తున్న హేమంత్‌ని తదేకంగా చూసింది పద్మ.

ఎలానో సంభాషణ మొదలుపెట్టి అతన్ని గేలి చేయాలని ఆమె సంకల్పం.

ఎవరైనా ఏదైనా అంటే డొంక కదిలించాలని అటూ ఇటూ వేళ్ళు విరుచుకుంటూ చూసింది.

అప్పుడే అటెండెన్స్ రిజిస్టర్ క్లోజ్ చేస్తూ "ఏంటి హేమంత్, లీవ్ లెటర్ పంపకుండా డుమ్మా కొట్టావు. ఒంట్లో బావుండలేదా ఏంటీ?" అన్నాడు ముకుందం హేమంత్ వైపు చూడకుండానే.

"ఆఁ కొద్దిగా జ్వరం." అన్నాడు హేమంత్ కూడా పొడిగా తనూ ఫైల్లోంచి తలెత్తకుండా.

"ఇవ్వాళా రేపూ రకరకాల జ్వరాలొస్తున్నాయి సార్! ఏం జ్వరమో.. ఏంటో పాపం!" అంది పద్మ అల్లుకుపోవడానికి సిద్ధపడుతూ.

హేమంత్ జవాబు చెప్పలేదు.

అసలు విననట్లు ఊరుకున్నాడు.

"నిన్న మా పక్కింటాయన బావగారికి అదేం జ్వరమో వచ్చి ఇరవైనాలుగ్గంటల్లో పోయాడు హేమంత్‌గారూ! రక్తపరీక్ష చేయించుకున్నారా మరి?" అంది తిరిగి రెచ్చగొడుతూ.

హేమంత్ బదులివ్వలేదు.

"ఊరుకోమ్మా, లేనిపోని అపశకునం మాటలు. ఏదైనా జ్వరమైతే ఇంత త్వరగా ఆఫీసుకి రాగలడా? నువ్వూరికే సాగదియ్యకు" అన్నాడు ముకుందం చిరాగ్గా.

పని చేసుకుంటున్న మిగతా స్టాఫ్ కూడా కొద్దిగా ఆ సంభాషణ ఇష్టపడనట్లుగా చిరాగ్గా చూశారు.

అంతలోనే బాలయ్య ఒకామెను వెంటబెట్టుకుని రమేష్‌బాబు చాంబర్స్‌లోకి వెళ్ళాడు.

అందరి కళ్ళూ అటు తిరిగాయి.

ఆ అమ్మాయికి వయసు ముప్పయిలోపే ఉంటుంది. చేతిలో చిన్నపాటి సంచితో అందర్నీ బిక్కుబిక్కుమంటూ చూస్తూ బాలయ్య వెంట లోనికి వెళ్ళింది.

"సారు! నమస్కారం పెట్టు"

ఆవిడ నమస్కారం పెట్టింది.

"మన సారయ్య పెళ్ళాం సార్. సారయ్య చచ్చిపోయాడు కదా! ఈవిడకి పోస్టింగ్ ఆర్డర్సిచ్చి మీ దగ్గర వేసారు. నన్నొద్దని చెప్పారట కదా! నా బదులు ఈవిడ. మీకు బాగానే ఉంటదిలే సార్. చెప్పినట్లు వింటదిలే. ఏమ్మా?" అన్నాడు బాలయ్య ఆ అమ్మాయివైపు చూస్తూ.

రమేష్‌బాబుకి బాలయ్య మాటల్లో వెటకారం అర్థమైనా తెలియనట్లు నటిస్తూ "ఏం పేరమ్మా?" అనడిగాడు.

"వసంత" ఆమె బెదురుతున్నట్లుగా చెప్పింది.

కాస్సేపు హేమంత్ గొడవ పక్కన పెట్టి రమేష్‌బాబు ఛాంబర్స్‌లోకొచ్చింది పద్మ.

రావడమే కుర్చీ బర్రున లాక్కుని కూర్చుంటూ "కొత్త పోస్టింగా?" అనడిగింది వసంతని ఎగాదిగా చూస్తూ.

కష్టాలవల్ల దైన్యంగా ఉన్నా వసంత మొహం కళగా ఉంది. అమాయకత్వం వల్ల వచ్చిన అందం అది. అప్పుడే పూసిన ఓ పేరు తెలియని పువ్వులా.

"ఇదిగో వసంతా, ఈవిణ్ణి బాగా చూసుకోవాలి. ఈవిణ్ణి బాగా చూసుకుంటే నీకసలే తిప్పలూ ఉండవు" అన్నాడు బాలయ్య వెటకారంగా నవ్వుతూ.

రమేష్‌బాబు ఆమె పోస్టింగ్స్ చూసి జాయినింగ్ రిపోర్ట్ తనే రాసి ఆమె చేత సైన్ చేయించి "నువ్వింక రిలీవ్ అవ్వు" అన్నాడు బాలయ్యని.

"అఁ అవుతానులెండి.. నేనెక్కడికి పోతాను. డి.సి.ఇగారి దగ్గరే వేయించుకున్నా. తెల్లారితే నాతోనే పని మీకు. మా వసంత జాగ్రత్త సార్" అన్నాడు బాలయ్య వెళ్ళిపోతూ.

వసంత నిస్సహాయంగా చూసింది.

"ఈవిడకి కాస్త ఏం చేయాలో చెప్పు. చూడమ్మా వెళ్ళి ముకుందంగారిని పిలుచుకురా" అన్నాడు రమేష్‌బాబు.

పద్మ వసంతకి ముకుందాన్ని చూపించింది.

"సారూ, మిమ్మల్ని పెద్దసారు రమ్మంటున్నాడు" అని చెప్పింది వసంత.

ముకుందం లోనికొస్తూనే "ఏంటి సార్, బాలయ్యనెందుకు పంపేసారు? ఈ లేడీస్ అటూఇటూ తిరుగుతూ పనిచేయలేరు. మరీ ముఖ్యంగా అటెండర్స్‌గా" అన్నాడు కొద్దిపాటి విసుగు చూపిస్తూ.

"వాడి ఎడాసిటీ మరీ ఎక్కువయిపోయింది ముకుందంగారూ. వాడే ఛీఫింజనీరు లెవెల్లో మాట్లాడుతున్నాడు. అందుకని"

"అయినా.." అంటూ ఆమె జాయినింగ్ రిపోర్టు తీసుకుని వెళ్ళి అటెండెన్స్ రిజిస్టర్‌లో సైన్ చేయించాడు ముకుందం.

"మన కొత్త అటెండరు. పేరు వసంత. సారయ్య భార్య. బాలయ్యకి బదులుగా వచ్చింది" అన్నాడు ముకుందం స్టాఫ్‌తో.

"దరిద్రం వదిలింది" అంది పద్మ.

"ఏం వదిలింది? వాడు డి.సి.ఇ గారి దగ్గర జేరాడు. ఇంకా జులుం పెరుగుతుంది" అన్నాడు ముకుందం.

ఇంత జరుగుతున్నా హేమంత్ తలకూడా ఎత్తకుండా తన పని తాను చూసుకుంటూనే ఉన్నాడు.

అతన్ని క్రీగంట గమనిస్తూనే ఉంది పద్మ.

హేమంత్ ఆఫీసు పరిస్థితులని పట్టించుకునే స్థితిలో లేడు. అతని ఆలోచనల నిండా వరూధినీయే తిరుగుతోంది.

అంత చక్కని తెలివితేటలున్న అమ్మాయికి అలాంటి జీవితమా! దేవుడికెందుకింత కక్ష. ముందు ఎంత జీవితముంది. అంతా.. ఇలా నిస్సారంగా, నిస్తేజంగానే గడవాలా! తనేమీ చేయలేడా? ఎలా? ఏదో అర్థమవుతున్నట్లే ఉంది. కానీ.. ఏదో జంకు. భయమూ పరిస్థితులూ  అతనికి దారి చూపించడంలేదు.

"సారూ మిమ్మల్ని పెద్దసారు పిలుస్తున్నాడు" వసంత మాటకి ఈలోకంలోకొచ్చాడు హేమంత్.

"ఊ" అన్నాడు కొద్దిగా ఉలిక్కిపడ్డట్లుగా.

"ష్! నెమ్మది. సారు జ్వరం పడ్డాడు" అంది పద్మ నవ్వుతూ.

ఈ సారి హేమంత్ ఆమె వైపు సీరియస్‌గా చూసి "నేను వచ్చేలోపల ఈ డేటా చెక్‌చేయండి" అంటూ ఎస్టిమేట్ ఆమె టేబుల్ మీదకి గిరాటేసి లేచి నిలబడ్డాడు.

రమేష్‌బాబు మొహం చూడాలనిపించడంలేదు. కానీ.. తప్పదు. ఒక మనిషి వికృతరూపం చూశాక మామూలుగా మాట్లాడటం చాలా కష్టంగా ఉంటుంది. రమేష్ బాబు బలహీనతలు, డబ్బు ఆశ అన్నీ కొంతవరకూ తెలుసు. కానీ.. మరీ ఇంత నీచంగా.. వరూధినితో ఆడిన గేమ్ చాలా కోపంగా అనిపిస్తోంది.

హేమంత్ సూటిగా రమేష్‌బాబు వైపు చూడకుండా ఎటో చూస్తున్నట్లుగా విష్ చేసి కూర్చున్నాడు.

రమేష్‌బాబు మాత్రం హేమంత్‌ని పరీక్షగా చూస్తూ "వంట్లో బాగోలేదా?" అనడిగాడు.

"స్లైట్ ఫీవర్" గొణిగినట్లన్నాడు హేమంత్.

"వచ్చి చూద్దామనుకున్నాను. కుదర్లేదు. ఆ రోజే అనుకున్నా. నువ్వు మరో పెగ్ తాగినప్పుడే అప్‌సెట్టవుతావేమోనని. సరే వదిలేయ్. దాని గురించి నీకెందుకు టెన్షన్. నువ్వెక్కడ దాని బుట్టలో పడి దెబ్బతింటావోనని చెప్పాను. ఏవీలేందే ఇంత హర్టయ్యావు. ఇక నిజంగా లోతుకి దిగితే ఏవయ్యేవాడివి?" అన్నాడు ఓదార్పుగా.

హేమంత్ మొహం కోపంతో జేవురించింది.

లేచి జుట్టుపటుకుని కొట్టాలనిపించింది.

పరిస్థితి అదికాదు కాబట్టి కోపాన్ని బలవంతంగా అణుచుకుని "నాకెందుకు సర్ ఆమె సంగతి? ఏదో చిన్నపాటి స్నేహం. ఆమె గురించి చెడుగా కూడా అనుకోవాల్సిన అవసరం నాకు లేదు" అన్నాడు కూల్‌గా నవ్వడానికి ప్రయత్నిస్తూ.

"సరే సరే! ఇప్పుడు నువ్వయితే ఆరోగ్యంగా ఉన్నావుకదా? అందుకే పిలిచాను" అన్నాడు మాటమారుస్తూ రమేష్‌బాబు.

"సరే" అంటూ లేచాడు హేమంత్.

వచ్చి తిరిగి సీట్లో కూర్చున్నాడే కానీ పనిమీద ఏకాగ్రత కుదరడం లేదు.

"ఏంటండీ ఎస్టిమేటిచ్చి వెళ్ళారు. నాకెందుకిది?" అంది పద్మకోపంగా.

"అది మీ సీటుదే"

"అవుననుకోండి. మీకు మార్కు చేసారుగా చెయ్యమని."

"అంటే ఏ టు జడ్ చెయ్యమని కాదు. డేటా చెక్ చెయ్యండి. నేను నోటు రాస్తాను" అన్నాడు హేమంత్ అసహనంగా.

"డేటానా? ఇది ఏ షెడ్యూల్ ఆఫ్‌రేట్స్‌తో చెయ్యాలి?"

"నయం షెడ్యూల్ ఆఫ్ రేట్స్ ఒకటుంటుందని తెలుసు మీకు. మీ సర్కిల్ ఎక్కడుంది?"

"కాకినాడ."

"మరింక ధవళేశ్వరం షెడ్యూల్ ఆఫ్ రేట్స్‌తో చేయండి"

పద్మ ఎస్టిమేట్‌ను అటూ ఇటూ తిరగేసి గబగబా అది పుచ్చుకుని రమేష్‌బాబు రూములోకి పరిగెత్తింది.

"చూడండి ఆ హేమంత్ నేను ఎస్టిమేట్ చెక్ చేయాలట. అంత మాత్రానికి అతనెందుకు?" అంది ఏడుస్తున్నట్లుగా.

"ఏం, చెయ్యొచ్చుకదా!"

"తెలిసి మాట్లాడకండి. నాకు రాకనే కదా, మిమ్మల్ని పట్టుకుని ఏడుస్తున్నా!"

"ష్! సరే, వసంతా వెళ్ళి వసుమతిగారిని పిలువు" అన్నాడు వసంతతో.

"ఆవిడెందుకు?"

"ఇప్పుడసలే దెబ్బతిన్న పులిలా ఉన్నాడు హేమంత్. వసుమతి చేత చెక్ చేయిస్తానులే."

వసుమతి రావడమే అసహనంగా లోనికొచ్చింది.

"కొంచెం హేమంత్‌కి హెల్త్ బాగోలేదు. కాస్త ఈ ఎస్టిమేట్ డేటా చెక్ చేసి పెడతారా?"

వసుమతికి పనిరాని రమేష్‌బాబంటే చాలా హేళన. పైగా ఆమె రమేష్‌బాబుకంటే సీనియర్. జోనల్ సిస్టమ్‌లో ఆమెని వెనక్కి తోసి రమేష్ బాబుకి ప్రమోషనిచ్చారని మంటకూడా ఉంది. పైగా పద్మతో అతని వేషాలు ఆమెకి చాలా ఏవగింపుని కలిగిస్తున్నాయి.

"ఈవిడేం చేస్తుంది?" అంది పద్మవైపు తిరిగి.

"మీకు తెలుసుగా..." నవ్వబోయాడు రమేష్‌బాబు.

"నాకేం తెలియదు. నా సర్కిల్ హెవీ సర్కిల్. నేనే రోజూ ఇంటికి పట్టుకెళ్ళి తెల్లవార్లూ వర్క్ చేస్తున్నాను.. సారీ!" అంది నిక్కచ్చిగా వసుమతి.

"ఈ ఒక్కసారికి.."

"ఒక పని చేయండి, ఆవిడ సర్కిల్‌ని కూడా నాకు ఎలాట్ చేసి ఆమెను నాకు అసిస్టెంటుగా వేయండి. పని నేర్పిస్తాను ఆవిడకి" అంది వసుమతి.

పద్మ కోపంతో ఊగిపోయింది.

"నేను మీకు అసిస్టెంటునా?"

"అంత పౌరుషముంటే పని నేర్చుకోండి పద్మా. మీలాంటివారు నాకు అసిస్టెంటు కావాలని నేను కోరుకోవడంలేదు" అంటూ విసురుగా వెళ్ళిపోయింది వసుమతి.

"సరే, హేమంత్‌నే పిలువు"

"ఆయన పర్మిషన్ లెటర్ మీకిమ్మని చెప్పి ఇప్పుడే వెళ్ళిపోయారు సారూ!" అంది వసంత చేతిలో కాగితం అతని బల్లమీద పెడుతూ.

"వ్వాట్! వెళ్ళిపోయాడా?"

"అవును సారూ, ఎవరో అమ్మాయి వచ్చి పిలుచుకెళ్ళింది"

వసంత మాటకి దిగ్భ్రమ చెంది రమేష్‌బాబు, పద్మ మొహమొహాలు చూసుకున్నారు.

"అవును సర్! ఆ అమ్మాయి ఏదో ప్రాబ్లమ్‌లో ఉన్నట్లుంది హడావుడిగా తీసుకెళ్ళింది" అంటూ లోనికొచ్చాడు ముకుందం.

రమేష్‌బాబు మాటపడిపోయినట్లుగా చూశాడు ముకుందంవైపు.

**"ఎంతసేపయింది?"** అనడిగాడు చివరికి నోరు పెగల్చుకుని.

"ఇప్పుడే" అంటూ వెళ్ళిపోయాడు ముకుందం.

"చూశారుగా మీరేదో తెగ సంబరపడిపోతున్నారు చాలా ఘనకార్యం చేసినట్లుగా. అందుకే ఇంక పనిమీదేం ఇంటరెస్టుంటుంది. పరిగెత్తుతున్నాడు" మాటిమాటికి అంటూ రెట్టించింది పద్మ.

రమేష్‌బాబు ఆమె మాటలు వినిపించుకునే స్థితిలో లేడు. అతని హృదయం భగ్గుమంటోంది అకారణంగా.

***తమ తప్పు తాము తెలుసుకునే స్థితిలో ఉంటే మనుషులు సైకోలగానో దుర్మార్గులుగానో మారరు.***

ఇకిప్పుడు మాట్లాడి ప్రయోజనం లేదని చిన్నగా అక్కడనుండి జారుకుంది పద్మ.

హాస్పిటల్లో గబగబా పరుగుతీస్తున్నట్లుగా నడుస్తోంది వరూధిని. ఆమె వెనుకాలే హేమంత్.

ఈసారి ఆమె నిజంగానే హాస్పిటల్‌కి తీసుకురావడం ఆందోళన కలిగిస్తోంది హేమంత్‌కి.

ఎప్పుడూ సరదాగా హాస్పిటలని చెప్పి సినిమాకి తీసుకెళ్ళే వరూధిని నిజంగానే ఇంటెన్సివ్ కేర్ వైపు ఆందోళనగా పరుగుపెట్టడం అతనికి భయాన్ని కల్గించింది.

"ఏమయింది?" అన్నాడు కంగారుగా.

ఆమె వెనుతిరిగి చూసింది. ఆ కళ్ళనిండా నీళ్ళు.

"అమ్మకి బాగాలేదా?"

ఆమె తల అడ్డంగా తిప్పింది.

"కాదు. చిత్రకి. చిత్రకి చాలా జ్వరం" అలా చెబుతున్నప్పుడు ఆమె బుగ్గల మీద కన్నీళ్ళు జలజలా రాలిపోయాయి.

ఎలా ఊరడించాలో తెలియని స్థితి.

"ఏం జరిగింది?"

"మొన్న గొడవకి చాలా భయపడింది. చిత్రని బలవంతంగా లాక్కుని వెళ్ళాలని చూశాడా దుర్మార్గుడు. ఆ పెనుగులాటలో బాగా నలిగిపోయింది." అంది వరూధిని కన్నీళ్ళు తుడుచుకుని.

ఇంతలో నర్సు వచ్చి ఏవో మందులు అర్జెంటుగా కావాలని కౌంటర్‌లో డబ్బు కట్టమని చీటీ ఇచ్చింది.

వరూధిని ఆ చిట్‌ని తీసుకుని ఆలోచించడం గమనించాడు హేమంత్.

అప్పుడు చూశాడామె చేతులకున్న గాజులు, మెడలో చెయిన్ లేకపోవడం.

'ఒక్క నిముషం' అంటూ ఆమె వెళ్ళబోతుండగా అతనామె చెయ్యిపట్టుకున్నాడు గబుక్కున.

వరూధిని ఆగి అతనివైపు చూసింది.

"నేను కట్టి వస్తానివ్వండి"

ఆమె జవాబు ఆశించకుండానే హేమంత్ చొరవగా ఆ చిట్ తీసుకుని ముందుకెళ్ళాడు.

అతను వెళ్ళిన వైపే నిర్లిప్తంగా చూస్తుండిపోయింది వరూధిని.

అదృష్టవశాత్తు ఆ రోజునే హేమంత్ జీతం తీసుకున్నాడు. ఇంకా ఏ డిస్బర్సెమెంట్సు చేయలేదు.

ఒక స్నేహితురాలికి ఈ మాత్రం సహాయపడగల అవకాశం వచ్చినందుకు తనకి సంతోషంగా ఉంది.

గబగబా కౌంటర్‌లో మనీ పే చేసి చెప్పిన మందులు తెచ్చి వరూధినికి అందించాడు.

"థాంక్స్ హేమ్. నేను ఇంటికెళ్ళాక నీకు మనీ తిరిగిస్తాను" అంది కృతజ్ఞతగా.

"ముందు పని చూడండి"

వరూధిని లోపలికెళ్ళి నర్సుకి మందులు హేండోవర్ చేసి చిత్ర బెడ్ దగ్గరకెళ్ళింది. స్పృహలో లేని చిత్రని చూసి దుఃఖం ఆపుకోలేకపోయింది. కన్నీటిని బలవంతంగా ఆపుకుని "ఎలావుంది?" అనడిగింది డ్యూటి డాక్టర్ని.

అతను ఫర్వాలేదన్నట్లుగా తల పంకించి వెళ్ళిపోయాడు. నిస్సత్తువగా బయటకొచ్చి హేమంత్ పక్కన కూర్చుంది వరూధిని.

"ఎలావుంది?" హేమంత్ ఆదుర్దాగా అడిగాడు.

బదులుగా నీరసంగా నవ్వింది వరూధిని ఫర్వాలేదన్నట్లుగా.

"నువ్వెళ్ళు హేమంత్! మళ్ళీ రేపు ఆఫీస్‌కి వెళ్ళాలిగా!" అంది.

"ఫర్వాలేదు. ఉంటాను" అన్నాడు ఆమె పక్కనే కూర్చుంటూ.

వద్దనలేదు వరూధిని.

అవసరం అలాంటిది.

ఆమె మనసిప్పుడు ఆసరా కోరుకుంటోంది.

ఇంటి దగ్గర ముసలి తల్లి బేలగా ఒంటరిగా ఉంది. మగతోడు లేని బ్రతుకులయిపోతాయి తమవి.

ఆమె కళ్ళు వర్షిస్తున్నాయి.

"ప్లీజ్ బి కంట్రోల్ వరూధినీ!" అన్నాడు ఎలాగోలా హేమంత్.

ఆమె కళ్ళు తుడుచుకుని నవ్వడానికి ప్రయత్నించింది.

"జీవితం చిన్నది, అశాశ్వతమైందీ అని అందరూ తెగ చెబుతారు. కానీ ఎందుకిలా తాము సుఖపడకుండా ఎదుటవాడిని సుఖపడనివ్వకుండా ఇలా సేడిస్టిక్ గేమ్స్ ఆడుకుంటారు. ఉద్ధరించలేనివారు బిడ్డలకి జన్మనెందుకిస్తారు. ఎందుకిలా కన్నీటిమయం చేస్తారు!?" అంది వేదనగా.

హేమంత్ వింటున్నాడు.

ఆమెని ఓదార్చేంత వయసూ, పరిపక్వతా కూడా లేవతనికి, కానీ.. తల్లి గుర్తొచ్చింది.

నల్గురిని కన్న తన తండ్రి కూడా తల్లిని గుర్తించేవాడు కాదు ఎప్పుడూ ఆస్తి గోలే. తల్లే అన్నీ సర్దుకునేది. తెలియక తను చేసే అల్లరిని కూడా భరించేది. ఆడపిల్లలకెన్ని అవసరాలుంటాయి. అవన్ని సర్దుబాటు చేసేది. తనకి ఊహ తెలిసి తండ్రి ఏదో ఒక నెపంతో తల్లిని తిట్టడమే గాని ప్రేమగా పలుకరించడం తెలియదు. ఒక్క సినిమాకి తీసుకెళ్ళినట్లుగా కూడా చూడలేదు.

"ఏంటాలోచిస్తున్నావ్ హేమంత్?"

వరూధిని ప్రశ్నకి ఈ లోకంలో కొచ్చాడు హేమంత్.

ఏం లేదన్నట్లుగా తలాడించాడు.

"ఆ పక్కావిడ చూశావా, ఒట్టప్పుడు మా ఇంటి విషయాలన్నీ ఆవిడకే కావాలి. కొంచెం సేపు అమ్మదగ్గర ఉంటారా అని అడిగితే... వెయ్యివంకలు చెప్పింది. ఇంకెవరన్నా సహాయం చేస్తే వాళ్ళ గురించి అంతా ఆవిడకి చెప్పాలి."

"వెళ్ళి అమ్మని చూసి రమ్మంటారా?"

"ఫర్వాలేదు. వాడిప్పుడు రాడు. డబ్బు అందింది కదా!"

"గాజులిచ్చేసారా?"

వరూధిని హేమంత్ వైపు చూసి నవ్వి "తెలివైనవాడివే" అంది.

"జీతం రాలేదా?"

"అదీ తీసుకెళ్ళాడు"

హేమంత్ గుండె నొక్కేసినట్లయింది.

"కాస్సేపు పడుకో హేమంత్! అవసరమైతే లేపుతానులే" అంది వరూధిని.

"నిద్రరావడం లేదు"

"సరే ఏదన్నా చెప్పు"

"ఏం చెప్పను?"

"నీ గురించే"

"మీ ఇంటి సంగతులేం చెప్పలేదు ఎప్పుడూ"

"అంత చెప్పుకోవాల్సిన చరిత్రేంలేదు. మామూలు మధ్యతరగతి కుటుంబం. అమ్మలేదు" అన్నాడు నవ్వుతూ.

"ఇంకా...."

"ఇంకేముంటుంది. డబ్బు అవసరాలు. అదిలేక వచ్చే బాధలు, అప్పులు.. " హేమంత్ నవ్వాడు.

"అద్సరే! పెళ్ళెప్పుడు చేసుకుంటావ్?"

వరూధిని సూటి ప్రశ్నకి హేమంత్ తడబడ్డట్లుగా చూశాడు.

"అప్పుడేకాదు" అన్నాడు నసిగినట్లుగా.

"ఎలాంటమ్మాయి కావాలి?"

"ఏమీ అనుకోలేదు."

వరూధిని నవ్వింది. "చెప్పడంలేదు నువ్వు. దాస్తున్నావు కదూ!" అంది.

ఇంతలో నర్సు వచ్చి చిత్రకి స్పృహ వచ్చిందని చెప్పడంతో వరూధిని పరిగెత్తినట్లుగా లోపలికెళ్ళింది.

చిత్ర ఊరికే కదలిపోతూ "మమ్మీ మమ్మీ" అంటోంది అలా చూడగానే కన్నీళ్ళొచ్చేసాయి వరూధినికి.

"అరగంటలో రూముకి తెస్తాం. మీరెళ్ళి కూర్చోండి" అని చెప్పింది నర్సు.

వరూధిని బయటకొచ్చి హేమంత్ చేతులు పట్టుకుని "హేమ్, చిత్రకి తగ్గింది. నేనెంత వణికి పోయానో తెలుసా! చిత్ర లేకపోతే నా జీవితం ఏవిటి?" అంది ఏడుస్తూ.

హేమంత్ మాట్లాడలేక పోయాడు.

***"ప్రతి స్త్రీలోనూ తల్లి ఉంటుంది కానీ.. ప్రతి పురుషుడిలోనూ తండ్రి ఉండడు."*** అనుకున్నాడు మనసులో.

కాస్సేపటికి చిత్రని రూమ్‌కి తీసుకొచ్చారు.

హేమంత్ కూడా రూమ్‌లో కూర్చున్నాడు.

చిత్రకి ఇంకా ట్రీట్‌మెంటు జరుగుతోంది.

తెలతెలవారుతుండగా "ఇక నువ్వెళ్ళు హేమంత్. నేను చూసుకుంటానులే" అంది వరూధిని.

హేమంత్ సరేనన్నట్లుగా బయలుదేరుతుండగా "హేమ్!" అంది వరూధిని.

హేమంత్ వెనుతిరిగి చూశాడు.

"థాంక్స్ ఏ లాట్!" అంది వరూధిని.

హేమంత్ తల పంకించి బయటకి నడిచాడు.

రూమ్‌కి వస్తూ ఇంటికొకసారి ఫోను చెయ్యాలని పించింది హేమంత్‌కి.

"నాన్న ఎలా ఉన్నారో! అక్కయ్యల పరిస్థితి ఏవిటో!" ఎన్నో ఆలోచనలతో కాల్ చేసాడు.

తండ్రే ఎత్తాడు.

"నాన్నగారూ, బాగున్నారా?"

"ఏదో ఏడ్చేను. నువ్వెలా ఏడుస్తున్నావక్కడ?" అతని ధోరణి అంతే.

"బాగానే ఉన్నాను."

"అక్కయ్యలంతా బాగున్నారా?"

"ఆఁ! ఉన్నారున్నారు అంతా ఆ సరోజని కొంపకెళ్ళారు. అదేదో చచ్చి ఏడవబోయింది. వెధవ గొడవని.. వెధవ గొడవ."

ఆమాట విని కంగారు పడిపోయాడు హేమంత్.

"సరోజని ఆంటీకేమయింది నాన్నగారూ!" అన్నాడు ఆందోళనగా.

"ఏవో, ఎవడికి తెలుసు. దరిద్రపుగోల. ఏదో ఉరేసుకుని చావబోయిందట. దరిద్రపు సంత. దాన్ని చూడ్డానికెళ్ళారు" అంటూ మరోమాటకి ఆస్కారమివ్వకుండా ఫోను పెట్టేసాడతను.

హేమంత్ తల్లడిల్లిపోయాడు.

అంతే.

హేమంత్ నిలువెల్లా వణికిపోయాడు.

తను అర్జెంటుగా ఊరెళ్ళాలి.

"తమ కుటుంబాన్ని నిలబెట్టిన సరోజని ఆంటీని చూడకుండా ఎలా ఉండగల్గడం."

కానీ.. డబ్బు. జేబులో తడుముకున్నాడు. రానూపోనూ సరిపోతుంది.

హేమంత్ గబగబా రూమ్ కెళ్ళి తయారయి బాగ్ తీసుకుని బస్టాండుకి పరిగెత్తాడు.

హేమంత్‌ని చూసి బావురుమంది అతని అక్క.

"ఎంత పని చేయబోయిందిరా అత్త !?" అంది ఏడుస్తూ.

"అసలేం జరిగింది?"

"ఏవోరా ఏవీ చెప్పదు" అంది.

బావగారు మాత్రం "నువ్వు స్నానం చెయ్యి హేమంత్. తర్వాత మాట్లాడుదాం" అన్నాడు.

హేమంత్ స్నానం చేసి టిఫిన్ తిన్నాననిపించుకున్నాడు.

"కాస్సేపు బయటికెళ్దాంరా"

"నేను ముందు ఆంటీని చూడాలి"

"అదే, చూడొచ్చు"

ఇద్దరూ బయటకి నడుస్తుండగా "మన మూలంగానే సరోజనిగారికి ఈ కష్టాలు హేమంత్"

"వ్వాట్! మన మూలంగానా?" ఆశ్చర్యపోతూ అడిగాడు హేమంత్.

"అవును. పూర్తి వివరాలింకా తెలియవు. పోలీస్ కేసుకాకుండా చూసుకున్నాను. టైముకి ఆ రామలక్ష్మిగారు వెళ్ళకపోతే అంతా అయిపోయేది"

"అంటే... కొన్నాళ్ళనుండి ఆ సుబ్బారావుగాడు సరోజనిగారిని ఏడిపిస్తున్నాడట. ఆమె ఒంటరితనం అప్పు తీసుకోవడం అలుసుగా తీసుకుని వేళకాని వేళల్లో ఇంటికి రావడం... వెకిలి చేష్టలు చెయ్యడం.. లేదంటే క్షణాల్లో డబ్బు కక్కమనడం.. చూచాయగా రామలక్ష్మిగారు చెప్పడమే. సరోజనిగారు ఇప్పటికీ నోరు తెరచి ఒక్కమాట చెప్పలేదు."

"కానీ... సరోజని ఆంటీలాంటి ధైర్యస్తురాలిలా చేయడం" సందిగ్ధంగా చూశాడు హేమంత్.

బదులుగా ఆయన నవ్వి "ఆడదాని.. ధైర్యం మేకపోతు గాంభీర్యంలాంటిది. అప్పుడు వెనుక కనకారావుగారుండేవారు. ఆయన ప్రేమ ఉండేది. అదే ఆమె బలం. ఆ బలాన్ని భర్త ఇవ్వలేకపోతే.. ఆడదాని బ్రతుకిలానే అవుతుంది. ఆయన పోయాకనే ఆవిడకి అతనంటే ఎంత ప్రేమో... అర్థమవుతోంది." అన్నాడాయన.

హేమంత్ నరాలన్నీ బిగుసుకుపోయినట్లయింది.

ఆమె పరిస్థితికి తామే కారణమని తెలిసి.. సిగ్గుతో తల భూమిలోకి దిగిపోతున్నది.

ఆమె తన ఇంటిమీద భారం మోసి తమ ఇల్లు నిలబెట్టింది. ఏం చేయాలిప్పుడు.

"నువ్వేం ఆలోచిస్తున్నావో నాకర్థమవుతోంది హేమంత్. పేరుకు నేను నీ అక్క భర్తనయినా స్వంత మేనమావని. ఈ ఇంటి ఆర్థిక పరిస్థితులన్నీ నాకు తెలుసు. మనకి పరువుండొచ్చుకానీ డబ్బు లేదు. ఆ పరువుకూడా ఇన్నాళ్ళూ ఎవరి దగ్గరా అప్పుచేయకుండా బ్రతకడం వలన వచ్చిందే. చిన్నపిల్లాడివి నిన్నేమని అడగాలి. ఏం చేద్దాం?" అన్నాడాయన బాధగా.

హేమంత్ దగ్గర జవాబులేదు.

అంత డబ్బు ఒక్కసారిగా కట్టగల స్థితికాదు తనది.

"సరే! ముందెళ్ళి సరోజని గారిని పలుకరించు"

హేమంత్ సరేనన్నట్లుగా తల పంకించి సరోజని ఇంటివైపు నడిచాడు.

తలుపు తెరిచే ఉంది.

ఎవరివో మాటలు వినిపిస్తున్నాయి.

హేమంత్ ప్రాణం ఉగ్గబెట్టుకుని లోపలికి నడిచాడు.

"ఈ మాయదారి బుద్ధి నీకెలా పుట్టిందే! ముందీ రసం తాగు" అంటోంది రామలక్ష్మి.

హేమంత్‌ని చూడగానే నీరసంగా నవ్వింది సరోజని.

"రారా! నీక్కూడా చెప్పేసారా ఈ ముండలు. ఆడికి చెప్పకండే అడలి ఛస్తాడన్నాను. ఆఖరికి చెప్పేసారన్నమాట." అంది నవ్వడానికి ప్రయత్నిస్తూ.

హేమంత్ నవ్వలేదు.

రామలక్ష్మి అతనికి కుర్చీ తెచ్చి వేస్తూ "చూశావయ్యా, దాని నవ్వు. ఎప్పుడూ నేను అప్పులకొస్తానని తిట్టిపోస్తది. అదే దాని ప్రాణాన్ని కాపాడింది. నేను పంచదారకి రాకపోతే దాని ప్రాణం నిలువునా పోయేది" అంది కోపంగా.

"ఏడిసేవులేగాని ఈడిక్కాస్త కాఫీపెట్టు. ఎప్పుడొచ్చావురా నువ్వు?" అంది సరోజని.

రామలక్ష్మి వంటగదిలో కెళ్ళింది.

"ఏంటాంటీ ఈ పని?" అన్నాడు హేమంత్ కన్నీళ్ళతో.

"ఉత్తిత్తినేరా! అసలా తాడు బలంగా ఉందో లేదోనని. ఊరికే తెగిచచ్చింది" అంది నవ్వుతూ.

"చాల్లే సంబడం. ఎప్పుడూ ఇంతే. ముందు కాఫీ తాగు. అసలు సంగతి నేను చెబుతాను" అంది రామలక్ష్మి కాఫీ గ్లాసు హేమంత్‌కి అందిస్తూ.

"నోర్మూసుకుని ఇంటికెళ్ళు. నీ మొగుడీపాటికే కాఫీ కోసం నాలుక పీక్కుంటాడు" అంది సరోజని.

"సర్లే! నువ్వే చెప్పు" అంటూ వెళ్ళిపోయింది రామలక్ష్మి గ్లాసుడు పంచదార తీసుకుని.

"చెప్పాంటీ! అసలేం జరిగింది?"

సరోజని ఈసారి తలదించుకుంది.

ఆ కళ్ళవెంట నీళ్ళు జలజలా రాలేయి.

సరోజని కన్నీళ్ళు చూసి తల్లడిల్లిపోయాడు హేమంత్.

"ఏంటోరా! మీ మావయ్య చచ్చిపోయాక బ్రతుకు బలవంతంగా ఈడ్వటమేగానీ... ఏం లేదురా బతకడానికి. మీ అమ్మన్నా ఉంటే... కొంతలో కొంత బాగుండేదేమో" అంది మెల్లిగా.

హేమంత్‌కి కన్నీళ్ళొచ్చాయి ఆ మాటకి.

"కాని.. ఆ సుబ్బారావు..."

"మీ బావ చెప్పాడా... వాడుత్త ఎదవరా! ఆడికోసం ఎందుకు చస్తాను - ఆణ్ణి చంపుతాను కానీ.." అంది.

ఆ గొంతులో ఇదివరకటి ధైర్యమూ నిర్లక్ష్యమూ లేవు.

"నీతి తక్కువ ఎదవరా.. ఇంతకీ మీ మావ చేస్కాడా ఇదంతా! ఆడెందుకు ఉన్నపళంగా సచ్చి నా బతుకిట్లా నడిబజార్లో పడెయ్యాల." అంది బేలగా కనకారావు ఫోటో వైపు చూస్తూ.

"ఆంటీ, నువ్వేనా ఇలా మాట్లాడుతున్నది. వాడి డబ్బు వాడి మొహానా కొట్టేద్దాం. నేను వాడితో మాట్లాడుతాను"

"ఎక్కణ్ణుంచి తెస్తావురా?"

హేమంత్ దగ్గర సరోజని ప్రశ్నకి జవాబు లేదు.

మరోదారి కూడాలేదు - కేవలం పౌరుషం తప్ప.

"ఆంటీ, ఇలాంటి పని మాత్రం మరోసారి తలపెట్టొద్దు" అన్నాడు వేదనగా.

సరోజని మాట్లాడలేదు.

హేమంత్ బయటకి నడిచాడు - వేదనాతీతమైన ఒక నిర్లిప్తభావనతో.

**అన్యమనస్కంగా పనిచేస్తున్నాడు హేమంత్.**

డబ్బు!

జీవితాలతో ఎంతగా ఆడుకుంటుంది..!!

ఎన్ని తెలివితేటలున్నా ప్రతిభవున్నా, మంచితనం ఉన్నా.. దానిముందు ఎందుకు కొరగాకుండా పోతాయెందుకు.?

మనం తయారు చేసిన డబ్బే - మనముందు వటవృక్షంలా ఎదిగిపోయి మనతో ఆడుతుంటే నిస్సహాయంగా చూడాల్సిందేనా?

డబ్బుతో పదవుల్ని కొంటున్నారు, సీటుల్ని కొంటున్నారు బిరుదుల్ని కొంటున్నారు, పురస్కారాలు పొందుతున్నారు - చరిత్రనే మార్చేస్తున్నారు. ఇంకేమిటి మనిషి తెలివితేటలకున్న విలువ.

ఆలోచనల్ని ఎక్కడెక్కడికో పోతున్నాయి.

రమేష్ ఒకటి రెండుసార్లు హేమంత్ వంక చూసుకుంటూ అటూ ఇటూ వెళ్ళాడు కాని.. పలకరించే సాహసం చెయ్యలేకపోయాడు.

పద్మ వంకరగా చూస్తూ - ఏవో రెండు వ్యంగ్యాలు విసిరింది కానీ.. హేమంత్ అసలు వినను కూడా వినలేదు.

స్తబ్ధంగా సాయంత్రం అయిపోయింది.

నిర్లిప్తంగా ఫైలు మూసి.. ఇంటికి బయల్దేరేడు... నడుస్తూ.. బస్ కూడా ఎక్కకుండా.

''హేమ్!''

ఆ పిలుపు ఎవరిదో తెలుసు.

వెనుతిరిగి చూశాడు.

స్కూటీ మీద వరూధిని.

''ఎక్కు''

హేమంత్ మారుమాట్లాడకుండా ఎక్కాడు.

''ఇటెక్కడికి?''

''మా ఇంటికి''

''వద్దు''

''ఏం?''

''అమ్మ ఏమన్నా అనుకుంటారేమో?''

బదులుగా వరూధిని నవ్వింది.

''ఏముందని అనుకోవడాలు. మాది.. అంత కుసంస్కారమైన కుటుంబం కాదు''

''అది కాదు..'' నసిగాడు హేమంత్.

''ఏదికాదు!? మగవాడు అనగానే చెడు అర్థం ఎందుకు స్ఫురిస్తుంది. మగవాడు మన తండ్రిగా, అన్నగా, తమ్ముడిగా, పాలవాడిగా, పూలవాడిగా, వాచ్‌మన్‌గా ఎన్ని అవతారాల్లో వచ్చినా తప్పులేదు. స్నేహితుడనగానే కనుబొమ్మలు వంకరపోతాయి ఎందుకనో!'' అంది వరూధిని.

హేమంత్ జవాబివ్వలేదు.

అతని ఆలోచనలన్నీ డబ్బు చుట్టే తిరుగుతున్నాయి. ఎలా.. సరోజని ఆంటీ అప్పు తీర్చటం!?

''దిగు''

వరూధిని హెచ్చరికతో స్కూటీ దిగేడు హేమంత్. ఇల్లు చూడగానే నచ్చింది హేమంత్‌కి.

అటూ ఇటూ ఎపార్ట్‌మెంట్సు వల్ల ఇరుకులో పడింది కాని. చిన్న తోట , ముందు వరండా.. దాని నిండా పూలకుండీలు - కళగా ఉంది.

వరూధిని వెంట లోనికి సంశయంగా నడిచాడు హేమంత్.

హాల్లో ఈజీ ఛెయిర్‌లో కూర్చుని ఉంది రాజేశ్వరి - వరూధిని తల్లి.

హేమంత్‌ని చూడగానే ఆమె సాదరంగా నవ్వి ''రా బాబూ!'' అంది.

హేమంత్‌కి ఆమెకి నమస్కరించి ఎదురుగా ఉన్న సోఫాలో కూర్చున్నాడు.

''అమ్మాయంతా చెప్పింది. థాంక్స్ నీకు'' అందామె వస్తున్న కన్నీటిని ఆపుకుంటూ.

"అదేం లేదాంటీ" అన్నాడు నసుగుతున్నట్లుగా. వరూధిని మంచినీళ్ళు, దాంతోపాటు కాఫీ తెచ్చి "హేమ్ అంత మాటకారి కాదమ్మా. కంగారు పెట్టేయకు" అంది నవ్వుతూ.

"అందరూ నీలా వాగుడుకాయలుంటారా?" అందామె చిరునవ్వుతో.

"చిత్ర.. ఎలావుంది?"

"పడుకుంది. ఫర్వాలేదు. ఇందాకంతా ఆడింది" అంది వరూధిని.

"చాలా పెద్ద గండం గడిచింది." అంది రాజేశ్వరి నిట్టూరుస్తూ.

హేమంత్ కేం మాట్లాడాలో తెలీక దిక్కులు చూశాడు.

చివరికి "నేను బయల్దేరతాను" అన్నాడు నసిగినట్లుగా.

"అప్పుడేనా, భోంచేసి వెళ్ళాలి. చూడమ్మా వరూ, అబ్బాయిని నీ గదిలోకి తీసుకెళ్ళు." అంది రాజేశ్వరి.

"రా హేమ్, పైన బాగుంటుంది" అంది వరూధిని మెట్లెక్కుతూ.

హేమంత్ ఆమె వెనుక మేడమీద కెళ్ళాడు.

పైన విశాలమైన హాల్, అందులో ఇత్తడి గొలుసులతో చెక్క ఊయల, అందమైన ఇండోర్ ప్లాంట్, తంజావూరు చిత్రాలు గోడలకి ఉన్నాయి. రాక్ నిండా దేశ విదేశాల పుస్తకాలు, మరో పక్క పెయింటింగ్ స్టాండు, దానికి సగం వేసిన చిత్రం..

"మీరు ఆర్టిస్టా?" విస్మయంగా అడిగాడు హేమంత్ స్టాండు మీద ఉన్న చిత్రాన్ని చూస్తూ.

ఏదో... అన్నిట్లో వేలు పెడతాను. ఏదీ పూర్తిగా రాదు" అంది వరూధిని "కూర్చో" అంటూ.

హేమంత్ కేన్ కుర్చీలో కూర్చుంటూ చుట్టూ పరిసరాల్ని క్రీగంట గమనిస్తున్నాడు.

అక్కడ ప్రతిది కళాత్మకంగానే, సింపుల్‌గానే ఉన్నాయి.

ఇంతటి అభిరుచులున్న ఈ అమ్మాయికి ఇంత భయంకరమైన, దురదృష్టకరమైన జీవితమా!

"ఏంటాలోచిస్తున్నావ్ హేమ్, సడెన్‌గా రెండ్రోజులు కనపడలేదెందుకు?"

"ఊరెళ్ళాను"

"ఎందుకంత సడెన్‌గా?"

"ఊరికే, అందర్నీ చూడాలనిపించింది"

ఆ జవాబు సరిగా అనిపించలేదు వరూధినికి.

"ఏం జరిగింది?"

"ఏమీలేదు. ఇంటిపక్క సరోజని ఆంటీకి బాగాలేదని తెలిసి..."

"నేను నా గురించి అంతా చెప్పాను. నువ్వింకా దాస్తున్నావు.. చెప్పకూడనిదా?"

వరూధిని ప్రశ్నకి హేమంత్ కళ్ళు చెమర్చేయి.

"చెప్పకూడనిదేమీ లేదు" అంటూ అంతా చెప్పాడు హేమంత్.

వరూధిని గాఢంగా నిట్టూర్చింది "ఎంత మంచావిడ సరోజనిగారు!" అంది వేదనగా.

"ఎందుకో పదే పదే అమ్మ గుర్తొస్తోంది వరూధినీ. నాకసలే కష్టం తెలియదు. అల్లరి చేయడం తప్పా. నన్ను నాన్న కొడ్తారని అన్నీ దాచేది. అందరికన్నా చిన్నవాణ్ణని బాగా ముద్దు చేసేది. ఊహ తెలిసాక అమ్మంటే ప్రేమతోపాటు, గౌరవం, జాలి కూడా ఏర్పడ్డాయి.

అమ్మకేదన్నా చేయాలని... నా ఇంజనీరింగ్ అవ్వగానే నాతోపాటు తీసుకెళ్ళిపోవాలని ఎన్నో కలలు. కానీ ఆ అవకాశం ఇవ్వకుండానే నేను చదువు పూర్తిచేయకుండానే .... "హేమంత్ గొంతు సన్నగా వణకడం గమనించింది వరూధిని.

అతన్ని ఆత్మీయంగా ఓదార్చాలనిపించింది వరూధినికి. కానీ.. ఏం చేయాలో తోచక వాతావరణం తేలిక చేయాలనే ఉద్దేశ్యంతో "అల్లరంటే ఏం చేసేవారేంటి?" అనడిగింది.

హేమంత్ కొద్దిగా తేరుకుని "ఏవో చిలిపి పనులు. అప్పట్లో ఏం తోస్తే అది."

"ఏదీ ఒకటి చెప్పండి" అంది వరూధిని నవ్వుతూ. హేమంత్ తనలో తనే నవ్వుకున్నాడు.

"నాక్కూడా చెప్పండి. నవ్వుతాను"

"అంటే.. బాగుండదు"

"ఫర్వాలేదు"

"అప్పుడు బాగా చిన్నవాడినండి"

"అదే. చెప్పండి"

"నాకప్పుడు తొమ్మిదేళ్ళు. ఫిఫ్త్‌క్లాసేమో చదువుతుంట. మా క్లాసులో అమ్మాయిలింకా ఫ్రాకులే వేసుకునేవారు. కొంతమంది మగపిల్లలు నాకో పని అప్పచెప్పారు. నేను పొట్టిగా చిన్నగా ఉండేవాణ్ణి. అమ్మాయిలంతా నాతో బాగా ఆడేవారు. ఒకరోజు క్లాసు జరుగుతోంది. నేను అమ్మాయిల బెంచీల క్రింద పాకి వాళ్ళేసుకున్న కలర్ చెడ్డీల రంగులన్ని వీళ్ళకొచ్చి చెప్పాను. అదే వాళ్ళు నాకు అప్పచెప్పిన పని ఇక చూడండి, క్లాసయిపోయాక వీళ్ళు చేసిన అల్లరి. పంకజం ఎల్లో డ్రాయర్, వనజ పింక్, సావిత్రి బ్లాక్ అంటూ గోల చేసేసారు. చివరికి ఎంక్వయిరీ చేస్తే నా పేరు బయటపడింది"

వరూధిని నవ్వాపుకోలేకపోయింది.

"మరి.. మరేం చేసారప్పుడు?"

నన్ను క్లాసులోంచి తీసేసి. ఇంటికి రిపోర్టు చేసారు.

"అమ్మే స్కూలు కొచ్చి మాట్లాడింది. ఆ తర్వాత ఎప్పుడూ అమ్మాయిల జోలికెళ్ళలేదు." అన్నాడు హేమంత్ తనూ నవ్వుతూ.

"మొత్తానికి గ్రంధసాంగుడే మీరు!"

"అదేం లేదండీ, ఆ తర్వాత.. నేనేవో కొంటె పనులు చేసినా.. అమ్మాయిల్ని ఏడిపించలేదు. చివరికి ఇంజనీరింగ్‌లో కూడా అందరూ నాతో చాలా ఫ్రెండ్లీగా ఉండేవారు"

"ఎవర్నయినా ప్రేమించారా?"

హేమంత్ వెంటనే జవాబు చెప్పలేకపోయాడు. ఆ తర్వాత లేదన్నట్లుగా తలూపాడు.

"అయితే ప్రవరాఖ్యుడన్నమాట"

తలెత్తి చూసి. "లేదు" అన్నాడు చిన్నగా నవ్వుతూ.

"ఏంటా జవాబులు. సరే, మిమ్మల్ని ఇబ్బంది పెట్టను. ఊరికే డబ్బు గురించి బెంగపడకండి. మా ఆఫీసరొకడు ఎప్పుడూ అంటుండేవాడు. మనీ మస్ట్ బి అండర్ సర్క్యులేషన్. ఇట్ మస్ట్ నాట్ బి స్టాగ్‌నేటెడ్ అని. మీ అవసరాలకి అందుతుంది డబ్బు. డోంట్ వర్రీ! రండి భోజనానికి" అంటూ లేచింది.

ఆమెని అనుసరిస్తూ ఎదురుగా టేబుల్ మీదున్న గజ్జెలవైపు చూసి "మీరు డాన్సరా?" అనడిగాడు ఆశ్చర్యంగా.

"ఏదో కొద్దిగా నేర్చుకున్నాను. భరతనాట్యం.. బాధ కలిగినా, ఆనందం కలిగినా ఈ హాలు ఊగిపోతుంది." అంది నవ్వుతూ.

"హేమంత్ నవ్వాడు."

"పాత కట్టడం కదా! తట్టుకుంటున్నది కాబోలు" అన్నాడు చమత్కారంగా.

"ఫర్వాలేదే?" అంది వరూధిని తనూ నవ్వుతూ భోజనాలనంతరం చిత్రనొక్కసారి చూసి రాజేశ్వరిగారికి చెప్పి బయటకొచ్చాడు.

"నేను డ్రాప్ చెయ్యనా?"

"వద్దు. ఆటోలో వెళ్ళిపోతాను" అన్నాడు హేమంత్.

"డబ్బు గురించి వర్రీకావద్దు. ఏ సమస్య అయినా అలానే ఉండిపోదు" అంది వరూధిని.

హేమంత్ తలూపి బయల్దేరాడు.

ఆ వారం అంతా హేమంత్ పరధ్యానంగానే గడిపాడు. వరూధినిని అప్పుడప్పుడూ కలిసినా అతని ఆలోచనలు అలానే ఉన్నాయి. అంత డబ్బెలా? రమేష్‌ని అడగడం ఇష్టంలేదు. వెంటనే పద్మకి చెబుతాడు. పని జరగకపోయి అవమానం మిగులుతుంది.

టాంక్‌బండ్ బెంచీ మీద ఆలోచిస్తూ సిగరెట్ కాలుస్తున్నాడు.

"ఈ అలవాటు కూడా ఉందా? ఇదివరకెప్పుడూ చూడలేదే?"

హేమంత్ వరూధిని మాటకి ఉలిక్కిపడి సిగరెట్ పడేసాడు.

వరూధిని పక్కనే కూర్చుని "సిగరెట్లు కాలిస్తే డబ్బులొస్తాయని ఎవరైనా చెప్పారా?" అంది.

"లేదు.. లేదు.. ఏదో తోచక"

"కాని. అలా ఎవరైనా చెప్పుంటే.. అది నిజమే" అంది నవ్వుతూ.

హేమంత్ అర్థం కానట్లుగా చూశాడు.

"అవును. ఇదిగో డబ్బొచ్చేసింది" అంటూ ఒక పేకెట్ అతని చేతిలో పెట్టింది.

"ఏంటిది? ఎక్కడిది?" అన్నాడు హేమంత్ ఆ పేకెట్ అందుకోకుండా.

"ఎక్కడిదయితేనేం. డబ్బు డబ్బే. ముందెళ్ళి సరోజనిగారి పరువు కాపాడు."

"వద్దు వరూధినీ! మొన్న చిత్ర వైద్యానికే చాలా కష్టపడ్డారు. ఇప్పుడెక్కణ్ణుంచి తెచ్చారింత డబ్బు?"

"చూడు మిష్టర్ హేమంత్. డబ్బు ఒక ప్రవాహం లాంటిది. దాన్ని టైముకి మనం అందుకోకపోతే అది మరో వైపు పోతుంది. ఎవడో అదృష్టవంతుడు దాన్నందుకుంటాడు. కాబట్టి తీసుకో. ఎక్కడిది బ్లాకా, వైటా. అంటూ యక్షప్రశ్నలెయ్యకు. అఫ్‌కోర్సు వైటే" అంటూ బలవంతంగా అతని చెయ్యి తెరచి పేకెట్ చేతిలో పెట్టింది.

"ఎంత?" నసిగాడు హేమంత్.

"నీ అవసరానికి సరిపడినంత. రాత్రికి బస్సెక్కు"

హేమంత్‌కి సిగ్గుగా ఉంది. ఆ సిగ్గుని మించిన అవసరమూ ఉంది.

కానీ.. తన జీవితంలో ప్రవేశించిన స్త్రీలందరూ ఎంత ఉత్తములు. తన తల్లి, సరోజనీ ఆంటీ, వరూధిని... ఎందుకిలా తనేం ఉపకారం చేయకుండానే.. ఇంతగా ప్రేమిస్తున్నారు. తనకింతగా సహాయపడుతున్నారు.

"ఆలోచనల్ని మాని బయల్దేరండి. ఇదిగో టిక్కెట్టు" అంటూ టిక్కెట్టు చేతిలో పెట్టింది వరూధిని.

"కాని.."

"కానీలు, అర్థణాలు ఎప్పుడో అవుడ్డేటెడ్ అయిపోయాయి. వెళ్ళండి హ్యరీ అప్" అంది వరూథిని లేచి నిలబడుతూ.

అతన్ని రూమ్ దగ్గర వదిలేసి "జాగ్రత్త! బస్సుల్లో దొంగలెక్కువయిపోయారు" అంటూ హెచ్చరించింది వరూథిని.

"థాంక్ యూ వరూథినీ! థాంక్సేలాట్!" అన్నాడు హేమంత్ గొణుగుతున్నట్లుగా.

ఎదురుగా నంగనాచిలా కూర్చున్నాడు సుబ్బారావు.

హేమంత్.. అతని మామయ్య, రామలక్ష్మి భర్త రాఘవరావు, రామలక్ష్మి మరో పక్కన కూర్చున్నారు.

"డబ్బు లెక్క చూసుకో, పీనాసి ఎదవా!" అంది సరోజని జుట్టు ముడేసుకుంటూ.

అందర్నీ చూసి వెయ్యేనుగుల బలం వచ్చేసింది సరోజనికి.

సుబ్బారావు లెక్కచూసుకుని "సరిపోయిందక్కా" అన్నాడు ఎంతో వినయంగా.

"ఛీ! నీ బతుకు చెడా! అప్పుడే అక్కా అంటావు, అమ్మా అంటావు. చేతులు పట్టుకుంటావు. ఏం బతుకురా నీది!? తప్పయినా ఒప్పయినా దానికో ధర్మం ఏడవాలిరా గాడిదా!" అంది సరోజని గయ్యిమని లేస్తూ.

"పోనీలే ఆంటీ! వదిలెయ్యండి." అన్నాడు హేమంత్.

"ముందింటి కాగితాలివ్వు" అన్నాడు హేమంత్ మావయ్య.

సుబ్బారావు కాగితాలందించాడు.

అన్నీ సరిచూసుకుని "ఇంక బయల్దేరు" అన్నాడాయన.

"వస్తానక్కా!" అంటూ లేచి నిలబడ్డాడు సుబ్బారావు.

"రాకు. ఇకెప్పుడూ ఈ ఇంటి ఛాయిలకే కాదు - ఈ వీధిలో నడిచినా కాళ్ళిరగ్గొడతాను" అంది సరోజని.

"సర్లే అక్కా!" అన్నాడు సుబ్బారావు వెళ్తూ.

"చూడండి సుబ్బారావుగారూ! అవసరానికి డబ్బిచ్చారు. థాంక్స్. నిజానికి అది నా అవసరం. దాన్ని అలుసుగా తీసుకుని పిచ్చి వేషాలేస్తే.. ప్రాణానికే ముప్పు. ప్రాణం పోయాక ఏం చేసుకుంటారండీ డబ్బు? మనుషులు మనుషుల్లా ప్రవర్తిస్తే బాగుంటుంది కదా!" అన్నాడు హేమంత్.

"నిజవేనబ్బాయీ! వస్తా" అంటూ వెళ్ళిపోయాడు సుబ్బారావు.

"దొంగ సచ్చినోడు" అంది సరోజని కోపంగా.

"మరి.. మేం కూడా వెళ్ళొస్తాం" అంటూ అందరూ బయల్దేరు.

"నువ్వుండరా!" అంది సరోజని హేమంత్‌ని.

"సరే.. నువ్వు మాట్లాడిరా!" అంటూ హేమంత్ మామయ్య వెళ్ళిపోయాడు.

"ఎక్కడిదిరా అంత డబ్బు?"

సరోజని ప్రశ్నకి తలదించుకున్నాడు హేమంత్.

"నిన్నేరా.. ఎక్కడిదంత డబ్బు?" అంటూ హేమంత్ భుజాలు పట్టి కుదిపింది సరోజని.

"ఒక దేవత ఇచ్చింది"

ఆ జవాబు విని సరోజని తెల్లబోయి చూసింది.

"దేవతా?"

"అవునాంటీ అవసరానికి ఆదుకున్న వాళ్ళని దేవతలేగా అంటాం"

"ఎవర్రా, కొంపదీసి ప్రేమించేసేవేంటి?"

"అవును"

సరోజని అమాంతం హేమంత్ కాళ్ళ దగ్గర కూలబడి "ఏంట్రా ఇదంతా నిజవేనా.. ఎవరాపిల్ల? బాగుంటుందా?" అంది.

"బాగుంటుంది. నీలా!"

"ఎదవమాటలు మాను. సరిగ్గా చెప్పు"

"అవునాంటీ. నీలానే చాలా మంచిది. కపటం తెలియనిది. మంచితనాన్ని మించిన అందం ఇంకేముంటుంది."

"అవున్లే మీమావకూడా ఇలానే అనేవాడు. అద్సరే! మరీ సంగతి ఇంట్లో చెప్పావా?"

"లేదు. అసలా అమ్మాయికే చెప్పలేదు" అన్నాడు హేమంత్ మెల్లిగా.

"ఏడిసినట్టుంది నీ యవ్వారం, ఏం మగాడివిరా! ఆ మాత్రం చొరవదీసుకు చెప్పలేవూ. ఈలోపన ఇంకెవడన్నా చెప్పి ఎగరేసుకుపోతే..!"

"ఆ పరిస్థితి రాదు. ఆల్రెడీ ఆ అమ్మాయికి పెళ్ళయింది."

"ఏంటీ ... పిచ్చిగానీ ఎక్కిందా నీకు?" సరోజని తెల్లబోతూ అడిగింది.

"ఏమో మరి?"

**సరోజని అసహనంగా** లేచి నిలబడింది.

ఆ వెంటనే బెదిరిస్తున్నట్లుగా వేలూపుతూ "నాతో పరాశికాలు కాదు ఎదవకానా! చెడ్డీ తొడిగి వళ్ళో పెట్టుకుని పెంచినదాన్ని. నిజం చెప్పు. ఆ పిల్లకి పెళ్ళయిందా?" అంది ఆవేశంగా.

హేమంత్ తన పెద్ద పెద్ద కళ్ళతో సరోజని వైపు చూసి "ఎప్పుడన్నా నీతో జోక్ చేసేనా ఆంటీ?" అన్నాడు నెమ్మదిగా.

సరోజనికి అంత ఆవేశం దిగిపోయింది.

చప్పున నీళ్ళు జల్లిన పాలలా బుస్సున కిందకి దిగిపోయి హేమంత్ కాళ్ళ దగ్గర కూలబడి "ఇదేంట్రా సన్నాసీ! అసలే నీ బాబు అగ్గిలేకుండానే మండే గుగ్గిలం. అసలు ప్రేమ పెళ్ళికే ఒప్పుకుని సావడు. మళ్ళీ ఆ పిల్లకి పెళ్ళయిందంటున్నావు. ఆడేవయ్యాడు?" అంది.

హేమంత్‌కి ఎక్కడో చోట మనసు విప్పాలని వుంది.

దానికి తగిన వ్యక్తి సరోజని ఆంటీ కాక మరెవరు, అభ్యుదయ భావాలతో పాటు, పరిస్థితులు, బలాలు, బలహీనతలు తెలిసిన మనిషి.

అందుకే ఎలాంటి తటపటాయింపు లేకుండా అంతా చెప్పేసాడు.

ఆ పైన తలదించుక్కూర్చున్నాడు.

సరోజని మాట్లాడకుండా మౌనంగా కూర్చోవటం అతనికి ఆశ్చర్యమేసింది.

తల తిప్పి చూశాడు.

సరోజని కళ్ళనిండా నీళ్ళు.

"అయ్యో, అంత - చిన్న వయసులో ఇన్ని బాధలా? ఏ(టా ఈ దేవుడు.. అసలున్నాడంటావా?" అంది మెల్లిగా.

హేమంత్ అలానే మౌనంగా కూర్చున్నాడు.

"కాని.. ఏవంతూ! నువ్వు నువ్వు కష్టాల్లో ఇరుక్కుపోతున్నావురా. నాకు తెలుసు... నాకు తెలుసు. నీ బాబు రాద్ధాంతం చేస్తాడు. చాలా గొడవలయి పోతాయిరా. నాకెందుకో. ఏంటో ఏం చెప్పను. వద్దురా! ఆ పిల్లకేం చెప్పకు. ఆ పిల్ల మానాన ఆ పిల్లని బతకనియ్యి వదిలెయ్యి" అంది హీనస్వరాన.

హేమంత్ సరోజని వైపు అదోలా చూశాడు.

"కాని.."

"కాని" రెట్టించింది సరోజని.

"నేను.. నేను, ఆమె లేకుండా కష్టమాంటీ! నేనింకెవర్నీ పెళ్ళి చేసుకోలేను. "

సరోజని కళ్ళు పెద్దవి చేసి చూసింది.

"అంటే. అంటే గట్టిగా అనేసుకున్నావన్నమాట."

హేమంత్ తల పంకించాడు.

"మరి నీ బాబుని ఎదిరించగలవా?"

"నచ్చజెప్పడానికి ప్రయత్నిస్తాను"

"ఓ యబ్బ! ఈ మగడాబుసరి మాను. పేమించేటప్పుడు తారాజువ్వలా దూసుకెల్లడం.. పెళ్ళిదగ్గర ఎనకడుగులెయ్యటం. ఎన్ని కతలు సూడలేదురా! నీ బాబు సస్తే ఒప్పుకోడు, అలా అనుకుని అప్పుడేం చేయాలో మాటాడు. దేనికన్నా సిద్దం అంటేనే ఆ పిల్లకి సెప్పు. అనవసరంగా సినిమా పాటలు పాడి ఆ పిల్ల మనసు కెలకకు. అసలే దెబ్బతిని వుంది." అంది సరోజని కుండ బద్దలు కొట్టినట్లుగా.

"నేను.. నేను.. అంతా ఆలోచించే చెబుతున్నాను ఆంటీ. అలాంటి పరిస్థితి వస్తే నేను నాన్నని ఎదిరించడానికి సిద్ధంగానే వున్నాను." అన్నాడు హేమంత్.

"సరే ముందాపిల్ల వుద్దేశ్యమేంటో తెలుసుకో."

హేమంత్ తల పంకించాడు.

"జాగ్రత్త. ఏ సంగతీ నాకు రాయి. లేకపోతే రామలక్ష్మి యింటికి ఫోన్ చెయ్యి. పంచదార కొనుక్కోదుకానీ ఫోనేయించుకుంది.. బడాయి" అంది సరోజని.

హేమంత్ లేచి నిలబడ్డాడు.

"వస్తానాంటీ"

"జాగ్రత్త! ఎల్లేటప్పుడు కనబడు. నెంబరిస్తా" అంది సరోజని తను లేచి నిలబడి.

హేమంత్ వెళ్తున్న వైపు జాలిగా చూస్తూ 'బంగారంలాంటి పిల్లాడు నలిగిపోతాడే' అనుకుంది బాధగా.

ఆ సాయంత్రం హేమంత్ రాక కోసం నిజంగానే ఎదురుచూస్తోంది వరూధిని.

ఈ నాలుగురోజులు నాలుగు యుగాల్లా గడిచాయామెకు. తనకి తెలియకుండానే తాను హేమంత్ పట్ల బాగా స్నేహభావం పెంచుకోవడం అతనికోసం ఎదురు చూడటం... ఆశ్చర్యంగా వుందామెకు. ఆఫీసులో తనెవరితోనూ ఎక్కువగా మాట్లాడదు.

చాలామందికి అక్కడ ఎకడమిక్ క్వాలిఫికేషన్సు వున్నాయిగాని... తమ సహజ సిద్ధమైన బలహీనతల్ని అధిగమించడానికి అవేమాత్రం వుపయోగపడకపోవడం ఆమెని ఆశ్చర్యానికి గురి చేస్తుంది.

ఎవరైనా ఒక మంచి డ్రెస్సు వేసుకు వస్తే వారిని అభినందించక పోగా ఏదో ఒక రకంగా హేళన చేసి సంతోషపడతారు. ఎందుకలా!? వాళ్ళు తమకి నచ్చే కదా కొనుక్కుంటారు. అప్పుడు 'బాగుంది. ఈ డ్రెస్సులో బాగున్నారు' అని అభినందిస్తే ఏం పోతుంది? అది వారికెంత ఆనందాన్నిస్తుంది. ఒక మంచిమాట వారి హృదయాల్ని రంజింపజేయటమేగాక తిరిగి వాళ్ళు మనల్ని ప్రేమిస్తారు.

కానీ అలా చేయరు. వెనకాల ఏదో చెప్పుకోవాలని ప్రయత్నిస్తారు. ఈ అసూయని, అకారణ ద్వేషాన్ని జయించలేక ఎప్పుడూ పురుషుల మీద దాడి చేస్తారు. వాళ్ళ వల్లే చాలా అన్యాయానికి గురయిపోయినట్లు వాపోతుంటారు. మంచి చెడు రెండు జాతుల్లోనూ వుంటాయి. ఇలా ఆలోచిస్తుంది వరూధిని.

అందుకే అనుకోని విధంగా హేమంత్‌కి దగ్గరయింది. కానీ ఇది స్నేహమేనా? అంతకు మించి... తల విదిలించుకుందొక్కసారి.

లేదు. స్నేహమే. తనకి తనే జవాబు చెప్పుకుంది.

హేమంత్ సరాసరి కొన్ని స్వీట్స్ తీసుకుని తమ ఇంటికే రావడం ఆశ్చర్యాన్ని కలిగించింది వరూధినికి. చాలా సంతోషం వేసింది కూడా.

"హలో హేమ్! ఎప్పుడు రావడం" అంటూ ఆనందంగా ఆహ్వానించింది.

"ప్రొద్దుట. ఆఫీసుకెళ్ళి ఇటొస్తున్నా!" అన్నాడు. స్వీట్సు పాకెట్టు టేబుల్ మీద పెడుతూ.

"ఈ ఫార్మాలిటీస్ ఏమిటి?" అంది వరూధిని నవ్వుతూ.

"అదేం లేదు. నేనొస్తుంటే సరోజిని ఆంటీ ఇచ్చింది. తనే స్వయంగా చేసింది. "

"ఓహో! మరి మీకోసం చేసి వుంటారు కదా!" అంది వరూధిని పాకెట్ విప్పుతూ.

"కాదు. నీకోసమే ఇవ్వమని చెప్పింది."

వరూధిని ఆశ్చర్యంగా కళ్ళెగరేసి "నా గురించి చెప్పేసారా! ఏమని? ఆడరౌడీ అనా!" అంది నేతి అరిసె ఒకటి తీసుకుని తింటూ.

హేమంత్ ఆమెనలానే చూస్తున్నాడు.

ఆమె ప్రశ్నకి బదులుగా చాలా చెప్పాలని వుంది. మాటలు గొంతులో గంతులేస్తున్నాయి. ఎంతో ఉద్వేగానికి గురవుతున్నాడు.

కానీ అన్నీ బయటకు రాకుండానే గొంతులోనే నేలరాలకుండానే ఆవిరవుతున్న మంచుబిందువుల్లా హరించుకుపోతున్నాయి.

"అయ్యో, అబ్బాయికి పెట్టకుండా నువ్వే తినడమా! పిల్ల తల్లివయినా పిల్ల చేష్టలు పోలేదు" అంటూ వచ్చింది రాజేశ్వరి.

ఆవిణ్ణి చూసి లేచి నిలబడి నమస్కరించాడు హేమంత్.

"కూర్చోబాబూ, ఎవరికో బాగాలేదని వెళ్ళావట, బాగున్నారా అందరూ?"

హేమంత్ బాగున్నట్లుగా తల పంకించాడు.

''పిల్ల తల్లినయితే పిల్లని కానా? ఒక బిడ్డని కనినంత మాత్రాన ముసలితనం వచ్చేస్తుందా? చెప్పు హేమంత్'' అంది వరూధిని కోపం నటిస్తూ.

''సరే, అబ్బాయికి కూడా పెట్టు'' అంది రాజేశ్వరి.

''ఆ డ్యూటీ నీది'' అంది వరూధిని కదలకుండా కూర్చుని.

హేమంత్ ఆమెని కొత్తదానిలా చూస్తూ కూర్చున్నాడు.

రాజేశ్వరి లేచి వెళ్ళబోతుంటే ''వద్దండి. నేను టీ కూడా తాగే వచ్చాను. చిత్ర ఏది? ఎలా వుంది?'' అని అడిగాడు హేమంత్.

''పడుకుంది. మధ్యాహ్నం నిద్రపోలేదు'' అంది రాజేశ్వరి.

రాజేశ్వరికి కూడా హేమంత్ రాక ఆనందంగానే ఉంది. ఎంతోమంది మధ్య గౌరవ మర్యాదలు పొంది ఇప్పుడిలా ఏకాకులుగా బ్రతకడం ఆమెకెంతో దుఃఖాన్ని కలిగిస్తుంటుంది. ఎవరైనా ఒక్కరు తమకి అండగా, ఆప్యాయంగా నిలబడాలని ఆమె కోరిక. అందుకే వరూధినికి మళ్ళీ పెళ్ళి చెయ్యాలని రమేష్‌బాబు సంబంధం చూసింది. అదలా బెడిసి పోవడం బాధ కలిగిస్తోంది కూడా. హేమంత్‌ని చూసినప్పటినుండి ఏవేవో ఆశలు. ఆశలతో తీగలు సాగడం మనసు నైజం. అది యదార్థ జీవితంలో జరుగుతుందో లేదో అది వేరే సంగతి. చిన్నపాటి ఆశే కదా జీవితాల్ని ముందుకి నడిపించేవి. హేమంత్ పరిచయంనాటి నుండి కూతురి ప్రవర్తనలో మార్పు ఆమె దృష్టిని దాటిపోలేదు. ఆమెలోని వుత్సాహాన్ని పసిగడుతూనే వుంది.

పెళ్ళయిందని ఒక కూతురు వుందని తప్పిస్తే తన కూతురికేం లోపం వుంది. ఒక కన్నెపిల్లకన్నా ఎన్నో గొప్ప లక్షణాలున్నాయి. కానీ అది ఒకటిచాలుగా అన్నిటినీ తుడిచిపెట్టడానికి.

రాజేశ్వరి మనసు ఉసూరుమంది. అయినా ఏదో ఆశ. అందుకే వాళ్ళు మాట్లాడుకోవాలని పనివున్నట్లు లోపలికి వెళ్ళింది.

''ఊఁ, మొద్దబ్బాయిలా కూర్చున్నావేంటి? ఏవన్నా చెప్పు. సరోజని ఆంటీ ఎలా వున్నారు? ఆ రోగ్ అప్పు తీర్చేసారా? వడ్డీగా నాలుగంటించి రావాల్సింది'' అంది కజ్జికాయ తీసుకుంటూ.

''అదేంటలా అమ్మోరిలా తింటున్నావ్?'' ఆశ్చర్యంగా అడిగాడు హేమంత్.

''మరి తినడానిక్కాదా తెచ్చింది'' అంది వరూధిని ఇంకా ఆశ్చర్యంగా.

హేమంత్ నవ్వి ''తిను తిను'' అన్నాడు.

''చెప్పు సరోజనీ ఆంటీ గురించి. ఆమె హేపీనా?'' అంది వరూధిని కజ్జికాయ కొరుకుతూ.

''చాలా!''

''పోనీలే వాడి న్యూసెన్స్ వదిలింది. పైకెళ్దామా? ఈ రోజు పౌర్ణమట. మా బాల్కనీ నుండి చంద్రుడు భలే కనిపిస్తాడు'' అంటూ లేచింది వరూధిని.

ఆ అవకాశం కోసమే చూస్తున్న హేమంత్ చప్పున లేచి నిలబడ్డాడు.

''అమ్మా, మేం పైకి వెళ్తున్నాం. వంటయ్యాక పిలువు. హేమంత్ భోంచేసి వెళ్తాడు'' అని చెప్పి పైకి దారి తీసింది వరూధిని. వెంట నడిచాడు హేమంత్.

పైకి వెళ్ళగానే ఆశ్చర్యానికి లోనయ్యాడు హేమంత్. పైన సెటప్పంతా మారిపోయి వుంది. కొత్త కర్టెన్స్, వేరే బొమ్మలు - సోఫాసెట్ స్థానం మారింది. కొత్త ఇండోర్ ప్లాంట్స్....

''ఏంటంతా మార్చేసావు?''

"అవును హేమ్! నాకెప్పుడూ ఒక్కలా వుంటే బోర్ కొడుతుంది. అందుకే తరచూ హాల్ డెకరేషన్ మార్చేస్తుంటా" అంది కూర్చుంటూ.

హేమంత్ కూర్చున్నాడు.

"ఇప్పుడు చెప్పు. అమ్మ వుంటే నీకు ఫ్రీగా వుండదని పైకి తీసుకొచ్చా!" అంది వరూధిని.

హేమంత్ ఆమెవైపు ఆశ్చర్యంగా చూశాడు. తన మనసు గ్రహించినట్లుగా మాట్లాడుతోంది వరూధిని.

"నిజంగా ఈసారి చాలా బోర్ కొట్టింది హేమ్. నువ్వులేని వెలితి బాగా తెలిసింది" అంది వరూధిని మళ్ళీ.

నిజంగా వరూధిని కూడా తనలా..!!??

"చెప్పవేంటి అలా బిగుసుక్కూర్చుంటే కాలం పరిగెత్తుతుంది. జీవితాలయిపోతాయి"

హేమంత్ ఇంకా ఆశ్చర్యపోయాడు.

"వరూధినీ!" అన్నాడు చివరకెలానో గొంతు పెగల్చుకుని.

వరూధిని అతనివైపాశ్చర్యంగా చూసింది.

"నీకోసంగతి చెప్పాలి"

"చెప్పమనే అడుగుతుంట"

"చెప్పాక నువ్వు నన్ను ఏమీ అనకూడదు" చిన్నగా సణిగాడు హేమంత్.

"ఏమీ అనను. కాకపోతే చేతిలో వున్నది విసిరేస్తాను" అంది చేతిలో అప్పటిదాకా గుండ్రంగా తిప్పుతున్న టెన్నిస్ బాల్ని చూపిస్తూ.

"అదే భయం నీతో"

"అసలేంటిది?"

"ఏంటంటే.. నీకంటే ముందు నీగురించి సరోజని ఆంటీకి చెప్పాను"

వరూధిని ఈసారి మాట్లాడలేదు. హేమంత్ వాలకం చూస్తే మేటరేదో సీరియస్సే అన్నట్లర్థమవుతోంది.

అందుకే అలానే చూస్తూ కూర్చుంది.

"నాకెలా చెప్పాలో కూడా తెలియడం లేదు. నీ పెళ్ళిగురించి మళ్ళీ ఆలోచించలేదా? రమేష్ బాబు సంబంధం చెడిపోయాక ఇంకెవర్ని చూడలేదా?" మెల్లిగా ఒక్కొక్క మాట కూడదీసుకుంటూ అడిగాడు హేమంత్.

వరూధిని అతని ప్రశ్నకి తెల్లబోయింది.

మనసులో ఏవో ప్రకంపనలు మొదలయ్యాయి.

తీపి గుర్తులకన్నా చేదు అనుభవాలే ఎక్కువ. కలలకన్నా కన్నీళ్ళే ఎక్కువ.

ఎర్రబడిన ఆమె కళ్ళవైపు చూడలేదు హేమంత్. "చాలా జీవితం ముందుంది. ఒక చేదు అనుభవమైందని అంతా అలా వుండదు. నువ్వు మళ్ళీ పెళ్ళిచేసుకుంటే బాగుంటుందని.. అని అనుకుంటున్నాను."

వరూధిని పెదవులు వణుకుతున్నాయి.

కాని... వాతావరణం మార్చాలని "ఏంటీ వూరెళ్ళాక పెళ్ళిళ్ళ పేరయ్య అవతారం ఎత్తావా? కొంపదీసి నాకు సంబంధంగానీ చూశావేంటి?" అంది నవ్వడానికి ప్రయత్నిస్తూ.

హేమంత్‌కి ఎలా తన మనసుని తెలియబర్చాలో తెలియడంలేదు.

"చూశాను" అన్నాడు తలెత్తి చిన్నగా నవ్వుతూ.

"కొంపతీసి ఆ సుబ్బారావుగాడు కాదుకదా!?"

వరూధిని మాటలకి హేమంత్ నవ్వాడు.

"నాగురించి అంత సీరియస్‌గా ఆలోచించకు. ఇప్పుడంత అర్జెంటుగా పెళ్ళిచేసుకోవాలని అనుకోవడంలేదు. పెళ్ళి నాకు నామీద పెత్తనం చేయడానికి ఒక అధికారిని తెచ్చుకోవడమే. హాయిగా వుండలేక ఈ బాదరబందీ దేనికి?" అంది వరూధిని.

"అందరూ అలా ఎందుకుంటారు వరూధినీ!"

"ఎందుకుండరో చెప్పు. పెళ్ళి అనగానే చాలామంది మగవాళ్ళకి తాను భార్య మీద పెత్తందారి అనే స్ఫురణకొస్తుంది గాని.. తాను ఆమెకన్ని విధాల ఆదరణగా వుండి ఆమె బాధ్యత స్వీకరించే వ్యక్తినని అనిపించదు. అందులో ఇలాంటి రెండో పెళ్ళి అమ్మాయిని చేసుకోవడం చాలా ఔదార్యమని, జాలిచూపి ఆమెని వుద్ధరించాననే భావనతో క్షణక్షణం 'ఏడుస్తుంటారు కొందరు."

"అందరూ అలా వుండరు"

"అందుకని లాటరీ వెయ్యనా? వద్దు హేమంత్. అందులో చిత్రని తన కన్నకూతురిలా చూస్తే వ్యక్తి వుంటాడనుకోను."

"ఒకవేళ వుంటే?"

వరూధిని ఈసారతనివైపు ఆశ్చర్యంగా చూసింది.

"చాలా గట్టిగానే సంబంధం వెదికి పట్టుకుని వచ్చినట్లున్నావు. ఇంతకీ ఎవరాపెళ్ళికొడుకు? కాస్సేపాడుకుంటాను" అంది వాతావరణాన్ని తేలిక చేయడానికి ప్రయత్నిస్తూ.

"వంటయింది. వస్తారా?" రాజేశ్వరి పిలుపుతో ఆ సంభాషణ అక్కడితో తెగిపోయింది.

ఇద్దరూ క్రిందకి వచ్చారు.

చిత్రని చంకన వేసుకుని ఇద్దరికీ వడ్డించింది రాజేశ్వరి.

చిత్ర అతన్ని చూసి నవ్వి చేతులు చాపుతుంది.

హేమంత్ చిత్రని ముద్దుపెట్టుకుని భోజనం కానిచ్చాడు.

హేమంత్ బయల్దేరుతుంటే అతనితోపాటు బయటకి వచ్చింది వరూధిని.

అతను గేటు దాటుతుంటే అడిగింది వరూధిని. "ఇంతకీ ఎవరా తలమాసిన పెళ్ళికొడుకు? పేరు చెబితే రాత్రి కాసిని కలలన్నా కంటాను కదా!" వెన్నెల్లో ఆమె నవ్వు తళుక్కున మెరిసింది.

హేమంత్ తలెత్తి ఆమెవైపు చిరునవ్వుతో చూసి చటుక్కున ఆమె చేతినందుకుని "ఆ తలమాసినోడు హేమంతే!" అంటూ ఆ చేతిని ముద్దుపెట్టుకుని వదిలేసి వేగంగా ముందుకి సాగిపోయాడు.

వరూధిని తెల్లబోయిందా చర్యకి!!

ఇదిమిద్ధంగా 'ఇదీ' అని చెప్పలేని భావప్రకంపనలకి లోనవుతూ.

**గేటు తలుపుకి తాళం వేయకుండా,** ఇంటి మెయిన్ డోరు గడియ వేయకుండా లోనికి అదోలాంటి ట్రాన్స్‌లో వెళ్తున్నట్లుగా వున్న కూతుర్ని ఆశ్చర్యంగా చూసింది రాజేశ్వరి.

"ఏంటమ్మా అబ్బాయి వెళ్ళాడా?" అనడిగింది.

వరూధిని ఏమీ జవాబివ్వకుండా గదిలోనికి వెళ్ళిపోయింది.

రాజేశ్వరి తెల్లబోతున్నట్లుగా తన గదిలోకి వచ్చింది.

చిత్రని సహజంగా రాత్రి ఎంత లేటయినా తన గదిలోకి తీసుకెళ్ళడం వరూధినికి అలవాటు.

"మంచి నిద్రలో వుంది, ఈ పూటకి నా దగ్గర పడుకోనివ్వవే!" అని బ్రతిమిలాడినా వరూధిని వినేదికాదు. అలాంటిదీరోజు కూతుర్ని కూడా తీసుకెళ్ళలేదు.

ఏం జరిగిందసలు? మళ్ళీ కూతురి గదిలోకి తొంగి చూసింది.

వరూధిని బ్లాంకెట్ కప్పుకుని పడుకుంది.

రాజేశ్వరి తలుపు దగ్గర కేసి తన గదిలోకెళ్ళి పోయింది. బ్లాంకెట్‌లో వరూధిని చీకటిలో ఎటో చూస్తోంది.

ఏదో ప్రకంపనలకి లోనవుతోంది మనసు.

హేమంత్ అలా ఒక్కసారిగా ఉరుములేని పిడుగులా అంత మాటనేసాడేమిటి?

ఎంత అమాయకంగా, ఆడపిల్లలా సిగ్గుపడుతూ మొగమాటంగా మాట్లాడేవాడు.

ఒక విధంగా తానే చాలా చొరవగా ప్రవర్తించేది. కానీ.. ఆ చొరవలో తానెప్పుడూ మరో భావాన్ని ప్రకటించలేదే?

మరెందుకిలా?

ఒక విధంగా తానూ తనకి తెలియకుండా అతని స్నేహాన్ని అతని సాన్నిధ్యాన్ని కోరుకుంటున్న మాట వాస్తవం. కానీ.. దాన్నిలా ప్రేమకి దారి తీయించాలని తానాశించలేదు.

'లేదా?' ఆమె మనసు ఆమెనే అపహాస్యం చేసింది.

వరూధిని అతను ముద్దుపెట్టి వదిలేసిన చేతిని చూసుకుంది పదే పదే!

ఏవో ప్రకంపనలు.

నిజానికిది తనకి మొదటి పురుష స్పర్శకాదు!

కాని.. ఆ వివాహంలో ఆ స్పర్శలో తన మనసు పులకించింది లేదు.

అదో తంతులా జరిగిపోయింది.

హృదయానికి దగ్గరకి రాని తతంగమది.

ప్రేమరాహిత్యమైన పెళ్ళి..

పులకింత లేని ఒక సమాగమం.. ఒక వ్యభిచారంలా.

ఫలితంగా ఒక బిడ్డకి తల్లయింది.. లోకానికి చూడటానికి ఒక వ్యక్తికి భార్యయింది. అంతే!

తాను ఎంతో భావనలతో, ఆశలతో అల్లుకున్న ప్రేమ మందిరం అగ్గిపుల్ల గీసినట్లుగా భస్మీపటలమైంది.

తల్లిదండ్రులని గౌరవించి మనసా వాచా చక్రవర్తిని వివాహమాడింది. తనువూ మనసూ అతనికి అర్పించి జీవించాలని ఉవ్విళ్ళూరింది. కాని.. ఫలితం! హృదయమే లేని కసాయి వాడి చేతిలో పడి మాడి మసయిపోయింది తన బ్రతుకు. ఇప్పుడు కూడా తనని తన మానాన బ్రతకనివ్వకుండా కనీసం కడుపున పుట్టిన బిడ్డ మొహం కూడా చూడకుండా.. దుర్మార్గానికి ఒడిగడుతున్నాడు.

ఇలాంటి తరుణంలో హేమంత్ స్నేహం నిజంగానే తనకొక మలయమారుతంలాంటిదే

కానీ.. హేమంత్ ఒక్కసారిగా ఇలా చెబుతాడని తాననుకోలేదు.

వరూధినికి అంతా అయోమయంగా వుంది.

అలా అని హేమంత్ పై కోపం కూడా రావడం లేదు.

నిజానికి ఆమె మనసు కూడా హేమంత్ సాన్నిధ్యాన్ని కోరుతోంది.

కానీ.. అది సాధ్యమయ్యేదేనా?

తాను ఒక బిడ్డ తల్లి. తన తల్లి, చుట్టూ సమాజం తనకి పదే పదే గుర్తుచేసే మాట.

ఆ మాటతో అందరూ తన హృదయానికి, శరీరానికి ఒక ఇనుప భద్రతా వలయాన్ని ఏర్పరిచి తమ బాధ్యత తీరినట్లుగా దానివలన ఈ సమాజానికి ఎంతో శ్రేయస్సు చేసిన వారిలా ఫీలవుతారు.

వరూధినికి పిచ్చెక్కినట్లయింది.

హేమంత్ అలా అనకుండా వుండాల్సింది అని పదే పదే మనసుకి సర్ది చెప్పుకోవాలని ఎంతగా ప్రయత్నించిన ఆమె హేమంత్ ప్రేమని పూర్తిగా నిరాకరించలేకపోతోంది .

ఇదిమిత్థం కాని ఆలోచనతో ఆమెకా రాత్రి నిద్రే కరువయ్యింది.

మొదటిసారిగా హేమంత్‌కి పనిమీద ఏకాగ్రత కుదరలేదు.

రమేష్ బాబిచ్చిన ఫైల్‌ని స్టడీ చెయ్యలేక పోతున్నాడు. తానేంటి, ఇంత ధైర్యంగా చెప్పేసేడు.

వరూధిని ఏమనుకుందో!?

కొంపదీసి రమేష్ బాబుని వాయించినట్లుగా రయ్యిన వచ్చి తన పరువు కూడా అందరిలో తియ్యదు కదా!

అలా చెయ్యదని మనసు చెబుతున్నా చిన్న భయం అతన్ని వెంటాడుతూనే వుంది.

అతని చూపులు గుమ్మాల్ని వెదుకుతూనే వున్నాయి.

"సార్! మిమ్మల్ని పెద్దసారు పిలుస్తున్నాడు" వసంత పిలుపుకి ఉలిక్కిపడి చూసి లేచి వెళ్ళాడు హేమంత్.

"హేమంత్ నోట్ ప్రిపేర్ చేసేవా, మూడు గంటలకి సెక్రెటేరియట్‌లో మీటింగు వుంది" అన్నాడు రమేష్ బాబు.

"లేదు" హేమంత్ జవాబు విని రమేష్ నివ్వెరబోయి చూశాడు.

"అదేంటి. డి.సి.ఇ ఇప్పటికి రెండుసార్లు కబురు చేసారు" అన్నాడు కంగారుగా.

"నా కర్థం కావడం లేదు"

ఈసారి మరింత తెల్లబోయాడు రమేష్‌బాబు.

అలాంటి పదం హేమంత్ నోటివెంట రావడం మొదటిసారి.

"అదేంటి హేమంత్, నువ్విది వరకు డీల్ చేసిందే కదా! వంట్లోకానీ బాగోలేదా?" అన్నాడు గాభరాగా.

హేమంత్ జవాబు చెప్పలేదు.

"టాబ్లెట్స్ ఏవన్నా తెప్పించనా?"

"వద్దు. ఆ సబ్జక్టు నాది కాదు ఎవరు కన్సెర్న్‌డో వాళ్ళని నోట్ ప్రిపేర్ చేయమనండి"

"ఈ టైములో ఆ సంగతులు మాట్లాడకు. అవతల కొంపంటుకుపోతుంది. ప్లీజ్!" కాళ్ళు పట్టుకున్నంత పనిచేసేడు రమేష్‌బాబు.

హేమంత్ ఫైలు తీసుకుని సీట్లోకొచ్చి తల విదిలించుకుని ఎలాగో నోట్ ప్రిపేర్ చేసేడు.

టైపయిన నోట్‌ని తీసుకుని రమేష్‌బాబు హడావుడిగా వెళ్తుంటే "నేనూ రూమ్‌కి వెళ్తాను" అని చెప్పి రూమ్‌కి బయల్దేరాడు హేమంత్.

చాలాసేపు నిద్రపోవాలని ప్రయత్నించేడు కాని.. ఆలోచనల నిండా వరూధినే వుంది.

ఆమె రెస్పాన్స్ కోసం అతని మనసు వేయి కళ్ళతో ఎదురు చూస్తున్నది. క్షణాలు యుగాలవ్వడమేంటో తెలిసింది.

తల దువ్వుకుంటూ ఒకవేళ వరూధిని ఆఫీసు వైపుగాని వెళ్ళి వుంటుందా? తను అనవసరంగా ఇంటికొచ్చేసేడేమో! అనుకుంటుండగా డోర్ నాకయింది.

హేమంత్ చిరాగ్గా వెళ్ళి తలుపు తీసేడు.

ఆశ్చర్యం.

ఎదురుగా వరూధిని.

హేమంత్ చెప్పలేని సంభ్రమానికి లోనయ్యాడు. కానీ... లోపల అనుకోని భయం కూడ.

ఆమె ఏం మాట్లాడుతుందో?

"లోపలికి రావచ్చా?"

అప్పుడు స్పృహలో కొచ్చేడు హేమంత్.

కంగారుగా తేరుకుని "రా! రా! వరూధిని!" అన్నాడు దారిస్తూ.

వరూధిని లోనికొచ్చి కుర్చీలో కూర్చుంది.

హేమంత్ కూడా కూర్చున్నాడు.

కొన్ని క్షణాలు మౌనం.

మంచులా ఘనీభవిస్తున్న క్షణాలు.

"నీతో మాట్లాడాలని.." అంది చివరికి వరూధినే. కళ్ళెత్తి ఆమె వైపు చూశాడు హేమంత్.

వరూధిని అతని వైపు చూడటం లేదు.

తలదించుకుని అరచేతిలో గీతలు గీసుకుంటూ "నిన్న.... అదే.. ఎందుకలా?" అంది మెల్లిగా.

"ఎలా?" అన్నాడు హేమంత్.

వరూధిని కాస్సేపు మాట్లాడలేదు.

"నీకేం తప్పనిపించలేదా?" ఆమె తలెత్తి అతనివైపు చూసింది.

అతను తల అడ్డంగా తిప్పేడు.

"కాని.. నేను మన మధ్య స్నేహాన్నే ఆశించేను. ఇప్పుడు చూడు. ఎంత ఇబ్బందిగా వుందో.. నీతో మాట్లాడటం."

వరూధిని నిజంగానే తొట్రుపడుతున్నట్లుగా ఒక్కొక్క మాట పలికింది.

హేమంత్‌కి కొంత అర్థమయ్యింది.

ఆమె కూడా తనని ఇష్టపడుతుంది. అందుకే ... ఇంత నిదానంగా కూడబలుక్కుని మాట్లాడుతోంది. లేకపోతే సీమటపాకాయలా పేలిపోయేదే

"ఇందులో తప్పేమిటో నాకర్థం కావటంలేదు వరూధినీ. నేను నిన్ను ఇష్టపడుతున్నాను అదే నీకు తెలియజేసేను"

"అంటే..?" కళ్ళెత్తి అతనివైపు చూబీతూ అడిగింది వరూధిని.

"వంకరటింకర కథలొద్దు. నేను నిన్న నా జీవితభాగస్వామినిగా చేసుకోవాలనుకుంటున్నాను. జీవితమంతా నువ్వు నాకు కావాలి. దానికి పెళ్ళేకదా మార్గం" చాలా సూటిగా ఒక పురుషుడిలా మాట్లాడేడు హేమంత్.

అతని కంఠస్వరంలో నిర్దుష్టమైన అభిప్రాయానికి ఆశ్చర్యంగా చూసింది వరూధిని.

"కాని.. ఇది జరిగేది కాదు"

"ఆ సంగతి తర్వాత. నువ్వు.. నువ్వు.. నన్నిష్టపడుతున్నావా? ఆ విషయం చెప్పు ముందు"

"ఎందుకు చెప్పాలి? జరగని వాటిమీద ఎందుకు ఇష్టాలు ఏర్పరచుకోవాలి?"

"ఇష్టాలు ఏర్పడిన వాటిని జరిగేట్లు చూసుకోవాలి."

హేమంత్ వైపు తెల్లబోయినట్లుగా చూసింది వరూధిని.

"కాని.... నేను నీకన్నా పెద్దదాన్ని. ఆ సంగతి తెలుసా?"

"ఇది మొదటి ప్రతిబంధకమా! ట్రాష్. ఇవన్నీ నేను నమ్మను."

"లోకం నమ్ముతుంది."

హేమంత్ బదులుగా పెద్దగా నవ్వాడు.

అతనలా నవ్వడం వరూధిని ఇదివరకెన్నడూ చూడలేదు.

చాలా వింతగా చూసిందతనివైపు.

"నీ జీవితం ఇలా నాశనమయితే చూస్తూ కూర్చున్న లోకం.. నువ్వు తిరిగి సంతోషంగా సుఖంగా వుండటాన్ని చూడలేని లోకం సంగతి దేనికి వరూధిని? వెనక్కి తిరిగి కోపంగా చూస్తే పారిపోయే మొరిగే కుక్కలాంటిదీ లోకం. దాని సంగతి వదిలేయ్. నీ అభిప్రాయం మాత్రమే చెప్పు"

"కానీ.. వరహీనం"

ఆమె మాట పూర్తికాకుండానే మళ్ళీ నవ్వాడు హేమంత్. "ఒక ధీరోదాత్తురాలయిన వరూధినిలాంటి అమ్మాయిలు మాట్లాడాల్సిన మాటలు కావివి. ఒక్కసారి గతచరిత్ర అంతా క్షుణ్ణంగా గుర్తుచేసుకుని ఆలోచించు. గురజాడగారి కన్యాశుల్కం చదివేవా? ముక్కుపచ్చలారని పసిపిల్లల్ని కాటికి కాళ్ళు చాచిన ముసలివాళ్ళు ఏ ఉద్దేశ్యంతో పెళ్ళి చేసుకున్నారు. కేవలం వృద్ధాప్యంలో వాళ్ళ చేత సేవలు చేయించుకోవడానికే. భార్య వయసు చిన్నదయితే ఆమె తనకి ఊడిగం చేయడానికి పనికొస్తుందనే. వితంతువులకి అన్ని నిబంధనలు పెట్టి వారి బ్రతుకులు నిస్సారం చేసి ఎంతమంది అయినవారే వాళ్ళనెలా వుపయోగించుకున్నది... ఆ అపరాధాలన్నీ చీకటిలోనే ఎలా కలిసిపోయిందీ.. నీకు తెలిసే వుంటుంది. అందుకే వీటి సంగతి వదిలేయ్. నువ్వు నన్నిష్టపడుతున్నావో లేదో మాత్రమే చెప్పు."

వరూధిని అతని వైపు చాలా ఆశ్చర్యంగా చూసింది. అందులో ఆరాధన మిళితమై వుంది.

"కాని..?"

"నాకు తెలుసు. నీ సందేహం చిత్రగురించి. చాలాసార్లు నువ్వు చిత్ర గురించిన భయాలు సందేహాలూ చెబుతూనే వచ్చావు. నిన్ను నిజంగా ప్రేమించిన వాడు చిత్రని కూడా ప్రేమించి తీరాలి. అది నూటికి నూరుపాళ్ళూ నిజం. చిత్ర ఒక పసిపాప. పైగా నీ ప్రాణం. నువ్వు నా ప్రాణం. మరి ప్రాణాన్ని ఎవరైనా హింసించుకుంటారా! ద్వేషిస్తారా! చిత్రకి నేనే కన్నతండ్రినవుతాను. నువ్వంగీకరిస్తే..."

అప్పుడు వచ్చింది దుఃఖం.

అది ఆనందమో.. బాధో తెలియని ఒక వుద్వేగం.

వరూధిని కళ్ళు ధారలై వర్షించాయి.

ఆమె మోకాళ్ళలో తల దించుకుని వెక్కెక్కి ఏడ్చింది. తలిరాకులా కదిలిపోయింది.

లతలా వూగిపోయింది.

ఒక్కసారి ఆమెని పొదవి పట్టుకుని ఊరడించాలనిపించినా మనసుకి అడ్డుకట్ట వేసేడు హేమంత్.

ఆ దుఃఖం ఆమె నుండి వెళ్ళిపోవటమే అవసరం. కాస్సేపటికి ఆమె వుద్వేగం నుండి బయట పడింది.

ఈసారి... కాస్త ధైర్యంగా హేమంత్ వైపు చూసింది.

"కానీ.. మీ ఇంట్లో మన పెళ్ళికి ఒప్పుకుంటారా?" బేలగా అడిగింది.

"ఒప్పుకోరు" చాలా ఖచ్చితంగా ఠక్కున జవాబిచ్చేడు హేమంత్.

వరూధిని బెదిరినట్లు చూసిందతనివైపు.

హేమంత్ చిన్నగా నవ్వి "ఈ ప్రశ్న నీకన్నా ముందు సరోజని ఆంటీయే అడిగింది. "

"అంటే... ఆమెకి చెప్పేవా?"

ఔనన్నట్లుగా తలుపేడు హేమంత్.

"ఆంటీ చాలా విశాల హృదయం, అభ్యుదయ భావాలు కల వ్యక్తి. మనిషి బలాల్ని, బలహీనతల్ని కలిపి స్వీకరించే సహృదయం ఆమెకుంది. భాష ఏదయినా భావాలు వున్నతమైనవి. ఆమె నాకు ముందే చెప్పింది. మీ నాన్న ససేమిరా ఒప్పుకోడు. ఎదిరించి చేసుకోగల సత్తా వుంటేనే.... ఆ అమ్మాయికి చెప్పు. లేకపోతే వద్దని."

హేమంత్ జవాబు విని మరింత ఆశ్చర్యపోయింది వరూధిని.

"ఆంటీని.. చూడాలి"

"చూద్దువుగాని.. ముందసలు ఈ సంగతి చెప్పు. నన్నిష్టపడుతున్నావా?" హేమంత్ సూటి ప్రశ్నకి వరూధిని కనులు వాల్చేసింది.

ఆ వెంటనే లేచి నిలబడి "వెళ్ళాలి. చీకటి పడింది" అంది కంగారుగా.

హేమంత్ సన్నగా నవ్వి "ఇంతకంటే లేటుగా మనం టాంక్ బండ్ మీద కూర్చుని కబుర్లు చెప్పుకున్న సందర్భాలెన్నో వున్నాయి. అప్పుడు లేని భయం ఇప్పుడా?" అన్నాడు దగ్గరగా వస్తూ.

అతన్ని చూసి ఒకలాంటి భయం, సిగ్గు మొదటిసారి కలిగి లేచి నిలబడింది వరూధిని.

కానీ... అనుకోని విధంగా అతని చెయ్యి ఆమె తలని నిమిరింది ఆప్యాయంగా.

"పిచ్చీ! భయపడకు. నువ్వు నాకో అపురూపమైన వరానివి. నిన్ను పదిలంగా కాపాడుకుంటాను. ఇక నీకే భయాలూలేవు. అన్నిటికీ నేనున్నాను నీకు. అదేకదా నిజమైన ప్రేమ. "

బదులుగా వరూధిని అతన్ని అల్లుకుపోయింది.

తలని నేనున్నానని వాల్చుకోవడానికొక భుజం దొరికింది ఆమెకిన్నాళ్ళకి.

అదేకదా... అసలైన పురుషత్వం.!!

**హేమంత్ చెప్పిన విషయాన్ని** విని సరోజని దిగ్భ్రాంతికి గురయ్యింది. నిజానికది సంతోషకరమైన వార్తే.

"వరూధిని నా ప్రేమని అంగీకరించింది. ఆమె కూడా నన్ను ప్రేమిస్తుందాంటీ!" అని చెప్పాడు హేమంత్.

అప్పటినుండి సరోజనికి నిజంగా దిగులుపట్టుకుంది.

'ఈడికింక కష్టాలు మొదలయ్యేయి. అయ్యో దేవుడా!' అనుకుంది బాధగా.

కొంతసేపు కాలుగాలిన పిల్లిలా ఇల్లంతా కలయతిరిగింది. ఆ తర్వాత కనకారావు ఫొటో దగ్గర నిలబడి 'చూసావా, ఏవంతుగాడెంత పని చేసేడో. ఆడికసలే తల్లిలేదు. ఆ బాబుగాడు ఏం జేస్తాడో? బతికినన్నాళ్ళూ పెళ్ళాన్ని కాల్చుకుతిన్నాడు. ఇప్పుడిక యీడి బరతం పడతాడు. ఏం జేద్దావంటావూ?' అనడిగింది అమాయకంగా.

కనకారావు ఎత్తుపళ్ళతో అలాగే నవ్వుతున్నాడు.

"సర్లే! బతికుండగానే ఏవీ చెప్పటం రాని మొద్దవతారానివి. ఇప్పుడింకేం జెబుతావ్?" అనుకుంటూ వీధి తలుపు తీసింది.

ఎందుకో.. ఒక్కసారి హేమంత్ ఇంటికెళ్ళి అక్కడి వాతావరణాన్ని చూసి రావాలనిపించింది.

కనకారావు చనిపోయాక ఆ యింటి గడప తొక్కలేదు సరోజని.

కానీ.. ఇప్పుడా యింటి వాతావరణం ఎలావుందో.. మానసికంగా ఏవన్నా వాళ్ళ ఆలోచనలు ఎదిగయేమో ఈ పెళ్ళికి వాళ్ళంతా ఏవన్నా అంగీకరించే స్థాయిలో వున్నారేమో తెలుసుకోవాలన్నదే సరోజని వుద్దేశ్యం.

చిన్నగా జారిపోయిన జుట్టుని వేలుముడిగా చుట్టుకుని హేమంత్ యింటివైపు అడుగులు వేసింది.

వీధిలోనే అరుగు మీద దర్శనమిచ్చేడు హేమంత్ తండ్రి సుందరం.

సరోజనిని చూస్తూనే ఛీత్కారంగా మొహం పెట్టి "ఏంటిలా దయచేసేవ్ చాలా రోజులకి?" అన్నాడు వెటకారంగా.

"నిన్ను చూడాలనిపించింది బావా! రాత్రి కల్లో కొచ్చేవ్" అంది నవ్వుతూ ఎదురుగా వున్న అరుగుమీద చతికిలబడి.

సుందరం మొహం ఆ జవాబుకి ఇంకాస్త చిటపటలాడేడు.

"అడ్డమైన వాళ్ళ కలల్లోకి రావాల్సిన ఖర్మేం పట్టలేదు నాకు. మొన్నా మధ్య చావబోయేవంట. ఏంటి డ్రామానా?" అన్నాడు వెటకారంగా.

"అవును బావా! తాడు గట్టిగాలేదు." అంది సరోజని.

"నువ్వెందుకు ఛస్తావే, నల్గురిని చంపే రకానివి" అని వెటకారంగా నవ్వేడు సుందరం.

"నిజమే బావా, నీ సంగతి చూడకుండా పోవడం యిష్టంలేక బతికేసేను. అద్సరే నీ మేడ సంగతేవయింది? కోర్టుల చుట్టూ తిరిగి తిరిగి అరిగిపోయిన బలపం ముక్కలా అయిపోయేవు. ఏవన్నా నువ్వు బతికుండగా ఆ కొంప వస్తుందంటావా?" అనడిగింది సరోజని అమాయకంగా మొహం పెట్టి.

"ఎందుకు రాదూ! తన్నుకుంటూ వస్తుంది. ఒకటి రెండు నెలల్లో అక్కడే వుంటాను. చూడు" అన్నాడు సుందరం ముక్కుపుటాలు బిగబెట్టి గర్వంగా.

"అవునా! ఆ పాటికి కొంచెం తిను. లేకపోతే ఆ మేడలో పెద్ద పనోడిలా వుంటావు. ఏసుకున్న పట్టుచొక్కా బుజాలమీద నిలవాలా?" అంది సరోజని నవ్వుతూ.

"అదే. మరి నీవాగుడు తగ్గలేదు కనకారావు చచ్చినా!" అన్నాడు సుందరం కోపంగా.

"ఎలా తగ్గుద్ది బావా? అక్కపోతే నీకేమాత్రం బుద్దొచ్చింది. పుట్టిన బుద్ధి పుడకల్లో పెటాలి. అద్సరే ఏవంతుగాడికి పెళ్ళెప్పుడు చేస్తావ్?"

"ఆడి పెళ్ళి ఆ మేడలోనే!" అన్నాడు సుందరం గర్వంగా.

"అబ్బో పెద్ద ప్లానే" అంది సరోజని.

ఇంతలో హేమంత్ అక్క బయటకి వచ్చి చూసి "ఆంటీ, నువ్వా, లోపలికి రా!" అంది.

సరోజని లేచి లోపలికెళ్ళి ఉయ్యాల బల్లమీద కూర్చుని ఇల్లంతా కలయ జూసింది. ఇంట్లో పెద్ద మార్పులేవీ లేవు.

"ఏంటే కొత్తసామానేం కొన్నట్లు లేదు. ఏవంతుగాడు డబ్బేం పంపడంలేదా?"

"పంపకపోతే ఈయనూరుకుంటాడా, ఫోనులు మీద ఫోనులు చేసి వాడి ప్రాణం కొరుకుతాడు."

"మరి?"

"తీసుకెళ్ళి ఆ కోర్టులకే పోస్తున్నాడు. ఆ కథంతే!" అంది కాఫీ తెచ్చి సరోజనికిస్తూ

"మరి వాడికి పెళ్ళి చెయ్యరా?"

"ఏమో, ఆయనిష్టం. మన మాట పడనిస్తాడా? ఈ మధ్య తన చెల్లెలి కూతుర్నిచ్చి చేస్తానని అంటున్నాడు. "

"నాకు తెలియని చెల్లెలెవరే?" అంది సరోజని కొంచె వులిక్కిపడుతూ.

"అదే. కేరళలో వుంటుంది వసుంధరత్త."

"వాళ్ళతో మీకసలు రాకపోకల్లేవు కదే"

"ఏమో, ఈ మధ్య నాన్నతో మాట్లాడుతున్నారు. వాళ్ళ దగ్గర డబ్బు తీసుకున్నట్లున్నారు." అందామె.

సరోజని మనసు కలుక్కుమంది.

"అప్పుడే ఇక్కడ కథ అడ్డం తిరుగుతోందే!" అనుకుని బాధపడుతూ "ఒకేళ ఆడే పిల్లనన్నా పేమించి పెళ్ళిజేసుకుంటే.."

బదులుగా పకపకా నవ్వింది హేమంత్ అక్క. "ప్రేమా.. వాడా? ఊరుకో ఆంటీ!" అంది.

"ఏంటే ఆడు నీ తమ్ముడయినంత మాత్రాన ఆడు మగాడు కాదా! అసలే సిటీలో వుంటున్నాడు" అంది సరోజని.

"ఏ సిటీలో వున్నా మా తమ్ముడు తమ్ముడే వాడలాంటి వెధవ పనులు చెయ్యడు." అంది గర్వంగా.

"ఏంటి పేవించడం ఎదవ పనా? రోజుకి మూడు పేమ సినిమాలు టి.వి పెట్టుకుని నోరావలించి చూస్తావ్. ఆడు పేవిస్తే ఎదవ పనా?" అంది సరోజని.

"ఏమో, వాడా పని చెయ్యడు గాక చెయ్యడు." అందామె నిక్కచ్చిగా.

సరోజనికి అంతకంటే మాట్లాడాలనిపించలేదు.

ఒకలాంటి నైరాశ్యంతో ఇంటిదారి పట్టింది వేదనగా.

❖❖❖

ఎదురుగా కూర్చున్న హేమంత్‌ని పరికించి చూస్తున్నాడు రమేష్‌బాబు.

హేమంత్ మొహంలో కొత్త కళ ఉట్టిపడి పడుతుంది.

"ఏంటీ మధ్య మొహం వెలిగిపోతుంది. పెళ్ళేమైనా కుదిరిందా?" అనడిగేడు నవ్వుతూ.

"అదేం లేదు సర్" అన్నాడు హేమంత్ నవ్వుతూ.

"కాదు.. నువ్వు దాస్తున్నావ్. సమ్‌థింగ్ స్పెషల్" అన్నాడు రమేష్

"పెళ్ళి కాకపోతే ప్రేమ" అంటూ లోని కొచ్చి హేమంత్ పక్కన బర్రున కుర్చీ లాక్కుని కూర్చుంటూ అంది పద్మ.

హేమంత్ జవాబు చెప్పకుండా లేచి సీట్లోకి వెళ్ళాడు.

"ఏంటి కథ?" అన్నాడు రమేష్‌బాబు.

"ఏవుందా పిల్లనేసుకుని.. ఊరంతా బలాదూరు తిరుగుతున్నాడు. చాలా మంది చూశారు." అంది పద్మ.

"నీకు హేమంతంటే కోపం. అలానే చెబుతావులే" అన్నాడు నిరసనగా.

బదులుగా "వసంతా!" అంటూ పిలిచింది పద్మ బిగ్గరగా.

వసంత వచ్చి నిలబడింది.

"చెప్పు, మీ చిన్న సార్ ఏడేడ తిరుగుతున్నాడో, ఆ పోరినేసుకుని" అంది గడ్డం క్రింద చెయ్యిపెట్టుకుని విలాసంగా కాళ్ళూపుతూ.

వసంత పద్మ వైపు కళ్ళు మిటకరించి చూసింది భయంగా.

"భయం లేదులే చెప్పు. మన సారే!" అంటూ ఉత్సాహపరిచింది పద్మ.

వసంత మళ్ళీ రమేష్‌బాబు వైపు చూసింది.

"చెప్పు. ఎక్కడ చూశావ్? అన్నాడు రమేష్‌బాబు కాస్త సౌమ్యంగా.

"ఎక్కణ్ణంటే.. ఒకతూరి సుల్తాన్ బజార్‌లో బుక్కుల కొట్లకాడ సార్. ఆడగిద్దరూ కల్సి బుక్కులేరతండారు" అంది పద్మ.

"అదే.. ఎలా ఏరతన్నారో కూడా జెప్పు" అంది పద్మ.

పద్మ మళ్ళీ కళ్ళు మిటకరించింది.

"చెప్పు" రమేష్ బాబు హెచ్చరికతో "గదేసారూ, ఒకళ్ళ మీద ఒకళ్ళు బడి ఏరతన్నారు"

"సరిగ్గా చెప్పు" కొంచెం రమేష్ బాబు గదమాయించేసరికి "గదే. ఆడనే జూసిన... ఇంకోసారి సిన్మాలో దగ్గర జూసిన" అంది భయంగా.

"సరే, నువ్వెళ్ళు" అంది పద్మ. అదే అదనుగా పారిపోయినట్లెళ్ళిపోయింది వసంత.

"ఇదేం కొత్త! వాళ్ళిద్దరూ ఎప్పట్నుంచో తిరుగుతున్నారుగా!" అన్నాడు రమేష్‌బాబు కొంచెం చిరాగ్గా.

నిజానికి వసంత చెప్పిన విషయం విని అతని మనసు కుతకుతలాడుతున్నది. దాన్ని పైకి కనపడకుండా తనకంత ఇంటరెస్టు లేనట్లు మాట్లాడటానికతను శతవిధాల ప్రయత్నిస్తున్నాడు.

"ఇంకేం మరి.. రేపు శుభలేఖ తెచ్చిస్తాడు. పెళ్ళి కెళ్ళి ఇన్నక్షింతలేసి రండి" అంటూ రెచ్చగొట్టి మళ్ళీ కుర్చీ బర్రున లాగి సీటుకెళ్ళిపోయింది పద్మ.

సెక్షన్‌లో అడుగు పెట్టేసరికి అక్కడ సీన్ వేరే విధంగా వుంది.

పద్మ ఆశ్చర్యపోయింది.

"కొంపదీసి ఇతను పెళ్ళి శుభలేఖలు పంచడం లేదు కదా" అనుకుంది తెల్లబోతూ.

"ఏంటి హేమంతూ, పెళ్ళా?" అంది అమాయకంగా.

"అమ్మా, ఎప్పుడూ నీకు పెళ్ళిగోలే. హేమంత్ గ్రూప్ ఒన్ రిటెన్ ఎగ్జామ్స్ పాసయ్యేడు" అన్నాడు సూపర్నెంటు ముకుందం.

పద్మ మరీ మరీ తెల్లబోయింది.

"అప్పుడే ఎందుకంత హడావుడి. రిటెన్ పాసయి వోరల్లో తన్నిన వాళ్ళు చాలామందున్నారు" అంది పద్మ వెటకారంగా

"శుభం పలకమని నీలాంటిదాన్ని తీసుకెళ్తే పెళ్ళి కూతురు ముండెక్కడ చచ్చిందన్నదట. కాస్త నోరు సంబాళించుకో తల్లీ" అన్నాడాయన చిరాగ్గా.

"నిజమంతే లెండి. పద్మగారెప్పుడూ కీడెంచి మేలెంచుతారెప్పుడూ" అన్నాడు హేమంత్.

"వెళ్ళి సార్‌కి చెప్పండి" అన్నాడు సూపర్నెంటు ముకుందం.

"ఇందులో ఏముందని?" అన్నాడు హేమంత్.

"బాగోదు చెప్పండి అన్నాడు" ముకుందం తిరిగి.

హేమంత్ అయిష్టంగా రమేష్‌బాబు ఛాంబర్స్‌లో కెళ్ళి విషయం చెప్పేడు.

రమేష్‌బాబు మొహం వివర్ణమైంది.

హేమంత్ వోరల్లో కూడా సెలక్టయి తీరతాడు. తన చేతిలోంచి జారిపోతాడు. వరూధిని ఒక ఆఫీసర్ భార్యయి కూర్చుంటుంది. చూస్తుండగానే వాళ్ళిద్దరూ ఆనందంగా, హాయిగా వుంటారు తనిలా లాడ్జీల్లో ఏసుఖమూ లేకుండా బ్రతుకుతూనే వుండాలి.- అనుకున్నాడతను.

ఐతే వివర్ణమయిన మొహాన్ని కప్పిపుచ్చుకుంటూ పెద్దగా నవ్వుతూ హేమంత్‌కి షేక్‌హేండిచ్చి "నాకు తెలుసు హేమంత్ నీకు సెలక్షన్ వస్తుంది. నాకు తెలుసు" అన్నాడు ఆనంద పడిపోతున్నట్లుగా.

"అప్పుడే చెప్పలేం సర్. ఇదంతా ముకుందంగారి పట్టుదల." అన్నాడు రమేష్ బాబు కడుపులో మంటని కళ్ళలో కనబడనివ్వకుండా.

ఎప్పుడెప్పుడీ సంగతి వరూధినికి షేర్ చేసి సంతోషపడాలా అని హేమంత్ మనసు ఎదురు చూస్తోంది.

అందుకే అతను అయిదు కాగానే పరిగెత్తినట్లుగా వెళ్ళిపోయాడు.

అతనెక్కడ కెళ్తాడో వూహకందిన రమేష్‌బాబు అసూయతో కుతకుతలాడుతూ నిస్సహాయంగా చూస్తుండి పోయేడు.

కానీ.. అలవాటు ప్రకారం అతని హృదయం దుర్మార్గంగా ఆలోచిస్తూనే వుంది.

హేమంత్ సరాసరి వరూధిని ఇంటికే వెళ్ళాడు. విషయం వినగానే ఎగిరి గంతేసింది వరూధిని.

"స్వీటేది?" అనడిగింది.

"తేలేదు" అన్నాడు హేమంత్.

"ఎందుకని? ఇలాంటి విషయాన్ని స్వీట్ లేకుండా చెబుతారా?" అంది అధికారంగా.

"అప్పుడే నాకు సెలక్షన్ వచ్చినట్లు కాదు కదా!" అన్నాడు హేమంత్ నవ్వుతూ.

"దాని మాటలకేం గాని... నేను చేస్తానుండు స్వీట్‌ని" అంది రాజేశ్వరి చిత్రని అతని చేతికందిస్తూ.

ఆవిడ కావాలనే చిత్రని అతనికిచ్చిందని హేమంత్‌కి తెలియదు. చిత్ర అతనికలవాటు కావాలి. చిత్రని అతను ప్రేమించాలన్నది ఆమె అంతర్గత మనోభీష్టం.

చిత్రనెత్తుకుని హేమంత్, వసుంధర మేడమీదకెళ్ళారు.

చిత్ర ఇప్పుడు హేమంత్‌కి మాలిమయ్యింది.

అతని జేబులోని పెన్ను తీసుకుని ఆడుతుంది.

చిత్రని పక్కన కూర్చోపెట్టుకుని అతనాడుతుంటే వరూధిని సంతోషంగా చూసింది.

తనకే కాదు చిత్రకి కూడా ఒక ఆలంబన దొరికినట్లు అతని గుండెల్లో తాము గువ్వలుగా ఒదిగి బ్రతకగలమనే నమ్మకమూ వరూధినిలో మొదటిసారి కలిగాయి.

ఇంతలో రాజేశ్వరి రవ్వకేసరి తీసుకుని పైకొచ్చింది.

"అదేంటమ్మా, పిలిస్తే నేను వచ్చేదాన్నిగా?" అంది వరూధిని నొచ్చుకుంటూ.

బదులుగా రాజేశ్వరి నవ్వి డిషెస్ వాళ్ళిద్దరికీ యిచ్చి చిత్రని తీసుకుని కిందకి వెళ్ళింది.

"ఇప్పుడు చెప్పు హేమ్, నీకు ఆర్.డి.ఓ వస్తుందా! ఆర్.టి.ఓ వస్తుందా?" అనడిగింది వరూధిని రవ్వకేసరి తింటూ నవ్వుతూ.

"ఎందుకా రెండే సెలక్ట్ చేసావు?"

"బాగా నగలు చేయించుకుని అమ్మోరులా దిగేసుకోవాలని" అంది పకపకా నవ్వుతూ.

హేమంత్ కూడా నవ్వాడు.

వరూధినిని చూస్తూనే అతని మనసు ఆనందంతో వుప్పొంగుతుంది.

ఎన్ని కష్టాలున్నా గలగలా నవ్వే ఆమె మనస్తత్వం అతనికి నచ్చుతుంది.

"వరూ!"

ఆమె అతనివైపు ఆశ్చర్యంగా చూసింది.

ఆ వెంటనే ఆమెలో చిలిపిదనం మాయమైంది.

"ఊఁ" అంది మెల్లిగా.

"సరోజిని ఆంటీకి చెప్పాను."

"ఏమని?"

"నువ్వొప్పుకున్నావని"

"ఏమన్నారు?

"సచ్చినోడా! ఆ పిల్లకి చీమకుట్టినా నిన్ను చంపేస్తానంది."

"మరైతే హిట్ గానీ, గమేక్సిన్ గానీ.. తెచ్చేరా?"

ముందు అర్థం కాలేదతనికి.

అర్థం కాగానే పకపకా నవ్వేసేడు.

వరూధిని కూడ అతనితో శృతి కలిపింది.

హేమంత్ చిన్నగా ఆమె చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు ప్రేమగా.

వరూధిని దగ్గరగా జరిగి అతని భుజమ్మీద తలాన్చింది.

ఇప్పుడామె నరనరాల్లోకి ఒక ధైర్యం, నమ్మకమూ రక్తంలో కలిసి ప్రవహిస్తున్నాయి.

**రమేష్ లాడ్జిలో** కూర్చుని పూటుగా తాగుతున్నాడు చక్రవర్తి.

రమేష్ అతన్నే తదేకంగా చూస్తూ "పెళ్ళాన్నలా వదిలేసేవేంటీ?" అన్నాడు చిన్నగా.

బదులుగా తలెత్తి చూశాడు చక్రవర్తి.

"ఎలా వదిలేసాను?" అతని గొంతులో కరుకుదనం చూసి కొద్దిగా జంకాడు రమేష్.

మందు పూర్తిగా ఎక్కలేదని మరో బాటిల్ ఓపెన్ చేసాడు రమేష్‌బాబు.

కాదనకుండా తాగుతూనే వున్నాడు చక్రవర్తి.

తాగుతూ తాగుతూ తలెత్తి చూశాడు. అతని కళ్ళలో క్రౌర్యం చూసి కొద్దిగా జంకాడు రమేష్‌బాబు.

మగాడు - కాస్తో కూస్తో రోజూ తాగేవాడు అతనికే చక్రవర్తిని చూసి భయం వేసింది.

ఇలాంటివాడికెలా యిచ్చి వరూధినిని పెళ్ళిచేసారు అనిపించిందతనికో క్షణం. కానీ వెంటనే వరూధిని పట్ల అతను పెంచుకున్న అకారణ ద్వేషం అతనిలో వున్న కొద్దిపాటి విచక్షణని కమ్మేసింది.

"ఏవన్నావు - ఇందాక - పెళ్ళాన్నలా వదిలేసేవని కదూ!"

రమేష్‌బాబుని గుచ్చి చూస్తూ అడిగాడు చక్రవర్తి మాటలు ముద్దగా వస్తున్నాయి.

"అంటే.. అది" నసిగాడు రమేష్‌బాబు.

'చాలిక' అన్నట్లు చెయ్యి ఎత్తాడు చక్రవర్తి.

ఆ వెంటనే పకపకా నవ్వాడు. ఆ నవ్వంతా వికటం.

"నాకెంత తాగినా శరీరానికే ఎక్కుతుంది. మెదడుకి కాదు. ఎవరేం మాట్లాడినా బా..గా అర్థమవుతుంది. తాగితే మరీ బాగా అర్థమవుతుంది . ఇది చెప్పడానికా నన్ను పిలిచి తాగిస్తున్నావు!" అని ఆగి గ్లాసులో వున్న మందు గటగటా తాగి గ్లాసు దఢాల్న టీ పాయ్ మీద పెట్టాడు.

రమేష్‌బాబు అలానే చూస్తున్నాడు.

సిగరెట్టు వెలిగించి "అది నా నుండి విడాకులు తీసుకుంది తెలుసా?" అన్నాడు.

రమేష్ బాబు ఏవీ మాట్లాడలేదు.

"అదిప్పుడు నా పెళ్ళాం కాదు"

మళ్ళీ పకపకా నవ్వాడు చక్రవర్తి.

"మన దేశంలో వున్న ఫెసిలిటీ ఏవిటంటే చట్టాలకి, సంబంధాలకి సంబంధంలేదు. ఒకసారి తాళి కట్టించుకున్నాక అది విడిపోయినా - దానితో మొదటి మొగుడికి చాలా లింకులుంటాయి. ముఖ్యంగా పిల్లలు! సొసైటీ!"

"అదెలా తగలడినా - అవసరమైనప్పుడు దాన్నేడిపించి భయపెట్టి, టార్చర్ చేసి డబ్బు తెచ్చుకుంటున్నానంటే - అది నేను దాని మొగుణ్ణి కావడమే. ఎవరు విడాకులు తీసుకుని ఇదంతా ఏవిటని అడగరు. ఆఁ! ఇంతకీ అది నీకెలా తెలుసు. దాని గురించి నీకెందుకు అంత శ్రద్ధ!" చక్రవర్తి సూటి ప్రశ్నకి కాస్త కంగారు పడ్డాడు రమేష్‌బాబు.

"నువ్వేం నీళ్ళు నవలక్కరలేదు. దానిమీద నీ కన్నుపడినట్లుంది. సరే. నువ్వే నీ అంతట బయటకొచ్చి నా దృష్టిలో పడ్డావ్. తాగుడికి డబ్బుల్లేనప్పుడు వాడుకోడానికి నా కింకో కేసు దొరికింది. ఒరేయ్ చక్రీ! నువ్వెలాగన్నా చాలా అదృష్టవంతుడివిరా. ఉద్యోగం పోయినప్పటికీ ఇన్నేళ్ళుగా భలే బతికేస్తున్నావ్" అని భుజం తట్టుకున్నాడు చక్రవర్తి.

"అదెవరితోనో తిరుగుతుందంటే నేను పౌరుషపడిపోతాననుకున్నావు కదూ. అబ్బే. నాకదేం అక్కర్లేదు. కాకపోతే మన దేశంలో ఆడది దాని శీలం గురించి ఎద్దేవా చేస్తే భరించలేదు. కత్తితో పొడిచినా సహిస్తుంది కానీ మాట పడదు. అందుకే.. ఇలాంటివి వాడి డబ్బు తెచ్చుకుంటా"

"ఆఁ ఇంతకీ దానితో తిరుగుతున్నాడన్నావే... ఆడెవడు"

చక్రవర్తి మాట పూర్తికాకుండానే రూమ్ డోర్ తెరచుకుంది.

లోపలికి వచ్చిన స్త్రీ మూర్తిని చూసి కంగారుగా లేచి నిలబడ్డాడు రమేష్‌బాబు.

చక్రవర్తి ఆవిడవైపు చూసి ఏంటీ నీకీ విజ్జలు గూడా వున్నాయా! ఆడాళ్ళని లాడ్జీలకి పిలిపించుకుంటావా.. గ్రంథసాంగుడివే. అన్నాడు వెటకారంగా ఆవిణ్ణి ఎగాదిగా చూస్తూ.

"నువ్వేంటి.. నువ్వొచ్చావేంటి.." రమేష్‌బాబు కంగారు పడుతూ అడిగాడు భార్యని చూస్తూ.

ఆవిడ అతన్ని చక్రవర్తిని మార్చి మార్చి చూసింది.

"లాడ్జీల్లో చేరి నువ్వేసే వేషాలేంటో చూడాలని వచ్చాను. ఒక గజెటెడ్ జాబ్ చేస్తూ - గౌరవ మర్యాదలు లేకుండా బాధ్యతా రహితంగా అడ్డమైన వాళ్ళతో తాగుతూ - ఇలా కాలక్షేపం చేయడానికి నీకు సిగ్గులేదా!"

చక్రవర్తి సర్రున కుర్చీ వెనక్కిడ్చినట్లు లాగి విసురుగా లేచి "ఎవర్తివే నువ్వు!" అన్నాడు.

జరగబోయే పరిణామం వూహించి రమేష్‌బాబు గబగబా అడ్డం వచ్చి నిలబడి "ప్లీజ్, ఆవిడ నా భార్య" అన్నాడు బతిమాలుడుతున్నట్లుగా.

"అయితే ఏం మాట్లాడతందది. అడ్డమైన వాళ్ళుంటుందా! నరికేస్తాను దాన్ని" మాటలు తడబడుతున్నా గట్టిగా అరిచాడు చక్రవర్తి.

ఎవరినెలా అణచాలో, నోరు ఎలా మూయించాలో తెలిసిన తెలివైన రమేష్‌బాబు గబుక్కున జేబులోంచి కొంత డబ్బు తీసి చక్రవర్తి జేబులో పెట్టి "నువ్వెళ్ళు ప్లీజ్" అన్నాడు.

చక్రవర్తి తీసి వాటిని లెక్కపెట్టుకుంటూ నవ్వి "ఏంటో అనుకుని తిట్టానుగానీ.. నువ్వు నిజంగా లక్ష్మీదేవివే. నువ్వేంటి ఆడోళ్ళంతా లక్ష్మీదేవిలే. వాళ్ళేడుస్తూ మరి.. మగాళ్ళకి డబ్బులిస్తారు. వుంటా. నాకింకో ఖాతా దొరికింది" అంటూ వెళ్ళిపోయాడు చక్రవర్తి.

చక్రవర్తి వెళ్ళగానే వూపిరి పీల్చుకుని భార్యవైపు చూశాడు రమేష్‌బాబు.

"ఏంటిలా ఇక్కడికి రావడం. మర్యాదలేకుండా" అన్నాడు కోపంగా.

చక్రవర్తి మాటలకి అప్పటికే అవమానపడి ఎర్రబడిన కళ్ళతో కన్నీళ్ళాపుకుని కోపంతో వూగిపోతూ చూస్తోంది రమేష్ భార్య లావణ్య.

"ఏంటీ, ఏవంటున్నావు నువ్వు. మొగుడనే దరిద్రుడు ఎక్కడ మకాం వేస్తే పెళ్ళాం అక్కడికి రాకుండా వుంటుందా?" అంది కోపంగా.

"అవును. నువ్వొక పెళ్ళానివి - నేనొక మొగుణ్ణి" అన్నాడు రమేష్‌బాబు వెటకారంగా.

"నిజమే, నేనొక పెళ్ళాన్నో కాదోగాని.. నువ్వొక మొగుడివి మాత్రంకాదు. నీకా అర్హత లేదు. వుంటే ఇలా లాడ్జిల్లో కూర్చుంటావా? పిల్లలున్నారన్న ఇంగితముందా - నీకు. ఎప్పుడన్నా ఒక చీరకాదు కదా ఒక హెయిర్ క్లిప్పన్నా కొన్నావా? పిల్లలకి చాక్లెట్సు కొనడానికి వెనుక ముందాడే నీకు భర్తననే టైటిల్ ఎలా దొరుకుతుంది."

"నీ అమ్మా బాబూ నన్నేమన్నా చెయ్యనిస్తారా! ఇంట్లో మకాం వేసి - నన్నో పురుగులా చూస్తున్నారు"

"అది నువ్వు చేసుకున్నదే వాళ్ళకి లెక్కకి మించి డబ్బుంది. డబ్బులు పడేస్తే వ్యక్తిత్వాన్ని అమ్మేసుకుని వచ్చే వెధవ కోసం చూశారు. నాకు ఎన్నో మంచి సంబంధాలొచ్చాయి. ఇల్లరికం వుండనన్నారని వదిలేసారు మా నాన్న. కూతుర్ని వదిలేసి వుండలేమనుకున్నారేగాని ఓ వ్యక్తిత్వం, వెన్నెముక లేని వాడికిచ్చి తమ కూతుర్ని కట్టబెడతామన్న జ్ఞానం లేదు వాళ్ళకి. అలా చూడక ఎలా చూస్తారు మరి" అంది లావణ్య ముక్కుపుటాలదరుతుండగా.

"మాటలు సరిగ్గా రానియ్. మొగుణ్ణని మరిచిపోతున్నావు"

"పాపం, పదే పదే గుర్తుచేయాల్సిన ఖర్మపట్టింది నీకు. నువ్వు నాకు మొగుడివా! పాపం పెళ్ళాం వదిలేసిందని పెళ్ళి సంబంధాలు చూసుకుంటున్నావ్‌గా!" అంది లావణ్య హేళనగా.

ఒక్కసారిగా వులిక్కిపడ్డాడతను. వరూధిని మీద అనుమానం వచ్చిందతనికి.

"ఏంటి ఏం మాట్లాడుతున్నావ్ నువ్వు. ఎవరు చెప్పారు నీకు. పెళ్ళేంటి సంబంధాలేంటి" అన్నాడు కంగారుగా.

"ఏమి నటిస్తున్నావు. పాపం అందరూ సినిమావాళ్ళని అంటారు కాని నిజ జీవితాల్లో నీలాంటి మహానటుల్ని గుర్తించరు. పెళ్ళేమిటా... సంబంధాలేమిటా.. చూడు ఇవి" అంటూ ఒక కవరు తీసి రమేష్ మొహమ్మీద కొట్టింది.

ఆ విసురుకి కవరులోని ఫోటోలు విడివడి క్రిందపడ్డాయి.

రకరకాల ఫోజుల్లో సినిమా నటి బాబులాంటి మేకప్పులో వున్న అరడజను ఫోటోలు క్రిందపడ్డాయి. వాటి వంక దొంగ చూపులు చూశాడు రమేష్‌బాబు.

"ఇదెవరో టి.వి ఆర్టిస్టట. తొంభయ్యారు కండిషన్స్ పెట్టింది. తాగుతుందట. సహించాలట. ఎవరెవరో వస్తారట. భరించాలట. ఒక కోటిరూపాయలు ముందు జాగ్రత్తగా దానికి ఫిక్స్ చేయాలట. దానివాళ్ళంతా ఇంట్లో వుంటారట. చేసుకో మరి. నేనే దగ్గరుండి చేస్తాను" అంది లావణ్య కోపంతో వూగిపోతూ.

రమేష్‌బాబుకి ఏం మాట్లాడాలో ఇక తోచలేదు. నేల చూపులు చూస్తూ నిలబడ్డాడు.

"దరిద్రుడా! పెళ్ళాం మంచిదికాదా! వదిలేసిందా! చేస్తున్నది గవర్నమెంటు జాబ్. ఈ సంగతి బయటపెడితే సస్పెండయి - ఊచలు లెక్కపెడతావు. అంతవరకు వెళ్ళే బాపతు ఆడదాన్ని కాదుగాబట్టి ఇక్కడికొచ్చాను. చెప్పు. ఇప్పటికిప్పుడే విడాకులిస్తాను. తే, కాగితాలు" అని వగరుస్తూ మంచమ్మీద కూర్చుంది లావణ్య భోరున ఏడుస్తూ.

అటూ ఇటూ చూశాడు రమేష్.

ఆ వెంటనే డోర్ లాక్ చేసి అమాంతం లావణ్య వేళ్ళమీద పడ్డాడు.

ఆ చర్యకి ఉలిక్కిపడి ఛీదరింపుగా కాళ్ళు వెనక్కిలాక్కుంది లావణ్య. "ఛీ! లే! దిగజారుడి వెధవ!" అంది.

"నువ్వెన్నా తిట్టు. ఏమీ అనుకోను. పెళ్ళాం మొగుణ్ణి తిట్టకపోతే ఎవర్ని తిడుతుంది. మీ అమ్మా నాన్న మీద కోపంతో ఈ పని చేసాను. నిజంగా చేసుకుంటానా! అమ్మతోడు" అన్నాడు సంస్కారహీనంగా.

"ఛీ నిన్నింకా నమ్మడానికి నాకింక శక్తిలేదు. పిల్లలకోసం - నాకున్న సంస్కారంతో నిన్ను వదలడం లేదు నేను. ఎంతసేపు మా అమ్మా నాన్నలని ఆడిపోసుకుంటున్నావుగాని. ఒక అర్ధరూపాయి ఏనాడన్నా యింట్లో యిచ్చావా? మమ్మల్నేవన్నా పోషించవా! మాట్లాడితే మీ అమ్మని చూడలేదంటావు. అది నీ ఇల్లయితే నీకు హక్కులుంటాయి. అప్పుడెప్పుడో పిడకలేసేనని - ఇక్కడ కూడా రెండు గేదెలు పెట్టుకుని పిడకలేస్తానంటే మా వాళ్ళేలా ఒప్పుకుంటారు. నీకు నా మనసులో స్థానం పోయింది. బాధ్యతారహితంగా భర్త గౌరవం పొందాలనుకోవడం నీలాంటి మగవాళ్ళ తెలివితక్కువతనం. తాళి ఒక ఆచారం. అందులోనే అన్నీ ఇమిడిపోయి వున్నాయనుకోవడం కేవలం నీ జ్ఞానం. మర్యాదగా ఇంటికి పద. పిల్లలు అడుగుతున్నారు" అంది లావణ్య లేచి నిలబడి.

రమేష్‌బాబు సిగ్గులేకుండా సూట్‌కేసు తీసుకుని ఆమె వెంట నడిచాడు.

వీధిలో కూర్చుంది సరోజని.

వేసవి సాయింత్రం.

అప్పటిదాకా ఉక్కపోతతో ఉక్కిపోయిన ప్రాణాలు ఇన్ని నీళ్ళు పోసుకుని, అట్టలా పౌడర్లద్దుకుని సినిమాలకనో, షికార్లకనో వీధిన పడ్డారు.

సముద్రపు గాలి నగరానికి వీవనలు వీస్తున్న చల్లని సమయం.

వచ్చిపోయేవాళ్ళని చూస్తుండగా హేమంత్ అక్క రాజేశ్వరి ఎవర్నో వేసుకుని రావడం గమనించింది.

చూడగానే ఆమె గ్రహించేసింది.

వాళ్ళు దరిదాపు గంధపు అడ్డబొట్లు, చీరకట్టు లూజ్ జుట్టుముడులు - మళయాళీల్లా వున్నారు.

ఒకరు తల్లీ - మరొకరు పిల్ల.

మనుషులు మాత్రం అవసరం లేకపోయినా విరుచుకుని ఎగిరెగిరి నడుస్తున్నారు.

దగ్గరకి రాగానే "ఎవరే యీ గజ్జెల గుర్రాలూ" అంది రాజేశ్వరితో.

"చెప్పానుకదా, వసుంధరత్త - కూతురు నాగిని" అంది.

"ఆహా! ఎప్పుడన్నా చూస్తేకదా! ఏవిటి సడెన్‌గా ఇన్నేళ్ళకొచ్చారు" అంది వాళ్ళని ఎగాదిగా చూస్తూ.

"దేముండు కలిపేంది ఎప్పుణ్ణో అప్పుడే కదా కలిసేదీ" అంటూ వసుంధర ఏసగా రాగం తీసినట్లు చెప్పింది.

"ఏంటే మీ అత్త మాట్లాడమంటే పాటలు పాడుతుంది" అంది సరోజని మొహమ్మీదే

వసుంధరకి సరోజని చురకలు అర్ధంకాక అలానే చూస్తూ నిలబడింది.

"దీని పేరు నాగినా? బాగానే పెట్టేరు పేరు. రోడ్డంతా పాములానే మెలికలు తిరిగి నడుస్తోంది. దీన్నేనా హేమంత్ మెళ్ళో వేయాలనుకుంటున్నారు." అంది నాగినీని పరిశీలనగా చూస్తూ.

"ఊరుకో అత్తా. వాళ్ళకర్ధమవుతుందేమో!" అంది రాజేశ్వరి సైగ చేస్తూ.

"సంబడం. నేనేవన్నా చాటుగా అంటున్నావా? అర్ధం కావాలనే కదే. సరే ఎక్కడిదాకా? గుడికా" అంది సరోజని.

"లేదు బీచ్‌కి" అంది రాజేశ్వరి.

"కేరళలో సముద్రానికి కొదొవచ్చిందా - మళ్ళీ యిక్కడ కూడా బయల్దేరారు. సరే వెళ్ళండి" అంది సరోజని.

వాళ్ళు వెళ్తుంటే వాళ్ళనే గమనించసాగింది.

ఆ పిల్ల మెలికలు తిరుగుతూ లేని వయ్యారాలు నటిస్తూ వెళ్తుంటే సరోజనికి హేమంత్ గుర్తొచ్చాడు.

చూడ్డానికి తెల్లగానే వుందిగాని మొహమంతా వంకరలే. ఆ లిప్‌స్టిక్‌లూ, బుగ్గల రంగులూ హేమంత్ భరించగలడా!

చమ్కీలు, సెంట్లూ అద్ది వాజులో పెట్టిన కాగితం పువ్వులా వుంది.

వెంటనే వరూధిని గుర్తొచ్చింది.

'అయ్యో మాయదారి పిల్ల. నీ దారంతా ముళ్ళే' అనుకుంది బాధగా.

హేమంత్ ఎలా గెలుస్తాడో - తండ్రినెదిరించి - నిలబడగలడా! ముసలాడు అసాధ్యుడు. వాడి బుర్రలో ఏ ఆలోచన వస్తుందో చెప్పలేము. బ్రతికినన్నాళ్ళూ పెళ్ళాన్ని నంజుకు తిన్నాడు. నీటికావి లుంగీ కట్టుకుని చొక్కాలేకుండానే మూడొంతుల జీవితం గడిపేసాడు. ఏ పెళ్ళి సంబంధంనాడో, పెళ్ళినాడో స్వాతంత్రదినం రోజు జెండాలు అతని వంటి మీద చొక్కా గాలికి ఊగుతున్నట్లు వేలాడేది.

"బావా! నువ్వా, ఎన్.టి.రామారావనుకున్నాను. సినిమాల్లో ప్రయత్నించకూడదూ! రామారావిట్టే పడిపోతాడు. జెండామీద కపిరాజులా తెగ నీలగచ్చు నువ్వు" అనేది.

నిజంగా రామారావయిపోయినట్లుగా బొక్కి బుగ్గల నిండా నువ్వు దాచుకుని "ఛీ నోర్ముయ్" అనేవాడు కోపం నటిస్తూ.

హేమంత్ తల్లి తనవైపు చూసి ఏమీ అనొద్దన్నట్లుగా సైగ చేసేది.

"ఏమాటంటే ఆ మాటంటాడే నిన్నవమానపరిస్తే నాకు బాధకదా" అని చెప్పేది చాటుగా.

నిజమే వాడి నాలుక నిండా తుమ్మ ముళ్ళే మాట మర్యాద లేదు. ప్రేమలేదు.

ఎలా కాపురం చేసిందో ఆ యిల్లాలు, తలచుకుంటే దుఃఖమొస్తుంది.

ఆ కథ ముగిసిందనుకునే లోపున ఈ రాహువు హేమంత్ జీవితంలోకి ప్రవేశిస్తున్నాడనే చింత ఎక్కువయిపోయింది సరోజనికి.

అతనికీ సంగతి చెప్పి ముందే జాగ్రత్త పడమనాలి. ఫోను చేస్తే బాగుండును" అనుకుంటూ జారిపోయిన జుట్టుముడేసుకుంటూ లోనికి నడిచింది సరోజని.

చక్రవర్తి తూలుతూ సెక్షన్‌లోకి వచ్చాడు.

సెక్షనంతా ఒక్కసారి గుపున లిక్కర్ వాసనొచ్చి అందరూ తలెత్తి అసహనంగా చూశారు.

"ఎవర్నువ్వు? ఎవర్నువ్వు" అంటూ వసంత అడ్డుకోబోయింది.

"ష్!" చక్రవర్తి కోపంగా వసంతని తోసినంత పనిచేసి "ఆడెక్కడ?" అన్నాడు.

ముకుందం కొంచెం తెలివితేటలుగా లేచి నిలబడి "ఎవరండీ మీరు, ఎవరు కావాలి?" అన్నాడు గొంతులో ఎక్కడలేని సౌమ్యత కొని తెచ్చుకుని.

"వాడే.. వాడి పేరేంటి? ఆఁ రమేషు ఆఁ! ఆఁ రమేషు ఆఁ ఆఁ! రమేష్" అన్నాడు నత్తుతూ

ముకుందం అతని వాలకం చూశాడు.

మాసిన చొక్కా, దానిమీద జర్దా తిన్న డాగులు, చాలా పక్కా తాగుబోతని అర్థమవుతుంది.

అతన్ని కంట్రోల్ చేయాలని ప్రయత్నించడం వృధా అని రమేష్‌బాబు ఛాంబర్ వైపు చూపించాడు.

చక్రవర్తి తూలుకుంటూ రమేష్ బాబు గదిలోకెళ్ళి 'గుడ్మార్నింగ్ బాస్!' అన్నాడు కుర్చీ సర్రున లాక్కుని కూర్చుంటూ.

రమేష్ బాబు అతన్ని చూసి వులిక్కిపడ్డాడు.

"ఏంటి, ఏంటిలా వచ్చేసావు వెళ్ళిపో" అన్నాడు కంగారుగా.

"వెళ్తానులే. నువ్వెంత తొందరగా పని జరిపిస్తే... అంత తొందరగా" అన్నాడు చక్రవర్తి గారపళ్ళు బయటపెట్టి నవ్వుతూ.

"పనేంటి? ఇది ఆఫీసు. అయ్ సే గెటవుట్!" అన్నాడు రమేష్ అసహనంగా.

బదులుగా టేబుల్ మీదున్న టేబుల్ వెయిట్‌ని గట్టిగా ఎత్తి టేబుల్‌మీద కొడుతూ "తెల్సులేవయ్యా! నేను కూడా ఇంజనీర్‌గా చేస్తూనే డిస్‌మిస్సయ్యాను. ఏంటా ఫైలు? ఓహో! ఆర్బిట్రేషనా, ఇలాంటి కేసుల్లో బాగా గిడుతుంది కదా! ఆ ఒంగోలు కాంట్రాక్టరుగాడు ఈ కేసులోనే నన్నిరికించి సస్పెండ్ చేయించాడు జాగ్రత్త మరి" అన్నాడు.

రమేష్‌బాబుకి పిచ్చెక్కిపోతున్నది.

***ఒక పిచ్చివాణ్ణి భరించొచ్చు. ఒక వ్యసనపరుణ్ణి కూడా భరించవచ్చు. ఒక మేధావి అయిన పిచ్చివాణ్ణి భరించలేము వాడికి పదితలల తెలివి వుంటుంది కానీ హృదయం వుండదు. ఇప్పుడా హృదయం లేని మెదళ్ళే ప్రపంచాన్ని నాశనం చేస్తున్నాయి.***

"సరే! ఎందుకొచ్చావ్?" అన్నాడు తగ్గిపోతూ

"చక్రవర్తి ఎందుకొస్తాడు. డబ్బుకావాలి. అయ్ వాంట్ మనీ" అన్నాడు పేపర్ వెయిట్ గిరగిరా తిప్పుతూ.

"డబ్బా! నా దగ్గరెక్కడిది? నన్నడుగుతావేంటి?" అన్నాడు అసహనంగా.

బదులుగా పకపకా నవ్వాడు చక్రవర్తి.

"ఏం పాపం? ఇంకా ఏ కాంట్రాక్టరూ రాలేదా?"

"ఏం మాట్లాడుతున్నావ్ నువ్వు? ఇదిగో నా ఖర్చులుకని తెచ్చుకున్నాను. ఈ అయిదొందలూ వుంచు" అంటూ జేబులోని అయిదొందల నోటు ఇవ్వబోయాడు రమేష్‌బాబు.

"ఛీ!" అంటూ విసిరి కొట్టాడు చక్రవర్తి.

"చక్రవర్తి నోరు తెరిచి అడిగేడంటే పదివేలకి తగ్గడు. సింహం. ఏవనుకుంటున్నావ్? తియ్యి."

రమేష్‌బాబు కళ్ళు బయటకి పొడుచుకొచ్చినంత పనయ్యింది.

"ఏంటీ, పదివేలా! సంపాదిస్తే తెలుస్తుంది. నా దగ్గర లేవు" అన్నాడు కోపంగా.

"లేకపోతే అడుక్కుని ఇవ్వు"

అప్పుడే ఛీఫ్ ఇంజనీర్ దగ్గర్నుండి ఫైలు తీసుకుని లోనికి రాబోయిన హేమంత్ అక్కడి వాతావరణం చూసి తక్కున స్ప్రింగ్‌డోర్ పట్టుకుని నిలబడిపోయాడు.

చక్రవర్తి అతనివైపు చూశాడు.

"కాస్సేపాగిరా హేమంత్" అన్నాడు.

హేమంత్ తలపంకించి చక్రవర్తిని ఆశ్చర్యంగా చూస్తూ వెళ్ళిపోయాడు.

"ఆ వచ్చిందెవరో తెలుసా?" రమేష్‌బాబు చక్రవర్తివంక వెటకారంగా చూస్తూ అడిగాడు.

"ఎవడైతే నాకేంటి.. డబ్బు తియ్యి. తాగి నాలుగ్గంటలు దాటింది. పిచ్చెక్కిపోతున్నది" అన్నాడు అసహనంగా.

"అలా అంటే.. ఎలా? తెలుకోవల్సిన వ్యక్తి. మీ ఆవిడ బాయ్‌ఫ్రెండ్"

ఆ మాట విని చక్రవర్తి నొసలు కోపంతో ముడుచుకుంది.

ఆ వెంటనే సర్దుకుంటూ "డబ్బు సంగతి చూడు" అన్నాడు కోపంగా.

"వాణ్ణెళ్ళి అడుగు"

"..రేయ్! రమేష్ నాటకాలాడకు. ఎంత తాగినా ఈ చక్రిగాడికి బుర్ర పనిచేస్తూనే వుంటుంది. నువ్వు నన్నెందుకు పనిగట్టుకుని లాడ్జికి పిలిచేవో నాకు తెలియదనుకుంటున్నావా! ఈడంటే నీకేదో ద్వేషం. నా ద్వారా నీకక్ష తీర్చుకోవాలనుకుంటున్నావ్. నీ పప్పులు నా దగ్గరుడకవ్. నా కోసం నేను ఏవన్నా చేస్తానురా. నీకోసం కాదు. మర్యాదగా డబ్బులివ్వి" అంటూ గొంతు పెంచాడు చక్రవర్తి.

రమేష్ ఇక శ్రుతి మించుతుందని గ్రహించి బజ్జర్ నొక్కాడు. వసంత వచ్చి నిలబడింది.

"వెళ్ళి పద్మనడిగి ఒక అయిదువేలుతే" అన్నాడు.

"అయిదేంటి, పది, అక్షరాలా పదివేలు" అన్నాడు చక్రవర్తి రెండు చేతులుకున్న పదివేళ్ళని చూపిస్తూ.

"వుండవు బాస్. రేపు లాడ్జికిరా! ఇస్తాను" అన్నాడు రమేష్ బాబు కాళ్ళ బేరానికొస్తూ.

వసంత వెళ్ళి అయిదువేలు తెచ్చి రమేష్‌బాబు చేతికిచ్చింది.

రమేష్ డబ్బు అతని చేతిలో పెడుతూ "ఇక ఆఫీసుకెపుడూ రాకు" అన్నాడు.

చక్రవర్తి డబ్బుని ముద్దుపెట్టుకుంటూ "పిచ్చి మాటలు..! బాంక్ దగ్గరికి రాని కష్టమరుంటాడా బాస్. రప్పించుకునేట్లు చేసుకోకు. సరేనా!" అంటూ లేచి నిలబడి "అవును ఆడిపేరేంటన్నావు?" అనడిగాడు.

"హేమంత్"

"ఓ.కే." అంటూ బయటకి నడిచి హాల్లో తన పనిచేసుకుంటున్న హేమంత్‌ని ఎగాదిగా చూసుకుంటూ వెళ్ళిపోయాడు చక్రవర్తి.

అతడటు వెళ్ళగానే "ఈ తాగుబోతు కేసేంటి కొత్తగా" అంటూ లోపలికొచ్చింది పద్మ.

"నా ఏడుపు నేనేడుస్తుంటే... నీ గొడవేంటి?" అన్నాడు రమేష్‌బాబు చిరాగ్గా.

"మీ ఏడుపు మీతో వుంటే ఫర్వాలేదు. నా దగ్గర డబ్బుకి ఎందుకు పంపుతున్నారు?" అంది పద్మ వెటకారంగా.

"ఏంటి, అంతా నీదిలా చెబుతున్నావు. పొద్దున్న ఆ సుబ్బారెడ్డిని ఇరవై నీకిచ్చి వెళ్ళమన్నాను."

"పదే ఇచ్చాడు" అంది పద్మ వేళ్ళు విరుచుకుంటూ.

"అంటే పది నొక్కేసేవా?"

"బాగుంది. నా ఉద్యోగానికి రిస్కులేదా! ప్రతివాడు నాకిచ్చి వెళ్తున్నాడని ఎవరైనా పసిగడితే నా కొంప కొల్లేరవ్వదా?" అంది కోపంగా.

"సరే! ఏదో ఒకటి ఏడ్వండి. నన్ను కాస్సేపు వదిలెయ్యి" అన్నాడు రమేష్ విసుగ్గా.

"ఆ మాటే నేను అంటున్నా" అని విసురుగా లేచి వెళ్ళిపోయింది పద్మ.

హేమంత్ ఆఫీసు నుండి బయటకొచ్చేసరికి బయట స్కూటీ మీద వెయిట్ చేస్తూ వుంది వరూధిని.

"ఏయ్, హేమూ!" అంది తనని గమనించకుండా వెళ్తున్న హేమంత్‌ని పిలుస్తూ.

హేమంత్ వులిక్కిపడి చూసి "ఏంటిక్కడ, నేను ఇంటికి వచ్చేవాణ్ణి కదా!" అన్నాడు కొంచెం కంగారుగా.

"ఎన్నాళ్ళని ఇంట్లో కూర్చుంటాం. అందుకే మనం తొలిదినాల్లో కలిసిన ప్రాంతంలో కూర్చోవాలని" అంది.

హేమంత్ స్కూటీ ఎక్కాడు.

ఇద్దరూ టాంక్ బండ్ మీద కెళ్ళారో లేదో అక్కడ జనం గుమికూడి వున్నారు.

ఇద్దరూ దిగి టాంక్‌బండ్ మీద నిలబడి రెయిలింగ్ పట్టుకుని చూశారు.

ఎవరో ఆత్మహత్య చేసుకోడానికి నీటిలో దూకేసాడు. అతన్ని రక్షించడానికి ఈతగాళ్ళు ప్రయత్నిస్తున్నారు. జనానికి వినోదం, కాలక్షేపం కావాలి. అందరూ గుమికూడి ఎవరికి తగ్గ వాఖ్యానాలు వాళ్ళు చేస్తున్నారు.

కాస్సేపటికి ఆ గజ ఈతగాళ్ళు అతి కష్టం మీద ఆ వ్యక్తిని ఫుట్‌పాత్ మీద పడుకోబెట్టారు.

ఇంతలో జనంలో ఎవరో ఒకామె గుర్తుపట్టి "ఈడు చిన్న శీను కొడుకు కదూ! అయ్యో ఏమొచ్చిందీడికి" అంది.

పోలీసులు ఆవిడ చెప్పిన వివరాల సహాయంతో ఇంటికి ఫోను చేసారు.

హేమంత్ అతన్ని పరికించి చూశాడు.

పదిహేనేళ్ళ కుర్రాడు.

ఈ వయసుకి చచ్చిపోవాల్సిన అవసరం ఏమిటి, పరీక్షకాని  ఫెయిలయ్యాడా! ఆరోజు కాని ముందు రోజుగానీ ఎలాంటి పరీక్షా ఫలితాలూ విడుదల కాలేదు.

ప్రేమలు విఫలమయ్యే వయసూ కాదు.

సరిగ్గా అప్పుడే అతని తల్లి కాబోలు వలవలా ఏడుస్తూ గుండెలు బాదుకుంటూ వచ్చింది.

ఇప్పుడాశ్చర్యపోవడం హేమంత్ వంతయ్యింది.

వసంత.

వసంత కొడుకా!

ఇక అనుకోని బాధ్యత హేమంత్ పైన పడింది.

అంబులెన్స్ వెంట హేమంత్ వరూధిని బయల్దేరారు. డాక్టర్స్‌తో మాట్లాడాడు. పోలీసులకి ముట్టజెప్పాడు. ఈ దేశంలో మన నీతి మనల్ని ఉద్ధరించదు. గొంగళిలో తింటున్నాం. అవతల ప్రాణం. అందుకే హేమంత్ ఏమీ ఆలోచించలేదు.

వరూధినిని ఇంటికి పంపి మూడు రోజులు ఆస్పత్రిలోనే వున్నాడు.

పిల్లాడు బ్రతికాడు.

వసంత హేమంత్ కాళ్ళకి మొక్కినంత పనిచేసింది.

"మీ ఋణం తీర్చుకోలేను సార్. టయిముకి దేముడి ఈడనే వుండి కాపాడారు." అంటూ వలవలలాడింది.

"అద్సరే, ఎందుకు వీడీ పనిజేసేడు" అనడిగాడు హేమంత్.

"ఏం జెప్పాల సర్. లూనా అడిగిండు. కొనిచ్చా. ఇప్పుడదిగాదు కెనటిక్ హోండా గావాల్నంట. శానా కోరికలు బాబూ! ఏడదెచ్చేది? ఒకట్నా రెండా! ఆడు తాగి తాగి సచ్చిండు. ఈడు నన్ను సంపి బతుకుతుండు."

"ఏం పేరు?"

"అఖిలేశు"

"సరే మీరు ఇంటికి వెళ్ళండి. నేనొచ్చి మాట్లాడతాను"

వసంత నమస్కరించి కొడుకుని తీసుకుని వెళ్ళింది.

ఈ సంగతి తెలిసి ఆఫీసునుండి ఒక్కరు కూడా వచ్చి పరామర్శించక పోవడం ఆమెని ఖేదపరిచింది.

చీమ చిటుక్కుమంటే జీపులు కార్లేసుకుని వెళ్ళి అందర్నీ పరామర్శించి వచ్చే స్టాఫ్ తనని అలా నిర్లక్ష్యం చేయడం చూసి ఆమె హృదయం కుమిలిపోయింది.

హోదాలు, పలుకుబడి, డబ్బువుంటే వుంటే గాడిద కాళ్ళు కూడా పట్టుకునే జనం నైజం తెలిసి ఖిన్నురాలయిపోయింది.

ఆమెకు హేమంత్ ఒక దేవుడిలా కనిపించాడు.

అప్పుడే హేమంత్ వరూధినితో సహా వాళ్ళింటికి వెళ్ళేడు.

ఆ టైముకి అఖిలేషు కూర్చుని తల్లి కోసిచ్చిన పళ్ళు తింటున్నాడు.

"మా సారు" అని పరిచయం చేసింది వసంత. అతని మొహంలో గౌరవం కాని పశ్చాత్తాపం కాని.. ఏమీలేవు.

పైగా ఏదో ఘనకార్యం చేసిన వాడిలా గర్వంగా వున్నాడు.

హేమంత్ ఇల్లంతా పరికించి చూశాడు.

ఇంట్లో టి.వి, కూలర్ - కావాల్సిన సామానంతా వుంది.

హేమంత్ పక్కన కూర్చుని "ఎందుకు చచ్చిపోవాలనుకున్నావ్?" అనడిగాడు.

వాడు హేమంత్‌ని అదోలా చూసి తలతిప్పుకున్నాడు.

"ఈ సామానంతా మీ ఆయన హయాంలోనే కొన్నావా? " వసంత నడిగాడు హేమంత్.

"యాడిది సారు! ఆడుతాగి చేసిన అప్పులకే శానా డబ్బు గట్టినా! ఇప్పుడియ్యన్నీ నే గొన్నయ్యే."

"నువ్వు కూడా చచ్చిపోతే మరివీడెలా బతుకుతాడు?"

ఆ ప్రశ్నకి వరూధినితో పాటూ ఆ కుర్రాడు ఆశ్చర్యంగా చూశారు.

"అవును వసంతా! రోజూ వీడికోరికలు తీర్చలేక చచ్చేబదులు ఒక్కసారే చావొచ్చుకదా! అప్పుడు వీడు రోడ్డుమీద అడుక్కున్నా ఎవడూ పైసా వెయ్యడు. తాడు తెచ్చాను. ఉరేసుకుంటావా? " అంటూ జేబులోంచి తాడు తీసాడు.

"హేమంత్ ఏంటి నువ్వుచేస్తున్న పని" అంది వరూధిని కంగారుగా.

"ఇంకెలా చెప్పాలో నాకు తెలియడం లేదు. వాడి కోరికలకీ, వాడి ఆర్థిక స్థోమతుకీ సారూప్యముందా? "

"ఆర్థిక స్థోమతు ఏ స్థాయిలో వున్నా పిల్లలందరివీ ఒక్కటే కోరికలు. ఇవన్నీ తీర్చడం తల్లిదండ్రులకి సాధ్యమవుతుంది. తల్లిదండ్రులంటే ఏ.టి.ఎం కార్డులా! తండ్రి తాగి తాగి చచ్చాడు. ఏదో ప్రభుత్వం పుణ్యమా అని వచ్చిన ఉద్యోగంతో ఆవిడ బతికిస్తుంది. నేను చూడు వాచీ కూడా పెట్టుకోను. వాచీదేనికి, టైము చూపించడానికి. గోడకి గడియారముంది. ఇక దేనికి? ముందు బాగా చదువుకుని పెద్ద జాబ్ చేసి కోరికలు తీర్చుకో. నాకు నీమీద కోపం లేదు. తల్లిని బాధించకూడదు" అన్నాడు అఖిలేష్ మీదచెయ్యివేసి.

అఖిలేష్ తలవంచుకున్నాడు.

కళ్ళ వెంట నీళ్ళు జారిపడ్డాయి.

హేమంత్ వసంత వైపు తిరిగి "మీదీ తప్పుందమ్మా. మీరే పిల్లల్ని కన్నట్లు వాళ్ళ గొంతెమ్మ కోరికలన్నీ తీర్చడం తప్పుకాదా! వాళ్ళని కొంచెం కష్టపెట్టే పెంచాలి. అన్నీ తెలియబరచాలి" అని చెప్పి బయల్దేరాడు హేమంత్.

వసంతతోపాటు అఖిలేష్ కూడా లేచి నిలబడ్డాడు.

"సారీ సారూ!" అన్నాడు అఖిలేష్.

"సారీ వద్దు. బాగా చదువుకో. మన చేతిలో వస్తువులతో పెట్టుకున్న నగలతో విలువరాదు. అది ఆయా వస్తువుల విలువ మాత్రమే. నీ కేరక్టర్‌తో నీ విలువ పెంచుకో. సరేనా! " అంటూ బయటకొచ్చాడు హేమంత్.

అతనితో పాటు పరిగెత్తినట్లు బయటకొచ్చి "యూ ఆర్ గ్రేట్ హేమూ" అంది వరూధిని.

"ఎందుకు?" నవ్వాడు హేమంత్.

"నీలో మరో మనిషిని చూశాను. రియల్లీ హేట్సాఫ్ యు టూ" అంది ఆరాధనగా.

హేమంత్ నవ్వి "పద, ఇంకో మనిషిని కూడా చూపిస్తాను" అన్నాడామె తలమీద మురిపెంగా తడుతూ.

వరూధినీ నవ్వింది.

హృదయమంతా వెన్నెల పరుచుకున్నట్లుగా.

**సరోజని వాకిట్లో కూర్చుంది.**

ఎక్కడ కూర్చున్నా ఒకటే!

లోకమంతా శూన్యంగా అనిపిస్తుంది. దేనికోసం ఎదురు చూడాలి? ఎంతసేపు చూస్తే ఏం ఒరుగుతుంది. ఒకప్పుడు పళ్ళికిలించుకుంటూ కనకారావు దూరం నుంచి రావడం చూసి మనసు పురివిప్పి ఆడేది. చేతిలో అరడజను అరటి పళ్ళో, జిలేబీనో పట్టుకుని ఇంటికొచ్చేవాడు.

వాకిట్లోనే సంచి చేతికివ్వబోతుంటే తను కసురుకునేది. "అక్కడదాక తెచ్చినోడివి లోపలికి తేలేవా? నన్ను చూడగానే మగ బడాయి పొడుచుకొచ్చిందా?" అనేది

కనకారావు ఇంకాస్త పళ్ళికిలించేవాడు.

"చాల్లే సంబడం, ఊరికే నవ్వకు. నవ్వకుండానే పళ్ళన్నీ బయటే వుంటాయి. ఏంటో ఇంతందగాడు దొరకలేదని.. నా బాబు నాకు నిన్నంట గట్టాడు" అనేది సరోజని.

అతను స్నానం చేసి భోజనానికి కూర్చునే వరకూ సరోజని మాటలకి హద్దుండేది కాదు.

అన్నిటికి నవ్వే అతని జవాబు.

సరోజని అతని జ్ఞాపకాలతోనే చీకటి పడేవరకూ వాకిట్లోనే కూర్చుంది.

ఇంతలో సున్నంరాయిలా దొర్లుకుంటూ రోడ్డుకడ్డం పడి వసుంధర రావడం గమనించింది సరోజని.

ఆవిడ సరోజని వైపు చూసి నవ్వుతూ "బాగుండిరా?" అంది.

"ఏదో ఒక గుండిగలే కానీ..నువ్విలా రా!" అంటూ పిలిచింది.

వసుంధర దగ్గరగా వచ్చి "ఇదియా ప్రసాదం" అంది.

"అద్సరేగాని నువ్వు తెలుగుదానివేగా! తెలుగునెందుకలా భ్రష్టు చేసి మాట్లాడతున్నావు?" అంది సరోజని.

బదులుగా ఆవిడ నవ్వి "శానాదినములుగా అక్కణ్ణేగా వుండటం" అని సరోజని పక్కన అరుగుమీద కూర్చుంది వసుంధర.

"వచ్చి చాలా రోజులయిందిగా. ఇక బయల్దేరరా?" అనడిగింది సరోజని.

"వాడుదా వస్తే నిశ్చయం జేసుకుని పోతాం"

"ఎవడుదా?"

"వాడే, హేమంతు"

సరోజని గుండెలో బాంబు పేలినట్లయింది.

"వాడికి చెప్పారా?"

"అదంతా అన్నపని. ఫోను చేసినాడు. వంట్లో బాగుండలేదని చెప్పినాడు"

ఆ మాట విని సరోజని డీలా పడిపోయింది.

"సరే వెళ్ళిరా" అంటూ లోపలికొచ్చింది. ఆ వెంటనే కాలుగాలిన పిల్లిలా అటూ యిటూ తిరిగి చిన్నగ్లాసు తీసుకుని హేమంత్ ఇంటికెళ్ళింది.

"ఏంటిలా వచ్చావ్?" అన్నాడు హేమంత్ తండ్రి సుందరం.

"ఏదయినా అప్పడుగుదామని."

"అంటే ఏం కావాలో నీకే తెలియదన్నమాట" వెటకారంగా అన్నాడు సుందరం.

"నీ యింట్లో అసలేవుందో తెలుసుకుని.. దాన్ని బట్టి అడగాలని."

"నీతో ఎవడు మాట్లాడి గెలవగలడులే.. పో లోపలికి" అన్నాడు సుందరం చిరాగ్గా.

"అయ్యో కాసేపు నిలబడి మాట్లాడటానికి పనికొచ్చే మొహమేనా" అంటూ లోపలికెళ్ళింది సరోజని. వసుంధర, నాగిని కలిసి టి.వి దగ్గర కూర్చుని సినిమా చూస్తున్నారు.

సరోజని గబగబా వంట చేస్తున్న రాజేశ్వరి దగ్గరకి వెళ్ళి "ఏంటే ఆడికి నిశ్చితార్థం చేస్తున్నారా?" అంది గుసగుసగా.

"అవునత్తా! హేమంత్‌కి రమ్మని ఫోను చేసాడు నాన్న." సంబరంగా చెప్పింది రాజేశ్వరి.

"ఎంత కులుకుతూ చెబుతున్నావే! అంతకన్నా వాడికి పురెయ్యండి. పీడా వదులుతుంది" అంది సరోజని కోపంగా.

అదిరిపోయినట్లుగా చూసింది రాజేశ్వరి.

"అవునే, వాడి మనసేంటో మీక్కర్లేదు. మీ మీ స్వార్థాలే మీవి. మీ అమ్మే గనక వుంటే ఇలా జరిగేదా?"

"నా కర్థంకావడంలేదు అత్తయ్యా మీ మాటలు."

"అవున్లే, నువ్వంటే ఇంట్లో వున్న మేనమావని ప్రేమించి టింగురంగా అంటూ పెళ్ళి చేసుకున్నావు. పైసా కట్నం లేకుండా తేరగా వచ్చాడని మీ బాబు కాళ్ళు కడిగి వదిలించుకున్నాడు. వాడు కూడా ప్రేమించాడే ఆ పిల్లని చేసుకోనివ్వకపోతే అంతే. నా నోటితో చెప్పను."

సరోజని మాటలు విని మ్రాన్పడిపోయింది రాజేశ్వరి.

సరోజని చెయ్యి పట్టుకుని గబగబా పెరట్లో బావిదగ్గరకి తీసుకెళ్ళి "ఇప్పుడు చెప్పు వివరంగా" అంది ఆందోళనగా.

"సవరదీసి సాగదీసి చెప్పడానికిదేం టి.వి సీరియల్ కాదు. ముందు వాణ్ణి రానివ్వకుండా ఆపు. తర్వాత కథ చెబుతాను" అంది సరోజని చిరాగ్గా.

"ఎలా? వాడొచ్చేస్తాడిప్పుడు. మావయ్య స్టేషన్‌కి వెళ్ళాడు కూడ."

అంతే.!!

సరోజని గ్లాసక్కడ పడేసి బొడ్లో చిల్లర సరిచూసుకుని, వీధిలోకి వచ్చి ఆటో ఎక్కింది స్టేషన్‌కి పోనివ్వమని.

సరోజని ఆటోదిగి వగరుస్తూ పరిగెత్తుకొచ్చేసరికి మావయ్యతోపాటు వస్తున్న హేమంత్ ఎదురుపడ్డాడు.

"ఆంటీ"

హేమంత్ పిలిచేసరికి సరోజని అతన్నిచూసింది.

"ఏంటత్తా నాన్నకెలా వుంది?" అన్నాడు కంగారుగా.

"ఆయనకేం, ఎండిపోయిన శొంఠికొమ్ములా ఎప్పుడు నవనవలాడేడు. నువ్వింటి కెళ్ళకు. మా యింటికిరా!"

ఇద్దరూ అర్థం కానట్లుగా సరోజని వైపు చూశారు.

"ముందు మా యింటికి పదండి. ఇక్కడ చెప్పడానికి నాకు ఓపికలేదు" అంది సరోజని జారిపోయిన జుట్టుముడి వేసుకుంటూ.

ఆ యిద్దరూ ఆమెను అనుసరించారు.

"అసలెందుకు నీ బాబు నిన్ను పిలిపించాడో తెలుసా?"

ఇద్దరికి కాఫీ యిచ్చి నేలమీద కూలబడి అడిగింది సరోజని.

"నాన్నకి సీరియస్సని.." అనుమానంగా మేనమామ వంక చూస్తూ అన్నాడు హేమంత్.

అతను తలదించుకున్నాడు.

"బెల్లం కొట్టే రాయిలా అలా కూర్చుంటావేంటి, చెప్పు హేమంత్‌కి" అంది సరోజని కోపంగా.

"ఇదంతా ఎందుగ్గాని నీ బాబు సుబ్బరంగా వున్నాడు. నీకు నిశ్చితార్థం చేయాలని పిలిపించాడు. నీ మేనత్త, దాని కూతురు ఇంట్లో తిష్టేసుక్కూర్చున్నారు. ఆ మేడ కోసం యీళ్ళు అప్పిచ్చేరంట. ఇప్పుడిక నీ బాబు పీక మీద కత్తి పెట్టి కూర్చున్నారు. ఆళ్ళకి నీతో కూడా అవసరం లేదు. కేవలం ఆ మేడ కోసవే.... ఇదంతా. ఆ మాట నీ కాబోయే అత్త చెప్పింది" అంది.

హేమంత్ తెల్లబోయి చూశాడు.

"ఇప్పుడేం చేద్దామనుకుంటున్నావ్?"

హేమంత్ మాట్లాడలేకపోయాడు.

"ఇంటి కెల్లావో ఆడు నిన్నెల్లనివ్వడు. ఉరేసుకుంటానని బెదిరించి ఈ పెళ్ళి కుదిరిస్తాడు. నువ్వు సినిమా హీరోలా ఈ పెళ్ళి చేసుకుని సుబ్బరంగా పిల్లల్ని కంటావ్. ఆ పిల్లగతేంటి?"

"ఏ పిల్ల?" హేమంత్ మేనమామ ఆశ్చర్యంగా అడిగాడు.

"నువ్వుండు అదంతా తర్వాత చెబుతాను."

"ఏంరా ఏమంతూ! మాట్లాడవేంటి, తప్పించుకోడం తెలిస్తేనే తలదూర్చమన్నారు. ఇప్పుడేంటలా కూర్చున్నావ్? సరే, నే చెప్పింది విను. నువ్వు రాలేదు. వెళ్ళి వాడికి శెలవు దొరకలేదో ఏంటో రాలేదని చెప్పు" అంది హేమంత్ మేనమామ వైపు తిరిగి.

"నా కర్థమయ్యేట్లు చెప్పండి" అన్నాడతను తికమకగా చూస్తూ.

"ఈడొకమ్మాయిని ప్రేమించాడు. ఆ పిల్ల లేకపోతే ఛస్తానన్నాడు. అర్థమయ్యిందా? నీకు డబ్బు కావాల్సి నేనిస్తే ఆ సుబ్బిగాడి చెరనుండి ఆ పిల్లే తనిల్లు తాకట్టు పెట్టి డబ్బిచింది. ఇప్పుడర్థమయ్యిందా?" అంది సరోజని.

"కాని... మావయ్యా..."

"ఏంటి మావయ్యా!? ఆడిపెళ్ళి ఆడిష్టమొచ్చినట్లు చేసుకుంటే.. ఈడికేంటి నొప్పి? నువ్వెళ్ళి రాలేదని చెప్పు. అంతే!" అంది సరోజని అసహనంగా.

అతను తలూపి వెళ్ళిపోయాడు.

"మీ యింట్లో కథ ఇప్పుడే మొదలయ్యింది. ఇక ముందు ముందు మీ నాన్న చాలా చేస్తాడు అన్నిటికీ సిద్ధపడకపోతే... ఇక అంతే సంగతులు. ఆలోచించుకో!" అంది సరోజని హెచ్చరిస్తున్నట్లుగా.

హేమంత్ ఆలోచిస్తూ కూర్చున్నాడు.

చివరకు సరోజని వైపు చూస్తూ "నేను దేనికైనా సిద్ధపడతాను గాని.. వరూధినీని వదులుకోను ఆంటీ" అన్నాడు స్థిరంగా.

ప్రేమ ఎప్పుడూ ఒకటే.

ప్రేమ కథల మలుపులే వేరు.

రైల్లో తిరిగి వస్తున్నప్పుడు అతనికి చాలా వేదనగా వుంది. వరూధినిని ఎవరో తననుండి బలవంతంగా లాగేసుకుంటున్నారేమో అని అతను భయపడిపోతున్నాడు.

మొదటిసారి తండ్రి మీద అతనికి చెప్పలేని అసహ్యమేసింది. ప్రేమనే పదానికి అర్థం తెలీని మూర్ఖుడు, స్వార్థపరుడు. తల్లిని ఒక యంత్రంలా చూశాడు. అతనికి ఏ కమిట్‌మెంటూ లేదు. తాను గొప్ప ఆస్తిమంతుడనిపించుకోవాలనే తాపత్రయంతో ఆ మేడ చుట్టూ తిరిగాడు. దానికోసం ఏమయినా చెయ్యడానికి సిద్ధపడుతున్నాడు.

అసలీ పెళ్ళేమిటి?

అప్పుడెప్పుడో తను పుట్టకమునుపే పక్కింటి టీ కొట్టు మళయాళీతో వెళ్ళిపోయి పెళ్ళిచేసుకుంది తన మేనత్త. అదృష్టం బాగుండి టీ కొట్టు రెస్టారెంటయి బాగుపడింది. అప్పుడు చంపేస్తాను, పాడిచేస్తాను అన్న మేనత్త యిప్పుడు డబ్బులొచ్చేసరికి వియ్యానికి పనికొచ్చింది.

ఆ మేడ చుట్టూ అందరి బ్రతుకుల్ని తాడేసి తిప్పుతున్నాడు. ఎంతవరకు తెస్తాడో?

మొదటిసారిగా భయమేసింది హేమంత్‌కి.

అసలీ అక్కర్లేని విలన్లేంటి - ఎందుకు వాళ్ళు సుఖంగా వుండి యితరుల్ని సుఖంగా వుండనివ్వరు. వాళ్ళ తప్పులు వాళ్ళెందుకు తెలుసుకోరు.

రమేష్‌బాబుకి వరూధిని మీద కోపం ఎందుకు? పెళ్ళయి పిల్లలున్న వ్యక్తి భార్యకి విడాకులు లేకుండా వరూధినిని చేసుకోవడానికి వెళ్ళడం - ఆపైన నీచంగా మాట్లాడటమే కాకుండా - ఆమె మీద కక్ష పెంచుకోవడం దేనికి?

భార్యని హింసించి విడాకులు తీసుకున్న చక్రవర్తి చట్టాన్ని ఉల్లంఘించి వరూధిని మీద ఇంకా పెత్తనమున్నట్లుగా డబ్బుకోసం దాడి చేయడం - ఎంత నీచం.

రేపు తన తండ్రి కూడ!!!???

వీల్లేదు. అలా జరగడానికి వీల్లేదు తలవిదిలించుకున్నాడు హేమంత్ ఒక్కసారిగా.

ఆ రోజు సాయింత్రం తిన్నగా వరూధిని దగ్గరకే వెళ్ళాడు హేమంత్.

తిన్నగా తనకు తానుగానే మేడమీద కెళ్తూ "ఒకసారి పైకిరా!" అన్నాడు.

వరూధిని అతని వైపు ఆశ్చర్యంగా చూసి తిరిగి తల్లివైపు చుసింది.

''వెళ్ళు. ఏదో చెప్పాలనుకుంటున్నట్లున్నాడు'' అంది ఆమె నెమ్మదిగా.

వరూధిని పైకి రావడమే ''అయ్ లవ్ యూ వరూ, నిన్ను నేనెన్నటికీ వదులుకోను'' అన్నాడు అతడామెను గాఢంగా కౌగిలించుకుంటూ.

అదే అతని మొదటి కౌగిలి.

అందులో ప్రేమ తప్ప మరెలాంటి కోరికా లేదు.

ఒక పసివాడొచ్చి గట్టిగా తల్లిని హత్తుకున్నట్లుంది.

''ఏమయ్యింది హేమంత్? మీ నాన్నగారెలా వున్నారు? ఎందుకిలా ఎగ్జయిటవుతున్నావ్?'' అంది కౌగిలి విడిపించుకోడానికి ప్రయత్నిస్తూ.

హేమంత్ వదల్లేదు.

అతనికి పెళ్ళి సంబంధం గురించి చెప్పడం కూడా ఇష్టం లేదు.

''ఏం లేదు, ఏం లేదు. ఎందుకో ఈసారి నిన్నొదిలి వెళ్ళడం భరించలేకపోయాను. అంతే'' అన్నాడు.

వరూధిని చిన్నగా నవ్వింది.

నిజానికి ఆమె ఫీలింగ్ కూడా అదే

హేమంత్ ఆమె ఆలోచనల నిండా నిండిపోయాడు. ఆమె ఊపిరిగా మారిపోయాడు.

అందుకే అతనికి సెలక్షన్ వచ్చి వెళ్ళిపోతే ఎక్కడికి వేస్తారో? అంతా భయంగా వుంది.

''అవును హేమ్. నేను కూడా అలానే ఫీలయ్యాను'' అంది గొణిగినట్లుగా. నువ్వు సెలక్టయ్యాక ఎక్కడికి వేస్తారో?'' అంది.

హేమంత్ మాట్లాడలేదు. ''నిన్ను తీసుకెళ్ళిపోతాను వెంటనే'' అన్నాడు నిశ్చయంగా.

''రండి, భోజనానికి''

వరూధిని తల్లి పిలుపుతో ఇద్దరూ ఈలోకంలో కొచ్చారు.

హేమంత్ గ్రూప్ వన్ సెలక్టయ్యాడని తెలియగానే ఆఫీసంతా కలకలం రేగినట్లయింది.

అందరూ హేమంత్‌ని అభినందిస్తున్నారు.

చేతులు పట్టి వూపేస్తున్నారు.

వెంటనే ఛీఫ్ ఇంజనీరు నుండి అతనికి పిలుపొచ్చింది. హేమంత్ వెళ్ళగానే ఆయన నిలబడి కరచాలనం చేసాడు.

''వుయ్యార్ ప్రౌడాఫ్‌యూ! బట్ ఎట్ ద సేమ్ టైమ్ వూయ్యార్ లూజింగ్ ఏ గుడ్ ఇంజనీర్'' అన్నారాయన ఆదరంగా నవ్వుతూ.

హేమంత్ ఆయన ఆఫర్ చేసిన కాఫీ తాగి తనని కొంచెం త్వరగా రిలీవ్ చేయమని కోరాడు.

''ష్యూర్! వెంటనే ఛార్జి ఎవరికయినా హేండోవర్ చేయమని రమేష్‌బాబుకి చెబుతాను'' అన్నాడు.

అదే సమయానికి రమేష్ బాబు ఎదుట హొయలుబోతూ పద్మ కూర్చుని వుంది.

''ఏం చెయ్యగలిగారు? ఇప్పుడు ఆఫీసరుగా వెళ్ళిపోతున్నాడు. రేపోమాపో పెళ్ళి శుభలేఖ కూడా తెచ్చిస్తాడు'' అంది వెటకారంగా.

రమేష్‌బాబు మొహం అసూయతో రగిలిపోతున్నది.

పేపర్ వెయిట్‌ని గుండ్రంగా తిప్పుతూ "ఏదో ఒకటి చెయ్యాలి. ఆలోచించు. వాడు జాయిన్ కాకూడదు సస్పెండ్ కావాలిక్కడే" అన్నాడు కసిగా.

పద్మ హేళనగా నవ్వింది.

"నవ్వుతావేంటి? చెప్పు" అన్నాడు.

"వసంతని పిలవండి"

"వసంతా, ఆవిడెందుకు? " అన్నాడు రమేష్‌బాబు అనుమానంగా చూస్తూ.

రమేష్ బాబు బజ్జర్ నొక్కాడు.

వసంత వచ్చి నిలబడింది.

"నువ్వో పని చెయ్యాలి చేస్తావా?"

వసంత బెదురుగా చూసింది.

"ఈ మాట ఎక్కడన్నా అన్నావో... నీ గతి అధోగతే" అంది పద్మ బెదిరిస్తున్నట్లుగా.

వసంత మాట్లాడలేదు.

పద్మ చెప్పిన విషయం విని రమేష్‌బాబు కూడా ఆశ్చర్యపోయాడు.

"స్త్రీలు దేవతలు, సౌమ్యులు అంటారు కానీ, స్త్రీల కొచ్చినన్ని క్రిమినల్ థాట్స్ మగాడిక్కూడా రావు." అన్నాడు మెచ్చుకోలుగా.

"ఇంతకీ ఏవంటావ్?" అంది పద్మ వసంతకేసి చుసి.

అదే సమయంలో వసంత ఆలోచిస్తున్నది "నిజమే తనొకర్తే చేయగలదు.  చేసి తీరాలి" అనుకుంది మనసులో.

చిన్నగా తలూపింది.

ఆ సాయంత్రం ఏమీ తెలియని వరూధిని హేమంత్‌లు ఒక థియేటర్‌లో సినిమా చూస్తున్నారు భవిష్యత్తు మీద ఆశలతో కలలు కంటూ.

చక్రవర్తి తూలుతూ సెక్షన్‌లోకి వచ్చాడు.

సెక్షనంతా ఒక్కసారి గుప్పున లిక్కర్ వాసనొచ్చి అందరూ తలెత్తి అసహనంగా చూశారు.

"ఎవర్నువ్వు? ఎవర్నువ్వు" అంటూ వసంత అడ్డుకోబోయింది.

"ష్!" చక్రవర్తి కోపంగా వసంతని తోసినంత పనిచేసి "ఆడెక్కడ?" అన్నాడు.

ముకుందం కొంచెం తెలివితేటలుగా లేచి నిలబడి "ఎవరండీ మీరు, ఎవరు కావాలి?" అన్నాడు గొంతులో ఎక్కడలేని సౌమ్యత కొని తెచ్చుకుని.

"వాడే.. వాడి పేరేంటి? ఆఁ రమేషు ఆఁ! ఆఁ రమేషు ఆఁ ఆఁ! రమేష్" అన్నాడు నత్తుతూ

ముకుందం అతని వాలకం చూశాడు.

మాసిన చొక్కా, దానిమీద జర్దా తిన్న డాగులు, చాలా పక్కా తాగుబోతని అర్థమవుతుంది.

అతన్ని కంట్రోల్ చేయాలని ప్రయత్నించడం వృథా అని రమేష్‌బాబు ఛాంబర్ వైపు చూపించాడు.

చక్రవర్తి తూలుకుంటూ రమేష్ బాబు గదిలోకెళ్ళి 'గుడ్మార్నింగ్ బాస్!' అన్నాడు కుర్చీ సర్రున లాక్కుని కూర్చుంటూ.

రమేష్ బాబు అతన్ని చూసి వులిక్కిపడ్డాడు.

"ఏంటి, ఏంటిలా వచ్చేసావు వెళ్ళిపో" అన్నాడు కంగారుగా.

"వెళ్తానులే. నువ్వెంత తొందరగా పని జరిపిస్తే... అంత తొందరగా" అన్నాడు చక్రవర్తి గారపళ్ళు బయటపెట్టి నవ్వుతూ.

"పనేంటి? ఇది ఆఫీసు. అయ్ సే గెటవుట్!" అన్నాడు రమేష్ అసహనంగా.

బదులుగా టేబుల్ మీదున్న టేబుల్ వెయిట్‌ని గట్టిగా ఎత్తి టేబుల్‌మీద కొడుతూ "తెల్సులేవయ్యా! నేను కూడా ఇంజనీర్‌గా చేస్తూనే డిస్‌మిస్సయ్యాను. ఏంటా ఫైలు? ఓహో! ఆర్బిట్రేషనా, ఇలాంటి కేసుల్లో బాగా గిడుతుంది కదా! ఆ ఒంగోలు కాంట్రాక్టరుగాడు ఈ కేసులోనే నన్నిరికించి సస్పెండ్ చేయించాడు జాగ్రత్త మరి" అన్నాడు.

రమేష్‌బాబుకి పిచ్చెక్కిపోతున్నది.

***ఒక పిచ్చివాణ్ణి భరించొచ్చు. ఒక వ్యసనపరుణ్ణి కూడా భరించవచ్చు. ఒక మేధావి అయిన పిచ్చివాణ్ణి భరించలేము వాడికి పదితలల తెలివి వుంటుంది కానీ హృదయం వుండదు. ఇప్పుడా హృదయం లేని మెదళ్ళే ప్రపంచాన్ని నాశనం చేస్తున్నాయి.***

"సరే! ఎందుకొచ్చావ్?" అన్నాడు తగ్గిపోతూ

"చక్రవర్తి ఎందుకొస్తాడు. డబ్బుకావాలి. అయ్ వాంట్ మనీ" అన్నాడు పేపర్ వెయిట్ గిరగిరా తిప్పుతూ.

"డబ్బా! నా దగ్గరెక్కడిది? నన్నడుగుతావేంటి?" అన్నాడు అసహనంగా.

బదులుగా పకపకా నవ్వాడు చక్రవర్తి.

"ఏం పాపం? ఇంకా ఏ కాంట్రాక్టరూ రాలేదా?"

"ఏం మాట్లాడుతున్నావ్ నువ్వు? ఇదిగో నా ఖర్చులుకని తెచ్చుకున్నాను. ఈ అయిదొందలూ వుంచు" అంటూ జేబులోని అయిదొందల నోటు ఇవ్వబోయాడు రమేష్‌బాబు.

"ఛీ!" అంటూ విసిరి కొట్టాడు చక్రవర్తి.

"చక్రవర్తి నోరు తెరిచి అడిగేడంటే పదివేలకి తగ్గడు. సింహం. ఏవనుకుంటున్నావ్? తియ్యి."

రమేష్‌బాబు కళ్ళు బయటకి పొడుచుకొచ్చినంత పనయ్యింది.

"ఏంటీ, పదివేలా! సంపాదిస్తే తెలుస్తుంది. నా దగ్గర లేవు" అన్నాడు కోపంగా.

"లేకపోతే అడుక్కుని ఇవ్వు"

అప్పుడే ఛీఫ్ ఇంజనీర్ దగ్గర్నుండి ఫైలు తీసుకుని లోనికి రాబోయిన హేమంత్ అక్కడి వాతావరణం చూసి ఠక్కున స్వింగ్‌డోర్ పట్టుకుని నిలబడిపోయాడు.

చక్రవర్తి అతనివైపు చూశాడు.

"కాస్సేపాగిరా హేమంత్" అన్నాడు.

హేమంత్ తలపంకించి చక్రవర్తిని ఆశ్చర్యంగా చూస్తూ వెళ్ళిపోయాడు.

"ఆ వచ్చిందెవరో తెలుసా?" రమేష్‌బాబు చక్రవర్తివంక వెటకారంగా చూస్తూ అడిగాడు.

"ఎవడైతే నాకేంటి.. డబ్బు తియ్యి. తాగి నాలుగ్గంటలు దాటింది. పిచ్చెక్కిపోతున్నది" అన్నాడు అసహనంగా.

"అలా అంటే.. ఎలా? తెలుకోవల్సిన వ్యక్తి. మీ ఆవిడ బాయ్‌ఫ్రెండ్"

ఆ మాట విని చక్రవర్తి నొసలు కోపంతో ముడుచుకుంది.

ఆ వెంటనే సర్దుకుంటూ ''డబ్బు సంగతి చూడు'' అన్నాడు కోపంగా.

''వాణ్ణెళ్ళి అడుగు''

''..రేయ్! రమేష్ నాటకాలాడకు. ఎంత తాగినా ఈ చక్రిగాడికి బుర్ర పనిచేస్తూనే వుంటుంది. నువ్వు నన్నెందుకు పనిగట్టుకుని లాడ్జికి పిలిచేవో నాకు తెలియదనుకుంటున్నావా! ఈడంటే నీకేదో ద్వేషం. నా ద్వారా నీకక్ష తీర్చుకోవాలనుకుంటున్నావ్. నీ పప్పులు నా దగ్గరుడకవ్. నా కోసం నేను ఏవన్నా చేస్తానురా. నీకోసం కాదు. మర్యాదగా డబ్బులివ్వి'' అంటూ గొంతు పెంచాడు చక్రవర్తి.

రమేష్ ఇక శ్రుతి మించుతుందని గ్రహించి బజ్జర్ నొక్కాడు. వసంత వచ్చి నిలబడింది.

''వెళ్ళి పద్మనడిగి ఒక అయిదువేలుతే'' అన్నాడు.

''అయిదేంటి, పది, అక్షరాలా పదివేలు'' అన్నాడు చక్రవర్తి రెండు చేతులుకున్న పదివేళ్ళని చూపిస్తూ.

''వుండవు బాస్. రేపు లాడ్జికిరా! ఇస్తాను'' అన్నాడు రమేష్ బాబు కాళ్ళ బేరానికొస్తూ.

వసంత వెళ్ళి అయిదువేలు తెచ్చి రమేష్‌బాబు చేతికిచ్చింది.

రమేష్ డబ్బు అతని చేతిలో పెడుతూ ''ఇక ఆఫీసుకెప్పుడూ రాకు'' అన్నాడు.

చక్రవర్తి డబ్బుని ముద్దుపెట్టుకుంటూ ''పిచ్చి మాటలు..! బాంక్ దగ్గరికి రాని కష్టమరుంటాడా బాస్. రప్పించుకునేట్లు చేసుకోకు. సరేనా!'' అంటూ లేచి నిలబడి ''అవును ఆడిపేరేంటన్నావు?'' అనడిగాడు.

''హేమంత్''

''ఓ.కే.'' అంటూ బయటకి నడిచి హాల్లో తన పనిచేసుకుంటున్న హేమంత్‌ని ఎగాదిగా చూసుకుంటూ వెళ్ళిపోయాడు చక్రవర్తి.

అతడటు వెళ్ళగానే ''ఈ తాగుబోతు కేసేంటి కొత్తగా'' అంటూ లోపలికొచ్చింది పద్మ.

''నా ఏడుపు నేనేడుస్తుంటే... నీ గొడవేంటి?'' అన్నాడు రమేష్‌బాబు చిరాగ్గా.

''మీ ఏడుపు మీతో వుంటే ఫర్వాలేదు. నా దగ్గర డబ్బుకి ఎందుకు పంపుతున్నారు?'' అంది పద్మ వెటకారంగా.

''ఏంటి, అంతా నీదిలా చెబుతున్నావు. పొద్దున్న ఆ సుబ్బారెడ్డిని ఇరవై నీకిచ్చి వెళ్ళమన్నాను.''

''పదే ఇచ్చాడు'' అంది పద్మ వేళ్ళు విరుచుకుంటూ.

''అంటే పది నొక్కేసేవా?''

''బాగుంది. నా ఉద్యోగానికి రిస్కులేదా! ప్రతివాడు నాకిచ్చి వెళ్తున్నాడని ఎవరైనా పసిగడితే నా కొంప కొల్లేరవ్వదా?'' అంది కోపంగా.

''సరే! ఏదో ఒకటి ఏడ్వండి. నన్ను కాస్సేపు వదిలెయ్యి'' అన్నాడు రమేష్ విసుగ్గా.

''ఆ మాటే నేను అంటున్నా'' అని విసురుగా లేచి వెళ్ళిపోయింది పద్మ.

హేమంత్ ఆఫీసు నుండి బయటకొచ్చేసరికి బయట స్కూటీ మీద వెయిట్ చేస్తూ వుంది వరూధిని.

''ఏయ్, హేమూ!'' అంది తనని గమనించకుండా వెళ్తున్న హేమంత్‌ని పిలుస్తూ.

హేమంత్ వులిక్కిపడి చూసి ''ఏంటిక్కడ, నేను ఇంటికి వచ్చేవాణ్ణి కదా!'' అన్నాడు కొంచెం కంగారుగా.

''ఎన్నాళ్ళని ఇంట్లో కూర్చుంటాం. అందుకే మనం తొలిదినాల్లో కలిసిన ప్రాంతంలో కూర్చోవాలని'' అంది.

హేమంత్ స్కూటీ ఎక్కాడు.

ఇద్దరూ టాంక్ బండ్ మీద కెళ్ళారో లేదో అక్కడ జనం గుమికూడి వున్నారు.

ఇద్దరూ దిగి టాంక్‌బండ్ మీద నిలబడి రెయిలింగ్ పట్టుకుని చూశారు.

ఎవరో ఆత్మహత్య చేసుకోడానికి నీటిలో దూకేసాడు. అతన్ని రక్షించడానికి ఈతగాళ్ళు ప్రయత్నిస్తున్నారు. జనానికి వినోదం, కాలక్షేపం కావాలి. అందరూ గుమికూడి ఎవరికి తగ్గ వాఖ్యానాలు వాళ్ళు చేస్తున్నారు.

కాస్సేపటికి ఆ గజ ఈతగాళ్ళు అతి కష్టం మీద ఆ వ్యక్తిని ఫుట్‌పాత్ మీద పడుకోబెట్టారు.

ఇంతలో జనంలో ఎవరో ఒకామె గుర్తుపట్టి "ఈడు చిన్న శీను కొడుకు కదూ! అయ్యో ఏమొచ్చిందీడికి" అంది.

పోలీసులు ఆవిడ చెప్పిన వివరాల సహాయంతో ఇంటికి ఫోను చేసారు.

హేమంత్ అతన్ని పరికించి చూశాడు.

పదిహేనేళ్ళ కుర్రాడు.

ఈ వయసుకి చచ్చిపోవాల్సిన అవసరం ఏమిటి, పరీక్షకాని ఫెయిలయ్యాడా! ఆరోజు కాని ముందు రోజుగానీ ఎలాంటి పరీక్షా ఫలితాలూ విడుదల కాలేదు.

ప్రేమలు విఫలమయ్యే వయసూ కాదు.

సరిగ్గా అప్పుడే అతని తల్లి కాబోలు వలవలా ఏడుస్తూ గుండెలు బాదుకుంటూ వచ్చింది.

ఇప్పుడాశ్చర్యపోవడం హేమంత్ వంతయ్యింది.

వసంత.

వసంత కొడుకా!

ఇక అనుకోని బాధ్యత హేమంత్ పైన పడింది.

అంబులెన్స్ వెంట హేమంత్ వరూధిని బయల్దేరారు. డాక్టర్స్‌తో మాట్లాడాడు. పోలీసులకి ముట్టజెప్పాడు. ఈ దేశంలో మన నీతి మనల్ని ఉద్ధరించదు. గొంగళిలో తింటున్నాం. అవతల ప్రాణం. అందుకే హేమంత్ ఏమీ ఆలోచించలేదు.

వరూధినిని ఇంటికి పంపి మూడు రోజులు ఆస్పత్రిలోనే వున్నాడు.

పిల్లాడు బ్రతికాడు.

వసంత హేమంత్ కాళ్ళకి మొక్కినంత పనిచేసింది.

"మీ ఋణం తీర్చుకోలేను సార్. టయిముకి దేముడి ఈడనే వుండి కాపాడారు." అంటూ వలవలలాడింది.

"అద్సరే, ఎందుకు వీడీ పనిజేసేడు" అనడిగాడు హేమంత్.

"ఏం జెప్పాల సర్. లూనా అడిగిండు. కొనిచ్చా. ఇప్పుడదిగాదు కెనటిక్ హోండా గావాల్నంట. శానా కోరికలు బాబూ! ఏడదెచ్చేది? ఒకట్నా రెండా! ఆడు తాగి తాగి సచ్చిండు. ఈడు నన్ను సంపి బతుకుతుండు."

"ఏం పేరు?"

"అఖిలేశు"

"సరే మీరు ఇంటికి వెళ్ళండి. నేనొచ్చి మాట్లాడతాను"

వసంత నమస్కరించి కొడుకుని తీసుకుని వెళ్ళింది.

ఈ సంగతి తెలిసి ఆఫీసునుండి ఒక్కరు కూడా వచ్చి పరామర్శించక పోవడం ఆమెని ఖేదపరిచింది.

చీమ చిటుక్కుమంటే జీపులు కార్లేసుకుని వెళ్ళి అందర్నీ పరామర్శించి వచ్చే స్టాఫ్ తనని అలా నిర్లక్ష్యం చేయడం చూసి ఆమె హృదయం కుమిలిపోయింది.

హోదాలు, పలుకుబడి, డబ్బువుంటే వుంటే గాడిద కాళ్ళు కూడా పట్టుకునే జనం నైజం తెలిసి ఖిన్నురాలయిపోయింది.

ఆమెకు హేమంత్ ఒక దేవుడిలా కనిపించాడు.

అప్పుడే హేమంత్ వరూధినితో సహా వాళ్ళింటికి వెళ్ళేడు.

ఆ టైముకి అఖిలేషు కూర్చుని తల్లి కోసిచ్చిన పళ్ళు తింటున్నాడు.

"మా సారు" అని పరిచయం చేసింది వసంత. అతని మొహంలో గౌరవం కాని పశ్చాత్తాపం కాని.. ఏమీలేవు.

పైగా ఏదో ఘనకార్యం చేసిన వాడిలా గర్వంగా వున్నాడు.

హేమంత్ ఇల్లంతా పరికించి చూశాడు.

ఇంట్లో టి.వి, కూలర్ - కావాల్సిన సామానంతా వుంది.

హేమంత్ పక్కన కూర్చుని "ఎందుకు చచ్చిపోవాలనుకున్నావ్?" అనడిగాడు.

వాడు హేమంత్‌ని అదోలా చూసి తలతిప్పుకున్నాడు.

"ఈ సామానంతా మీ ఆయన హయాంలోనే కొన్నావా? " వసంత నడిగాడు హేమంత్.

"యాడిది సారు! ఆడుతాగి చేసిన అప్పులకే శానా డబ్బు గట్టినా! ఇప్పుడియ్యన్నీ నే గొన్నయ్యే."

"నువ్వు కూడా చచ్చిపోతే మరివీడెలా బతుకుతాడు?"

ఆ ప్రశ్నకి వరూధినితో పాటూ ఆ కుర్రాడు ఆశ్చర్యంగా చూశారు.

"అవును వసంతా! రోజూ వీడికోరికలు తీర్చలేక చచ్చేబదులు ఒక్కసారే చావొచ్చుకదా! అప్పుడు వీడు రోడ్డుమీద అడుక్కున్నా ఎవడూ పైసా వెయ్యడు. తాడు తెచ్చాను. ఉరేసుకుంటావా? " అంటూ జేబులోంచి తాడు తీసాడు.

"హేమంత్ ఏంటి నువ్వుచేస్తున్న పని" అంది వరూధిని కంగారుగా.

"ఇంకెలా చెప్పాలో నాకు తెలియడం లేదు. వాడి కోరికలకీ, వాడి ఆర్థిక స్థోమతుకీ సారూప్యముందా? "

"ఆర్థిక స్థోమతు ఏ స్థాయిలో వున్నా పిల్లలందరివీ ఒక్కటే కోరికలు. ఇవన్నీ తీర్చడం తల్లిదండ్రులకి సాధ్యమవుతుంది. తల్లిదండ్రులంటే ఏ.టి.ఎం కార్డులా! తండ్రి తాగి తాగి చచ్చాడు. ఏదో ప్రభుత్వం పుణ్యమా అని వచ్చిన ఉద్యోగంతో ఆవిడ బతికిస్తుంది. నేను చూడు వాచీ కూడా పెట్టుకోను. వాచీదేనికి, టైము చూపించడానికి. గోడకి గడియారముంది. ఇక దేనికి? ముందు బాగా చదువుకుని పెద్ద జాబ్ చేసి కోరికలు తీర్చుకో. నాకు నీమీద కోపం లేదు. తల్లిని బాధించకూడదు" అన్నాడు అఖిలేష్ మీదచెయ్యివేసి.

అఖిలేష్ తలవంచుకున్నాడు.

కళ్ళ వెంట నీళ్ళు జారిపడ్డాయి.

హేమంత్ వసంత వైపు తిరిగి "మీదీ తప్పుందమ్మా. మీరే పిల్లల్ని కన్నట్లు వాళ్ళ గొంతెమ్మ కోరికలన్నీ తీర్చడం తప్పుకాదా! వాళ్ళని కొంచెం కష్టపెట్టే పెంచాలి. అన్నీ తెలియబరచాలి" అని చెప్పి బయల్దేరాడు హేమంత్.

వసంతతోపాటు అఖిలేష్ కూడా లేచి నిలబడ్డాడు.

"సారీ సారూ!" అన్నాడు అఖిలేష్.

"సారీ వద్దు. బాగా చదువుకో. మన చేతిలో వస్తువులతో పెట్టుకున్న నగలతో విలువరాదు. అది ఆయా వస్తువుల విలువ మాత్రమే. నీ కేరక్టర్‌తో నీ విలువ పెంచుకో. సరేనా! " అంటూ బయటకొచ్చాడు హేమంత్.

అతనితో పాటు పరిగెత్తినట్లు బయటకొచ్చి "యూ ఆర్ గ్రేట్ హేమూ" అంది వరూధిని.

"ఎందుకు?" నవ్వాడు హేమంత్.

"నీలో మరో మనిషిని చూశాను. రియల్లీ హేట్సాఫ్ యు టూ" అంది ఆరాధనగా.

హేమంత్ నవ్వి "పద, ఇంకో మనిషిని కూడా చూపిస్తాను" అన్నాడామె తలమీద మురిపెంగా తడుతూ.

వరూధినీ నవ్వింది.

హృదయమంతా వెన్నెల పరుచుకున్నట్లుగా.

**సరోజని వాకిట్లో కూర్చుంది.**

ఎక్కడ కూర్చున్నా ఒకటే!

లోకమంతా శూన్యంగా అనిపిస్తుంది. దేనికోసం ఎదురు చూడాలి? ఎంతసేపు చూస్తే ఏం ఒరుగుతుంది. ఒకప్పుడు పళ్ళికిలించుకుంటూ కనకారావు దూరం నుంచి రావడం చూసి మనసు పురివిప్పి ఆడేది. చేతిలో అరడజను అరటి పళ్ళో, జిలేబీనో పట్టుకుని ఇంటికొచ్చేవాడు.

వాకిట్లోనే సంచి చేతికివ్వబోతుంటే తను కసురుకునేది. "అక్కడదాక తెచ్చినోడివి లోపలికి తేలేవా? నన్ను చూడగానే మగ బడాయి పొడుచుకొచ్చిందా?" అనేది

కనకారావు ఇంకాస్త పళ్ళికిలించేవాడు.

"చాల్లే సంబడం, ఊరికే నవ్వకు. నవ్వకుండానే పళ్ళన్నీ బయటే వుంటాయి. ఏంటో ఇంతందగాడు దొరకలేదని.. నా బాబు నాకు నిన్నంట గట్టాడు" అనేది సరోజని.

అతను స్నానం చేసి భోజనానికి కూర్చునే వరకూ సరోజని మాటలకి హద్దుండేది కాదు.

అన్నిటికి నవ్వే అతని జవాబు.

సరోజని అతని జ్ఞాపకాలతోనే చీకటి పడేవరకూ వాకిట్లోనే కూర్చుంది.

ఇంతలో సున్నంరాయిలా దొర్లుకుంటూ రోడ్డుకడ్డం పడి వసుంధర రావడం గమనించింది సరోజని.

ఆవిడ సరోజని వైపు చూసి నవ్వుతూ "బాగుండిరా?" అంది.

"ఏదో ఒక గుండిగలే కానీ..నువ్విలా రా!" అంటూ పిలిచింది.

వసుంధర దగ్గరగా వచ్చి "ఇదియా ప్రసాదం" అంది.

"అద్సరేగాని నువ్వు తెలుగుదానివేగా! తెలుగునెందుకలా భ్రష్టు చేసి మాట్లాడతున్నావు?" అంది సరోజని.

బదులుగా ఆవిడ నవ్వి "శానాదినములుగా అక్కణ్ణేగా వుండటం" అని సరోజని పక్కన అరుగుమీద కూర్చుంది వసుంధర.

"వచ్చి చాలా రోజులయిందిగా. ఇక బయల్దేరరా?" అనడిగింది సరోజని.

"వాడుదా వస్తే నిశ్చయం జేసుకుని పోతాం"

"ఎవడుదా?"

"వాడే, హేమంతు"

సరోజని గుండెలో బాంబు పేలినట్లయింది.

"వాడికి చెప్పారా?"

"అదంతా అన్నపని. ఫోను చేసినాడు. వంట్లో బాగుండలేదని చెప్పినాడు"

ఆ మాట విని సరోజని డీలా పడిపోయింది.

"సరే వెళ్ళిరా" అంటూ లోపలికొచ్చింది. ఆ వెంటనే కాలుగాలిన పిల్లిలా అటూ యిటూ తిరిగి చిన్నగ్లాసు తీసుకుని హేమంత్ ఇంటికెళ్ళింది.

"ఏంటిలా వచ్చావ్?" అన్నాడు హేమంత్ తండ్రి సుందరం.

"ఏదయినా అప్పడుగుదామని."

"అంటే ఏం కావాలో నీకే తెలియదన్నమాట" వెటకారంగా అన్నాడు సుందరం.

"నీ యింట్లో అసలేవుందో తెలుసుకుని.. దాన్ని బట్టి అడగాలని."

"నీతో ఎవడు మాట్లాడి గెలవగలడులే.. పో లోపలికి" అన్నాడు సుందరం చిరాగ్గా.

"అయ్యో కాసేపు నిలబడి మాట్లాడటానికి పనికొచ్చే మొహమేనా" అంటూ లోపలికెళ్ళింది సరోజని. వసుంధర, నాగిని కలిసి టి.వి దగ్గర కూర్చుని సినిమా చూస్తున్నారు.

సరోజని గబగబా వంట చేస్తున్న రాజేశ్వరి దగ్గరకి వెళ్ళి "ఏంటే ఆడికి నిశ్చితార్థం చేస్తున్నారా?" అంది గుసగుసగా.

"అవునత్తా! హేమంత్‌కి రమ్మని ఫోను చేసాడు నాన్న." సంబరంగా చెప్పింది రాజేశ్వరి.

"ఎంత కులుకుతూ చెబుతున్నావే! అంతకన్నా వాడికి వురెయ్యండి. పీడా వదులుతుంది" అంది సరోజని కోపంగా.

అదిరిపోయినట్లుగా చూసింది రాజేశ్వరి.

"అవునే, వాడి మనసేంటో మీక్కర్లేదు. మీ మీ స్వార్థాలే మీవి. మీ అమ్మే గనక వుంటే ఇలా జరిగేదా?"

"నా కర్థంకావడంలేదు అత్తయ్యా మీ మాటలు."

"అవున్లే, నువ్వంటే ఇంట్లో వున్న మేనమావని ప్రేమించి టింగురంగా అంటూ పెళ్ళి చేసుకున్నావు. పైసా కట్నం లేకుండా తేరగా వచ్చాడని మీ బాబు కాళ్ళు కడిగి వదిలించుకున్నాడు. వాడు కూడా ప్రేమించాడే ఆ పిల్లని చేసుకోనివ్వకపోతే అంతే. నా నోటితో చెప్పను."

సరోజని మాటలు విని మ్రాన్పడిపోయింది రాజేశ్వరి.

సరోజని చెయ్యి పట్టుకుని గబగబా పెరట్లో బావిదగ్గరకి తీసుకెళ్ళి "ఇప్పుడు చెప్పు వివరంగా" అంది ఆందోళనగా.

"సవరదీసి సాగదీసి చెప్పడానికిదేం టి.వి సీరియల్ కాదు. ముందు వాణ్ణి రానివ్వకుండా ఆపు. తర్వాత కథ చెబుతాను" అంది సరోజని చిరాగ్గా.

"ఎలా? వాడొచ్చేస్తాడిప్పుడు. మావయ్య స్టేషన్‌కి వెళ్ళాడు కూడ."

అంతే.!!

సరోజని గ్లాసక్కడ పడేసి బొడ్లో చిల్లర సరిచూసుకుని, వీధిలోకి వచ్చి ఆటో ఎక్కింది స్టేషన్‌కి పోనివ్వమని.

సరోజని ఆటోదిగి వగరుస్తూ పరిగెత్తుకొచ్చేసరికి మావయ్యతోపాటు వస్తున్న హేమంత్ ఎదురుపడ్డాడు.

"ఆంటీ"

హేమంత్ పిలిచేసరికి సరోజని అతన్నిచూసింది.

"ఏంటత్తా నాన్నకెలా వుంది?" అన్నాడు కంగారుగా.

"ఆయనకేం, ఎండిపోయిన శొంఠికొమ్ములా ఎప్పుడు నవనవలాడేడు. నువ్వింటి కెళ్ళకు. మా యింటికిరా!"

ఇద్దరూ అర్థం కానట్లుగా సరోజని వైపు చూశారు.

"ముందు మా యింటికి పదండి. ఇక్కడ చెప్పడానికి నాకు ఓపికలేదు" అంది సరోజని జారిపోయిన జుట్టుముడి వేసుకుంటూ.

ఆ యిద్దరూ ఆమెను అనుసరించారు.

"అసలెందుకు నీ బాబు నిన్ను పిలిపించాడో తెలుసా?"

ఇద్దరికి కాఫీ యిచ్చి నేలమీద కూలబడి అడిగింది సరోజని.

"నాన్నకి సీరియస్సని.." అనుమానంగా మేనమామ వంక చూస్తూ అన్నాడు హేమంత్.

అతను తలదించుకున్నాడు.

"బెల్లం కొట్టే రాయిలా అలా కూర్చుంటావేంటి, చెప్పు హేమంత్‌కి" అంది సరోజని కోపంగా.

"ఇదంతా ఎందుగ్గాని నీ బాబు సుబ్బరంగా వున్నాడు. నీకు నిశ్చితార్థం చేయాలని పిలిపించాడు. నీ మేనత్త, దాని కూతురు ఇంట్లో తిష్టేసుక్కూర్చున్నారు. ఆ మేడ కోసం యీళ్ళు అప్పిచ్చేరంట. ఇప్పుడిక నీ బాబు పీక మీద కత్తి పెట్టి కూర్చున్నారు. ఆళ్ళకి నీతో కూడా అవసరం లేదు. కేవలం ఆ మేడ కోసవే.... ఇదంతా. ఆ మాట నీ కాబోయే అత్త చెప్పింది" అంది.

హేమంత్ తెల్లబోయి చూశాడు.

"ఇప్పుడేం చేద్దామనుకుంటున్నావ్?"

హేమంత్ మాట్లాడలేకపోయాడు.

"ఇంటి కెళ్లావో ఆడు నిన్నెళ్లనివ్వడు. ఉరేసుకుంటానని బెదిరించి ఈ పెళ్ళి కుదిరిస్తాడు. నువ్వు సినిమా హీరోలా ఈ పెళ్ళి చేసుకుని సుబ్బరంగా పిల్లల్ని కంటావ్. ఆ పిల్లగతేంటి?"

"ఏ పిల్ల?" హేమంత్ మేనమామ ఆశ్చర్యంగా అడిగాడు.

"నువ్వుండు అదంతా తర్వాత చెబుతాను."

"ఏంరా ఏమంతూ! మాట్లాడవేంటి, తప్పించుకోడం తెలిస్తేనే తలదూర్చమన్నారు. ఇప్పుడేంటలా కూర్చున్నావ్? సరే, నే చెప్పింది విను. నువ్వు రాలేదు. వెళ్ళి వాడికి శెలవు దొరకలేదో ఏంటో రాలేదని చెప్పు" అంది హేమంత్ మేనమామ వైపు తిరిగి.

"నా కర్థమయ్యేట్లు చెప్పండి" అన్నాడతను తికమకగా చూస్తూ.

"ఈడొకమ్మాయిని ప్రేమించాడు. ఆ పిల్ల లేకపోతే ఛస్తానన్నాడు. అర్థమయ్యిందా? నీకు డబ్బు కావాల్సి నేనిస్తే ఆ సుబ్బిగాడి చెరనుండి ఆ పిల్లే తనిల్లు తాకట్టు పెట్టి డబ్బిచ్చింది. ఇప్పుడర్థమయ్యిందా?" అంది సరోజని.

"కాని... మావయ్యా..."

"ఏంటి మావయ్యా!? ఆడిపెళ్ళి ఆడిష్టమొచ్చినట్లు చేసుకుంటే.. ఈడికేంటి నొప్పి? నువ్వెళ్ళి రాలేదని చెప్పు. అంతే!" అంది సరోజని అసహనంగా.

అతను తలూపి వెళ్ళిపోయాడు.

"మీ యింట్లో కథ ఇప్పుడే మొదలయ్యింది. ఇక ముందు ముందు మీ నాన్న చాలా చేస్తాడు అన్నిటికీ సిద్ధపడకపోతే... ఇక అంతే సంగతులు. ఆలోచించుకో!" అంది సరోజని హెచ్చరిస్తున్నట్లుగా.

హేమంత్ ఆలోచిస్తూ కూర్చున్నాడు.

చివరకు సరోజని వైపు చూస్తూ "నేను దేనికైనా సిద్ధపడతాను గాని.. వరూధినీని వదులుకోను ఆంటీ" అన్నాడు స్థిరంగా.

ప్రేమ ఎప్పుడూ ఒకటే.

ప్రేమ కథల మలుపులే వేరు.

రైల్లో తిరిగి వస్తున్నప్పుడు అతనికి చాలా వేదనగా వుంది. వరూధినిని ఎవరో తననుండి బలవంతంగా లాగేసుకుంటున్నారేమో అని అతను భయపడిపోతున్నాడు.

మొదటిసారి తండ్రి మీద అతనికి చెప్పలేని అసహ్యమేసింది. ప్రేమనే పదానికి అర్థం తెలీని మూర్ఖుడు, స్వార్థపరుడు. తల్లిని ఒక యంత్రంలా చూశాడు. అతనికి ఏ కమిట్‌మెంటూ లేదు. తాను గొప్ప ఆస్తిమంతుడనిపించుకోవాలనే తాపత్రయంతో ఆ మేడ చుట్టూ తిరిగాడు. దానికోసం ఏమయినా చెయ్యడానికి సిద్ధపడుతున్నాడు.

అసలీ పెళ్ళేమిటి?

అప్పుడెప్పుడో తను పుట్టకమునుపే పక్కింటి టీ కొట్టు మళయాళీతో వెళ్ళిపోయి పెళ్ళిచేసుకుంది తన మేనత్త. అదృష్టం బాగుండి టీ కొట్టు రెస్టారెంటయి బాగుపడింది. అప్పుడు చంపేస్తాను, పొడిచేస్తాను అన్న మేనత్త యిప్పుడు డబ్బులొచ్చేసరికి వియ్యానికి పనికొచ్చింది.

ఆ మేడ చుట్టూ అందరి బ్రతుకుల్ని తాడేసి తిప్పుతున్నాడు. ఎంతవరకు తెస్తాడో?

మొదటిసారిగా భయమేసింది హేమంత్‌కి.

అసలీ అక్కర్లేని విలన్లేంటి - ఎందుకు వాళ్ళు సుఖంగా వుండి యితరుల్ని సుఖంగా వుండనివ్వరు. వాళ్ళ తప్పులు వాళ్ళెందుకు తెలుసుకోరు.

రమేష్‌బాబుకి వరూధిని మీద కోపం ఎందుకు? పెళ్ళయి పిల్లలున్న వ్యక్తి భార్యకి విడాకులు లేకుండా వరూధినిని చేసుకోవడానికి వెళ్ళడం - ఆపైన నీచంగా మాట్లాడటమే కాకుండా - ఆమె మీద కక్ష పెంచుకోవడం దేనికి?

భార్యని హింసించి విడాకులు తీసుకున్న చక్రవర్తి చట్టాన్ని ఉల్లంఘించి వరూధిని మీద ఇంకా పెత్తనమున్నట్లుగా డబ్బుకోసం దాడి చేయడం - ఎంత నీచం.

రేపు తన తండ్రి కూడ!!!???

వీల్లేదు. అలా జరగడానికి వీల్లేదు తలవిదిలించుకున్నాడు హేమంత్ ఒక్కసారిగా.

ఆ రోజు సాయింత్రం తిన్నగా వరూధిని దగ్గరకే వెళ్ళాడు హేమంత్.

తిన్నగా తనకు తానుగానే మేడమీద కెళ్తూ "ఒకసారి పైకిరా!" అన్నాడు.

వరూధిని అతని వైపు ఆశ్చర్యంగా చూసి తిరిగి తల్లివైపు చుసింది.

"వెళ్ళు. ఏదో చెప్పాలనుకుంటున్నట్లున్నాడు" అంది ఆమె నెమ్మదిగా.

వరూధిని పైకి రావడమే "అయ్ లవ్ యూ వరూ, నిన్ను నేనెన్నటికీ వదులుకోను" అన్నాడు అతడామెను గాఢంగా కౌగిలించుకుంటూ.

అదే అతని మొదటి కౌగిలి.

అందులో ప్రేమ తప్ప మరేలాంటి కోరికా లేదు.

ఒక పసివాడొచ్చి గట్టిగా తల్లిని హత్తుకున్నట్లుంది.

"ఏమయ్యింది హేమంత్? మీ నాన్నగారెలా వున్నారు? ఎందుకిలా ఎగ్జయిటవుతున్నావ్?" అంది కౌగిలి విడిపించుకోడానికి ప్రయత్నిస్తూ.

హేమంత్ వదల్లేదు.

అతనికి పెళ్ళి సంబంధం గురించి చెప్పడం కూడా ఇష్టం లేదు.

"ఏం లేదు, ఏం లేదు. ఎందుకో ఈసారి నిన్నొదిలి వెళ్ళడం భరించలేకపోయాను. అంతే" అన్నాడు.

వరూధిని చిన్నగా నవ్వింది.

నిజానికి ఆమె ఫీలింగ్ కూడా అదే

హేమంత్ ఆమె ఆలోచనల నిండా నిండిపోయాడు. ఆమె ఊపిరిగా మారిపోయాడు.

అందుకే అతనికి సెలక్షన్ వచ్చి వెళ్ళిపోతే ఎక్కడికి వేస్తారో? అంతా భయంగా వుంది.

"అవును హేమ్. నేను కూడా అలానే ఫీలయ్యాను" అంది గొణిగినట్లుగా. నువ్వు సెలక్టయ్యాక ఎక్కడికి వేస్తారో?" అంది.

హేమంత్ మాట్లాడలేదు. "నిన్ను తీసుకెళ్ళిపోతాను వెంటనే" అన్నాడు నిశ్చయంగా.

"రండి, భోజనానికి"

వరూధిని తల్లి పిలుపుతో ఇద్దరూ ఈలోకంలో కొచ్చారు.

హేమంత్ గ్రూప్ వన్ సెలక్టయ్యాడని తెలియగానే ఆఫీసంతా కలకలం రేగినట్లయింది.

అందరూ హేమంత్‌ని అభినందిస్తున్నారు.

చేతులు పట్టి వూపేస్తున్నారు.

వెంటనే ఛీఫ్ ఇంజనీరు నుండి అతనికి పిలుపొచ్చింది. హేమంత్ వెళ్ళగానే ఆయన నిలబడి కరచాలనం చేసాడు.

"వుయ్యార్ ప్రౌడాఫ్‌యూ! బట్ ఎట్ ద సేమ్ టైమ్ వూయ్యార్ లూజింగ్ ఏ గుడ్ ఇంజనీర్" అన్నారాయన ఆదరంగా నవ్వుతూ.

హేమంత్ ఆయన ఆఫర్ చేసిన కాఫీ తాగి తనని కొంచెం త్వరగా రిలీవ్ చేయమని కోరాడు.

"ష్యూర్! వెంటనే ఛార్జి ఎవరికయినా హేండోవర్ చేయమని రమేష్‌బాబుకి చెబుతాను" అన్నాడు.

అదే సమయానికి రమేష్ బాబు ఎదుట హొయలుబోతూ పద్మ కూర్చుని వుంది.

"ఏం చెయ్యగలిగారు? ఇప్పుడు ఆఫీసరుగా వెళ్ళిపోతున్నాడు. రేపోమాపో పెళ్ళి శుభలేఖ కూడా తెచ్చిస్తాడు" అంది వెటకారంగా.

రమేష్‌బాబు మొహం అసూయతో రగిలిపోతున్నది.

పేపర్ వెయిట్‌ని గుండ్రంగా తిప్పుతూ "ఏదో ఒకటి చెయ్యాలి. ఆలోచించు. వాడు జాయిన్ కాకూడదు సస్పెండ్ కావాలిక్కడే" అన్నాడు కసిగా.

పద్మ హేళనగా నవ్వింది.

"నవ్వుతావేంటి? చెప్పు" అన్నాడు.

"వసంతని పిలవండి"

"వసంతా, ఆవిడెందుకు? " అన్నాడు రమేష్‌బాబు అనుమానంగా చూస్తూ.

రమేష్ బాబు బజ్జర్ నొక్కాడు.

వసంత వచ్చి నిలబడింది.

"నువ్వో పని చెయ్యాలి చేస్తావా?"

వసంత బెదురుగా చూసింది.

"ఈ మాట ఎక్కడన్నా అన్నావో... నీ గతి అధోగతే" అంది పద్మ బెదిరిస్తున్నట్లుగా.

వసంత మాట్లాడలేదు.

పద్మ చెప్పిన విషయం విని రమేష్‌బాబు కూడా ఆశ్చర్యపోయాడు.

"స్త్రీలు దేవతలు, సౌమ్యులు అంటారు కానీ, స్త్రీల కొచ్చినన్ని క్రిమినల్ థాట్స్ మగాడిక్కూడా రావు." అన్నాడు మెచ్చుకోలుగా.

"ఇంతకీ ఏవంటావ్?" అంది పద్మ వసంతకేసి చుసి.

అదే సమయంలో వసంత ఆలోచిస్తున్నది "నిజమే తనొక్కర్తే చేయగలదు. చేసి తీరాలి" అనుకుంది మనసులో.

చిన్నగా తలూపింది.

ఆ సాయంత్రం ఏమీ తెలియని వరూధిని హేమంత్‌లు ఒక థియేటర్‌లో సినిమా చూస్తున్నారు భవిష్యత్తు మీద ఆశలతో కలలు కంటూ.

**సినిమా అయిపోయాక** హేమంత్‌ని తీసుకుని వరూధిని ఒక రెడీమేడ్ షాప్‌కెళ్ళి అతనికి రెండు సూట్లు కొంది. వాటిని సైజ్ చేయిస్తూవుంటే 'ఎందుకిప్పుడివన్నీ' అని గొణిగాడు హేమంత్.

"ఎందుకేవిటి, నువ్విప్పుడు గ్రూప్‌వన్ ఆఫీసరువి. దర్జాగా వుండాలి. అంచెలంచెలుగా నువ్వు ఎదగడం నేను కళ్ళారా చూడాలి. సూట్‌లో నిజంగా చాలా బాగుంటావు" అంది సంతోషం నిండిన కళ్ళతో.

"కాని.. నా మీద చాలా ఖర్చుపెడుతున్నావు వరూ. ఇంకా నీ యిల్లు తాకట్టులోనే వుంది. అది తలుచుకుంటే నాకు చాలా గిల్టీగా వుంటుంది" అన్నాడు బాధగా.

"ష్! ఇంకా నువ్వూ నేనూ ఏమిటి, నేను ఎవరికో ఇచ్చానా... నాకే నేను ఇచ్చుకున్నాను - పద" అంది.

ఇద్దరు ఒక హోటల్లో భోం చేసాక వరూధినీని ఇంట్లో వదిలేసి రూమ్ కొస్తూ సరోజనీకి ఫోన్ చేసాడు.

సరోజని లైన్లో కొచ్చి "ఏంరా ఇంత రాత్రప్పుడు, ఎలాగున్నావు?" అనడిగింది.

"బాగున్నానాంటీ, నాకు గ్రూప్ వన్ సెలక్షనొచ్చింది" అన్నాడు హేమంత్.

"ఏంటో అదంతా, ఇపుడు నువ్వు చేస్తున్న వుద్యోగానికన్నా పెద్దదా?" అనడిగింది సరోజని.

"పెద్దదే! నీకే ముందు చెబుతున్నా. నాన్నకి చెప్పలేదింతవరకు."

"ఏం చెబితే నీ బాబుకి సంతోషం కాని... చెప్పాలిగా. వాళ్ళెళ్ళేరులే. చెప్పు" అంది సరోజని.

"ఇంతకీ నువ్వు అదే వూళ్ళో వుంటావా.. వేరే వూరెళ్ళి వరూధినీని మరచిపోతావా?"

బదులుగా గట్టిగా నవ్వాడు హేమంత్.

"నీకెప్పుడూ వరూధినీ గురించే. నాకన్నా వరూధినీయే ఎక్కువయిపోయింది. వేరే వూరు వేస్తారు. కానీ.. నేను త్వరలోనే వరూధినీని తీసుకెళ్ళిపోతాను. వర్రీ అవ్వకు."

"అదేకదరా.. కావాల్సింది" అంది సరోజని.

వెంటనే ఇంటికి ఫోన్ చేసాడు.

రాజేశ్వరి మాట్లాడింది.

హేమంత్ సెలక్షన్ గురించి తెలిసి చాలా సంతోషించింది.

"నాన్న నిద్రపోతున్నారు. నేను చెబుతాలేరా హేమంత్! అయినా ఆయనకివన్నీ ఏం పడతాయిలే. జాగ్రత్త. ఆ దయ్యాలు వెళ్ళారు. కానీ నాన్న వాళ్ళ దగ్గర డబ్బు తీసుకున్నార్రా. వాళ్ళు ఈ సంబంధం వదిలేట్లు లేరు. అందరికీ ఆ మేడమీదే ధ్యాస" అని చెప్పింది.

"సరే! చూద్దాం" అని ఇంటి మొహం పట్టాడు హేమంత్.

తాను యుద్ధానికి సన్నిద్ధం కావాలి. తప్పదు. వరూధినీకి మాత్రం ఎలాంటి కష్టం కలగనీయ కూడదు. ఆమెని పదిలంగా జీవితాంతం చూసుకోవాలి.

ఆలోచిస్తూ రూమ్‌కి చేరుకున్నాడు.

వరూధిని చిత్ర పక్కన పడుకుని నిద్రపోవాలని ప్రయత్నించింది.

ఎంతకూ నిద్రపట్టలేదు.

ఆలోచనల నిండా హేమంతే నిండిపోయాడు. సూట్‌లో అతనెలా వుండేది ఊహించుకుని ఆమె మనసు ఆనందంతో పొంగిపోతున్నది.

మొదటిసారి ప్రేమని చవిచూసిన వరూధిని తన అదృష్టానికి తనే విస్తుపోతున్నది.

తన ప్రమేయం లేకుండానే వివాహం, బిడ్డతల్లి కావడం, అష్టకష్టాలు, కన్నీళ్ళు, ఒంటరి తనం ఎదుర్కొంది. ఇక యీ జీవితానికి వెలుగేలేదని కేవలం చిత్రకోసమే తాను బ్రతకాలని తెలిసి చక్రవర్తి పెట్టే కష్టాలని భరిస్తూ కన్నీళ్ళు దాచుకుని బ్రతుకుతోంది.

తను అనుకోలేదు.

హేమంత్ రూపంలో తన జీవితంలోకి వెలుగొస్తుందని. ఒక విధంగా రమేష్‌బాబు తనకి సహాయపడ్డాడేమో? లేకపోతే తను ఆ ఆఫీస్‌కి వెళ్ళే అవసరం కలిగేది కాదు.

హేమంత్ పరిచయంతో తన జీవితంలోకి వసంతమొచ్చింది. అతని భుజమ్మీద సేద తీరితేచాలు ఎంత భరోసా! ఎంత ధీమా! ఎంత నమ్మకం. స్త్రీ కోరుకునేది అదే కదా! దీన్ని అర్థం చేసుకోలేక చాలామంది పురుషులు స్త్రీ గొంతెమ్మ కోరికలు కోరుతుందని - గయ్యాళిగా మారి ఏడిపిస్తుందని చాలాచాలా అనుకుంటారు. అసలు స్త్రీని లాలించడం - ప్రేమని చూపించడం చేతకాని పురుషులే స్త్రీలని

గయ్యాళిగానూ, కోరికల పుట్టగానూ మారుస్తారు. తాళికట్టే బాధ్యతల విషవలయంలోకి నెట్టే ప్రేమ రాహిత్యానికి గురి చేసి ఆమెని అవహేళనకి గురిచేసి నిందించే పురుషుడికేమి తెలుసు స్త్రీ హృదయం ఎంత రాగమయమో - ఎంత త్యాగమయమో.

ఎన్నో ఆలోచనలతో, మనసు పరవశిస్తుంటే వరూధిని చిత్రమీద గాఢనిద్రలోకి జారుకుంది.

ఆ రోజు హేమంత్ రిలీవ్ అవుతున్నాడు.

నిజంగానే ఘనమైన పార్టీ ఎరేంజ్ చేసారు చీఫ్ ఇంజనీరుగారు. స్వయంగా ఆయన డెప్యూటి చీఫ్ ఇంజనీరు చంద్రమౌళిగారికి చెప్పి ఘనంగా పార్టీ ఎరేంజ్ చేయించారు. చంద్రమౌళిగారు కూడా హేమంత్ పనితనాన్ని చూసి చాలా ఇష్టపడేవారు.

పార్టీ ఘనంగా జరిగింది. అందరూ హేమంత్ గురించి చాలా బాగా మాట్లాడారు.

హేమంత్ ప్రత్యేకించి ముకుందంగారికి ధన్యవాదాలు చెప్పాడు. ఆయన నన్ను గ్రూప్ వన్‌కి ప్రిపేర్ కమ్మని చెప్పకపోతే నేనటు దృష్టి సారించేవాడిని కాదు. ఈ వుద్యోగంతోనే సరిపెట్టుకునేవాడినని చెప్పడంతో ఒక సామాన్య సూపర్నెంటుని పెద్ద ఆఫీసర్ల ముందు ప్రస్తుతించడం చంద్రమౌళిగారికి చాలా నచ్చింది.

పార్టీ ముగిసేసరికి చీకటి పడింది.

వచ్చి 'రిలీవ్ ఆర్డర్ తీసుకో హేమంత్' అని చెప్పి రమేష్ వసంత వంక, పద్మవంక చూసి సెక్షన్‌కి వెళ్ళాడు. ఇంకా జరగవలసిన తతంగం వుండటంతో స్టాఫ్ కూడా సెక్షన్‌కి వచ్చారు.

రమేష్‌బాబు చాంబర్‌లోకి వెళ్ళి బజ్జర్ నొక్కాడు. వసంత బెదురుతూ వెళ్ళి నిలబడింది.

"గుర్తుందిగా! ఎక్కడా ఏ మాత్రం చెడకూడదు. పద్మ చెప్పినట్లు చెయ్యి. నేను ఏంటిరూంలోవుంటాను. హేమంత్‌ని పిలు," అంటూ ఏంటీరూములోకి వెళ్ళిపోయాడు రమేష్‌బాబు.

వసంతకి గుండెదడ వచ్చింది.

అయినా తప్పదు.

హాల్లోకొచ్చి "సారూ, మిమ్మల్ని సారు పిలుస్తున్నారు" అంది వణుకుని దాచుకుంటూ.

పద్మ ధైర్యం చెబుతున్నట్లుగా బొటనవేలు చూపించింది.

వసంత తలదించుకుని రమేష్‌బాబు చాంబర్‌లో కెళ్ళింది. హేమంత్ ఆమె వెనుక వెళ్ళబోతుంటే " సర్, ఇక్కడొక సంతకం పెట్టి వెళ్ళండి" అన్నాడు ముకుందం.

హేమంత్ ఆయన వంక ఆశ్చర్యంగా చూస్తూ "సర్ అంటున్నారేవిటి సర్, నన్ను" అన్నాడు.

"కాదా మరి. మీ తెలివికి అంచెలంచెలుగా ప్రమోషన్స్ పొంది మన సెక్రటేరియట్‌కే సెక్రటరిగా వస్తారు. చూడండి ఇది నా దీవెన" అన్నాడు ముకుందం వాత్సల్యంగా.

"కలలు చాలా బాగున్నాయి. కాస్సేపటికేం జరుగుతుందో ఎవడికి తెలుసు" అంది పద్మ వేళ్ళు విరుచుకుంటూ.

"ఎప్పుడన్నా సరిగ్గా మాట్లాడేవామ్మా జీవితంలో!" అని విసుక్కున్నాడు ముకుందం చిరాగ్గా మొహం పెట్టి.

పద్మకిదేం పట్టలేదు.

హేమంత్ ఎప్పుడు చాంబర్‌లోకి వెళ్తాడా అని చూస్తోంది.

హేమంత్ ముకుందంగారి దగ్గర సంతకం పెడుతుండగానే జరిగిందా సంఘటన.

లోపల్నుండి వసంత కెవ్వున అరిచింది.

"ఏంది సారే! ఏంటిదంతా? ఏవనుకున్నారు నన్ను" అంటూ గట్టిగా అరచి ఏడుస్తూ బయటకొచ్చింది వసంత,

సెక్షనంతా దిగ్భ్రమగా లేచి నిలబడ్డారు.

వసంత ఏడుస్తూనే వుంది.

"ఏవయింది, ఏవయింది?" అందరూ తెల్లబోయి అడుగుతున్నారు.

"ఏం జెప్పాల సర్. ఆ ముదనష్టపోడు నా చెయ్యి బట్టి గుంజిండు. శానా దినాల్నుండి ఎర్రి చేష్టలు జేస్తనే వున్నాడు. మొగుడు బొయ్ బతకొచ్చినదాన్ని. సప్పుడు సెయ్యక నెట్టుకొస్తండ. ఈరోజు సీకటయ్యిందేమో దయ్యం బట్టినట్టు.. " అని మళ్ళీ వెక్కెక్కి ఏడ్చింది వసంత.

హేమంత్ అందరితోపాటు తెల్లబోయి చూస్తున్నాడు.

పద్మ చచ్చిన పాములా కొయ్యబారి చూస్తోంది.

రమేష్‌బాబు బయటకి రాకుండా చాంబర్‌లోనే బిగుసుకుని కూర్చున్నాడు.

స్టాఫంతా తలోమాట అంటున్నారు.

పెద్ద ఆఫీసది.

పార్టీ జరగడంతో స్టాఫంతా వున్నారు.

అంతే అందరూ గుమికూడిపోయారక్కడ.

వసంత గోడకి జారబడి కూర్చుని ఏడుస్తూనే వుంది.

"ఛీ! ఛీ! చేసేది పెద్దజాబ్. వేసేది చిల్లర వేషాలు. ఏం మనిషి?" అంటున్నారు లేడీ స్టాఫ్.

"ఏవయింది?" రానే వచ్చింది, ఎన్.జి.వో లీడర్ చిగురుపాటి శమంతకమణి.

అందరూ తోచినట్లు చెబుతుంటే "వాడేడి?" అంది శమంతకమణి గద్దించినట్లు.

"పద పోలీస్ స్టేషన్‌కి. వీడుద్యోగం వూడబీకించి జైలు వూచలు లెక్కబెట్టిస్తాను. ఆడాళ్ళంతా వీడి వుంపుడు గత్తెలనుకుంటున్నాడేమో!" అంది గట్టిగా అరుస్తూ.

వసంత లేచి నిలబడింది.

"పేరు గబగబా రాసుకోవడం రానివాళ్ళందరికీ ప్రమోషన్స్ ఎలా వచ్చేస్తాయో మరి" అంది చాలా రోజులుగా తన ప్రమోషన్‌ని పక్కకి పెట్టి అందరికీ యిస్తున్నారన్న అక్కసుతో లలితా సుందరి కొంగు సవరించుకుంటూ.

విషయం తెలిసి చంద్రమౌళిగారు పరిగెత్తుకొచ్చారు. ఆయనెంత మంచివారో అంత ముక్కోపి.

ఆయన్ని చూసి అందరూ పక్కకి తగ్గారు.

"చూడు శమంతకమణీ! ఈ సమస్య మన ఆఫీసులోనే పరిష్కరించుకోగలమేమో. చూద్దాం. వసంత అమాయకురాలు. అనవసరంగా పోలీస్ స్టేషన్‌కి లాగకు."

"మీరలానే చొచ్చగొట్టేస్తారు సర్. ఇలా లూజ్‌గా వదిలేస్తే ఆడాళ్ళకి సేఫ్టీ వుండదు. దెబ్బకి దెయ్యం లొంగాలి" అంది శమంతకమణి ఆవేశపడిపోతూ.

"నా నిజాయితీని నువ్వు నమ్ముతావా?" చంద్రమౌళిగారు ఓపిగ్గా అడిగారు.

"అవునమ్మా, విను" అన్నారు ముకుందంగారు.

శమంతకమణి అయిష్టంగానే వెనక్కి తగ్గింది.

"హేమంత్, యూ కేరీ ఆన్. ఈ గొడవతో నీకేం సంబంధం లేదు. ఆల్ ద బెస్ట్" అంటూ హేమంత్‌కి షేక్ హాండిచ్చి సాగనంపారు చంద్రమౌళిగారు.

"ఓ.కె అందరూ పదండి." అంటూ గట్టిగా ఆయన అరిచేసరికి స్టాఫ్ రకరకాలుగా చెప్పుకుంటూ వెళ్ళిపోయారు.

వాళ్ళతోపాటు 'బతుకుజీవుడా!' అంటూ పద్మకూడా జారుకుంది.

చంద్రమౌళిగారు వసంత వంక చూసి "నువ్వు కూడా పదమ్మా రేపు ఆఫీసుకి రాగానే నన్ను కలువు" అని చెప్పి రమేష్‌బాబు వున్న చాంబర్స్ వైపు చూస్తూ వెళ్ళిపోయారాయన.

ఊహించని ఆ పరిణామానికి వంట్లోని రక్తం ఒక్కొక్క బిందువూ నీరయిపోతుంటే అలానే బిక్కజచ్చికూర్చున్నాడు రమేష్‌బాబు.

"అందరూ ఎల్లిపోయారు. లేస్తే జర తాళాలేస్తా!" వాచ్‌మన్ మాటలకి లేచి చచ్చిన పాములా బయటకొచ్చాడు రమేష్‌బాబు.

అప్పటికే ఆఫీసంతా ఖాళీ అయిపోతుంది.

ఆ మర్నాడు చంద్రమౌళిగారు కొంచెం త్వరగా ఆఫీసుకొచ్చారు. అప్పటికే వచ్చి బయట నిలబడి వుంది వసంత. ఆమెకి వత్తాసుగా అటెండర్లు బయట నిలబడి వున్నారు. క్లాస్ ఫోర్ యూనియన్ లీడర్ మస్సూర్ ఆలీఖాన్ చంద్రమౌళిగారికి సలాం చేసాడు. చంద్రమౌళిగారు లోపలికెళ్ళిన పదినిమిషాల తర్వాత వసంతని రమ్మని పిలిపించారు.

బాలయ్య వచ్చి "సార్ రమ్మంటున్నారు." అన్నాడు.

వసంత భయంగా లోపలికెళ్తుంటే "మేమంతా వున్నాం. ఏం భయపడకు" అని భరోసా ఇచ్చాడు.

వసంత చంద్రమౌళిగారికి నమస్కరించి తలుపువారగా నిలబడింది.

"ఇలా దగ్గరకి రా!"

వసంత రెండడుగులు ముందుకేసింది.

"ఇప్పుడు చెప్పు. అసలేం జరిగింది?" ఆయనది కంచుకంఠం. అయినా కొంచెం మృదువుగా అడగటానికి ప్రయత్నించారు.

"నిన్న జెప్పిన కదా సార్!" అంది భయంగా.

"అదికాదు. వివరంగా చెప్పు"

వసంత కళ్ళు మిటకరించి చూసింది.

"సారూ!"

"ఊ" చంద్రమౌళిగారు కళ్ళుమూసుకుని వినడానికి సిద్ధపడ్డారు.

"సార్, నిజం జెబితే నా నౌకరి తీసేస్తారా?"

చంద్రమౌళిగారు కళ్ళు తెరచి ఆమె వంక సాలోచనగా చూసి "నిజమే చెప్పు. నీకేం ఫర్వాలేదు. నేనున్నాను" అన్నారు నెమ్మదిగా.

"రమేషు సారు నా చెయ్యిబట్టలేదు. నేను అబద్ధమాడిన"

ఆయన తెల్లబోయినట్లు చూశారు.

"అవు సర్. నిన్న సాయింత్రం రమేషు సారు ఆడజేసే పద్మమ్మ నన్ను పిలిచినారు. పిలిచి ఏమంతు సారు పెద్దాపీసరుగా బోడానికి ఈల్లేదని ఈడనే సస్పెడయిపోవాలని తీర్మానించుకున్నారు. అందుకే నన్ను హేమంతు సార్ చెయ్యిపట్టుకున్నాడని లొల్లిజేయమని జెప్పినారు. ఆ సారు మంచోడు. ఆయన కూడు పడగొట్టాలని జూస్తున్నారని నేను బాగా ఆలోచించి గిట్ల జేసిన సారూ. ఈ తప్పు కాయండి మల్లా" అంటూ ఏడ్చింది వసంత.

"ఎందుకు?"

"ఏమో సారూ! తెల్వదు. మొదటికాణ్ణి నుంచి ఆల్లిద్దరూ ఏమంతు సారంటే ఏడుస్తుంటారు. పద్మమ్మ పని జెయ్యదు. ఆమె పనంత ఏమంతుసారు చేతే రమేష్ సారు జేయిస్తడు. రమేషు సారు బట్టే లంచాలన్ని పద్మమ్మకే యిస్తారు. గుత్తేదార్లు. ఆమె వడ్డీలకి తిప్పుద్ది. పద్మమ్మ మొదట్నుండి ఏమంతు సార్ని ఏదో అంటనే వుంటది. ఆ సారు మంచోడయ్యా. దేముడిలెక్క. అందుకే గిట్ల జేసిన" అంటూ మళ్ళీ ఏడ్చింది వసంత.

"సరే ఇదెవరికీ ఇక చెప్పకు. పోలీస్ కేసయితే వాళ్ళ వుద్యోగాలు పోతాయి" అన్నారు చంద్రమౌళిగారు.

"గట్లయితే నన్నేం జేయరా సారూ! నాకు నా బిడ్డని ఏమన్నా జేస్తే?" భయంగా చూసింది వసంత.

"అదంతా నేను చూసుకుంటాను" అని ముకుందంగారిని, ఎన్.టి.పి.ఏని - ఇంకా బయటవున్న ఒక లాయర్ని రమేష్‌బాబుని, పద్మని పిలవమని చెప్పారు అటెండరికి.

అందరూ క్షణాల్లో వచ్చి నిలబడ్డారు.

లాయరు, ముకుందం, ఎన్.టి.పి.ఏ కూర్చున్నారు.

"మీరు హేమంత్‌ని ఎందుకు సస్పెండ్ చేయించాలనుకున్నారు?" తీవ్రంగా అడిగారు చంద్రమౌళిగారు.

వాళ్ళిద్దరూ తలలుదించుకున్నారు.

"బాధ్యతాయుతమైన వుద్యోగాలు చేస్తూ ఇలాంటి చౌకబారు పనులు చేయడానికి మీకు సిగ్గులేదా? తెలివైన ఒక మంచి కుర్రాడి భవిష్యత్తు నాశనం చేస్తే - మీకేం ఒరుగుతుంది. ఏమ్మా నీది ఆడజన్మేనా? ఏం తిట్టాలి నిన్ను. ఆఫీసులకెందుకొస్తారమ్మా మీరు!?" అని కేకలేసి "లాయర్‌గారు మీరు వీళ్ళవల్ల వసంతకెలాంటి హాని జరగదని.. జరిగితే వీళ్ళేబాధ్యులని బాండ్ పేపర్ మీద ఒక ఎగ్రిమెంటు తయారు చేయండి" అని చెప్పి

"ముకుందంగారూ, నోటు పెట్టండి ఇతన్ని రివర్టు చేసి పార్వతీపురం ఏజెన్సీకి ఎడ్మినిస్ట్రేటివ్ గ్రవుండ్స్ మీద ట్రాన్స్‌ఫరు చేయండి" అంటూ పద్మకేసి చూశారు.

"మీ యిష్టం సార్! ఆమె పని చేయదు. చేసే వాళ్ళని చేయనివ్వదు. ఏదైనా డివిజనాఫీసుకి వేస్తే బాగుంటుందని నా సలహా సర్" అన్నాడు ముకుందం.

అంతా గంటలో జరిగిపోయింది.

దిక్కులేని మొహంతో ఆ సాయంత్రమే ఆ ఇద్దరూ రిలీవయ్యారు. లాయర్ తయారు చేసిన ఎగ్రిమెంటు మీద సంతకాలు చేసి.

**పోస్టింగ్ ఆర్డర్స్ కోసం** సెక్రటేరియట్‌లో వెళ్తుండగా హేమంత్‌కి ముకుందం ఎదురొచ్చాడు.

"నమస్తే సర్! పోస్టింగ్స్ ఎక్కడిచ్చారు?" అనడిగాడు ముకుందం.

"ఇంకా లేదు. దానికోసమే" అన్నాడు హేమంత్.

ముందురోజు ఆఫీస్‌లో జరిగిన సంగతులన్నీ వివరించాడు హేమంత్‌కి ముకుందం.

"వ్వాట్! ఇంత జరిగిందా?" అన్నాడు ఆశ్చర్యపోతూ.

"అవున్సార్! ఎంక్వయిరీలు, ఎక్స్‌ప్లనేషన్స్ ఏవీ లేకుండా... అంతా పకడ్బందీగా జరిగిపోయింది. దటీజ్ చంద్రమౌళీగారూ! ఇద్దరూ ఏడ్చుకుంటూ రిలీవయ్యారు."

"అదికాదండీ వసంత ఇంత ధైర్యం చేసిందా?" ఆశ్చర్యపోతూ అడిగాడు హేమంత్.

"అదే పిల్లిలా వుండే వసంత ఇంతకి తెగించిందంటే అందరికీ ఆశ్చర్యమే. ఏవైనప్పటికీ చాలా మంచిపిల్ల సార్" అని మెచ్చుకున్నాడు.

హేమంత్ ఆలోచిస్తూనే ఆర్డర్స్ తీసుకుని తిన్నగా వరూధిని దగ్గరకెళ్ళాడు. వరూధిని హేమంత్ వెళ్ళేవరకు శెలవు పెట్టింది.

ఆమె కూడా మిశ్రమ భావాలతో సతమతమవుతోంది.

హేమంత్‌కి మంచి ఉద్యోగం వచ్చిందన్న ఆనందాన్ని అతను వెళ్ళిపోతాడన్న బాధ కప్పేస్తున్నది.

"ఆర్డర్స్ తీసుకున్నావా? కంగ్రాట్స్" అంది అతని చేతిలోని పోస్టింగ్ ఆర్డర్స్ తీసుకుని చూస్తూ.

ఆమెచ్చిన టీ తాగుతూ "మనం అర్జెంటుగా వసంత ఇంటికెళ్ళాలి" అన్నాడు హేమంత్.

"ఎందుకిప్పుడు?"

హేమంత్ జరిగినదంతా చెప్పాడు.

వరూధిని తెల్లబోయింది.

"ఇంత కక్షా!?"

"సరే పద" అన్నాడు తొందరపెడుతూ హేమంత్.

"ఒక్క నిముషం" అంటూ డ్రెస్ మార్చుకుని తల్లికి చెప్పి బయల్దేరింది.

దారిలో వసంత కొక చీర, పళ్ళు స్వీట్స్ కొన్నాడు హేమంత్.

ఇద్దర్నీ చూసి వసంత ఆశ్చర్యపోయింది.

"రాండి సారూ! రాండి మేడం" అంది కంగారుగా

వరూధిని తెచ్చినవన్నీ వసంత చేతికిచ్చింది.

"యియ్యన్నీ దేనికి మేడం? మీరిద్దరూ కనిపించరంటే దిగులుగా వుంది" అంది బాధగా.

"నువ్వు చేసిన మేలు మరచిపోను" అన్నాడు హేమంత్.

"ఏముంది సారూ మిమ్మల్ని కాపాడుకోటం మా బాధ్యత. నా కొడుకు ఆస్పత్రిలో వున్నప్పుడు నిలువు కాళ్ళమీద నిలబడ్డారు మీరు" అంది కన్నీళ్ళతో.

"భయపడకు. నేనున్నాను ఏ అవసరమొచ్చినా. వరూధిని వచ్చి చూస్తుంది" అన్నాడు లేచి నిలబడుతూ.

వసంత కన్నీళ్ళతో తలాడించింది.

బయటికి వస్తూనే "వరూ!" అన్నాడు హేమంత్.

"ఊ"

"నాతో వైజాగ్ వస్తావా?"

అతని ప్రశ్నకి వులిక్కిపడింది వరూధిని.

''వైజాగా? ఎందుకు?''

''జాయినింగ్ టైముంది. రెండురోజులు నాతో వుండొచ్చు కదా!''

''కాని.. అది మీ వూరు అయినా ఎక్కడుండాలి నేను?''

''సరోజిని ఆంటీ ఇంట్లో వుంచుతాను. ఆంటీకి కూడ నువ్వంటే చాలా యిష్టం''

''కాని.. మీ వాళ్ళు అక్కడే వున్నారు కదా... చూస్తే''

''ఫర్వాలేదు. సిటీలో తిరిగే వాళ్ళు ఎక్కువ లేరు. అయినా ఎవరు చూసినా నాకేం భయంలేదు. నిన్ను జాగ్రత్తగా వెనక్కి పంపిస్తాను. మీ అమ్మగారికి చెప్పు''

వరూధిని తల పంకించింది.

రమేష్‌బాబు రిలీవయ్యాడు గాని. పాడేరులో జాయిన్‌కాలేదు.. సిక్‌లీవ్ పెట్టి ఇంట్లో కూర్చున్నాడు.

అతనికి తెలుసు - అతను ఎగ్జిక్యూషన్‌కి వెళ్ళి పనిచేయలేడు. ఎలాగైనా ఏ మినిస్టర్నన్నా పట్టుకుని తిరిగి ఇక్కడే రీ పోస్టింగ్స్ తీసుకోవాలని అతని ఆశ. కానీ చంద్రమౌళిగారున్నంత కాలం మినిస్టరు కాదు అతని తలలో జేజెమ్మ చెప్పినా వినడుగాక వినడు. చీఫ్ ఇంజనీరు ఇతనెంత చెబితే అంత.

''వెళ్ళి జాయినవ్వండి. ఇక ఆ ఆఫీసులో ఏ మొహం పెట్టుకుని పని చేస్తారు'' అంది అతని భార్య కోపంగా.

''అవునయ్యా మాకే నీ మొహం చూడాలంటే రోతగా వుంది'' అన్నాడు మావగారు పాన్ నవులుతూ.

''ఏంటి మీరంతా? అది దొంగ మాటలు చెప్పింది నేనేం దాని చెయ్యిపట్టుకోలేదు. ఆఫ్టల్ అటెండరది'' అని గెంతాడు రమేష్ బాబు.

''నాకు మీ సంగతి తెలుసు. ఆడగాడిదని కూడ వదలు మీరు. ఛీ వెధవ బతుకు'' అంటూ లోపలికి వెళ్ళిపోయిందావిడ.

రమేష్ బాబు జుట్టు పీక్కున్నాడు.

రోడ్డుమీద కెళితే ఆఫీసు వాళ్ళు కనబడతారు. ఇంట్లో వీళ్ళగోల. ''దీనికన్నా ఆ ఫస్టుక్లాసు ఏజెన్సీలో అలమలు తిని బతకడవే మేలేమో!'' అనుకుంటూ చిరుచీకటిలో ఇంటికి దగ్గరగా వున్న థర్డ్ రేటెడ్ బార్‌లో కూర్చున్నాడు తాగుతూ.

''ఏవయ్యా నీకు ఈ బారే గతయ్యిందా?''

రమేష్ ఆ గొంతు విని వులిక్కిపడ్డాడు.

''ఎవరా?'' అన్నట్టుగా చుట్టూ చూశాడు.

మసక మసక లైటింగ్‌లో గోడవారగా కూర్చుని తాగుతూ కనిపించాడు చక్రవర్తి.

అతన్ని చూసి వులిక్కిపడ్డాడు రమేష్‌బాబు.

''వీడి దరిద్రం ఇక్కడ కూడా'' అనుకుంటుండగా చక్రవర్తి గ్లాసు పట్టుకుని రమేష్‌బాబు ఎదురుగా వచ్చి కూర్చున్నాడు.

''ఏంటీ, ఆడు ఎళ్తా ఎళ్తా నిన్నాఫీసునుండి సాగనంపాడంటగా!'' అంటూ భళ్ళున నవ్వాడు చక్రవర్తి.

ఆ మాటకి అరికాలు మంట నెత్తికెక్కింది రమేష్‌బాబుకి.

''ఇదంతా నీ నిర్వాకమే. వాణ్ణేదన్నా చెయ్యి అంటే వినకుండా డబ్బు మాత్రం తీసుకున్నావు'' అన్నాడు అక్కసుగా.

"డబ్బా! ఏ మాత్రం ఇచ్చావు. డబ్బుకి మొహం చూసుకుంటే పనులిలానే చెడతాయి భాయీ. కక్కుర్తిగా ఎడాపెడా సంపాదించావు. ఎందుకలా పళ్ళుగిట్టకరచుకుని బ్రతుకుతావు. చివరికి ఎవరి పాలో నీ డబ్బు. కాస్త అనుభవించు రాజా అనుభవించు" అంటూ మళ్ళీ నవ్వాడు చక్రవర్తి.

చక్రవర్తి మాటలకి లేచి వెళ్ళిపోవాలనిపిస్తున్నది రమేష్‌బాబుకి.

కాని...ఎక్కడో ఏదో ఆశ.

వీడి ద్వారానే తను వరూధిని మీద కక్షతీర్చుకోగలడు. ఎలాగైనా వీణ్ణి దానిమీదకి ఆయుధం చేసి విసరాలి.

"నేను సంపాదించిందంతా నీకు తెలుసా?"

"ఎవరి దగ్గర ఎప్పుడెంత నొక్కేసావో లిస్టు చూపించనా?" అంటూ జేబులో చెయ్యిపెట్టాడు చక్రవర్తి.

"ఓహో! అంత డీటైల్స్ సేకరించేవా?"

"ఈ చక్రవర్తి వుత్త క్రిమినల్ కాదు మిస్టర్. పది తలలున్న ఇంటిలిజెంట్ క్రిమినల్"

"అద్సరే, నీ పెళ్ళాం రేపోమాపో వాణ్ణి పెళ్ళాడబోతుంది. నీ కూతురికి వాడు తండ్రవ్వబోతున్నాడు. సిగ్గుగా లేదా?" అతన్ని ఎలా దెబ్బతీసి రెచ్చగొట్టాలా అని మరో ప్రయత్నం చేసాడు రమేష్‌బాబు.

"హహహ! ఏవి తెలివి? నన్ను రెచ్చగొట్టి నీ పని జరిపించుకోవాలని మహా తాపత్రయపడుతున్నావు. నా కోపాన్ని అవసరానికి మాత్రమే వాడుకుంటాను మిస్టర్. నాకు డబ్బు రాలందే ఏదీ చెయ్యను వస్తా" అంటూ లేచాడు చక్రవర్తి.

రమేష్‌బాబు అసంకల్పితంగా అతని చేతిని పట్టుకున్నాడు. "ఆగాగు. ఇవ్వనన్నానా!? నాకు నిజానికి హేమంత్ మీద అంత కోపం లేదు. నా పగంతా దానిమీదే. దాని వల్లనే ఇదంతా జరిగింది. అది సుఖపడకూడదు. కుళ్ళికుళ్ళి ఏడవాలి. అదే నా తీవ్రమైన కోరిక" అంటూ జేబులోంచి పదివేల కట్ట తీసిచ్చాడు.

చక్రవర్తి ఆ కట్టని అటూ యిటూ తిప్పి "దీంతో అది కుళ్ళి కుళ్ళి ఏడవాలా? ఇప్పుడు బార్‌లో ఏకబిగిన కూర్చుంటే సిగరెట్ నుసిలా రాలిపోతుంది" అన్నాడు హేళనగా.

"సరే! రేపొద్దున్నే ఇక్కడికేరా! తెచ్చిస్తా"

"దట్స్ గుడ్ వస్తా!" అంటూ లేచి తూలుకుంటూ వెళ్ళిపోయాడు చక్రవర్తి.

రమేష్ పళ్ళు పటపటలాడాయి వరూధినిని తలచుకుని.

"చూస్తాను. నీ సంగతి చూస్తాను" అనుకుంటూ ఇంటిదారి పట్టాడు.

రైలు కదిలింది.

ఫస్ట్ ఏ.సిలో కూర్చున్నారు హేమంత్, వరూధినులు.

వరూధినికి ఏదో జంకుగా వుంది.

హేమంత్ అంటే ఎంత యిష్టమున్నా, తనే అతని పట్ల ఎంతో చొరవ తీసుకుని స్నేహం చేసి సినిమాలకి షికార్లకి తిరిగినా, ఇప్పుడిలా ఒంటరిగా పెళ్ళికాకుండా అతనితో ప్రయాణం చెయ్యడం అదోలా గిల్టీగానే వుంది.

హేమంత్ ఆమె వైపు చూశాడు.

ఆమె భయాన్ని కూడా గ్రహించాడు.

"వరూ!"

"ఊఁ" అంది.

"ఏమయినా చెప్పు"

"ఏం చెప్పను?

"ఎప్పుడూ లొడలొడా వాగేదానివి కదా! అలాగే ఏదయినా చెప్పు"

వరూధిని చిన్నగా నవ్వింది.

"భయపడుతున్నావా?" అతను నవ్వుతూ అడిగాడు.

"లేదు. లేదు ఎందుకు భయం నువ్వేమన్నా రాక్షసుడివా?" ఆమె తడబడుతూ అంది.

అతను నవ్వాడు.

"మరెందుకలా అటూ యిటూ చూస్తున్నావు. ఇది ఏ.సి కంపార్టుమెంటు. నువ్వు చూడాలన్నా ఏవీ కనపడవు. చచ్చినట్లు నన్నే చూడాలి. తప్పదు నీకీ శిక్ష"

"అదేం కాదు హేమంత్. నువ్వు ఎకాయెకి నన్ను వైజాగ్ తీసుకెళ్తున్నావు. అక్కడ మీ వాళ్ళున్నారు. పైగా సరోజనీ ఆంటీ యిల్లు మీ యింటికి దగ్గరే కదా! భయమేస్తుంది" అంది మెల్లిగా.

బదులుగా హేమంత్ సాలోచనగా చూశాడు.

"భయపడకు వరూ! నేను చూడ్డానికి మెత్తగా భయస్తుడిలా కనిపిస్తున్నానేమోగానీ టైమొచ్చినప్పుడు వెనక్కి తిరిగే మనిషిని కాను. ఆరు నూరయినా నీ చెయ్యి వదలను. ఎందుకో మా వైజాగ్‌లో కొన్ని ప్రదేశాల్లో నిన్ను పక్కన పెట్టుకుని తిరగాలని ఆశ. మళ్ళీ ఎప్పుడు కలుస్తామో?"

అతని వైపు భయంగా చూసింది వరూధిని.

అసంకల్పితంగా అతని చేతిని పట్టుకుంది.

ఆ చేతిమీద తన చేతిని వుంచి భరోసా యిస్తున్నట్లుగా తట్టాడు.

"పుట్టాక నేను చాలా గాఢంగా ప్రేమించింది మా అమ్మని. మా నాన్న పెట్టిన కష్టాల్ని ఆ మహాతల్లి ఎలా ఓర్చుకుందో ఏమో? అతనికసలు హృదయమే లేదు. నేను తెలియక చేసే అల్లర్లని కూడా ఎంతగానో సహించేది. ఊహ వచ్చాక నేను పెద్దయి అమ్మని సుఖపెట్టాలనుకున్నాను. ఒకసారి నా స్కాలర్‌షిప్‌లో మనీ దాచి అమ్మకి అరతులం బంగారం కొన్నాను. తీరా యిద్దామని వెళ్ళేసరికి అమ్మ శవం గుమ్మంలో ప్రత్యక్ష్యమయ్యింది. అది చివరికి అక్కకి మంగళసూత్రంగా మారింది. తిరిగి నా మనసులో నువ్వు ప్రవేశించావు. నీకు తెలీదు వరూ నేను నా జీవితాన్ని నీకే అంకితమిస్తున్నా!! అది సుఖం కాని.. మరొకటి కాని...దట్సాల్. మాటలు రావు నాకు."

హేమంత్ నిజానికి చాలానే మాట్లాడాడు ఇన్ని రోజులకి.

వరూధిని అతన్ని విస్ఫారిత నేత్రాలతో చూసింది.

ఆ వెంటనే చలించిపోయింది.

ఇందాకటి సందేహాలన్నీ తుడిచిపెట్టుకుపోయి ఆమె అతని పక్కకి వచ్చి కూర్చుని అతని భుజమ్మీద తలానించింది.

హేమంత్ ఆమె తల నిమిరాడు.

మూసుకున్న ఆమె కనుల వెనుక అపారమైన నమ్మకం ప్రేమ, ధైర్యం పెనవేసుకోవడం అతను కూడా గ్రహించగలిగాడు.

కాని అదే రైల్లో ఆర్డినరీ సెకండ్ క్లాసులో మరో వ్యక్తి వాళ్ళని ఫాలో చేస్తున్నాడని వాళ్ళకి తెలియదు.

అతనే చక్రవర్తి.

విశాఖపట్నంలో ప్లాట్‌ఫారమ్మీద దిగిన హేమంత్‌ని, వరూధినిని వాళ్ళు గమనించకుండా ఫాలో అవుతున్నాడు చక్రవర్తి.

ప్లాట్‌ఫామ్మీద పొద్దుటే వచ్చిన రైళ్ళతో జనం క్రిక్కిరిసి వున్నారు.

జనాన్ని తప్పించుకుని వాళ్ళని ఫాలో చెయ్యడం చక్రవర్తికి చాలా కష్టంగా వుంది.

అయినా వరూధిని వేసుకున్న పింక్ చుడీదారు ఆనవాలుతో పరిగెత్తుతున్నాడు.

ఇంతలో ఎవరో ఆడమనిషి అతన్ని గట్టిగా గుద్దేసింది.

అసలే రాత్రంతా కంపార్టుమెంటులో కూడా తాగుతున్న చక్రవర్తి అంతదూరం తూలిపోయాడు.

అసలే నోటిదురుసున్న చక్రవర్తి "ఏంటే, కళ్ళు కనబడటంలేదా?" అన్నాడు.

అంతే. ఆమె హార్మోనియమ్మీద చకచకా మీటలు నొక్కేసినట్లు తిట్ల పురాణం అందుకుంది.

"ఏట్రా ఎవులికి కల్లుపోనాయి. దొంగసచ్చినోడ. పొద్దున్నే పూటుగా తాగేసి ఒల్లూ పై తెలీకుండా ఆడంగుల మీనడిపోతున్నావు నీ జిమ్మడ. నీ బూడిద కాలికీ యేలికీ పోనూ.." ఆవిడ తిడుతూనే వుంది.

చక్రవర్తి అవాక్కయి పరుగులంకించుకుని స్టేషన్ బయటకొచ్చాడు.

అతని బుర్ర దిమ్మతిరిగిపోయింది.

కాసేపు ఏవీ అర్థం కాలేదు.

తనసలు వైజాగెందుకొచ్చినట్లు?

అర్థమయి చుట్టూ చూశాడు.

దూరంగా పింక్ కలర్ డ్రెస్సు కనిపించింది.

గబగబా పరిగెత్తాడు ఆవిడ దగ్గరకి.

తీరా చూస్తే ఆమె ఒక చంటి పిల్లాణ్ణెత్తుకుని భర్తకూడ వెళ్తోంది.

అతను తల పట్టుకున్నాడు.

ఇప్పుడీ సిటీలో ఎక్కడని వెదకాలి?

అప్పలమ్మల్ని చూస్తే చాలు అతనికి వణుకొస్తున్నది.

"ఆటో కాని కావాలేటి బావూ?" ఆటో అతని పిలుపుతో ఈ లోకంలోకొచ్చి "ఏదైనా హోటల్‌కి పోనివ్వు" అన్నాడు.

ఆటో కదిలింది.

గుమ్మంలో నిలబడి వున్న హేమంత్‌ని, వరూధినిని చూసి తెల్లబోయింది సరోజిని.

వెంటనే అర్థం చేసుకుని "ముందు లోపలికిరండి" అంది కంగారుగా.

వాళ్ళు లోపలికి రాగానే ధడాల్న తలుపు లేసి "ఎవరన్నా చూశారా!" అంది.

"లేదులే ఆంటీ ఇంకా సరిగ్గా తెల్లారలేదు కదా!" అన్నాడు హేమంత్.

"ఈ అమ్మాయి..."

"తెలుసులే! వరూధిని"

"కూర్చోమ్మా" అంటూ కుర్చీ ముందుకి తోసింది.

సరోజని పక్కన నేలమీద చతికిల పడ్డాడు హేమంత్.

"ఏంరా ఇలా ఎకాయెకీ తీసుకొచ్చేసావు, నీ జాబు చూస్తే రణరంగమవ్వదూ!" అంది సరోజని.

హేమంత్ నవ్వి "ఎప్పుడయినా అయ్యేదే ఏదో కాస్త ముందూ వెనుకా. ముందు వరూధినికి ఏం కావాలో చూడు" అన్నాడు.

"అయ్యో నా మతిమండ. నువ్వొచ్చి మొహం కడుక్కో తల్లీ. నేను కాపీలిస్తాను" అంది సరోజని వరూధిని బాత్రూం చూపిస్తూ.

వరూధిని బ్రష్ తీసుకెళ్ళగానే "పిల్ల బాగుందిరా ఇంత చిన్నపిల్లకి పెళ్ళి.. పిల్లా?" అంది ఆశ్చర్యంగా.

"ష్! వింటుంది"

"సర్లే మీ ఇంటికెళ్తావా? వెళ్తాను. ఇప్పుడు కాదు. వరూధినీని పంపించేసాక" అన్నాడు.

"సరే! బయటకెళ్ళకు. గోడల పక్కన నక్కలుంటాయి. అవసరమున్నా లేకపోయినా చెడగొడితే వాటికి సంబరం" అంటూ హెచ్చరించి కాఫీ పెట్టడానికి వెళ్ళింది సరోజని.

**"ఇప్పుడీ పిల్లని** ఎక్కడికి తీసుకెళ్దామనుకుంటున్నావ్?" వరూధిని అవతల గదిలో నిద్రపోతుండగా హేమంత్ గదిలో కెళ్ళి గుసగుసగా అడిగింది సరోజని.

హేమంత్ ఒక్క క్షణం మౌనంగా వుండిపోయాడు.

"ఎందుకో తెలియదు తనతో ఒక రెండు రోజులు.."

"ఊ, రెండు రోజులు..." రెట్టించి అడిగింది సరోజని.

హేమంత్ కొంత తడబాటుగా సరోజని వైపు చూశాడు.

ఆ తర్వాత నిదానంగా "నాకు నీకెలా చెప్పాలో తెలియదాంటీ, తనని వదిలేసి రావడం నాకు చాలా కష్టంగా అనిపించింది. మళ్ళీ ఎప్పుడు కలుస్తామో తెలియదు. అందుకే అనాలోచితంగా రమ్మని అడిగేసాను. ఏమిటో దిగులుగా వుందాంటీ" అన్నాడు.

సరోజని అతనివైపు నిశితంగా చూసింది.

"ఉరేయ్. నా మాట పెడుసేరా! కానీ నువ్వు నాకంత అర్థం కానివాడివి మాత్రం కాదు. అయినా ఏ క్షణం ఎలాంటిదో? నువ్వు మగాడివి ఆ పిల్ల చిన్న వయసయినా కష్టాలు నెత్తికెత్తుకుని బతుకుతున్న దురదృష్టవంతురాలు. అయినా ఆడదానికి వయసేంటిరా. మొగుడు పక్కన లేకపోతే వ్యభిచారి కూడా నీతులు చెబుతుందీ దేశంలో. పాపం, చూస్తుంటే జాలేస్తున్నది. జాగ్రత్త మరి" అంది.

"అత్తా!"

"ఏంటి?"

"నామీద నమ్మకం లేదా?"

"నమ్మకం లేంది నీమీద కాదు - ఆ పిల్ల జాతకమ్మీద"

"నువ్వన్నది నిజమే ఆంటీ. తనని నేను చాలా గాఢంగా ప్రేమిస్తున్నాను. జీవితాంతం ఆమె స్నేహాన్ని, సాహచర్యాన్ని కోరుతున్నాను. ఆమెలో ఒక అద్భుతమైన స్త్రీ శక్తిని చూస్తున్నాను. మిగతా విషయాలు వదిలేయ్. నన్ను నమ్ము."

సరోజని హేమంత్ బుగ్గలు పుణికి "నాకు తెలుసురా బంగారం. ఇప్పుడా అమ్మాయిని ఎక్కడికి తీసుకెళ్తావ్?"

"భీమిలి వెళ్ళాలని"

"ఎలా?"

"ఏదయినా టాక్సీలో."

"సరే, నువ్వు బయటకెళ్ళకు. నేను ప్రొద్దుటే టాక్సీ తెస్తాను. గుట్టుగా వెళ్ళండి."

"నువ్వా?"

"లేకపోతే మరి నువ్వా! కొంపలంటుకుంటాయి ఎవరన్నా చూస్తే - ఎవడైనా కొత్తవాణ్ణి చూసి తెస్తా. చీకటితో లేచి తయారవ్వండి" అంది గదిలోంచి వెళ్ళిపోతూ.

చీకటితో టాక్సీకోసం వెళ్తున్న సరోజనీని అవునా కాదా అన్నట్లు అనుమానంగా చూశాడు సుబ్బారావు.

అతనీమధ్య గుండె నొప్పొచ్చి డాక్టర్ల సలహామీద వాకింగ్ చేస్తున్నాడు.

కసితో కాని, ఆమె మీద నీచదృష్టితో కాని.. సరోజనీని ఇట్టే పసిగట్టే శక్తి అతనికుంది.

"అదేె.. ఏంటింత పొద్దున్నే. నేలమీద నడిచే తారాజువ్వలా చకచకా ఎల్లిపోతంది. ఏటో యవ్వారం" అనుకుని తనూ హడావుడిగా నడిచాడు.

సరోజని అతన్ని చూడలేదు.

సరోజని టాక్సీస్టాండులో నిలబడి బాగా పరీక్షించి ఒక అపరిచిత మొహాన్ని చూసి అతని దగ్గరగా వెళ్ళి మాట్లాడి చప్పున టాక్సీ ఎక్కింది.

సుబ్బారావు గబగబా టాక్సీ నెంబరు గుర్తుపెట్టుకుని - అంతటితో ఆగక సరోజని ఇంటివైపు నడక ప్రారంభించాడు.

కానీ అప్పటికే హేమంత్, వరూధినీలు టాక్సీ ఎక్కి వెళ్ళిపోవడం జరిగిపోయింది.

సరోజని ఇంటి తలుపులు మూసి వున్నాయి.

అర్థం కాలేదతనికి.

అంటే ఎటో వుడాయించింది.

ఎక్కడికయివుంటుంది?

పట్టుకోవాలి. పరువు తియ్యాలి.

తన పరువు తీసినందుకు కక్షతీర్చుకోవాలి. మగవాడి తప్పుని చాలా ఔదార్యంగా క్షమించేస్తుంది లోకం. ఇంకా కావాలంటే - దానిక్కూడ ఆడదే కారణమై వుంటుందని చెప్పుకుని సంతోషపడుతుంది.

అదే ఆడదయితే చూడకపోయినా నిజానిజాలు తెలియకపోయినా దూదిలా ఏకేస్తుంది.

ఇప్పుడదే చేయాలి. సరోజనీని రోడ్డుమీద నిలబెట్టాలి.

సుబ్బారావు ఆలోచిస్తూ ఇంటి మొహం పట్టాడు.

భీమిలీ రోడ్డు.

సముద్రం పొడవునా ఆనుకుని వెళ్తున్న కారులోంచి ఒకలాంటి పరవశానికి గురయి ప్రకృతిని చూస్తోంది వరూధిని.

ఎంత అందం ఈ ప్రకృతిలో.

ఎవరితోనూ మాట్లాడకుండా ఏ పుస్తకమూ చదవకుండానే కేవలం కళ్ళప్పగించి దేవుడు సృష్టించిన ఈ అందాలు చూస్తే చాలు బ్రతుకు ధన్యమై పోతుంది.

నిర్విరామంగా ఎగసిపడుతూ ఒడ్డుకి జేరి ఒరిగిపోతున్న కెరటాలు తెల్లని నురుగుని తలమీద మోస్తూ.

మరోపక్క పచ్చని ప్రకృతి.

సముద్రాన్ని తాకాలని క్రిందకి వస్తున్న మబ్బులు.

హేమంత్ క్రీగంట వరూధిని వైపు చూశాడు.

ఆమె నిజంగానే ఈ లోకంలో లేదు.

ఆమె చెయ్యి అతని చేతిలో వుంది.

"నువ్వసలీ లోకంలో లేవు."

అప్పుడు తల తిప్పి చూసింది వరూధిని.

చిన్నగా నవ్వి "అవును హేమ్, నేనంతా హైదరాబాదులోనే పుట్టి పెరిగాను. సముద్రం నాకంత తెలియదు. మా సముద్రం హుస్సేన్‌సాగరే. ఎంత బాగుంది. భూమిని కొలుస్తూ మనతోనే వస్తున్నది" అంది సంబరంగా.

"ఈ రోజు పౌర్ణమి తెలుసా?"

"అవునా! నీకు తిథులు కూడా తెలుసా?"

"అమ్మ పాటించేది. కేలండర్ తీసుకుని అమ్మ చెబుతుంటే నేను ప్రత్యేకమైన రోజులకి సున్నాలు చుట్టేవాణ్ణి"

"ఎందుకు?" ఆశ్చర్యంగా అడిగింది వరూధిని.

"ఆ ఆ రోజుల్లో ఏవో ప్రత్యేకమైన నియమాలు పాటించి పూజలు చేసేది. ముఖ్యంగా అమ్మ పౌర్ణమిరోజు వెన్నెల్లో తులసికోట దగ్గర కూర్చుని లలితా సహస్రం చదువుతుంటే నేను పక్కనే కూర్చునేవాణ్ణి"

చిత్రంగా వింటోంది వరూధిని.

హేమంత్ గట్టిగా నిట్టూర్చాడు.

"ఆ తెల్లవారు ఝామున స్నానాలేవిటో.. ఆ పూజలేవిటో? నాకు తెలిసి అమ్మ సుఖపడిన దాఖలాలు లేవు" అన్నాడు బాధగా.

వరూధిని అలానే వింటోంది.

"బహుశ మరో జన్మంటూ వుంటే.. అమ్మకి తప్పకుండా మంచి భర్త లభిస్తాడు. అదేకదా నిజమైన అదృష్టం."

"ఎంత స్వార్థం. మళ్ళీ ఆడజన్మేనా?" అంది వరూధిని నిష్టూరంగా.

"స్వార్థమా! ఆడదంటే ప్రేమ స్వరూపిణి వరూ. దీపంలేని ఇల్లన్నా చీకటిగా వుండదేమో కానీ స్త్రీ లేని ఇల్లంతా గాడాంధకారమే. అమ్మ చనిపోయాక ఆ ఇల్లు నాకు స్మశానవాటికలా కనిపించేది. ఎప్పుడూ చిర్రుబుర్రులాడుతూ ప్రేమనే పదానికి అర్థం తెలీని నాన్నని చూస్తే వద్దులే, ఎంతయినా తండ్రికదా!" అన్నాడు జేవురించిన మొహంతో.

మాటల్లో టాక్సీ భీమిలి కాటేజస్‌కి చేరుకుంది. అంతకు ముందే హేమంత్ బుక్ చేసిన కాటేజ్‌కి చేరుకున్నారు వాళ్ళు.

ఆ సాయంత్రం బీచ్‌లో నడుస్తూ ఎదురుగా వున్న అనంతమైన సముద్రాన్ని చూస్తూ..

"సముద్రాన్ని చూస్తే భయం వెయ్యడం లేదూ?" అనడిగింది వరూధిని.

"ఎందుకు?" ఆశ్చర్యంగా అడిగాడు హేమంత్.

అలా చూడు.

"ఆ జలరాశి అనంతంగా లేదూ. దిగంతాలకి వ్యాపిస్తూ... దానిముందు మనం ఇసుక రేణువుల్లా. నాకు మాత్రం భయం వేస్తోంది హేమ్" అంది వరూధిని హేమంత్ చేతిని గట్టిగా పట్టుకుంటూ.

హేమంత్ నవ్వాడు.

"నాకేం అలా అనిపించడం లేదు వరూ. బహుశా చిన్నతనం నుండి సముద్రాన్ని చూస్తూ పెరిగినందువల్లనేమో. రా" అంటూ చెయ్యి పట్టుకుని కొంచెం దూరం సముద్రంలోకి లాక్కెళ్ళాడు.

కెవ్వు కెవ్వున అరుస్తూనే వుంది వరూధిని భయంతో.

పెద్ద పెద్ద అలలు ఎగసి ఎగసి పడుతున్నాయి. ఎన్నో జంటలు నీటిలో తడిసి ముచ్చట పడుతున్నారు.

అంతలోనే నిలువెత్తు అల ఒకటి వచ్చి హేమంత్‌ని, వరూధినీని నిలువెల్లా తడిపేసింది.

ఉప్పునీళ్ళు కళ్ళల్లోకి, ముక్కులోకి వెళ్ళి వుక్కిరిబిక్కిరయ్యింది వరూధిని.

ఆమెని చూసి కంగారు పడి "సారీ, వరూ సరదాగా చేసాను" అన్నాడు హేమంత్.

వరూధిని తడిసిన చున్నీతోనే మొహం తుడుచుకుని "భయం వేసింది తెలుసా! నువ్వు చాలా మొండివాడివి" అంది చిరుకోపంగా.

"సారీ అన్నాగా"

"ఇప్పుడు చూడు బట్టలన్నీ తడిసిపోయాయి"

"అలా కాస్సేపు ఒడ్డున కూర్చుంటే అవే ఆరిపోతాయి" అన్నాడు హేమంత్.

ఇద్దరూ దూరంగా వచ్చి ఇసుకలో కూర్చున్నారు. చీకటి అన్ని వైపులా పరచుకుంటున్నది.

చంద్రుడు సముద్రగర్భంలోంచి రావడాన్ని సంతోషంగా చూసింది వరూధిని.

వెన్నెల అంతటా పరుచుకోవడం ప్రారంభమైంది. అలల దూకుడు పెరిగింది.

సముద్రం - ఆకాశంలో వినీలమైంది. దూరంగా వున్న షిప్పులు చిన్న ఆటబొమ్మల్లా కనిపిస్తున్నాయి. వాటిలో దీపాలు మాత్రం వాటి వునికిని తెలియజేస్తున్నాయి.

అంతసేపు కేరింతలు కొట్టి ఆడిపాడిన జంటలు గువ్వపిట్టల్లా దగ్గర దగ్గరగా ఒదిగిపోవడం ఒక కంట చూస్తూనే వుంది వరూధిని.

వరూధినికి ఆ వాతావరణం నచ్చినా మొదటిసారిగా ఇలా రావడం తప్పేమోననిపించింది.

వెన్నెల ఆకాశమంతా రేకులు విప్పిన తెల్లకలువలా విచ్చుకుంటున్నది. వాతావరణంలో ఒకలాంటి చల్లగాలి చోటుచేసుకుని - అటు భయంతోనూ - ఇటు చలితోనూ సన్నగా వణుకుతోంది.

కెరటాలు చంద్రుణ్ణి చూసి వెర్రి ఆరాటంతో ఎగసి ఎగసి పడుతున్నాయి.

అక్కడక్కడా దూదిపింజల్లాంటి మబ్బులు.

హేమంత్ వరూధిని భయాన్ని గమనించాడు.

"వరూ!"

"ఊ" అంది హీన స్వరాన.

"వెళ్ళిపోదామా?"

"ఎక్కడికి?"

"ఇంటికి"

"ఇప్పుడా?"

"ఏముంది, కారు మన చేతిలో వుంది."

"సరే" అన్నట్లు తల తిప్పింది వరూధిని.

ఇద్దరూ పైకి లేచారు.

టాక్సీ బయల్దేరింది.

సముద్రమూ, వెన్నెలా దారి పొడవునా తోడుగా వస్తూనే వున్నాయి.

"నీ భయాన్ని నేను గమనించాను వరూ. ఆడపిల్లకది సహజమేనేమో. నేను నిన్ను ఇబ్బంది పెట్టాలని తీసుకురాలేదు. మళ్ళీ ఎప్పుడు కలుస్తామో తెలీదు. తిరిగి మనం మళ్ళీ కలుసుకునే వరకు ఈ భీమిలి, సముద్రమూ, వెన్నెల జ్ఞాపకాలుగా మిగలాలన్నదే నా ఆశ. నేను ముందు నీకు స్నేహితుణ్ణి. ఆ తర్వాత ప్రేమికుణ్ణి. ఇందులో వున్న తియ్యని జ్ఞాపకం శారీరక సంబంధంలో వుండదని నా నమ్మకం. మనం కలిసినా విడిపోయిన ఈ క్షణాలు మన జీవితంలో సుగంధాలు వెదజల్లిన పూలలా మిగిలిపోతాయి."

వరూధిని అతని మాటలకి వులిక్కిపడి చూసింది.

ఆమె కళ్ళలో లీలగా కన్నీళ్ళు వెన్నెల కాంతిలో అభ్రకం పొరలా మెరిసాయి.

ఈసారి ఆమె అన్నీ మరచి అతని భుజమ్మీద వాలింది "విడిపోవడమా?" అని సన్నగా గొణుగుతూ.

"మాటవరసకి అనేసాను. విడిపోవడమంటూ వుండదు. అది నేనూహించలేను" అతని చేతులు ఆమెను చుట్టేసాయి.

కాని.. పెను పాములు ఎప్పుడూ పొంచే వుంటాయని. ఇది వారిద్దరి జీవితాల్లో ఆఖరి సమాగమని వారికే తెలియదు.

అర్ధరాత్రి దాటి వచ్చిన వాళ్ళిద్దర్నీ చూసి "మీ అసాధ్యం కూలా! ఇంత రాత్రా రావడం, ఎవరు చూడలేదు కదా!" అంది సరోజని కంగారుగా.

"లేదులే ఆంటీ"

"రండి, ఏవన్నా తిన్నారా?" తలుపు లేస్తూ అడిగింది.

"ఆఁ దారిలో టిఫిన్ చేసాం"

"అయ్యో రామా! ఇంత ఉడకేస్తానుండండి" అంటూ వంట గదిలోకెళ్ళబోయిన సరోజనిని వారించింది వరూధిని.

"వద్దాంటీ, ఆకల్లేదు"

"అవును"

"అవున్లే, ఆకళ్ళేం వుంటాయి నా పిచ్చిగాని" అని నవ్వింది సరోజని.

ఆ మాటకి సిగ్గుపడి తలదించుకుంది వరూధిని.

"సరే వచ్చి నా దగ్గర పడుకో, నీతో మాట్లాడాలి " అంది సరోజని.

వరూధిని కాళ్ళూ చేతులూ కడుక్కుని గదిలో కొచ్చింది.

సరోజని పాలు వేడి చేసుకొచ్చి చెరో గ్లాసిచ్చింది.

ఆ వెంటనే తన గదిలో కొచ్చిన వరూధినికి బ్లాంకెట్ ఇచ్చి పక్కనే పడుకుంటూ "మా హేమంత్ మంచివాడు. తేడా వస్తే కాళ్ళిరగ్గొడతాను. అసలా తేడా రానివ్వడనుకో. మరి నువ్వుకూడా ధైర్యంగా నిలబడతావా?" అనడిగింది సూటిగా.

వరూధిని తల వూపింది.

"తలూపడంకాదు. ఈడి బాబు మనిషి రూపంలో వున్న రాక్షసుడు. ఆడికే సెంటిమెంటూ సింగినాదం లేవు. ఆడి ధాటికి తట్టుకోవాలి. బెదరకూడదు. ఆడే గెంతి గెంతి నేలమీద చతికిల పడతాడు."

వరూధిని బెదురుగా చూసింది.

సరోజని లాలింపుగా తన చెయ్యి వరూధిని నడుం చుట్టూ వేసి "ఆడమాయకుడమ్మా. ఆ ఎదవ పేమా గీమా అంటాడని అనుకోలేదసలు నేను. నట్టేట్లో ముంచకు. పిచ్చోడయిపోతాడు. ఆణ్ణి..బాగా..సూసుకో" అంటూనే నిద్రలోకి జారుకుంది సరోజని.

నిద్రలేనిది మాత్రం వరూధినికే.

**ఆ మర్నాడు** ఇద్దరూ లేచి తయారవుతుంటే "మళ్ళీ బయటకి తీసుకెళ్తావా?" అని సందేహంగా అడిగింది సరోజని హేమంత్‌ని.

హేమంత్ సన్నగా నవ్వి "ఇక్కడికే వేంకటేశ్వరస్వామి గుడికి అలా కైలాస్‌గిరికి వెళ్దామని" అన్నాడు.

"ఇక్కడికేలే! ఇంత భయంలేకుండా పోయిందేవిట్రా నీకు. ఎవరైనా చూస్తే నానా రభసని నేను ఛస్తున్నాను. సరే మరి. వెళ్ళి టాక్సీ తేవాలా?" అనడిగింది ఇద్దరికీ కాఫీ యిస్తూ.

"లేదాంటి, అతనికి నిన్ననే ఆరుగంటలకల్లా రమ్మని చెప్పాను" అన్నాడు హేమంత్ తలదువ్వుకుంటూ.

"పోనీలే, తెలివైన పనే చేసావ్, వాడికి నువ్వేమన్నా తెలుసా?" అంటూ ఆరా తీసింది సరోజని.

"లేదులే ఎక్కడో శ్రీకాకుళం నుండి వచ్చాడంట కొత్తగా" ఆ పాటికే టాక్సీ వచ్చి గుమ్మంలో నిలబడింది.

వాళ్ళిద్దరూ వెళ్ళేవరకూ గుమ్మంలోనే నిలబడి లోపలికొచ్చింది సరోజని.

సరిగ్గా అదే సమయానికి టాక్సీ స్టాండులో నిలబడ్డాడు సుబ్బారావు.

ఎలాగైనా ఈరోజు అతన్ని పట్టుకుని సరోజని ఎక్కడికెళ్ళిందో ఆరా తియ్యాలి. కథేంటో తెలుసుకోవాలి అనుకుంటూ చలిగాలులు వీస్తున్నా లెక్కపెట్టకుండా అలానే నిలబడ్డాడు సుబ్బారావు.

తన దగ్గరున్న టాక్సీ నెంబరు కాగితాన్ని జేబులోంచి తీసి అక్కడున్న టాక్సీలని గమనిస్తూ ఒక గంట గడిపాడే కాని... అతనికా టాక్సీ దొరకనే లేదు.

అసలీ సరోజని తిరిగి రాలేదా, ఎక్కడికి వుడాయించుంటుంది అని క్షణక్షణానికి వుద్విగ్నత పెరిగిపోతుంటే ఇక యిలా కాదనుకుని సరోజని ఇంటివైపు నడిచాడు సుబ్బారావు.

సరోజని గుమ్మం ముందు నీళ్ళు జల్లి ముగ్గు పెడుతూ అతన్ని చూడలేదు.

'అరె, ఇదిక్కడే వుంది. వెళ్ళొచ్చేసిందా' అనుకున్నాడామెని చూస్తూనే. ఆమెని చూడగానే వాడి పాడుబుద్ధి తిన్నగా తిరిగి వెళ్ళిపోవాలనిపించలేదు.

కొంచెం దూరంగా నిలబడి చిన్నగా సకిలించాడు.

సరోజని తలెత్తి చూసింది.

ఎదురుగా నిలబడి నవ్వుతూ "ఏంటి సరోజనీ చుట్టాలొచ్చారా?" అన్నాడు పలకరింపుగా.

సరోజనీకి వళ్ళంతా జెర్రెలు పాకినట్లయింది.

మరోసారయితే ఆ కళాపి జల్లిన చెంబు వాడి మొహమ్మీద విసిరేసేదే

'చుట్టాలొచ్చారా' అన్న ప్రశ్నకి ఆమె మనసు చాలా కంగారుపడింది.

"ఇటుకేసెందుకొచ్చావ్ సిగ్గులేదా?" అంది కొంచెం తీవ్రంగానే.

"ఎందుకంత కోపం. ఎల్లకాలం తగాదాలిలాగే వుండిపోతాయా? మరచిపోవాలి. అద్సరే, నిన్న పొద్దున్నే టాక్సీస్టాండుకొచ్చావు. అందుకనే అడుగుతుంట" అన్నాడు తిరిగి పళ్ళికిలిస్తూ.

ఈసారి మరింత డీలాపడిపోయింది సరోజని.

అంటే వీడంతా చూశాడన్నమాట. హేమంత్ వచ్చినట్లుగాని తెలిసిపోయిందా కొంపదీసి అనుకుంది భయంగా.

అయినా తన భయాన్ని కప్పిపుచ్చుకుంటూ "పిచ్చి వాగుడు వాగకు. ఎవర్ని చూసి ఎవరనుకున్నావో దరిద్రపు మొహమా!" అంటూ ఛివాలున బక్కెట్టు, చీపురు తీసుకుని లోపలికొచ్చి తలుపేసుకుంది ధడాల్న.

"నాకింకా కంటి చూపు బాగానే వుంది సరోజనీ. నిన్ను గుర్తుపట్టలేనా?" అని అతననడం ఆమె చెవుల్లో పడింది.

లోపలికొచ్చిందేగాని ఆమె గుండె దడదడలాడుతూనే వుంది.

మొదటిసారి హేమంత్ మీద పీకలదాక కోపం ముంచుకొచ్చింది.

వీడెందుకిలా లేనిపోని వేషం వెయ్యడం. తండ్రి నైజం తెలీదా. అభం శుభం తెలీని పిల్ల జీవితంతో ఆటలాడటం దేనికి? అతని చెవిన పడిందంటే కొత్తరకం భాగోతం కనిపెట్టి వీధి వీధి తిరిగి విరగబడి ఆడతాడు అనుకుంది అసహనంగా.

ఆమె కళ్ళలో వరూధిని రూపమే మెరుస్తున్నది.

ఎంత బాగుందీ పిల్ల. ముఖ్యంగా ఆ కళ్ళు నిర్మలంగా మెరుస్తూ. 'చల్లగా వుండాలి' అనుకుంది ప్రేమగా.

హేమంత్ మొదలు వరూధినీని వేంకటేశ్వరస్వామి గుడికి తీసుకెళ్ళాడు.

ఇంకా చీకట్లు విడిపోలేదు.

పక్కనే వున్న హార్బర్‌కి వెళ్ళే సముద్రపు పాయని అలా విడదీసిన డాల్ఫిన్స్‌నోస్‌ని అందులో తేలుతున్న బుట్టల్లాంటి ఫాంటూన్స్‌ని దూరంగా ఆగివున్న షిప్పులని చిత్రంగా చూసింది వరూధిని.

దేవుడి దర్శనమయ్యాక ఇద్దరూ ప్రసాదం తింటూ పేరాపెట్ వాల్‌ని ఆనుకుని కూర్చున్నారు.

అసలేనాడూ సముద్రమే తెలియని వరూధిని సముద్రాన్నే తదేకంగా చూస్తూ " ఆ బుట్టల్లా దీపాలతో తేలుతున్నాయే, అవేంటి?" అనడిగింది.

"వాటిని పాంటూన్సంటారు" అని చెప్పాడు హేమంత్

"ఎందుకవి?"

"రాత్రి పూట వచ్చే షిప్పులకి అవి హార్బర్‌కి వెళ్ళడానికి దారి చూపిస్తాయి. అవతల కొండ చూశావా, అదే డాల్ఫిన్స్‌నోస్. దానివలనే ఇక్కడ నేచురల్‌గా హార్బర్ ఏర్పడింది. ఈ దీపాల కాంతితో షిప్ హార్బర్ చేరుకుంటుంది" అన్నాడు హేమంత్.

వరూధిని వాటిని, సముద్రాన్ని ఎదురుగా వున్న కొండని సంభ్రమంగా చూసింది.

"చాలా బాగుంది వైజాగ్. సముద్రం ఈ వూరిని పాములా చుట్టేసినట్లుంది" అంది తన్మయత్వంగా.

"అదే వైజాగ్ స్పెషాలిటీ. పద కైలాసగిరి చూద్దువుగాని" అన్నాడు పైకి లేస్తూ.

కారు కైలాస గిరి కొండ ఎక్కుతుంటే చుట్టూ అనంతమైన సముద్రమే. ఇద్దరూ చాలాసేపు శివపార్వతుల విగ్రహం దగ్గర కూర్చున్నారు.

"మళ్ళీ ఎప్పుడొస్తావు హైదరాబాదు?" దిగులుగా అడిగింది వరూధిని.

అతనితో తిరుగుతున్న కొన్ని గంటల్లో అతన్ని విడిపోతున్నాననే దిగులు ఆమెని వెంటాడుతునే వుంది.

"జాయిన్ కాగానే అక్కడి వ్యవహారాలు చూసుకుని వచ్చేస్తానుగా!"

"కాని..."

"నాకీ డిపార్టుమెంటు కొత్త. బేసికల్‌గా నేను ఇంజనీర్ని. కొంచెం అన్నీ తెలుసుకోవాల్సుంటుంది కదా" అన్నాడు హేమంత్ అనునయంగా.

"అవును" సన్నగా గొణిగింది వరూధిని. ఆమె కళ్ళలో నీళ్ళు గమనించాడు హేమంత్.

"చిత్ర, అమ్మ గుర్తొస్తున్నారు" అంది చిన్నగా నవ్వి సంజాయిషీ యిస్తున్నట్లుగా.

"నాకు తెలుసు" అతనామె చేతిని సున్నితంగా పట్టుకున్నాడు.

చక్రవర్తికి ఆ లాడ్జిలో పరమ విసుగ్గా వుంది.

వచ్చిన పని కాలేదు, తెచ్చిన డబ్బయిపోతున్నది.

తాగి తాగి చిరాకెత్తుతున్నది మొదటిసారిగా. ఎలా పట్టుకోవాలి వీళ్ళని.

అతను సిగరెట్టు తాగుతూ లాడ్జిలోంచి బయటకొచ్చి నాలుగురోడ్ల కూడలిలో నిలబడ్డాడు.

"ఎక్కడని వెదకాలి. ఎవర్నని అడగాలి. ఎండ చుర్రుమంటోంది. దానికి తోడీవుక్క. ఏం వూరిది?" విసుక్కుంటూ మనిషి మనిషిని పరికించి చూస్తున్నాడు.

ఎంత కళ్ళు పొడుచుకుని చూసినా వాళ్ళ జాడలేదు.

ఎదురుగా వున్న బండిమీద బజ్జీలు తిని జర్దాపాన్ వేసుకుని ఆలోచిస్తుంటే అతనికి రమేష్‌బాబు తట్టాడు.

'అవును - కాస్సేపు వాడితో ఆడుకోవాలి.'

అతని పెదవులపై చిరునవ్వు మెరిసింది.

వెంటనే ఎదురుగా వున్న టెలిఫోన్ బూత్‌లోకి నడిచి రమేష్‌బాబుకి ఫోన్ చేసాడు.

"ఏనయ్యిందా?" రమేష్‌బాబు కంఠంలో ఎక్కడలేని ఆతృత.

"ఏమవ్వడం, వాళ్ళిద్దరూ ఎటుపోయారో అంతుపట్టడంలేదు. లంకంత వూరు. ఎక్కడని వెదకాలి?"

"మరి దేనికని వెళ్ళావు?" రమేష్‌బాబు గొంతులో వెటకారం.

"ఎక్కువ మాట్లాడకు నేనేం నీ బాబుకాడి నౌఖర్నికాను. నువ్విచ్చిన బోడి డబ్బుతో వూరంతా జల్లెడ పట్టడానికి."

"బోడి డబ్బా?" డబ్బునేమన్నా అంటే పిచ్చి కోపం వచ్చేస్తుంది రమేష్‌బాబుకి. ఎన్ని తిప్పలు పడితే ఎన్ని వేషాలేస్తే వచ్చి చేరుతుంది. తనముందే తన కష్టార్జితాన్ని మందు చేసి తాగేస్తుంటే అతనికి వెర్రెత్తిపోతున్నది.

"సరే ఇప్పుడేం చెయ్యమంటావ్?" విసుగ్గా అడిగాడు.

"ఆ హేమంత్ గాడి ఎడ్రస్ చెప్పు"

"ఎడ్రస్సా, నాకేం తెలుసు"

"ఏం వుద్యోగం చేస్తున్నావు? వాడి సర్వీసు రిజిస్టర్‌లో వుంటుంది. లేదా ఎడ్మినిస్ట్రేటివ్ వింగ్‌లో అడుగు దొరుకుతుంది."

"ఇప్పుడా, నేనడిగితే అందరికీ సందేహం వస్తుంది. అసలే నేను లీవ్‌లో వున్నాను" అన్నాడు రమేష్‌బాబు.

"సరే ఒక పదివేలు ఈ లాడ్జికి పంపు. ఎడ్రస్ చెబుతాను"

"నా దగ్గర లేవు"

ఫోను కట్టయింది వెంటనే.

చక్రవర్తికి అరికాలి మంట నెత్తికెక్కింది.

ఆ కోపం వరూధిని మీదకు మళ్ళింది.

ఇది వాణ్ణేసుకుని బలాదూరు తిరుగుతోంది. తనిలా ముష్టివాడిలా వుద్యోగం పోగొట్టుకుని రోడ్లమీద తిరుగుతున్నాడు. దీనివలనే కదా తన వుద్యోగం పోయింది.

కసిగా సిగరెట్ పీక క్రింద పడేసి వెనుతిరుగుతుంటే దూరంగా రోడ్డుకటువైపు హోటల్లోంచి వచ్చి టాక్సీ ఎక్కుతున్న జంటమీద పడిందతని దృష్టి.

అవును వాళ్ళే. అంటే ఇక్కడే చక్కర్లు కొడుతున్నారన్నమాట.

అతను ఆత్రుతగా రోడ్డు క్రాస్ చెయ్యాలని ప్రయత్నించే లోపునే టాక్సీ తుర్రుమంది.

చక్రవర్తి అసహనంగా జుట్టు పీక్కున్నాడు.

"ఇదే. మా నాన్న జీవితకాలం తను సుఖపడకుండా మమ్మల్ని సుఖపడకుండా చేసిన ఇల్లు" టాక్సీ ఆపి చెప్పాడు హేమంత్.

వరూధిని ఆ ఇంటికేసి చూసింది.

ఇంటి చుట్టూ చాలా స్థలం వుంది. పెద్ద పెద్ద చెట్లతో చాలా భాగం మూసుకుపోయి కనిపించడం లేదు.

ఒక చిన్న పేలస్‌లా వుంది.

రంగులు లేక, మనుష సంచారం లేక మాసిపోయి బోసిపోయి వుంది.

"లోపలికెళ్దాం రా!"

"వద్దు. భయంగా వుంది" అంది వరూధిని ఆ యింటివైపదోలా చూస్తూ.

"ఎందుకు?"

"చాలా కళావిహీనంగా లేదూ"

"అవును. దీపం పెట్టే దిక్కులేక ఎన్నో ఏళ్ళుగా కోర్టుకేసుల్లో ఇరుక్కుని అలా వుండిపోయింది మరి" ఆమె చెయ్యిపట్టుకుని లోనికి లాక్కెళ్తూ అన్నాడు హేమంత్.

"ఎందుకు బలవంతంగా నాకీ యిల్లు చూపిస్తున్నావ్?" అనడిగింది వరూధిని అసహనంగా.

"మా నాన్న కోర్టుకేసు గెలిచేట్లుగా వున్నాడట. రాబోయే కాలంలో ఈ యింటికి మహారాణివి నువ్వేనని" అన్నాడు హేమంత్ కొంటెగా.

"ఛీ!ఛీ నాకిలాంటి ఆస్తులేం వద్దు. చూస్తే దయ్యాల కొంపలా వుంది" అంది వరూధిని కోపంగా.

హేమంత్ పకపకా నవ్వి "అయితే ఇందులో వుండనంటావ్" అన్నాడు.

"ఛస్తే వుండను"

"వద్దులే. ఈ ఇంటిమీద నాక్కూడా చెప్పలేని అసహ్యం పద" అన్నాడు చెయ్యిపట్టుకుంటూ.

ఈ రోజు వెళ్ళిపోతాను హేమూ. నాకు పదే పదే చిత్ర గుర్తొస్తున్నది. అమ్మ ఎలా మేనేజ్ చేస్తున్నదో ఏమో?" అంది వరూధిని ఆందోళనగా.

"అలాగే పంపిస్తాను" అన్నాడు హేమంత్.

"ఆ హేమంత్ గాడి ఎడ్రస్ కావాలి. ఎలా?" అడిగాడు పద్మని రమేష్‌బాబు కోటీలో ఒక హోటల్లో కూర్చుని.

"ఏమో, నాకేం తెలుసు" అంది పద్మ నిర్లక్ష్యంగా.

"నీకు బాగానే తెలుసు. అనుకుంటే నిముషంలో తేగలవు."

"ఆ రోజులు పోయాయి"

"నా దగ్గర పనిచెయ్యడం లేదనేగా నీకా నిర్లక్ష్యం. మళ్ళీ మంచిరోజులొస్తాయి."

"అంత నమ్మకమా?" వెటకారంగా అడిగింది పద్మ.

"సరే! ఈ మాటలన్నీ మాని" ముందా ఎడ్రస్ పట్టుకో. వాళ్ళిద్దరూ టింగురంగా అని వైజాగంతా చక్కబెడుతున్నారు. వాడిమీద - దానిమీద కసి తీర్చుకోందే నేను నిద్రపోను" అన్నాడు రమేష్‌బాబు.

"సరే! నాకేంటి లాభం?"

"ఎప్పుడూ లాభాల గొడవే నీకు. మనమిలా అయిపోవడానికి వాళ్ళేకదా కారణం. వాడినలా వదిలెయ్యడమేనా?" ఆమెని రెచ్చగొట్టే ప్రయత్నం చేసాడు రమేష్‌బాబు.

"సరే ప్రయత్నిస్తాను" అంది పద్మ.

తన చెయ్యిదాటిపోయిన హేమంతంటే ఆమెకీ చెప్పలేని కసివుంది. కాని.. ఆ పని రమేష్‌బాబు కోసమే చేస్తున్నట్లుగా ఎస్టాబ్లిష్ చేసుకోవడం ఆమె ప్రత్యేకత.

"అద్సరే రెండునెలలుగా వడ్డీ యివ్వడంలేదు నువ్వు."

"వడ్డీయా?" చాలా ఆశ్చర్యంగా అడిగింది పద్మ.

"తెలియనట్లడుగుతున్నావేంటి, నీవాటా నువ్వు నొక్కేస్తూ నా డబ్బు వడ్డీకి తిప్పుతున్నావు కదా! దాని సంగతి."

"తెలుసులెండి. అవతల ఉద్యోగం చెయ్యలేక గాలికి తిరుగుతున్నాను. ఇప్పుడు మీకు వడ్డీకావాలా?" అంది వుక్రోషంగా పద్మ.

"ఏదన్నా అంటే ఇదొకటి. నా డబ్బు నువ్వెంత పర్సెంట్ వడ్డీకి యిస్తున్నావో - నాకెంత విదిలిస్తున్నావో నాకంతా తెలుసు. అంతేలే టైము బాగోనప్పుడు గాడిద కాళ్ళు పట్టుకోవాలి."

"అంటే నేను గాడిదనా?"

"ఊరికే రెట్టించకు. వెళ్ళి వాడ్నెడస్సు పట్టుకో. మళ్ళీ మనకి మంచిరోజులొస్తాయిలే" రమేష్‌బాబు పైలేచాడు.

పద్మ అతనివెనుకే బయల్దేరింది.

"రేపిదే టైముకి రండి. ఇస్తాను" అంటూ.

"ఏంటి?"

"హేమంత్ ఎడ్రస్సు."

"షూర్?" అతని కళ్ళు మెరిసాయి.

"షూర్" అందామె గర్వంగా.

**రైలు బయల్దేరడానికి** మరో అయిదు నిముషాల వ్యవధి మాత్రమే వుంది.

హేమంత్ మినరల్ వాటర్ బాటిల్, బిస్కట్లు, పళ్ళు వరూధినికి అందించాడు.

"ఎందుకివన్నీ! కాసేపుంటే పడుకుంటాను కదా!" అంది సన్నగా. అప్పటికే ఆమె హృదయమంతా నిండిన దుఃఖం కన్నులనుండి దూకాలని విశ్వప్రయత్నం చేస్తున్నది.

హేమంత్ హృదయమూ భారంగానే వుంది.

వరూధిని పరిచయమయ్యాక ఓ ఒకటీ అరా రోజులు ఆమెను చూడకుండా గడిపాడేమో గాని.. ఇప్పుడిక ఇలా వదిలేయాల్సి రావడం అతనికి చెప్పలేని వేదన కలిగిస్తోంది.

"ఎంత, వచ్చేస్తానుగా, పాప జాగ్రత్త!" అని మాత్రమే అనగలిగాడు అనునయంగా.

వరూధిని అతనివైపు చూసింది.

ఆ కళ్ళనిండా క్రిందకి దొర్లడానికి సిద్ధపడ్డ నీళ్ళు.

హేమంత్ ఆమె చేతిని పట్టుకున్నాడు అనునయంగా.

ఆ స్పర్శలో అతనామెకు ఆప్యాయత, ఒక భరోసా అందించాడు.

రైలు కదలబోతుండగా కళ్ళు పెద్దవి చేసి అతన్ని ఆర్తిగా చూసింది వరూధిని.

ఆ వెంటనే అతని చేతిని గట్టిగా పట్టుకుంది ఒక కాగితపు మడత అతని చేతిలో పెడుతూ.

రైలు ముందుకి సాగిపోయింది.

హేమంత్ రైలు కనుమరుగయ్యేవారకూ చూసి బయటకొచ్చి ఆ కాగితపు మడత విప్పాడు.

**ఓ స్నేహితుడా...**

*ఎందుకో ఇలా రాయాలనిపించింది హేమ్! రాత్రి సరోజని ఆంటీ ఏమేమో చెబుతూనే వుంది. ఆమె ఆలోచనల నిండా మన గురించి కమ్మని కలలు ఆశలు. ఒక చదువు సంధ్య లెరుగని స్త్రీ, పుట్టిన చోటునుండి మరెక్కడికీ కదలని ఒక సగటు మనిషిలోని*

*సంస్కారం, ముందు చూపు, అభ్యుదయ భావాలూ చూసి నా మనసు చాలా ఆశ్చర్యానికి గురయ్యింది. ఆమె ప్రేమకు వివశురాలి నయ్యాను. పెళ్ళయిందంటేనే చులకన, ఆపైన ఒక బిడ్డ వున్న నన్ను ఎంతగా ఆదరించిందో తలచుకుంటేనే కన్నీళ్ళు వస్తున్నాయి.*

*ఆమెకు నీమీద ఎంత ప్రేమ. ఎంత అనురాగం. నువ్వెక్కడ జీవితంలో నీకు కావాల్సింది పోగొట్టుకుంటావో అని ఆమె చాలా ఆదుర్దాపడటం గమనించాను. ఎందుకో నాకూ భయం వేసింది హేమ్. నా జీవితంలో ఎప్పుడూ నాకు కావాల్సింది దొరకలేదు. ఇప్పుడు దేవుడిలా నిన్ను యిచ్చి నన్ను ఉక్కిరి బిక్కిరి చేస్తుంటే ఏదో భయం. ఈ ఆనందం వెనుక ఏమి పొంచి వుందో అని ఆందోళన. పెళ్ళి కానంతవరకూ నేను చాలా సంతోషంగా జీవించాను. మా యింటినిండా ఎంతమంది బంధువులో.. స్నేహితులో... నాన్న వారందరికీ ఏదో విధంగా సాయపడటం నాకు తెలుసు. ఇంచుమించు వారేదో సాయం ఆశించే మా యింటికి వచ్చేవారు. వారి పనులు చేయడమే కాక ఆర్థికంగా కూడా ఆదుకునేవారు. అమ్మ యిక సరేసరి. అన్నపూర్ణలా వారికి వండి పెట్టేది. ఒక్కోసారి ప్రయివసీ లేక నేను విసుక్కునేదాన్ని. అప్పుడు నాన్న ఎంతో అనునయంగా ఇతరులకి సహాయపడటంలో వున్న అందాన్ని, ఆనందాన్ని విడమరచి చెప్పేవారు.*

*ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే... ఒక్కసారిగా నా పెళ్ళి ఫెయిలవడంతో ఎవరూ మా యింటి ఛాయల వైపు చూడలేదు. డబ్బు ఎప్పుడూ మేము అడగం. ఒక చిన్నమాట సాయం కూడా చెయ్యలేదెవరూ. చాలా ఒంటరిలయిపోయాం. కొందరు తిన్న యింటి వాసాలు లెక్కపెట్టిన వాళ్ళు కూడా వున్నారు. అకారణంగా మా మీద దుష్ప్రచారాలు చేసి చక్రవర్తికి వెళ్ళి మా పరిస్థితులు వివరించి ఈ గొడవని పెద్దది చేసి ఆనందించిన వాళ్ళున్నారు.*

*సరే! ఏం చెబుతున్నానో అర్థంకావటంలేదు హేమ్.*

*ఎందుకో భయం. నిన్ను ఆ దేవుడు నిజంగానే నాకిచ్చాడా! నిజంగా దేవుడంత మంచివాడా? ఏమో హేమూ నాకు ఎందుకో అపనమ్మకం.*

*హేమ్, ఒక మాట చెబుతాను. ఒకవేళ... ఏదయినా అనుకోనిది జరిగితే.. ఇలా అనుకోడానికి నాకు మనసొప్పడం లేదు నిజంగా కానీ ఏదో భయం. మన స్నేహాన్ని ఎప్పుడూ బిట్టర్ చెయ్యకు. పూలువాడిపోవచ్చు. రాలిపోవచ్చు కానీ దాని పరిమళాన్ని మాత్రం ఎన్నటికీ మరచిపోలేం. దాన్నలానే కాపాడుతావు కదూ! నువ్వెప్పటికీ.. ఎప్పటికీ నాకుంటావ్ కదూ!*

***- నీ వరూ***

ఆ ఉత్తరం చదవడం పూర్తికాగానే హేమంత్ కళ్ళు సజలమయ్యాయి.

ఎందుకిలా బేలగా మారిపోతున్నది వరూధిని. తనకి మొదటిసారి పరిచయమయినప్పుడు ఎంత ధైర్యం కనబరచింది.

ప్రేమ బలహీనతా?

ఎందుకు విధిని నమ్మలేకపోతోంది.

చాలా నిస్సత్తువుగా స్టేషన్ బయటకొచ్చి ఆటో ఎక్కబోతుండగా జరిగిందా సంఘటన.

దూరంగా చక్రవర్తి నిలబడి హేమంత్‌ని చూసి అదిరిపడ్డాడు.

"అరె! వీడిక్కడున్నాడేంటి, అదేది?" అనుకుంటూ పెద్ద పెద్ద అడుగులేసుకుంటూ వచ్చాడు.

హేమంత్ ఆటో ఎక్కగానే ఈసారి ఏ మాత్రం ఆలస్యం చెయ్యకుండా మరో ఆటో ఎక్కి వెంబడించాడు.

"ఆ ఆటో వెనుక పోనివ్వు" అంటూ హెచ్చరిస్తూ ఆ ఆటోనే గమనిస్తూ చూస్తున్నాడు చక్రవర్తి.

హేమంత్ ఇదంతా గమనించే స్థితిలో లేడు.

అతని ఆలోచనలనిండా వరూధిని ఉత్తరంలో రాసిన మాటలే గిరగిరా తిరుగుతున్నాయి.

వరూధిని ఎందుకింత నిరాశావాదిగా మారిపోతున్నది. తనకి ఉద్యోగం రాకుండా అక్కడే వుండి వుంటే బాగుండేదేమో? ఈ దూరం శాశ్వతమవుతుందేమోనని వరూధిని బాధపడటం ఎంతో ఆందోళన కలిగిస్తుంది హేమంత్‌కి.

ఇద్దరూ అక్కరలేని విలన్లు. ఆమె జీవితంతో చెలగాటమాడుతున్నారు. జరిగిన ప్రతిదీ ఆమెవలనే అని కక్ష పెంచుకుంటున్నారు. తమ తప్పులు ఆమె నెత్తికేసి రుద్దుతున్నారు. ఎలాగైనా వరూని కాపాడాలి. ఆమెకి భరోసా ఇవ్వాలి.

హేమంత్ ఒక పళ్ళ దుకాణం దగ్గర ఆపి సరోజని కోసం కొన్ని పళ్ళు కొన్నాడు. అవి తీసుకుని తిరిగి ఆటో ఎక్కాడు.

చక్రవర్తి కూడా ఆటో ఆపించి సిగరెట్లు కొనుక్కుని మళ్ళీ ఆటో ఎక్కాడు.

ఆటోలు రెండూ ఒకదాని వెనుక మరొకటి పరిగెత్తుతున్నాయి.

సరోజని ఇల్లు మరో ఫర్లాంగు దూరం ఉందనగా జరిగిందా సంఘటన.

ఎదురుగా వస్తున్న బైక్ అడ్డంగా వచ్చి చక్రవర్తి ఆటోని గుద్దేసింది.

ఇక అంతే.

బైక్ నడిపే వ్యక్తికీ ఆటో డ్రైవర్‌కీ సంవాదం మొదలయ్యింది. ఏ అనువాదానికీ అందని తిట్లు ఏ నాట్యకారుడికీ చేతకాని విన్యాసాలతో వాళ్ళిద్దరూ జనాన్ని అలరించారు.

చక్రవర్తిలాంటి దుర్మార్గుడికి కూడా వాళ్ళని కంట్రోల్ చేసే శక్తి చాలక సిగరెట్టు మీద సిగరెట్టు తాగుతూ ముందుకి నడక సాగించాడు.

"ఇదేనా రావడం?"

సుందరం ఎంతో అందంగా కొడుకుని పలకరించాడు.

"ఊఁ.." అన్నాడు హేమంత్ బాగ్‌ని అక్కగారి చేతికిస్తూ.

"శ్రీకాకుళంలో జాయినయి ఏడుస్తున్నావా?"

హేమంత్ తండ్రివైపు అదోలా చూసాడు జవాబు చెప్పకుండా.

మాటలో మార్దవం - ప్రేమ బాధ్యత లేకుండా ఆ దేవుడెలా పుట్టించాడితన్ని. అని అతనికెప్పుడూ ఆశ్చర్యం వేస్తుంది అతన్ని చూడగానే తల్లి పడిన కష్టాలు, వేదన గుర్తొచ్చి ఒకలాంటి ఏహ్యాభావంకూడా కలుగుతుంది.

"ఉద్యోగం మంచిదే జాగ్రత్తగా సంపాదించుకుంటే. ఆ పని చేసి ఏడు" హేమంత్‌తో పాటు మూడోసారి కాఫీ తాగుతూ సుందరం.

హేమంత్ మాట్లాడలేదు.

"అన్నట్లూ నీ పెళ్ళి వచ్చేనెలలో చేద్దామనుకున్నా! శెలవు చూసుకుని ఏడు"

హేమంత్ ఏదో అనబోయేంతలో వెనుకనుండి రాజేశ్వరి ఏమీ మాట్లాడవద్దన్నట్లు సైగ చేసింది.

హేమంత్ లోపలికి నడిచాడు.

"వసుంధరత్తలేదూ, ఆవిడ కూతురు నాగినితో నీ పెళ్ళి నిశ్చయం చేసాడు నాన్న. వాళ్ళు మొన్నొచ్చి తిష్టవేసి వెళ్ళారు. చూడ్డానికి బాగానే వుంటుందనుకో. కానీ నువ్వు...?" అంటూ ఆగింది రాజి.

హేమంత్ అక్కగారి వైపు చూసాడు.

"అదే! సరోజనీ ఆంటీ అంతా చెప్పింది. నువ్వు... అదంతా జరుగుతుందట్రా! నాన్న సంగతి నీకు తెలుసుగా."

హేమంత్ మాట్లాడలేదు.

అతని మనసులో ఎంత గట్టి నిర్ణయం తీసుకున్నదీ ఆమెకు తెలియదు.

ఆ మర్నాడు శ్రీకాకుళంలో జాయినవ్వడానికి వెళ్ళిపోయాడు హేమంత్.

రమేష్‌బాబు ఫోనులో చెప్పిన ఎడ్రస్ విని గర్వంగా నవ్వుకున్నాడు చక్రవర్తి.

ఇప్పుడెక్కడికి తప్పించుకుపోతావ్ అని గర్వంగా నవ్వుకున్నాడు చక్రవర్తి.

తాపీగా టిఫిన్ తిని ఒక పెగ్ మందు కాఫీలా తాగి సుందరం ఇంటికి బయల్దేరాడు.

సుందరం బయటకెళ్దామని వంటిమీద చొక్కా తగిలించుకుని జారిపోతున్న కళ్ళద్దానికి దారంతో ముడులు వేసి 'దరిద్రపు ముండ, ఎన్నిసార్లు కట్టినా ఇంతే.' అని తిట్టుకుంటున్నాడు.

రాజీ అతనివైపే దీక్షగా చూస్తూ "అలా ప్రాణం లేని వస్తువుని తిట్టకపోతే కొత్తది కొనుక్కోవచ్చు కదా!" అంది కాస్త నిష్ఠూరంగా.

తండ్రి బుద్ధి చూసి చూసి ఈ మధ్య కాస్త ఎదురు తిరిగి మాట్లాడటం నేర్చుకుందామె.

సుందరం కూతుర్ని వెటకారంగా చూస్తూ "అవునవును, మీ అమ్మ తెచ్చిన ముల్లె వుందిక్కడ. కొనుక్కోవాలట, కొనుక్కోవాలి" అన్నాడు కోపంగా.

"పోయిన అమ్మనెందుకులే ఈ రొంపిలోకి లాగడం. తమ్ముడు పంపిస్తున్నాడు కదా!" అని గిరుక్కున వెనుతిరిగి వెళ్ళిపోయింది రాజీ వంటగదిలోకి. ఆ మాటకి సుందరానికి చాలా కోపం వచ్చేసిందిగాని ఆ సమయానికే చక్రవర్తి గుమ్మంలో నిలబడి "హేమంత్ ఇల్లిదేనా?" అనడిగాడు.

చక్రవర్తివైపు నిశితంగా చూశాడు సుందరం. అతన్ని చూడగానే అసలే కూతురి మాటకి కోపంగా వున్న సుందరానికి చిర్రెత్తుకొచ్చింది.

దానికి కారణాలు రెండు - ఒకటి చెట్టంత మనిషిని తననొదిలి హేమంత్ ఇల్లిదేనా అనడగడం. రెండు - అతని తాగుబోతు ఆకారం.

"ఎవడ్రానువ్వు?" అన్నాడతను తన సాధారణ ధోరణిలో.

"ఎవడ్రా అంటావా నన్ను" అంటూ చెలరేగిపోయాడు చక్రవర్తి.

అతను తాగున్నాడని అర్థమయిపోయింది సుందరానికి.

"నా కొంపకొచ్చి నన్నే అంటావా - తాగుబోతు వెధవా! ముందు బయటకి నడు" అంటూ కీచుగా అరిచాడు సుందరం.

"నన్ను తాగుబోతు వెధవా అంటావా గుప్పెట్లో పెట్టి పీక నొక్కానంటే గుటుక్కుమంటావ్" అంటూ ముందుకొచ్చాడు చక్రవర్తి రౌద్రంగా.

ఆ అరుపులకి రాజీ కంగారుగా వచ్చి అడ్డం పడింది.

"ఎవర్నువ్వు, ఏంటీ గోల?" అంది చక్రవర్తిని చూసి.

హేమంత్ ఇంటి పరిస్థితి తెలుసుకోవాలని వచ్చిన సరోజని ఆ దృశ్యాన్ని చూసి గాభరాపడి పోయింది.

"ఏంటిది, ఎవర్నువ్వు?" అంది చక్రవర్తి కేసి చూస్తూ.

"ఎవరా - వీడి కొడుకు నా పెళ్ళాన్ని లేవదీసుకొచ్చాడు. అది తేల్చుకోవాలనే వచ్చాన్నేను. వీడు... వీడు వాడికన్నా ఏడాకులెక్కువ చదివినట్లున్నాడు. గట్టిగా గాలి వూదితే చచ్చేలా వున్నాడు. ఎంత పొగరు!?"

సరోజనికి అర్థమయీ అర్థమవనట్లుంది. "అంటే.. వీడేనా వరూధిని జీవితాన్ని నాశనం చేసినవాడు. ఇక్కడిదాకా వచ్చేసాడా. అంటే వీడు వాళ్ళతో పాటూ. అమ్మో" లోలోపలే గుండెలు బాదుకుంది.

ఇంతలోనే సుందరం అగ్గిమీద గుగ్గిలంలా మండిపడ్డాడు. "ఏం కూసావ్? నా కొడుకు నీ పెళ్ళాన్ని లేవదీసుకొచ్చాడా! వాడికి పుట్టాక వాడి అక్కలూ, అమ్మా తప్ప మరో ఆడదానివంక కన్నెత్తి చూడ్డం కూడా తెలుసా! ఏదా క్ర్ర. ఈవేళ వీడి వీపు చీరేస్తాను" అన్నాడు వూగిపోతూ.

సరోజనికి పరిస్థితి విషమిస్తున్నదని అర్థమయ్యింది.

వెంటనే గబుక్కున సుందరాన్ని పట్టుకుంది. "ఉండు బావా! ఊరికే ఉల్లింకాయలా అలా ఎగురుతావేంటి. ప్రతి దారిన బోయే వాడి మాటలకీ జవాబు చెప్పాల్సిన అవసరముందా! అవతల నీకెన్ని బాధ్యతలున్నాయి. కొడుకు పెళ్ళి చెయ్యాలా! లంకంత మేడలోకి వెళ్ళాలా! నీ కల తీరేలోపునే బి.పితో ఊగిపోతే ఎలా? రా రాజీ ముందు బావని లోపలికి తీసుకెళ్ళు" అని బలవంతాన గదిలోకి లాక్కెళ్ళి తలుపు గడేసి వచ్చింది సరోజని.

సుందరం ఇంకా తలుపులు కొడుతూనే వున్నాడు ఆవేశంగా.

సరోజని జారిన ముడి సరిచేసుకుని "ఎవరు బాబూ నువ్వు?" అంది ఎంతో నిదానంగా చక్రవర్తికేసి చూస్తూ.

"నువ్వెవరివి?" అని ఎదురు తిరిగి అడిగాడు చక్రవర్తి.

"ఈ ఇంటికి కావాల్సిన మనిషినేలే. చూడు, నువ్వు చెప్పిన మాట వినడానికి చాలా అసహ్యంగా వుంది. నీ పెళ్ళాం అంటున్నావు. నువ్వుండగా అంత పనెందుకు చేస్తుంది చెప్పు. ఇలా ఒక మగాడొచ్చి చెప్పుకోవడం ఎంత నామర్దా? ఇంటి దగ్గర తేల్చుకోవాల్సినవి ఇంటిదగ్గర తేల్చుకో. ముందు ఇందులో నీకెంత అధికారముందో కూడా తేల్చుకో. పద. ఎవరైనా వింటే నిన్ను చూసే నవ్వుతారు" అంది చాలా శాంతంగా.

చక్రవర్తికి చాలా కోపం వచ్చిందిగానీ సరోజని మాటలు అతని పురుషాహంకారం మీద ఎక్కడో లాగి కొట్టినట్లున్నాయి. ఒకలాంటి అవమానంతో అతని నోరు మూతపడింది.

తూలుకుంటూ బయటికి నడుస్తూ... "చూస్తా! అక్కడే తేల్చుకుంటా" అని వెళ్ళడం విని సరోజనికి భయం వేసింది వరూధినీని ఏం చేస్తాడోనని.

**కొత్త ఆఫీసు.** కొత్త ఉద్యోగం కొత్త బాధ్యతలు. వెళ్ళగానే పని వత్తిడిలో ఇరుక్కుపోయాడు హేమంత్.

ప్రభుత్వానికి, రాజకీయనాయకులకి, కరప్షన్ అలవాటుపడిన సబార్డినేట్స్‌కి ఎంత దగ్గరగా వెళ్ళాడో అర్థమవుతున్నది హేమంత్‌కి.

చాలా అసహనంగా వుంది.

పిచ్చి కోపంగానూ వుంది.

అసలు అవన్నీ జీర్ణించుకోవడానికే బోల్డంత సమయం పట్టేలా వుంది. పనితో, క్రిందవారితో, పైవారితో సతమతమైపోతున్నాడు.

సెలక్షన్ వచ్చినప్పటి ఆనందం లేదిప్పుడు.

అక్కడ ఒక ఇంజనీరుగా ఒక బ్రిడ్జినో, కాజ్‌వేనో ఏక్విడెక్ట్‌నో, ఫ్లయ్‌ఓవర్‌నో అండర్ బ్రిడ్జినో డిజైన్ చేస్తున్నప్పుడు కలిగే ఆనందం కలగడం లేదిప్పుడు.

వర్క్ ఫీల్డ్‌లో సరేసరి. అక్కడ కూడా చాలా అవకతవకలున్నాయి. అవినీతి వున్న చోటల్లా అవి ప్రదర్శితమవుతూనే వుంటాయి.

రోజంతా ఉక్కిరి బిక్కిరవుతూ పనిచేసి ఏ అర్ధరాత్రికో పడుకున్నప్పుడు వరూధిని గుర్తొస్తుంది. ఒక పిల్ల తెమ్మెరలా.

ఫోను చేద్దామనుకుంటుండగానే నిద్రముంచుకొస్తుంది. తెల్లవారుతూనే ఏ ఛోటా మోటా రాజకీయ నాయకుడి నుండో ఫోన్‌కాల్స్.

'ఆ ఫైలు మీద సంతకం పెట్టు, ఈ ఫైలు మీద పెట్టకు' అని.

మళ్ళీ పరుగులు.

ఆ రోజు ఎలాగైనా వరూధినీకి ఒక ఉత్తరం రాయాలని కూర్చున్నాడు, హేమంత్ రిసీవర్ని తీసి క్రిందపెట్టి.

అప్పుడే సరిగ్గా వరూధిని అతని నెంబరు సంపాదించి పదేపదే కాల్స్ చేస్తున్న సంగతి అతనికి ఎంతమాత్రం తెలియదు.

వరూధిని ఆఫీసు నుండి వస్తూనే గుమ్మం ముందున్న చెప్పుల్ని చూసి ఒక్కసారిగా ఉలిక్కిపడింది.

అవి ఒక రంగంటూ లేకుండా మాసి, విడిపోయి తెగిపోడానికి సిద్ధంగా వున్నాయి.

అవి చక్రవర్తివని పోల్చుకోడానికామెకి ఎంతో సేపు పట్టలేదు.

గుండె పట్టేసినట్లయింది.

'కొన్ని శనుల్ని ఏమి చేసినా వదిలించుకోలేమా!' అని ఆమెకు ఏడుపొచ్చేసింది.

ప్రాణం బిగబెట్టుకుని లోపలికి అడుగులేసింది.

ఎదురుగా వున్న సోఫాలోనే కాలుమీద కాలేసుకుని ఒక చేత్తో చిత్రని మరో చేతిలో ఒక కాగితాన్ని పట్టుకుని కూర్చున్నాడు చక్రవర్తి.

అతని ఎదురుగా బలిపశువులా రాజేశ్వరి బిగుసుకుని కూర్చుని వుంది.

వరూధినీని చూస్తూనే "రండి మేం సాబ్! రండి! స్వాగతం" అన్నాడు చక్రవర్తి వ్యంగ్యంగా నవ్వుతూ.

వరూధిని కోపాన్ని, అసహ్యాన్ని అణచుకుని మెల్లిగా చిత్రని తీసుకోబోయింది.

"అహహా! తమకెందుకంత శ్రమ మేడమ్. తమరిప్పుడు కొత్తగా ప్రేమ డోలికల్లో ఉయ్యాలలూగుతున్నారు కదా! అలాంటప్పుడు ఈ పిల్ల భారం కదా మీకు. అందుకే నేను తీసుకెళ్ళాలని వచ్చాను." అన్నాడు చిత్రని వెనక్కులాక్కుంటూ.

అతని మొరటుతనానికి చిత్ర కెవ్వున ఏడ్చింది.

రాజేశ్వరి ఆందోళనగా చూసి "మధ్యలో పసిపిల్ల దాన్నేడిపించకు. ఇలా ఇవ్వు" అంది అసహనంగా.

"నువ్వు నోర్మూసుకో మైడియరత్తా. దీన్ని పూర్తిగా చెడగొట్టిందే నువ్వు. ఇదెవడితోనో ప్రేమాయణం నడపడానికి కారణమే నువ్వు. చాలా నెరజాణవి నువ్వు" అన్నాడు హేళనగా నవ్వుతూ.

ఆ వాతావరణం ఎంతో కంపరంగా, జుగుప్సగా వుంది వరూధినికి.

అలా బలిపశువులా నిలబడి చూస్తోంది. ఒక రకమైన నిస్సహాయతతో.

"ఈ ఉత్తరమేంటి మేడమ్. కొత్త ప్రియుడు కవిత్వమంతా ఒలకబోసి రాసాడు తమకు. చదవమంటారా!"

అప్పుడర్థమయ్యింది వరూధినికి హేమంత్ రాసిన ఉత్తరమని అది. చప్పున అసంకల్పితంగా లాక్కోబోయింది వరూధిని.

"ఆ!ఆ! తమరుండండి. అంత కంగారు దేనికి? మేం చదివి పెడతాం కదా!" అంటూ చిత్రని చంకలో నొక్కి పెట్టి ఉత్తరం చదవటం ప్రారంభించాడు చక్రవర్తి.

*డియర్ వరూ!*

*పని వత్తిడిలో నీకు కాల్ చెయ్యలేకపోయాను. కనీసం నీకు నెంబర్ కూడా ఇవ్వలేకపోయాను.*

*కాని... నువ్వు గుర్తురాని క్షణం లేదు. అది నీకు తెలుసు. కోపమొచ్చిందా? నీకు కోపం రాదని తెలుసు. అంత సగటు ఆడదానివి కాదు నువ్వు.*

*వెళ్తూ వెళ్తూ అలా రాసేవేంటి, ఎందుకూ భయం? నా మీద నమ్మకం లేదా? లేక విధి మీదా! పిచ్చి ఆలోచనలు పెట్టుకోకు.*

*గడచినదంతా మరచిపో.*

*నీతో గడిపిన క్షణాలు గుర్తొస్తున్నాయి.*

*భీమిలి, కైలాసగిరి, యారాడ కొండలు నాకు కొత్త అందాలు సంతరించుకుని కనబడ్డాయి.*

*ఆ గాలినిండా ఒక కొత్త సువాసనలు.*

*ప్రేమైక భావన ఎంత మధురంగా వుంటుందో, ఒక మంచి సాహచర్యం ఎంత ఆనందాన్నిస్తుందో నాకర్థమైంది.*

*ఇంత సున్నితమైన అనుబంధాన్ని, అనురాగాన్ని కాలదన్నుకున్నవాడు దురదృష్టవంతుడు.*

*ఇంకా ఎన్నో చెప్పాలని వుంది.*

*త్వరలో వస్తాను.*

*చిత్ర జాగ్రత్త.*

*అమ్మగారికి నమస్కారాలు.*

**- నీ హేమంత్.**

ఆ ఉత్తరాన్ని ఎంత వ్యంగ్యంగా చదవాలో అంత వ్యంగ్యంగానూ చదివాడు చక్రవర్తి రకరకాల వ్యాఖ్యానాలు చేస్తూ.

వెంటనే వరూధిని వైపు గుచ్చి చూస్తూ "నువ్వు కూడా మన పెళ్ళయిన కొత్తలో ఇలాంటి పైత్యపు ఉత్తరమొకటి నాక్కూడా రాసినట్లు గుర్తు. వీడి తర్వాత ఇంకెవరూ?" అన్నాడు హేళనగా.

వరూధిని కోపాన్ని పట్టలేకపోతోంది.

పళ్ళతో అడుగు పెదవి కొరుకుతూ "ఆ ఉత్తరం ఇలా ఇవ్వు" అంది.

"హమ్మా! ఇది నా దగ్గరే వుంటుంది. నీక్కాబోయే మావగారు నీ సంగతి చెబితే నమ్మలేదు. వాడి కొడుకు బంగారవంట. వాడికి చూపించాలిగా. ఈ మలయ సమీరాల్ని, మధుర స్వప్నాల్ని" అని జేబులో పెట్టుకున్నాడు.

వరూధిని నిరుత్తరాలయి నిలబడిపోయింది.

అంటే.. 'వీడు అక్కడిదాకా వెళ్ళిపోయాడా! కథ చాలా దూరమెళ్ళిపోయిందా!'

కళ్ళనిండా నీళ్ళు నిండిపోయాయి.

అలాగే తలుపుకి జేరబడింది నిస్తేజంగా.

"ఏంటీ? బెంగ పడుతున్నావా చిట్టీ, ఈ ఉత్తరం పంపకూడదనుకుంటే ఒక పదివేలు కొట్టు. లేదంటే ఆ రమేష్‌బాబుగాడికి అమ్మేస్తా! చెప్పు... భలే మంచి చౌక బేరమూ" అని రాగాలు తీసాడు చక్రవర్తి చిత్రని దింపి లేచి నిలబడి స్టెప్పులేస్తూ.

వరూధినికంతా అర్ధమయింది. బాక్‌గ్రౌండులో రమేష్‌బాబుండి ఆడిస్తున్నాడని.

ఒక అందమైన అనుభూతిని అలానే గుండెల్లో దాచుకోలేకపోతే మూడో వ్యక్తి చేరి ఆ అందాన్నెలా ఛిద్రం చేయగలరో. ఎంత అగాధాన్ని సృష్టించగలరో అర్ధమవుతూనే వుంది.

హేమంత్ రాసిన ఆ అందమైన పువ్వుల్లాంటి అక్షరాలు వీళ్ళ నోళ్ళలో పడి నలిగిపోతుంటే భరించలేక మెళ్ళో గొలుసు తీసి యిస్తూ "ఇది పదివేలు దాటే వుంటుంది. ఆ ఉత్తరమిలా ఇవ్వు" అంది శాంతంగా.

చక్రవర్తి చప్పున గొలుసు లాక్కుని గాలిలో ఆడించి చూస్తూ "బంగారమేనా?" అన్నాడు హేళనగా.

వరూధిని జవాబు చెప్పకుండా "లెటరివ్వు" అంది.

"అబ్బా! ఆశ. ముందిది బంగారమో కాదో కనుక్కోవాలి కదా!" అన్నాడు వంకరగా నవ్వుతూ.

వరూధినితోపాటు రాజేశ్వరికూడా నిరుత్తరాలయి చూసింది అతని చేష్టకి.

"చూడు, ఈ లెటర్ నీకేం ఉపయోగపడుతుంది డార్లింగ్. మహా అయితే మరో పదిసార్లు చదువుకుంటావ్. ఇది నాకయితే కేష్ తెచ్చిపెడుతుంది. ఇక్కడ గొలుసు. అక్కడ కేష్ .. వస్తున్నా రమేష్, కమింగ్" అంటూ వెళ్ళిపోయాడు చక్రవర్తి గొలుసుని గిరగిరా తిప్పుతూ.

అతను వెళ్ళినవేపే చూస్తూ కుర్చీలో కూలబడింది వరూధిని భావరహితంగా.

"వరూ అతనేం ఉపద్రవం తెస్తాడో - ఆ రమేష్ గాడితో కూడా వీడికి ఫ్రెండ్‌షిప్పుందా" అంది రాజేశ్వరి వేదనగా.

వరూధిని నిర్లిప్తంగా తల్లివైపు చూసింది.

"నీ కూతురు చాలా అదృష్టవంతురాలమ్మా. ఒక బ్రతుకుని నాశనం చెయ్యడానికి అకారణంగా ఎంతమంది చేతులు కలుపుతున్నారో చూడు." అంది.

రాజేశ్వరి బదులుగా కన్నీళ్ళు పెట్టుకుంది.

"అలా అనకు వరూ"

"ఫర్వాలేదు. నాకోసం కాదు. ఆ హేమంత్ చాలా అమాయకుడు. అతనికెలాంటి అపకారం తలపెడతారో అని భయంగా వుంది. నాకిది అలవాటే. ఏదో జరుగుతుందని నమ్మకం లేదెప్పుడూ" అంది వరూధిని.

రాజేశ్వరి మాట్లాడలేకపోయింది.

"లే అమ్మా. లే. చిత్ర సంగతి చూడు" అంది వరూధిని తల్లిని హెచ్చరించి తన గదిలోకి వెళ్ళిపోతూ.

అక్కడ ఆమె మౌనంగా తన బాధని కన్నీటి రూపంలోకి తర్జుమా చేసుకుంటుందని తెలిసిన రాజేశ్వరి మౌనంగా బిడ్డనెత్తుకుని కదిలింది అక్కణ్ణుంచి.

రమేష్‌కి ఎదురుగా కూర్చున్నాడు చక్రవర్తి బార్‌లో నడుం క్రిందకి జార్చి విలాసంగా చేతిలోని ఉత్తరాన్ని కదిలిస్తూ.

రమేష్ అసహనంగా చక్రవర్తి కేసి చూస్తున్నాడు.

"ఇప్పుడేమంటావ్?" అన్నాడు చివరికి రమేష్.

"ఒక పది కొట్టు. ఉత్తరం ఇస్తా. ఎన్నిసార్లు చెప్పాలి?" అన్నాడు మందు తాగుతూ.

"మళ్ళీ పదా! మొన్ననేగా వైజాగ్‌కి పది పంపాను. ఏం చేసుకొచ్చావ్?" అన్నాడు రమేష్ కోపంగా.

"హలో మైడియర్ సార్. ఇది ఉత్తరమనుకుంటున్నావా. అణుబాంబు. ఇది గాని ఆ సుందరంగాడి కోర్టులో పడాలీ... ఇక చూస్కో, ఎంత విస్ఫోటన జరుగుతుందో. ఆ హేమంత్‌గాడి పిలక వాడి బాబుకి చిక్కుతుంది. వాడంటే ఏంటనుకుంటున్నావ్? చూడ్డానికి ఆర్నెల్లగా ఆహారం లేని వాడిలా వుంటాడు పీనుగ. చర్మం వలవకుండానే ఎముకుల్ని లెక్కెట్టొచ్చు. కానీ వాడి పొగరుందే. అమ్మో.. వాడసాధ్యుడు. వాడికి తెలిస్తే వీళ్ళ పెళ్ళి ఛస్తే జరగనివ్వడు. ఇక వరూధిని బతుకు చింతపల్లి సంతే" అన్నాడు చక్రవర్తి విలాసంగా నవ్వుతూ.

ఆ ఉత్తరాన్ని చేజిక్కించుకోవాలని చాలా ఆదుర్దాగా వుంది రమేష్‌కి. హేమంత్ మీద వరూధిని మీద అతని కసి అలాంటిది.

కాని తాను ఏమాత్రం ఆత్రం చూపినా ఈ తాగుబోతు వెధవ రేటు పెంచేస్తాడు. తను తినీ తినక సంపాదించిన సంపాదనని తనెదుటే మందుగా మార్చి నిముషాల్లో పీల్చేస్తాడు.

అందుకే ఆలోచిస్తూ తన గ్లాసులోని మందుని తాగీ తాగనట్లు సిప్ చేస్తున్నాడు.

"సరే - నువ్వే వుంచుకో. వాళ్ళేమయితే నాకెందుకు" అన్నాడు నిర్లక్ష్యాన్ని నటిస్తూ.

బదులుగా చక్రవర్తి పకపకా నవ్వాడు.

బార్‌లో చాలామంది వెనక్కి తిరిగి చూశారు.

"ఏవీ ఇంట్రస్టు లేనట్లు భలే నటిస్తున్నావే. అదేమో నా పెళ్ళాం. వీడేమో ఎవరో కోన్‌కిస్కాగాడు. మధ్యలో ఇంత ఇంట్రస్టు చూపించి ఇంత ఖర్చుపెట్టావంటే.. ఊరికే అని నేననుకుంటానని నువ్వనుకుంటున్నావా? దాని మీద నీ కన్నుంది. కసంతా దానిమీదే అదే కదా నీ బాధ."

రమేష్ అతన్నలానే చూస్తున్నాడు.

"వీడికి మెదడుంది. మనసులేదు" అనుకున్నాడు మనసులో.

"నువ్వేం ఆలోచిస్తున్నావో నాకు తెలుసు బ్రదర్. తాగుబోతయినా వీడు అఖండుడనేగా. అవును. నేను చాలా ఇంటలిజెంట్‌ని. మెరిట్‌లో పాసయ్యాను. ఏదో ఖర్మకాలి ఇలా నిన్నూ నిన్నూ అడుక్కుంటున్నాను. నా పెళ్ళాం గురించి నాకేం సెంటిమెంటు లేదు. అదెవడితో తిరిగితే నాకేంటి? నాకు డబ్బుకావాలి. అది దాని దగ్గరుంది. నువ్వు నాకు కొన్ని లూప్‌హోల్స్ ఇచ్చావ్. వాటితో నేను దాన్ని బ్లాక్‌మెయిల్ చేస్తున్నా. అంతే. ఇప్పుడు చెప్పు నీకీ లెటర్ కావాలో వద్దో!" ఈసారి చక్రవర్తి మాటల్లో అసహనం తొంగిచూసింది.

"మరీ ఎక్కువ చెబుతున్నావ్" అన్నాడు నసుగుతూ.

"నువ్వు ఒక రోజులో సంపాదించిన దాంట్లో సగం కూడా లేదు. నీ పేరు చెబితే ఆఫీసులో అటెండర్స్ కూడా 'థూ' అని వూస్తున్నారు. అంత పేరుంది నీకు. అసలీ ఉత్తరం ఖరీదు పాతిక. ఎందుకులే ఏడుస్తావని పది చెప్పా. వస్తా" అంటూ తూలుతూ పైకి లేచాడు చక్రవర్తి.

"సరే! సరే! ఆగు" అంటూ జేబులోంచి పదివేలు తీసిచ్చాడు రమేష్ అయిష్టంగానే.

చక్రవర్తి డబ్బందుకుని కళ్ళకద్దుకుని "వస్తా" అంటూ పైకి లేచాడు మళ్ళీ.

"ఉత్తరం" కంగారు పడుతూ అడిగాడు రమేష్.

"ఇదిగో నాలిగ్గీసుకో" అంటూ ఉత్తరాన్ని అతని మీదకి విసిరి వెళ్ళిపోయాడు చక్రవర్తి.

రామలక్ష్మి ఫోనొచ్చిందని చెప్పగానే గబగబా పరిగెత్తింది సరోజని.

అవతల హేమంత్.

"ఆంటీ"

"అవునా, వెళ్ళిన ఇన్నాళ్ళకా ఫోను. ఇవతల కొంపలంటుకు పోతున్నాయి తెలుసా?"

"ఏం జరిగిందాంటీ?"

"ఇంకా ఏం జరగాలి? ఆ ముదనష్టపోడు మీతోపాటే ఇక్కడకొచ్చాడు. వచ్చి మీ ఇంటికెళ్ళి నానా వాగుడూ వాగాడు" అంది సరోజని రొప్పుతూ.

"ఎవరూ?" అనడిగాడు హేమంత్ అయోమయంగా.

"ఇంకెవరూ? నా నోటితో అలా అనడానికి యిష్టంలేక చెప్పలేకపోతున్నా. వాడేరా. వాడి పేరు. అదే చక్రవర్తి. మీ యింటికెళ్ళి వాడి పెళ్ళాన్ని నువ్వు లేపుకొచ్చావని నానా వాగుడూ వాగాడు."

ఆ మాటలు విని హతాశుడయిపోయాడు హేమంత్.

"ఏంటాంటీ, ఇదంతా నిజమా?" అన్నాడు కంగారుగా.

"అవునా, నీ బాబు ఇదంతా విని ఆసులో కండెలా శివాడుతుంటే నేనే సర్ది చెప్పి వాణ్ణి సాగనంపాను. మీ నాన్న శాంతించాడు ప్రస్తుతానికి. నీమీద అతనికున్న నమ్మకం అలాంటిది. ప్రేమించడం రాని సచ్చు సన్నాసివని. అమ్మా, అక్కా తప్పా ఆడ మొహం చూడని వెర్రి వెధవ్వని."

"అయ్యో!"

"అయ్యో కుయ్యో కాదు. వాడు వెళ్ళి వరూథిన్ని ఏ విధంగా ఏడిపిస్తున్నాడో అని భయంగా ఉంది నాకు. అసలు దీనికంతటి కారణం నువ్వే. ముందాలోచన లేకుండా ఏకంగా ఈ వూరికే తీసుకొచ్చావు నువ్వు. ఇంతకీ ఆ పిల్లకి ఫోను చేసావా.. ఏ సంగతీ కనుక్కున్నావా?" అంది సరోజని నిష్ఠూరంగా.

"లేదాంటీ, ఈ ఆఫీసు పని చాలా హెవీగా వుంది. కుదరలేదు. మొన్న లెటరొకటి రాశాను" అన్నాడు హేమంత్ ఆందోళనగా.

"ఆఫీసు పనీ, గాడిదగుడ్డూ అంటే అక్కడా పిల్ల బతుకు బుగ్గయిపోతుంది. వీలైనంత తొందర్లో ఆ పిల్లని రిజిష్టరు పెళ్ళి చేసుకుని తీసుకుపో. లేకపోతే ఏం జరుగుతుందో నాకు ఊహకందటంలేదురా ఏమంతూ. వెంటనే ముందు ఫోను చెయ్యి" అంది సరోజని రొప్పుతూ.

"సరే ఆంటీ వర్రీ అవ్వకు. నేను చూసుకుంటాను" అని రిసీవర్ క్రెడిల్ చేశాడు హేమంత్.

సరోజని ఆయాసంగా అక్కడే కూలబడితే గ్లాసుతో కాఫీ తీసుకొచ్చి యిచ్చింది రామలక్ష్మి.

"ఏం జరిగింది అక్కా?" అంది రామలక్ష్మి పక్కన కూర్చుంటూ. జరిగిందంతా చిన్నగా చెప్పింది సరోజని.

"అయ్యో, ముక్కుపచ్చలారని కుర్రాడు. మన కళ్ళెదుట పెరిగాడు. ఏం జరుగుద్దో ఏంటో" అంది రామలక్ష్మి విచారంగా.

"వాడి ముక్కు ఏ పచ్చరంగులో వుంటే ఏంటిగాని? అవతలా పిల్ల అసలే పుట్టెడు కష్టాల్లో వుంది. ఇప్పుడీ పీనుగకి తెలిస్తే ఎంత రాద్ధాంతం చేస్తాడో రావుడూ. చచ్చేలా వున్నా జీళ్ళపాకంలా సాగిపోతున్నాడు. వాడికి ఏ ప్రేమా బంధాలూ లేవు. ఎప్పుడూ ఆ మేడ రంధే వాడి మేడలో సమాధులు కట్టా!" అని తిట్టిపోసింది సరోజని.

ఆ క్షణం ఏ నోటితో సరోజని ఉక్రోషం వెళ్ళగక్కిందోగాని ఆ మేడ చివరికి దానికే ఆలవాలమయింది భవిష్యత్తులో.

**కాలింగ్ బెల్** మోతకి వెళ్ళి తలుపు తీసింది రాజేశ్వరి.

ఎదురుగా నిలబడి ఉన్న అమ్మాయి చటుక్కున రాజేశ్వరి కాళ్ళకి దణ్ణం పెట్టి "అమ్మా బాగున్నారా!?" అంటూ గట్టిగా కౌగలించుకుంది.

ఈ హఠాత్ చర్యకి రాజేశ్వరి కొంచెం గాభరాపడి "ఎవరమ్మా ఎవరు మీరు?" అంది గాభరాగా.

ఆ అమ్మాయి చనువుగా లోపలికొస్తూ "నన్ను మరచిపోయారా అమ్మా, అవును నేను చేసిన పని అలాంటిది" అంది కన్నీళ్ళతో.

రాజేశ్వరి ఆ అమ్మాయిని పరికించి చూసింది.

బాబ్డ్ హెయిర్, చుడీదార్... ఎక్కడో అస్పష్టంగా ఆ మేనరిజం తెలిసినట్లు...

"నువ్వు... నువ్వు మమతవేనా?" అంది సంశయంగా.

"హబ్బా! గుర్తుపట్టేసారమ్మా" అంటూ మళ్ళీ గట్టిగా కౌగిలించుకుంది.

"ఇన్ని రోజులకి గుర్తొచ్చామా మేము?" అని రాజేశ్వరి అంటుండగానే గదిలోంచి బయటకొచ్చింది వరూధిని.

వరూధినిని చూడగానే లేచి నిలబడి నువ్వు మాత్రం "ఏం మారలేదు వరూ! అలానే వున్నావ్. అమృతం తాగేవా?" అంటూ వరూధినీని కౌగిలించుకుంది మమత.

"చాలా రోజులకి ఎలా వున్నావ్?" అంది వరూధిని నవ్వుతూ.

బదులుగా మమత ముఖకవళికలు మార్చింది.

"ఏం చెప్పను వరూ! అమ్మ కేన్సర్‌తో చనిపోయింది. నేను ఒకణ్ణి నమ్మి పెళ్ళిచేసుకుని దుబాయ్ వెళ్ళిపోయాను. వాడుత్త దుర్మార్గుడు. నేను పడని కష్టాలు లేవనుకో. చివరికి ఎలాగో బయట పడి ఇండియా చేరాను. రాగానే మిమ్మల్ని చూడాలనిపించి వెంటనే వచ్చేసాను."

"తిన్నగా ఇక్కడికేనా రావడం?" అనడిగింది రాజేశ్వరి, ఆమె వెనుక ఉన్న లగేజ్‌ని చూసి.

"అవునమ్మా - నా కెవరున్నారింక. మీరు లేకపోతే.. ఏ హోటల్లో అన్నా దిగి ఇల్లు చూసుకోవాలనుకున్నాను." అంది మమత.

"సరే, స్నానం చెయ్యి. టిఫిన్ పెడతాను" అంది రాజేశ్వరి.

మమతని చూసి రాజేశ్వరి అప్రసన్నంగా మారిపోయింది.

మమత వరూధిని క్లాస్‌మేట్. చదువుకునే రోజుల్లో తరచూ వరూధిని వెంట ఇంటికొచ్చేది. తన కష్టాలు ఏకరువు పెట్టేది. అవి విని ఆ అమ్మాయికి తాము ఆర్థికంగా సహాయపడేవారు. వరూధిని బట్టలు చాలా తీసుకెళ్ళేది. అందరికీ సహాయపడటమే తెలిసిన తమ కుటుంబం మమతకి చాలా సహాయపడి ఆదుకునేవారు.

వరూధిని పెళ్ళికి ముందు మమత చాలా హడావుడిగా వచ్చి తన తల్లికి కేన్సర్ వచ్చిందని హాస్పిటల్లో ఉందని ఒక లక్షరూపాయలు కావాలని ఏడ్చింది. వెంటనే ఆ డబ్బు యిచ్చి ఆదుకున్నారు వరూధిని తండ్రి.

అంతే!

ఆ తర్వాత ఇదే రావడం.

మమత స్నానానికి వెళ్ళగానే రాజేశ్వరి వరూధిని దగ్గరగా వచ్చి "జాగ్రత్తమ్మా, డబ్బు మాత్రం యివ్వకు. ఉంటే నాలుగురోజులుండి పోనీ. ఈ అమ్మాయి మాటలమీద నాకు నమ్మకం లేదు" అంది చిన్నగా.

వరూధిని సరేనన్నట్లుగా తలూపింది.

మమత స్నానం చేసి వచ్చింది. మంచి ఖరీదైన చీర కట్టుకుని సూట్‌కేసులోంచి పదిరకాల ట్యూబ్స్ తీసి మొహానికి పూసుకుని మేకప్ చేసుకుంది. ఆమె తయారు చూస్తుంటే చాలా ఆశ్చర్యమనిపించింది రాజేశ్వరికి. అసలన్ని రకాల అలంకరణ సామానుంటుందని కూడా ఆమెకు తెలియదు. కారణం వరూధిని పౌడర్ కూడా రాసుకోదు.

మమత రాజేశ్వరి పెట్టిన దోసెలు మరీ మరీ అడిగి వేయించుకుని తిన్నది.

"ఇలాంటి దోసెలు తిని ఎన్ని రోజులయిందో. నిజంగా ఇటునుండి అటు చూడొచ్చు. మీ వంట నిజంగా అమృతమాంటీ" అని పొగుడుతూనే వుంది తింటూ.

వరూధిని కూడా చిత్రకి స్నానం చేయించి వచ్చి డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చుంది.

రాజేశ్వరి టిఫిన్ తీసుకొచ్చి కూతురికి పెట్టింది.

వరూధిని చిత్రకి తినిపిస్తూ తను తింటుంటే ఫోను వచ్చింది. వరూధిని పరిగెత్తుకెళ్ళి రిసీవర్ అందుకుంది.

"వరూ, ఎలా వున్నావో? నాకు ఆంటీ అంతా చెప్పింది. నేను వీలు చూసుకుని ఈ వారంలో వస్తాను. మనం రిజిష్టర్ మారేజ్ చేసుకుందాం. నేను రూల్స్ అన్నీ కనుక్కున్నాను. ఒక నెలముందు నోటీస్ బోర్డులో పెట్టాలట. సాక్షులుగా ముకుందంగారిని అడుగుతాను. ఇంకెవరన్నా వుంటే చూడు. వాడు ఆ రాస్కెల్ వచ్చి ఏవన్నా నూసెన్స్ చేస్తాడా! వర్రీ అవ్వకు. ఇంకెంత నాల్రోజులు ఓపిక పట్టు సరేనా!" వరూధినీని మాట్లాడనివ్వకుండా అంతా తనే మాట్లాడేసాడు హేమంత్.

మమత వచ్చి మంచమ్మీద కూర్చుని వరూధినినే గమనిస్తోంది ఆసక్తిగా.

వరూధినికి మొన్న వచ్చి చక్రవర్తి చేసిన గొడవ గురించి చెప్పాలనిపించలేదు. చెప్పి అతని మూడ్ చెడగొట్టడం యిష్టంలేక మౌనం వహించింది.

"నిజంగా మనముందు ఎన్నో మంచి రోజులున్నాయి వరూ! నన్ను నమ్ము. ఇప్పుడేం మాటల్లో చెప్పలేను. నాకు మన జీవితం ఈస్టమన్ కలర్‌లో కనిపిస్తున్నది. ఎంతదృష్టం నువ్వు నాకు దొరకడం సరే సరే. ఎవడో అదే పనిగా ఫోను చేస్తున్నాడు స్కాండల్. వాడికి తెల్లవారడమే రాజకీయం" అంటూ ఫోను పెట్టేసాడు హేమంత్.

వరూధిని రిసీవర్ క్రెడిల్ చేసి మమతవైపు చూసింది.

మమత చాలా ఆసక్తిగా వరూధినీని గమనిస్తూ "ఏంటంత సంతోషంగా వున్నావ్? కొంపదీసి మీ ఆయనగాని మారిపోయి ఫోన్ చేసాడా?" అంది నవ్వుతూ.

ఆ పేరు వినగానే వరూధిని మొహం అప్రసన్నంగా మారింది.

"సారీ, నేనేమన్నా తప్పుగా మాట్లాడానా! నా జీవితమెలాగూ మాడిమసిబొగ్గయింది. నువ్వన్నా బాగుండాలని అలా అన్నాను వరూ. ఎంత మంచి కుటుంబం మీది. ఎంత ఆదుకున్నారు నన్ను. నా జీవితమంతా మీ ఇంట్లో ఊడిగం చేసినా మీ రుణం తీర్చుకోలేను" అంది మమత కన్నీళ్ళతో.

అంతే!

వరూధినికి మమతపట్ల చెప్పలేని ప్రేమ కలిగింది.

పాపం డబ్బులేక యివ్వలేక మొహం చాటేసింది. అంతమాత్రాన చెడ్డదనుకోవాలా! మనిషికి మనిషి కావాలి. మనసు విప్పి చెప్పుకోవడానికి మరో మనసుకావాలి. అన్నీ డబ్బుతో కొలవడం తప్పు.

వెంటనే వరూధిని హేమంత్ గురించి అంతా చెప్పేసింది. అలా చెబుతున్నప్పుడు వరూధిని మొహంలో విరబూస్తున్న ఆనందపు సుమాల్ని గమనిస్తోంది మమత.

"ఎంతదృష్టం.!!? జీవితంలో ఇంత దెబ్బ తగిలాక కూడా ఒక పెళ్ళికాని అబ్బాయి పిల్ల తల్లివని తెలిసికూడా ప్రేమించడం నిజంగా యూ ఆర్ లక్కీ వరూ!" అంది మమత.

వరూధిని నవ్వింది.

"తొందరలో ఒక ఆఫీసర్ భార్యవి కాబోతున్నావన్నమాట" అంది మమత మళ్ళీ.

"నాకే ఇది నమ్మబుద్ధికావడం లేదు మమతా! నా జీవితంలో ఇంత గొప్ప ఆదర్శవంతమైన వ్యక్తి ప్రవేశిస్తాడని అనుకోలేదు" అంది వరూధిని హేమంత్‌ని తలచుకుని పరవశంగా.

ఆ ఆనందాన్నే మమత చూసి లోలోపల రగిలిపోతున్నదని అసూయతో ఉడికిపోతున్నదని ఏమాత్రం గ్రహించలేకపోయింది వరూధిని.

ఎవరికి ఏమి చెప్పకూడదో వారికే అంతా చెప్పేసింది. అవసరంలేకపోయినా హాని చేసేవారుంటారని - ఒకరి కన్నీళ్ళే వారికి దాహం తీరుస్తాయని వరూధిని తెలుసుకోలేకపోయింది.

కాలింగ్‌బెల్ మోగింది

వెళ్ళి తలుపు తీసింది వరూధిని.

వెనకాలే మమత.

ఎదురుగా నిలబడిన అపరిచిత వ్యక్తిని సందిగ్ధంగా చూసి "మీరు?" అనడిగింది వరూధిని.

"నా పేరు లావణ్య. నేను రమేష్‌బాబుకి భార్యని. అలా చెప్పుకోవాల్సి రావడం నాకు సిగ్గుగా వుంది."

వరూధిని కొద్దిగా తెల్లబోయి "రండి" అంది మెల్లిగా.

లావణ్య లోపలికొచ్చి కూర్చుని ఇల్లంతా కలయజూస్తూ "నన్ను క్షమించండి. ఇలా అనుకోకుండా రావాల్సి వచ్చింది. నాకంతా తెలిసింది. మిమ్మల్ని చేసుకోబోయే వ్యక్తి రాసిన ఉత్తరం నిన్న మా వారి జేబులో నాకు దొరికింది. నేను నిలేస్తే అతనంతా చెప్పుకొచ్చాడు. అతను చాలా దిగజారుడు మనిషని తెలుసు కాని.. మరీ ఇంత నీచంగా ప్రవర్తిస్తాడని తెలియదు. అతనివల్ల మీరు పడిన కష్టాలకి నేను క్షమాపణ చెప్పలేను. ఆ చిన్నమాట మీకెలాంటి ఊరడింపూ కాదని నాకు తెలుసు. ఈ ఉత్తరాన్ని మీకు కాబోయే మావగారికి పంపాలని ఇతను చక్రవర్తి దగ్గర కొన్నాడట. ఆ రోగ్‌ని అంతకుముందే చూశాను. మీలాంటి అమ్మాయి అలాంటి వాడి భార్య కావడం ఎంత దురదృష్టం. పోనివ్వండి. మీకు ఇక మీదట మంచి భవిష్యత్తు ఏర్పడాలని ఆ భగవంతుణ్ణి కోరుకుంటాను.

ఇకమీదట రమేష్ బాబు మీ జోలికి రాడని మాట యిస్తున్నాను. అలా వస్తే నేను ఏమీ చేయడానికైనా వెనుకాడను. భర్తనే జాలితో అతని తప్పుల్ని కాచే ఆడదాన్నికాదు నేను. ఆల్ ద బెస్ట్" అంటూ కాఫీ తాగి వెళ్ళమన్నా వద్దని అంతే వేగంతో ఉత్తరాన్ని వరూధిని చేతిలో పెట్టి వెళ్ళిపోయింది లావణ్య.

వరూధిని ఇంకా ఆశ్చర్యంలోంచి తేరుకోలేదు.

"ఎవరావిడ, ఏంటిదంతా..? " అంటూ చనువుగా ఆ ఉత్తరాన్ని చేతిలోకి తీసుకుని చదివేసింది మమత.

అప్పుడే స్నానం, పూజ ముగించుకుని వచ్చిన రాజేశ్వరి "ఏంటమ్మా, ఎవరో వచ్చినట్లున్నారూ?" అనడిగింది కూతుర్ని.

వరూధిని తేరుకుని జరిగిందంతా చెప్పింది రాజేశ్వరికి.

రాజేశ్వరి చేతులెత్తి దేవుడికి దణ్ణం పెట్టి "దేవుడున్నాడమ్మా, లేకపోతే ఎంత చిత్రం? ఆవిడ చేతికి ఉత్తరం దొరకడం - ఆవిడ పెద్ద మనసుతో తెచ్చివ్వడం నిజంగా నీకు మంచిరోజులు వచ్చాయి వరూ" అంది కన్నీళ్ళతో.

అన్నీ వింటున్నది మమత.

"హేమ్ ఇందాక ఫోను చేసాడమ్మా. ఈ వారంలో వస్తాడట. రిజిష్టర్ మారేజ్ చేసుకోవాలని. ముందుగా ఒక నెల నోటీసు బోర్డులో పెడతారట. సాక్షులని చూడాలి" అని చెప్పింది వరూధిని.

"నేను పెడతాను" తక్కున అంది మమత.

అప్పటికి గానీ మమత అన్నీ వింటున్నదని గ్రహించలేకపోయింది రాజేశ్వరి.

మమత రాజేశ్వరిని గమనిస్తూనే వుంది. ఆమె మొహంలో తన పట్ల అప్రసన్నత, అపనమ్మకం గోచరిస్తూనే వున్నాయి.

అందుకే వెంటనే మొహంలో ఎక్కడలేని నవ్వు తెచ్చుకుని "నిజంగా నాకెంత సంతోషంగా వుందో తెలుసా ఆంటీ. వరూధిని బ్రతుకిలా అయిపోయిందని నేను ఏడవని రోజు లేదు. మీరు నమ్మకపోవచ్చు. ఇదింత డబ్బు తీసుకుని చెప్పాపెట్టకుండా చెక్కేసిందని అనుకుని వుండొచ్చు. కానీ ఏం చెయ్యను? అమ్మ చనిపోయినప్పుడు అంత్యక్రియలకి కూడా నా దగ్గర డబ్బులేదు. తిరిగి మిమ్మల్ని ఏ మొహం పెట్టుకుని అడగను. అందుకే ఎప్పట్నుంచో ప్రేమా, దోమా అంటున్న ఈ దుబాయ్ వ్యక్తిని అడిగాను. ఆ కృతజ్ఞతతోనే పెళ్ళి చేసుకున్నాను" అంది మమత ఏడుపు నటిస్తూ.

రాజేశ్వరికూడా ఆ మాటలు నమ్మింది.

మంచివారి కుండే అవలక్షణమే అది.

వారు మెదడుతో కాక మనసుతోనే ఆలోచించడం.

"పోనీలే వూరుకో. నీకూ మంచి రోజులొస్తాయి. మాకు కాబోయే అల్లుడు చాలా మంచివాడు. మంచి పొజిషన్‌లో ఉన్నాడు. నీ జీవితాన్ని కూడా చక్కబరుస్తాడు. గతం మరచిపో. మేమిచ్చిన డబ్బుగురించి మరిచిపో" అంది అనునయంగా.

ఈ లోపున ఆమె మెదడులోనే చకచకా పావులు కదుపుతోందని వాళ్ళిద్దరూ గ్రహించలేకపోయారు.

రాజేశ్వరి చిత్రని తీసుకుని గదిలోకెళ్ళగానే "వరూ, నిన్నొకటడిగితే ఏమనుకోవు కదా!?" అంది మమత నెమ్మదిగా.

వరూధిని ఏమిటన్నట్లుగా చూసింది.

"ఈ లగేజ్ ఏదయినా రూమ్‌లో పడేసి వస్తాను. చిన్న పెళ్ళివుంది. వెళ్ళాలి. నగలేం లేవు. వాళ్ళకి నాగురించేం తెలియదు. ఒక నెక్లెస్ వుంటే ఇస్తావా! మళ్ళీ ఇప్పుడే తెచ్చిచ్చేస్తాను" అంది.

వరూధిని ఆమెనేమీ శంకించలేదు.

"అలాగే. లాకర్‌లో వున్నాయి. తెచ్చిస్తాను" అంటూ పర్స్ తీసుకుని వెళ్ళింది బాంక్‌కి.

అదే అదనుగా గబగబా ఆమె డెస్కంతా వెదికింది మమత. అక్కడ డైయిరీలో హేమంత్ వివరాలూ, వాళ్ళిద్దరూ విశాఖ వెళ్ళడం గురించి అన్నీ రాసున్నాయి. అవి చూడగానే మమత కళ్ళు మెరిసాయి. వెంటనే ఆ డైయిరీని, ఉత్తరాన్ని బాగ్‌లో వేసుకుని తయారయ్యింది.

వరూధిని రాగానే నెక్లెస్ పెట్టుకుని "చాలా థాంక్స్ వరూ, పెళ్ళికి వెళ్ళి సాయంత్రం వస్తాను. అమ్మకి చెప్పు" అంటూ లగేజ్ తీసుకుని బయలుదేరింది.

"ఎక్కడికో వెళ్ళిపోవడం దేనికి? ఇక్కడే ఉండొచ్చుకదా! నాకు మాత్రం ఎవరున్నారు?" అంది వరూధిని అమాయకంగా.

బదులుగా మమత వరూధిని బుగ్గలు పుణికి "నాకు తెలుసు నువ్వు బంగారు తల్లివి. ఎవరెంత హద్దుల్లో ఉండాలో అంతలో వుంటేనే స్నేహాలు కలకాలం మిగులుతాయి. పేరుకు రూమ్ కాని నేనిక్కడే వుంటాను. సరేనా! అమ్మకి చెప్పు" అంటూ వెళ్ళిపోయింది మమత.

ఇంకో నాలుగురోజుల్లో హేమంత్ వస్తాడన్న ఊహ చాలా ఆనందాన్ని కలిగిస్తోంది వరూధినికి. ఆమె మనసు మనసులో లేదు.

ఒక పక్క సంతోషం మరో పక్క భయమూ, కంగారూ. అటూ యిటూ తోచనట్లు తిరుగుతోంది.

"అమ్మా, ఈ పిల్ల ఎక్కడికెళ్ళింది? మళ్ళీ రాలేదే?" అంటూ మమత గురించి అడిగింది రాజేశ్వరి చాలాసార్లు.

ఖరీదైన నెక్లెస్ కూడా తీసుకువెళ్ళింది.

కొంపదీసి మళ్ళీ మోసం చేసిందా! ?

అప్పుడే ఫోను రింగయింది.

మమత.

"వరూ, రూం దొరికింది. చిన్న చిన్న పనులు వల్ల రాలేకపోయాను. రెండురోజుల్లో వస్తాను. కంగారు పడకు."

మమతని అనుమానించినందుకు కొద్దిగా సిగ్గుపడింది వరూధిని.

నయం. ఇంకా తల్లికి చెప్పానుకాదు అనుకుంది.

"ఎవరమ్మా ఫోను?"

"మమతమ్మా. ఏవో పాపం కష్టాలు. రూమ్ దొరికిందట. రెండురోజుల్లో వస్తానని చెప్పింది."

"అసలెందుకెళ్ళిపోవడం. లంకంత కొంప. ఎక్కడున్నా ఏముంది? అనవసరంగా బయట ఉండటం" అంది రాజేశ్వరి సానుభూతిగా.

అప్పుడే సరిగ్గా కాలింగ్‌బెల్ మోగింది.

తలుపు తెరిచింది రాజేశ్వరి.

"ఇదేనా వరూధిని కొంప?"

"మీరెవరూ?" అర్థంకానట్లుగా చూసింది రాజేశ్వరి.

"నేనెవరో చెబుతాను. ముందు ఫానెక్కడ" అంటూ అతను విసురుగా లోపలికొచ్చి చేతిలోని తాడు ఫాన్‌కి కట్టే ప్రయత్నం చెయ్యబోయాడు.

ఊహించని ఆ చర్యకి రాజేశ్వరి మ్రాన్పడిపోయి చూసి "అమ్మా వరూధినీ" అంటూ అరచింది.

స్టూలెక్కి ఫాన్‌కి తాడు ముడివేస్తున్న ఆ వ్యక్తిని చూసి నిరుత్తురాలయ్యింది వరూధిని పరిగెత్తుకుంటూ వచ్చి.

**స్టూలెక్కి ఫాన్‌కి** తాడు ముడివేస్తున్న ఆ వ్యక్తిని చూసి, వరూధిని పరిగెత్తుకుంటూ వచ్చి, నిరుత్తరాలయ్యింది.

"ఏమోనమ్మా, ఏమీ చెప్పకుండా తలుపు తియ్యగానే వచ్చి యిలా చేస్తున్నాడు.. పిచ్చాడేమో!" అంది రాజేశ్వరి ఆందోళనగా చూస్తూ.

"అవును పిచ్చోళ్ళమే. నా కొడుకూ - నేను కూడా పిచ్చోళ్ళమే! అందుకే మీ ఆటలిలా సాగుతున్నాయ్" అన్నాడతను ఆవేశంతో వూగిపోతూ.

"మీరు మాట్లాడేది మాకేం అర్థంకావడంలేదు. ముందు మీరు స్టూల్ దిగి మాట్లాడండి" అంది వరూధిని కొంత అసహనంగా.

"ఎలా అర్థమవుతుంది కొంపలు ముంచేవాళ్ళకి. నిక్షేపంగా వున్న మా కొంపకి శనిదేవతల్లా పట్టారు. ఇంతకన్నా ఎందులోనన్నా పడి చావకూడదూ!" అతను తాడు మెడకి తగిలించుకుంటూ అన్నాడు.

వరూధినికి కొంత అర్థమయ్యింది.

"మీరు సుందరంగారా?"

"హమ్మా! నా పేరు కూడా తెలుసుకున్నావ్!"

అతని జవాబు విని నిజంగానే మ్రాన్పడిపోయింది వరూధిని. వెంటనే రాజేశ్వరి వైపు తిరిగి "పాపని తీసుకుని లోపలికెళ్ళు" అంది.

రాజేశ్వరి కదల్లేదు - "అతను నీకేమన్నా ఆపద తలపెడితే?"

"ఏం జరగదమ్మా! ప్లీజ్" అంది.

అందులో వేడికోలు కన్నా ఒక అసహనమైన ఆజ్ఞ వుండటంతో రాజేశ్వరి అయిష్టంగానే గదిలోకెళ్ళింది చిత్రని ఎత్తుకుని.

"ఇప్పుడు మీరు క్రిందకి దిగి మీరేం చెప్పదలచుకున్నారో అది చెప్పండి" అంది వరూధిని సుందరం కేసి చూసి శాంతంగా.

"క్రిందకి దిగితే నన్నుకూడా మాటల్తో బోల్తా కొట్టించాలనుకుంటున్నావా? నేను బెదిరిస్తున్నాననుకుంటున్నావేమో! నిజంగానే ఉరివేసుకుని ఛస్తాను" అన్నాడు సుందరం హిస్టీరికల్‌గా.

"అది మీ యిష్టం. ముందు మీరేం ఆశించి వచ్చారో ఆ సంగతి మాత్రం చెప్పండి."

"నా కొడుకుని వల్లో వేసుకున్నావ్. నీకు బుద్ధిలేదా? పెళ్ళయిన ఆడదానివి. పైగా ఒక పిల్లకూడా వుంది. నిన్నిలా పెంచిందా మీ అమ్మ?"

"మీరెక్కువగా మాట్లాడుతున్నారు. మీరే పనిమీద వచ్చారో అది మాత్రమే చెప్పండి."

"దయచేసి నా కొడుకుని వదిలేయ్! వాడు నా ఆస్తి" సుందరం చేతులు జోడించాడు.

"ఈ మాట మీరు హేమంత్ కి చెప్పకూడదా! మీకు ఆస్తిమీద మమకారమని తెలుసు. కానీ.. కొడుకునే ఆస్తిగా భావించే గొప్ప మనస్తత్వం అని నాకు తెలియదు."

"వాడు నీ మోజులో పడ్డాడు. నా మాట వినడు. ఈ పెళ్ళి జరిగితే నేను చచ్చితీరతాను. బెదిరింపనుకుంటున్నావేమో! కావాలంటే చూడు" అంటూ ఉచ్చు బిగించుకోబోయాడు సుందరం.

సరిగ్గా అప్పుడే మమత రంగప్రవేశం చేసింది.

"ఆ!.ఆ! ఏంటీ అఘాయిత్యం! ఎవరితను?" అంటూ సుందరాన్ని చూసి గాభరాగా అరచింది.

సుందరం మమతవైపు చూసి "ఇదెవర్తి?" అన్నాడు వెటకారంగా.

"మాటలు తిన్నగా రానివ్వండి. చావబోతూ కూడ పొగరుగా వాగుతున్నారు" అంది మమత కోపంగా.

వరూధిని మమతని వారించి "మీరనుకున్నట్లే జరుగుతుంది. క్రిందకి దిగండి" అంది ఎర్రబడిన కళ్ళలో దుఃఖం ఆవిరవుతుండగా.

"నిజవేనా?"

వరూధిని అతనివైపు అలానే చూస్తూ తలవూపింది.

"నీ పిల్లమీద ఒట్టెయ్యి!" అన్నాడు సుందరం మొండిగా.

"నాకు ఒట్లు మీద నమ్మకం లేదు. దిగండి" అంది.

సుందరం దిగాడు స్టూలు మీంచి.

"ఇదిగో! నువ్వింక హేమంత్‌కి కనిపించకూడదు. కనిపించావో - వాడు నిన్నొదలడు. వాడి మనసు విరిగేలా చేసి వెళ్ళిపో!"

వరూధిని నిస్తేజంగా చూస్తూ నిలబడింది.

సుందరం తాడు తీసి సంచిలో పెట్టుకుని "నీకు సిగ్గూ, పౌరుషం వుంటే నా కొడుకు జోలికి రావద్దు" అంటూ బయటకి నడిచాడు.

వరూధిని సోఫాలో కూలిపోయినట్లుగా కూర్చుంది.

అలాంటి పరిస్థితిలో వున్న వరూధినిని చూసి మమత కళ్ళు మెరిసాయి.

"ఏం జరిగింది, ఎవరతను?" అంది వరూధిని పక్కనే కూర్చుని.

వరూధిని జవాబు చెప్పలేదు.

తల రెండు చేతుల్లో పెట్టుకుని కూర్చుంది మౌనంగా.

రాజేశ్వరి గబగబా బయటకొచ్చి మమతని చూసి "చూశావా, మమతా..! ఇతను హేమంత్ తండ్రి. ఎవరు చెప్పారో ఏమోగాని ఇంటికొచ్చి యింత అఘాయిత్యం చెయ్యబోయాడు" అంది ఏడుస్తూ.

అసలిదంతా చేసి సుందరాన్ని యిక్కడికి వచ్చేటట్లుగా చేసిన మమత లోలోపల చాలా సంతోషపడుతూ... దాన్ని కనపడకుండా మొహాన్ని బాధగా మార్చి "అయ్యో, ఇతనేంటి... యిక్కడకొచ్చి... అతనిక్కడ చచ్చివుంటే ఎంత ఘోరం జరిగేదాంటీ, మీరు పోలీసు కేసులో ఇరుక్కునేవారు. చిత్ర భవిష్యత్తు ఏమయ్యేది?" అంది వాళ్ళనింకా భయభ్రాంతులకి గురిచేయడానికి.

వరూధిని తలెత్తి మమతవైపు చూసింది.

అదే అదనుగా మమత వరూధిని పక్కన కూర్చుని "ఏడ్వటానికిది సమయంకాదు వరూ! ఏదయినా త్వరగా నిర్ణయించుకోవాలి. నీ ముందున్నది చిత్ర భవిష్యత్తు. ఆలోచించుకో" అంది మెల్లిగా.

"మనం యిక్కణ్ణించి వెళ్ళిపోదాం అమ్మా" అంది తల్లి వైపు తిరిగి.

రాజేశ్వరి అయోమయంగా చూసింది కూతురివైపు.

"ఎక్కడికి? ఎందుకు?"

"అవును. అదే మంచి ఆలోచన ప్రస్తుతానికి. లేకపోతే ఇంతమంది శత్రువుల్ని ఎలా ఎదుర్కోవడం? ఇంత పగా... ఒక్క అసహాయురాలి మీద" అంది మమత.

"అదే. ఎక్కడికి. అంటే హేమంత్‌ని..?" సందిగ్ధంగా చూసింది రాజేశ్వరి.

"హేమంత్‌ని మరచిపోమ్మా. అదొక కల. అయిపోయింది" అంది వరూధిని దుఃఖాన్ని నిగ్రహించుకుంటూ.

"అవునమ్మా. ఇలా చెప్పడానికి చాలా బాధగా వున్నా.. ఆ ముసలోడు అన్నంత పనీ చేసేట్లున్నాడు. వాడు ఛస్తే ఎంత గొడవ?" అంది మమత.

"కానీ.. హేమంత్‌కు ఈ విషయం చెప్పాలి కద! అతను చాలా మంచివాడు" అంది రాజేశ్వరి.

"ప్రస్తుతం అదికాదు మన సమస్య. మనం ఎక్కడికి వెళ్ళాలా అని ఆలోచిస్తున్నాను."

"అవును వరూ! మనం మద్రాసు వెళ్ళిపోదాం." అంది మమత వెంటనే.

"మద్రాసా?"

"అవును. అక్కడ నాకు ఒక స్నేహితురాలుంది. మనకి అన్ని ఏర్పాట్లూ చేస్తుంది. నీకు జాబ్ కూడా చూస్తుంది" అంది మమత.

వరూధిని మమతవైపు చూసింది.

"మనం వెళ్ళిపోవాలి. చాలా అర్జెంటుగా. లేకపోతే హేమంత్ వచ్చేస్తాడు. అన్ని ఏర్పాట్లూ నువ్వే చెయ్యాలి మమతా!" అంటూ రివ్వున గదిలోకి వెళ్ళి తలుపు మూసుకుంది.

ఆ తలుపు వెనకాల ఆమె హృదయం కన్నీరయి కురుస్తుందని ఆ యిద్దరికీ తెలుసు.

ఆ ఇంటికున్న తాళం చూసి చాలా నిరుత్తురడయిపోయాడు హేమంత్.

వరూధిని తనకి పరిచయమయ్యాక ఎన్నడూ ఇలా జరగలేదు. ఆ యింటికి తాళం వుండటమే తెలియదు. ఎప్పుడూ రాజేశ్వరి చిత్రతో ఆ యింటిని కనిపెట్టుకునే వుండేది.

ఎవర్నడిగినా తెలియదని ముక్తసరిగా జవాబు చెబుతున్నారు.

హేమంత్ ఎంతగానో ఆలోచిస్తూ చాలాసేపు అక్కడే నిలబడ్డాడు.

ఎంత ఆశగా వచ్చాడు.

అసలేం జరిగిందో ఎంత ఆలోచించినా అంతుబట్టడం లేదు.

పరిచయమయ్యాక వరూధిని తనకి చెప్పకుండా ఎక్కడికీ వెళ్ళలేదు. తీరా పెళ్ళి అనుకున్నాక వరూధిని తల్లితో సహా మాయమవ్వడం అతను జీర్ణించుకోలేకపోతున్నాడు.

ఆలోచిస్తూ హోటల్‌రూమ్‌కి చేరుకున్నాడు.

ఆలోచించేకొలది అతనికి మతిపోతున్నది.

ఎవరూ బంధువులున్నట్లుగా - వారితో అనుబంధాలున్నట్లుగా కూడా చెప్పలేదెప్పుడూ.

ఎవరైనా వరూధినికి కీడు తలపెట్టి వుంటారా?

అలా అనుకోగానే ఎక్కడలేని భయంతో వణికిపోయాడు హేమంత్. వెంటనే లేచి రమేష్‌బాబుకి ఫోను చేసాడు.

అవతల్నుండి రమేష్‌బాబు 'హలో' అన్నాడు.

"నేను హేమంత్‌ని. వరూధినీని ఏం చేసావ్?"

అతని సూటి ప్రశ్నకి నిజంగానే వణికిపోయాడు రమేష్‌బాబు.

"నేనా... నేనేం చేస్తాను." అన్నాడు కంగారుగా.

"అవును. నువ్వే వరూధిని నీకేం అపకారం చేసింది? నువ్వు తప్పు చేసింది కాకుండా ఆమె మీద పగబట్టావ్. నాకే ఎన్నో చెప్పావు. ఆమె నిన్ను ప్రేమించి దగా చేసిందా! జీవితంలో ఓడిపోయిన ఒక స్త్రీకి సహాయం చెయ్యకపోగా.... ఆమె నాశనాన్ని కోరుకున్నావ్. ఆమె చెడ్డదని ప్రచారం చెయ్యాలని చూశావ్. ఆమె చెడ్డదయితేనేం మంచిదయితేనేం ఆమె జీవితం ఆమెది." అన్నాడు హేమంత్ చాలా ఆవేశంగా.

హేమంత్ ఎప్పుడయితే అంత సూటిగా, కోపంగా అడుగుతున్నాడో రమేష్‌బాబు కంగారుపడిపోయాడు. నేరప్రవృత్తిగల వారికి అదేపాళ్ళలో పిరికితనమూ వుంటుంది.

అసలే యిప్పుడు ఉద్యోగం సరిగ్గా లేదు. ఇల్లరికపు బ్రతుకు. పైగా భార్యకి తన సంగతులన్నీ తెలిసిపోయాయి. హేమంత్ ఇప్పుడు ఉద్యోగరీత్యా మంచి స్థితిలో వున్నాడు. అతను తలచుకుంటే తన బ్రతుకింకా అధ్వాన్నమయిపోతుంది.

అందుకే అతను దిగజారిపోయాడు భయంతో.

"లేదు హేమంత్! నేనేం చేయలేదు. నన్ను నమ్ము."

"నిన్ను నమ్మాలా! చక్రవర్తిని ఎగదోసి ఆమె జీవితంతో ఆటలాడుతున్నావ్. చక్రవర్తి వైజాగ్‌దాకా నీ ప్రమేయంలేకుండానే వచ్చాడా?"

"నిజమే. నేను చాలా తప్పులు చేసాను. కాదనను. మొన్న నా భార్యకి తెలిసిపోయింది. ఆవిడ నన్ను చాలా అసహ్యించుకుంది. ఆమె మందలించాక నా కళ్ళు తెరచుకున్నాయి. ఇకెప్పుడూ వరూధిని జోలికి వెళ్ళనని నా పిల్లల మీద ఒట్టుపెట్టుకున్నాను. మీ యిద్దరూ పెళ్ళి చేసుకుని సుఖంగా వుండాలని ఆశిస్తున్నాను. ప్రామిస్." అన్నాడు రమేష్‌బాబు దాదాపు ఏడుస్తున్నట్లుగా.

"నీ మాటలు నమ్మమంటావా?"

"ఇంకెలా చెప్పాలో నాకు తెలియడంలేదు హేమంత్."

హేమంత్ రిసీవర్ క్రెడిల్ చేసి మంచంమ్మీద పడుకున్నాడు ఆలోచిస్తూ.

అతని దృష్టి చక్రవర్తి మీదకి మళ్ళింది.

ఒకవేళ అతనేమయినా చేసాడా వరూధినిని. ఎలా తెలుస్తుంది?

వెంటనే మళ్ళీ రమేష్‌బాబుకి ఫోను చేసాడు హేమంత్.

"రమేష్! నిన్ను నమ్మి ఒక బాధ్యత నీకు అప్పజెప్తున్నాను. వరూధిని గురించి నాకు చాలా టెన్షన్‌గా వుంది. ఆ చక్రవర్తిని కాంటాక్ట్ చేసి నాకేమన్నా ఇన్ఫర్మేషనివ్వగలవా?"

"ష్యూర్ హేమంత్. అది నా బాధ్యత. నువ్వెక్కడున్నావో చెప్పు. వివరాలు తెలుసుకుని వస్తాను" అన్నాడు రమేష్‌బాబు.

హేమంత్ తను బస చేసిన హోటల్ పేరు చెప్పాడు.

రమేష్‌బాబు పిలవగానే చక్రవర్తి వెంటనే వచ్చాడు.

కారణం అతని చేతిలో చిల్లుగవ్వ లేకపోవడమే.

"వరూధినిని ఏం చేసావ్?"

రమేష్‌బాబు ప్రశ్నకి తెల్లబోయినట్లుగా చూశాడు చక్రవర్తి.

"వ్వాట్! నేను చెయ్యడమేంటి?"

"ఆ ఉత్తరం నీకే యిచ్చేసానుగా."

"అవును. అదికాదు సమస్య. వరూధినీ కనిపించడంలేదు. అందరూ నిన్నే అనుమానిస్తున్నారు." అన్నాడు రమేష్‌బాబు.

చక్రవర్తికి కోపం ముంచుకొచ్చిందా మాటవిని.

"నాకసలే తిక్కతిక్కగా వుంది. మూడురోజులయింది మందు తాగి. చేతిలో పైసాలేదు. పొద్దున్నే పిలిచి పిచ్చివాగుడు వాగితే తల బద్దలు కొడ్తాను. అసలింతకీ అది నిజంగానే కనిపించడంలేదా? నీకెలా తెలుసు?" అన్నాడు అసహనంగా.

ఇక దాచి లాభం లేదని గ్రహించాడు రమేష్‌బాబు.

"హేమంత్ ఫోను చేసాడు. అతను నన్ను - నిన్ను అనుమానిస్తున్నాడు. అసలే ఇప్పుడు పొజిషన్లో వున్నాడు. ఆమెకేదయినా జరిగితే మనం యిరుక్కుంటాం. నా సంగతి సరే. తరచూ ఇంటికెళ్ళి గొడవ చేస్తుంటావని చుట్టుపక్కల నీ గురించి తెలుసు. అందుకే - నీకు చెబుతున్నా. నీకు తెలిస్తే చెప్పు. "అన్నాడు కొంచెం అనునయంగా విషయం రాబట్టాలని.

చక్రవర్తి నొసలు చిట్లించాడు.

"నిజంగానే కనిపించటంలేదా..? ఇప్పుడసలు డబ్బుకోసం దాని దగ్గరకే వెళ్దామనుకున్నానే. ఏవయ్యుంటుంది? హేమంత్‌కే తెలియకుండా అదెక్కడికి వెళ్తుంది" అన్నాడు తనలో తాను మాట్లాడుకుంటున్నట్లుగా.

రమేష్‌బాబుకి చక్రవర్తికి నిజంగానే తెలియదని అర్థమయిపోయింది.

చక్రవర్తి చేసిన తప్పుడు పనిని దర్జాగా చెప్పుకునే తరహా రౌడీ. ఇలా ఆలోచిస్తున్నాడంటే వరూధిని విషయం అతనిక్కూడా తెలియదని గ్రహించాడు రమేష్‌బాబు.

"సరే, నీ జాగ్రత్తకోసం పిలిచాను అంతే." అని పైకి లేచాడు.

వెళ్ళిపోతున్న రమేష్‌బాబు వంక నిర్ఘాంతపోతున్నట్లుగా చూసి "బాబ్బాబూ, ఓ అయిదొందలన్నా కొట్టు. నాలుక పిడచకట్టుకు పోతున్నది." అన్నాడు చక్రవర్తి మొదటిసారిగా వేడుకుంటూ.

రమేష్‌బాబు ఒక వందరూపాయలు అతని మీదకి విసిరి వెళ్ళిపోయాడు. ఇప్పుడతనికి తనతో అవసరంలేదని గ్రహించిన చక్రవర్తి ఆ వంద తీసుకుని కల్లుకాంపౌండ్ వైపు నడిచాడు.

తమ జీవితాలకి అసలేం జరుగుతుందో తెలియని స్థితిలో బిక్కుబిక్కుమంటూ కూర్చున్నారు వరూధిని, రాజేశ్వరి ఆ యింట్లో.

మమతే అన్నీ చూసుకుంటున్నది.

ఆ మర్నాడు వాళ్ళు బుక్ చేసిన సామాను కొంత ట్రాన్స్‌పోర్టులో వచ్చింది.

మమత స్నేహితురాలు సుశీల కూడా వాళ్ళని పలకరించి కావాల్సిన ఏర్పాట్లు చేస్తోంది.

ఆ మధ్యాహ్నం రాజేశ్వరి కూతుర్ని నెమ్మదిగా అడిగింది.

"వరూ, ఇప్పుడిక్కడేం చేయాలని వచ్చావ్. హేమంత్‌కి కనబడకుండా ఎందుకిలా దాక్కోవాలని నిర్ణయించుకున్నావ్? నాకేమీ అర్థంకావడంలేదు" అంది బాధగా.

"నాకు సరిగ్గా ఏం చేయాలో తెలియదమ్మా. అందర్నుండీ తప్పించుకోవాలని మాత్రమే ఇక్కడికి వచ్చేసాను. కొన్నాళ్ళు నాకు మనశ్శాంతికావాలి. అలసిపోయానమ్మా" అంది వరూధిని.

"కనీసం హేమంత్ కన్నా చెప్పకూడదా?"

"కూడదు. ఆ రిలేషన్ అయిపోయింది."

రాజేశ్వరి కూతురి జవాబుకి అయోమయంగా చూసింది.

"మన వలన ఆ తండ్రీకొడుకులకి సమస్యలు సృష్టించడం నాకిష్టంలేదు. హేమంత్‌కి నేనెక్కడున్నదీ తెలిస్తే ఖచ్చితంగా ఇంకో పెళ్ళిచేసుకోడు. ఆ తండ్రి నన్ను చేసుకుంటే వూరుకోడు. దీనికి పరిష్కారం నేను కొన్నాళ్ళు అజ్ఞాతంలో వుండటమే. ఎన్నో రోజుల్నుండీ ఆలోచిస్తున్నాను చక్రవర్తి బెడద ఎలా వదిలించుకోవాలా? - అని."

"మరి ఇక హేమంత్‌ని పెళ్ళి చేసుకోవా?"

"అది జరగదు. నాకిప్పుడు కావాల్సింది కాస్త మనశ్శాంతి."

అప్పుడే అక్కడికొచ్చిన మమత "అవునాంటీ వరూకి ఒక్కపెళ్ళి లేదనేగానీ ఏం లోటు? చాలా తెలివైనది. మంచి జాబ్ వస్తుంది. సుశీలకి చెప్పాను. ఇక్కడ హాయిగా చిత్రని పెంచుకుని తన భవిష్యత్తు తీర్చిదిద్దడానికి కావల్సిన వెసులు బాటుంటుంది." అంది.

రాజేశ్వరి కన్నీళ్ళు తుడుచుకుంది.

"అమ్మా ఇక ఈ సంగతులాలోచించకుండా చిత్రని చూసుకో. మమత చెప్పినట్లుగా నేను జాబ్ చూసుకుంటాను. జరిగిందంతా ఇద్దరం మరచిపోదాం" అంది వరూధిని శాంతంగా.

రాజేశ్వరి నిట్టూరుస్తూ లోనికి వెళ్ళింది.

మమత చిన్నగా వరూధిని పక్కన కూర్చుంది.

"ఇంకో చిన్న పనిచేస్తేకానీ నీ సమస్య తీరదు వసూ!" అంది లాలనగా.

ఏమిటన్నట్లుగా చూసింది వరూధిని.

"నువ్వు కనిపించకపోతే హేమంత్ నిద్రాహారాలు మానేసి పిచ్చివాడవుతాడు. ఉద్యోగ బాధ్యతలు నిర్వహించలేడు. చివరికి ఒక తాగుబోతుగానో లేదా ఒకానొక దశలో ఆత్మహత్య.."

"మమతా!" భరించలేనట్లుగా అరచింది వరూధిని.

"చూశావా, మాటకే నువ్వు భరించలేకపోతున్నావ్. ఇక నిజంగా అతనలా అయితే నువ్వు సహించగలవా? అందుకే నా మాట విని అతని జీవితాన్ని సరిగ్గా వెళ్ళేలా చెయ్యి."

వరూధిని అర్థంకానట్లుగా చూసింది.

"అతనికో లెటర్రాయి"

"ఏమని?"

"ఇప్పుడేకాదు - ఎప్పటికీ నువ్వతనికి కనబడవని అతనికి తెలియాలి. అతను తిరిగి ఎవర్నన్నా పెళ్ళిచేసుకోవాలి. జీవితంలో స్థిరపడాలి. సంతోషంగా వుండాలి. నార్మల్ జీవితంలో పడాలి. నిజంగా నువ్వతన్ని ప్రేమిస్తే అతని శ్రేయస్సేకదా నువ్వు కోరుకునేది."

మమత మాటలామె హృదయాన్ని రంపంతో కోస్తున్నాయి.

"నాకు తెలుసు నీ బాధ. అర్థం చేసుకోగలను. ఆలోచించు" అంటూ అక్కణ్ణుంచి లేచి వెళ్ళిపోయింది మమత.

వరూధిని కళ్ళు అవిరామంగా వర్షిస్తుంటే అలానే కూర్చుండిపోయింది. అలా ఎంతసేపో..!!

**కాలింగ్‌బెల్ శబ్దం** విని తలుపు తెరచింది సుశీల.

ఎదురుగా మమత.

లోనికొస్తూనే సోఫాలో కూర్చుని "కాస్త కాఫీ యిస్తావా ఆంటీ! ఒకటే తలనొప్పి. ఆ తల్లీ కూతుళ్ళ ఏడుపు మొహాలు చూడలేక ఛస్తున్నా!" అంది నుదురు నొక్కుకుంటూ.

సుశీల లోనికెళ్ళి పదినిముషాల్లో కాఫీ తెచ్చి యిచ్చి ఎదురుగా కూర్చుంది.

"ఒకరి సంగతులు అడగటం భావ్యంకాదని అడగలేదు. చూస్తే బాగా బ్రతికినవాళ్ళలా ఉన్నారు. ఏమిటీ వాళ్ళకొచ్చిన సమస్య?" అంది సుశీల.

"మాయరోగం. తిన్నదరగని వేషాలు. ఒక పిల్ల తల్లి. ప్రేమా దోమా అంటూ ఎవడి వెంబడో పడింది. వాళ్ళ బాబొచ్చి నానా హంగామా చేసాడు. వీళ్ళ ఏడుపు చూడలేక నేనే యిక్కడికి తీసుకొచ్చాను" అంది మమత చిరాగ్గా మొహం పెట్టి.

"పోనీలే! మంచిపని చేసేవ్" అంది సుశీల సానుభూతిగా.

"ఏం మంచి పనో. ఇసుంటా రమ్మంటే ఇల్లంతా దేకేరకం. మళ్ళీ ఈవిడకి ఉద్యోగం చూడాలి. ఎంకి పెళ్ళి సుబ్బి చావుకొచ్చినట్లుంది" అంది మమత.

సుశీల నవ్వింది.

"సామెతలు బాగానే నేర్చావ్"

"అద్సరే ఆంటీ. కాస్త రాసుకోవాలి. నీ బెడ్‌రూమ్‌లో కూర్చోనా?"

"కూర్చో, దానికేం భాగ్యం" అంది సుశీల మమత తాగిన ఖాఫీ కప్పు తీసుకెళ్తూ.

మమత సుశీల బెడ్‌రూమ్‌లోకెళ్ళి కూర్చుని వరూధిని యిచ్చిన కవర్ విప్పి హేమంత్‌కి రాసిన ఉత్తరాన్ని దీక్షగా చదివింది.

ఆ వెంటనే ఆమె భ్రుకుటి ముడత పడింది.

ఆ ఉత్తరం చదివితే హేమంత్ ఛస్తే పెళ్ళి చేసుకోడు.

'ఏంటిలా రాసింది. తనేం చెప్పింది. అతనికి తనమీద అసహ్యం కలిగేలా రాయమంటే..'

వెంటనే ఆ ఉత్తరం పక్కకి పెట్టి తను మరో ఉత్తరం రాయడం మొదలు పెట్టింది.

**హేమంత్‌కి,**

నా కూతురి జోలికిక రాకు. అయిందేదో అయ్యింది. నీ తండ్రి చేసిన నిర్వాకానికి మా బతుకులు నట్టేట మునిగాయి. ఉన్న పరువు కాస్తా పోయింది. ఇంత దిక్కుమాలిన కుటుంబమా మీది? అలాంటి తండ్రికి పుట్టిన నువ్వెలాంటి వాడివి. చక్రవర్తి తిరిగొచ్చాడు. నా కూతురు అతనితోనే కాపురం చేస్తుంది. తిరిగి మమ్మల్ని కలవాలని ప్రయత్నిస్తే నేను చచ్చినంత ఒట్టు.

**ఇట్లు రాజేశ్వరి.**

రెండు ఉత్తరాలు టేబుల్ మీద పెట్టి "ఆంటీ కవర్లేమన్నా వున్నాయా?" అనడిగింది సుశీలని పిలుస్తూ.

"లేవు" అంది సుశీల.

"సరే, ఇప్పుడే వస్తాను" అంటూ వెళ్ళింది మమత.

సుశీల తలుపు బోల్టు వేసి తిన్నగా తన బెడ్‌రూములోకెళ్ళి ఆ ఉత్తరాల్ని చూసింది.

మొదట మమత రాజేశ్వరి పేరుతో హేమంత్‌కి రాసిన లెటర్ చదివింది.

చాలా ఆశ్చర్యమనిపించిందామెకు.

రాజేశ్వరి అంటే వరూధిని తల్లి. ఆమె పేరుతో మమత ఎందుకు లెటర్రాయడం.

అర్థం కాలేదామెకు.

వెంటనే రెండవ ఉత్తరం చేతిలోకి తీసుకుంది.

**హేమంత్!**

ఈ ఉత్తరం నాకెలా రాయాలో తెలియడంలేదు. నీకేం చెప్పాలో కూడా అర్థం కావడంలేదు. అంతా నా చేతుల్లో లేనట్లుగా జరిగిపోతున్నది. కొన్ని క్షణాలు.. చాలా కొద్ది క్షణాలు నా జీవితంలో దొరికిన అపురూప భాగ్యాన్ని దోచుకుపోతున్నాయి. ఒక పెద్ద అల అతికష్టమ్మీద ఒడ్డు చేరిన నన్ను సుడిగుండంలోకి లాక్కుపోతున్నది.

నా జీవిత సౌభాగ్యం మీద నాకెప్పుడూ నమ్మకంలేదు. లా ఆఫ్ ఎట్రాక్షనో ఏమోగాని చివరికి అదే జరుగుతున్నది.

నువ్వు నాకు స్నేహితుడిగా లభించినప్పుడు నాకు నీమీద ఎలాంటి దృష్టీలేదు. కాని.. రాను రాను నేను ఎన్నో జన్మలనుండీ ఎదురు చూసిన అపురూప భాగ్యం నువ్వేనని నమ్మాను. ఒక గొప్ప స్నేహితుణ్ణి పొందానని ఆనందపడ్డాను. ఇక ఎప్పుడూ నిన్ను పోగొట్టుకోకూడదని నీ చేతినందుకుని శేష జీవితం గడపాలని కలలు కన్నాను. భౌతికమయిన ఆనందాల కోసం నేను వెంపర్లాడలేదు. ఒక స్త్రీని ఎలా గౌరవించాలో - నైతిక విలువలకి నువ్వెంతగా ప్రాధాన్యత ఇస్తావో చూసి అబ్బురపడ్డాను.

చెప్పు! నిన్ను ప్రేమించడం తప్పా!? నువ్వు కావాలనుకోవడం తప్పా!? అన్ని అనుభూతులున్న మనిషినికానా..? నేను. కడుపు నిండిన వాళ్ళు చెప్పే ధర్మాలు చూసి నాకు నవ్వొస్తుంది. అసలు వాళ్ళకేం తెలుసు. జీవితాల గురించి. నీ స్నేహం దొరి కాక ఏటికెదురీది ఒడ్డున చేరినట్లయింది నాకు. కాని. ఎలా చెప్పను హేమ్! విధి మళ్ళీ దెబ్బతీసింది.

నా మనసు విస్ఫోటన చెంది వేలాది ముక్కలయి మాడి మసిబారి నేలరాలిపోతున్నది. నేనికలేను. కేవలం ఇప్పుడు నేను చిత్రకి అమ్మని మాత్రమే. నాకోసం వెదక్కు. మీ నాన్నగారు చెప్పిన అమ్మాయిని పెళ్ళిచేసుకో! ఇది మన జీవితంలో చిన్న కల. ఇంతకంటే చెప్పలేను.''

ఆ ఉత్తరం చదివి సుశీల కళ్ళు నీళ్ళతో మసకబారాయి.

అలానే స్థాణువులా వచ్చి సోఫాలో కూర్చుంది.

తన కూతురు లావణ్య గుర్తుకొచ్చింది.

ఒకర్ని ప్రేమించి ఆ పెళ్ళికి తను కాదన్నానని ఆత్మహత్య చేసుకున్న కూతురి కథ తిరిగి మనసుని కెలికింది.

సుశీల కళ్ళు ధారాపాతంగా వర్షించాయి.

కాలింగ్ బెల్ మోగింది.

కళ్ళు తుడుచుకుని తలుపు తెరిచింది.

ఎదురుగా మమత కవర్లు తీసుకుని. ''ఎక్కడా కవర్లు దొరకలేదు. బయటకెళ్ళి తెచ్చాను'' అంది నవ్వుతూ.

సుశీల నవ్వలేకపోయింది.

''ఒకసారిలా కూర్చో''

మమత సుశీల వైపు అర్థం కానట్లుగా చూసి కూర్చుంది.

చూడు మమతా " నువ్వు నాకన్నా చిన్నదానివైనా మనిద్దరం స్నేహితుల్లా కలిసిపోయాము." అదే చనువుతో చెపుతున్నాను.

"నువ్వు దేవుణ్ణి నమ్ముతావా?"

"ఊ" అంది మమత.

"దేవుడంటే గుడిలో విగ్రహం కాదు. మన ఆత్మే. అదెప్పుడూ మనకి నిజానిజాలు చెబుతూనే వుంటుంది. ఎటొచ్చీ దాన్ని మనం నొక్కేస్తాం" అంది సుశీల తిరిగి.

ఇదంతా ఎందుకు చెబుతుందో అర్థంకావడంలేదు మమతకి.

"నేను ఆ రెండు ఉత్తరాలూ చదివాను. నువ్వేం చేస్తున్నావో అర్థమయింది నాకు"

మమత గతుక్కుమన్నట్లుగా చూసింది.

"వరూధినిగాని, ఆమె తల్లిగాని నీకు హాని చేసారా?"

లేదన్నట్లుగా తలూపింది మమత.

"మరెందుకిలా చేస్తున్నావు? ఒకటి మాత్రం చెబుతున్నాను. నువ్వు చెడ్డదానివేం కాదు. ఏదో బలహీనత నిన్నిలా చేయిస్తున్నది. కారణం నీక్కూడా తెలియదు. మనం గుడికి వెళ్తాం. దేవుణ్ణి బోల్డు కోరికలు కోరతాం. అందరూ అలానే కోరుకుంటారని మరచిపోతాం. బయట కొచ్చి పక్కవాడు మాత్రం బాగోకూడదనుకుంటాం. నా సంగతే చూడు ఒక్కగానొక్క కూతురు. ప్రేమించిన వాడితో పెళ్ళి జరిపిస్తే ఏంబోతుంది. అహం అడ్డొచ్చింది. కాదన్నాను. ఆ కూతుర్ని పోగొట్టుకున్నాను. ఇప్పుడెంత ఏడిస్తే ఉపయోగం ఏవిటి? వాళ్ళు కాస్తో కూస్తో నీకు సహాయమే చేసారు. అటువంటి వాళ్ళకి తిరిగి సహాయం చేస్తే ఎంత బాగుంటుంది. ఆలోచించు!"

మమత తల దించుకుంది.

ఆమె కళ్ళలో నీళ్ళు నిండాయి.

"నాకు తెలుసు. నువ్వాలోచిస్తున్నావని. వద్దు మమ్మూ. ఆ అమ్మాయి రాసిన ఉత్తరాన్ని యధాతథంగా అతనికందజేయి. వీలయితే వెళ్ళి అతన్ని కలువు. దగ్గరుండి తీసుకురా. ఆ పెళ్ళి మన చేతుల మీదుగా చేద్దాం. ఒక మంచి పని చేస్తే ఎంత సంతోషం కలుగుతుందో స్వయంగా అనుభవించి చూడు."

మమత మాట్లాడలేదు.

"ఇవ్వడంలో వున్న ఆనందం గురించి నీకు తెలియదు. తెలిసాక నువ్వు నీ జీవితంలో ఎన్నడూ పొందని ఆనందం పొందుతావు. ఉంది అని ఎవ్వరూ ఇవ్వరు. ఇచ్చే గుణం వుంటేనే ఇస్తారు. ఇలా నీ కృతజ్ఞతని చాటుకో. మనిషి జన్మ ఎంతో అపురూపం అంటారు. దాన్ని అనుభవించు."

మమత వచ్చి ఒక్కసారిగా సుశీలని కౌగలించుకుంది. భుజమ్మీద తలాన్చింది. సుశీల భుజమ్మీద ఆమె కన్నీళ్ళ తడి అంటింది.

సుశీల మాట్లాడలేదు.

అయిదు నిముషాలనంతరం మమత తలెత్తి కళ్ళు తుడుచుకుంది.

"అవును ఆంటీ! వరూధిని నాకు చాలా సహాయపడింది. నన్నెన్నో విధాల ఆదుకుంది. నాకే దయ్యం పట్టిందో. తెలియదు. నువ్వు నా కళ్ళు తెలిపించావు. నేనిప్పుడే బయల్దేరి ఆ ఉత్తరం చూపించి హేమంత్‌ని తీసుకొస్తాను. వాళ్ళ పెళ్ళి మన చేతుల మీద జరిపిద్దాం. అబ్బ! ఇలా అనుకోగానే నాకెంత హాయిగా వుందో. ద్వేషం, అసూయ మనసుని ఎంత దహించి వేస్తాయో! నా మనసిప్పుడెంత

తేలికపడిందో తెలుసా! అప్పుడే వరూధినికి చెప్పను. హేమంత్‌ని తీసుకొచ్చి ఎదుట నిలబెట్టినప్పుడు ఆమె పొందే ఆనందాన్ని స్వయంగా చూడాలి" అంది మమత ఆనందంగా.

సుశీల మమతవైపు ప్రేమగా చూసింది.

"మన మనసులెప్పుడూ మందిరాలే. అందులో దేవుణ్ణి ప్రతిష్ఠించాలో దెయ్యాన్ని ప్రతిష్ఠించాలో మన చేతుల్లోనే వుంది. ఆ పని చెయ్యి. వాళ్ళ సంరక్షణ నేను చూసుకుంటాను" అంది.

"ఈ రోజే టిక్కెట్టు దొరికితే బయల్దేరతాను" అంది మమత ఒక రకమైన ఉద్వేగానికి లోనవుతూ.

సరోజని గుమ్మంలో కూర్చుంది.

సుందరం ఇంటిదగ్గర ఏదో హడావుడిగా వుంది.

వెళ్ళి ఏంటో కనుక్కోవాలనుంది గాని... ఆ ముసలి సచ్చినోడు నోటికేం వస్తే అది వాగుతాడు. మంచీ మర్యాదా లేదు. హేమంత్ నుండి ఏ కబురూ లేదు. చాలా దిగులుగా వుంది సరోజనికి.

అప్పుడే రామలక్ష్మి వచ్చింది గ్లాసు పట్టుకుని - సిగ్గుగా నవ్వుతూ.

"నీ సిగ్గు చివిడినట్లే వుందిగాని.. ఏంటే ఆ బక్కోడింటి ముందు హడావుడి" అనడిగింది సరోజని.

"అవునక్కా. హేమంత్ పెళ్ళంట. పెళ్ళో, నిశ్చితార్థమో అడుగుదామంటే.. ఆ రాజీ కూడా కనబడ్డంలేదు."

సరోజని గుండెల్లో బాంబు పడినట్లుగా ఉలిక్కిపడింది.

ఒక్కసారి రామలక్ష్మిని పట్టుకుని గట్టిగా కుదిపి "నువ్వు నిజమే చెబుతున్నావా తింగరిదానా?" అంది ఆవేశంగా.

"ఏమోనక్కా.. ఎవరో అంటే విని చెబుతున్నా" అంది భయంగా.

"ఆ ఏవంతు గాడొచ్చాడా?"

"చూళ్ళేదక్కా. వచ్చినట్లుగా లేడు" అంది నసుగుతూ.

సరోజనీని నీరసం ఆవహించింది.

రామలక్ష్మికి కావాల్సిన పంచదారిచ్చి అటూ యిటూ కాలుగాలిన పిల్లిలా కాస్సేపు తిరిగింది.

"ఇక లాభం లేదు. ఆ ముసిలోడితో ఎన్నోసార్లు తిట్లు తింది. అతని మాటలు తనకేం కొత్తవి కావు. ఇప్పుడు పౌరుషపడి ఇంట్లో కూర్చుంటే వాడి బతుకు బుగ్గవుతుంది. వెళ్ళి అసలేం జరుగుతుందో కనుక్కోవాలి" అనుకుని చీర చెరగులు సరిచేసుకుని సుందరం ఇంటికి బయల్దేరింది సరోజని.

గుమ్మంలో సరోజనీని చూడగానే వంకరగా పెట్టాడు సుందరం మొహాన్ని.

సుందరం అప్పటికే వంటవాళ్ళతో మాట్లాడుతున్నాడు.

"వచ్చావా? ఇంకా రాలేదేంటా అని చూస్తున్నా" అన్నాడు వెటకారంగా.

"ఇప్పుడేం ఖర్మ. ముప్పయ్యేళ్ళ నుండీ నీ కొంప చుట్టూ తిరుగుతూనే వున్నా. నువ్వు పిలవనంత మాత్రాన ఆగిపోయే రకాన్ని కాదునేను. ఇంతకీ ఏంటి హడావుడి బావా! షష్టిపూర్తిగాని చేసుకుంటున్నావా?" అనడిగింది సరోజని అమాయకంగా మొహం పెట్టి.

"అదొకటే తక్కువ. హేమంత్ పెళ్ళి" అన్నాడు గర్వంగా.

సరోజని గుండె గతుక్కుమంది. ఎక్కడలేని శక్తి తెచ్చుకుని "వాడొచ్చేడా?" అంది నీరసంగా.

"వస్తాడు అప్పుడే ఎందుకు. టైముకి తగలెడతాడులే!" అన్నాడు సుందరం నిర్లక్ష్యంగా.

"పెళ్ళికూతురెవరూ?" ఆశ చావక అడిగింది సరోజని.

రాజీ కాఫీగ్లాసు తెచ్చి ఒకటి తండ్రికిచ్చి ఇంకోటి సరోజని చేతిలో పెడుతూ "ఇంకెవరు, నాగినీయే" అంది చిన్నగా సరోజనితో.

సరోజని అనుకున్నదే కానీ నిజంగా అది నిజమని వినగానే గుండె గుభేలుమంది.

ఇక ఊరుకుంటే లాభం లేదనిపించింది మనసుకి.

ఎన్నోసార్లు వాళ్ళింటి విషయాల్లో తమ జోక్యం చేసుకుని తిట్లు తింది. వాళ్ళు తనవాళ్ళే అనుకుంది. తన శక్తికి మించి సహాయపడింది. ఇప్పుడు హేమంత్ పెళ్ళి విషయంలో 'నాకెందుకులే' అని ఉదాసీనత వహిస్తే వాడి జీవితమే బుగ్గిపాలవుతుంది. తనని తిట్టినా సరే మెడ పట్టుకుని గెంటినా సరే.

"బావా!"

"ఏంటి సంగతి?"

"ఈ పెళ్ళికి ఏవంతుగాడొప్పుకున్నాడా?"

సుందరం సరోజని వైపు సీరియస్‌గా చూశాడు.

"ఏంటి వాడొప్పుకునేది. ఇక్కడి వాడు బాబుని నేనింకా బతికేవున్నాను" అన్నాడు సుందరం ఉయ్యాలూగుతూ.

"అవును. ఆ సంగతి నిజమే. కానీ కాపురం చెయ్యాల్సినవాడు వాడు. ఒక మాట వాణ్ణడిగితే బాగుంటుందని"

"నీ బోడి సలహా మాకక్కర్లేదు. వాడు నా మాట జవదాటడు. అయినా మా నాగినీకేం తక్కువని"

"నువ్వడిగావనే నేను ఈ ముప్పయ్యేళ్ళనుండీ మీ యింటి చుట్టూ తిరిగి సలహాలివ్వడం లేదు. అక్క చచ్చిపోయినప్పుడే నాకీ యింటితో అక్కర తీరిందని తెలుసు. కాని... పిల్లలు వాళ్ళు.. నా పిల్లల్లా ప్రేమించాను. ఇప్పుడీ పెళ్ళి చేసి ఆడి బతుకు బండ చేయకు. నాగినీకి ఏం తక్కువని నేనడంలేదు. నిజానికి అన్నీ ఎక్కువే. ఆ ఎక్కువలు భరాయించే శక్తి ఆ ఏవంతుగాడికి లేదని చెబుతున్నా"

సుందరం ఈసారి సరోజనీని తేరిపార చూశాడు.

"అంటే?"

"ఇంతవరకొచ్చాక నీకు చెప్పకుండా దాయలేను. దాస్తే తప్పు చేసిందాన్నవుతాను. నన్ను తిట్టూ కొట్టూ పడతాను. ఈ పెళ్ళి మాత్రం ఆపు"

"ఎందుకనట"

"వాడో పిల్లని పేవించాడు. ఆ పిల్లలేకపోతే బతకలేడు. ఈ పెళ్ళి ఆడు చేసుకోడు. నా మాటిను."

"ఓహో! ఈ కథంతా నడిపిన గ్రంధసాంగివి నువ్వన్నమాట. నీకు చెప్పుకున్నాడా పాపం."

"అవును. చెప్పుకోడానికి ఆడికి తల్లేది?"

"తండ్రికూడా చచ్చేడనుకున్నాడా?"

"తండ్రిలాగ నువ్వెప్పుడన్నా ఆళ్ళని దగ్గరికి తీసుకుని మంచీ చెడ్డా మాట్లాడేవా? కష్టం సుఖం అడిగేవా? నోరిప్పితే నీ నోట్లోంచొచ్చేయన్నీ తప్పుడు మాటలే కదా! చనువుంది కాబట్టి నాకు చెప్పుకున్నాడు. దయచేసి ఈ విషయంలో నా మాటిను. ఆడికి నచ్చిన పిల్లతో ఆడి పెళ్ళి చెయ్యి. ఆ పిల్లకూడా చాలా మంచిది." అంది సరోజని బ్రతిమిలాడుతున్న ధోరణిలో.

సుందరం ఉయ్యాల్లోంచి చటుక్కున దిగి "ఆ పిల్లని కూడా చూశావన్నమాట" అన్నాడు కోపంగా.

"చూశాను బావా, మా యింటికొచ్చింది."

"దాని పిల్లని కూడా చూశావా మరి"

అతనెందుకంత వెటకారంగా మాట్లాడుతున్నాడో అర్థమై బాధనణచుకుని "ఆ పిల్ల ఖర్మకొద్దీ పెళ్ళయింది. పెళ్ళయింది కాబట్టి ఒక బిడ్డ పుట్టింది. వాడో త్రాష్టుడు. విడాకులయ్యింది. అంతమాత్రంచేత ఆ పిల్ల చెడిపోయిందా? ఆ పిల్లలోని సుగుణాలన్నీ చెడిపోయాయా? ముందు జీవితంలో ఇక సుఖపడకూడదా? చదువుకుని కూడ యిలా ఆలోచిస్తున్నావేంటి బావా నువ్వు?" అంది సరోజని వేదనగా.

"ఓహో! చాలా తెలుసే నీకు. ఇంకా ఏంటో అనుకున్నాను. నా కొడుకుని అమాయకుణ్ణి చేసి ఈ కథంతా నువ్వే నడిపేవన్నమాట. ఇంకా నయం. నాకా ఆకాశరామన్న ఉత్తరం రాబట్టి సరిపోయింది. లేకపోతే ఆ దరిద్రురాలు మా యింటికి చుట్టుకుంటే దాన్ని వదిలించడం కష్టమయ్యేది. అదింక నా కొడుకుని ఛస్తే చేసుకోదు. వెళ్ళు. ఈసారి సలహాలంటూ నా గడప తొక్కావో కాళ్ళిరగ్గొడతాను." అన్నాడు సుందరం రంకెలేస్తూ.

సరోజని అతని మాటలు విని నీరుకారిపోయింది.

"అంటే సుందరం వరూధిని దగ్గరకెళ్ళాడన్నమాట. ఇంకేముంది. ఆ పిల్ల యితన్ని చూసి హడలిపోయుంటుంది. దేవుడా ఆ హేమంత్‌ని నువ్వే రక్షించాలి" అనుకుంటూ వెను తిరిగింది సరోజని.

**చిత్రకి అన్నం** తినిపిస్తున్న రాజేశ్వరి చొరవగా లోనికొచ్చిన సుశీలని చూసి తొట్రుపడి "రండి" అంది తప్పదన్నట్లుగా.

సుశీల చనువుగా వచ్చి కూర్చుంటూ "బాగున్నారా? ఏవో పనుల్లో పడి మీ గురించి పట్టించుకోవడంలేదు. ఏమనుకోకండి" అంది చిరునవ్వుతో.

"అయ్యో ఇంతకన్నా ఏమి చేయాలి? అకస్మాత్తుగా వచ్చి పడ్డాం. అన్ని సదుపాయాలూ చేసారు" అంది రాజేశ్వరి చిరునవ్వు కొనితెచ్చుకుని.

నిజానికి లోలోపల ఆమె కుళ్ళిపోతున్నది. ఎన్ని ప్రయత్నాలు చేసినా ఎందుకని వరూధిని జీవితం చిగురించడం లేదో ఆమెకి అర్థంకావడంలేదు. బంగారంలాంటి కుర్రాడు మనసా వాచా ప్రేమించి పెళ్ళికి సిద్ధపడితే. ఎక్కణ్ణుంచో గద్దలా ఆమె సంతోషాన్ని ప్రతిసారీ ఎత్తుకుపోతున్న విధిని చూసి నివ్వెరపోతుందామె మనసు. ఆ పిల్ల ఇంత నష్టజాతకురాలా! పూర్వజన్మలో అంత పాపం చేసి పుట్టిందా! లేక క్షణక్షణం తనని క్రుంగదియ్యడానికే.. ఆమె జీవితమలా మోడు బారిపోతున్నదా?

"ఏమిటో ఆలోచిస్తున్నారు మీరు?" అంది సుశీల రాజేశ్వరిని గమనిస్తూ.

"అబ్బే, అదేం లేదు. కాఫీ తీసుకుంటారా?" అనడిగింది రాజేశ్వరి తొట్రుపాటుగా.

"మర్యాదలేం వద్దు. ఇంటి పక్కనే వుంటుంట. నేను వరూధిని కోసం వచ్చాను. ఇంతకీ ఏదీ తను?" అంది సుశీల.

"తలనొప్పిగా వుందని పడుకుంది" అని సర్దింది రాజేశ్వరి.

"పనిలేకుండా వుంటే అంతే. ఏదీ పిలవండి. తనతో పని వుండి వచ్చాను నేను" సుశీల చొరవగా.

రాజేశ్వరికిక తప్పలేదు.

"నిజమే పనిలో పడాలి తను. ఇలా బెంగతో చిక్కి శల్యమైతే రేపు చిత్ర గతేంటి?" అనుకుంటూ వరూధినీని లేపింది.

వరూధిని పడుకుంది కాని నిద్రెక్కడిది?

తన ప్రమేయం లేకుండా దొర్లిపోతున్న తన జీవితాన్ని చూసి ఆమె నివ్వెరపోతోంది.

హేమంత్ ఇక తనకి లేడనే నిజాన్ని భరించలేకపోతోంది.

పరిగెత్తుకెళ్ళి హేమంత్‌ని గాఢంగా కౌగిలించుకుని బావురుమనాలనిపిస్తుంది.

ఎవరికీ ఏ మాత్రం ఇబ్బంది లేని తమ మధ్యకి ఎందుకు ఇంతమంది వచ్చి నిప్పులు పోస్తున్నారు.

మనిషి ఆకారంలో ఇన్ని పిశాచాలుంటాయా? ఆలోచనల్ని తెంచుకుంటూ తల్లివైపు చూసింది ఏంటన్నట్లు.

"పక్కింటి సుశీలగారొచ్చారమ్మా, నీతో ఏంటో మాట్లాడాలట"

వరూధిని నొసలు చిట్లించి "నాతోనా?" అంది.

"అవునమ్మా.. రా! బాగోదు. మన అవసరాలన్నీ ఆమె చూస్తున్నారు కదా, ఒక్కసారి పలకరించు" అంది బ్రతిమాలుతున్న ధోరణిలో.

వరూధిని మెల్లిగా లేచి జుట్టు సరిచేసుకుని వచ్చి హాల్లో వున్న సుశీలకి నమస్కరించింది.

"రామ్మా రా! ఏంటంత నీరసంగా వున్నావ్, ఒంట్లోకాని బాగోలేదా?" అనడిగింది సుశీల ఆప్యాయంగా వరూధినీని పక్కన కూర్చోబెట్టుకుంటూ.

వరూధిని చిన్నగా నవ్వడానికి ప్రయత్నించింది.

"కొద్దిగా తలనొప్పి" అంది చిన్నగా.

"అన్నీ పోతాయి ఉద్యోగంలో చేరితే. నీ గురించి మమత అంతా చెప్పింది. ఎక్కడో ఎందుకు? ఎగ్మూర్‌లో మన కంపెనీయే ఉంది టెక్స్‌టైల్స్‌ది. దాన్ని చూసుకో. నీ ఉద్యోగానికి ఏపేరన్నా పెట్టుకో. పెత్తనమంతా నీదే లాభాలేం అక్కర్లేదు. నష్టాల్లేకుండా అందులో పనిచేసేవాళ్ళకి జీతాలివ్వగలిగితే చాలు." అంది సుశీల నవ్వుతూ.

ఆ మాట విని రాజేశ్వరి ఆశ్చర్యపోయింది.

వరూధిని కూడా తెల్లబోతూ చూసింది.

"ఏం మాట్లాడరూ? నచ్చలేదా? నచ్చకపోతే తర్వాత మరో జాబ్ వెదుక్కోవచ్చు. ప్రస్తుతానికి ఖాళీగా వుండకుండా!" అంది సుశీల తిరిగి.

"అదేంకాదాంటీ, నా క్వాలిఫికేషన్స్ అవీ తెలియకుండా మీరు ఇంతలా ఆఫర్ చేస్తుంటే ఆశ్చర్యంగా వుంది." అంది వరూధిని మొహమాటంగా.

"చదువుకున్న పిల్లవి. అంతో ఇంతో ఉద్యోగం చేసినదానివి. ఇది చాలు నాకు" అంది సుశీల.

"మీరంత భరోసా ఇస్తుంటే ఎందుకు కాదంటుంది. రేపే జాయినవుతుంది" అంది రాజేశ్వరి కంగారుగా ఎక్కడ వరూధిని కాదంటుందో అన్న భయంతో.

వరూధిని తల్లి ఆదుర్దా గమనించింది.

"సరే ఆంటీ" అంది నెమ్మదిగా.

"నా తల్లి. ఇప్పుడు నాకు నచ్చావ్. చూసే దిక్కులేక మూసేయాలనుకుంటున్నాను. ఇప్పుడే నీకు ఆర్డర్ చేతిలో పెడతాను. ఈ రోజు మంచిరోజు. ఒకసారి మా యింటికి రా!" అంది లేచి నిలబడి.

"ఇప్పుడా!" అంది ఆశ్చర్యంగా వరూధిని.

"ఇప్పుడే పక్క పోర్షన్‌లోకి రావడానికేవన్నా ముహూర్తం కావాలా?" అంది సుశీల నవ్వుతూ.

"వెళ్ళమ్మా. ఆంటీ దైవంలా మనకి సహాయపడుతున్నారు. ఇదంతా మమత చలవ" అంది రాజేశ్వరి సంతోషంగా.

సుశీల ఆమె వైపు జాలిగా చూసింది.

సుశీల వరూధిని చెయ్యిపట్టుకుని చొరవగా తన పోర్షన్‌లోకి తీసుకెళ్ళింది.

వరూధిని సోఫాలో కూర్చుని ఇల్లంతా కలయజూసింది. ఎటు చూసినా ఖరీదైన సామానుంది. కర్టెన్లు, ఫర్నీచర్, వాజులూ అన్నీ నోట్ల కట్టల్ని కక్కుతున్నట్లు. కానీ ఏంటో లోపం. వరూధినికి ఆ యింటి డెకరేషన్ ఉక్కిరిబిక్కిరిగా అనిపించింది.

సహజ సిద్ధమైన వెలుగులో ఒక పచ్చని మొక్క తలూపుతుంటే దానికన్నా సౌందర్యముంటుందా! అనుకుంది అంత బాధలోనూ.

సుశీల లోపలికెళ్ళి జ్యూస్ తీసుకొచ్చి యిచ్చి "నీతో మాట్లాడాలనే ఇలా తీసుకొచ్చాను" అంది పక్కన కూర్చుంటూ.

వరూధిని అర్థంకానట్లుగా చూసింది.

సుశీల వరూధిని చేతిమీద చెయ్యి వేసింది ఆప్యాయంగా.

"ఇంతకీ హేమంత్‌తో పెళ్ళి ఎందుకు వద్దన్నావ్?" ఆమె సూటి ప్రశ్నకి తెల్లబోయింది వరూధిని.

"నాకు తెలిసిందని కంగారుపడకు. నేను నీ రహస్యం తెలిసిందని నిన్ను అవమానించాలని అడగటంలేదు. వీలయితే నీ జీవితాన్ని చక్కబరచాలనే అడుగుతున్నాను."

వరూధిని తలదించుకుంది. దించుకున్న ఆ కళ్ళనుండి రెండు కన్నీటి చుక్కలు జారి సుశీల చేతిమీద పడ్డాయి.

"ఛీ! ఏడుస్తున్నావా? నీలాంటి పిల్ల ధైర్యంగా పోరాడి కావల్సింది సాధించుకోవాలిగానీ చేతకాని దానిలా ఇలా ఏడ్వకూడదు. ఒకసారా ఫోటోకేసి చూడు" అంది.

వరూధిని ఎదురుగా నిలువెత్తులో ఉండి దూకుతున్న జలపాతంలా హుషారుగా నవ్వులు చిందిస్తున్న ఒక పాతికేళ్ళ యువతి ఫోటోవైపు చూసింది.

"అది నా కూతురు. పేరు కావేరి. అదింట్లో వున్నా, వీధిలో వున్నా ఒక జలపాతమే. ఉధృతంగా ఉరుకుతూ ప్రవహించే నదే. తండ్రి లేకపోయినా దాన్నలా ఏడు మల్లెపూలెత్తుగా పెంచాను. పోస్టుగ్రాడ్యుయేషన్ చేస్తుండగా అది ప్రేమలో పడింది. నేనో పెద్ద సంబంధం చూసినప్పుడది బయటపెట్టింది. ఆ అబ్బాయిని చూశాను. నాకు నచ్చలేదు. అసలు కారణం అతనికి డబ్బులేకపోవడం. నచ్చలేదని చెప్పాను. 'నీకు నచ్చడమేంటి - నేనుకదా చేసుకునేది' అని ఎదురు తిరిగింది.

మరోసారి నా అహం దెబ్బతిన్నది. ఛస్తే ఈ పెళ్ళి జరగనివ్వనని గదిలో బంధించాను. అతన్ని రౌడీల చేత బెదిరించి ఊరునుండి పంపించేసాను. పెళ్ళి ఏర్పాట్లు చేసేస్తున్నాను. ఆ రోజు ఆఖరిసారిగా నా కాళ్ళమీద పడి ఏడ్చింది. 'అమ్మా అతను లేకపోతే బతకలేను' అంది. నాకు తలకెక్కలేదు. పెళ్ళయితే అదే సర్దుకుంటుందిలే అనుకున్నాను. అంతే! ఆ రాత్రి... ఇలా చివరికి ఫోటోలో మిగిలింది."

ఆఖరి మాట అంటున్నప్పుడు సుశీల కంఠం వణికింది. కన్నీళ్ళు జలజలా రాలాయి.

"ఆంటీ!" వరూధిని ఆమె చేతిని గట్టిగా పట్టుకుంది. ఆ కథ ఆమెని విచలితురాల్ని చేసింది.

సుశీల కళ్ళు తుడుచుకుని "నేను చేసిన తప్పుకి అది జీవితకాలపు శిక్ష వేసి వెళ్ళిపోయింది. ప్రతిక్షణం ఏడుస్తూనే వుంటుంది నా మనసు. అందుకే నీ కథ అలా ముగియకూడదనే నీతో చనువు లేకపోయినా నువ్వేమనుకుంటావో అన్న సందేహమున్నా జోక్యం చేసుకున్నాను."

వరూధిని తలదించుకుంది.

''అంతా అయిపోయిందాంటీ'' అంటూ.

''ఇంకా ఏమీ అయిపోలేదు. నా ప్రయత్నం నేను చేస్తున్నాను. అంతా మంచే జరుగుతుందని నా నమ్మకం.''

''ఎలా?.. ఎలా... మీకేం తెలుసు'' ఆశ్చర్యంగా అడిగింది వరూధిని.

''తెలుసుకున్నాను. ఇద్దరి మనుషుల్ని విడదీసినా పాపంలేదేమో కానీ.. రెండు కలిసిన మనసులకి ద్రోహం తలపెట్టకూడదు. దానంత పాపం మరొకటి లేదు. అందులోనూ సహాయపడుతున్నట్లుగా నటిస్తూ.''

సుశీల మాటలు వరూధినికి ఏ మాత్రం అర్థంకాలేదు.

''వద్దాంటీ, వదిలేయండి'' అంది నిదానంగా.

సుశీల వరూధిని వైపు నిశితంగా చూసింది.

''సరే! జరిగేదేంటో చూద్దాం. నువ్వు ముందయితే ఉద్యోగంలో చేరు. ప్రతి క్షణాన్ని పూర్తిగా బిజీగా గడుపు. కాలం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూద్దాం'' అంది.

వరూధిని తలూపింది సరేనన్నట్లుగా.

సుశీల లోపలికెళ్ళి ఒక ట్రేలో కొత్తచీరా, రవికల గుడ్డ పెట్టి దానిమీద ఎపాయింట్‌మెంట్ ఆర్డర్ పెట్టి తీసుకొచ్చి వరూధినికి బొట్టు పెట్టి యిచ్చింది.

ఇప్పుడివన్నీ ఎందుకంటూనే పెద్దావిడ మాటని గౌరవిస్తూ అందుకుంది వరూధిని.

సుశీల వరూధిని భుజం తట్టి ''నీకంతా మంచి జరుగుతుంది. ఇప్పుడన్నా నా కూతురు నన్ను క్షమిస్తుందేమో!'' అంటూ ఆమె తలనిమిరి నుదుటిమీద ముద్దుపెట్టుకుంది.

సరోజని ఇంట్లో కాలుగాలిన పిల్లిలా అటూ యిటూ తిరుగుతోంది.

గుండెలో దుఃఖం లుంగచుట్టుకుపోతోంది.

ఏంటిదంతా, ఇలా జరిగిపోతుందేంటి? ఆడేడి, ఎటు పోయాడు. ఇంత ముదనష్టం నా నెత్తికి చుట్టి.. అసలీళ్ళెవరూ? నేనెవరూ? నాకేంటింత బాధ? అనుకుంటుంటే పిచ్చెక్కిపోతోంది.

కర్ణాకర్ణిగా వినిపిస్తున్న మేళాలు.. చావు బాజాల్లా యినిపిస్తున్నాయి.

అప్పుడే లోపలికొచ్చింది రామలక్ష్మి - గ్లాసు లేకుండా.

''ఏవే, అప్పుడే డప్పులు వాయిస్తున్నారెందుకే - ఆడుగాని వచ్చేసాడా? పెళ్ళికొడుకుని చేస్తున్నారా?'' అంది గాభరాగా సరోజని.

''లేదక్కా! ఆడు కోర్టులో గెలిచాడంట. మేడ యీళ్ళకొచ్చేసిందంట. అదీ సంబడం'' అంది రామలక్ష్మి.

అయినా సరోజని తేరుకోలేదు.

చటుక్కున కళ్ళు తిరిగినట్లు నేలమీద కూలబడి గోడకి జేరబడింది.

''అక్కా!'' అంటూ చెయ్యిపట్టుకుంది రామలక్ష్మి ఆదుర్దాగా.

సరోజని వళ్ళు చల్లబడుతున్నది.

''ఏంటక్కా, పద డాక్టరు దగ్గరకెళ్దాం'' అంది గాభరాగా.

''నేనంత తొరగా సావనుగాని ఎల్లి ఇంత పంచదార ఉప్పు కలిపిన నీళ్ళట్టుకురా! కాస్త బి.పి తగ్గేడ్చినట్లుంది'' అంది సరోజని.

రామలక్ష్మి గబగబా వంటగదిలోకెళ్ళి చారెడు పంచదార, చిటికెడు ఉప్పు కలిపిన నీళ్ళు తెచ్చి సరోజని చేత తాగించింది.

పది నిముషాల్లో సరోజని కాస్త తేరుకుని సర్దుకుని కూర్చుంది.

"ఏవే నువ్వు గ్లాసులేకుండా వచ్చి నా కొంపకూల్చకే. చూడు మొదటిసారి నువ్వు అప్పుకి రాకుండా వచ్చి నా పేణానికి ముప్పు తెచ్చేవ్. నువ్వెప్పుడూ ఇలా రాబాకే" అంది సరోజని చిన్నగా నవ్వడానికి ప్రయత్నిస్తూ.

రామలక్ష్మి నవ్వలేదు.

"చాల్లే సంబడం. ముందు పద డాట్టరు దగ్గరికి." అంది చెయ్యిపట్టి గుంజుతూ.

సరోజని చెయ్యి విదిలించుకుంది.

"డాట్టరూ ఏట్టరూ కాదే ముందాడు రావాలి. అసలిదంతా ఏంటో తేలాలి. అంతవరకూ ఎవడూ నాకేం చెయ్యలేడు."

"నువ్వాళ్ళ కొంపకెల్లొచ్చావుగా, ఏం తెలీలేదా?"

"ఏంటో ఆ ముసిలోడు సచ్చిన కుక్కలా నీలుక్కుపోయాడు. గర్వంతో ఉయ్యాలూగుతుంటే సీకిట్టదేవరాయల్లా వున్నాననుకుంటాడు. ఎదవ. రెక్కల మీద సొక్కా ఎప్పుడూ నిలబడలేదు. ఉయ్యాల్లో కూర్చోబెట్టి ఊరేగిస్తున్న శవంలా వున్నాడు. ఈడికి మేడొకటే తక్కువ. దయ్యిరుడు" అని తిట్టింది సరోజని.

"సర్లె! అసలు సంగతి చెప్పు"

"ఏవుందే చెప్పడానికి. ఈడెల్లి ఆ పిల్లని బెదిరించి వచ్చినట్టున్నాడు. తర్వాత ఏం జరిగిందో తెలియటంలేదు. ఆడేమో నిమ్మకి నీరెత్తినట్లు కూర్చున్నాడక్కడ. ఒక ఫోనన్నా రాలేదు. పిచ్చెక్కిపోతున్నది నాకు" అంది సరోజని.

ఆ సాయంత్రం మునిమాపు వేళ దీపమన్నా వేసుకోకుండా అలానే కూర్చుంది సరోజని.

ఏదో అలికిడిగా అనిపిస్తే గుమ్మం వైపు చూసింది.

"ఆంటీ"

ఉలిక్కిపడి లేచి లైటు వేసి "నువ్వంట్రా ఏవంతూ నూరేళ్ళాయిషురా! రా!రా! నీ గురించే అనుకుంటున్నా" అంది.

హేమంత్ ఏమీ మాట్లాడలేదు.

వచ్చి సరోజని పక్కన నేలమీద కూర్చున్నాడు.

"ఏంట్రా, అంత తతంగం మీ కొంపలో జరిగిపోతుంటే నువ్వెక్కడో నిమ్మకి నీరెత్తినట్లు కూర్చున్నావా! నేనిక్కడ దిక్కుతోచక సచ్చిపోతున్నాననుకో"

హేమంత్ ఈసారీ ఏవీ మాట్లాడలేదు.

అకస్మాత్తుగా అతను సరోజని వడిలో తలపెట్టుకుని పడుకున్నాడు.

ఆ చర్యకి సరోజని ఆశ్చర్యపోయింది.

వాడు చిన్నతనం నుండి తనకు మాలిమే. అయినా ఎప్పుడూ... చివరికి తల్లి చనిపోయినప్పుడు కూడా... వాడు తన వడిలో తలదాచుకోలేదు. అనుకోకుండానే ఆమె చెయ్యి అతని తలనిమిరింది. ***మగవాడికి ఒంటరితనం ఆవహించినప్పుడు, నిస్పృహాయత వెంటానప్పుడు ఒక స్త్రీ ఒడి కావాలి. అది తల్లి కావచ్చు, ప్రియురాలిది కావచ్చు. ఆ క్షణం ఎవరయినా తల్లిగానే మారిపోతారు.***

అతని వెచ్చని కన్నీళ్ళు ఆమెని స్పృశించాయి.

ఆమె ఉలిక్కిపడి...."అరె, ఏంర్రా ఏడుస్తున్నావా?" అంది గాభరాగా.

"ఆంటీ.. వరూధిని కనిపించడం లేదాంటీ" అన్నాడతను వేదనగా.

ఆమె అతని తలని తోసేసి "ఏంర్రా నువ్వు చెబుతున్నది నిజవేనా..? అసలేం జరిగింది. ఆడుగానీ ఏవన్నా జేసేడా!" అంది కంగారుగా.

హేమంత్ లేచి కూర్చుని గోడకి జేరబడి "లేదాంటీ, అతనికీ ఏమీ తెలియదు. నేను హైదరాబాదు వెళ్ళి వాకబు చేసాను. ఇల్లు ఖాళీచేసి వెళ్ళిపోయింది" అన్నాడు వేదనగా.

"దేవుడా, నేననుకున్నంత అయ్యిందిరా. ఇదంతా నీ బాబు చేస్సాడ్రా. ఆ పిల్లని బెదిరించి వచ్చాడు. ఏవన్నాడో ఏవో ఆ పిల్ల ఎల్లిపోయింది. ఒక్క ఉత్తరవన్నా రాయలేదా? ఫోనన్నా చెయ్యలేదా?" అంటూ వాపోయింది సరోజని.

తల లేదన్నట్లుగా అడ్డంగా వూపాడు హేమంత్.

"అవునా ఎవరు నిప్పెట్టేరో తెలియదుగాని నీ బాబు ఎల్లింది మాత్రం నిజం. మరిప్పుడేం జేస్తావ్?" అంది వేదనగా సరోజని.

మాట్లాడలేదు హేమంత్.

"అసలయినా నువ్విప్పుడా వచ్చేది. అసలేం జరుగుతుందో తెలుసుకో నీకు" అంటూ గయ్యిన హేమంత్ మీదకి లేచింది సరోజని.

"ఏం చెయ్యనాంటీ, ఎంక్వయిరీ చేస్తూనే వున్నాను. సెలవు పెట్టి తెలుసుకుందామంటే ఆ నాగావళి పొంగింది. ఫ్లడ్ డామేజ్ పనులు ఎమర్జన్సీగా రాత్రింబగళ్ళూ చూడాల్సినవి. అందర్నీ ఆ పనికే తరలించాడు సి.ఎమ్. మా నాన్న వెళ్ళాడే అనుకో. నాకు చెప్పొచ్చుగా. నా మీద నమ్మకం లేదా? అలా ఎందుకు ఎడ్రస్ లేకుండా చెయ్యడం? నాకెంత పిచ్చెక్కిపోతుందో తెలుసా!"

"ఆ నాగావళెప్పుడూ నీళ్ళులేకుండా బీటలేసే వుంటది కదా! అది కూడా యిప్పుడే పొంగాలా? మజ్జెలో ఆ పిల్లనెందుకంటున్నావ్. ఆడదని లోకువా? అసలే వుద్దేశం లేని పిల్లని ముగ్గులోకి దించింది నువ్వు. నీ బాబేం కూసాడో? ఏం వాగాడో? లేకపోతే ఉన్నపాటున ఎల్లిపోయే రకవా? ఇంకెందుకు మరి. టింగురంగా అంటూ ఆ మెలికల పాముని కట్టుకుని నాట్యవాడు" అంది సరోజని కోపంగా.

హేమంత్ సరోజని వైపు కోపంగా చూశాడు.

అసలే పెద్దవైన అతని కళ్ళు జేగురు రంగు తిరిగి ఆమెని శపించే కోడెత్రాచు కళ్ళలా మారాయి.

"అదికాదురా! నాకు నిజంగా చెప్పలేనంత బాధగావుంది. ఎదవది ఎందుకు పెంచుకున్నానో మమకారం. నీ బతుకు బాగుండాలని ఆణ్ణి ఎప్పుడూ వదిలేయకమ్మా ఆడు పిచ్చోడయిపోతాడని ఆ పిల్లకి నువ్వు సూడకుండా చెప్పాను కూడా. అయినా ఇంతపని చేసిపోయింది. దానికింత కనికరం లేకుండా పోయిందే "అని ఏడ్చింది సరోజని.

హేమంత్ లేచి నిలబడి చివరికి అన్నాడు.

"సోనియ్ ఆంటీ, బ్లడీ లైఫ్. లెటెట్‌బి!" అంటూ జేబులోంచి సిగరెట్టు పెట్టె తీసి సిగరెట్టు వెలిగించాడు.

సరోజని తెల్లబోయి చూసిందతనివైపు.

హేమంత్ సరోజని ఫీలింగ్స్ గమనించే స్థితిలో లేడు. అతనొక దమ్ము పీల్చి లేచి నిలబడ్డాడు.

"ఏంర్రా మందుకూడా తాగుతున్నావా?"

"ఇక్కడికి తేలేదు"

అతని జవాబు విని ఇంకా ఆశ్చర్యపోయింది సరోజని.

"అవునా మీ మగాళ్ళకి కష్టాలు రాగానే మందు, సిగరెట్లు, ముండలు చాలామందే కనబడతా్రా! అవతలా పిల్లకూడా నీలాగే తాగుతుందేమో? ఎదవకానా! నా ఎదుటే సిగరెట్టు కాలుస్తావా?" అంటూ కోపంతో అతని నోట్లో సిగరెట్టు లాగెయ్యబోయింది.

హేమంత్ విసురుగా ఆమె చేతిని విసిరేసినట్లు తోసి ముందుకి నడవబోయాడు.

సరోజని ఉద్రేకంగా లాగి అతని చెంపమీద కొట్టింది. ఆ చర్యకి దిగ్భ్రమ చెందిన హేమంత్ ఆమె వైపు చూసి వెంటనే చూపు దించుకుని బయటకి నడిచాడు.

వాడు వాడెళ్ళిపోతున్నాడు... మళ్ళీ వస్తాడా!

పుట్టెడు దుఃఖంతో వాడొస్తే ఆదరించాల్సిందిపోయి ఎన్నడూ లేంది కొట్టింది. ఒక సిగరెట్టు కాలిస్తే కొంపంటుకుందా! అంటూ నేలమీద కూలబడి ఏడ్చింది సరోజని.

**ఆ రోజు ఆఫీసు** కారులో సుశీలతోపాటు ఆఫీసుకి బయల్దేరింది వరూధిని.

వరూధినికి లోలోపల ఆందోళనగా వుంది.

అసలేం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి.

ఎవరో తన ప్రమేయం లేకుండా ముందుకి తోసినట్లు వెళ్ళిపోతోంది జీవితం.

కావాల్సినవి జారిపోయాయి.

అనుకోనివే వస్తున్నాయి.

దేవుడు తన పీక నొక్కి పూర్తిగా చావకుండా మళ్ళీ మళ్ళీ వదిలేసి వినోదిస్తున్నట్లుగా వుంది.

కారు ఎగ్మూరులోని సుశీల కావేరి టెక్స్‌టైల్స్‌కి చేరుకుంది.

చాలా విశాలమైన ఆవరణలో వుందా ఫేక్టరీ. ఆవరణంతా పెద్ద పెద్ద చెట్లతో నీడలు పరచుకుని చల్లగా వుంది. చెట్లకి వదలలేని ప్రియురాళ్ళలా రకరకాల రంగులతో విరబూసిన బోగన్ విల్లాలు చెట్టుమానులో కలిసిపోయి అల్లుకుపోయాయి. నమ్మిన ఆడదానికి ఎప్పటికీ భరోసాగా వుంటానని మాట యిచ్చిన ప్రియుళ్ళలా చెట్లు నిటారుగా నిలబడి కొమ్మకొమ్మనా పూల రెమ్మల్ని మోస్తున్నాయి.

సుశీల కారు దిగింది - వరూధిని అనుసరించింది కొంచెం బెరకుగా.

ఇద్దరూ లోనికెళ్ళగానే ఒక నడివయసు స్త్రీ ఎదురొచ్చి సుశీలకి విష్ చేసి చిరునవ్వుతో వరూధిని వైపు చూసింది.

"మా కావేరి మళ్ళీ తిరిగొచ్చింది." అంటూ నవ్వింది సుశీల.

ఆమె వరూధిని వైపు చూసి "అవును. నాకూ అలానే అనిపిస్తున్నది మేడం" అంది.

"ఈమె ఈ రోజు నుండి నీ పర్సనల్ సెక్రటరి. ఈ ఫాక్టరి బాగోగుల్ని ఈమెకి తెలుసు. నీకన్నిటికీ చేదోడు వాదోడుగా వుంటుంది. ఇక్కడ హోదాలూ, భేషజాలూ అంటూ ఏమీలేవు. న్యాయపరమైన లాభసాటిగా వ్యాపారాన్ని నడిపిస్తే చాలా కుటుంబాలు ఇంత తిని హాయిగా బ్రతుకుతాయి. మన ఫ్యాక్టరీలో పనిచేసేవారు ఎక్కువ మంది స్త్రీలే. అందరూ భర్తలు అనారోగ్యంగా వుండి పనిచేయలేని వారి భార్యలో లేక దురలవాట్లతో చనిపోయిన వారి భార్యలో! - వీళ్ళందరూ కష్టపడి చెప్పినట్లుగానే పని చేస్తారు." అంది సుశీల.

ముగ్గురూ ముందుకి నడిచారు ఫాక్టరి అంతా చూస్తూ.

కొందరు బట్టల్ని రంగుల్లో ముంచి ఆరేస్తున్నారు.

మరికొందరు ఆరిన వాటిని ఇస్త్రీ చేస్తున్నారు.

ఇంకొందరు పొడవాటి బల్లల మీద రకరకాల డిజైన్లు ముద్రిస్తున్నారు.

"ఇవన్నీ నేత వస్త్రాలే వరూధినీ. కోరా రంగు నేత గుడ్డని కొని మనం వాటికి రకరకాల రూపుల్ని కలిపిస్తాం. నువ్వు కొంచెం ఇనోవేటివ్‌గా ఆలోచించి డిజైన్లు సెలక్టు చేసి చెబితే మనకి డిజైనర్ వున్నాడు అతను వాటిని తయారు చేస్తాడు" అంటూ చివరికి ఒక కేబిన్‌లోకి తీసుకెళ్ళింది సుశీల.

ఆధునికంగా తయారు చేసిన ఆ కేబిన్‌లో వరూధినిని ఎమ్.డి సీటులో కూర్చోబెట్టి "మళ్ళీ వెలుగొచ్చింది" అంది సంతోషంగా.

ముందే సిద్ధం చేసి పెట్టుకున్న ఫ్లవర్ బొకె వరూధినికి అందించింది, ప్రియంవదగా పిలవబడుతున్న పర్సనల్ సెక్రటరి.

"నువ్వంతా ఓపిగ్గా చెప్పు. తను తేలిగ్గానే అల్లుకుపోతుంది. తెలివైన పిల్ల" అని బయటకి వచ్చాక ప్రియంవదకి చెప్పి బయల్దేరింది సుశీల.

ప్రియంవద తిరిగొచ్చేటప్పటికే వరూధిని అక్కడున్న కొన్ని ఫైల్స్ తీసుకుని స్టడీ చేస్తూ ప్రియంవదని చూసి చిన్నగా నవ్వుతూ "ముందు ఆర్థికలావాదేవీలు తెలుసుకుంటే - మనం మరి ముందు ఇంకెంత మేరకు ఖర్చుపెంచుకోగలమో తెలుస్తుంది కదాండీ!?" అంది.

ప్రియంవద ఆ మాటకి సంతోషించింది.

"అవును మేడమ్" అంది నవ్వుతూ.

"నో మేడమ్. కాల్ మి ఏజ్ వరూధిని. నాకు నిజంగా పరిశ్రమల గురించి ఏమీ తెలియదు. మీరు నన్ను గైడ్ చేయండి. ఆర్థిక విషయాల గురించి ముందు నాకు వివరించండి. ఆ తర్వాత మన టెక్స్‌టైల్స్‌ని కొత్తపంథాలో ఎలా ముందుకి తీసుకెళ్ళాలో ఆలోచిద్దాం" అంది.

ముందు లోనికి చాలా బెరకుగా వచ్చిన వరూధిని సీట్లో కూర్చోగానే వెంటనే గంభీరంగా మారి కంపెని విషయాల్ని చర్చించడం అదీ ముందుగా డబ్బులు పెట్టుబడి, లాభనష్టాల గురించి మాట్లాడటం చాలా సంతోషాన్ని కల్గించింది ప్రియంవదకి.

ఆ సంగతే ఫోను చేసి సుశీలకి చెప్పింది.

సాయంత్రం ఇంటికెళ్ళి స్నానం చేసి రాజేశ్వరి పెట్టిన టిఫిన్ తిని చిత్రని ఎత్తుకుని ఆడిస్తున్న కూతురి ముఖకవళికల్ని గమనించసాగింది రాజేశ్వరి.

వరూధిని మొహం గంభీరంగానే వున్నా - నిన్నటి దైన్యం కనిపించలేదు రాజేశ్వరికి.

కాస్త ఊపిరి పీల్చుకుని - "ఎలా వుందమ్మా పని?" అనడిగింది.

"కొత్తకదమ్మా. కొద్దిగా స్టడీ చేయాలి. ఒక వారం పడుతుంది అర్థం కావడానికి" అంది జుట్టుపట్టి లాగుతున్న చిత్ర చేతుల్ని విడిపించుకుంటూ.

కాస్సేపటి తర్వాత "కాసేపు ఆంటీతో మాట్లాడాలి" అంటూ చిత్రని రాజేశ్వరికి అప్పగించి సుశీల దగ్గరకి వెళ్ళింది వరూధిని.

వరూధిన్ని చూడగానే సుశీల మొహం వికసించింది.

"నేనే వద్దామనుకున్నా. పగలూ రాత్రి బోర్ కొట్టిస్తున్నానేమోనని రాలేదు" అంది సుశీల నవ్వుతూ.

వరూధిని తాను గమనించిన విషయాల్ని క్లుప్తంగా ఆమెకు చెప్పి "డిజైనింగ్ చాలా మార్చాలి ఆంటీ!" అంది.

"అలాగే. జనానికి నచ్చేవేంటో గమనించి డిజైనింగ్ చేయించు" అంది.

బదులుగా వరూధిని నవ్వి "అలా కాదు ఆంటీ! మనం తయారు చేసే వాటిని జనం ఇష్టపడాలి" అంది.

"అంటే?" అంది సుశీల అర్థంకానట్లుగా.

"సినిమావాళ్ళు కూడా జనానికి నచ్చేవివే అంటూ తమ ఆలోచనల్నే పదేపదే రిపీట్ చేసి ఆ కళాఖండాల్ని మన నెత్తిన రుద్దుతుంటారు. అందుకని నవ్వొస్తుంది" అంది.

సుశీల వింటున్నది.

"ఎవరైనా ప్రేక్షకులు ఒక ముసలి హీరో అన్నీ అంటించుకుని కుర్రాడిలా రెండర్థాల పాటలు పాడి పడుచు పిల్లతో ఎగరడం యిష్టపడతారా? వాళ్ళు అలాంటి సినిమాలే పదే పదే తీస్తుంటే ఏం చేస్తారు. గతిలేక చూస్తారు. అలాగే కస్టమర్స్‌కి ఇవే ఇష్టం అని పదే పదే ఒకరకమైన డిజైన్స్ మనం ప్రవేశపెడితే ఛాయిస్ లేక కొనుక్కుంటారు. నేనీరోజు ఇతర కంపెనీల డిజైన్స్ కొన్ని తెప్పించుకుని చూసాను. కొంత భిన్నంగా చేద్దామని డిజైనర్‌కి చెప్పాను" అంది.

సుశీల మెచ్చుకోలుగా చూసింది.

"ప్రియంవద బాగా సహకరిస్తున్నారు. సరే వస్తానాంటీ!" అంటూ పైకి లేచి "రోజులో కాసేపు మీరు వస్తుండండి. అలా యజమాని రావడం వలన మాలో పనిపట్ల భయభక్తులు వుంటాయి." అని చెప్పి వెళ్ళిపోతున్న వరూధినిని మెచ్చుకోలుగా చూసింది సుశీల.

"ఈ మమత ఏమయినట్లు? చాలా నమ్మకంగా మాట్లాడిందే కొంపదీసి మళ్ళీ మోసం చేసిందా?' అని ఆలోచిస్తూ బెడ్‌రూమ్‌లోకి వెళ్ళింది సుశీల.

ఆ రాత్రి సరోజని భోంచేయలేదు.

నిద్ర అసలే లేదు.

నిక్షేపంలాంటి కుర్రాడు ఎందుకూ గాకుండా పోతున్నాడని భయంగా వుంది. చక్కటి పిల్లాడు. చదువూ సంస్కారం వున్నవాడు. ఇలా అయిపోతున్నాడేంటి?

ఈ నిర్భాగ్యపు ప్రేమని విషమని తెలియక అమృతమని తాగి జీవితాల్ని నాశనం చేసుకుంటున్నారే! ఇప్పుడెంత పనయ్యింది?

ఏ కట్లపామునో, తాచుపామునో - తాళికట్టి ఇద్దరి పిల్లల్ని కని బతుకు ఈడ్చేదానికి ఈ ప్రేమలూ సింగినాదాలూ ఎందుకూ?

రేపు దేవుడి దయవల్ల వాడొస్తే - వాణ్ణి వాస్తవ జీవితానికి తీసుకురావాలి. అసలు వాడొస్తాడా? ఎన్నడూ లేందీ కొట్టింది! అనుకుంటూ ఆలోచనల్తో సతమతమవుతూ ఏ తెల్లవారుఝామునకో పడుకుంది సరోజని.

మెలుకువొచ్చేసరికి ఎండ మొహాన పడి చుర్రుమనిపిస్తోంది. 'అయ్యో నా సిగ్గు చివడ. ఈ వేళప్పుడు దాక పడుకున్నానేంటి,' అనుకుంటూ ఆదరాబాదరా లేచి మొహం కడుక్కుని కాఫీగ్లాసు తెచ్చుకుని వీధిలో రాటకి జేరబడింది సరోజని.

అప్పుడే నాగిని, వాళ్ళమ్మ కలిసి ఇంటి ముందునుండీ వెళ్తూ కనిపించారు.

సరోజని మరోసారయితే ఏదో ఒకటని పలకరించేదే

ఇప్పుడసలు మనసు రాలేదు.

నాగినిని చూస్తే చీమలు పెట్టిన పుట్టలో పాములు జేరతాయన్న సామెత గుర్తొచ్చి మనస్సు కలుక్కుమంది.

"దేవళానికి పోయొస్తుము" అంది వాళ్ళమ్మ.

సరోజని నిస్సత్తువగా తలూపింది.

''పెండ్లి పెట్టికుంటిమి కదా!'' అందావిడ తిరిగి.

సరోజని అలానే సర్పద్రష్టలా చూస్తోంది.

''వాండు కూడ వచ్చినాడు'' అంటూ ముందుకి సాగిపోయారు. నిస్సహాయంగా లోపలికొచ్చి కుర్చీలో కూలబడి కళ్ళు మూసుకుంది.

ఆ కళ్ళనుండి రెండు కన్నీటి బిందువులు జారిపడ్డాయి.

ఒక్కసారి కాళ్ళమీద ఏదో స్పర్శ.

ఉలిక్కిపడి కళ్ళు తెరచింది సరోజని.

హేమంత్! కాళ్ళమీద తలపెట్టుకుని.

గబుక్కున హేమంత్‌ని లేవదేసి ''ఏంట్రా యిది?'' అంది కంగారుగా.

''క్షమించాంటీ, నిన్న నేనలా ప్రవర్తించి వుండకూడదు'' అన్నాడు గద్గదంగా.

''ప! నేనేవీ అనుకోలేదురా! నా చెయ్యికి బొల్లిరానూ! గబుక్కున కొట్టేసాను. దెయ్యం పట్టింది నాకు'' అంది బాధగా.

''లేదాంటి అమ్మ తర్వాత అమ్మవి. నువ్వు కొట్టేవనికాదు. నా ప్రమేయం లేకుండా అంతా జరిగిపోతోంది. ఎంత చెప్పినా వినడంలేదు. మాటాడితే ఉరేసుకుంటానంటున్నాడు. బెదిరిస్తున్నాడు. ఈ పెళ్ళి నేను చేసుకోలేనాంటీ. నువ్వన్నా నాన్నకి చెప్పవా?'' ఒక చిన్నపిల్లాడిలా అర్థించాడు హేమంత్ జాలిగా సరోజని కళ్ళలోకి చూస్తూ.

సరోజనికి ఏం మాట్లాడాలో పాలుబోలేదు.

''ఏంటాంటీ, నాకోసం ఒక్కసారి నాన్నతో...''

సరోజని ఆప్యాయంగా హేమంత్ తల నిమిరింది.

''పిచ్చి సన్నాసి. నువ్విలా నన్ను బతిమిలాడా లేంట్రా. అన్నీ అయ్యాయి. నన్ను తిట్టినా ఆఖరికి కొట్టినా పరవాలేదని ఎల్లి కాళ్ళట్టుకుని అడిగ్నేరా! ఆడు మడిసా! ఆడికి పిల్లలని పెళ్ళావని ఎప్పుడన్నా కనికరముందా! ఆడుకొంచెం కూడా మనసు మార్చుకోలేదు.''

హేమంత్ తలదించుకున్నాడు.

''సరే ఆంటీ! ఏం జరిగితే అది జరుగుతుంది. నేనీ పెళ్ళిమాత్రంచేసుకోను. ఛస్తే చావనీ!'' అంటూ పైకి లేచాడు.

సరోజని చటుక్కున హేమంత్ చెయ్యి పట్టుకుంది.

''ఒరేయ్! ఒక మాటడుగుతా, జవాబు చెబుతావా?''

ఏమిటన్నట్లుగా చూశాడు హేమంత్.

''నీకు..నీకు వరూదిని కనిపిస్తదని నమ్మకముందా?''

ఆ ప్రశ్నకి అయోమయంగా చూశాడు.

''పిచ్చిసన్నాసి. ఆ పిల్లని నీ బాబు బవుశా యిలాగే సస్తానని బెదిరించి వుంటాడు. అందుకే వున్నపాటుగా చేస్తున్న ఉద్యోగాన్నీ, సొంత కొంపనీ వదిలేసెళ్ళిపోయింది. బెదిరిపోయికాదురా! ఇసిగిపోయి. అంటే చాల గట్టిగా నిర్ణయించేసుకుందన్నమాట. ఇక వరూదిని నీకు తారసపడదు. ఒకేళ కనబడ్డా నిన్నిక చేసుకోదు'' అంది సరోజని.

''ఆంటీ!''

"అవున్రా! ఇది నూటికి నూరుపాళ్ళు నిజం"

హేమంత్ ఆమె మోకాళ్ళమీద తలపెట్టి పడుకున్నాడు ఆమె చీరకుచ్చిళ్ళ తడి ఆమెకు తెలుస్తోంది.

"నా మాటిని నాగినీని పెళ్ళిచేసుకో"

ఉలిక్కిపడి చూశాడు హేమంత్.

"అవున్రా! నేనే ఈ మాట చెబుతున్నాను. స్రుహలో వుండే మాట్లాడతన్నా. ఇది జీవితం. సినిమా కాదు బతుకు బుగ్గి చేసుకోటానికి. మిగతా బతుకు యిట్టం వున్నా లేకపోయినా లాగాలి. మీ మావ సస్తే నేను బతకటం లేదా! మీ యిద్దరికీ రాసిలేదు. నువ్వు నిదానంగా వుజ్జోగం చెయ్యాలి. నలుగురిలో మడిసిలా బతకాలి. తప్పదు. ఈ నాగిని కాకపోతే యింకో భోగిని. ఆడది - లేకుండా బతుకు నడవదు. కాగడానో కిర్సనాయిలు దీపమో కొంపలో పెట్టే దిక్కొకటి వుండాలి. ఇద్దరు నలుసులు పుడితే నీ బాజ్యతలు మారిపోతాయి. వచ్చిందొక కలనుకో. కాళీగున్నప్పుడు తల్చుకో. అంతే!" అంది సరోజని మనసు దిటవు చేసుకుని.

"నెవ్వర్ ఆంటీ!" అన్నాడు హేమంత్ ఉద్రేకంగా.

"ఆ పిచ్చివాగుడే వద్దు. నేను నికార్సయిన నిజాలు వడగట్టి చెబుతున్నా. అనుకున్నది జరగలేదని ఎత్తిపడెయ్యడానికి ఇది కుండకాదు. జీవితం. చెయ్యాల్సిన పనులు చాలా వుంటాయి. దేవుడు నీకేదో పెద్ద బాజ్యతే ఒప్పజెప్పుంటాడు. కాదనడానికి నువ్వెవరివి?"

"కాని..కాని.. ఇదెలా సాధ్యం ఆంటీ! నేను వరూని మరచిపోలేను" అన్నాడు హేమంత్ ఉద్వేగంగా.

'పిచ్చి సన్నాసీ! ఎవరు మరచిపొమ్మన్నారు. మీ అమ్మెళ్ళిపోయింది. మరచిపోయావా? ఇదీ అంతే!"

హేమంత్ మాట్లాడలేదు.

సరోజని హేమంత్ గడ్డం పట్టుకుని "నా మాటిను. కాలికి దెబ్బ తగిలిందని నడవడం మానలేం. జీవితమూ అంతేరా! కదిలిస్తే ఎందరి బతుకుల్లో ఎన్ని కతలుంటాయో! లే! నడక సాగించు."

"మరి.. మరి.. నాగినీకి ఇదంతా చెప్పనా?"

హేమంత్ కొంత దారికొస్తున్నందుకు సరోజని సంతోషించింది.

"పిచ్చి ఎదవా! ఇలాటియ్ సెప్పుకుంటార్రా! ఇక సీమ కుట్టినా నిన్ను అనుమానంగానే చూస్తది. ఆడబుద్ది నీకు తెలవదురా ఎదవా! ముందు బాగానే యింటారు అరికతలా! ఆనక నీ బతుకుంటది. వద్దు. ఇది నీ మనసులోనే సమాది చెయ్యి."

హేమంత్ లేచి నిలబడ్డాడు నిస్సత్తువగా.

"వస్తా ఆంటీ!" అన్నాడు.

అతనెళ్తుంటే గుండె పిండేసినట్లు చూసింది సరోజని.

తనేంటి.. ఇలా చెప్పేయగలిగింది. ఇంత కఠినత్వం ఎక్కణ్ణుంచొచ్చింది తనకి.

సరోజని కళ్ళు అవిరామంగా వర్షించసాగాయి.

అలానే కూలబడిపోయింది నిర్జీవంగా.

సన్నాయి మేళం వినిపిస్తోంది సన్నగా.

రామలక్ష్మి పరిగెత్తుకొచ్చింది గాభరాగా.

"అక్కా! అక్కా, ఏవంతుని పెళ్ళికొడుకుని చేస్తున్నారంట"

సరోజని పేలవంగా చూసింది రామలక్ష్మి వైపు.

"అక్కా మాట్లాడవేంటి? హేమంతు ఈ పెళ్ళికి ఒప్పేసుకున్నాడా?"

దానికీ జవాబు చెప్పలేదు సరోజని.

"ఒక్కసారెళ్ళి చూసిరా అక్కా!"

"వద్దే, నేనెళ్తే బాగోదు" అంది నిస్సత్తువగా. రామలక్ష్మి అర్థంకానట్లుగా చూసింది.

"ఆ కథ ముగిసిందే. మర్చిపో" అంది చివరికి చిన్నగా

రామలక్ష్మి విభ్రాంతురాలయిపోయింది - సరోజని వైపు నిర్ఘాంతపోయి చూస్తూ.

❧❧❧

**సరోజని ఏదో** చెప్పబోతుండగా దూరంగా వస్తున్న రాజీని గమనించింది రామలక్ష్మి.

"రాజీ వస్తున్నదక్క!" అంది గుసగుసగా.

"అత్తా" అంది వస్తూనే రాజీ సరోజని వైపు చూసి.

"నువ్వా రాజీ! రా!" అంది సరోజని చిన్నగా నవ్వడానికి ప్రయత్నిస్తూ.

"తమ్ముణ్ణి పెళ్ళికొడుకుని చేస్తున్నారక్కా" అంది రాజీ మెల్లిగా.

సరోజని మాట్లాడలేదు.

"నిన్ను పిలవలేదని ఏమీ అనుకోకు. నాన్న చాలా గట్టిగా చెప్పాడు నిన్ను పిలవడానికి వీల్లేదని" అంది రాజీ హీన స్వరాన.

సరోజని నవ్వింది. "పర్లేదు. ఇంకా నన్ను పిలవమన్నాడంటే ఆశ్చర్యపోవాలి. అయినే నేను రానే" అంది.

"తమ్ముడదోలా ఉన్నాడు. ఎవరితో మాట్లాడటంలేదు" అంది దిగులుగా.

సరోజని అలాగే చూస్తూ కూర్చుంది.

"అత్తా!"

"ఊ"

"ఆ అమ్మాయి... ఆ అమ్మాయి ఏవయ్యింది? తమ్ముడు ఈ పెళ్ళికి ఎందుకొప్పుకున్నాడు. నాకు చాలా దిగాలుగా ఉంది" అంది రాజీ బాధగా.

"నీ బాబునడగలేకపోయావా?"

సరోజని మాటకి తెల్లబోయినట్లుగా చూసింది రాజీ.

"అవునే. జవాబు చెప్పాల్సింది నీ బాబే! నేను కాదు"

"ఏమడుగుతాం అత్తా! మాట్లాడితే తాడొకటి తీసుకుని ఉరేసుకుంటానని బెదిరిస్తున్నాడు."

"అదేపని ఆ పిల్ల యింటికెళ్ళి చేసొచ్చాడు. ఆ పిల్ల అడ్రెస్ లేకుండా సొంత కొంపొదిలి ఎళ్ళిపోయింది. చేసుకోనీ! ఎవర్తో ఒకర్తి ఉండాలిగా జీవితం ఎళ్ళబోసుకోటానికి" అంది సరోజని నిర్లిప్తంగా.

"అత్తా.. నువ్వే ఇలా.."

"ఇంకెలా మాట్లాడానే. ఛీ! అన్నా ఛ అన్నా మీ కొంప పట్టుకుని ఏలాడాను. ఆడికి మంచి జరగాలని ఎంతో తాపత్రయపడ్డాను. కన్నతండ్రే కాటికి కట్టెలు పేరుస్తుంటే కాదనే వాడెవడే ఈ పాడులోకంలో యిలాంటోళ్ళు కూడా ఉంటారు" అంది సరోజని ఉక్రోషంగా.

రాజీ మాట్లాడలేకపోయింది.

"మరి తమ్ముడు...?"

సర్దుకుంటాడులే. అమ్మపోతే ఏవయ్యాడు. అంత ఉప్పెనొచ్చి ఊళ్ళూళ్ళూ పోతే తిరిగి బతికినోళ్ళు బట్టకట్టలే! అంతే.. ఎంతసేపూ మీ తమ్ముడే అంటున్నావు. అవతలా పిల్లేవయిందో మీరు ఆలోచిస్తున్నారా?"

సరోజని మాటలకి తలదించుకుంది రాజీ.

"అద్సరే! పెళ్ళి ఝామ్మని ఆ బంగళాలో చేస్తానన్నాడుగా. అక్కడేనా?" అంది సరోజని.

"లేదత్తా! అదంతా పాడుబడి వుంది. దానికి రంగులేయాలంటేనే లక్షలవుతుంది. దానికి తోడు తమ్ముడు అందులో అడుగుపెట్టనన్నాడు" అంది రాజీ.

"సరే ఎల్లు మరి. మళ్ళీ యిక్కడికి రావడం చూస్తే ఈరంగమాడ్తాడు" అంది సరోజని.

రాజీ తలుపి వెళ్ళిపోయింది.

"అక్కా నువ్వు నిజంగానే పెళ్ళికెళ్ళవా?" అని అడిగింది రామలక్ష్మి రాజీ వెళ్ళగానే సరోజనిని.

"ఏ మొహం పెట్టుకునెళ్ళి వాడి మొహం చూడాలే. అద్సరేగాని ఎల్లి రెండు జతల బట్టలు సర్దుకుని అన్నవరమెళ్తావని నీ మొగుడికి చెప్పిరా! ఇక్కడుంటే పిచ్చెక్కిపోతున్నది" అంది సరోజని.

రామలక్ష్మి విస్తుపోతూ చూసి "నువ్వు దేవుడి గుడికా?" అంది.

"దేవుడి కోసం కాదులేవే! అక్కడికి కాకపోతే ఇంకెక్కడికి వెళ్తాం మనం. కాస్త ఈ స్థలం నాల్రోజులొదిలేయకపోతే పిచ్చిబట్టేట్లు ఉంది. ఎల్లు. ఎల్లి నీ మొగుడి పర్మిషన్ తీసుకో!" అంది సరోజని.

"ఆయనేం కాదంటాళ్ళే అక్కా! నువ్వు రమ్మనడవే గగనం. ఇప్పుడే వస్తా" అంటూ రివ్వున పరిగెత్తింది రామలక్ష్మి.

"మాయదారి సంత. మొగుడు మాట పెళ్ళావినేసినట్లు - పెళ్ళాలకి మొగుళ్ళు అడలి సచ్చినట్లు.. అన్నీ డ్రామా కంపెనీలు.." అనుకుంది స్వగతంలా తనూ లేచి తయారవ్వడానికి సిద్ధపడుతూ సరోజని.

ఆఫీసు నుండి వస్తునే కొన్ని ఆటవస్తువులు చిత్రకోసం తెచ్చింది వరూధిని.

స్నానం చేసి వచ్చి కూతురితో ఆడుకుంటున్న వరూధినికి కాఫీ, టిఫిన్ యిచ్చి "ఇందాకనే సుశీలాంటీ ఆఫీసు నుండి వచ్చారు" అంది.

"అవునమ్మా. రోజూ కాస్సేపు ఆఫీసుకి రమ్మన్నాను నేనే. కాసేపనుకున్నావిడ రోజంతా వుండిపోయారు కొత్త డిజైన్లవీ చూస్తూ" అంది వరూధిని టిఫిన్ తింటూ.

"మరి యిద్దరూ కలిసి ఆవిడ కారులోనే రావొచ్చుకదా! " తల్లి సందేహానికి చిన్నగా నవ్వింది వరూధిని.

"అది పద్ధతి కాదమ్మా. ఆమె నాకెంత చనువిచ్చినా ఆమె ఆ కంపెని ఓనర్. నేను నా లిమిట్స్ దాటకూడదు. ఈ వారం రోజుల్లో నేను చాలా గమనించాను. కొంతమంది స్టాఫ్ ఆమె కనుసన్నల్లో పడాలని తెగ ఆమె చుట్టూ తిరగడం - ఆమెని సందర్భం లేకుండా పొగడటం ఆమె అడక్కపోయినా అవీ ఇవీ అందించడం చాలా వెగటుగా వుంది చూస్తుంటే. "

"అవును. అయినా అలాంటి వాళ్ళవే రోజులు కదమ్మా. ఎంత మేధావులు కూడా పొగడ్తలకే పడతారు. చాడీలనే రుచిగా వింటారు. ఎదుటవారికి ఎంతో విజ్ఞతతో చెప్పేవాళ్ళు కూడా వీటికి బోల్తాపడి మంచివారిని దూరం చేసుకుంటారు. ఏం చేస్తాం. నల్లగిరితో నారాయణా!" అంది రాజేశ్వరి.

"సుశీలాంటి తెలివైందమ్మా. ఆమె నా ఛాంబర్‌లో వీటి గురించి తనే ప్రస్తావించారు. నాకు పని ముఖ్యం. వారిలో క్రమశిక్షణ ముఖ్యం. ఒకామె నా చుట్టూ ప్రదిక్షణలు చేస్తూ పాదాలమీద ఉండేది. ఎప్పుడు చూసినా చాడీలే. నేను ఆమె స్వంతంలా అందరికీ చెప్పుకునేది. వెంటనే తీసేసాను" అని చెప్పారు. నేను నాకిచ్చిన వెహికల్లోనే వచ్చాను. ఎవరి స్థానంలో వాళ్ళుంటేనే విలువ" అంది వరూధిని.

రాజేశ్వరి కూతురివైపు అభినందనగా చూసింది.

ఈ పదిరోజుల్లో ఎంతో ఎదిగిపోయినట్లుగా అనిపించింది.

కొంతలో కొంత హేమంత్‌ని మరిచి మనిషిలా బ్రతకగలదని ఆశకలిగిందా తల్లిలో.

కాని... అందుకు విరుద్ధంగా వరూధిని రాత్రి వేళ చాలాసేపు మెలుకువగా వుంటుంది ఆలోచనలతో. వాటినిండా హేమంతే.

తనకి - అతనికి ఏదైనా మనస్పర్థ వచ్చి విడిపోతే అది వేరు.

కోపంతో దూరం కావచ్చు.

కానీ.. ఇది అది కాదే.

ఎవరో తమని బలి తీసుకున్నారు.

హేమంత్ అందరిలాంటి మగవాడు కాదు. పూటకో వేషం వేసే అల్పుడు కాదు. తమ స్నేహం కొద్దిరోజులే కావొచ్చు. వాటి మధ్య నిజాయితీ వుంది. ఒకరిపట్ల ఒకరికి నమ్మకమూ, బాధ్యత వుంది. పరస్పర అవగాహన - పంచుకోవడం వుంది. వీటన్నిటి మధ్యా ఇరుక్కున్న తమ హృదయాలున్నాయి.

ఇదేవిటి.. ఇంత బలమైన బంధం... ఒక్క క్షణలో ఇలా తెగిపోయిందేమిటి? ఇంత దూరాన్ని పెంచేసిందేమిటి?

అర్థంకాని బాధతో ఆమె హృదయం మెలిపెట్టినట్లవుతుంది. కన్నీరు తలగడలో ఇంకిపోతుంది.

ఎప్పటికో నిద్ర.

తెల్లవారుతూనే పరుగు.

అప్పుడే పండుగలూ పబ్బాలూ లేకపోవడంతో సత్రంలో గది తేలిగ్గానే దొరికింది సరోజనికి రామలక్ష్మికి.

ఇద్దరూ స్నానం చేసి ఒకసారి గుళ్ళో కెళ్ళొచ్చారు.

రామలక్ష్మి దేవుణ్ణి చూసి అదేపనిగా లెంపలు వాయించుకుంటుంటే "నాకు తెలియదుకాని అన్ని తప్పులు చేసేవేంటే?" అంది సరోజని నవ్వుతూ.

"ఊరుకో అక్కా... ఏదో ఒకటి తెలియక చేస్తాం కదా!" అంది రామలక్ష్మి.

"తెలియకేంలే. తెలిసే చేసేవ్. ఇప్పటికెన్నిగ్లాసుల పంచదార అప్పే నాకు? అదంతా చెప్పాయనకి" అంది సరోజని.

"పో అక్కా... నువ్వు మరీనీ!" అంది రామలక్ష్మి.

గుళ్ళోంచి బయటకొచ్చాక ఆ చుట్టూ పరిసరాలు పై నుండే చూసారు. ఆ కొండలు.. నది.. పచ్చదనం.. మనోహరంగా ఉందా ప్రాంతం.

ఏది చూస్తున్నా ఏం చేస్తున్నా కడుపులో ఏదో ఏసిడ్ తాగినట్లు గాభరాగానే వుంది సరోజనికి.

"పెళ్ళయిపోయి వుంటుందా? వాడిక నాగిని సొత్తయిపోయుంటాడా! ఆడి బతుకు మలుపు తిరిగిపోయిందా?" ఏదో వేదనతో కొట్టుకుపోతుందామె మనసు.

మూడురోజులూ మూడు యుగాల్లా గడిచిపోయాయి. వ్రతం చేద్దామన్నా ఒప్పుకోలేదు సరోజని.

"ఏం గనకార్యం జరిగిందని వ్రతాలు, నోములూ చెయ్యాలే. ఇంతింత కళ్ళెట్టుకు చూసేది అన్యాయాల్ని చూడమనా! ఏం దేవుళ్ళో. పద. పద" అంటూ లేవదీసింది సరోజని.

ఇద్దరూ.. తిరుగు ప్రయాణమయ్యారు చివరికి.

సుశీల వరూధినీని ఆఫీసుకెళ్ళనిచ్చి రాజేశ్వరి దగ్గరికి వచ్చింది.

రాజేశ్వరి ఆమెని ఆహ్వానించి కూర్చోపెట్టింది.

"మీ దయవల్ల నా కూతురిప్పుడిప్పుడే మనుషుల్లో పడుతున్నది. మీ మేలు మరచిపోలేను." అంది రాజేశ్వరి సుశీల చేతులు పట్టుకుని కన్నీళ్ళతో.

"అయ్యో, అంత మాటనకండి. నిజానికి నేనే వరూధినికి ఋణపడి ఉన్నాను." అంది సుశీల గద్గదస్వరంతో.

రాజేశ్వరి ఆవిడ వైపు ఆశ్చర్యంగా చూసింది.

"అవునండి. వరూధిని చాలా తెలివితేటలుగా నన్ను బిజీ చేసింది. ఇదివరకు ఇరవైనాలుగ్గంటలు నా కూతురి మరణం తలుచుకుని కుమిలిపోతుండేదాన్ని. ఇప్పుడు నన్ను ఆఫీసుకి రమ్మని కండిషన్ పెట్టింది. నాకుతెలియకుండానే నేనిప్పుడు ఫాక్టరీ బాగోగులు చూసే పనిలో పడ్డాను. అక్కడ వ్యవహారాలన్నీ అర్థమవుతున్నాయి. ఎంతోమంది నిర్భాగ్యులకి ఉపాధి కల్పిస్తున్నానన్న నమ్మకం ఏర్పడింది. అది నాకు చాలా సంతృప్తినిస్తోంది" అంది సుశీల.

"నిజంగా చాలా సంతోషమండి" అంది రాజేశ్వరి.

"వరూధిని చాలా తెలివైన పిల్ల. ఆ అమ్మాయికి అడ్మినిస్ట్రేటివ్ చాలా ఉంది. అందరూ తన అదుపులో కొచ్చేసారప్పుడే కాని.." అంటూ ఆగిందామె.

రాజేశ్వరి ఆందోళనగా చూసిందామె వైపు.

"ఇంత తెలివైన పిల్ల మమతనెలా నమ్మిందో?"

రాజేశ్వరి అర్థంకానట్లుగా చూసింది.

"మీ అమ్మాయి జీవితమిలా కావడానికి కారణం మమత. మీకా సంగతి తెలుసా? మమతే హేమంత్ తండ్రికి ఈ విషయం తెలియజేసి మీ ఇంటికి రప్పించింది. వాళ్ళిద్దర్నీ అకారణంగా నిర్దాక్షిణ్యంగా విడదీసింది. హేమంత్‌కి మీరిక కనబడకూడదని భయపెట్టి ఇక్కడికి తీసుకొచ్చేసింది."

సుశీల మాటలకి తెల్లబోయింది రాజేశ్వరి.

"అవును. నేను రెడ్ హేండెడ్‌గా పట్టుకుని నిలేసేసరికి నిజం ఒప్పుకుని ఏడ్చింది. అన్నం పెట్టిన చేతిని ఎలా కొరికేవ్, నీకు పుట్టగతులుంటాయా అని కేకలేసేసరికి భయపడి అంతా చెప్పేసింది. వెళ్ళి అంతా చెప్పి హేమంత్ ని తీసుకొస్తానంది. ఇప్పటివరకు అయిపులేదు. అసలెళ్ళిందో లేదో?" అంది సుశీల.

రాజేశ్వరి తేరుకోలేకపోయిందా సంగతులు విని.

"ఆ అమ్మాయికి ఆ బుద్ధి ఎందుకు పుట్టిందో.. చాలా విషయాల్లో ఆమెని ఆదుకున్నాం" అంది హీనస్వరాన కన్నీళ్ళతో రాజేశ్వరి.

సుశీల గాఢంగా నిట్టూర్చింది.

"హు! పెట్టిన చేతినే కదా. ఎవరైనా కొరకగలరు. అంతా మరచిపొండి. చూద్దాం. దేవుడు ఆడే నాటకం ఏ మలుపులు తిరుగుతుందో. ఈ సంగతులేమీ వరూధినికి చెప్పకండి. అంతా కెలికినట్లవుతుంది. ఇప్పుడిప్పుడే తను మనుషుల్లో పడుతున్నది" అంటూ బయల్దేరింది సుశీల.

వెళ్తున్న ఆమె వైపే నిస్తేజంగా చూస్తూ కూర్చుండిపోయింది రాజేశ్వరి.

సరోజని గుండెలరచేత్తో పట్టుకుని ఆటో దిగింది. దిగుతూనే "ఒసే రామలక్ష్మి. ఇప్పుడే దిగగానే ఏం గోల అనుకోపోతే... కొంచెం ఆ సుందరం పీనుగ చూడకుండా రాజీని పిలుస్తావా!?" అంది.

"అయ్యో, అదేం భాగ్గవక్కా! నాక్కూడా హేమంత్ మీదే వుంది మనసు. ఇంటికెళ్ళి ఈ బాగ్ పడేసి వెళ్తా" అంటూ వెళ్ళిపోయింది రామలక్ష్మి.

సరోజని గబగబా స్నానం చేసి ఇంత కాఫీ కలుపుకుని రాజీ కోసం ఎదురు చూస్తూ కూర్చుంది.

మరో అరగంటలో రాజీ, రామలక్ష్మి కలసి వచ్చారు.

"పెళ్ళయిపోయిందా?" అనడగలేక గుండె పట్టేస్తోంది సరోజనికి.

"దావే కూర్చో" అంది. సరోజని హీనస్వరాన.

రామలక్ష్మి "నేనొస్తానక్కా. ఇంట్లో ఎక్కడివక్కడే పడివున్నాయ్" అంటూ వెళ్ళిపోయింది.

సరోజని చిన్నగా రాజీవేపు చూసింది.

రాజీ గోడకి చేరబడి చేతిలో గీతలు గీసుకుంటూ మౌనంగా కూర్చుంది.

"ఏవే, నీ బాబు లేడా?" అనడిగింది.

"ఇంకా ఆ బిల్డింగ్‌కి తగలెట్టింది కట్టుకోవాలిగా లాయర్లకి. వసుంధరత్తతో కేరళ వెళ్ళాడు రాత్రే." అంది రాజేశ్వరి.

"మరి నాగిని...?"

"తనూ వెళ్ళింది.."

గుండె పట్టేసినట్లుంది సరోజనికి.

"మరీ.. వాడు..?"

"తమ్ముడా.. తమ్ముడు శ్రీకాకుళం వెళ్ళిపోయాడు. ఉన్న ఈ నాలుగురోజులూ ఒకటే ఫోన్లు - ఆఫీసునుండి. అర్జెంటు పనులట. సి.ఎమ్ టూరట"

ఇద్దరి మాటలూ గుంభనంగా సాగిపోతున్నాయి.

అసలు విషయం తెలియక ప్రాణం కొట్టుకుంటున్నది సరోజనికి.

అలాగే కూర్చుంది. అడిగితే ఏం వినాల్సి వస్తుందో అని!

"ఉండత్తా. నీకు కనీసం పెళ్ళి స్వీట్స్‌అన్నా పెడతాను. పెళ్ళి భోజనం ఎలాగూ తినలేదు నువ్వు"

అంతే!

తెలిసిన విషయమన్నా తలలో వెయ్యి విస్ఫోటనాలు జరిగినట్లయింది సరోజనికి. అలాగే నిస్సత్తువుగా కుర్చీలో జేరబడిపోయింది కన్నీళ్ళతో.

కాలం యాంత్రికంగా ముందుకి సాగిపోతోంది.

కనకారావు చనిపోయినప్పుడు కూడా ఇంతస్తబ్దత అనుభవించెరగదు తను.

హేమంత్ జీవితమింత విషాదం కావడం భరించలేక పోతోంది సరోజని.

ఒంటరితనం ఇప్పుడు బాగా తినేస్తోంది.

అప్పుడే ఒక ఆటో గుమ్మం దగ్గరగా ఆగింది.

అటుకేసి చూసింది సరోజని నిర్లిప్తంగా.

ఆటో డ్రైవరు దిగొచ్చి "ఇక్కడ సుందరంగారిల్లంట ఎక్కడో తెలుసా?" అనడిగాడు.

"వాడి బొంద మీద" అంది సరోజని అక్కసుగా.

డ్రైవరు బుర్రగోక్కుంటూ ఆటోలోకి చూశాడు.

"హేమంత్ అని అడుగు పోనీ"

ఆడగొంతు విని ఆసక్తిగా చూసింది సరోజని.

అందులో స్త్రీమూర్తి చిన్నగా నవ్వి ఆయనతో అర్జెంటు పని హైదరాబాదునుండొచ్చాను" అంది.

వెంటనే ఏదో స్ఫురించినట్లయి బయటకొచ్చి "ఇక్కడే దిగండి" అంది.

ఆవిడ మెల్లిగా ఆటో దిగింది. బాగ్ డ్రైవరు తెచ్చి వరండాలో పెట్టాడు.

సరోజని ఆమెని ఎగాదిగా చూసింది.

ఆమె కుడి చెయ్యి ముంజేతికి పెద్ద బాండేజ్ వుంది. మొహం నిండా ఎర్రబడ్డ గాయాలున్నాయి. ఆమె కుంటుకుంటూ వచ్చి "నా పేరు మమత. హేమంత్‌తో అర్జెంటుగా మాట్లాడాలి" అంది.

"లోపలికి రా ముందు" అంది సరోజని ఆమెని అనుమానంగా చూస్తూ.

మమత లోపలికొచ్చి కూర్చుంది.

సరోజని ఆమెకి మంచినీళ్ళిచ్చి "ఆడు మావోడే! ఇంతకీ ఏంటిపని?" అంది.

"నేను వరూధిని తరఫున వచ్చాను.

వరూధిని సంగతొకటి హేమంత్ గారికి చెప్పాలని.

పదిరోజుల క్రితమే రావాల్సింది. దారిలో బస్ ఏక్సిడెంటయింది. స్పృహలేదు. ఆస్పత్రిలో పడేసారు. ఈ ముంజెయ్యి పోయింది. వెంటనే దొరకలేదు. అందుకే.. " అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకుంది మమత తలదించుకుని.

ఏదో అర్థమయీ అర్థమవుతున్నట్లుంది సరోజనికి.

దిగ్భ్రమగా చూసింది మమతవైపు.

***

**సరోజని** మౌనంగా లేచి మంచి నీళ్ళు, కాఫీ రెండూ తెచ్చి ముందు పెట్టింది.

"తాగు దూరం నుండొచ్చినట్లున్నావ్" అంది మెల్లిగా.

మమత ఎడం చేత్తో వణుకుతున్న చేత్తో కప్పందుకుని కాఫీ తాగింది.

కప్పు క్రిందపెడుతూ "హేమంత్‌గారు లేరా?" అంది మెల్లిగా.

"లేడుగాని సంగతేంటో చెప్పు. ఆడికి చెప్పినా నాకు చెప్పినా ఒకటే" అంది సరోజని మమతని అనుమానంగా చూస్తూ.

"అంటే.. అది..."

"ఇదిగో అమ్మాయ్, నువ్వట్టే సణక్కు. ఆడికి జెప్పినా ఆడు తిరిగి నాకే చెబుతాడు" అంది సరోజని హెచ్చరిస్తున్నట్లుగా.

మమత మౌనంగా కూర్చుంది.

సరోజని ఆమెని అసహనంగానూ, అనుమానంగానూ చూసింది.

"నువ్వు వరూధిని దగ్గర్నుండొచ్చేవా?"

ఆ మాటకి స్సరున తలెత్తి చూసింది మమత.

"మీకు.. మీకు వరూధిని తెలుసా?"

"తెలుసు. వరూధిని ఇప్పుడెక్కడుంది? ఎలావుంది?" అనడిగింది సరోజని ఆత్రంగా.

"బాగానే వుంది. మద్రాసులో" అంది మమత నసుగుతూ.

"అవునా! అసలక్కడికెందుకెళ్ళింది? ఏవంతుకెందుకు చెప్పలేదు. అసలేం జరిగింది సరిగ్గా చెప్పు" అంటూ కంగారుగా అడిగింది సరోజని.

"ఎలా చెప్పాలో నాకర్థంకావడం లేదాంటీ, దీనికంతటికీ కారణం నేను. నన్ను నరికినా పాపం లేదు" అంది మమత కన్నీళ్ళతో.

"నిన్ను నరకాలో - చిత్రికపట్టాలో తర్వాత. ముందు జరిగింది చెప్పు. నాకు కాళ్ళల్లో వణుకొస్తుంది" అంది గాభరాగా సరోజని.

మమత మెల్లిగా జరిగిన కథంతా చెప్పుకొచ్చింది.

వింటున్న సరోజని క్షణక్షణం ఉద్రేకంతో ఊగిపోయింది.

బి.పి పెరిగి 'దేవుడా!' అంటూ గోడకి జేరబడి కళ్ళు మూసుకుంది ఆమె కళ్ళు వరద గోదావరులయ్యాయి.

మమత నిశ్చేష్టగా ఆమెని చూస్తూ కూర్చుంది.

"తప్పే చేసాను. క్షమించండి. ముందు హేమంత్‌గారికి ఈ విషయం తెలియజేసి ఆయన్ని తీసుకెళ్ళడానికొచ్చాను."

సరోజని చప్పున కళ్ళు తెరిచింది. "ఎక్కడికి తీసుకెళ్తావ్ ఏట్లోకి. జరగాల్సిన అనర్థమంతా జరిగేపోయింది. నీకింత పాడుబుద్ధి ఎందుకు పుట్టిందే ఆ పిల్ల సొమ్ముతిని - చేసిన మేలు మరచి ఇంత నీచానికి పాల్పడతావా? నువ్వసలు ఆడదానివేనా, నీకసలు పుట్టగతులుంటాయా?" అంటూ ఆవేశపడిపోయింది.

మమత, మాట్లాడకుండా కూర్చుంది.

"ఆడవాళ్ళు సాదుస్వభావులంటారు. సింగినాదమంటారు. నాలుకతో చేతలతో ఆడాళ్ళు నిప్పెట్టినట్లు మగాళ్ళు కూడా పెట్టరే. నువ్వు చేసిన పాపం ఏ గంగలో కడిగినా పోదు. నువ్వాడుకున్నది ఆళ్ళ జీవితాల్తోనే కాదు. ఆళ్ళ మనసుల్తో. ఆళ్ళ శాపం నిన్నొదలదు. ఈ రోజు ఎల్లమారిందనుకోకు. ఒక రోజొస్తది. పదిరెట్లు ఏడుస్తావు. వెయ్యి శవాలు తిన్న రాబందుకూడా ఒక గాలివానకి ఛస్తది. గుర్తుంచుకో"

"ఒకరోజు ఎప్పుడో కాదాంటీ ఇప్పుడు రానే వచ్చింది." అంది తన కుడిచేతిని చూసుకుంటూ.

సరోజని కళ్ళు తుడుచుకుంది.

జుట్టు సరిచేసుకుని "సరే! అసలాళ్ళ జాతకాలే బాగోలేదులే. నువ్వుకాకపోతే ఇంకో శనిగాడు దాపురించేవాడు. ఇక ఈ సంగతి ఇంతటితో మరచిపో. తిన్నగా ఇంటికెల్లిపో. నువ్విక వరూధిని ముఖం కూడా చూడొద్దు" అంది.

"అంటే?" ఆశ్చర్యంగా చూసింది మమత.

"ఆడి పెళ్ళయిపోయింది. ఈ సంగతి తెలిస్తే ఆడు కాపరం చెయ్యడు. అన్నెం పున్నెం తెలీని ఇంకోపిల్ల బతుకు నాశనమవుతుంది" అంది సరోజని వేదనగా.

మమత తెల్లబోయి చూసింది.

"ఏవంతుకి వరూదిని ఎక్కడుందో తెలియకూడదు. అలాగే వరూధినికి కూడ ఆడిపెళ్ళి సంగతి చెప్పొద్దు. ఇప్పుడాళ్ళ దారులు ఇడిపోయాయి. మనసుల్లో ఏవున్నా బతికి తీరాలి. ఇప్పుడన్నా ఈ మంచి పని చేసి పుణ్ణెం కట్టుకో" అంది సరోజని చేతులు జోడించి.

మమత తలాడించి వెళ్ళడానికి లేచింది.

"ఉండు దూరం నుండి వచ్చావ్. అన్నం తినెళ్ళు" అంది సరోజని.

"వద్దాంటీ" అంది మమత హీనస్వరంతో.

"నువ్వొద్దన్నా నేను అన్నం పెట్టకుండా పంపను." అంటూ లేచి సరోజని వంటగదిలోకెళ్ళింది.

అంతసేపూ మమత మౌనంగా కూర్చుంది.

మరోగంటలో సరోజని భోజనం సిద్ధం చేసింది. కంచంలో అన్నంపెట్టి చేతికి స్పూను అందించింది.

మమత ఎడం చేత్తో స్పూను తీసుకుని తింటుంటే చూస్తూ కూర్చుంది సరోజని.

భోజనం కాగానే బయట నిలబడి ఖాళీగా వెళ్తున్న ఆటోని పిలిచింది సరోజని.

మమత బయల్దేరుతుంటే ఆమె బాగ్ ఆటోలో పెట్టి "చూడు నీ పేరేంటోగాని మనిషికి ఒక కష్టం వస్తే 'అయ్యో పాపం' అనేట్లుండాలి గాని బాగా అయ్యిందనుకునేట్లుండకూడదు. కష్టాలు అందరికీ వస్తాయి. నువ్వు చేసిన పాపం నీ చెయ్యి ప్రతిక్షణం గుర్తుచేస్తూనే వుంటది. మనిషికి వంటిరంగు కాదు ముఖ్యం బుద్ధి. అదిచ్చే అందం ముందు వెర్రి వేషాలు నిలబడవు. ఇకముందు జాగ్రత్తగా బతుకు" అంటూ సర్రున లోపలికొచ్చి తలుపేసుకుంది ఛీత్కారంగా.

సుశీల టి.వి చూస్తుండగా ఫోను రింగయ్యింది.

సుశీల రిసీవర్ తీసుకుని 'హలో' అంది.

"నేనాంటీ, మమతని"

"ఆఁ ఆఁ! ఏమయ్యింది? హేమంత్‌ని కలిసావా?"

"లేదాంటీ దారిలో నాకు ఏక్సిడెంటయింది. వారం రోజులు పైనే హాస్పిటల్లో వున్నాను. కాస్త కోలుకుని వెళ్ళేసరికి అతని పెళ్ళయిపోయింది. "

ఆ మాట విని సుశీల హతాశురాలయిపోయింది.

"అయ్యో! నిజమా! వరూధిని ఎంత దురదృష్టవంతురాలు" అంది సుశీల బాధగా.

"ఈ పాపమంతా నాదే ఆంటీ! దేవుడు నాకు తగిన బుద్ధి చెప్పాడు. నేనిక అక్కడికి రాను. దయచేసి వరూధినికి హేమంత్ పెళ్ళిగురించి తెలియజెయ్యకండి. బాధపడుతుంది. సరోజని అని ఒకావిడున్నారు. ఆవిడ గట్టిగా ఈ మాట చెప్పారు." అంది మమత.

"అలాగా, నువ్వు కూడా ఇక మీదట వరూధినీని కలవకూడదు" అంది సుశీల రిసీవర్ క్రేడిల్ చేస్తూ.

"ఎవరి గురించి మేడమ్. హేమంత్ పెళ్ళయిపోయిందా? హేమంత్ బాగున్నాడా?"

ఆ ప్రశ్నకి ఉలిక్కిపడి చూసింది సుశీల.

ఎదురుగా ఏదో ఫైల్ తీసుకుని చిరునవ్వుతో నిలబడివుంది వరూధిని.

"మీరు డోర్ గడ వెయ్యలేదు. కరెంట్ లేదా - కాలింగ్‌బెల్ కొట్టాను. వినిపించలేదా?" చాలా కూల్‌గా అంది వరూధిని వచ్చి పక్కన కూర్చుంటూ.

సుశీల దయ్యం పట్టినట్లుగా చూసింది వరూధిని వైపు.

"ఎవరూ ఫోన్? మమత చేసిందా?" అనడిగింది తిరిగి వరూధినే.

ఈసారి మెల్లిగా నోరు విప్పింది సుశీల.

"నీకు.. నీకు బాధగా లేదా వరూధినీ, హేమంత్ పెళ్ళయిపోయిందంటే?" అనడిగింది హీనస్వరాన సుశీల.

వరూధిని చిరునవ్వు నవ్వింది.

"లేదు. మా పెళ్ళి జరగకూడదనేగా నేనింత దూరం వచ్చేసింది. మొదటినుండీ నేను ఈ విషయంలో అనుమానిస్తూనే వున్నాను. అదే జరిగింది." అంది వరూధిని నెమ్మదిగా.

"కాని ఇదంతా మమత చేసిందని నీకు తెలియదు. మమత తిన్నయింటి వాసాలు లెక్కపెట్టింది. మనసు విప్పి చెప్పినందుకు నీ జీవితాన్నే ఛిద్రం చేసింది. పాపాత్మురాలు" అంది సుశీల అక్కసుగా.

"పోనీలెండి మేడం. జరిగిపోయిందిగా. తేలుని జేబులో వేసుకున్నాక అది కుట్టక మానదుగా. ఇప్పుడనుకుంటే ఏం లాభం?"

"కాని... ఇక్కడ నీకు జరిగిన నష్టం."

"నష్టం ఏమీలేదు. భౌతికంగా మేమిద్దరం పెళ్ళిపేరుతో ముడిపడలేదు. అంతే. మొదటినుండీ నేను నష్టజాతకురాలినే. జీవితం సాఫీగా జరగలేదు. నా మంచితనం నన్ను కాపాడలేదు. లోకం ఎన్నో మాటలంది. సహించాను. రకరకాల నిందలు వేసింది. విని భరించాను. హేమంత్‌ని నిజానికి నేను ప్రేమించలేదు. పెళ్ళి చేసుకోవాలని అనుకోలేదు. అతనే చొరవచేసాడు. ముందుకొచ్చాడు. జీవితానికి ఒక తోడు ఏర్పరచాలని అమ్మ ఆశించింది. చక్రవర్తి ఆగడాలు ఎక్కువయిపోయాయి. అనుకోకుండా ఒక్కో సంఘటనా నన్ను హేమంత్‌కి దగ్గరకు లాగాయి. మెల్లిగా నేను అతని ఆకర్షణలో పడ్డాను. అతన్ని, అతని వ్యక్తిత్వాన్ని ఆరాధించాను. అతని నీడలో, ప్రేమలో చిత్ర బాగా పెరుగుతుందని నమ్మాను. రకరకాల వ్యక్తులు అకారణంగా వెంటపడి హింసించారు. అయినా తట్టుకున్నాం. అందరికన్నా ఎక్కువ ద్రోహం చేసింది మమత."

వరూధిని నోరు తెరచి వెల్లువలా చెబుతుంటే మౌనంగా వింటున్నది సుశీల.

"నాకు హేమంత్ పట్ల వున్న ప్రేమని ఎవరూ ఛిద్రం చెయ్యలేరు. అలాగే హేమంత్ నన్ను ఏ నాటికీ మరిచిపోడు. నాకా నమ్మకం వుంది. ఒక తోటలో సువాసనా భరితంగా వికసించిన పువ్వుని దాని కాలం కాకుండానే రేకులని ఛిద్రం చేసారు. కానీ ఆ పువ్వు వెదజల్లిన వాసనల్ని ఎవరూ నాశనం చెయ్యలేరు. అది మా రెండు హృదయాలకి మాత్రమే తెలిసిన అద్భుత భావన. దాన్నెవరూ కాజెయ్యలేరు. ఎందుకంటే మాది శరీరాకర్షణ కాదు. డబ్బు లావాదేవీ అసలేకాదు. ఇప్పుడు చెప్పండి - హేమంత్ నాకు దూరమయ్యాడా?"

వరూధిని ప్రశ్నకి జవాబు చెప్పలేకపోయింది సుశీల.

నాకిప్పుడొక బాధ్యత వుంది. అది చిత్రని సక్రమంగా పెంచి సమాజంలో ఒక పరిపూర్ణ వ్యక్తిగా నిలబెట్టడం. ఇప్పుడు నా దృష్టి దానిమీదనే. హేమంత్ ఎక్కడికి పోతాడు. అతని స్థానం నా హృదయంలో పదిలంగానే వుంటుంది. అతని జ్ఞాపకాలు నా మనసులో పదిలంగానే వుంటాయి" అంది వరూధిని ఒక రకమైన ఉద్వేగానికి లోనవుతూ.

సుశీల మ్రాన్పడి చూస్తునే వుంది.

"దేవుడు మంచివాడే ఆంటీ. నా సొమ్ము తిన్నవాళ్ళు, నా ఉపకారం పొందిన వాళ్ళూ నాకూ ద్రోహం చేసినా నేనేమీ చెయ్యని మీరు నాకు అండగా నిలబడ్డారు. మిమ్మల్నిచ్చాడుగా నాకు" అంది వరూధిని వణుకుతున్న గొంతుతో.

ఇప్పుడామె కళ్ళు అవిరామంగా వర్షించసాగాయి. అనుకోకుండా వరూధిని చటుక్కున సుశీల వడిలో తల పెట్టుకుంది.

సుశీల కళ్ళు నీటితో నిండిపోయాయి.

ఆమె చెయ్యి అసంకల్పితంగా ఆమె తలని ఆప్యాయంగా నిమిరింది.

సరోజని అలవాటుగా వీధి అరుగు మీద కూర్చుంది.

ఇది వరకయితే వచ్చేపోయేవాళ్ళని ఏదో ఒక మాట అని గిల్లి నవ్వుకునేది. తన జీవితంలో ఉన్న అల్లరితనం, ఆనందం సగం దోచుకుని వెళ్ళాడు కనకారావు. చివరిదాకా కాపాడతానని తోడుగా వుంటానని దొంగ ప్రమాణాలు చేసాడు పెళ్ళిరోజు అని మనసులో వెయ్యిసార్లు తిట్టుకుంది సరోజని.

'ఇప్పుడు మిగిలింది కాస్త ఊడ్చుకుపోయాడు ఈ ఏవంతుగాడు. ఎందుకు తనకి వాడిమీద వల్లమాలిన ప్రేమా! ఒక్క పోనన్నా కొట్టాడు కాదు ఎదవ. ఎలా వున్నాడో?' అనుకుని బాధపడసాగింది సరోజని.

"ఎట్లుంటిరి వదినగారూ!" ఆ పిలుపు విని పక్కకి చూసింది సరోజని.

ఎదురుగా హేమంత్ అత్త వసుంధర.

"నువ్వా, ఎప్పుడొస్తివి?" అంది సరోజని. ఎంత బాధలో వున్నా జన్మతః వచ్చిన కొంటెదనం వదలక.

"పొద్దుటే వస్తిమి. మీకు దా కొన్ని స్వీట్స్ యిద్దామని" అంటూ కొత్త స్టీలు బేసిన్లో వేసిన స్వీట్స్ గిన్నెతో సహా యిచ్చింది వసుంధర.

'వద్దు' అందామనుకుంటానే తీసుకుంది సరోజని.

'శుభమా' అని కూతురి పెళ్ళి చేసి ఆనందంతో పంచుకుంటున్నది. హేమంత్ బతుకలా అవ్వడానికి ఆమె ఎంతమాత్రమూ బాధ్యురాలు కాదు. తను తినకపోతే రామలక్ష్మికివ్వొచ్చులే అనుకుంటూ "నాగిని వచ్చిందా?" అని అడిగింది.

"తెస్తిమి. ఇక్కడదా పూడ్చిపోదుము" అంది వసుంధర తనూ అరుగెక్కి కూర్చుంటూ.

"నీ బొంద! నిక్షేపంగా పెళ్ళిచేసి పూడుస్తానంటావేమే పిచ్చి మొహమా! ఇక్కడెందుకు ఆ పీనుగ దగ్గర. తీసుకెళ్ళి ఏవంతుగాడి దగ్గర వదిలిరా" అంది సరోజని.

"అప్పుడే వద్దంటాడు అల్లుడు. పని జాస్తి వున్నదంట"

"అదెప్పుడూ వుంటానే వుంటది. వాడట్లనే అంటాడు. తీసుకెళ్ళి వదలిరా. ఎవరిదారిన వాళ్ళుండేటప్పుడు పెళ్ళిదేనికి? వాడికింత టైముకన్నీ చూడాలిగా."

"మీరు చెప్పిందిదా కరెట్టు. తీసుకెళ్తా"

"నీకో మాట చెబుతా, వింటావా?"

"చెప్పండి"

"వెళ్ళి నీ కూతుర్ని వదిలేసి న్నాలోజులుండీ మంచీ చెడ్డా చూసిరా. అక్కడ పాతుకుపోకు" అంది సరోజని.

అర్థంకానట్లుగా చూసింది వసుంధర.

"కొత్త జంట. కులాసాగా వుంటారు. ఎవరూ అడ్డం లేకపోతే మంచీ చెడ్డా మాట్లాడుకుంటారు. తొందరగా కలిసిపోతారు. నువ్వుంటే నీకు అల్లుడి చేసేవన్నీ తప్పులుగా కనిపిస్తాయి. కూతురికి ఏదో ఒకటి ఎక్కిస్తావు. అందుకే అల్లుడింట్లో అత్తని మకాం వెయ్యొద్దంటారు. అర్థమయ్యిందా?" అంది.

వసుంధర మౌనంగా సరోజని మాటలు వింది.

"అవును వదినగారూ! నేనుదా ఒకమాట అడుగుదునా?" అంది మెల్లిగా.

"అడుగు"

"అల్లుడికి ఈ పెళ్ళి యిష్టం కాదా?"

"ఈ ప్రశ్న నువ్వు పెళ్ళికి ముందు వచ్చి అడగాల్సింది - ఇప్పుడు కాదు"

"అంటే?"

"అంటే ఏమీలేదు. ఇప్పుడిలాంటి అనుమానం ఎందుకొచ్చింది నీకు?"

"పెండ్లిలో అల్లుడి మొగంలో కళదా లేదు. సీరియస్‌దా వుంటిడి. ఆ శుభకార్యం కూడా ఇప్పుడుదా వద్దని పోయిండు"

సరోజనికి అంతా అర్థమయ్యింది.

"వాడి మొహమే అంత. అందులో చేస్తున్న ఉద్యోగం కూడా అలాంటిదే ఇక ఈరోజుల్లో పిల్లలకి ఈ తతంగాలిష్టం వుండటం లేదు. ఊరికే ఆలోచించ మాకు. అయినా నువ్వూ నీ అన్నా కలిసి చేసిన పెళ్ళికి ఇన్ని ప్రశ్నలెందుకిప్పుడు?" అంది సరోజని తుంచేసినట్లుగా.

వసుంధర వెళ్ళిపోయింది తలూపి బుద్ధిగా.

"ఏంటక్కా వసుంధరొచ్చి వెళ్తోంది?" అంటూ వచ్చింది రామలక్ష్మి.

"నీకోసమేనే. ఈ స్వీట్సు నీకివ్వమని యిచ్చెళ్ళింది" అంది గిన్నె రామలక్ష్మికందిస్తూ.

"ఊరుకో అక్కా నీకు మరీ పరాశికాలు" అంది రామలక్ష్మి గిన్నెలోకి తొంగి చూస్తూ.

"ఎందుకా తొంగి తొంగి నంగి చూపులు. తీసుకెళ్ళు. నేను తిననని తెలుసుగా"

"మరి గిన్నె?"

"మాయదారి సంత అది కూడా నీకేనే. నేనేం చేసుకుంటా నీ స్టీలు బొచ్చెలు" అంది సరోజని.

రామలక్ష్మి పరమానందంగా గిన్నె తీసుకెళ్తుంటే నిర్లిప్తంగా చూసింది సరోజని.

రైలు దిగిన అత్తగారిని, భార్యని రిసీవ్ చేసుకోవడానికి స్టేషన్ కొచ్చాడు హేమంత్.

వాళ్ళని చూడగానే గుండె పట్టేసినట్లయింది అతనికి.

అసలు జీవిత రంగంలో మొదటి అంకం ప్రారంభమవ్వబోతోంది. ఎలా ఇదంతా ఎదుర్కోవాలో తెలియడంలేదతనికి.

యాంత్రికంగా ఒక చిరునవ్వు నవ్వి వాళ్ళని ఇంటికి తీసుకెళ్ళాడు.

వసుంధర అతన్నే గమనిస్తోంది. కొత్తగా పెళ్ళయిన వ్యక్తిలో వుండాల్సిన లక్షణాలేవీ అతనిలో కనబడటంలేదు. క్రీగంట చూపులుగానీ చిరునవ్వులుగానీ అతనిలో లేవు.

నాగిని మాత్రం హేమంత్‌ని చూసి పొంగిపోతోంది. "బావా, బావా" అంటూ అదీ యిదీ చెబుతూనే వుంది.

అతను 'ఊ' 'ఊ' అంటున్నాడే గాని ఏవీ మాట్లాడటం లేదు. ఇంటికెళ్ళాక ఒక పనికుర్రాడు ఎదురొచ్చి సామానందుకున్నాడు.

"వీడి పేరు సింహాద్రి. ఏదికావాలన్నా అడగండి. ఈవిడ సత్యవతి. మీకన్నింటికీ సహాయకారిగా వుంటుంది. నా కర్జెంటు మీటింగు వుంది. నేను వెళ్ళాలి" అంటూ గబగబా స్నానం ముగించి ఆదరాబాదరా వెళ్ళిపోయాడు హేమంత్.

అదేం గమనించే స్థితిలో లేదు నాగిని.

పెద్ద గవర్నమెంటు క్వార్టర్స్. ఇంటి చుట్టూతోట. అందులో పనిచేస్తున్న మాలి. ఇప్పుడు తను ఆఫీసరుగారి భార్య. చాలా అబ్బురంగానూ, ఆనందంగానూ వుంది నాగినికి.

వసుంధర మాత్రం నీరసపడిపోయింది.

సింహాద్రి ఏం చెప్పినా చేస్తున్నాడు.

సత్యవతి కాఫీ టిఫిన్లు యిచ్చింది.

కానీ అల్లుడి ప్రవర్తన తను ఆశించినట్లుగా లేదు ఏదో తేడాగా వుంది.

మొదటిసారి ఆమెలో బాధ ఉత్పన్నమయ్యింది.

**ఆ రాత్రి తన** ప్రయత్నంగా వరూధిని సత్యవతి చేత పూలు తెప్పించి నాగినిని తయారు చేసింది. అంతకు ముందే హేమంత్ అభీష్టం తెలిసిన మనిషి కావడంతో ఏవీ ఆర్భాటం లేకుండానే ఆ గదిని కూడా తయారు చేసింది.

రాత్రి తొమ్మిది తర్వాత హేమంత్ హడావుడిగా వచ్చాడు.

ఎక్కువ మాటలు లేకుండా ఉండటానికి అతను శతవిధాల ప్రయత్నం చేస్తున్నాడు. వస్తూ తనతో తెచ్చిన ఫైల్సు కూడా బెడ్‌రూమ్‌లో పెట్టుకున్నాడు.

అతన్ని క్రీగంట గమనిస్తూనే వుంది వుంది వసుంధర

హేమంత్ వస్తూనే బెడ్‌రూమ్‌లోకి వెళ్ళి తలుపువేసుకున్నాడు.

నాగిని టి.వి చూస్తూ కూర్చుంది.

వసుంధర కూతురికేసి కోపంగా చూసింది.

"వళ్ళు తెలుస్తుందా నీకు?" అంటూ అసహనంగా అరచింది.

నాగిని ఉలిక్కిపడి తల్లికేసి చూసింది.

అలా అరిచినందుకు వసుంధరకే సిగ్గేసింది.

తండ్రిలేని పిల్లని తల్లీ తండ్రయి తనే పెంచి పెద్దచేసింది. అదీ చాలా గారాంగా.

భర్తపోయినా అతను స్వయంగా సంపాదించిన ఆస్తి చాలానే వుంది. ఎన్ని ఉన్నా తనది ప్రేమ పెళ్ళి. మగదక్షత లేదు. అతను పోగానే ఆస్తికోసం అత్తింటివారు చుట్టుముట్టారు. అప్పుడే అన్నగారి సహాయం కోరడానికి పుట్టింటికొకసారి వచ్చింది.

ఆ రోజు తనకింకా గుర్తుంది. అన్నగారు ఈడ్చికొట్టినంత పనిచేసాడు. ఒకవిధంగా వదినగారే ఉత్తమురాలు. అతనికి అడ్డుపడి ఆ తన్నులూ తిట్లూ తనే పడింది. పిల్లలు చిన్నవాళ్ళు. వాళ్ళకసలు గుర్తుందో లేదో!

ఆ రాత్రి వంటగదిలో అన్నం పెట్టి "చూడు వసుంధరా! మీ అన్నని మనిషనుకుని వచ్చినందుకు విచారిస్తున్నాను. అతనికి హృదయంలేదు. స్త్రీలంటే చులకన. ప్రేమించి ఎదిరించి పెళ్ళిచేసుకుని మన భాష, ప్రాంతంకాని మనిషితో ఒంటరిగా వెళ్ళావు. ఆ ధైర్యంతోనే పోరాడు. ఎప్పుడూ ఈ గడప తొక్కకు. ఏముందని వస్తావమ్మా ఇక్కడికి. ఏమీ సహాయం చెయ్యలేని నిస్సహాయురాలు మీ వదిన" అంది కన్నీళ్ళతో.

వసుంధర అర్థం చేసుకుని వదినగారి కాళ్ళకి నమస్కరించి బయటపడింది.

ఆ తర్వాత సంఘమే ఆమెకు బ్రతకడం - పోరాడటం నేర్పింది. కొద్దిరోజుల్లోనే హోటల్ని చేతిలోకి తీసుకుని విజయం సాధించింది.

తర్వాత ఇన్నేళ్ళకి అన్నగారే తన యిల్లు వెదుక్కుంటూ తన గడప తొక్కాడు. కోర్టు ఖర్చులకోసం. మాటల్లో హేమంత్ గురించి చెప్పాడు.

అన్నగారు ఒకనాడు కర్కశంగా ప్రవర్తించాడని తను బదులు తీర్చుకోలేకపోయింది. దానికి కారణం తను ఆడపిల్ల. ఆడపిల్లకి మనసుంటుంది. దానినిండా ప్రేమ, జాలి ఉంటాయి. దాన్ని ఆసరా చేసుకునే ఈ పురుషప్రపంచం ఆడుకుంటుంది. ఆడిస్తుంది. నిందలు వేస్తుంది. అయినా స్త్రీ ఆ లాలిత్యాన్ని కోల్పోలేదు - ఎన్ని దెబ్బలు తగిలినా అదే ఆమె ఔన్నత్యం.

ఆ రాత్రి వసుంధర హేమంత్ గురించి ఆలోచించింది. అన్నగారు అడిగిన డబ్బు యిస్తూ "మా నాగినీని కోడలుగా చేసుకోవచ్చు కదా!" అని.

సుందరం ఎగిరి గంతెయ్యలేదు గాని - మౌనంగా కళ్ళు మూసుకుని ఆలోచనలో పడ్డాడు.

"మా బిడ్డకుదా పుడ్చినంత ఆస్తిదా ఉండింది. అప్పుడుదా నేను ఆ పెండ్లి చేస్కోని మీకు కష్టం కల్గిస్తిని. నా పెనిమిటి నన్ను బాగానే జూసుకున్నాడు. కాని.. మా అత్తింటివార్కి మాత్రం నేను అంగీకారం కాలేదు. ఇప్పుడీ డబ్బు చూసి మళ్ళీ మాట కలుపుతున్నారు" అంది అన్నగారి వైపు క్రీగంట జూస్తూ.

వెంటనే కళ్ళు తెరచాడు సుందరం.

"ఎందుకు నేను లేనా! దాన్ని హేమంత్‌కి జేసుకుంటా" అన్నాడు.

వసుంధర మోహం పుచ్చపువ్వులా వికసించింది.

తను పోయినా పిల్లకి బంధువర్గం బలముంటుంది. ఒంటరిదయిపోదు - అని సంతోషపడి అన్నగారడిగిన డబ్బిచ్చింది.

"ఇలా తన కూతురికోసం తనుదా ఆశపడడం ఏమి తప్పు" వసుంధర ఆలోచిస్తూ కూతురి పక్కన కూర్చుని "నీకు పిచ్చి శానా వుండిందే పెండ్లయిన దానివి. మొగుడొస్తే వెంబడి బడి ఏమి కావాల్నో జూస్కో వద్దా. పొయ్యి జూడు" అంది.

"నువ్విలా జెబుతావ్‌గాని బావ ఏమొద్దు పో అంటాడు" అని గునిసింది నాగిని చిన్నపిల్లలా.

"వాడికిదా సిగ్గు జాస్తి. అట్లనే అంటాడు. పో! పొయి జూడు" అంది కూతుర్ని కుదిపి లేవదీస్తూ.

నాగిని వెళ్ళబోతుంటే హేమంతే బయటకి వచ్చి డైనింగ్ టేబుల్ మీద భోజనం వడ్డించుకోబోయాడు.

వసుంధర నాగినీని గిల్లి సైగ జేసింది.

నాగిని పరిగెత్తి హేమంత్ చేతిలో గరిట లాక్కుని తను వడ్డించింది.

హేమంత్ మౌనంగా భోంచేస్తున్నాడేకానీ వాళ్ళిద్దరూ తిన్నారో లేదో అనికూడా అడగలేదు.

నాగినికి కొంచెం కోపం వచ్చింది.

"మేం తినలేదు" అంది బుంగమూతి పెట్టి.

హేమంత్ తలెత్తి చూసి 'సారీ' అన్నాడు.

"అదేమి మాటనే నాగినీ! ముందల్లుడ్ని తిననివ్వు" అంది నొచ్చుకున్నట్లుగా.

హేమంత్ మరింకేమీ మాట్లాడకుండా వాష్‌బేసిన్‌లో చెయ్యి కడుక్కుని గదిలోకి వెళ్ళిపోయాడు.

వసుంధర నిట్టూర్చి "రా భోం చేద్దాం" అంది కూతురితో.

భోజనాలయ్యాక తనతోపాటు బెడ్‌రూమ్‌లోకొస్తున్న కూతుర్ని చూసి "ఇక్కడకాదు. ఆ గదిలోకెళ్ళు" అంది.

"బావ పని చేసుకుంటున్నాడు" అంది నాగిని.

"అతను చేసుకుంటే చేసుకోనివ్వు. నువ్వెళ్ళి పడుకో" అంది వసుంధర కోపంగా.

నాగిని చిరాగ్గా మొహం పెట్టి వెళ్ళింది.

మరో అయిదునిముషాల్లో రయ్యిన బయటకొచ్చి "బావకి చాలా పనుందట. వెళ్ళమన్నాడు" అంది తల్లి పక్కన పడుకుంటూ.

వసుంధరకి ఈసారి బాగా కోపం వచ్చింది.

వెంటనే వెళ్ళి హేమంత్‌ని నాలుగూ కడిగి పారేద్దామనుకుంది గాని సరోజని చెప్పిన మాటలు గుర్తొచ్చి కోపాన్ని అణచుకుంది.

అలా అణుచుకోవడం వలన ఆ బాధ దుఃఖంగా మారింది.

ఆగని కన్నీళ్ళని కూతురి కళ్ళపడకుండా తుడుచుకుని "నేను రేపుదా పోదును." అంది కూతురితో.

"అదేమిటమ్మా నువ్వెళ్ళిపోతే ఎలా? బావ కేంపులు పోతాడు. నేనొక్కర్తినే ఉండలేను" అంది నాగిని ఏడుపు గొంతుతో.

ఆ మాటకి వసుంధర మనస్సు చివుక్కుమంది.

కూతుర్ని ఆ పరిస్థితిలో వదిలి వెళ్ళడానికి మనసంగీకరించడంలేదుగాని తనుంటే హేమంత్ ఏ మాత్రమూ నాగిని మొహం చూడడని ఆమెకర్థమయ్యింది. అందుకే మనసు దిటవు చేసుకుని "ఇది నీ కాపురం - నువ్వే అన్నీ సమర్దించుకోవాల్న. నేనుండేమి పూడుస్తను. నేను మీ నాన్నని చేస్కున్నప్పుడు భాష దా వేరు. స్టేట్ దా వేరు. ఉండి పూడ్చలా?" అంది విసుగ్గా.

"నువ్వొక్కర్దానివీ ఎందుకక్కడ? నాతోనే వుండు" మారాం చేసింది నాగిని.

"అదిదా కుదర్దు. బిజినెస్సు పాడయిపోద్ది" అంది కఠినంగా వసుంధర అటుతిరిగి పడుకుంటూ.

ఆ మర్నాడు వసుంధర వెళ్తుంటే వారించాలని ప్రయత్నించాడు హేమంత్.

వసుంధర కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ "కుదరదు అల్లుడూ "పిల్లనిదా నీకప్పజెప్పినాను. ఇకనుండి నువ్వుదా దానికి తల్లీతండ్రీ." అంది.

హేమంత్ ఆమె వైపు నిస్సహాయంగా చూసాడు.

సింహాచలం నాగిని వెళ్ళి రైలెక్కించారు.

"నువ్విప్పుడు చిన్నపిల్లవుగావు. నీ సంసారం - ఎట్లు చేసినా నీదే బాధ్యత!" అంటూ చివరిమాటగా చెప్పింది వసుంధర.

రైలు కదిలిపోతుంటే ఆమె మనసు చెక్కలు ముక్కలయినట్లనిపించింది. నాగినీని పుట్టాక ఇదే మొదటిసారి వదిలేయడం. అల్లుడు బాగుంటే ఆమెకింత బాధవుండేదికాదు. చాలా వెలితిగా వేదనగా ఉందామెకు.

ఇప్పుడామె బాధంతా కోపంగా పరిణమించి సుందరం మీదకి మళ్ళింది. వైజాగ్‌లో దిగి నేరుగా సుందరం దగ్గరకెళ్ళింది.

రాజీ ఎదురొచ్చి "రా అత్తా, ఇప్పుడేనా రావడం?" అంది ఆప్యాయంగా చేతిలో సూట్‌కేసు అందుకుంటూ.

వసుంధరకి చాలా కసిగా వుందిగాని... అది ఆ అమాయకపు పిల్లమీద చూపించడం భావ్యంకాదనుకుని "మీ అప్పేడి?" అంది.

ఎప్పుడూ 'నాన్న' అనే అత్త అలా అప్ప అనడంలో ఏదో ఆంతర్యముందని గ్రహించిన రాజి "కూర్చో అత్తా - కాఫీ తెస్తానంటూ లోనికెళ్ళింది.

"అదేనే... నీ బాబు ఎటు బోయేడూ అంటున్నా" అంటూ వంటగదిలోకి వినపడేలా హెచ్చరించింది వసుంధర గొంతు పెంచి.

రాజి కాఫీ తెచ్చి అత్తకిస్తూ "ఇంకేముందత్తా తెల్లవారగానే ఆ బంగళాదగ్గరకెళ్తాడు. వెనకా ముందూ తిరిగి దాన్ని పదేపదే చూసుకుంటాడు. దానికోసం కోర్టుల చుట్టూ తిరిగినన్నాళ్ళూ ఆ సంగతి వేరు. అది తనకే చెందగానే అది నిజంగా తనకొచ్చేసిందా అని ఆశ్చర్యం . దాన్నేం చేసుకోవాలో తెలియని తికమక. బేరాలొస్తున్నా అమ్మకూడదనే అహం. పిచ్చెక్కిపోతున్నాడు నాన్న." అంది నిట్టూరుస్తూ.

"సరే, ఇప్పుడూ అక్కడికేనా పోయినాడు?" అంది.

"అక్కడికే వెళ్ళుంటాడు"

వసుంధర నిట్టూర్చింది.

"సరే నాకు స్నానానికి దా నీళ్ళుదా పెట్టు. నేనట్లా దేవళం దాక పొయొస్తునుద" అంటూ లేచింది.

స్నానం కాగానే గుడికంటూ బయటపడిన వసుంధర తిన్నగా సరోజని యింటికెళ్ళి తలుపు తట్టింది.

తలుపు తెరచిన సరోజని ఆశ్చర్యపోతూ "రారా, అప్పుడే వచ్చేసావేంటి?" అంది నవ్వుతూ.

వసుంధర కుర్చీలో కూర్చుంటూ "ఉండి ఏమిదా చెయ్యను. అదట్లా వుంచి ఒక మాట చెప్పండి. హేమంత్‌దా ఎవర్నయినా ప్రేమించినాడా?" అనడిగింది సూటిగా.

వసుంధర అనుకోని ప్రశ్నకి తెల్లబోయింది సరోజని.

"అదేంటి, అలా వాడుగాని చెప్పాడా?"

"లేదు. నాకే అల్లుడిదా పద్ధతి నచ్చలేదు. పిల్లని దూరంగా పెడ్తున్నాడు. మాట్లాడడు. నవ్వడు" అంది వసుంధర.

"అదేం కాదులే వసుంధరా.. వాడి ఆఫీసు పని వత్తిడిలో..

"అట్ల కతలు నాకుదా వద్దు. మగబుద్ధి నాకు తెలియదనుకుంటిరా! ఈ సంగతి మా అన్నని అడుగుదామనే ఇటొస్తిని. వాడుదా యింట్లో లేడు." అంది వసుంధర.

సరోజని ఏదో చెప్పబోతుండగానే బయట గట్టిగా కేకలు వినిపించి వీధిలోకి చూసింది.

ఆటోలో ఎవరో సుందరాన్ని తీసుకొస్తున్నారు. సుందరానికి స్పృహలేనట్లుంది.

సరోజని గబుక్కున లేచి వీధిలోకి పరిగెత్తింది.

వెనకాల వసుంధర కూడా వెంబడించింది కంగారుగా.

"అయ్యో! అయ్యో బావకేమయింది?" అంటూ ఆటో వెంబడి అరుచుకుంటూ వెళ్ళింది సరోజని.

ఆ గొడవకి రాజీ, ఆమె భర్త బయట కొచ్చారు.

ఆటో అతను మరొకతను కలిసి స్పృహలేని సుందరాన్ని లోపలకి తీసుకెళ్ళి ఉయ్యాల బల్లమీద పడుకోబెట్టారు.

రాజీ భర్త దగ్గరున్న డాక్టర్ని తీసుకొచ్చాడు.

డాక్టరు నాడి చూసి పెదవి విరిచాడు.

రాజీ గొల్లుమంటూ సుందరం మీద పడి ఏడ్చింది. క్షణాల్లో వాతావరణమంతా మారిపోయింది.

వసుంధర నిశ్చేష్టగా నిలబడిపోయింది.

తాను ఎన్నో అడగాలనుకుని ఎంతో ఆవేశంగా వచ్చింది.

ఒక ప్రశ్నకూడా అడగకుండానే అతను దిగంతాలకి సాగిపోయాడు. సరోజని ఓపిక తెచ్చుకుని రాజీని పక్కకి లాగి "ఏడవకు. జరగాల్సింది చూడు. ముందా ఏవంతుగాడికి ఫోను చెయ్యి" అంది.

రాజీ కళ్ళు తుడుచుకుని లోపలికి వెళ్ళింది.

సరోజని దూరంగా కూర్చుని అతనివంకే చూస్తుంది.

బ్రతికినన్నాళ్ళూ పెళ్ళాం బిడ్డల్ని కాల్చుకుతిన్నాడు. ఆస్తి ఆస్తి అంటూ ఉన్నదంతా కోర్టులకే తగలేసాడు. పిల్లలమీద పెత్తనమే కానీ ప్రేమనందించలేకపోయాడు. వంటిమీద చొక్కా సరేసరి - పెదవుల మీద చిరునవ్వుకూడా లేకుండా చూపంతా ఆ మేడ మీదే పెట్టుకుని బ్రతికాడు. చివరకి మేడ వచ్చింది. ఏం మిగిలింది. దాన్నో అడుగుపెట్టకుండానే ఈ లోకం దాటేసాడు. ఇంత మాత్రం దానికి ఒక్కపూట కూడా ఎవరినీ సుఖపడనివ్వలేదు. తను సుఖపడలేదు. చివరికి కొడుకుని ప్రేమించిన పిల్లతో పెళ్ళికాకుండా అడ్డంపడి ఇద్దరి గొంతులూ కోసాడు. ఆమె మనసు పరిపరివిధాల పోతోంది.

సాయంత్రానికల్లా హేమంత్ మరో యిద్దరక్కలూ - వాళ్ళ కుటుంబాలూ, వచ్చేసారు. చీకటి పడుతుండగా హేమంత్ నాగనీలుకూడా దిగారు.

వస్తూనే హేమంత్ సరోజని దగ్గరకెళ్ళి చతికిలపడి ఆమె వంక చూశాడు. సరోజని అతని చేతిని పట్టుకొంది ఊరడిస్తున్నట్లుగా అక్కడ తతంగమంతా అల్లుళ్ళు చూసుకుంటున్నారు.

వసుంధర హేమంత్‌ని చూసి గట్టిగా ఏడ్చింది "చూసినావా అల్లుండూ, ఎట్ల చేసి పోయినాడో - మా అన్న" అంటూ.

"చాల్లే వూరుకో" అని కసిరింది సరోజని.

నువ్వు రాగాలు తియ్యడం కాదు - వెళ్ళు వెళ్ళి రేపొద్దుటే జరగాల్సిన తతంగం చూడు. ఇక్కడ పెద్ద దిక్కు, పైగా వియ్యపురాలివీ నువ్వే" అంది.

వసుంధర లోపలికెళ్ళింది డ్రామా ఆపి.

"వెళ్ళరా - నువ్వు కూడా కాస్త మొహమన్నా కడుక్కో" అంది సరోజని హేమంత్‌తో.

హేమంత్ లోనికెళ్ళగానే గదిలో కూర్చుని కుమిలి ఏడుస్తున్న అక్కగార్లు కనిపించారు. అతన్ని చూడగానే 'తమ్ముడూ.." అని బావురుమన్నారు.

హేమంత్ మౌనంగా టాయిలెట్‌లోకి వెళ్ళి మొహం కడుక్కుని వస్తుండగా అందరికీ టీలు అందజేస్తున్న నాగిని కనిపించింది.

నాగిని అతని దగ్గరగా వచ్చి "టీ తాగు బావా" అంది. 'వద్దు' అందామనుకున్నాడు గాని ఎదురుగా కూర్చున్న సరోజని ఆంటీ తననే గమనించడం చూసి టీ గ్లాసు అందుకున్నాడు.

మరోగ్లాసు తీసుకుని సరోజనికిచ్చి పక్కనే కూర్చున్నాడు.

"ఊరికే దిగులు పడకురా. ఈ రోజయినా రేపయినా ఇది జరిగే తంతే. కాకపోతే ముత్యాల్లాంటి పిల్లల్ని - మాణిక్యంలాంటి పెళ్ళాన్ని ఒక్కరోజు కూడా సుఖపెట్టకుండా తరలిపోయాడు. అంతే!" అంది సరోజని.

హేమంత్ కూడా మౌనంగా తండ్రి పార్థివశరీరం వైపు చూస్తూ కూర్చున్నాడు. అతనికన్నీ గుర్తొస్తున్నాయి. తల్లిపడి వేదన, ఒంటరితనం, ఆర్థికస్థితుల్ని ఒక్క చేత్తో చక్కబెట్టుకోవడం అన్ని బాధల్ని తనే దిగమింగుకోవడం రెండు చిరిగిన చీరల్నే కుట్టికుట్టి కట్టుకోవడం అతని కళ్ళనుండి ధారాపాతంగా కన్నీళ్ళు జారిపోతున్నాయి. పెళ్ళంటే.. స్త్రీకి దుఃఖమూ, అవమానమేనా.. భర్తగా ఆదుకుంటానని తాళికట్టి - ఆమెని నిత్యం మాటలతో చేతలతో హింసిస్తూ పెత్తనం చేయడమేనా మగవాడి హక్కు.

చివరికి తల్లి శవం దగ్గర కూడా రాజకీయం చేసిన తండ్రిని చూస్తుంటే అతనికి చెప్పలేని కోపంగా వుంది. తన సంపాదన చూడకుండానే దానితో ఒక చీర కూడా కొనివ్వకుండానే ఆమె వెళ్ళిపోయింది. తెల్లవార్లూ అతను తండ్రి శవం దగ్గర కూర్చుని తల్లిని తలచుకుని ఏడుస్తూనే ఉన్నాడు. తెల్లవారి జరగవలసిన తతంగమంతా యాంత్రికంగా సాగిపోయింది. ఆ పదిహేనురోజులూ అన్నీ సక్రమంగా నిర్వర్తించింది నాగిని తల్లి సలహా మేరకు. ఏడుస్తున్న ఆడపడుచుల్ని ఊరడించి అన్నం పెట్టింది. బ్రాహ్మలతో మాట్లాడింది. వచ్చేపోయేవారికి మర్యాదలు చేస్తూ - ఆ యింటి కోడల్ననిపించుకుంది.

సరోజని కూడా నాగినిని చూసి ఆశ్చర్యపోయింది. 'ఔరా ఆడపిల్లలు ఎంతలో పెద్దవాళ్ళయిపోతారో కదా' అనుకుంది విస్మయంగా.

దినమయిన మర్నాడే హేమంత్ తిరిగి వెళ్ళిపోతూ.. సరోజనికి చెప్పడానికి వచ్చినప్పుడు మాత్రం 'నాగిని మంచిపిల్ల మనసు నొప్పించకు. ఇంతకంటే ఏం చెప్పలేనురా ఏవంతూ!" అంది కన్నీళ్ళతో

కొన్ని రోజులు అక్కలకి తోడుండమని నాగినిని అక్కడే వదిలేసి బయల్దేరాడు హేమంత్ శ్రీకాకుళానికి.

***

**దినవారాలు** గడిచి పదిహేనురోజులు దాటింది.

రోజూ ఏదో ఒక టైంలో సరోజని సుందరం యింటికి వెళ్ళి కాసేపు కూర్చుని మంచి చెడ్డా మాట్లాడి వస్తుంది. రాజేశ్వరి తప్ప అందరూ అప్పుడే వెళ్ళిపోయారు.

ఎవరి సంసారాలు వాళ్ళవి. అందులోనూ అతను తమని కన్నతండ్రే అనే ఇంగితంతో పిల్లలు అన్ని బాధ్యతలూ నిర్వర్తించారే తప్ప అతను వారికి చేసిన నిర్వాకం ఏమీలేదు.

అతన్ని గుర్తుచేసుకుంటే ఎప్పుడూ చిరాకు చిటపటలాడుతూ అందర్నీ ఆడిపోసుకునే మొహమే గుర్తొస్తుంది కానీ తమని దగ్గరకి తీసుకుని వాత్సల్యం చూపించిన సందర్భాలు గుర్తుకు రావు.

నాగిని అక్కడే ఉంది.

"నువ్వెందుకిక్కడ! అన్నీ సర్దుబాటయ్యాయికదా.." అంది సరోజని.

నాగిని రాజేశ్వరి మొహంలోకి చూసింది సందిగ్ధంగా.

"అవునత్తా. మేమూ అదే అంటున్నాం" అంది రాజేశ్వరి.

"మరేంటింక, బయల్దేరు" అంది సరోజని.

"బావ వచ్చి తీసుకెళ్తాడేమోనని.." అంది నాగిని నసిగినట్లుగా. సరోజనికి అర్థమయ్యింది. అటునుండి హేమంత్ రమ్మని పిలవలేదని నాగిని బాధపడుతోందని.

ఎంత తాళి కట్టించుకుని అధికారం సంపాదించినా ఆత్మాభిమానం ఉన్న ఆడపిల్ల పిలవందీ వెళ్ళలేదు కదా. అందులో కొత్త కాపురంలో వుండే తియ్యదనమే తెలియని పిల్ల అని బాధపడింది సరోజని ఏం తెలియనట్లుగా.

నాగిని బదులు చెప్పలేదు.

"పోనీ నువ్వు తీసుకెళ్ళరాదే. రాజీ" అంది సరోజని రాజేశ్వరి వైపు తిరిగి.

"ఇక్కడ నేను లేకపోతే జరగదత్తా. హేమంత్‌కి ఫోను చేస్తాను వస్తాడేమో" అంది రాజేశ్వరి.

'సరే' అని తలపంకించి ఇంటికొచ్చేసింది సరోజని.

సరోజని వచ్చేసరికి గ్లాసుపట్టుకుని బయట అరుగుమీద సరోజని కోసం ఎదురుచూస్తూ కూర్చునుంది రామలక్ష్మి.

"నీ గ్లాసూ నువ్వూ చల్లగుండ. ప్రపంచమంతా కూలిపోయినా నువ్వు మాత్రం నీ గ్లాసుతో రెడీ" అంటూ తాళం తీసింది సరోజని.

రామలక్ష్మి ఏమాత్రం సిగ్గుపడకుండా సరోజనితో లోపలికెళ్ళింది.

"అద్సరేనే. ఆ ఏవంతుగాడేంటే పిల్లని కాపరానికి తీసుకెల్లడూ! పాపం. ఈ పెళ్ళి నేనే చేసి పాపం కట్టుకున్నానేమోనే" అంది బాధగా.

ఆ మాట పూర్తవకుండగానే రాజేశ్వరి వచ్చిందక్కడికి.

"ఏంటే, నా వెనకాలే పరిగెత్తుకొచ్చావ్, ఏంటీ సంగతీ?" అంది సరోజని రాజేశ్వరిని పరిశీలనగా చూస్తూ.

రాజేశ్వరి రామలక్ష్మి వైపు అనుమానంగా చూసింది.

"పర్లేదు చెప్పు. మన మనిషేలే అది" అంది.

"ఇందాకే నాగినిని స్నానానికి వెళ్ళనిచ్చి హేమంత్‌కి ఫోన్ చేసాను. వాడికి మలేరియా అట. ఇప్పుడప్పుడే పంపొద్దని చెప్పాడు." అంది చిన్నగా.

"మరి వాడే యిక్కడికి రావొచ్చుకదా!" అంది సరోజని.

"శెలవే లేదంటున్నాడు"

"ఏడ్చినట్లుంది. రోగమొచ్చినప్పుడేకదా పెళ్ళామో, తల్లో పక్కన ఉండాల్సింది" అంది సరోజని.

"అందుకే నిన్నో మాట అడగాలని" అంటూ గొణిగింది రాజేశ్వరి.

"ఏంటో చెప్పు"

"అత్తా. నువ్వెన్నో సాయాలు చేసావ్ మాకు. ఇప్పుడూ నువ్వే ఆదుకోవాలి" అంది ప్రాధేయపూర్వకంగా.

"ఊరికే నసగబాకే. అసలు సంగతి చెప్పు"

"నా మాట విని నాగినీని శ్రీకాకుళం తీసుకెళ్ళు ప్లీజ్!" అంది రాజేశ్వరి వేడుకోలుగా.

"నేనా?"

"అవును. నువ్వే. నువ్వయితేనే అన్నయ్య నీమాట వింటాడు. నువ్వే వాళ్ళ కాపురం చక్కబెట్టగలవు ప్లీజ్. నా మాట కాదనకు" అంది రాజేశ్వరి.

"అవునక్కా. రాజేశ్వరి మాట విను" అంది రామలక్ష్మి రాజేశ్వరికి వత్తాసు పలుకుతూ.

"నువ్వొకదానివే గ్లాసుడు పంచదారకి గోదారీదమంటావ్! నేనెంతయినా పరాయిదాన్ని. ఆడు నామాటింటే నాగినీకి అలుసయిపోనా?" అంది చిరాగ్గా సరోజని.

"అదేం లేదత్తా. నాగిని పాపం మంచిపిల్ల. ఎలాగయినా వాళ్ళ కాపురం చక్కదిద్దగలిగిన దానివే. నువ్వే. హేమంత్‌కి నీ మాట మీద గురి. ఈసారికి నా మాట వినత్తా" అంది రాజేశ్వరి ప్రాధేయపూర్వకంగా.

సరోజనీకి అవుననక తప్పలేదు.

ఈ పెళ్ళి తనే చేసింది. ఈ తప్పు తనే దిద్దుకోవాలని తలూపింది సరోజని.

నాగినితోపాటుగా వచ్చిన సరోజనీని చూసి ఆశ్చర్యపోయాడు హేమంత్.

జ్వరం వున్న మాట నిజమే. అలానే ఆఫీసు పనులు నిర్వర్తించడంలో అతను మరీ చిక్కిపోయాడు.

"అత్తా నువ్వా?" అన్నాడు ఆశ్చర్యంగా.

"నేనేరా.. అలా కనిపించడంలేదా? ఇంత పెద్ద ఉద్యోగమొచ్చాక 'రా అత్తా' అని పిలిచావా, అందుకని నేనే వచ్చేసా!" అంది సరోజని నవ్వుతూ.

హేమంత్ ఏవీ జవాబివ్వలేదు. సరోజని ఆంతర్యం అతనికి తెలుసు. మౌనంగా ఇంటికి తీసుకెళ్ళాడు.

సరోజని బంగళా అంతా తిరిగి చూసి "ఇద్దరు మనుషులకి ఇంతిల్లెందుకురా! అసలు కొంపలేక చెట్లకింద ఏడుస్తున్న జనం ఎంతోమందుండగా" అంది ఆశ్చర్యంగా.

హేమంత్ నీరసంగా నవ్వాడు "అవును. బ్రిటిష్ వారి నుండొచ్చిందీ కల్చర్ మనకి. వదిలించుకోలేకపోతున్నాం" అన్నాడు.

నాగినీతో అతనసలు మాట్లాడక పోవడం గమనిస్తూనే వుంది సరోజని.

మాత్రలు వేసుకుని జ్వరంతోనే ఆఫీసుకెళ్ళిపోయాడు హేమంత్.

నాగిని వంటమనిషి సాయంతో పని ముగించుకుని సరోజని దగ్గరకొచ్చి కూర్చుంది. ఆ అమ్మాయి మొహంలో కళాకాంతీ లేదు. కదిలిస్తే ఏడ్చేట్లుగా ఉంది.

సరోజనీని అపరాధభావం చుట్టేసింది.

"నాగినీ. వాడికిజ్వరం కదా. కాస్త మందులు మాకులూ అవీ జాగ్రత్తగా చూడు. మాట్లాడటం లేదని నువ్వూ దూరంగా ఉంటే సంసారం జరగదు" అంది మెల్లిగా.

ఆ మాటకే వాయుగుండానికి కురిసిన వానలా నిశ్శబ్దంగా ఏడ్చింది నాగిని.

ఆ అమ్మాయి దుఃఖం చూసి తెల్లబోయింది సరోజని.

లేచి ఆ పిల్లని పొదివి పట్టుకుని "అయ్యో, గుండెల్లో ఇంత బాధపెట్టుకున్నావా, ఏంటి, ఏం జరిగింది, నా తల్లివి కదూ, నాకు చెప్పు" అంది లాలనగా.

నాగిని వెంటనే సర్దుకుని కళ్ళు తుడుచుకుంది.

"లేదు పిన్నీ. బావ ఇంతవరకూ నాతో మాట్లాడలేదు. ఈ పెళ్ళి ఇష్టం లేకపోతే ముందే చెప్పాలి కదా, ఏవీ చెప్పడు. అమ్మేమో.. నాకు సర్దుకోటం రాదంటుంది. నేనెవరికి చెప్పాలి నా బాధ!" అంది కన్నీళ్ళతో.

సరోజని కాసేపు మౌనం వహించింది.

మెల్లిగా నాగిని భుజం తట్టి "నేను కనుక్కుంటాను కంగారు పడకు. వాడు చెడ్డవాడు కాదు. నా మాట వింటాడు" అంది భరోసా యిస్తున్నట్లుగా.

నాగిని తలదించుకుని "నేను చిన్నదాన్నే కాదనను. గారాబంగా పెరిగిన దాన్నే ఒప్పుకుంటాను. కాని కొన్ని సంగతులు నాకూ తెలుసు. కొత్తగా పెళ్ళయి వచ్చిన భార్యని కన్నెత్తి చూడటం లేదంటే.. బావ నన్ను యిష్టపడటం లేదనేగా. ఒకరు చెబితే చేసే కాపురం కాపురమేనా?" అంది సూటిగా.

నాగిని ప్రశ్నకి ట్రాన్స్‌పడింది సరోజని.

వెంటనే ఏం జవాబు చెప్పాలో కూడా తోచలేదు.

మొదటిసారి హేమంత్ మీద చాలా కోపమొచ్చింది కూడ.

ఆ సాయంత్రం హేమంత్ వచ్చే టైముకి సరోజని "అమ్మా నాగినీ, ఒకసారి దగ్గరలో ఏదయినా గుడి వుంటే కాస్త పూజ చేసిరా. ఇంటికి మంచిది కదా!" అంది.

నాగిని ఏదో అర్థమయినదానిలా తలూపి వంటమ్మాయి సాయంతో గుడికి వెళ్ళింది.

కాస్సేపటిలో హేమంత్ వచ్చాడు.

సరోజని తనే కాఫీ తీసుకెళ్ళిచ్చింది.

"నువ్విచ్చావేంటాంటీ! పనమ్మాయి లేదా?" అన్నాడు.

"లేదు బయటకెళ్ళింది" అంటూ ఎదురుగా కూర్చుంది.

హేమంత్ కాఫీ తాగుతూ మౌనంగా కూర్చున్నాడు.

"అవునూ, పనమ్మాయి లేదా.. అని అడిగావు మరి నీ పెళ్ళాం ఏదని అడగలేదేంట్రా.. దానికి నువ్విస్తున్న విలువంతేనా?" అనడిగింది కోపంగా సరోజని.

హేమంత్ సరోజని వంక చూసి తలదించుకున్నాడు.

"నాకంతా తెలుసు. మీ అత్త ఏడ్చింది నాదగ్గర. పొద్దున్న నీ పెళ్ళాం ఏడ్చింది. ఈ పెళ్ళి చేసుకోమని చెప్పింది నేనే. ఈ పాపమంతా నాదేరా" అంది సరోజని బాధగా.

"అది కాదంటీ!"

"ఏదికాదు. నీ బాధ నీకుండొచ్చు. నాగిని అమాయకురాలు. జీవితమ్మీద ఎన్నో ఆశలు పెట్టుకొచ్చింది. ఇంకా వరూధినీని తలచుకుని ఈ పిల్ల గొంతుకోయడం మంచిదికాదు. మీ అమ్మ పోతే బతుకువదిలేసావా? కాలగతిలో ఎన్నో చెయ్యిజారిపోతుంటాయి. ఇంకా నువ్విలా ప్రవర్తిస్తే ఆ పిల్ల ఉండదు. నీ అత్త కోర్టులో దావా వేస్తుంది. నీ పరువూడుతుంది. జాగ్రత్త!" అంది సరోజని కోపంగా.

"అని అన్నారా?" కోపంగా అడిగాడు హేమంత్.

"లేదు. నేనే చెబుతున్నా. అయిపోయిందేదో అయిపోయింది. ఇంక ఆ కథ వదిలేయరా! నా మాటిను. నాగినీని బాగా చూసుకోరా!" బదులుగా హేమంత్ తల దించుకున్నాడు.

"ఏంటి మాట్లాడవూ?"

"ఆంటీ, నాకంతా తెలుసు. నాగినిమీద నాకేం కోపం, అసహ్యమూ లేవు. వరూధిని ఏమయిందో తెలియడంలేదు. అసలు బతికుందా...?"

"బతికేవుంది"

హేమంత్ ఈసారి ఆశ్చర్యంగా తలెత్తి చూశాడు.

"అవునా, నీకు తెలుసా? ఎక్కడుంది? ఎలావుంది? చెప్పాంటీ" అంటూ కుర్చీలోంచి లేచి సరోజని కాళ్ళదగ్గర కూలబడిపోయాడు ఒకరకమైన ఉద్వేగానికిగురవుతూ.

"ఏంట్రా, ఏంటీ పిచ్చీ, వరూధిని బాగనే వుంది. కానీ ఎక్కడుందో తెలియదు"

"అంటే?"

"ఒకరోజు నాకు ఫోన్ చేసింది. తను బాగానే ఉన్నట్లుగా చెప్పింది. ఏవంతుని పెళ్ళిచేసుకోమని చెప్పండాంటీ. నాకు పాపే ముఖ్యం అని చెప్పింది. ఎక్కడున్నావని అడిగేలోపునే ఫోను పెట్టేసిందిరా!" అంటూ అబద్ధమాడింది సరోజని.

"కనీసం... కనీసం.. ఎక్కడుందోనన్నా చెప్పిందా?" ఎంతో ఆందోళనగా అడిగాడు హేమంత్ సరోజనీని కుదిపేస్తూ.

"లేదురా! ఏమీ చెప్పలేదు"

"మరి.. ఈ ఫోను ఎప్పుడొచ్చింది.?"

"మొన్నేరా. మీ నాన్నపోయాకనే!"

హేమంత్ తలపట్టుకున్నాడు బాధగా.

సరోజని అతని గడ్డం పట్టుకుని "వదిలేయరా! వచ్చిందొక కలనుకో. మనసు దిటువు చేసుకోరా! నామాటిను" అంది బాధగా.

"ఇదిగో చెబుతున్నా యిను. ఉజ్జోగమా బాద్యత కలది. పెళ్ళామా ఇంట్లో కొచ్చింది. ఇక దారి మళ్ళించుకుని బతుకు. తప్పదు. ఒక పక్క వంట్లో బాగుండలేదు. వరూధిని తెలివైన పిల్ల. ఎలాగో బతుకుతుంది. పిల్లకోసమన్నా బతకాలి. నే చెప్పాల్సింది చెప్పాను. నాకు టిక్కెట్టు తెప్పించు. ఎళ్ళిపోవాలి" అంది సరోజని చివరిమాటగా.

అంతలోనే నాగిని గుడినుండి రావడంతో ఆ ప్రసక్తి ఆగిపోయింది.

ఆ మర్నాడు ప్రొద్దుటే ఎంత చెప్పినా వినకుండా సరోజని తిరిగి బయల్దేరింది.

వెళ్ళేముందు హేమంత్ వినకుండా నాగినీతో "అమ్మా నాగినీ, బలవంతంగా కాపరం చేసి నీ బతుకు బండలుజేసుకో అని చెప్పే సన్నాసిని కాదు నేను. అయితే మానవప్రయత్నముండాలి కాబట్టి రెండు మాటలు చెబుతున్నా. ఆడి మనసులో నీ పట్ల కోపం మాత్రం

లేదు. ఆడికి వంట్లో బాగోలేదు. భార్యగా కాకపోయినా తోడి మడిసిగా ఆడ్ని సరిగ్గా చూసుకో. ఇంతకన్నా ఏవీ చెప్పలేను ఆనక దేవుడెలా నడిపిస్తే అలా..'' అంటూ బయల్దేరింది సరోజని.

నాగిని తలవూపింది మౌనంగా.

అర్ధరాత్రి దాటింది.

అవతల గదిలో పడుకున్న నాగినికి అసలు నిద్రపట్టలేదు.

మంచమ్మీద పడుకుని తనగురించి తను ఆలోచించుకోవడం మొదలు పెట్టింది.

'చిన్నతనంనుండి తన జీవితం ఆడింది ఆటగా పాడింది పాటగా జరిగింది. తండ్రిలేడనేగాని తల్లి తనని చాలా గారాబంగా పెంచింది. అడిగి లేదనిపించుకున్నదే లేదు. చాలామంది స్నేహితులు తనని ఆరాధించేవారు. వాళ్ళందర్నీ సినిమాలకి తీసుకెళ్ళేది తన డబ్బుతోనే. రోజూ తను పెట్టుకునే నగల్ని, డ్రెస్సులని ఆరాధనగా చూసేవారు. అసలు కష్టాలుంటాయనిగాని అవి తన జీవితంలోకి ప్రవేశిస్తాయనిగానీ తానెప్పుడూ ఊహించలేదు.

సినిమాల్లో చూపించిన హీరోలాంటి భర్త తన జీవితంలోకి వస్తాడని తనని దివ్యలోకాల్లో తిప్పుతాడని చాలా గేరంటీ అయిన నమ్మకముండేది.

నిజంగానే హేమంత్ హీరోలానే ఉంటాడు. కానీ తనంటే అసలాసక్తే లేదు. తను బాగానే ఉంటుందే? చాలామంది తనని అలానే అనేవారే! మరెందుకితడు తనవైపు కన్నెత్తి చూడడు.'

చాలా కసిగా కోపంగా ఉంది నాగినికి.

ఇంత ముసుగులో గుద్దులాట దేనికి?

డైరెక్టుగా అడిగేస్తే సరిపోతుందిగా!

ఎన్నాళ్ళీ గుండెమంటని భరించాలి.

చివ్వున మంచమ్మీదనుండి లేచి హేమంత్ గది తలుపు తెరచి ఆక్కడి దృశ్యం చూసి నివ్వెరపోయింది నాగిని.

వాంతి చేసుకుని అపస్మారకంగా పడివున్నాడు హేమంత్.

ఒక్కక్షణం గాభరాపడి ఏం చేయాలో పాలుపోలేదు నాగినికి.

వెంటనే గబగబా పనమ్మాయిని లేపింది నాగిని. సత్యవతి లేచి చూసి కంగారు పడుతూ సింహాద్రిని లేపి తీసుకొచ్చింది.

ఈలోపునే నాగిని టవల్ తెచ్చి గబగబా హేమంత్‌ని శుభ్రం చేయడం మొదలెట్టింది. ''మీరు లేవండమ్మా'' అంటూ సింహాద్రి హేమంత్‌ని లేపి గోడకి జేరబెట్టి అంతా శుభ్రం చేసాడు.

సత్యవతి డ్రైవర్‌కి ఫోన్ చేసింది. అందరూ కలిసి హేమంత్‌ని హాస్పిటల్లో జాయిన్ చేసారు.

రెస్టు తీసుకోకుండా పనిచేయడంవల్ల బాగా బలహీనపడిపోయాడని అర్జెంటుగా డ్రిప్స్ పెట్టారు.

నాగిని అలానే ప్రమాన్పడి కూర్చుండిపోయింది అతని దగ్గర.

''ఇంటికేమన్నా ఫోన్ చేస్తారామ్మా?'' అని అడిగింది సత్యవతి నాగినిని.

''వద్దులే సత్యవతీ! అందర్నీ కంగారు పెట్టడం దేనికి? మనమే చూసుకుందాం'' అంది నాగిని.

అంత పెద్దరికం, స్థితత్వం తనకెలా వచ్చిందో తనకే అర్థంకాలేదు.

తెల్లవారుతూనే స్పృహ వచ్చింది హేమంత్‌కి.

ఐ.సి.యు నుండి అతన్ని రూములోకి షిఫ్ట్ చేసారు.

నాగిని దగ్గరుండి అన్నీ చూసింది. జ్వరం తగ్గాక చాలా బలహీనంగా ఉన్నాడు జాగ్రత్తగా చూసుకోమని నాగినికి చెప్పి డిశ్చార్జి చేసారు హేమంత్‌ని.

ఇంటికి తీసుకొచ్చాక ఆఫీస్ స్టాఫ్ చాలామంది అతన్ని చూడటానికి వచ్చారు. అందర్నీ తగిన రీతిలో గౌరవించి పంపిస్తున్న నాగినీని క్రీగంట గమనిస్తూనే ఉన్నాడు హేమంత్.

పదిహేనురోజులు శెలవు మంజూరు చేసామని బాగా రెస్ట్ తీసుకోమని వచ్చి పరామర్శించి వెళ్ళాడు అతని పై అధికారి.

నాగిని దాదాపు నిద్రపోయి వారం రోజులు దాటింది.

మొహంలో నీరసం ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.

రాత్రికాగానే హార్లిక్సు తీసుకుని గదిలో కొచ్చింది నాగిని.

హార్లిక్సు తాగి గ్లాసు అందిస్తూ "థాంక్స్ నాగినీ, నాకోసం చాలానే కష్టపడ్డావు" అన్నాడు హేమంత్.

అంతే!

నాగిని కళ్ళవెంట జలజలా నీళ్ళు రాలేయి.

"అరె! ఎందుకేడుస్తున్నావు, నేనేమన్నా తప్పు మాట్లాడానా?" అన్నాడు హేమంత్ కంగారుగా.

"లేదు బావా! ఇదే నువ్వు నాతో మాట్లాడిన మొదటిమాట. అందుకే ఆనందంతో ఏడుస్తున్నాను అంది" అతని మెడకి చేతులు చుట్టి.

హేమంత్ ఆమెని పట్టుకుని "సారీ, నాగినీ, ఇక నిన్నెప్పుడూ ఏడిపించను. సరేనా?" అన్నాడు.

నాగిని హృదయం ఆనందంతో ఒక అలలా ఎగసి ఆకాశాన్నంటుకుంది.

ఆ అవకాశాన్ని జారనివ్వకుండా ఆమె అతన్ని అల్లుకుపోయింది. "ఇన్నాళ్ళూ నువ్వు నన్నెందుకు సరిగ్గా చూడలేదో నేనెప్పుడూ అడగను. ఇకమీదట నన్ను నువ్వొదిలేసినా నేనొప్పుకోను. నాపేరు నాగిని బావా, నేనిలా నిన్ను చుట్టుకునే ఉంటాను" అంటూ అతని కౌగిలిలో ఇమిడిపోయింది నాగిని.

**ఆరునెలల కాలం** చాలా నిర్లిప్తంగా ఎటువంటి అలలూ, అలజడులూ లేకుండా సాగిపోయాయి.

ఎవరి మనసుల్లో ఏమున్నా పైకి ఎలాంటి ఒడిదుడుకులూ కనబడకుండా కాలం సాగిపోయింది.

సరోజనికి మాత్రం చాలా దుర్భరంగా కాలం గడుస్తుందనే చెప్పొచ్చు.

అరుగుమీద యధావిధిగానే కూర్చుంటుంది సరోజని.

ఒకనాటి సరదాలూ, అల్లర్లూ సుదూరంగా జరిగిపోయి మసకేసి మాయమయిన దృశ్యాల్లా దర్శనమిస్తున్నాయి.

కనకారావుతో కాపురం, రోడ్డుకడ్డం కాసి అయినవాళ్ళని, కాని వాళ్ళని కాళ్ళకడ్డం పడి ఏడిపించడాలు, మాటకి మాట. అసలా రోడ్డుమీద నడవాలంటే ఎంతటి మగాడికయినా హడల్.

సుందరానికి మాత్రమే కాస్త మర్యాద ఇచ్చేది. అదీ అతన్ని చూసి కాదు. హేమంత్ తల్లంటే ఎనలేని ప్రేమా, గౌరవము వుండేవి తనకి. ఇద్దరూ కష్టంలో కష్టం, సుఖంలో సుఖంగా కలబోసుకుని కాలం గడిపారు.

ఇప్పుడేముంది!?.

ఒక భవనం శిథిలమై నేలమట్టమయినట్లు అంతా చదునుగా, అలలు లేని సముద్రంలా మబ్బుల్లేని ఆకాశంలా.. సరోజని గాఢంగా నిట్టూర్చింది.

నిజం చెప్పాలంటే మనిషికెప్పుడూ ఒక బాధ్యతో, సమస్యో ఉండాలి. అప్పుడే మనిషి చైతన్యంగా ఉంటాడేమో!

తనకే పిల్లలుంటే వాడు రెక్కలొచ్చి అన్యాయం చేసిపోయాడని దుమ్మెత్తి పోసి నాలుగు కొంపలకి పోయి చెప్పన్నా వచ్చేది. ఒక కోడలుంటే బతకనివ్వడంలేదని వీధిలో కూర్చుని రాగాలన్నా తీసేది.

ఈ మెలికలు లేని బాటమీద బతుకెన్నాళ్ళు సాగదియ్యాలో!?

అప్పుడే రామలక్ష్మి గ్లాసు తీసుకుని కలశంతో వచ్చిన లక్ష్మీదేవిలా ప్రత్యక్షమయింది.

అదివరకయితే ఏవన్నా వెటకారాలు చేసి ఏడిపించేది కాని ఇప్పుడు తనకన్ని విధాలా రామలక్ష్మే దిక్కయింది.

"అక్కా.. ఈ సంగతి తెలుసా?"

"ఏ సంగతే?"

"అదే వసుంధర వచ్చింది"

"ఎవరే?" చిరాగ్గా అడిగింది సరోజని.

"ఇంకెవరూ, హేమంత్ అత్తగారు. నిన్నంతా ఒకటే షాపింగులు. బజారుకెళ్ళి ఏవిటేవిటో తెస్తానే వుంది."

"అవునా.. తెలియదే ఏంటో హడావుడి"

"తెలియదు. నాతో మాట్లాడదు కదా.. నువ్వు చూడలేదా?"

"లేదే నిన్న హేమంత్ నీ ఎదుటేగా మాట్లాడాడు. నా ఆరోగ్యం గురించే అడిగాడు." అంది సరోజని ఆలోచిస్తూ.

సరిగ్గా అప్పుడే వసుంధర హడావుడిగా వచ్చింది.

"సరోజనిగారూ. బాగుండిరా?" అంటూ.

"ఆ॥ఆ॥! బాగానే ఉన్నాను అటకపడేసిన గుండిగలా. నువ్వేంటీ. చాలా సందడిగ సరదాగా ఉన్నావు. ఏంటి సంగతి?" అంది సరోజని ఆరాగా వసుంధర వైపు చూస్తూ.

వసుంధర భళ్ళున నవ్వి "మీరు దా సందడంటే. తెలియదా మీకు?!" అంది.

"తెలిస్తే.. ఎందుకడుగుతాను?"

"అంటే.. హేమంత్ దా చెప్పి పూడ్చేడేమోనని.."

"వాడు ఒక్కసారే నేను పోయినప్పుడు పూడుస్తాడుగాని.. నువ్వు సంగతేంటో చెప్పి పూడ్చు"

"ఇంకేముంది. నేనుదా అమ్మమ్మని కాబోతున్నా.. అదిదా విశేషం" అంది వసుంధర ఆనందంగా.

సరోజని మనస్సు ఒక్కసారి నొక్కినట్లయింది.

వెంటనే నవ్వలేకపోయింది.

కళ్ళలో వరూధిని మెదిలింది.

ఇదంతా తనే పూనుకుని చేసి ఎందుకో మనసారా హర్షించలేకపోయింది సరోజని. హేమంత్ పూర్తిగా పరాయి వాడయిపోయాడా? అని మనసు మూలిగింది.

వెంటనే వసుంధర తననే గమనిస్తోందన్న స్పృహ వచ్చి "అవునా! చాలా సంతోషం వసుంధరా, వాడు ఫోను చేసాడు కాని. నాకు చెప్పడానికి సిగ్గుపడ్డట్లున్నాడు. ఎన్నో నెల?" అనడిగింది సరోజని నవ్వుతూ.

"అయిదు. అందుకే వచ్చా! నాగినీకి సీమంతం చేసి పూడుద్దామని."

"మరి వాళ్ళొస్తున్నారా?"

"ఇప్పుడుదా దిగుదురు. మీకీ సంగతి చెప్పి పూడ్చాలని వచ్చా. మీరు దా తప్పక రావాలి. మీరు కూడ" అంటూ రామలక్ష్మికి కూడా చెప్పి పరిగెత్తినట్లుగా వెళ్ళింది వసుంధర.

వసుంధర వెళ్తుంటే అలాగే నిస్తేజంగా చూసింది సరోజని.

"పెళ్ళి కాలేదు కాలేదు - చేసుకోనన్నంత సేపు పట్టలేదు. అన్నీ జరిగిపోతున్నాయ్" అంది రామలక్ష్మి బాధగా.

ఆ మాటతో తేరుకుంది సరోజని.

"సంతోషమే కదే! ఎక్కడ ఆడి బతుకు మోడయిపోతుందోనని పోరింది నేనేకదా! ఆ పిల్ల ఎలానూ వీణ్ణి చేసుకోదు. మగాడు తోడులేంది బతకలేడే ఒక్కోసారి యింత దుర్మార్గంగా మాట్లాడేనని అనుకోకపోతే మా ఆయన నాముందే పోవటం మంచిదే అయ్యిందనుకుంటాను. అదే నేనయితే అతనికింత ఉడకేసి పెట్టేదెవరు? పలకరించేదెవరూ. చెప్పు" అంది సరోజని బాధగా.

"అదీ నిజమే అక్కా"

"అదీ నిజమే కాదు - అదే నిజం. మగాడివన్నీ డాంభికాలే. ఆడ తోడు లేకపోతే అంతే సంగతులు. సరే.. ఆ గ్లాసేంటె.. కాఫీపొడా? పంచదారా?" అంది సరోజని.

"పంచదారే. ఈ రోజు శుక్రవారం కదా. ఇంత పరవాన్నం చేసి అమ్మవారికి పెడదామని.." అని సిగ్గుసిగ్గుగా నవ్వింది రామలక్ష్మి.

"అబ్బా, ఏం భక్తే.. పాలెవర్ని అడిగావ్?" అంది సరోజని వేళాకోళంగా.

"ఊరుకో అక్క! నువ్వు కాకపోతే ఇంకెవరంట నాకిచ్చేది? పాలున్నాయిలే" అంది రామలక్ష్మి నవ్వుతూ.

"సరే పోయి ఆ డబ్బాలోది పోసుకుపో" అంది సరోజని నవ్వుతూ.

రామలక్ష్మి పంచదార తీసుకుని వెళ్తుంటే గాఢంగా నిట్టూర్చింది సరోజని.

నిజానికి తమకంత పంచదార అవసరమే లేదు. కనకారావు నాలుగు కేజీలు తెచ్చిపోస్తుంటే 'ఎందుకంత తెస్తావ్. నేనేవన్నా తీపొంటలు చేస్తున్నానా?' అని తను కసురుకునేది.

కనకారవు నవ్వుతూ 'పాపం రాములొస్తది కదే. అందుకే' అని నవ్వేవాడు.

ఆ రోజుల్లో ఎంత లేకపోయినా పక్కవాడికింత పెట్టాలంటే ఇంత సరదా. ఇప్పుడెంతున్నా లేదనే ఏడుపు.

సరోజని ఆలోచిస్తుండగానే గుమ్మం ముందు ఆటో ఆగింది.

హేమంత్ ఆటోదిగి "నువ్వు ఇంటికెళ్ళు. నేను ఆంటీతో మాట్లాడి వస్తా" అని చెప్పి నాగినీని సాగనంపాడు.

"రారా! ఇప్పుడే మీ అత్తొచ్చి సంగతులు చెప్పెళ్ళింది" అంటూ నవ్వింది సరోజని.

హేమంత్ ఇబ్బందిగా మొహం పెట్టి "ఆంటీ, ఎలా ఉన్నావ్ చాలా చిక్కిపోయావ్ తెలుసా?" అన్నాడు సరోజనీని చూస్తూ.

ఆ మాటకి సరోజని కళ్ళు చెమర్చాయి.

"వయసొచ్చి మీద పడుతుంటే వంట్లో కండ కరిగిపోదేంట్రా. ఇంతకీ నువ్వెలా ఉన్నావు. నాగిని నీతో బాగుంటుందా?" అనడిగింది సరోజని లేచి.

"కూర్చోరా, ఇంత కాఫీ తెస్తాను. రైలు దిగి ఇక్కడికే వచ్చావ్" అంటూ.

హేమంత్ మాట్లాడలేదు.

సరోజని వెళ్ళి కాఫీ కలుపు కొచ్చింది.

హేమంత్ కాఫీ తాగుతూ "ఆంటీ" అన్నాడు మెల్లిగా.

సరోజని హేమంత్ కేసి దీక్షగా చూసింది.

హేమంత్ కొద్దిగా లావయ్యాడు. చూడ్డానికి హుందాగా ఉన్నాడు. చేస్తున్న ఉద్యోగం, సంసారం అతనికి హుందాతనాన్ని తెచ్చి పెట్టేయనిపించింది.

"మీ అత్తగారు చెప్పిందిరా, చాలా సంతోషం" అంది చిరునవ్వుతో

హేమంత్ మాట్లాడలేదు.

"ఆంటీ!"

"చెప్పరా?"

"వరూధిని సంగతేమైనా తెలిసిందా?"

సరోజని లేని కోపం తెచ్చుకుంది" ఇప్పుడెందుకు వరూధిని సంగతులు?" అంది.

"అదికాదాంటీ, ఆ ఇల్లు నాకోసం తనఖాపెట్టింది. విడిపించాలి కదా! నేను లోన్ పెట్టాను. డాక్యుమెంట్సు తన దగ్గరే ఉన్నాయి. ఎలా విడిపించాలి?"

సరోజని ఆ మాటలు విని గతుక్కుమంది.

నిజానికి ఆ రోజు ఆ పిల్ల ఆ డబ్బు కట్టి తన మానప్రాణాలు రక్షించింది. లేకపోతే ఆనాడే తాను అంతమైపోయేది.

"అవునా, ఆ సంగతి మరచేపోయాను" అంది బాధగా సరోజని.

"వాళ్ళకున్న ఆస్తి అదొక్కటే. ఆ దుర్మార్గుడివలన మెడలో ఉన్న ఒక్క చెయిన్ కూడా పోగొట్టుకుంది వరూధిని. ఒక ఆఫీసర్ కూతురిగా బాగా పెరిగింది. అభ్యుదయ భావాలు, ముక్కుసూటిగా బ్రతికిన అమ్మాయి పెళ్ళిపేరుతో ఒక దరిద్రుడి వలన సర్వనాశనమైపోయింది. అందుకు నేనుకూడా కారణమయ్యాను. నా తండ్రి వలన ఇల్లువదిలి వెళ్ళిపోయింది. ఎక్కడుందో తెలియదు. ఈ ఇల్లు తిరిగి ఆమెకెలా అప్పజెప్పాలో తెలియదు. నేను యాంత్రిక జీవితం సాగిస్తున్నాను. నా తప్పు మరో ఆడదాని జీవితాన్ని నాశనం చేయకూడదని నాగిని పట్ల నా ధర్మాన్ని నిర్వర్తిస్తున్నాను. ప్రతిక్షణం నా మనసు వరూధిన్నే స్మరిస్తోంది. కనీసం వరూధిని బిడ్డకి ఈ యిల్లు నిలబెట్టాలి. అప్పుడైనా నా తండ్రికి నిష్కృతి లభిస్తుంది. ఎలా ఆంటీ? ఎలా నేను వరూధిని గురించి తెలుసుకోగలను" అన్నాడు హేమంత్ వేదనగా.

సరోజని హేమంత్ని ఆశ్చర్యంగానూ, కొంత బాధగాను చూసింది.

ఒక సామాన్య మగాడిలా హేమంత్ జీవితంలో సర్దుకుపోలేదని ఆమె కర్థమైపోయింది.

ఇక తనకు తెలిసిన సంగతులు దాయడం అన్యాయమనుకుంది సరోజని.

"ఆ పిల్ల ఇప్పుడు మద్రాసులో ఉందట" అంది మెల్లిగా.

ఆ మాట వినగానే హేమంత్ కళ్ళు పెద్దవయ్యాయి.

"ఏమంటున్నావాంటీ?"

"అవున్రా, నీకీ సంగతి చెప్పకుండా దాచాను. నన్ను క్షమించు. అంతకు ముందే నీ పెళ్ళి జరిగిపోయింది" అంటూ మమత వచ్చి వెళ్ళిన సంగతులన్నీ ఏకరువు పెట్టింది సరోజని.

హేమంత్ కొన్ని క్షణాలు మాటలు రానట్లు చేష్టలుడిగి చూశాడు సరోజని వైపు.

"ఎంతపని చేసావాంటీ, కనీసం ఎక్కడుందోనన్నా తెలుసుకోలేదా?" అన్నాడు బాధగా.

"లేదురా, వివరాలు తెలిస్తే నువ్వీ కాపరం చెయ్యవని ఆ పిల్లని పంపించేసానేగాని ఇంత దూరమాలోచించలేదురా!" సరోజని బాధగా అంది.

"మద్రాసులో ఎక్కడని వెతగ్గలను. చిన్నపాటి ఆధారమన్నా లేకుండా" అని గొణుక్కున్నాడు తనలో తానే గోడకి జేరబడి నిస్పృత్తువుగా.

"సరే, ఇంటికెళ్ళొస్తాను" అని లేచాడు దిగులుగా.

సరోజని హేమంత్ వెళ్తుంటే అపరాధిలా చూసింది.

వసుంధర రంగరంగ వైభవంగా మరో పెళ్ళిలా హడావుడి చేస్తోంది.

తెలిసిన వాళ్ళని తెలియని వాళ్ళని కూడా పిలిచేసింది.

అందులో సుందరం లేక అందరికీ స్వేచ్ఛ లభించినట్లయింది. హేమంత్ అక్కలందరూ దిగిపోయారు.

వాళ్ళ పిల్లాపాపలతో ఇల్లంతా సందడిగా మారిపోయింది అందరూ నాగినిని ముద్దుచేస్తూ అలంకరిస్తున్నారు.

వైజాగ్ సంపెంగలతో ఇల్లంతా ఘుమాయిస్తోంది. వసుంధర స్వీట్లు, పళ్ళు అన్నీ ముత్తయిదువులకివ్వడానికి కవర్లు కడుతోంది.

రాజేశ్వరి నాగినికి పూలజడ వేస్తోంది.

అసలే తెల్లటి నాగిని మరింత అందంగా మెరిసిపోతోంది.

ఆడబిడ్డల పరాచికాలతో హాలంతా నవ్వులతో దద్దరిల్లుతోంది. పెరట్లో వంటవాళ్ళు వంటలు చేస్తూ ఒకరిమీద ఒకరు అరుచుకుంటూ పనులు చేస్తున్నారు.

అంత సందడిలోనూ ఏ మాత్రం కలవలేని హేమంత్ వరూధిని ఆలోచనలో బెడ్‌రూములో ఒక్కడుగా పడుకున్నాడు.

అతని మనసులో వరూధిని పరిచయం, కలబోసుకున్న మాటలు అనుకున్న ఆశలు గిరగిరా తిరుగుతున్నాయి.

వరూధిని ఒక్కసారి కలవాలన్న బలమైన కోరిక, అది తీరే మార్గం లేక మనసు పడుతున్న వేదన అతన్ని నిలువెల్లా కుదిపేస్తున్నాయి.

హాల్లో సందడి అతనికి చిరెత్తిస్తున్నది.

ఒక్కసారి పైకి లేచి "అందరూ ఎందులోనన్నా దూకండి" అని అరచి తిట్టాలనిపిస్తోంది.

కాని అతని ఇంగితం అతని పీక నొక్కేస్తోంది.

ఇంతలో సరోజని కూడ అక్కడికొచ్చింది.

అసలు హేమంత్ ఏం చేస్తున్నాడో కొంపదీసి ఈ తంతంగం ఆపమని కేకలేస్తాడేమోనని ఆమె పరిగెత్తుకొచ్చింది.

హేమంత్ లోపల పడుకుని ఉన్నాడని తెలిసి కాస్త ఊపిరి పీల్చుకుని చాపమీద పోసిన మల్లెపూల దగ్గర కూర్చుంది.

"అలా ఖాళీగా కూర్చున్నారేంటి? తలా ఒక చెయ్యేసి దండ కట్టక!" అంది పూలని అటూ యిటూ తిరగేస్తూ.

పూలు బదులుగా గుప్పున వాసనలు వెదజల్లాయి.

"బాగున్నాయ(్)రా మొగ్గలు" అంది సరోజని.

"ఏదీ కట్టమంటే ఎవరికి దా మాల కట్టుడు రాదంట. అందరూ సూదులుదా పట్టుకుని గుచ్చుతావుండారు. గుచ్చిన దండేమందం! ఏమిదా ఆడవాండ్లు వీళ్ళు" అంది వసుంధర తను కూర్చుని దండకడ్తూ.

"అవునిప్పుడు పిల్లలకి పూలు కట్టుడు రాదు. పెట్టుడూ రాదు" అంది సరోజని చమత్కారంగా.

"మీకు గూడ వచ్చి పూడ్చుదా?" అనడిగింది వసుంధర మళ్ళీ.

"అత్తకిదా వచ్చి పూడ్చును. అత్తదా దండకడితే చూడ చక్కగా ఉండును" అంటూ నవ్వింది రాజేశ్వరి.

రాజేశ్వరి మాటకి అందరూ పకపకా నవ్వారు.

మనసులు సంతోషంగా ఉన్నప్పుడు ప్రతిమాటకీ నవ్వేవస్తుంది.

నవ్వులక్కడ పూలలా విచ్చుకుని పరిమళాలు వెదజల్లుతున్నాయి

హేమంత్‌కి పుట్టబోయే బిడ్డ ఆడపిల్లా - మగపిల్లవాడా అని కాస్సేపు తర్జన భర్జన పడుతున్నారు.

"మీకు దా వస్తే కట్టండి వదినా!" అంది వసుంధర దారం రీలు సరోజని వైపు విసురుతూ.

సరోజని చకచకా దండ కట్టడం మొదలెట్టింది.

ఆమెవేళ్ళు అతి లాఘవంగా మల్లెల్ని అటూ యిటూ పేర్చి దారం మెలి తిప్పి ముడేస్తుంటే వసుంధర చిత్రంగా చూసింది.

"మీరు దా శానా బాగా కడుతుండ్రు" అంది మెచ్చుకోలుగా. చూస్తుండగా సరోజని అందరికన్నా పెద్దదండ అందంగా కట్టేసింది.

"దండ చక్రం మాదిరి ఉంది"

రాజేశ్వరి ఈసారి వసుంధర వైపు చూసి "అత్తా నువ్వు మాట్లాడే భాష తెలుగా, తమిళమా, మలయాళమా?" అంది నవ్వుతూ.

ఆ మాటకి నాగిని పూలజడని సర్దుకుంటూ "మా అమ్మది బడాయి. కావాలని ఏసగా మాట్లాడుతుంది. నేను హాయిగా తెలుగు మాట్లాడుతుంటే ఇక్కడ పుట్టిన ఈవిడ పె..ద్ద తెలుగురానట్లు ఏక్ట్‌చేస్తుంది" అంది వెక్కిరిస్తూ.

వసుంధర కోపం నటిస్తూ "ఇప్పుడు దా కడుపుతో ఉంటివని వూరుకుంటిని లేదంటే నీకు వీపుదా మోగేది" అంది.

అందరూ భళ్ళున నవ్వారు

వంటవాడొకడు టీలు, టిఫిన్‌లు అందిస్తుంటే "మీ ఆయనకిచ్చారా?" అంది వసుంధర.

"వద్దులే దాన్నిప్పుడు హైరాన పెట్టడం దేనికి, నేనిస్తా ఇటుతే" అని టీ గ్లాసు, టిఫిన్ ప్లేటు తీసుకుని హేమంత్ గదిలోకి వెళ్ళింది సరోజని.

హేమంత్ గోడవైపు తిరిగి పడుకున్నాడు.

నిద్రపోతున్నాడో లేదో తెలియడంలేదు.

"ఏవంతూ!" అంటూ చిన్నగా పిలిచింది.

హేమంత్ ఇటు తిరిగి "నువ్వా అత్తా!" అని లేచి కూర్చున్నాడు.

"ఇంద, టీ తాగు" అంటూ గ్లాసందించింది.

హేమంత్ టీ తాగుతుంటే "చూడు, ఇల్లంతా సరదాగా, సందడిగా ఉంది. నువ్వలా చిన్నబుచ్చుకుని కూర్చోకు. మీ నాన్న బతికినన్నాళ్ళు గదికొకళ్ళు గమ్మున కూర్చునేవారు. ఎవరైనా సంతోషంగా వుంటే మీ బాబుకి ఒళ్ళంతా మంటలు లేచేవి. ఇన్నాళ్ళకి స్వాతంత్ర్యమొచ్చి అందరూ సరదాగా హాల్లో కూర్చున్నారు. నువ్వు కూడా నవ్వుతూ ఉండు. బాగోదు" అంది మెల్లిగా.

హేమంత్ తల దించుకున్నాడు.

"చూడు వరూధిని తెలివిలేని పిల్లకాదు. ఆ ఇంటిని పోనివ్వదు. తప్పక కాపాడుతుంది. ఎవరో ఆమె వరూధినీని బాగా చూసుకుంటున్నదట. ఆమె తప్పక వరూధినికీ సహాయం చేస్తుంది. ధైర్యంగా ఉండు. దిగులుపడకు" అని హెచ్చరించి గది బయటకి వచ్చింది.

పోస్టులో వచ్చిన నోటీసులు చూస్తుంటే వరూధిని దగ్గరగా వచ్చి నిలబడింది రాజేశ్వరి.

"ఏంటవి?"

"కొంతకాలంగా వడ్డీ కట్టడంలేదు కదమ్మా. మన యింటికి ఆక్షన్ వేస్తామని బ్యాంక్ నోటీసులిచ్చింది." అని చెప్పింది వరూధిని.

"మరెలా?" అంది ఆదుర్దాగా రాజేశ్వరి.

"ఎక్కడయినా లోన్ దొరికితే ఇంటిని విడిపించి అమ్మేద్దామనుకుంటున్నాను" అంది వరూధిని.

"అయ్యో, అమ్మేస్తావా నాన్న కట్టిన యిల్లు?" అంది రాజేశ్వరి నొచ్చుకుంటూ.

వరూధిని విరక్తిగా నవ్వింది.

"అన్నీ నాన్నలో, తాతలో కడ్తారు. అలాగని శిధిలమైనా ఉంచలేం కదమ్మా!"

"శిధిలమా! ఎంత బాగుంది?"

"అంటే నా దృష్టిలో అక్కడ మనం పడినవన్నీ కష్టాలే. "

"మిగిలినవన్నీ చేదు జ్ఞాపకాలే. తిరిగి ఆ ఊరువెళ్ళాలని అనుకోవడం లేదు నేను."

"మరి చిత్రకేమిస్తావు?"

"మంచి చదువు, వ్యక్తిత్వం - అది చాలు"

రాజేశ్వరి మరేమీ మాట్లాడలేదు.

అంతలోనే సుశీల వచ్చిందక్కడికి.

"ఏంటీ తల్లికూతుళ్ళు ఓ డిస్కషన్. తెలుసుకోవచ్చా?" అనడిగింది నవ్వుతూ వచ్చి కూర్చుని.

"ఏంలేదు" అంది వరూధిని నవ్వుతూ.

"రహస్యమా? అయితే వద్దులే చెప్పకు" అంది సుశీల. వరూధిని ఇబ్బందిగా నవ్వి "ఏం లేదాంటీ, మా యిల్లు బాంక్‌లో మోర్ట్‌గేజ్ చేసాను. ఇంట్రస్టు కట్టక ఆక్షన్‌కి వచ్చింది" అంది.

"మరేం చెయ్యాలని"

"ఏదైనా లోన్ దొరికితే ఆ యింటిని విడిపించి అమ్మేద్దామని"

"ఎక్కడ దొరుకుతుంది లోన్. నీ ఆఫీసులోనే ప్రయత్నించు" అంది సుశీల ఎటో చూస్తున్నట్లుగా.

ఆమె అంతరంగం అర్ధమయి ఆశ్చర్యంగా చూసింది వరూధిని.

"కాని..."

"ఏం చెప్పకు. రేపు అప్లయ్ చెయ్యి. దీనికింత ఆలోచనదేనికి? ఏం చేసారీరోజు వంట?" అంటూ రాజేశ్వరివైపు తిరిగి అడిగింది సుశీల.

రాజేశ్వరి తెల్లబోతూ "ఇంకా మొదలెట్టలేదు" అంది గాభరాగా.

"బజ్జీలు వెయ్యండి. తినాలని వుంది" అంది సుశీల వాతావరణాన్ని తేలిక చేస్తూ.

**"నేనుదా** నా కూతుర్ని కొన్ని దినాలు కేరళ తీసుకుపోదును అల్లుడూ" అనడిగింది టి.వి చూస్తున్న హేమంత్ దగ్గర కొచ్చి వసుంధర.

హేమంతేమీ చెప్పకుండానే తల్లిమాటలకి అడ్డమొచ్చింది నాగిని.

"లేదమ్మా నేను రాను. బావకి భోజనానికి కష్టమవుతుంది" అంది

వసుంధర కూతురివైపు వెటకారంగా చూసి నవ్వింది. "శానా బాగా చెబుతుండావే! అంతకు ముందు అల్లుడు దా అన్నం తిని పూడ్చనట్లు. అయినా అక్కడదా వంట జేసి పూడ్చేది వంటమనిషేగా. నీవుదా జేసినట్లు కబుర్లు" అంది వసుంధర.

నాగినికి ఏమీ దిక్కుతోచనట్లయింది.

"అయినా నేను రాను" అంది మొండిగా.

అక్కడే నిలబడి అంతా చూస్తున్న రాజేశ్వరి జోక్యం చేసుకుని వెళ్ళులే నాగినీ. అదో ఆచారం. నాల్రోజులుండిరా" అంది.

"అట్లుదా చెప్పుము. మా సరదా మాది. కాస్త చలిమిడిదా ఎత్తి పంపుదుము" అంది వసుంధర.

ఇక ఆఖరి ఆయుధంగా హేమంత్ వైపు చూసింది నాగిని.

టి.వి. స్విచాఫ్ చేసి "తీసుకెళ్ళండి" అంటూ హాల్లోకి వెళ్ళిపోయాడు హేమంత్.

ఆ మర్నాడు వసుంధర నాగినిని తీసుకుని కేరళ బయల్దేరింది.

తానుకూడా బయల్దేరబోతూ సరోజని దగ్గరకొచ్చాడు హేమంత్.

"అత్తా, నేను కూడా వెళ్తున్నాను. ఈసారి ఆ మమత ఏమన్నా ఫోన్ చేస్తే వరూధిని ఎడ్రస్ తెలుసుకో. ఆ యిల్లు ఆమెకి అప్పజెప్పకపోతే నాకు మనశ్శాంతి ఉండదు" అని చెప్పి బయల్దేరాడు హేమంత్.

ఇంటికొచ్చి భోంచేసి బయల్దేరబోతుండగా జరిగిందా సంఘటన.

"ఈ పిల్లచూడు మొగుణ్ణి చంపేసిందట, కలికాలం. చూడ్డానికి బాగానే ఉంది మళ్ళీ" అన్నాడు రామారావు టి.వి చూస్తూ.

"వస్తా మావయ్యా" అంటూ రామారావుకి చెప్పి చాలా మామూలుగా టి.వివైపు చూశాడు హేమంత్.

అంతే!

అతని కళ్ళు పెద్దవయిపోయాయి.

గబుక్కున చేతిలోని బాగ్ పడేసి రామారావు చేతిలో రిమోట్ లాక్కుని సౌండ్ పెంచాడు.

"వరూధిని అనే ఆ యువతి చాలాకాలంగా భర్తని వదిలేసి దూరంగా ఉంటోంది. నిన్నరాత్రి చెన్నయ్ నుండి వచ్చిన ఆ యువతిని ఆమె భర్త తనతో కాపరానికి రమ్మని అడిగినందుకు అతి దారుణంగా అతన్ని కత్తెరతో పొడిచి చంపేసింది. ఆ పెనుగులాటలో ఆమె తల్లి కూడా మరణించింది. "

ఇక వినలేకపోయాడు.

అతని కళ్ళు అవిరామంగా వర్షించసాగాయి.

టి.వి న్యూస్ చూసి ఏడుస్తున్న హేమంత్‌ని చూసి కంగారుపడ్డారు రాజీ, రామారావులు.

"హేమంత్, ఏంటిది, వాళ్ళు నీకు తెలుసా?" రామారావు తెల్లబోతూ అడిగాడు.

హేమంత్ ఏమీ జవాబు చెప్పలేదు.

అతను హైదరాబాదుకి ఫ్లయిట్ టిక్కెట్ బుక్ చేసుకుంటుంటే ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయారు మౌనంగా.

సరిగ్గా అదే టైములో రామలక్ష్మి గబగబా పరిగెత్తుకుంటూ సరోజని ఇంటికొచ్చింది.

"అక్కా, అక్కా, ఒకసారి అర్జెంటుగా మా యింటికి రా, టి.వి చూద్దువుగాని" అంది గాభరాగా.

"ఈ టైములో దేవుడు పిలిచినా బయటకి రాను నేను. అయినా నేను టి.వి చూడను కదే!" అంది విసుగ్గా సరోజని.

"అబ్బా, ఆలస్యం చెయ్యకక్కా.. ఆ పిల్లలేదూ.. అదే మీ యింటికొచ్చిందే - ఆపిల్లని టి.విలో చూపిస్తున్నారు" అంది రామలక్ష్మి.

"ఏ పిల్ల? మా యింటికొచ్చిందా? ఎవరది?" అంది సరోజని చిరాగ్గా.

"అదే వరూధిని."

"అవునా... పద పద ఏం చేసింది. తెలివైన పిల్ల. ఏవన్నా బౌమతి గెల్చుకుందా! ఇప్పుడన్నా ఆ ఏవంతుగాడికి యివరాలు చెప్పొచ్చు" అంటూ చీర సరిచేసుకుంటూ ఇంటికి గెడపెట్టి రామలక్ష్మితో పరిగెట్టినట్లు వచ్చింది.

సరోజనీని చూసి రిమోట్ పెళ్ళానికిచ్చి లోపలికెళ్ళిపోయాడు రామలక్ష్మి భర్త.

అక్కడ చూపిస్తున్న దృశ్యాలు ఒక పక్కన అంతుపట్టలేదు సరోజనీకి.

"ఏంటది, ఎవరదీ, ఆ పిల్ల.. ఆ పిల్ల వరూదినీయా!" అంది తెల్లబోతూ.

"అవునక్కా, ఇందాకట్నుంచి అదే పనిగా అన్ని చానళ్ళలో చూపిస్తున్నారు. పేరుకూడా వరూదినేగా" అంది రామలక్ష్మి.

సరోజని ఆ దృశ్యాలు చూసి తోటకూర కాడలా వేళ్ళాడిపోయింది.

రక్తపు మడుగులో వరూధిని మొగుడు చక్రవర్తి, తల్లి రాజేశ్వరి పడివున్నారు. చిన్నపిల్లనెత్తుకుని వున్న వరూధినీని పోలీసులు అరెస్టు చేసి వేనెక్కిస్తున్నారు.

"అక్కా అక్కా" అంటూ గట్టిగా కుదిపింది రామలక్ష్మి సరోజనీని కంగారు పడుతూ.

"ఏంటే.. ఏంటే.. ఇది?" అంది సరోజని దాదాపుగా ఏడుస్తూ.

"అక్కా ఈ పిల్లేనే వరూదినీ?

"అవునే.. ఏంటే.. ఈ పిల్లేంటి అత్యలు చెయ్యడవేంటే దేవుడా... నేన్నమ్మలేకపోతున్నానే. ఇదంతా నిజం కాదే" అంది సరోజని.

"ఏమోనక్కా... నిజం దేవుడెరుగు. ముందాపిల్లని పోలీసోళ్ళెత్తుకుపోతున్నారు. మెడ్రాసెల్లిందని బాగానే ఉందని చెప్పావుకదా!" అంది రామలక్ష్మి.

కాసిని మంచినీళ్ళిమ్మని సైగచేసింది సరోజని.

రామలక్ష్మి గబగబా వెళ్ళి నీళ్ళు తెచ్చిచ్చింది.

సరోజని గటగటా నీళ్ళు తాగేసి గోడకి జేరబడింది.

ఛానెల్ వాడు పదేపదే వరూధినీని వేన్ ఎక్కించడం చూపిస్తున్నాడు.

సరోజని కొంచెం నిభాయించుకుని వరూధినీని పట్టి చూసింది.

వరూధిని మొహంలో ఎలాంటి ఆందోళనా, భయం కనిపించడంలేదు. చాలా నిర్లిప్తంగా చైతన్యం లేని మనిషిలా జడంగా కనిపిస్తోంది.

ఇక నన్నెవరేం చేసేది లేనట్లుగా అసలు జరుగుతున్న దానికీ తనకీ ఏ సంబంధం లేనట్లుగా వెళ్తోంది.

"అయ్యో పిల్లా... దేవుడు నీ మొహాన ఇంత దుఃఖం కష్టాలూ రాసాడా?" అనుకుంది మళ్ళీ ఏడుస్తూ.

"అక్కా, హేమంతుకి చెప్పవా.. ఉన్నట్టున్నాడు కదా!" అంటూ రామలక్ష్మి.

వెంటనే గబుక్కున లేచి నిలబడింది సరోజని.

"అవునే.. ఇప్పుడు కూడా దాచానంటే నన్ను క్షమించడు. అంటూ అలానే హేమంత్ ఇంటికి పరుగుతీసింది.

ఎటూగాని టైములో వచ్చిన సరోజని వైపు అదోలా చూసారు రాజీ, రామారావులు.

"ఆడు.. ఆడేడి..?" అంది సరోజని కంగారుగా.

"ఇప్పుడే హైదరాబాదెళ్ళాడు" అంది రాజీ.

"అవునా.. ఆడు టి.వి చూశాడా?"

"చూశాడు. ఆ అమ్మాయేనా తమ్ముడు ప్రేమించింది?" అనడిగింది రాజీ.

సరోజని నేలమీద కూలబడి "చుశాడా! దేవుడా.. ఆడింక మనిషవుతాడా?" అంది సరోజని ఏడుస్తూ.

"నాకేవీ అర్ధంకావడం లేదు. హేమంత్ ఎవరినన్నా ప్రేమించాడా? మరి ఆ అమ్మాయికి భర్త, కూతురు ఉన్నారు కదా?" ఆశ్చర్యపోతూ అడిగాడు రామారావు.

రాజీ క్లుప్తంగా జరిగిన కథంతా చెప్పేసింది రామారావుకి.

రామారావు తలపట్టుకున్నాడు.

"ఎందుకిలా దాచారు.? నాకన్నా చెప్పివుండాల్సింది" అన్నాడు వేదనగా.

"ఇదంతా నీ మావ నిర్వాకం. ఆ పిల్ల యింటిమీదకెళ్ళి నానా రచ్చ చేసాడు. ఛస్తానని బెదిరించాడు. అందుకే ఆ పిల్ల ఆ ఊరొదిలేసి ఎల్లిపోయింది. ఆ దరిద్రుడు ఇడాకులు తీసుకుని కూడా ఆ పిల్లని ఏదించి డబ్బులు తీసుకెల్తన్నాడు. దీపంలాంటి పిల్ల చివరికి మసిబారిపోయింది." అంది సరోజని.

"అద్సరే... ఇప్పుడు తమ్ముడు ఇలా వెళ్ళాడని తెలిస్తే నాగినీ ఏమంటుందో" అంది రాజీ వేదనగా.

సరోజని 'దేవుడిదే భారం' అన్నట్లు చేతులు పైకెత్తేసింది.

హేమంత్ తిన్నగా వరూధిని యింటికెళ్ళాడు. అక్కడ ఇద్దరు పోలీసులు ఆయింటికి కాపలాగా ఉన్నారు.

హేమంత్ తనెవరో చెప్పుకుని "ఎలా జరిగింది ఇదంతా?" అనడిగాడు పోలీసుల్ని.

"తెలియదు సర్! ఆవిడే భర్తని చంపేసానని ఒప్పుకుంది. తల్లిని వాడు చంపాడుట. బాడీలు పోస్టుమార్టంకి వెళ్ళాయి. వస్తేగానీ తెలియదు" అన్నారు వాళ్ళు

పక్కింటావిడ అక్కడ మూగిన జనంతో లెక్చరిస్తుంది.

"నేనెప్పుడో అనుకున్నా. ఇదింత పనీ చేస్తుందని. అది మొగుణ్ణొదిలేసి చాలామందిని చక్కబెట్టేది. చూసి ఎవడు భరిస్తాడు. ఆ ముసలి తల్లిముండ దీనికి వత్తాసు. చివరికి చంపేసింది."

హేమంత్‌కి వరూధిని ఒకసారి ఈవిడ గురించి చెప్పిన విషయాలు గుర్తొచ్చాయి.

అయినా అప్పుడేమీ అనలేని సందర్భం.

తలదించుకుని వస్తుంటే.. ఆవిడ హేమంత్‌ని చూడనే చూసింది.

"వాడే. వాడే. ఇప్పుడు దాని లేటెస్టు ప్రియుడు."

హేమంత్ వెనక్కి తిరిగి చూసి ఆమె దగ్గరగా వచ్చాడు.

మీ గురించి వరూధిని చాలాసార్లు చెప్పింది.

ఆమె నొసలు చిట్లించి "ఎవర్నువ్వు?" అంది దూరంగా జరుగుతూ.

"నేనెవరో తెలియకుండానే చెబుతున్నారా!? అంత పెద్దిల్లున్నా మీరెప్పుడూ బల్లిలా గోడకి అంటుకుని ఉండటానికే ఇష్టపడుతుంటారని. మీ ఆయన పొద్దున కాఫీ ఇవ్వడంతో మొదలెట్టి రాత్రి మీ కాళ్ళు పట్టిపడుకునే వరకూ రెస్టుతీసుకోరని. తెలియని వెధవ్వాగుడు దేనికి? చచ్చే వయసొచ్చినట్లుంది రెస్టుతీసుకో" హేమంత్ మాటలకి ఆవిడ లోపలికి పరిగెత్తింది.

మిగతావాళ్ళు చెల్లా చెదురయ్యారు.

పిచ్చెక్కిపోతున్న మనసుతో తను బసచేసిన హోటల్‌కి చేరుకున్నాడు హేమంత్.

విజిటర్స్ అవర్స్‌లో క్యూలో నిలబడ్డాడు హేమంత్. వరూధిని కోసం ఊగిరి బిగబట్టి వేయికళ్ళతో చూస్తున్నాడు. రకరకాల అభియోగాలు ఎదుర్కొంటున్న ఆడఖైదీలని రిమాండ్‌లో ఉంచే జైలు అది.

గోలగోలగా ఉందక్కడ.

చాలా నేలబారు కేసులు ఎక్కువే.

ఆ భాష, పరిస్థితులు ఘోరంగా ఉన్నాయి. 'వరూధిని అసలు తనని చూస్తుందా.. వస్తుందా?'

టెన్షన్‌గా ఉంది హేమంత్‌కి.

క్షణాలు యుగాల్లా లెక్కబెడుతున్న ఆ తరుణంలో చిత్రనెత్తుకుని వచ్చింది వరూధిని.

ఆ దృశ్యాన్ని చూసి విచలితుడయి పోయాడు హేమంత్.

చాలా నిర్లిప్తంగా మాసిన చుడీదారుతో రేగిన తలతో ప్రాణం లేని బొమ్మలా నడిచి వచ్చింది వరూధిని.

అంతసేపూ బిగబెట్టిన దుఃఖం తన్నుకొచ్చేసింది హేమంత్‌కి. వెక్కెక్కి ఏడ్చేసాడు.

వరూధిని అతనికేసి నిర్లిప్తంగా చూసి "అసలెందుకు వచ్చావు నువ్వు?" అంది నెమ్మదిగా.

హేమంత్ ఆమెవైపు కోపంగా చూశాడు.

"ఏంటిది? ఎందుకిలా జరిగింది? నన్ను తప్పించుకుని ఎందుకు పారిపోయావ్?" అన్నాడు.

వరూధిని జవాబు చెప్పలేదు.

తలదించుకుంది.

వాలిన కళ్ళల్లోంచి రెండు కన్నీటి బొట్టులు మాత్రమే రాలాయి. హేమంత్‌కి పిచ్చిపిచ్చిగా ఉంది.

"చెప్పు ఇప్పుడయినా చెప్పు. ఏం జరిగిందసలు.? నేను మంచి లాయర్ని పెట్టి నిన్ను విడుదల చేయిస్తాను. బెయిల్ మీద బయటకి తెస్తాను" అన్నాడు ఆవేదనగా.

వరూధిని నిర్లిప్తంగా నవ్వింది.

"వద్దు. బయట ప్రపంచంకన్నా ఇక్కడే బాగుంది నాకు. నేనెక్కడికీ రాను."

హతాశుడయి చూశాడు హేమంత్.

"అవును హేమంత్. చాలా విసిగిపోయాను. నేనే ఈ హత్యలు చేసాను. అలాగే వాంగ్మూలమిచ్చాను. ఏ లాయర్లూ వద్దు నాకు. "

"హత్యలా?"

వరూధిని తల దించుకుంది.

"ఇంకా నువ్వావేశంలో ఉన్నావు. రేపొస్తాను. ప్రశాంతంగా జరిగింది చెప్పు. నన్నింకా ఏడిపించకు."

వరూధిని అతనివైలానే చూసింది కొన్ని క్షణాలు.

"పెళ్ళయిందిగా. నన్ను ఇంకా మరచిపోలేదా?" అనడిగింది చిరునవ్వుతో.

హేమంత్ ఆమెని నిశితంగా చూశాడు.

ఇరవైనాలుగ్గంటల జైలు జీవితంలో ఆమె రూపురేఖలు మారిపోయాయి. ఎంతో ఉన్నతమైన కుటుంబంలో పుట్టి - కొన్ని ఆదర్శాలూ, ఆశయాలున్న ఈమె ఆ భయంకరమైన నేరస్థుల మధ్య ఆ నీచమైన ఆహారం తింటూ ఆలోచిస్తుంటే మతిపోతోందతనికి.

ఇంతలోనే టైమయిపోయిందంటూ వార్నిగొచ్చేసింది.

"సరే, రేపొస్తాను" అన్నాడు హేమంత్ తప్పని స్థితిలో.

"హేమంత్"

"నాదో చిన్న కోరిక"

"చెప్పు"

"కాదనువుగా?"

హేమంత్ జవాబు చెప్పలేదు.

"చిత్రని ఈ వాతావరణంలో ఉంచలేను. ఇక్కడన్నం వాసనొస్తుంది. తినడంలేదు. ఏదయినా హాస్టల్లో వేస్తావా? నా యిల్లు అమ్మి చదివించు. ఇంట్లో పెట్టుకోకు. అపార్థాలు వస్తాయి. కొన్నాళ్ళకి మరచిపోతుంది. నేనెవరో తెలియనియ్యకు. తల్లి నేరస్తురాలంటే పిల్లలు భరించలేరు."

ఆ మాటలు విని హేమంత్ గుండె ముక్కలు ముక్కలయిపోయింది.

వెంటనే చిత్రని అందుకున్నాడు.

జైలు సూపరిన్టెంటుని కలిసి ఫార్మాలిటీస్ పూర్తిచేసుకుని అతను హోటల్ కొచ్చేసరికి చాలా టైము పట్టింది.

చిత్ర వరూధిని కోసం ఏడుస్తుంటే ఊరడించి అన్నం తినిపించడం చాలా కష్టమైంది అతనికి.

ఆ రాత్రి చిత్రని కౌగిలించుకుని తనూ ఏడుస్తూ పడుకున్నాడు హేమంత్.

ఆ మర్నాడు కలిసినా వరూధిని నిర్ణయంలో ఎలాంటి మార్పూ రాలేదు.

చివరికి నిస్సహాయ స్థితిలో అతను చిత్రని తీసుకుని వైజాగ్ బయల్దేరాడు.

చేతిలో బిడ్డని తీసుకుని వచ్చిన హేమంత్‌ని చూసి తెల్లబోయారు రాజీ, రామారావులిద్దరూ.

విషయం అర్థమవుతున్నా.. ఇది ఎంతటి రాద్ధాంతానికి మూలమవుతుందో తెలీని స్థితి.

"పాపకి పాలు పట్టు"

హేమంత్ గొంతులోని స్థిరత్వం చూసి బెదిరింది రాజీ. పాపని తీసుకెళ్ళింది రాజీ.

"నాకిదంతా తెలియదు" అన్నాడు రామారావు నాందిగా.

హేమంత్ జవాబు చెప్పలేదు.

లేచి వెళ్ళి గోడకి వేలాడుతున్న సుందరం ఫోటో పీకి బయటికి విసిరేసాడు.

భళ్ళున పగిలిన శబ్దానికి రాజీ చిత్రని చంకనేసుకొచ్చింది.

ఏదో అందామనుకున్న రాజీని సైగచేసి వారించాడు రామారావు.

"పాపని నాకిచ్చి అదంతా తుడిచి బయట పారబొయ్యి" అన్నాడు భార్యతో.

రాజీ పాపని రామారావుకిచ్చింది.

"ముందెళ్ళి సరోజని ఆంటీని పిలుచుకురా" అన్నాడు హేమంత్.

ఆ గొంతులో ఇప్పుడొక అధికారం, తెగింపూ వినబడుతున్నాయి.

రాజీ చీపురక్కడ పడేసి గబగబా సరోజని ఇంటికెళ్ళింది.

"ఏంటే.. ఆడొచ్చాడా?" అంది సరోజని కంగారుగా రాజీని చూస్తూ.

"ఊఁ! నిన్నర్జంటుగా పిలవమన్నాడు."

"ఏం జరిగింది?"

"తెలియదు. వరూధిని కూతుర్ని తీసుకొనొచ్చాడు"

సరోజనికి పరిస్థితర్థమయ్యింది.

రాజీ వెనకాలే కంగారుగా వచ్చింది.

రాగానే పగిలిన సుందరం ఫోటో దర్శనమిచ్చింది.

"అదేంటి, బావ ఫోటో పడిపోయిందా?" అంది తెలియక.

"పడిపోవటం కాదు - నేనే పగలగొట్టాను" అన్నాడు హేమంత్ సరోజని వైపు చూస్తూ.

ఆ కళ్ళేదో కఠినంగా కనిపించాయి సరోజనికి.

"అయ్యో.. ఎంతయినా కన్నతండ్రి.." అని సణగబోయింది చిన్నగా.

"ఆంటీ.. ఆ కథలు మొదలెట్టకు. కామంతో కళ్ళు మూసుకుని చేసే పనులకి పుట్టిన పిల్లలం మేము. అతనెన్నడూ తండ్రి బాధ్యత స్వీకరించి ఎరగడు. అమ్మని పశువులా వాడుకుంటుంటే నిస్సహాయతతో భరించాం. నిష్కారణంగా వరూధిని బతుకు నాశనం చేసాడు కదా ఆంటీ. వరూధిని ఇప్పుడక్కడ.. జైల్లో.. నీకు తెలుసా ఆంటీ జైలెలా ఉంటుందో! నాకు. నాకు పిచ్చెక్కిపోతోందాంటీ! అయి లవ్ వరూధిని."

అంటూ దుఃఖం ఆపుకోలేక సరోజని వళ్ళో తలపెట్టుకుని వెక్కెక్కి ఏడ్చాడు హేమంత్.

సరోజని నిస్సహాయంగా అతని తలనిమురుతూ కూర్చుంది.

పది నిముషాల తర్వాత లేచి కూర్చుని "బట్టలు సర్దుకో ఆంటీ! మనం శ్రీకాకుళం వెళ్దాం" అన్నాడు సరోజనితో.

"ఎందుకు?" అని ప్రశ్నించే ధైర్యం లేదు సరోజనికి.

మౌనంగా చూస్తూ కూర్చుంది.

రామారావే తెగించి అడిగాడు. "చిత్రని.. ఏదైనా హాస్టల్లో.."

అతని మాట పూర్తికాకుండానే సర్రున పడగపట్టిన త్రాచుపాములా రామారావు వైపు తిరిగి చూశాడు హేమంత్.

"అది జరగదు."

"పోనీ నేను పెంచుతానురా తమ్ముడూ" అంది రాజీ ముందుకొచ్చి.

"కుదరదు. నేను చిత్రని ఎవరికీ ఇవ్వను. ఈ రోజునుండి చిత్రకి అన్నీ నేనే. నా బ్రతుకు చిత్రకోసమే. ఎవరివలన వరూధిని బ్రతుకు నాశనమైపోయిందో వాళ్ళే ఈ బాధ్యత స్వీకరించాలి"

సరోజని చిన్నగా అంది "మరి నాగిని వస్తే గొడవవుతుందేమో?"

హేమంత్ విరక్తిగా నవ్వాడు.

"జరిగింది చెబుతాను. సహృదయంతో వింటుందని నమ్ముతున్నాను."

వినకపోతే అని అడగలేదు సరోజని.

ఇప్పుడిక జరిగేది చూడటమే.

"సరే" అంటూ పైకి లేచింది.

రాజీ భుజమ్మీద అలసి అమాయకంగా నిద్రపోతున్న చిత్రని ఎత్తుకుని తన గదిలోకి వెళ్తున్న హేమంత్‌ని బాధతోనూ ఆశ్చర్యంతోనూ చూశారు రాజీ, రామారావులు.

**మమతని** తీసుకుని వచ్చిన సుశీల విజిటర్స్ కౌంటర్ దగ్గర నిలబడి అప్పుడే వచ్చిన వరూధినిని చూసి నివ్వెరపోయింది.

ఆ వెంటనే ఆమె కళ్ళు గండిపడిన చెరువులే అయ్యాయి.

"ఏంటిది వరూధిని! ఏం జరిగింది. నాకెందుకిందంతా ఎందుకు చెప్పలేదు. నేను నిన్ను ఎలాగోలా కాపాడుకునేదాన్ని. నిన్ను కూతురిలా ప్రేమించానే నన్ను పరాయిదానిగానే భావించవా?" అంటూ వలవలా ఏడ్చింది సుశీల.

మమత కళ్ళు కూడా అవిరామంగా వర్షిస్తున్నాయి.

వరూధిని శుష్కంగా నవ్వింది.

ఆమె మొహంలో ఎలాంటి బాధా గోచరించడంలేదు. అన్నిటికీ అతీతురాలిలా భావాతీతంగా వుంది.

"ఇప్పటికయినా మీకర్థంకాలేదా ఆంటీ! నేను దైవోపహతురాలిని. మీలాంటి ప్రేమమయి అండకూడా నన్ను కాపాడలేక పోయింది. వదిలేయండి" అంది నిదానంగా.

ఆ మాట విని హతాశురాలయింది.

"వదిలేయడమా! పువ్వులాంటి నిన్ను జైలుపాలు చేయడమా! చెప్పు అసలేం జరిగిందో చెప్పు. ఎంత ఖర్చయినా ఫర్వాలేదు. మంచి లాయర్లని పెట్టి నిన్ను రక్షించుకుంటాను." అంది సుశీల ఆవేశము దుఃఖమూ కలగలిపిన గొంతుతో.

"వద్దాంటీ, హేమంత్ కూడా చాలా బ్రతిమాలాడు. నాకీ జైలే సుఖంగా వుంది. బయట క్రూరజంతువులతో పడిన బాధలు చాలు"

"హేమంత్ వచ్చాడా?"

ఔనన్నట్లు తలూపింది వరూధిని.

"అది సరే! పాపేది? పాపని నేను పెంచుతాను" అంది సుశీల చిత్రకోసం చూస్తూ.

"హేమంత్ తీసుకెళ్ళాడు. అతనికే అప్పజెప్పాను."

"నామీద నమ్మకం లేకపోయిందా?" నిష్ఠూరంగా అంది సుశీల.

"అంతమాటనకండి. మీకీ వయసులో చిత్ర బాధ్యత అప్పగించడం ధర్మం కాదనిపించింది.

అర్థమయినట్లుగా తలపంకించింది సుశీల.

"ఇప్పుడిక నేనేం చేయాలి?" అంది వేదనగా.

"ఏం చేయాలో చెప్పనాంటీ"

"చెప్పు"

"తప్పక చేస్తారా?"

"ఒట్టు"

"అంత మాటక్కరలేదు. మీమీద నమ్మకముంది. మమతని తీసుకెళ్ళి మీ దగ్గర ఉంచుకోండి. ఒక చెయ్యిలేక ఆమె బ్రతకడం దుర్లభం. నా మాట వింటారా?"

ఆ స్థితిలోనూ తనకన్యాయం చేసిన మమత మేలు కోరుతున్న వరూధినీని చూసి తెల్లబోయింది సుశీల.

మమత తల మరింత భూమిలోకి దిగిపోయింది సిగ్గుతో.

"వరూ, అమ్మ నాకు ప్రతినెలా డబ్బు పంపిస్తున్నారు." అంది కన్నీళ్ళతో.

"ఇంత కష్టంలోనూ మమత గురించి ఆలోచిస్తున్నావా?" అంటూ తెల్లబోయింది సుశీల.

అలాగేనంటూ తలూపింది భారంగా.

❦❦❦

**మమతని** తీసుకుని వచ్చిన సుశీల విజిటర్స్ కౌంటర్ దగ్గర నిలబడి అప్పుడే వచ్చిన వరూధినీని చూసి నివ్వెరపోయింది.

ఆ వెంటనే ఆమె కళ్ళు గండిపడిన చెరువులే అయ్యాయి.

"ఏంటిది వరూధిని! ఏం జరిగింది. నాకెందుకిందంతా ఎందుకు చెప్పలేదు. నేను నిన్ను ఎలాగోలా కాపాడుకునేదాన్ని. నిన్ను కూతురిలా ప్రేమించానే నన్ను పరాయిదానిగానే భావించవా?" అంటూ వలవలా ఏడ్చింది సుశీల.

మమత కళ్ళు కూడా అవిరామంగా వర్షిస్తున్నాయి.

వరూధిని శుష్కంగా నవ్వింది.

ఆమె మొహంలో ఎలాంటి బాధా గోచరించడంలేదు. అన్నిటికీ అతీతురాలిలా భావాతీతంగా వుంది.

"ఇప్పటికయినా మీకర్థంకాలేదా ఆంటీ! నేను దైవోపహతురాలిని. మీలాంటి ప్రేమమయి అండకూడా నన్ను కాపాడలేక పోయింది. వదిలేయండి" అంది నిదానంగా.

ఆ మాట విని హతాశురాలయింది.

"వదిలేయడమా! పువ్వులాంటి నిన్ను జైలుపాలు చేయడమా! చెప్పు అసలేం జరిగిందో చెప్పు. ఎంత ఖర్చయినా ఫర్వాలేదు. మంచి లాయర్లని పెట్టి నిన్ను రక్షించుకుంటాను." అంది సుశీల ఆవేశము దుఃఖమూ కలగలిపిన గొంతుతో.

"వద్దాంటీ, హేమంత్ కూడా చాలా బ్రతిమాలాడు. నాకీ జైలే సుఖంగా వుంది. బయట క్రూరజంతువులతో పడిన బాధలు చాలు"

"హేమంత్ వచ్చాడా?"

ఔనన్నట్లు తలూపింది వరూధిని.

"అది సరే! పాపేది? పాపని నేను పెంచుతాను" అంది సుశీల చిత్రకోసం చూస్తూ.

"హేమంత్ తీసుకెళ్ళాడు. అతనికే అప్పజెప్పాను."

"నామీద నమ్మకం లేకపోయిందా?" నిష్ఠూరంగా అంది సుశీల.

"అంతమాటనకండి. మీకీ వయసులో చిత్ర బాధ్యత అప్పగించడం ధర్మం కాదనిపించింది."

అర్ధమయినట్లుగా తలపంకించింది సుశీల.

"ఇప్పుడిక నేనేం చేయాలి?" అంది వేదనగా.

"ఏం చేయాలో చెప్పనాంటీ?"

"చెప్పు"

"తప్పక చేస్తారా?"

"ఒట్టు"

"అంత మాటక్కరలేదు. మీమీద నమ్మకముంది. మమతని తీసుకెళ్ళి మీ దగ్గర ఉంచుకోండి. ఒక చెయ్యిలేక ఆమె బ్రతకడం దుర్లభం. నా మాట వింటారా?"

ఆ స్థితిలోనూ తనకన్యాయం చేసిన మమత మేలు కోరుతున్న వరూధినిని చూసి తెల్లబోయింది సుశీల.

మమత తల మరింత భూమిలోకి దిగిపోయింది సిగ్గుతో.

"వరూ, అమ్మ నాకు ప్రతినెలా డబ్బు పంపిస్తున్నారు." అంది కన్నీళ్ళతో.

"ఇంత కష్టంలోనూ మమత గురించి ఆలోచిస్తున్నావా?" అంటూ తెల్లబోయింది సుశీల.

అలాగేనంటూ తలూపింది భారంగా.

నాగినిని తీసుకుని వచ్చిన వసుంధర ఆ యింటివాతావరణం చూసి కొంత తెల్లబోయింది.

హేమంత్ కేంప్ వెళ్ళడంతో సరోజని చిత్రని స్కూలుకి తయారుచేస్తోంది.

వాళ్ళని చూసి ఖంగుతిన్న సరోజని నవ్వు తెచ్చుకుని "రండి రండి" ఇప్పుడేనా రావడం, ఆరోగ్యమెలా ఉందమ్మా నాగినీ?" అనడిగింది నాగినివైపు చూస్తూ.

ఆ మాటకి జవాబివ్వకుండా "ఈ పిల్లదా ఎవరు? మీరిక్కడదా ఏం జేస్తుండిరి?" అనడిగింది వసుంధర సూటిగా.

"నాక్కూడ ఏమీ చెప్పలేదు వసుంధరా! 'చిన్నపని వుంది రా' అంటే వచ్చాను" అంది సరోజని అబద్ధమాడుతూ.

"నమ్మమందురా!" అంది వసుంధర.

"అది నీ యిష్టం." అంది సరోజని మొండిగా.

ఇంతలో నౌఖరు వచ్చి చిత్రని స్కూలుకి తీసుకెళ్ళాడు.

వసుంధర కూతురివైపు చూసింది. "చూస్తివా, నీ మగడి భాగోతం. పిల్లని స్కూల్లో కూడా వేసిండంటే అదిప్పుడు ఇక్కడిదా తిష్టవేయునని నీకు తెలుస్తుందా?" అంది.

నాగిని అయోమయంగా చూసింది తల్లివైపు.

"బావని రానివ్వమ్మా అడుగుదాం" అంది మెల్లిగా.

"అవును కంగారు పడకు వసుంధరా! ఏ స్నేహితుడి కూతురో. వాళ్ళకే కష్టమొచ్చి తీసుకొచ్చేడో" అంటూ సర్దబోయింది సరోజని.

"ఏం స్నేహితురాలు కాకూడదా?" అంటూ వెటకారంగా సరోజని వైపు చూసింది వసుంధర.

ఆ మాటతో నాగిని కళ్ళనిండా నీళ్ళు నిండాయి. పెదవులు కంపించాయి.

"ఆ పిల్లని నీ అనుమానాలతో ఏడిపించకు. ముందెళ్ళి స్నానాలు చేయండి. టిఫిన్లు తిందురుగాని" అంది సరోజని మాటమారుస్తూ.

వాళ్ళిద్దరూ అసహనంగానే లేచారు.

ఆ రాత్రివరకూ వాతావరణం బిగుసుకునే ఉంది. సరోజని తనగదిలో బిక్కుబిక్కుమంటూ కూర్చుంది. తనెప్పుడూ తలవంచి ఏ పరిస్థితులకి దొంగలా నిలబడలేదు. ఇప్పుడా పరిస్థితి వచ్చి పడింది. కక్కలేక మింగలేక అన్నట్లుగా వుందామె గతి. రాత్రి పదిగంటలవుతుండగా వచ్చాడు హేమంత్.

అప్పటికే చిత్రని నిద్రబుచ్చింది సరోజని తనగదిలో.

హేమంత్ వస్తునే "చిత్ర భోంచేసిందా?" అని సరోజనిని అడగటంతో చిర్రెత్తుకొచ్చింది నాగినికి.

"మేం వచ్చాం కనబడుతున్నదా? "అని వెటకారంగా అడిగింది నాగిని.

హేమంత్ మాట్లాడలేదు.

"ఆరోగ్యమెలా వుంది?" అని మాత్రం పొడిగా అడిగాడు.

"చాలా సంతోషం ఆ మాత్రం అడిగినందుకు. ఇంతకీ ఆ పిల్లెవరు?" అంది నాగిని.

"అంతా చెబుతాను. ముందు భోజనం పెట్టు"

నాగిని అసహనంగా వడ్డించింది.

హేమంత్ భోజనం కాగానే "నా గదిలోకి రా" అన్నాడు నాగినిని.

నాగిని తల్లివైపు చూసింది.

"వెళ్ళు" అన్నట్లుగా సైగ చేసింది వసుంధర.

ఏం రాద్ధాంతం జరుగుతుందో అని గుండెదడతో చూస్తూ కూర్చుంది సరోజని.

"నాకు అబద్ధాలు చెప్పడం రాదు. చెప్పలేను. జరిగిన దాంట్లో ఎవరి పొరబాటెంత వుందో నువ్వే ఆలోచించు" అంటూ పూసగుచ్చినట్లు జరిగినదంతా చెప్పేసాడు హేమంత్.

అంతా విన్న నాగిని వెక్కెక్కి ఏడ్చింది.

హేమంత్ ఆమె వైపు నిస్సహాయంగా చూశాడు.

"నాగినీ, నేను తప్పు చేసి వుంటే క్షమించు. చిత్రవల్ల నీకెలాంటి నష్టమూ జరగదు. ఒక అనాధని చేరదీసేననుకో." అన్నాడు ఓదార్పుగా ఆమె గడ్డం పట్టుకుని.

నాగిని నిజంగానే నాగిని అయ్యింది.

బుసకొడుతూ లేచి నిలబడింది.

"నీకు పుట్టిన ఒక అక్రమ సంతానాన్ని నేను చేతకానిదానిలా పెంచాలా! ఈ ఇంట్లో నేనన్నా ఉండాలి. అదన్నా ఉండాలి" అంటూ తలుపు తీసుకుని పెద్దగా ఏడుస్తూ తల్లి ఒడిలో పడుకుని "అమ్మా, నా గొంతు కోసారే! ఆ పిల్ల బావకూతురే" అని రాద్ధాంతం చేసింది.

అంతే!

వసుంధర తోక తొక్కిన తాచులా "నేనుదా అనుకుంటూనే వుంటిని వీడుదా పెళ్ళిలో ఏడుస్తూనే ఉండిడి. ఇంత దాచి నా కొంపముంచుదురా!" అంటూ ఆశువుగా తిట్టి పోసింది.

సర్దిచెప్పాలనుకున్న సరోజనీని తిట్టింది.

"నీవుదా ఈ డ్రామా డైరెక్టరివి. నీకంతా తెలుసు" అని తిట్టి ఎంత చెప్పినా వినకుండా కూతుర్ని తీసుకుని వెళ్ళిపోయింది.

"ఏవంతూ ఆళ్ళని ఆపరా!" అంది సరోజని గాభరాగా.

హేమంత్ ఆ ప్రయత్నం చెయ్యలేదు.

"వద్దాంటీ, ఇప్పుడేం చెప్పినా వాళ్ళు వినరు" అన్నాడు.

"మరెలా! ఇంకా ఏమేం గొడవలవుతాయో? ఏ కేసులో వేస్తే..?"

హేమంత్ నిర్లిప్తంగా సరోజని వైపు చూశాడు.

"కానివ్వు. ఇవన్నీ ఇలానే జరుగుతాయనుకున్నామా" అన్నాడు వెళ్ళి చిత్రపక్కన పడుకుంటూ.

"అదికాదురా నువ్వేమీ అనుకోకపోతే చిత్రని ఏదైనా ఆస్టల్లో అదే మంచి ఆస్టల్లో యేస్తే..!" అంది భయంభయంగానే.

"కుదరదు. ఇప్పుడిక నా బ్రతుకంతా కేవలం చిత్రకోసమే. ఈ పనన్నా చేయకపోతే నా బ్రతుక్కి నిష్కృతి లేదు" అన్నాడు హేమంత్ స్థిరంగా.

చేసేది లేక సరోజని స్థబ్దుగా నిలబడిపోయింది.

వరూధిని నేరం ఒప్పుకోవడం వలన ఎక్కువ ఆర్గుమెంటు లేకుండానే వరూధినికి యావజ్జీవిత కారాగార శిక్ష పడింది. ప్రతి హియరింగ్‌కి హేమంత్ శెలవు పెట్టి కోర్టుకి వెళ్ళొస్తూనే ఉన్నాడు. శిక్ష విన్ననాడు అతను నిలువునా కృంగిపోయాడు. ప్రతిసారి వెళ్ళి వరూధినీని కలిసి, చిత్ర క్షేమ సమాచారం తెలిపి కొన్ని సాహిత్య విలువలున్న పుస్తకాలు వరూధినికి ఇచ్చి వస్తూనే ఉన్నాడు.

"నాగిని ఎలా వుంది?" అనడిగింది వరూధిని ఒకరోజు.

"బాగానే వుంది"

"చిత్రకోసం మీరేం గొడవపడలేదు కదా! చిత్రని హాస్టల్లోనే పెట్టావుకదూ!"

లేదు. చిత్రని నాగిని బాగానే చూస్తున్నది.

"నీకు పిల్లలా?"

"ఒక ఆడపిల్ల"

"అవునా, జాగ్రత్తగా పెంచు హేమంత్!" అంది వరూధిని.

కృంగిపోతున్న ఆరోగ్యంతో వృద్ధురాలిలా తయారయిన వరూధినీని చూసి వచ్చినప్పుడల్లా అతను రెండు రోజులు భోంచేయడు.

అతన్ని చూసి మరింత కృంగిపోతుంది సరోజని. చివరకి ఒకరోజు "నేనెల్లి పోతాన్నా" అంది కోపంగా.

హేమంత్ ఆమెని గట్టిగా కౌగలించుకుని "నువ్వూ నన్నొదిలేస్తావా?" అన్నాడు దీనంగా.

"మరేంటి, తిండి సరిగ్గా తినవు. నువ్వలా వుంటే పిల్ల కూడా దిగులుగా కూర్చుంటున్నది" అంది బాధగా.

"సరే. ఇకనుండి బాగానే ఉంటాను" అన్నాడు హేమంత్.

పదిహేనేళ్ళు కాలగర్భంలో కలిసిపోయాయి.

ఎవరినే విధంగా నడిపించినా దుఃఖజనులకు క్షణాలు సాగి దుర్భరంగా అనిపించినా కాలం దాని పద్ధతిలో అది నడచి ముందుకి సాగిపోయింది.

వరూధిని జైలునుండి రిలీజయింది.

ఆ రోజు హేమంత్ అన్ని ఫార్మాలిటీస్ పూర్తయ్యేక వరూధినీని తీసుకుని బయల్దేరాడు.

"ఎక్కడికి?" అనడిగింది వరూధిని.

"వైజాగ్"

"అక్కడికా! వద్దు. నేను చిత్రకి కనపడను"

"ఆ అవసరం రాదు"

మరేం మాట్లాడలేదు వరూధిని.

రైలు సాగుతుంటే బెర్త్‌మీద ముడుచుకుని పడుకున్న వరూధినీని అలాగే చూశాడు హేమంత్.

జుట్టు సగం నెరసిపోయింది. చెప్పిదవడలు పడిపోయాయి. విశాలమైన కళ్ళు ముడుచుకుపోయాయి. చర్మం ముడతలు పడింది. మహావుంటే ఇప్పుడు నలభయి సంవత్సరాలుంటాయి. కానీ ఎంతో వృద్ధురాలిగా మారిపోయిందామె రూపు. కష్టాలు మనిషి రూపు రేఖల్ని ఎలా దహించి వేస్తాయో చూస్తున్నాడతను. మాటమాటికి తెరలు తెరలుగా దగ్గుతున్నది హేమంత్. ఆమె పక్కన కూర్చుని బ్లాంకెట్ కప్పి ఆమె గుండెల్ని రాస్తూ కళ్ళు మూసుకున్నాడు.

మరో పసిపాప బాధ్యత అతని జమలో చేరింది. రైలు దిగగానే తిన్నగా సరోజని యింటికి తీసుకెళ్ళాడు హేమంత్.

సరోజని బాగా వడలిపోయింది.

వరూధినీని ముందు గుర్తుపట్టలేకపోయింది.

ఆ తర్వాత కౌగలించుకుని వెక్కెక్కి ఏడ్చింది.

"తల్లే! నా తల్లే! బంగారంలాంటి పిల్లవి ఇలా ఇనపముక్కలా అయిపోయావా?!" అంటూ వళ్ళంతా నిమిరింది.

సరోజని దగ్గరుండి ఆమెకి తలస్నానం చేయించి వద్దనివారించినా దిష్టితీసింది. వేసుకొచ్చిన బట్టలు బాగ్‌లోవి తీసి బయట పారేసింది.

సాంబ్రాణి పొగవేసి తలచిక్కులు తీసింది.

కాఫీ టిఫిన్లిచ్చి పడుకోబెట్టింది.

వరూధిని మెలుకువ వచ్చాక అన్నం తింటూ "హేమంత్ తిన్నాడా?" అనడిగింది.

"ఎక్కడ? అప్పుడే బయటకెళ్ళాడు" అంది.

"మీ చేత చేయించుకుంటున్నాను. క్షమించండి" అంది వరూధిని.

"అయ్యో తల్లీ! అంతమాటనకు. ఇన్నాళ్ళు నా ప్రాణం పోలేదంటే ఏదో రుణముండే" అంది సరోజని బాధగా.

"హేమంత్ ప్రస్తుతం ఇక్కడ జాబ్ చేస్తున్నాడా?"

"ఇంకెక్కడ జాబు! అప్పుడే వదిలేసాడు"

ఆ మాటకి ఆశ్చర్యపోయింది వరూధిని.

"అవునమ్మా ఈళ్ళ చదువులూ మంచి చెడ్డలూ కట్టమవుతాయని రాజీనామా ఇచ్చి ఇక్కడే స్థిరపడిపోయాడు. పైగా ఆళ్ళిద్దరూ ఇక్కడే డాక్టరీలు సదువుతున్నారు కదా!"

ఆ మాట విని ఆమె కళ్ళు మెరిసాయి.

"చిత్ర.. చిత్ర బాగా చదువుతుందా?" అంది చిత్ర గురించి తెలుసుకోవాలన్న ఆత్రుతతో.

"ఆc లేకపోతే ఏవంతూరుకుంటాడా! ముద్దు ముద్దే. సదువు సదువే. పిల్లకూడా ఎంత అందంగా ఉంటదనుకున్నావ్. బంగారు బొమ్మ. అంతా నీ రూపురేఖలే. బామ్మా బామ్మా అని నన్నొదలరు. ఇంకా యింకా బతకాలని ఏయేయో మందులేసి నా పేణాలు తీస్తారనుకో!" అంది సరోజని సంబర్మగా.

"హేమంత్ కూతురి పేరేంటి?"

"అదేంటోగాని నేను బుజ్జమ్మా అని పిలుస్తాను" అంది సరోజని.

"నాగిని బాగుందా?"

ఆ ప్రశ్నకి తెల్లబోయినట్లు చూసింది సరోజని.

"అంటే.. అంటే నీకేవీ తెలియదా?" అంది ఆశ్చర్యంగా.

ఏవిటన్నట్లుగా చూసింది వరూధిని.

"చిత్రమ్మని తేగానే గొడవెట్టుకుని నాగినీ ఎల్లిపోయింది. అక్కడ ఆడపిల్లట్టిందట. ఆ సంగతి కూడా ఏవంతుగాడికి కబురెట్టలేదు. ఎలాగో తెలిసిందంతే. పిల్లకి మూడోయేడనగా అనుకుంటూ - ఆళ్ళమ్మ వసుంధర పిల్లని తీసుకుని వచ్చింది. డెలవరీలోనే నాగిని సచ్చిపోయిందని. మూడేళ్ళు ఎలాగో పిల్లని సాకేనని.. ఇహ తనవల్ల కాదని పిల్లని అప్పజెప్పి ఏవంతుకి సెమాపనలు జెప్పి ఎల్లిపోయింది. ఆ మజ్జెన ఆవిడ సచ్చిపోయిందన్నారు. ఆస్తేదో ఆ చిన్నపిల్లకి రాసి కాగితాలు పంపించింది" అంది టూకీగా సరోజని.

ఆ కథ విని తెల్లబోయింది వరూధిని.

"నేను వాళ్ళ జీవితాలు కూడా పాడు చేసేనన్నమాట!" అంది బాధగా.

"మజ్జెలో నువ్వేం జేస్తావు. విదాడిన నాటకమిది. అయినా ఆ పిల్ల ఏవంతుగాడెంత జెప్పినా యినకుండా సిత్ర ఆడికే పుట్టిందని ఆడిపోసుకుని ఎల్లిపోయింది."

చాలాసేపలానే స్తబ్ధుగా కూర్చుండిపోయింది వరూధిని.

"మరి.. మరి... హేమంత్‌కి ఆదాయం?

"ఏవో బిల్డింగ్ కాంట్రాక్టులు చేస్తున్నాడు. డబ్బుకేం యిబ్బందిలేదు. "

"ఆ మేడ...?"

"అదా.. అదలానే పడుంది. దానిజోలికెవరూ ఎల్లరు" అంది సరోజిని.

ఆ రోజు తెల్లవారుతూనే నొప్పితో మెలితిరిగిపోయింది వరూధిని.

బలవతంగా హాస్పిటల్‌కి తీసుకెళ్ళాడు హేమంత్.

టెస్టులన్నీ జరిగాక "కేన్సర్. ఎడ్వాన్స్‌డ్ స్టేజి. కీమోథెరపీల వలన ఆమె నలిగి బాధపడటమేగానీ ప్రయోజనం ఉండదు." డాక్టర్ల మాటలకి మరింత కృంగిపోయాడు హేమంత్.

ఇంటికి వచ్చాక మెల్లిగా చెప్పింది వరూధిని.

"హేమంత్ నాకోసం వృధాప్రయత్నాలు చేసి ప్రయాసపడకు. అలసిపోయాను. ఈ ప్రయాణం సాగిపోనీ. ఆఖరి మజిలీ చేరడానికి అడ్డుపడకు. నీకు నేనెంతగానో రుణపడి ఉన్నాను. ఏ క్షణం నన్ను చూశావో నా కష్టాలు నిన్ను కూడా చుట్టుకున్నాయి. కన్నతండ్రి చంపేయబోయాడు. అడ్డుకున్న అమ్మని హత్యచేసాడు. దిక్కులేని పరిస్థితిలో అక్కడే దొరికిన కత్తెరతో పొడిచేసాను. భర్తని తల్లిని చంపిన భార్యగా ముద్రవేసారు. ఏమీకాని నువ్వు నీ కుటుంబాన్ని కూడా త్యాగం చేసి నా బిడ్డకి బంగారుభవిష్యత్తిచ్చావు. ఇది ఏ జన్మరుణమో!" అంది చేతులు జోడించి

ఆమె చేతులు అతను గట్టిగా పట్టుకున్నాడు.

"ఛ! ఏవిటిది?" అతని వెచ్చని కన్నీరు ఆమె చేతులమీద పడింది

"హేమంత్"

"ఊ"

"ఒక్కసారి నాకు పిల్లల్ని చూపించు. ఏ క్షణమెలా ఉంటుందో!"

"అలాగే"

"నేనెవరో చెప్పకు ప్లీజ్. తల్లి హంతకి జైలు కెళ్ళొచ్చిందంటే పిల్లలు జీర్ణించుకోలేరు. ఆ నిజమలా మరుగున పడిపోనీ!"

ఆ సాయంత్రం హేమంత్‌తో పిల్లలిద్దరూ వచ్చారు.

"వీళ్ళిద్దరూ నా కూతుళ్ళు. ఇది పెద్దది. పేరు చిత్ర. ఇది చిన్నది బుజ్జి. "

"అదేంటి దానికి పేరులేదా? బుజ్జీ ఏమిటి?" అంటూ మెల్లిగా నవ్వుతూ అడిగింది వరూధిని.

"డేడీ అంతే ఆంటీ! ఎప్పుడూ బుజ్జీ బుజ్జీ అనే అంటారు. ఈ బామ్మ కూడా అంతే. నా పేరు వరూధిని" అంది చిన్న పిల్లగారాంగా నవ్వుతూ.

తెల్లబోయిన వరూధిని హేమంత్ వైపు, సరోజని వైపు చూసింది.

హేమంత్ తలపంకించాడు.

సరోజని అవునన్నట్లుగా నవ్వింది.

"చిత్రా, ఒకసారి ఆంటీ పల్స్ చూడు. పక్కన కూర్చో, ఆంటీ మనకి చాలాకావాల్సిన వాళ్ళు. తల్లితో సమానం" అన్నాడు హేమంత్.

చిత్ర వెంటనే వరూధిని పక్కన కూర్చుంది ప్రేమగా.

"ఆంటీ బాధపడకండి. నేను డాక్టరయ్యేక మిమ్మల్ని బాగా చూసుకుంటాను" అంది చిత్ర వరూధిని చేతినందుకుని పల్స్ చూస్తూ.

ఒక్కసారి చచ్చుబడిన వరూధిని ఒంట్లో నాడులన్నీ శ్రుతి చేసిన తంత్రుల్లా ప్రేమనాదాన్ని పాడాయి .

పరిస్థితులు మరచి కూతుర్ని అక్కున జేర్చుకుంది ఆర్తిగా.

"చిత్రా! చిత్రా! అయ్ లౌ యూ!" అంది బుగ్గన ముద్దుల వర్షం కురిపిస్తూ.

"మరి నన్ను పెట్టుకోరా!" అని పక్కన జేరింది బుజ్జి.

వరూధిని బుజ్జిని కూడా కౌగలించుకుని ముద్దులు పెట్టింది.

"ఇద్దరూ రత్నాలు! థాంక్ యూ హేమంత్! థాంక్యూ" అంది పెల్లుబికిన సంతోషంతో వరూధిని చెమర్చిన కళ్ళతో.

హేమంత్ చిరునవ్వుతో తలపంకించాడు.

"సారీ! సారీ నేను షాబీగా ఉన్నాను. చిరాకు పడ్డారా?" అంది వరూధిని దూరంగా జరుగుతూ.

"మేము డాక్టర్లమాంటీ! అలాంటి భావనలుంటే ఈ వృత్తికే పనికిరాము. సరే ఇప్పుడు మేం మిమ్మల్ని ముద్దుపెట్టుకుంటాం. సరేనా?" అంటూ వాళ్ళిద్దరూ వరూధిని చెంపలమీద ముద్దులు కురిపించారు.

"చాలు చాలు!" అంటూ మెల్లిగా చేతులడ్డం పెట్టింది వరూధిని.

హేమంత్ అనుజ్ఞప్రకారం వాళ్ళిద్దరూ వరూధిని కాళ్ళకి దణ్ణం పెట్టి సాగిపోతుంటే కనిపించినంత మేర తృప్తిగా చూసుకుంది.

వరూధిని కళ్ళలో మెరుపు చూసి తృప్తిపడింది సరోజని.

ఆ రాత్రి -

వరూధిని బాధతో మెలికలు తిరుగుతోంది.

ఒకసారి పట్టలేక గట్టిగా అరిచింది.

సరోజని రివ్వున గా గదిలోకి వెళ్ళింది.

"ఆంటీ! ఆంటీ!" అంది ఆయాసంగా.

"ఆంటీ, ఒక్కసారి.. ఒక్కసారి హేమంత్‌ని పిలిపించరూ!"

సరోజని హేమంత్ కొనిచ్చిన సెల్‌ఫోనుతో హేమంత్‌కి ఫోను చేసింది.

అరగంటలో కారులో పరిగెత్తుకొచ్చాడు హేమంత్.

"పద! హాస్పిటల్‌కి తీసుకెళ్తాను" అన్నాడు వరూధినీని లేవదియ్యబోతూ.

వరూధిని వద్దని చేతులతోనే వారించింది.

అతన్ని పక్కన కూర్చోమని సైగ చేసింది.

హేమంత్ మంచమ్మీద కూర్చుని ఆమె తలని ఒడిలో పెట్టుకున్నాడు.

ఆమె ఆయాసం కొద్దిగా తగ్గింది.

ఆమె అతని చేతిని గట్టిగా పట్టుకుంది.

"హేమంత్! దేవుడు. అప్పుడప్పుడూ దయామయుడిలా ప్రవర్తిస్తాడు కదూ! ఇప్పుడు నిజంగా నీ చేతుల్లో.." హేమంత్ చటుక్కున ఆమె నోరు మూసాడు. అతని చేతిని ప్రక్కకి తోసేసి "నన్ను మాట్లాడనివ్వు హేమంత్! మాట్లాడనివ్వు. లేకపోతే ఇంకెప్పటికి నా మాటలు బయటకిరావు."

ఆమె ఆయాసపడుతూనే చెబుతోంది.

"నిజ్జంగా.. నాకు మగవాళ్ళ ప్రేమలమీద.. నమ్మకం...లేదు హేమంత్. ప్రతి...ఆరాధనని...ప్రేమని...కామదృష్టితోనే ...చూస్తారు. ఆడది.. శారీరక కోర్కెల కోసం.. వెంపర్లాడుతోందని...తామేదో ఉద్ధరించేస్తామని... అనుకుంటారు. ప్రేమ ఎంత గొప్పదో.. చొల్లుకార్చే.... ఈవెధవలకి చాలామందికి తెలియదు. కొమ్మనుంచి పువ్వుని తెంచకుండా దాని అందాల్ని అనుభవించడం తెలియని మూర్ఖులు. అందుకే.... నిన్ను ముందు నమ్మలేకపోయాను. నీలాంటి ఉత్తముడు... దొరకడం నా అదృష్టమే కదూ! నేను దురదృష్టవంతురాలిని కాదు కదూ! అవును. నేను అదృ....ష్టవంతురాలి..నే. అవు....ను"

ఆమె మాటలాగిపోయాయి.

హేమంత్ ఆమె తల నిమురుతూనే ఉన్నాడు.

అతని కన్నీరు స్పర్శరాహిత్యానికి గురయిన ఆమె శరీరమ్మీద రాలిపడుతూనే ఉంది.

ఎందుకో అనుమానం వచ్చి సరోజని లోపలికొచ్చింది.

"ఆంటీ.. ఆంటీ.. ప్రయాణం ముగిసింది" అన్నాడు హేమంత్ ఏడుస్తూ.

సరోజని "దేవుడా!" అంది క్రింద కూలబడుతూ.

ఇప్పుడా సుందరం మేడ ఆ రోజు ఏ నోటితో అన్నాడోగాని హేమంత్, పార్థివ శరీరానికి మందిరమైంది.

అక్కడ పొన్నాగ చెట్టుక్రింద ఆ పూల జడి క్రింద ఆమె శాశ్వతంగా నిద్రపోతోంది.

ఖాళీదొరికినప్పుడల్లా హేమంత్ ఆ మేడకున్న విశాలమైన మెట్లమీద కూర్చుని సిగరెట్టు మీద సిగరెట్టు కాలుస్తూ తదేకంగా ఆ సమాధిని గమనిస్తుంటాడు.

ఆ వ్యధాభరిత ప్రేమకథకి మేము సాక్ష్యులమన్నట్లుగా చిరుపాటి సువాసనలు నింపుకున్న పూలు అరకొరా గాలికి రాలుతూ వారి ప్రేమకథని పరిసరాలంతా వ్యాపింపజేసి తమ బాధ్యత నెరవేరుస్తుంటాయి.

అన్నట్లు ఇప్పుడా సమాధి పక్కన మరొక అనురాగమూర్తి సమాధికూడా వెలిసింది.

ఆ యిద్దరూ తన జీవితంలో నింపిన వెలుగుల్ని గుర్తు చేసుకుని ఇంటికి మరలిపోతుంటుందా హేమంతం.

( సమాప్తం)